అనగనగా ఓ మంచికథ

రెండవ భాగం

శ్రీ
కౌముది
మీ మంచిపుస్తకం నాతో వెళ్ళండి
www.koumudi.net
ప్రచురణసంఖ్య: 65

ఈ కథలన్నీ కౌముది సంచికలలో పునఃప్రచురించబడ్డాయి

1 దేవుడు ఏమనుకున్నాడో?	పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి	1
2 పగిలిన పచ్చికుండలు	నార్ల చిరంజీవి	7
3 వెన్నెల ఆశ్చర్యపోయింది	చంద్ర	14
4 ఆప్తస్వరం	కుప్పిలి పద్మ	18
5 శివరంజని	వేదుల మీనాక్షి దేవి	23
6 వర్షంలో వచ్చిన	మనిషి విజయలక్ష్మి రామకృష్ణన్	32
7 అలరాస పుట్టిళ్ళు	కళ్యాణ సందరీ జగన్నాథ్	38
8 చిత్రనళినీయం	యద్దనపూడి సులోచనా రాణి	51
9 మీ పేరేమిటి?	గురజాడ అప్పారావు	65
10 మేచ్ ఫిక్సింగ్	కె.వి.నరేందర్	75
11 కాగితం ముక్కలు - గాజు పెంకులు	బుచ్చిబాబు	80
12 సెలవయింది	గంధం యాజ్ఞవల్క్య శర్మ	86
13 అశ్వ హృదయం	శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి	92
14 మనకొద్దీ మంచితనం	మల్లాప్రగడ రామారావు	100
15 శ్రీకాకుళే మహాక్షేత్రే	వేటూరి సుందరరామమూర్తి	106
16 కాలువ	బెజ్జారపు వినోద్ కుమార్	111
17 తీరని కోరిక	ద్వివేదుల విశాలాక్షి	118
18 దగ్ధగీతం	పెద్దిభొట్ల సుబ్బరామయ్య	124
19 మరపురాని ఆవూరు	జమదగ్ని	129
20 నల్లజర్ల రోడ్డు	దేవరకొండ బాలగంగాధర తిలక్	145
21 ముక్తికోసం	తల్లావఝుల పతంజలి శాస్త్రి	161
22 ధర్మవడ్డీ	గోపిచంద్	166
23 ఎక్స్‌ప్రెస్ ఆగదు	మానస	171
24 కలం పట్టని కర్తల సంఘం	బుచ్చిబాబు	183
25 బాబాయి	గొల్లపూడి మారుతి రావు	189
26 వేడుక	పంతుల జోగారావు	194

27 దగాపడ్డ తమ్ముళ్ళు	దేవరకొండ మురళి	201
28 మసిగుడ్డ	కుప్పిలిపద్మ	206
29 ?	భువనచంద్ర	211
30 చరమరాత్రి	శ్రీశ్రీ	218
31 గుండెతడి	పంతుల జోగారావు	226
32 అవ్వ తిరునాళ్ళలో తప్పిపోయింది	దేవులపల్లి కృష్ణశాస్త్రి	232
33 బోన్సాయ్ బ్రతుకు	అబ్బూరి ఛాయాదేవి	237
34 ఇందుమూలంగా ..	నగ్నముని	240
35 అంత్యక్రియలు	తాళ్ళూరు నాగేశ్వరరావు	243
36 నల్ల సుశీల	వంశీ	248
37 డూప్	అరిగే రామారావు	254
38 కార్యసాధకుల మహాకావ్యం	బుచ్చిబాబు	260
39 ముంగిట్లో ముత్యాలు	జలంధర	269
40 సామగానం	మల్లాది రామకృష్ణ శాస్త్రి	278
41 శేషమ్మ - ఎ స్టడీ	చలం	282
42 నేను పోనే జలసూత్రం	రుక్మిణీనాథ శాస్త్రి	285
43 భోగం మనిషి	మునిపల్లె రాజు	293
44 చిగురుటాకు	కె.వి.నరేందర్	298

****

దేవుడు ఏమనుకున్నాడో

పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

(రచనా కాలం ।౨౧।)

పోలాప్రగడ మాగ్నం ఓపస్ కౌసల్య నవల. 14 దేశ భాషల్లోకి అనువాదమైంది. తల్లిదండ్రులు సినిమాగా వచ్చింది. ఇదిగాక దీపశిఖ, భోగిమంటలు, శ్రీవాధ కవిసర్వభౌమ ఇత్యాది నవలలు, రెండువందల కథలు, అనేక వ్యాసాలు రాశారు. ఇజాలకు పరిమితం కాకుండా, సమాజాన్ని విస్తృతంగా పరిశీలించి, మానవీయ కోణం నుంచి రచనలు సాగించారు. నిత్యోత్సాహి. చివరి క్షణం దాకా ఆయన రచనలు చేస్తూనే ఉన్నారు.

మాధవయ్యకి మళ్ళీ ఓ కొత్త సమస్య ఎదురైంది. అసలు ఆ మాటకొస్తే అతనికి వయస్సు తాలూకు మిసమిసలు పైనబడిన దగ్గర నుంచీ, తిరిగి అవి మళ్ళు ముఖం పట్టేలోగా, అంటే ఈ పాతిక ముప్పై ఏళ్ళ కాలంలోనూ, రకరకాల సమస్యలు తలకి చుట్టుకుంటూనే ఉన్నాయి. వాటిని ఎలా పరిష్కరించాలో అర్థంకాక అతను సతమతం అవుతూ ఉన్నాడు. సతమతం అవుతూ అతనలా అవస్థపడడం చూసి జాలితో నిలువెల్లా కరిగిపోయి ఎప్పటికప్పుడు ఎంతో ఆత్మీయతతో గౌరి అతన్ని ఆదుకుంటూనూ ఉంది.

అలా ఆదుకున్నది ఒకమారా రెండుమార్లా?

సరిగ్గా ఇప్పటికి ముప్పైయేళ్ళ క్రితం మొదటిసారిగా గౌరి అతని జీవితంలో ప్రవేశించి అతన్ని ఆదుకుంది. ఆ ప్రవేశించడం కూడా అదో విచిత్రమైన విధంగా.

అది మాధవయ్య మాంచి యౌవనపు పొంగులో ఉన్న రోజులు! కాలేజీ శలవలకని ఇంటికివచ్చి, ఆ పల్లెటూళ్ళో ఏం తోచక, పక్క ఊళ్ళో రథోత్సవమూ తిరునాళ్ళూ అవుతున్నాయంటే, పోనీ కాలక్షేపం అయినా అవుతుందని అక్కడికి బయలుదేరి వెళ్ళాడు మాధవయ్య.

ఓహ్! అక్కడ మంచి కోలాహలంగా ఉంది.

రథాన్ని కనుల పండువుగా అరటి స్థంభాలతోటీ, కొబ్బరి ఆకులతోటీ, రంగుకాగితాలతోటీ కొందరు అలంకరిస్తుంటే మరికొందరు తాటిమండల్ని ఆముదం కుండల్లో ముంచి రథచక్రాల ఇరుసులకి రాస్తున్నారు. దేవుడుతో సమానంగా రథం మీద కూర్చున్న పూజారి, దేవుడి మెళ్ళో దండల్ని సరిగా సర్దుతున్నాడు. రథం ముందు భాగానికి కట్టిన మోకులు పట్టుకుని కండలు తేరిన మగరాయుళ్ళంతా అమారుగా నుంచున్నారు, ధర్మకర్త గుమ్మడికాయ కొట్టగానే రథాన్ని లాగడానికి. ఇసుకవేస్తే రాలకుండా రోడ్డుకి ఇటూ అటూ జనం.

రకరకాల సరుకులు అమ్ముతూన్న వాళ్ళూ, వాటిని బేరం ఆడుతూ కొంటున్నవాళ్ళూ కొట్లనీ జనాన్నీ వింతగా చూస్తూ నిలబడ్డ వాళ్ళు, ఉండుండి 'గోవిందా' అంటూ అరుస్తున్న వాళ్ళూ, మంచి సందడిగా ఉంది. అటు జనాన్నీ ఇటు రథాన్నీ చూస్తూ రోడ్డు మధ్య

నిలబడ్డ మనుష్యుల్ని "రథం వస్తుంటే అలా చోద్యం చూస్తూ నిలబడతారేవిటి? పక్కకి తప్పుకోండి" అంటూ నిర్దాక్షిణ్యంగా అటూ ఇటూ తోసేస్తున్నారు పోలీసులు. అలాంటప్పుడు జనం కెరటాల్లా వచ్చి పక్కనున్న కొట్లమీదా మనుష్యులమీదా పడిపోతున్నారు.

అలా పడిన వాళ్ళలో మాధవయ్య ఒకడు.

పోలీసుల తాకిడికి ఒక్క ఉదుటున వచ్చి రోడ్డు పక్కగా నిల్చుని కొత్తగా వేయించుకున్న రంగు గాజుల్ని చూసుకుంటూ మురిసిపోతున్న గౌరిమీద పడబోయి ఆమె బుజాలు పట్టుకుని అతికష్టం మీద ఆపుకున్నాడు. పరధ్యానంలో ఉందేమో గౌరి కెవ్వున అరిచింది. మాధవయ్య అదిరిపడ్డాడు ఆ కేకకి. ఆ తర్వాత ఆమె ఏం అల్లరి పెడుతుందో దేవుడా అని బిత్తర చూపులు చూస్తోంటే జరిగిన సంగతి అర్థం చేసుకుంది కాబోలు, అలవోకగా నవ్వింది గౌరి. అసలే కలకలలాడుతూ అందంగా ఉన్న గౌరి ముఖానికి ఆ నవ్వు ఇంకో కొత్త అందాన్ని, ఆమె యవ్వనం అందించిన ఆహ్వానంలా మాధవయ్యలోని మగతనాన్ని రెచ్చగొట్టింది. యవనపు పొంగులో ఛామనఛాయగా పుష్టిగా ఉన్న గౌరి అందాన్ని కళ్ళతో తాగుతూ తనకి తెలియకుండానే గుటకవేశాడు మాధవయ్య.

రథం కదలడంతో జనంలో కూడా కదలిక బయలుదేరింది. అంతా రథం వెనకాలే పడి 'గోవిందా' అని అరుచుకుంటూ పోసాగారు. రథం ముందుకు వెళ్ళిపోవడంతో అక్కడ జనసమ్మర్ధం కూడా పల్చబడిపోయింది. అందరూ వెళ్ళిపోతున్నా మాధవయ్య మాత్రం అక్కడే నిలబడి గౌరికేసి గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాడు. అతనిలోని చైతన్యాన్ని తన అందమే కట్టిపడేసిందన్న సత్యాన్ని గ్రహించేసరికి గర్వంతో కూడిన ఆనందంతో గౌరికి ఒళ్ళు పులకరించింది, పెదవుల మీదికి పరిగెట్టుకుని వస్తున్న కులుకుని పంటితో నొక్కి పట్టి మాధవయ్య కేసి ఓరచూపు విసిరి విలాసంగా అడుగు కదిపింది గౌరి.

అనుసరించడమా, ఆగిపోవడమా అని తటపాయిస్తున్న మాధవయ్య మాట వినకుండనే అతని అడుగులు ఆమెని అనుసరించాయి. మధ్య మధ్య వెనక్కి తిరిగి చూసి నవ్వుతూ అతణ్ణి ఊరు బైట ఉన్న తన ఇంటిదాకా తీసుకెళ్ళి వయ్యారంగా తాళం తీసి ఇంట్లోకి వెళ్ళింది గౌరి.

'తను కూడా ఆమె వెనకాలే లోపలికి వెళ్ళడమా, రోడ్డుమీద నిలబడి పోవడమా?' ఎటూ నిర్ణయించుకోలేక తారట్లాడుతున్న మాధవయ్యని చూస్తే జాలేసింది కాబోలు, గడప దగ్గరికి వచ్చి కళ్ళతో పిలిచింది మాధవయ్యని. ఇంక తనని తాను సంబాళించుకోలేకపోయాడు మాధవయ్య. అతను అలా తడబడుతూ లోపల అడుగుపెట్టడమేమిటి, గౌరి నవ్వుతూ వెళ్ళి వీధి తలుపు తడిక వేసి రావడమేమిటి అంతా ఒక్క క్షణంలో కలలో జరిగినట్లు జరిగిపోయింది.

ఒళ్ళంతా వేడెక్కి జివ్వుమని నరాలు మెలితిరిగిపోతూ, కీలుకీలు దగ్గరగా నీరసం నమిలేస్తుంటే, యవ్వనం పెట్టే ఆ నరకాన్ని భరించలేక యమయాతన పడసాగాడు మాధవయ్య. ఆ స్థితిలో అతణ్ణి చూసి నిలువెల్లా కరిగిపోయి ఆ నరకాన్ని స్వర్గంగా మార్చి మొదటిసారిగా అలా ఇబ్బందిలో ఆదుకుంది గౌరి.

ఆ తర్వాత, గౌరికి నా అన్నవాళ్ళు లేకపోవడం వల్లనైతేనేమి, మాధవయ్య తన పెద్దలకి తెలియకుండా జాగ్రత్త పడటం వల్లనైతేనేమి, ఆ రెండు ఊళ్ళ మధ్యనా మాధవయ్య రాకపోకలు సజావుగానే సాగి, శలవలన్నీ ఇట్టే గడిచిపోయాయి.

తిరిగి ఏడాదికి, మళ్ళీ శలవలకి వచ్చినపుడు మాధవయ్య దిగాలుగ వచ్చాడు గౌరి దగ్గరకి. "ఏమిటి సంగతి? అలా ఉన్నావేమిటి? చెప్పవా?" అని లాలించి బుజ్జగించి బతిమాలితే కానీ చెప్పలేదు - తన తండ్రి రెండు మూడు సంబంధాలు చూశాడనీ, అందులో ఏదో ఒకటి చేసుకోపోతే వీలులేదని శాసిస్తున్నాడనే సంగతి.

మాధవయ్య మాటలు విని గౌరి నవ్వింది?

గట్టిగా పకపకా నవ్వింది.

పొట్ట చేతితో పట్టుకుని మరీ నవ్వింది.

విస్తుబోయి చూస్తున్న మాధవయ్యని చూసి మరికాస్త నవ్వి "అది కాదు మాధవా, పెళ్ళి అని సరదాగా చెప్పవలసిన సంగతిని అలా దిగాలుపడి చెపుతావేమిటి? నీ పెళ్ళా? మంచిది. అందమైన మంచి పిల్లని చూసి మరీ చేసుకో సుమా!" అంది గౌరి.

మాధవయ్యకి ఆ మాటలు మింగుడుపడలేదు. నేలచూపులు చూస్తూ "అది కాదు గౌరీ - నేను ఎవర్నో పెళ్ళి చేసుకుంటే మన ప్రేమ సంగతి ఏంగాను? మా నాన్నకి కోపం వచ్చినా సరే, తక్కువ కులం పిల్లని చేసుకున్నందుకు మా వంశం ప్రతిష్ట ఏమైపోయినా సరే నేను నిన్నే చేసుకుంటాను. నీ కోసం నేనామాత్రం త్యాగం చెయ్యగలను" అన్నాడు మాధవయ్య నెమ్మదిగా. ఆ మాటలు అంటున్నప్పుడు మాధవయ్య గొంతులో ఏ మాత్రం ఉత్సాహం కానీ, ఉద్రేకం గానీ కనిపించలేదు గౌరికి. ఒక్కక్షణం అతనికేసి చూసి ఆ తర్వాత దగ్గరగా వచ్చి అతని చొక్కా కాలరు సర్దుతూ "నా పిచ్చి మాధవా! నాకోసం అని, నీ మీద ఆశలన్నీ కేంద్రీకరించుకున్న మీ నాన్నగారినీ, తరతరాల నుంచీ కాపాడుకుంటూ వస్తూన్న వంశ గౌరవాన్నీ వదులుకుంటావా? వద్దు.... ఇలాంటి ఆలోచనలు పెట్టుకోకుండా వెళ్ళు - వెళ్ళి లక్షణంగా పెళ్ళి చేసుకో - నేను దూరం ఆలోచించి చెపుతున్నాను. త్యాగం ప్రేమ అంటూ ఆవేశపడటం మంచిది కాదు - ఇంక నాకు అంటావా, నీ అభిమానం ఉంటే చాలదూ పెళ్ళే కావాలేమిటి? మరచిపోకుండా ఎప్పుడేనా వచ్చి కనిపిస్తూండు. ఏం? అలా చెయ్యి" అంటూ ఎన్నో విధాల చెప్పి చివరికి ఎలా అయితేనేం ఒప్పించింది గౌరి.

గౌరిని చూస్తే, ఆపదలో తనని ఆదుకున్న ఒక దేవతలా తోచింది మాధవయ్యకి.

అవును!

అటు తండ్రిని కాదనడమా - ఇటు గౌరిని వదులుకోవటమా - వంశ మర్యాద ముఖ్యమా - ప్రేమ ముఖ్యమా? ఏమిటి చెయ్యడం? పరిష్కార మార్గం ఏమిటి? ఇలా ఏం పాలుపోక తలబద్దలు కొట్టుకుంటూంటే ఇట్టే తేల్చేసి తనని కాపాడింది గౌరి. ఇటువంటి గౌరినా తను వదులుకోవడం?

అలా వదులలేక పెళ్ళయి అయిదారేళ్ళుకావచ్చినా ఏ వారానికో పది రోజులకో ఓసారి వచ్చి గౌరిని చూసి మరీ వెళ్ళేవాడు మాధవయ్య. గౌరి కూడా అక్కడికి అదే మహాభాగ్యం అనుకుంటూ ఇరవై నాలుగు గంటలూ మాధవయ్య గురించే తియ్యగా తలచుకుంటూ, తనకి ఉన్న రెండూ మూడు ఎకరాల మాగాణీ మీద వచ్చే శిస్తు ఖర్చు పెట్టుకుంటూ, ఊళ్ళో తన గురించి ఎంతమంది ఎన్నిరకాలుగా అనుకున్నా లెక్కచెయ్యకుండా సంతోషంగానే రోజులు గడపసాగింది.

అయితే ఆ కాస్త సంతోషం కూడా ఆమెకు మిగల్చకుండా మాధవయ్య ఇంకో కొత్త సమస్యతో చక్కా వచ్చాడు.

గౌరికి మాధవయ్యకీ ఉన్న సంబంధం భార్యకి తెలిసిందట! ఇంక ఆ ఛాయలకు వెళితే తాను ఒప్పుకునేది లేదనీ, కాదంటే ఉరిపోసుకు ఛస్తాననీ అంటోందిట. ఆమెతో ఇప్పుడు పెద్ద తంటా వచ్చి పడిందంటూ చెప్పుకు వచ్చాడు మాధవయ్య. ఏం చెయ్యాలో, ఆమెని ఎలా ఒప్పించాలో ఏం అర్థం కావడం లేదంటూ తలపట్టుకుని కూర్చున్నాడు మాధవయ్య. గౌరికి పరిస్థితి అర్థమైంది. మాధవయ్యని అతని భార్య ఎంతగా ప్రేమిస్తుందో కూడా అర్థం అయింది. భార్యాపిల్లలతో పచ్చగా పరువుగా బతుకుతున్నాడు. తన కారణంగా అతనూ అతని బతుకూ బజార్నపడడమా? ఉహూ అలా ఒక్కనాటికీ కాకూడదు.

ఒక్క నిశ్చయానికి వచ్చి లేచి నిలబడి "ఇంక రేపటి నుంచీ నా దగ్గరకి రాకు మాధవయ్యా" అంది ఎటో చూస్తూ గౌరి.

మాధవయ్య అదిరిపడ్డాడు.

కాదన్నాడు.

కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

నాకోసం మళ్ళీ త్యాగం చేస్తున్నావా అన్నాడు.

నేను లేకుండా నువ్వు ఉండగలిగినా నువ్వు లేకుండా నేను ఉండలేను అన్నాడు.

ఆ ఆలోచన వద్దన్నాడు.

అలాంటి నిర్ణయానికి రావద్దన్నాడు.

అతని మాటలేం గౌరి వినిపించుకోలేదు. తన నిర్ణయానికి ఇంక తిరుగు లేదు అంది.

బాధ ఆపుకోలేక నువ్వు కర్కోటకురాలివి అన్నాడు; ఏం మాట్లాడలేదు.

చివరికి పౌరుషంతో నానా మాటలూ అని వెళ్ళిపోతున్న మాధవయ్యకు కనిపించకుండా చాటుగా కళ్ళు తుడుచుకుంది గౌరి.

పైకి కోపంగా వెళ్ళిపోయినా మనస్సులో గౌరి చేసిన త్యాగాన్ని గుర్తించలేక పోలేదు మాధవయ్య. 'త్యాగాలు చేస్తూ ఎప్పటికప్పుడు నన్ను ఆదుకోవడానికే ఈమెని పుట్టించాడేమో భగవంతుడు?' అనుకున్నాడు.

గౌరి ఇంకోమారు కూడా మాధవయ్యని ఆదుకుంది.

ముగ్గురు పిల్లల బాధ్యతనీ భర్తకి వదిలేసి మాధవయ్య భార్య కళ్ళు మూసినప్పుడు పదిరోజులూ ఇంకా వెళ్ళకుండానే అయినవాళ్ళూ, కావలసిన బంధువులు అంతా 'వెళ్ళివస్తాం మాధవయ్యా' అంటూ, ఈ బాధ్యత వచ్చి తనమీద ఎక్కడ పడుతుందో అనే భయంతో ఒక్కొక్కరే తప్పుకుంటూంటే, అప్పుడు మాధవయ్యని గౌరే ఆదుకుంది.

భార్య పోయిందనే బాధ ఒక పక్కన, పిల్లల్ని పెంచి పెద్ద చెయ్యటం ఎలా అనే బెంగ ఇంకో పక్కన గుండెనీ మెదడునీ తొలిచేస్తుంటే చేసేదేంలేక దిక్కుతోచక మోకాళ్ళమీద తలపెట్టుకుని బాధపడుతున్న మాధవయ్య దగ్గరికి సమయానికి వచ్చి "అయ్యో - ఇలా జరిగిందని నాకు కబురేనా తెలియలేదు. ఏంటి! నువ్వే అలా దిగాలుపడి కూర్చుంటే పిల్లలు బెంబేలు పడిపోరూ - ఏం చేస్తాం? లే... స్నానం చెయ్యి. రండర్రా మీకు అన్నం పెడతాను" అంటూ పిల్లల్ని దగ్గరగా తీసుకుని లోపలికి నడిచింది గౌరి.

అంతే అప్పటి నుంచీ మాధవయ్య ఇంట్లోనే వచ్చి ఉండిపోయి, అతని ఇంటికీ పిల్లలకీ చాకిరీ చేస్తూ "అమ్మలేదే" అని వాళ్ళకి అనిపించకుండా తల్లి కంటే ఎక్కువగా వాళ్ళని పెంచి పెద్ద చేసింది గౌరి. ఊళ్ళో లక్ష మంచి లక్ష రకాలుగా అనుకుంటున్నా అవేం లక్ష్యం చెయ్యకుండా మాధవయ్య పిల్లలే తన పిల్లలనుకుంటూ కాలక్షేపం చేస్తోంది.

ఇంతక్రితం గౌరి చేసిన త్యాగాలన్నీ ఒక ఎత్తూ, ఇలా తన ఇంట్లోకి వచ్చి ఉండిపోయి తనకీ తన పిల్లలకీ ఏ లోటూ రాకుండా వేడి వెచ్చనా చూడటం ఒక ఎత్తుగా కనిపించింది మాధవయ్యకి. ఫలితంగా రోజుకి ఒకసారైనా మనస్సులో కృతజ్ఞతలర్పించుకొనేవాడు గౌరికి.

పెద్దవాడు ఉద్యోగంలో ప్రవేశించాడు. రెండోవాడికి కాలేజీ చదువు పూర్తి కావచ్చింది. పిల్ల పెళ్ళికెదిగింది. ఇంక వాళ్ళనో ఇంటివాళ్ళని చేస్తే తనకింకేం సమస్యలున్నాయి అనుకున్నాడు మాధవయ్య. కానీ అలా ఇంటివాళ్ళని చెయ్యడంలోనే ఇంకో సమస్య వచ్చిపడుతుందని అనుకోలేదు అతను. అలా వచ్చిపడింది కనకే, మాధవయ్యకి మళ్ళీ ఓ కొత్త సమస్య ఎదురైందని అనుకోవలసి వచ్చింది.

అవును - మళ్ళీ ఇంకో కొత్త సమస్యే మాధవయ్యకి.

పిల్లాడికీ పిల్లకీ వస్తున్న సంబంధాలన్నీ ఎందుకు తిరిగిపోతున్నాయి? ఏమిటి కారణం అంటూ పడక కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్న మాధవయ్యకి ఇదీ కారణం తెలియచెప్పారు పెద్దబ్బాయీ, అమ్మాయీను.

"కాదు, అదేం కాదు" అని వాళ్ళని సమాధానపరచబోయాడు. "నువు అవునన్నా కాదన్నా అది మాత్రం నిజం. ఆవిడ మన ఇంట్లో ఉన్నన్నాళ్ళూ మాకు పెళ్ళిళ్ళు కావు, ఎవరూ మన సంబంధానికి ఒప్పుకోరు. కులం గాని కులం ఆవిడ ఇంట్లో ఎందుకు ఉంటోంది? ఆవిడకీ మీకూ ఏమిటి సంబంధం? అని మొహం మీద కొట్టినట్లు ఆ పచ్చి నిజాన్ని చెప్పేటప్పటికి మాధవయ్యకి మతిపోయింది.

గతం అంతా ఒక్కమారు అతని మనస్సులో మెదిలింది. తలకు మించిన సమస్యలెన్నో తన తలకి చుట్టుకుని తను సతమతం అవుతూంటే, ఎప్పటికప్పుడు గౌరి దేవతలా ఆదుకుంది. అంతక్రితం అన్నీ అలా ఉంచి మొన్న పది పదిహేనేళ్ళ క్రితం తల్లిపోయి దిక్కుతోచక అల్లాడుతున్న పిల్లల్ని వచ్చి తల్లిలా ఆదుకుంది.

ఏ పిల్లలకయితే ఆ రోజున ఆమె ఆసరా అయిందో ఆ పిల్లల కోసమే ఈ రోజున ఆమె ఇల్లు వదిలిపోవాలన్నమాట!

కావలసినప్పుడు రమ్మనడం, అవసరంలేదన్నప్పుడు పొమ్మనడం! ఇంతకంటే అన్యాయం ఏమైనా ఉందా? ఇప్పటికే తనకోసం పిల్లలకోసం గౌరి ఎన్నో త్యాగాలు చెసింది! త్యాగలు ఎప్పుడూ ఆమె వంతేనా? తనకి వచ్చిన ప్రతి సమస్యకీ గౌరి ఆహుతి అయిపోవాలా? వీల్లేదు. ఏమైతే అవుతుంది. పిల్లలకి పెళ్ళి కాకపోతే కాకపోనీ - ఇంక గౌరి త్యాగం చెయ్యడానికి వీలులేదు. తను చెయ్యనివ్వడు.

మొండికేసుకుని కూర్చున్న మాధవయ్యకి ఇంట్లో రోజు రోజుకీ పిల్లల ప్రతిఘటన ఎక్కువైంది. గౌరిని సూటిపోటీ మాటలనడం - పూర్వంలాగా ఆప్యాయంగా మాట్లాడకపోవడం, చివరికి మాధవయ్యతో కూడా ముభావంగా ఉండటం మొదలుపెట్టారు. ఒకరోజున ఏమైనా సరే గౌరి ఇంట్లోంచి వెళితే కానీ మేం అన్నాలు తినం అంటూ భీష్మించుకుని కూర్చున్నారు ముగ్గురు పిల్లలూ.

పరిస్థితులన్నీ గమనిస్తూ ఇన్నాళ్ళ నుంచీ మౌనంగా ఉంటూ వచ్చిన గౌరి "ఏమిటి మాధవయ్యా నువ్వు మరీను పిల్లలతో సమానంగా? నన్ను పోనియ్యి" అంది బట్టలు సర్దుకుంటూ?

"వీల్లేదు" భయంకరంగా గర్జించాడు మాధవయ్య.

ఏవిటది? ఎప్పుడూ లేంది ఇలా అయ్యాడేంవిటి మాధవయ్య! ఎప్పటికప్పుడు తన తలమీదకి వచ్చిపడిన సమస్యని తెముల్చుకోలేక సతమతం అవుతూ వచ్చిన మాధవయ్యే ఇవాళ ఇంత గంభీరంగా నిర్ణయం తీసుకుంటున్నది? ముడతలు పడుతున్న కనుబొమలు ఎత్తి ఆశ్చర్యంగా చూసింది.

ముడతలు పడుతున్న ముఖం, నెమరుస్తున్న జుట్టుతో కనిపిస్తున్న గౌరిని చూసి "ఈ వయస్సులో ఈమెని పంపించెయ్యడం కంటే ఘోరం ఇంకేమయినా ఉందా?" అనుకున్న మాధవయ్య కళ్ళు చెమ్మగిల్లాయి. కానీ కన్నీళ్ళు కనిపించనీయకుండా తుడుచుకుని "నాకో కొత్త సమస్య ఎదురైనప్పుడల్లా నువ్విలా త్యాగం చేస్తూ ఉండాలా? దీనికో అంతు అంటూ లేదూ? ఏవైనా సరే నువ్వు వెళ్ళడానికి వీలులేదు" అన్నాడు బిగ్గరగా.

"అయితే సరే మేం వెళుతున్నాం," అన్నారు పిల్లలు ముగ్గురూ ఒకేమారు.

ఆ మాటకి మాధవయ్య నిర్ఘాంతపోయాడు. వాళ్ళకేసి బాధగా చూశాడు. వాళ్ళు మాత్రం "ఏమంటారు చెప్పు, ఆమెని పంపిస్తావా? మమ్మల్ని వెళ్ళమంటావా?" అన్నట్టు చూశారు.

"ఎందుకొచ్చిన అల్లరి? నన్ను వెళ్ళనియ్యి? " అన్నట్టు చూసింది గౌరి.

మాధవయ్య ఒక్క నిముషం ఆగి, తల పంకించి లేచి, కండువా దులిపి భుజం మీద వేసుకుంటూ "సరే - మనమే పోదాం, నడు గౌరీ!" అన్నాడు. గౌరి భయంతో "అదేవిటి? నువ్వెక్కడికి? పిల్లలు ఏమౌతారు?" అంది.

"ఇప్పుడు వాళ్ళకి నీ అవసరం లేదు. వాళ్ళంతటి వాళ్ళయ్యారు. ఊ, నడు" అంటూ దురుసుగా అడుగు కదిపాడు మాధవయ్య, పిల్లలు ఎవరైనా అతణ్ణి వెళ్ళొద్దని ఆపుతారేమో అని చూసింది గౌరి. చివరికి నిట్టూర్చి "జాగ్రత్తగా ఉండండి బాబూ" అంటూ కన్నీళ్ళు పెట్టుకుని వదల్లేక వాళ్ళని వదిలి మాధవయ్యని అనుసరించింది.

తనకోసం? ఎంతో ప్రీతిగా చూసుకుంటున్న ఇంటినీ పిల్లల్నీ ఇన్నాళ్ళూ కాపాడుకుంటూ వచ్చిన పరువునీ, ప్రతిష్టనీ త్యాగం చేసేసి తనతో వచ్చేస్తున్న మాధవయ్యని అర్థం చేసుకోలేక బరువుగా అడుగులు వేస్తూ ఇల్లు చేరుకుంది గౌరి మాధవయ్యతో.

దట్టంగా పేరుకుపోయిన దుమ్ము ఊది, తాళం తీయబోతున్న గౌరీ, మౌనంగా పాత జ్ఞాపకాలు తిరగేసుకుంటూ మెట్లమీద పరధ్యానంగా నుంచున్న మాధవయ్యా ఉన్నట్టుండి వినిపించిన పెద్ద కోలాహలంలాంటి సందడికి వెనక్కి తిరిగి చూశారు.

అప్పటికే దేవుడి రథం ఆ వీధిలోకి తిరిగింది. రథంతోపాటు వందలకొద్దీ జనం ఆ వీధి అంతా నిండిపోతున్నారు.

గుమ్మం ముందు నుంచీ ఊరేగుతూ పోతున్న దేవుడికి మాధవయ్యా, గౌరీ చేతులు జోడించి కళ్ళు మూసుకుని మనసారా నమస్కరించారు.

వాళ్ళని చూసి దేవుడు ఏమనుకున్నాడో కానీ రథం చుట్టూ ఉన్న భక్తులు మాత్రం "ఎంతకి తెగించారు! ముసలివాళ్ళయినా పాతబుద్దులు పోలేదు వీళ్ళకి ఛీ... ఎంత వయస్సు వచ్చీ ఏం లాభం, సిగ్గూ, లజ్జా వదిలేశాక" అంటూ గుసగుసలాడుకుని ముక్కుమీద వేలేసుకున్నారు.

ooooo

ఇలా అన్నారు..!

జీవిత విలాస ప్రతిపాదనలో పడి జగాన్నే మర్చిపోయిన మానవులు ఎవరయినా ఉంటే - లోకం వారినే చెడిపోయినవారు అని నిందిస్తుంది. ఉజ్వలమైన ఆశలతో స్వప్నాలతో జీవితం ప్రారంభించే వారికి పరిస్థితులు అనుకూలించకపోతే పథవిహీనత శాపంగా పరిణమిస్తుంది. అసలు స్వప్నాలంటూ పెంచుకుని అధర్మ పథంలో రూపకల్పనం చేసుకునే వారికి పథవిహీనత ఎలాగూ తప్పదు. ఆ ఉజ్వలత వెనకాల అంధకారమూ తప్పదు. కాని ధర్మపథంలో జీవిస్తూ క్రమం తప్పని స్వప్నాలను వాస్తవం చేసుకోవాలని ప్రయత్నించే వాళ్ళకు కూడా ఈ శాపం తప్పటం లేదంటే అసలు స్వప్నాలలోనే ఒక తప్పు ఉన్నదని అనిపిస్తున్నది.

కలలూ , ఊహలూ, ఆలోచనలూ ఇవన్నీ శాంతి నివ్వడానికి బదులుగా బ్రతుకుని అశాంతి చేస్తున్నాయా? అని అనుమానమూ వస్తుంది.

- 'పథవిహీన' నవలలో లత

పగిలిన పచ్చికుండలు

నార్ల చిరంజీవి

(రచనా కాలం 1940)

అలనాటి ప్రముఖ కథారచయిత చిరంజీవి గారు 1940 ప్రాంతాల్లో రాసిన కథ ఇది. ఈయన కొన్ని సినిమాలకి పాటలు కూడా రాసారు.

పెద్ద వంతెనకు దిగువుగా కాలవొడ్డునే రోడ్డు నానుకుని ఇరవై ముప్పయి పాకలు వరసగా ఉన్నాయి. పెద్ద రైలుస్టేషన్‌కి పోయే ఆ రోడ్డు వస్తూ పోయే జనంతో కిటకిటలాడుతూంటుంది. ఆ పాకల్లో ఒక చిన్నపాక విడిగా కాస్త ఎడంగా ఉంది. గవిట్లో 'సీతాలు' చేరగలి కూచింది. దీపం లేని ఇబ్బంది కనిపించడం లేదు. రోడ్డు మీది ఎలక్ట్రిక్ దీపం వెలుగు చారలు ఏటవాలుగా పాకలో పడుకుంటున్నాయి. పాకవేపు చీకటి, రోడ్డువేపు వెలుగూ సీతాలుని సగం సగం పంచుకున్నయ్. ఎదురుగా రోడ్డవతల సినిమాహాలు, సినిమా పాటలూ, రైలు ఇంజన్ల కూతలు, రోడ్డు మీది కోలాహలం ఇవేవి సీతాలుని కదిలించడం లేదు. ఎక్కడో దూరాలకు అలిసి పోయిన కళ్ళప్పగించి దేన్నో వెతుకుతోంది.

ఎవరో తనను తాకినట్టనిపించింది. చప్పున పక్కకి తిరిగి చూసింది. పొరుగింటి పిన్ని. ఆవిడ అన్నపు గిన్నె పట్టుకొచ్చింది. సీతాలు మొహంవైపు పరకాయించి చూసి, గిన్నెని తడిక వేపు ఉంచింది. దగ్గరగా కూచుని - 'ఏమే పిల్లా!' అని ఆప్యాయంగా పిలిచింది. ఆవిడ సీతాలుని కూతురుతో సమానంగా చూసుకుంటుంది.

"ఇట్టా కూడూ నీళ్ళూ మానేస్తే ఏవన్నా లాభం ఉందటే?... దీపమున్నా వెలిగించావు కావు. అయ్యో ... రాతా.. లే! గుప్పెడు మెతుకులు తెచ్చాను. ముందు తిను..."

అని అన్నదా ఇల్లాలు సీతాలుని బుజ్జగిస్తూ.

"ఆకలి వేయడం లేదు పిన్నీ."

"ఆకల్లేదని నాకు చెబుతున్నావంటే? మరీ ఇంత చోద్యమైతే ఎట్టాగే పిల్లా? కడుపు మాడ్చుకుంటే గంగని పడ్డ కాపరం గట్టున పడుతుందంటే..."

సీతాలు ఉలుకూ, పలుకూ లేకుండా కూచుంది. ఎంతో చనువూ, ఇష్టమూను. అందుకే అన్నం తెచ్చింది. తినమన్నది. ఏ రకంగానూ, ఆవిడ సీతాలుచేత ఆ గుప్పెడన్నం తినిపించలేక పోయింది. ఇంతకు ముందు రెండు రోజులు నించీ ఇంతే పిన్ని విసుగుతో లేచి సీతాలుని ఒక్క కుదుపు కుదిపి--

"ఇంత మొండెత్తిపోయిన దానివి బ్రతికి బట్టకడతావని నమ్మకం ఏమిటి...?"

అని అనేసి విసురుగా వెళ్ళిపోయింది. పిన్ని వెళ్ళిపోతూ పెట్టిన శాపం విని సీతాలు కళ్ళుమూసుకుంది. మనసులో ఏదో వికారం ఉబుకుతోంది. "నేను మొండిదాన్నా?" అని పదే పదే గొణుక్కుంది. "మొండిదాన్నే అయి ఉంటే ఈ పాటికే నా బతుకు ఎటో ఒకటు తేలిపోయి ఉండేది" అని సణుక్కుంటూ తనకు తానే సమాధానం చెప్పుకుంది. చావు బ్రతుకుల సంధిలో రోగి ఏవో జ్ఞాపకాల్ని ప్రలాపించిన చందంగా, సీతాలు తన బ్రతుకు లోయల్లోని వెలుగు నీడల్ని నిరూపించుకుంటోంది. ఈ బస్తీ కాపరానికి రాకముందు - ఆ మారుమూల పల్లెటూళ్ళో తన జీవితం ఎలా గడిచిందో తళుక్కున మెరిసింది, మనసులో.

ఆ ఊరి బయట పాకలో తన పూరిల్లు, చెట్లూ చేమలూ, పుట్టా గట్టూ తప్ప మరో ప్రపంచం తెలీని రోజులివి. పైన ఆకాశం మెరిస్తే, కింద భూదేవి నవ్వితే, ఒళ్ళు పులకరించిన బ్రతుకది. బొద్దుగా పొద్దు తిరుగుడు పువ్వల్లే ఉండేది. పరిమళం చెడని, అచ్చం తెలుగు కన్నె తాను. పురుగు పుట్రా భయం ఎరక్కుండా, ఎండా వానా తేడా లేకుండా ఎదిగింది. పెరిగింది. చెరుకు బోదెల్లో, వంగ పాదుల్లో, తుమ్మ బీళ్ళల్లో, గడ్డి వాముల్లో తిరిగేది. చెట్లనీ, పిట్టల్నీ కవ్వించి కవ్వించి పాడేది, ఆడేది తాను.

ఆనాటి ఆ పొద్దు తిరుగుడు పువ్వేనా, ఈనాటి తాను? ఒక్క ఐదేళ్ళ బస్తీ కాపురంతో ఎంతగా మారిపోయింది. పిల్లా పీచు లేకపోయినా వాడిన పచ్చగన్నేరు పువ్వులాగా పాలిపోయింది.

మొదట్లో, రాములు వెంటబడి కాపరానికి వచ్చినప్పుడు ఈ బస్తీ జనం, మేడలు వాడలు చూసి విస్తుపోయింది. సంజెవేళ కందిచేలో ఎగిరిపోయే రంగు రంగుల పిట్టల్లా కనిపించారీ మనుషులు. చీకటి పడే వేళ ఎల్క్ట్రిక్ దీపాలు వెలిగితే కళ్ళు జిగేల్ మన్నవి. తన ఊళ్ళో అయితే చీకటి రాగానే గొంగళి ముసుగెట్టి పడుకోవలసిందే! ఈ బస్తీలో రాత్రయినా పగలయినా ఒకలాగానే తోచింది. కొత్త లోకంలోకి జారి వచ్చినట్టయింది.

అదేదో సినిమాకి రాములు తననీ తీసుకు పోయాడు. వీధి బాగోతం తప్ప ఏమీ ఎరగని తనకి - అంతమందిలో కూచోవడం, దీపాలారడం తెరమీద మనుషులు మాట్లాడడం... అదంతా చూస్తుంటే గుండె గుబగుబలాడి పోయింది. తెరమీద ఒక మగాడు ఆ ఆడపిల్లని "రాణీ!" అని పిలిచేవాడు. ఆ పిల్లకూడా "ఓ రాజా!" అని ఒయ్యారాలు కులుకుతో పిలిచేది. సినిమా అయిపోయి ఇంటికి వచ్చాక రాములు తనని దగ్గరకంటా బిగువుగా లాక్కుని "రాణీ" అని అచ్చంగా, అట్టాగే అన్నాడు. తనూ ఒళ్ళు పులకెత్తి అప్రయత్నంగానే 'నా వరాల రాజా!" అని అనేసి, చప్పున సిగ్గుపడింది. చిరువెచ్చని నిట్టూర్పులో ఒకరికొకరు పెట్టుకున్న ఆ క్రొత్త పేర్లని ఎన్నెన్ని సార్లు జపించారో!

ఇప్పుడీ జ్ఞాపకాల వల్ల సీతాలు కళ్ళు చెమ్మగిలినయ్. ఒకసారి కళ్ళార్పి, మళ్ళా జ్ఞాపకాల్లో పడింది.

రోజులు గడిచే కొద్దీ బస్తీలో జనం ఒత్తిడీ, మురుగు వాసనలూ, కొత్త భయాలూ ఒహటొహటి అనుభవంలోకి వచ్చాయి. ఎన్ని భయాలు వెంటాడితేనేం? తన 'రాజా'ని చూసుకుని అన్ని భయాల్ని అతనంటే తనకెంత ఇష్టమో చెప్పడానికి ఈ మాటలు చాలవు. ఒకసారి ఏమయిందీ? తనని పుట్టింటికి తీసుకుపోదామని తండ్రి వచ్చాడు. తండ్రి ఎందుకు వచ్చిందీ తనకి తెలుసు. అన్నాలు తింటుంటే అల్లునితో మాట కలిపి చెప్పాడు కూడా. పుట్టింటికి వెళ్ళాలని తనకు ఎంత ఇదిగా ఉన్నా - రాముల్ని ఒదిలి వెళ్ళడం జరగని పనిగా తోచింది. ఒదిలి ఉండడం అంటే ఇద్దరికీ పిచ్చెత్తుతుంది! తప్పదు. ఒకవేళ తనను పంపుతానంటాడేమో రాములు. మాట జారవద్దని చెబుదామనుకుని, చప్పున గదిలోకి వెళ్ళింది. పిచ్చిమారాజు, చంటి పిల్లాడిలాగా బిక్కమొగం వేసుకునికూచున్నాడు. తనని చూడగానే "వెళ్ళి పోతావా" ఇంచుమించు ఏడ్పుగొంతు పెట్టి అన్నాడు. తాను వలవల ఏడ్చేసింది. పుట్టింటి ప్రయాణం లేదని అర్థమయ్యేలోగా ఇద్దరి కళ్ళూ ఉబ్బిపోయాయి. ఏడవడానికి ఇందులో ఏముందని అడిగితే? ఏం జవాబు ఉంది? ఉహూ! చెప్పడానికి చూపడానికీ వీలు కాని జీవితపు లోతులవి. నాటికీ నేటికీ పుట్టింటి మొహమే చూళ్ళేదు మరి!

అలాంటి తీయని అనుభవాలు ఇప్పుడు గుర్తుకు తెచ్చుకుంటోంది సీతాలు. ఆ రోజుల్లో చక్కని ఇంట్లో కాపురం ఉండే వాళ్ళు కళకళ్ళాడిన రోజుల్ని తలుచుకున్నంత సేపూ సీతాలు కళ్ళు మిలమిల్లాడాయి. చిరుచెమటలు పోస్తున్నాయి. వెచ్చగా నిట్టూరుస్తూ ఊపిరి బిగపట్టి 'రాణీ' అని పిలుస్తున్నట్టు తోస్తోంది. తనకి చాలా ఇష్టమైన ఆకృతి తనని తాకినట్లు భ్రమ కలిగి వొళ్ళు పులకరిస్తోంది. ఎదురుగా ఉన్న ఎలక్ట్రిక్ దీపం చల్లగా చిక్కని వెలుగు ముద్దలుగా కనిపించింది!

ఆమె భ్రమ - భ్రమ మాత్రమే కాదు; గదికి అడ్డంగా కూచున్న ఆవిణ్ణి తప్పించుకోడానికి ఎంతో ప్రయత్నించి, చివరికి సాహసించి, దూరి, పాక లోపల ఉన్న ఆన్నపు గిన్నె ఖాళీ చేసి, సీతాలు భ్రమ కరిగి చూసేసరికి తోకాడించుకుంటూ, ఒక నల్లకుక్క వెళ్ళిపోతోంది. నాలిక తుడుచుకుంటూ తృప్తిగా దీప స్థంభం కిందికి చేరుకుంది. తన జ్ఞాపకాల దొంతర కూలిపోయినందుకు సీతాలు వెలిగి నవ్వింది. ఖాళీ గిన్నెని పాకమధ్యకి విసిరేసి, మళ్ళా కలల్లోకి పోవాలని ప్రయత్నించింది. మనోతమస్సుని చీల్చి జ్ఞాపకాల్లో పెనుగులాడాలని ప్రయత్నించింది.

రాములు ఇప్పుడెక్కడున్నాడో, ఏం చేస్తుంటాడో ఊహించడం తనకి సులభమే; అతని సంగతి ప్రతీ చిన్న విషయం తెలుసు. అతనికోసం ఏం చెయ్యాలన్నా చేస్తుంది. కానీ - ఏం చేయాలో మాత్రం తనకి తెలీకుండా ఉంది. అదే తెలిస్తే ఎంత బావుణ్ణు!... ఆలోచనలన్నీ అగ్ని జ్వాలలై చుడుతున్నాయ్. రాములు ఇంటికి వచ్చి నాలుగు రోజులయింది. ఇదేం కొత్త కాదు. ఐనా, తానీసారి భరించలేకుండా ఉంది. దారిద్ర్యాన్నీ, కన్నీళ్ళనీ నిర్జించ లేకపోయినా నిర్లక్ష్యం చెయ్యగలిగింది! కానీ ఈ బ్రతుకు మానసికంగా భరించలేకుండా ఉంది. తుఫానుకి చెట్టు పట్టు జారి నేలకూలే తీగెలాగా ఈ దిగుళ్ళతో సీతాలు తూలిపడుతోంది. నిలబడాలని ప్రయత్నించిన కొద్దీ ఎడాపెడా గాలీవానా దెబ్బలు మొహాన్ని ఈడ్చి కొడుతున్నాయ్. లాభం లేదు. ఇహ అతన్ని తాను కలుసుకుని తీరాలి. పీడకలవంటి ఈ బ్రతుకు మారిపోవాలి.

రాములు ఎక్కడుంటాడు?

అక్కడికి నాలుగున్నర మైళ్ళ దూరంలో కాలవకట్ట మీది పాకల్లో ఉంటాడు. తప్పకుండా ఉండి ఉంటాడు. నడిచిపోవటం తప్ప వేరే మార్గం లేదు. రెండు గంటల నడక, ఇప్పుడే బయలుదేరితే పదింటికల్లా వెళ్ళిపోవచ్చు.. ఆలస్యం ఎందుకు?

లేచి నిలుచుంది సీతాలు.

కొత్త బలం పోసుకుంటున్నట్టుంది. పాలు పోసుకుంటున్న వరిదుబ్బు లాగా తోచింది. పాకలోకి తొంగి చూసింది. ఏముంది? విరిగిన మజ్జిగలాగా వెలుగూ చీకట్లు కలిసి ఏర్పడిన పొడలు. కంచాలు మంచాలు ఏనాడో అమ్ముడు పోయాయి. ఒకటో రెండో గుప్పిళ్ళ బియ్యం ఉండాలి. తనూ, తన 'రాజా' వెన్నెల తోటగా చేసుకున్న ఆ పాక వెలుగు పొడల చాటున కుములుతున్న ముసలిదానిలాగా ఉంది. తడిక విసురుగా మూసేసింది. తెల్లారి అన్నం తినలేదు. ఆఖరికి పచ్చి మంచి నీళ్ళయినా ముట్టలేదు. అసలామాటే సీతాలుకి గుర్తు రావడం లేదు.

రోడ్డున పోయేందుకు ఎందుకనో మనస్కరించలేదు. కాలువ గట్టున పోతే దగ్గర కూడాను. పాకల వెనక్కి వచ్చి, వంతెన వేపు సాగారింది. కట్టకింది నుంచీ సరంగుల పాటలు వినిపిస్తున్నాయి. ఎగువన పడవల రేవుంది. రేవు దగ్గరవుతున్న కొద్దీ సరంగుల పాటలు జోరవుతాయి. పాకల తిన్నగా వచ్చాక బూతు పదాలు లంకించుకుంటారు. కట్టమీద నీడల్లో పాకల తాలూకు ఆడవాళ్ళు మొసలుతారు. పడవల్లోంచి సరంగులు కాయాగట్రా విసిరేస్తుంటారు. చీకటి ముసుగులో జరిగే గుద్దులాటల నుంచీ తప్పించుకుని సీతాలు వంతెన దగ్గరికి చేరేలోగా ఒకటీ రెండు అరిటిపళ్ళ హస్తాలు దూసుకుపోయాయి. క్రమేణా పాకల్లోని పడుచుల నవ్వులూ, పడవ సరంగుల పదాలు దూరమైపోయి.

దోసకాయ వాటంగా ఉన్న బస్తీని ఆ కాలువ నిలువగా చీల్చుకు పోయింది. దాని కిరుపక్కలా తెగిపడిన దోసచెక్కల్లాగా బస్తీ, బస్తీ చివరికి చేరుతున్న సీతాలు ఒకసారి వెనక్కి తిరిగి చూసింది. పాకల కెదురుగా ఉన్న సినిమా హాలు మీది పెద్ద పచ్చదీపం దబ్బ పండులాగా కనిపిస్తోంది. మసక వెన్నెట్లో బూడిద గీతలాగా ఉన్న కాలవకట్ట కాలిబాటనే సీతాలు ముందుకు నడుస్తోంది. నీళ్ళల్లో చేపలు ఎగిరే చప్పుళ్ళూ, తుప్పల్లో పొదల్లో కీచురాళ్ళ రొదలూ తప్ప మరే శబ్దం వినిపించడం లేదు. మాసిన దుప్పటి కప్పుకున్నట్టు ఖాళీ ప్రదేశం! తలవంచుకుని సీతాలు విసురుగా నడుస్తోంది. ఒకటి రెండు గులకరాళ్ళు కాలికి తగిలి, దొర్లుకుపోయి నీళ్ళల్లో చప్పుడు చేస్తూ మునిగిపోయాయి. ఇంకా మూడు మైళ్ళు పోవాలి తాను. మనస్సంతా పాడుపడ్డ మఠంలాగా ఉంది. మధ్య మధ్య తొలకరి మెరుపల్లే రాములు గుర్తుకొస్తున్నాడు. తాను తూలి పడిపోయేటంత బలంగా వేగంగా వస్తాయి ఆ జ్ఞాపకాలు కడుపు నొప్పిలాగా తెరలు తెరలుగావచ్చి ఒళ్ళు తిప్పుతోంది.

తాను ఇల్లాలు. ఇంత రాత్రివేళ కట్టుకున్న మగణ్ణి కలుసుకునేందుకు ఒంటరిగా బయలుదేరి వెళుతోంది. జీవన పటం మీద విషం చిలికి నల్లబడిన మచ్చ వంటి స్థితి తనది. సీతాలు యుగయుగాల సతీత్వంతో జ్వలించే ఏ సతీమ తల్లికీ తీసిపోదు. నాగరిక ప్రపంచం ఊపుల నించీ తప్పించుకుని, తన అణువణువులో ఒదిగి మిళితమైపోయి ఒక దౌర్భాగ్య వ్యక్తి కోసం వెళుతోంది. నడి వేసవిలో తగలడే కొంప నించీ పెనుగాలికి లేచిన మంటలు నాలుకలు సాచి మరో కొంపని జ్వలింపచెయ్యడానికి అగ్ని శిఖ వంటి శీతాలు కాలవకట్టన పడి వెళుతోంది...

2

రాములు సీతాలుని పెళ్ళాడక ముందు ఐదారేళ్ళ ముందు నుంచీ బళ్ళ కార్ఖానాలో కొలిమి వద్ద సమ్మెట మనిషిగా పనిచేసేవాడు. భగభగమండే కొలిమిలో ఎర్రగా కాలి కణకణమమడే ఇనుపబద్దీలు తీసి మేస్త్రి దాలిమీద మోపడం తరువాయిగా - రాములు సమ్మెటను మెరుపులాగా విసిరేవాడు. చింత నిప్పుల్లాంటి కళ్ళార్పి మేస్త్రి 'వారెవ! కొడకా!.. వేయ్ దెబ్బ!' అని హుషారిస్తూంటే, రాములు చేతిలో సమ్మెట గరిడీ కర్రలాగా చక్రం తిరిగేది! ఐదు పది దెబ్బల్తో రైలు బద్దీలాంటిది కూడా మెత్తగా మెలికలు తిరిగేది! పగలస్తమానమూ మంటల్తో ఆడి, సంజవేళ మేస్త్రి తానూ దుకాణం దగ్గరికి పోయేవాళ్ళు. ఆదా ఎక్కువ కనుక మేస్త్రి రెండు చటాకుల సారా తాగేవాడు. తాను మాత్రం ఒక్క లోటా కల్లు మాత్రం పుచ్చుకునేవాడు. కాస్త వళ్ళు చల్లబడేది. నీళ్ళోసుకుని కలో గంజో కడుపున పట్టించి పడుకుంటే ప్రాణాలెటో రెక్కలు విప్పుకుని పారిపోయేవి. తెల్లకు తెల్లారిలేస్తే మళ్ళా భగభగమండే కొలిమీ, ఎర్రగా కాలిన ఇనుపబద్దీలూ, 'వారెవా! కొడకా!', సమ్మెటా తానూ తయారు...

కాలువ కట్ట మీది ఇసుక గుట్ట మీద వెల్లకిలా పడుకున్న రాములు లేచి కూచున్నాడు. సమ్మెట పట్టిన నాటి కండరాలు ఈనాడేమయ్యాయి? ఒళ్ళు చూసుకున్నాడు. ఎడం చెయ్యి సాచి కుడి చేత్తో దండ కింద మాంసం ఉందేమో చూశాడు. ఉత్త తోలు తిత్తి వేళ్ళాడుతోంది. రొమ్ము, ముఖం అరిచేత్తో రుద్దుకుని మళ్ళా ఇసకమీద పడుకుని, ఆకాశం వేపు చూశాడు. కళ్ళు మూసుకుని పెదవులు బిగనొక్కుకున్నాడు. పెళ్ళి చేసుకోవటం తప్పయిందా? అని అనుకుని, కాదు కాదన్నట్టు తల అడ్డంగా ఊపాడు.

పెళ్ళయిన కొత్తలో కార్ఖానాలోని మిత్రులంతా తన వెంట దుకాణానికి వచ్చేవాళ్ళు. కాదనీ లేదనీ అనలేని మనస్సు తనది. రోజుకి పదీ, పన్నెండణాలు చెల్లించవలసి వచ్చేది. తను తాగుతున్నట్టూ మిత్రుల కింద దుబారా అయిపోతున్నట్టూ సీతాలుకు తెలియకుండా ఎంత ఇదయ్యేవాడు! సీతాలంటే చచ్చేటంత మమకారం! అవీ ఇవీ నమిలి వాసన రాకుండా చూసుకుని ఇంటికి మరీ వెళ్ళేవాడు. ఎన్నాళ్ళు దాగింది కనుక!...

'తాగుతున్నావా?' - సీతాలు తన నడిగిన రోజున మామూలు కల్లు మానేసి, పక్కనున్న వాళ్ళతో పందెం వేసి రెండు చటాకులు పైగా సారా తాగాడు. దాన్ని తగలెయ్యా! ఆ మోతాదు కాస్తా తన పరువు తీసింది. దగ్గరికి పోతూంటే - సీతాలు అరిచేత్తో తన నోటిని మూసి దూరంగా తోసేసింది. ఆ వేళ సీతాలు పెదవులు అందలేదు.

రాములు మళ్ళా లేచి కూచున్నాడు. లోపల దాచిన సీసా బయటికి తీశాడు దాన్ని ముద్దుపెట్టుకున్నాడు. రుచీపచీ లేక పెళసరిగా ఉంది ముద్దు. బిరడా తీసి తెండు గుక్కలు తాగి సీసా మళ్ళా దాచేసి పడుకున్నాడు. గుప్పిళ్ళతో ఇసుకని పిసుకుతున్నాడు. బద్ధకంగా ఉన్న కళ్ళల్లో చురుకు పుట్టింది. ఆనాటి ఘట్టాలు ఒహదాని వెంట వొకటి ముసురుకున్నాయి. గట్టిగా నిట్టూర్చి "అట్టా కాలం గడిచిపోయినా బాగుండేది" అని గొణుక్కున్నాడు.

కాలం అలా గడవలేదు. ఒకరోజున ఎక్కణ్ణించో నడమంతరంగా ఒక చిక్కొచ్చిపడింది. బస్తీలోనూ, చుట్టుపక్కలా కల్లూ సారాను తాగరాదని రూలొచ్చింది. ఎక్కణ్ణించి ఎందుకీ రూలొచ్చిందో ఈనాటికీ రాములికి తెలీదు. పదేళ్ళ అలవాటు. కుతిపుట్టి రోడ్లన్నీ తిరిగాడు. పాత స్నేహితుల్ని పలకరించాడు. చివరికి మేస్త్రి కూడా చెప్పా పెట్టకుండా వెళ్ళిపోయాడు. తిరగ్గా తిరగ్గా చివరికి అతిరహస్య స్థలంలో ఒక అరగ్లాసుడు అర్ధరూపాయికి దొరికింది. నిషా కల్పించుకుంటేనే కానీ కుతి తీరలేదు.

సీతాలుకి పువ్వులు తీసుకుపోవాలి. కొత్త సినిమా చూపించాలి. అన్నిటికీ డబ్బేది? ఈ పాడు తాగుడికి డబ్బు ఖర్చయితే ఎలాగ? 'ఇన్ని తిప్పలేందుకు' మానేద్దామని అనుకున్నాడు. ఎంత కష్టమైనా సరే నిగ్రహం మంచిదనుకున్నాడు... ఏం లాభం! ఆ వేళ సాయంత్రం మనసుకి కళ్ళెం పెట్టి రాములు ఇంటికి బయలుదేరాడు. కాస్త దూరం పోయేసరికి వెనకాలే వచ్చి మేస్త్రి చేయి పుచ్చుకున్నాడు. సెగ తగిలిన వెన్నలాగ వెంటసాగాడు. సరాసరి సిటీ బస్ ఎక్కి, ఇక్కడే, ఈ ఇసుక గుట్టల తిన్నగా లోపలి వైపు పాకల దగ్గర దిగారు. బస్తీ దుకాణాల వద్ద అలజడే ఉండేదికాదు. ఇక్కడ చూస్తే వందల కొద్దీ జనం. పెద్ద పెళ్ళో, సంతో జరిగినట్టుగా ఉంది. అందులో చాలామంది బస్తీ నుంచి వచ్చిన వాళ్ళే. ఆ వేళ ఖర్చంతా మేస్త్రిదే పొద్దుపోయి బస్తీలో ఇంటికి చేరేసరికి తలప్రాణం తోకకి వచ్చింది. జేబు కాళీ. సీతాలుకి పువ్వులు లేవు. ఆ రాత్రి మాటలూ లేవు. ఒకటే కన్నీళ్ళు. సగం సగం మైకంలో ఆ రాత్రి ఎట్టా గడిచిందో!

అలవాటయిన ప్రాణం అటూ ఇటూ తేలింది. పగలు సమ్మెట వేస్తున్నా, రాత్రిళ్ళు సీతాలు ఎదరకూచున్నా - చేతికందని కల్లూ సారాల మీదనే మనసు. ఇదివరకటిలాగా కూనిరాగాలు ఆనందం ఇవ్వడం లేదు. ఉహూ - అంతా మారి, మనసంతా మాయదారి సారామీదే అతుక్కుంది.

తరువాత తరువాత చాలా మార్పులు వచ్చాయి. ఎన్నిసార్లు తలుచుకుంటే ఏం లాభం? మెట్ల మీంచి జారిన చెంబు, మెట్లన్నీ దాటి నేలమీద కూడా మరింత దూరం దొర్లుతుంది. తనూ అంతే నిషా. నిషా కావాలి. తీపికల్లు చాలదు. నీళ్ళ సారా పనికి రాదు. అడ్డమైన గడ్డీ వేసి పులుపెక్కినది కావాలి. ఒళ్ళూ మనసూ తిమ్మిరెక్కాలి. రాత్రిళ్ళు ఇంటికి చాటుగా వచ్చి ముసుగు తన్నేవాడు. ఏ అపరాత్రో సీతాలు కుమిలి కుమిలి ఏడుస్తుంటే - తనూ లేచి ఏడ్చేవాడు. కళ్ళూ, దవడలు తోసుకుపోయి వికారంగా తయారయ్యాడు.

"ఎందుకిలా తాగుతావ్? నన్ను చూసయినా మానవూ?" అనేది సీతాలు. పాపం! ఎంత బిక్కమొగం వేసుకుని అడిగేది! తను నిస్సహాయంగా కళ్ళప్పగించి తల వేలాడేసేవాడు. పిచ్చి సీతాలు ఇంకేం అడుగుతుంది?

ఏమయితేనేం, దొంగ సారా కోసం తన బ్రతుకు చిచ్చున పడింది. కొన్నాళ్ళు రైలు మీద చిట్టడువుల్లోకి పోయి అక్కడ మస్తుగా తాగి వచ్చేవాడు. ఆఖరికి బస్తీలోనే రకరకాలుగా దొంగసారా దొరికేది. తాగుడు జోరయిన కొద్దీ పనిపాటలు తగ్గి ఆదా తగ్గింది. నిషా కోసం స్పిరిట్ తాగేవాడు. చౌకగా దొరికేదదే కడుపులో నొప్పి,కళ్ళు తిప్పు వచ్చినా స్పిరిట్ సారా రుచి తగిలింది. రానురాను అదీ దొరకలేదు!

సమ్మెట ఎత్తే ఓపిక తగ్గింది. దగ్గు... పొడిదగ్గు పుట్టింది. బొమికలు బైటపడ్డాయి. ఏ నెలకో ఒకసారి గుక్కెడు మంచి సారా, రెండు చీకులూ దొరికితే ఆ రోజు పెద్ద పండగ! తతిమ్మా రోజుల్లో తను తాగుతున్నది తెల్ల కిరసనాయిలూ, కుంకుముడు రసం కలిసిన మరేదో పానీయం... బంగారం వంటి సంసారంలో ఇలా చిచ్చురేగింది!

3

ఇసక గుట్టమీంచి రాములు లేచాడు. అన్ని జ్ఞాపకాలతో కళ్ళు తడిసిపోయాయి. ముక్కు కళ్ళలో చెమ్మ ఊరింది. "సీతాలూ! నీ రాజా చచ్చిపోయాడే!" అని గొణిగాడు. ఆకాశంలో తెల్లచుక్కలు ఒకటొకటీ మాయమవుతున్నాయి. పడమటగా ఒక మెరుపు మెరిసింది. రాములు కళ్ళార్చాడు. ఆలోచనలన్నీ తెగిపోయాయి. 'ఛ!' అని అనుకున్నాడు. చక్కగా లేనిపోని గాంభీర్యం తెచ్చుకుని గుట్టమీద కూచున్నాడు, సీసా ఇసకలోంచి లాగాడు. తాగబోతూంటే ఆవాళ సాయంత్రం అనుకున్న ఆలోచనేదో తటాలున మెరిసింది.

నాలుగురోజులుగా బస్తీ అంతా చెడ తిరిగాడు. ఇంటికి వెళ్ళడం లేదు. ఉత్త చేతుల్తో వెళ్ళదలచుకోనూ లేదు. తిరిగిన చోటు మళ్ళా చూడకుండా తిరిగాడు. చివరికి ఏమీ తోచక రైలు స్టేషనుకి వెళ్ళాడు.. తింటానికి ఏమీ దొరక్క ప్లాట్‌ఫారం అంతా తిరిగి చూశాడు. అడుక్కోడానికి అభిమానం అడ్డు తగిలింది. ఏదన్నా కూలిపని చెయ్యడానికి ఓపిక లేదు. ఇవతల పుల్ల అవతల వెయ్యడానికి అలుపొస్తుంది! చివరికి పంపు వద్ద ముఖం కడుక్కుని, కడుపు నిండా నీళ్ళు తాగి బెంచీమీద కూచున్నాడు. కాసేపటికల్లా ఒక నిండుపాటి ప్రయాణీకుడొకాయన వచ్చి అదే బెంచీమీద కూచున్నాడు. లాల్చీ జేబులోంచి పర్సు బయటికి పొడుచుకొస్తోంది. ఆ విషయం ఆయన గమనించనేలేదు. అటూ ఇటూ మెసిలి కూచోడంతో ఆ పర్సు కాస్తా బెంచీ మీద పడింది. ఇంతలో బండి రావడమూ, ఆయన హడావిడిగా లేచిపోవడమూ జరిగింది. రాములు ఇదంతా చుస్తూనే ఉన్నాడు. చప్పున పర్సు తీసి దాచి, చకచకా నడిచి రోడ్డూ, పార్కు కాలువా అన్నీ దాటి వచ్చాడు. ఒంటరిగా కూచుని పర్సు తీసి చూశాడు. రెండొందల రూపాయలు! అబ్బా! ఎంత డబ్బు!

చప్పున సీతాలూ, సంసారమూ గుర్తుకొచ్చింది. పాపం ఎంత బాధపడుతోందో! ఏడుస్తోందో; ఈ డబ్బు ఇంటికి తీసుకుపోతే, నాలుగు నెలలపాటు హాయిగా జరిగిపోతుంది కదా... కానీ రాములుకి డబ్బుని చూడగానే నాలిక విరగలాక్కుపోయినట్టయింది. మంచి కమ్మని సారా తాగి చాలా రోజులయ్యింది. ఈ రాత్రి ఆఖరుసారిగా మస్తుగా తాగి, తెల్లారే సరికి ఇంట్లో ఉంటే చాలా చాలా బావుంటుంది.

తన మనస్సులో సీతాలూ, సారా సీసా దెబ్బలాడుకోడం రాములికి స్పష్టంగా తెలుస్తూనే ఉంది. సీతాలుని నెట్టి సారా సీసా మనస్సుని ఆక్రమించింది. మంచి సారా! బస్తీలోకన్నా - పల్లెకి వెళ్ళి తాగితేనే మంచిది హాయిగా ఉంటుంది.... ఇంకేం - పల్లె వేపు పరిగెత్తాడు.

సరే, తర్వాత మామూలే... ఇదే గుర్తుకు వచ్చింది. రెండు గుక్కలు తాగి ఈ రాత్రే ఇంటికి పోవాలనుకున్నాడు. జేబు తడిమాడు. నిండుగా ఉంది. సగానికి మిగిలి ఉన్న సీసాని చూశాడు. రెప్పలు బరువెక్కుతున్నాయి. కళ్ళ నుంచీ నీళ్ళు జారుతున్నాయి. ఎందుకో తెలీదు... హుషారు దిగజారుతున్నట్టు తోచింది. అదే జరిగిందా ఏడ్పు కన్నీళ్ళూ...

లేచి, బస్తీ వేపు బయలుదేరాడు. పూర్తిగా చీకటి. సముద్రం వేపు నించీ నల్లని చిక్కని మబ్బులు వచ్చి ఆకాశాన్ని ఆక్రమించుకున్నాయి. మబ్బుల చాటున నక్షత్రాలు పగిలిపోతున్న బుడగల్లాగా తోస్తున్నాయి. చలిగాలి వీస్తోంది. తాచుపాములాగా కాలవ పరుగుతీస్తోంది. ఎడం చేత్తో చొక్కా కాలరు బిగించి మెలివేశాడు. మధ్య మధ్య సీసాలోంచి ఒక్కో గుక్క తాగుతున్నాడు. తాగుతున్న కొద్దీ నరనరాల్లో జ్వాలలు రేగుతున్నై. ఎన్నడూ లేనిది ఏదో ఆరాటం వెలికి దూకుతోంది. మాంచి నిషా కాబోలనుకున్నాడు. ఒళ్ళు ఉబుకుతోంది. బట్టలు బిగుతుగా చిరాగ్గా ఉన్నాయి. ఊడ తీసేస్తేనే బావుండును. కళ్ళు మెరుస్తున్నాయి. వోహ్! చాలా కాలానికి నిఖార్సయిన 'మందు' గొంతులో పడింది. నెత్తురు అల్లరి పెడుతోంది. చురుగ్గా ముందుకు నడుస్తున్నాడు.

ఎంత నడిచినా తరిగినట్టే లేదు. 'వెనక్కి నడుస్తున్నానా, లేదే! అదే బస్తీ లైటు కనిపిస్తుంటేనూ!' అనుకున్నాడు. ఎక్కడో వాన కురుస్తున్నట్టుంది. తడిసిన మట్టివాసన. చీకట్లో కాలిబాట కనిపించీ కనిపించనట్టుంది. మనస్సేమీ పనిచేయడం లేదు. పాదరసంలాగా నెత్తురు ప్రతి నరంలోకి పరుగెత్తి పొంగుతోంది. ప్రతి నెత్తురు చుక్కా కండా చలించినట్టుంది. విరిగిపడే ముందు ఉధ్రుతంగా పైకెగిరి కడలి తరంగంలాగా లోలోపలి కోరిక ఏదో ముఖంలోకి పొంగి చెక్కిళ్ళూ, నుదురూ పెళుసెక్కాయి. చాలాకాలంగా నిద్రపోతున్న యవ్వనం ఏదో మనస్సుని పట్టుకుంది. ఆట గుర్రంలాగా కదను తొక్కుతోంది. నిఖార్సయిన మందు మహాత్యం కాబోలు! అంత చల్లగాలిలోనూ మండుతున్న కాష్టంలాగా ఉంది ఒళ్ళు!

మెరుపులు, మెరుపులు, ఒకదాని వెంట ఒకటి, బస్తీవేపు మబ్బుల్లేవని తోచింది. బాటవేపు చూశాడు. మెరుపు తళుక్కుమంది. ఎవరో నీడలాగా కనిపించారు. తనలాగే ఎవరో. మళ్ళా మెరుపు మెరిస్తే బావుండును. తనకేం, మహారాజు, డబ్బుంది. అందులోనూ ఆకలిగొన్న సింహంలాగా ఉంది తన పని. ఐనా, ఆ వచ్చేది ఎవరో చూడగలిగితే.. ఆడదే అయితే. మెరుపొచ్చినప్పుడు మబ్బు చీలినట్లే మెదడు చీలిపోయింది... తటాలున మెరుపు మెరిసింది... ఇరవై గజాల్లో చీరె... బస్తీనుంచీ వస్తోంది.

రాములు నిలిచి పోయాడు. ఆఖరు గుక్క తాగేశాడు. నెత్తురు దూకుతోంది. ఒకసారి ఆపాదమస్తకం వణికింది. భయమా? కాదు - తృష్ణ. మండి పడుతున్న జ్వాల. కింద పెదవి కొరికాడు. చిట్లి నెత్తురు చెమర్చింది. నాలిక మీద నెత్తురు రుచి... ఖాళీ సీసా కాలవలోకి విసిరేశాడు. ఇంతసేపూ ఉన్న ఆరాటం ఏమిటో అర్థమయింది...

నీళ్ళలో "ధప్" మన్న చప్పుడికి ఉలిక్కిపడింది. నీరసంగా ఒక కల కంటోంది. అది కాస్తా చెదిరిపోయింది. తనకో బిడ్డ ఉండి ఉంటే, ఎలా ఉండేదా అని ఆ కల! ఆ బిడ్డనే సర్వస్వంగా చూసుకుంటూ బ్రతికేది. తన బతుకు ఇంత పాడయ్యేది కాదు కదా! నడవలేక నడవలేక ఈడ్చుకుంటూ నడుస్తోంది. తలెత్తకుండా నడుస్తోంది. ఆఖరుసారిగా కురుస్తున్న కన్నీటిని కూడా తుడుచుకోలేకుండా ఉంది. ఆపుకోనూ లేదు... ఎవరో తనని నొక్కేస్తున్నారు... మొదట ఏదో తగిలింది. కొండ చిలువ చుట్టేసినట్టు చుట్టేస్తున్నారు. చెడుకంపు, సారాకంపు. ఇంతసేపూ ఊహిస్తూ వచ్చిన బిడ్డ కూడా గిలగిలలాడుతున్నట్టు తోస్తోంది. బొమికెలు పెటపెటమంటున్నాయి. అమ్మబాబో.. ఎవరో తనని చెరిచే ప్రయత్నం చేస్తున్నారు. 'కెవ్' మని అరిచింది. ఆ అరుపుతోనే గుండె ఆగిపోయింది...

రాములు గిలగిల్లాడే చేపని వడిసి పట్టినట్టు చేతులు బిగిస్తున్నాడు. రొమ్ముకి నొక్కుకున్నాడు. తాచుబాము బుసలాగా చేతుల మధ్య నుంచీ బుస వినిపించి సన్నగిల్లుతోంది. రాములుకు తాను తూలిపోతున్నట్టు తోచింది. పట్టు వదల్లేదు. కింది పెదవి కొరికి నెత్తురు చవి చూశాడు. కాళ్ళూ చేతులు మెలిక వేశాడు.

"కెవ్"మన్న కేక ఎక్కణ్ణించో నూతిలోంచి వినపడ్డట్టుగా ఉంది. ఆ గొంతు ఎక్కడో విన్నట్టే ఉంది. ఒక రాయి వచ్చి కొట్టినట్టు, ఆ "కెవ్వు"మన్న స్వరం ఎవరిదో గుర్తు వచ్చింది.

"ఆ" అని మాత్రమే నీరసంగా అనగలిగాడు. రాములు చేతుల్లో సీతాలు మంచు ముద్దయింది. మెలికలు పడ్డ కాళ్ళూ చేతుల్ని వొదిలించుకోడానికి అవకాడం లేదు. ఎక్కడో ఎత్తయిన పర్వతాగ్రం నుంచీ లోయలోకి దొర్లినట్లు తోచింది. ఆ దొర్లడంలో సీతాలు పాడుగాటి జుట్టు రాములు మెడకి చుట్టుకుని బిగుసుకుపోయింది!

ఒకే ఒక నిమిషం!

కాలువలో ఒకసారి 'బుడుంగు'మని చప్పుడయింది. అంతే. పాతికేళ్ళన్నా నిండని ఆ దంపతుల జీవితాల్ని మింగి కప్పని తిన్న పాములే కాలవ, కారు నల్లని ఆకాశం కింద గంభీరంగా పోతోంది. కట్టమీద కంకరరాళ్ళ మీద చిందిన నెత్తురు మడుగు మాత్రం మన అందరికోసం ఇంకా పచ్చిపచ్చిగా మెరుస్తోనే ఉంది!!

*****

(రచనా కాలం -1969)

చెట్టు ఆకు సందుల్లోంచి ఓ సారి తొంగి చూసి అతనొక్కడూ తప్ప మరెవ్వరూ లేరని నిర్ణయించుకుని అల్లరి చేయకుండా మెల్లిగా ఊడలా కిందకు దిగి అతని ముందు నుంచుంది వెన్నెల.

క్షణకాలం నిశ్శబ్దంగా ఉండిపోయింది. అతనలాగే తన ఉనికిని కూడా గుర్తించకుండా చెట్టుకి ఒదిగి కళ్ళు మూసుక్కూర్చోవటం ఆశ్చర్యం కలిగించింది. మరో నిమిషం అలానే ఉండి తరువాత అతణ్ణి తట్టి లేపింది.

అతను కళ్ళు తెరిచి తన ఎదురుగా ఆకుల మధ్య నుంచీ నిలుచున్న వెన్నెలని, "ఎవరూ?" అని అడిగేడు.

"నేను... వెన్నెలని!" అన్నది వెన్నెల సిగ్గుతో మెల్లిగా తలదించుకుంటూ.

వెన్నెల తలదించుకోవటం అతనికి నచ్చలేదు. వెనక్కి చెట్టు బోదెనానుకుని నిట్టూర్చటం విని వెన్నెల తలెత్తి అతన్ని చూస్తూ అన్నది...

"పదిరోజుల్నించీ చూస్తున్నాను. ఆవేదనతో నిట్టూర్చటం; లోలోపలే వెక్కి వెక్కి ఏడ్వటం తప్ప మీరు ఇంకేమీ చేయటంలేదు. - ఇక్కడికి, ఈ కాలవ వడ్డుకి వచ్చి! కారణాలు ఊహించేంత జ్ఞానం నాకు లేదనే నేననుకోవటం..."

క్షణం ఆగి ఓసారి అటూ ఇటూ చూసింది.

అతను అలాగే బోదెనానుకుని ఆశ్చర్యంగా వెన్నెలకేసి చూస్తూ అన్నాడు - "అయితే నెలరోజులుగా నన్ను ఎవరూ కనిపెట్టటం లేదని పొరబడ్డానన్నమాట. నిజం! నాకింతవరకూ తెలియదు - నన్ను చూసేవాళ్ళు ఇంకొకళ్ళు ఉంటారని. ఎందుకంటే నేననుకునే రాధిక మొన్నటి వరకూ నన్ను ప్రతి విషయంలోనూ కనిపెట్టి ఉండేది. కానీ దురదృష్టం, ఆమె నాకింక లేదు..."

ఈసారి వెన్నెలకాశ్చర్యం వేసింది.

"నుంచునే ఉన్నావు కూర్చో!" అన్నాడతను.

వెన్నెల మాట్లాడలేదు "ఫరవాలేదు... కూర్చో! ఎంతసేపనినుంచుంటావు."

వెన్నెల అతని ముందు పచ్చికలో ఒదిగి కూర్చుంది.

అతను కాళ్ళు చాచి చేతులు వెనక్కి నెట్టి ఆకుల్లోంచి - వెలుగుతో ప్రకాశిస్తున్న చంద్రుడి వంక చూశాడు. క్షణం ఏమీ మాట్లాడలేదు.

వెన్నెల అతని ముందు ముడుచుకుని పువ్వుల కుప్పలా, వెలుగు ముద్దలా తలొంచుకుని అతనికేసి ఓరగా చూస్తూ కూర్చుంది.

"చంద్రుడికి నువ్వులా, నాకు రాధిక ఉందనుకునేవాణ్ణి...." అతనలాగే చంద్రుడి వంక చూస్తూ అన్నాడు.

వెన్నెల తలెత్తి అతనికేసి చూసింది.

"అవును. మొన్నటి వరకూ నేనూ, రాధికా అలాగే ఉండేవాళ్ళం. ప్రపంచంలో నాకు రాధిక తప్ప మరెవ్వరూ లేరు..."

వెన్నెల అతనికేసి కళ్ళప్పగించి చూడ్డం అతనికి నచ్చలేదు.

"నిజమే! రాధిక అసలు ఎవరో చెప్పకుండానే నీకీ విషయాలన్నీ చెప్పడం పొరబాటే! రాధిక నాకు మేనమామ కూతురు. నాకు చిన్నప్పటినుంచీ కూడా ఆత్మీయురాలిగా ఉన్నది కూడా ఒక్క రాధికే. నా తల్లీతండ్రీ నే బుద్ధెరక్కముందే నాకు దూరమయ్యారు. ఆ తరువాత ఇప్పటికీ నాకు మనిషిలా ఉండి, బ్రతకడం నేర్పించింది రాధికే! అందుకే నాకు రాధికంటే ప్రేమ. అసలు ప్రేమ ఏమిటో కూడా తెలియచెప్పిందీ.. ఆవిడే!... నిజం! వెన్నెలా! నీకు తెలుసో .. తెలియదో గానీ.. నాకు బ్రతకడంలో కలలు కనడం నేర్పింది ఆమే..."

"నాకప్పుడప్పుడూ అనిపించేది. ఆ భగవంతుడే గనక ఎదురొచ్చి నీకీ ప్రపంచంలో ఏం కావాలని అడిగితే ఓసారి భగవంతుణ్ణి చూసి పిచ్చిగా గొంతెత్తి నవ్వాలని ఉండేది. లేకపోతే.. రాధికే నాకు ప్రపంచం అయినప్పుడు ఇంక నేనేం కోరుకుంటాననీ....?"

క్షణం ఆగి చటుక్కున నవ్వాడతను.

వెన్నెల ఉలిక్కిపడింది. అతనెందుకు నవ్వేడో వెన్నెల కర్థం కాలేదు.

"ఇప్పుడనిపిస్తోంది. నిజంగా భగవంతుడలా నన్నడిగినప్పుడు నేనలా ప్రవర్తించకుండా ఉండాలని, గర్వంగా ఎదురు చెప్పకూడదని! కనీసం 'రాధికను నాకు దూరం చేయకు స్వామీ' అనయినా బ్రతిమాలాలని!" అంటూ తలొంచుకున్నాడు.

అతనలా కన్నీరు కార్చటం వెన్నెలకి బాధ కలిగించింది.

"మీరిలా క్రుంగిపోవటం బాగోలేదు. మీకింతకన్నా ఏం చెప్పను?" అన్నది.

అతను కన్నీళ్ళు నిండిన కళ్ళని ఎత్తి వెన్నెలకేసి చూసేడు.

"నాకు వేళయింది. మళ్ళీ కలుస్తాను - ఇలాగే రేపు! సెలవు" అంటూ లేచి ఆకుల్లోంచి చంద్రుడికేసి వెళ్ళిపోయింది వెన్నెల.

మర్నాడు -

మబ్బు కమ్ముకున్నప్పుడు

అసలు రావలసిన వేళకన్నా ఇంకాస్త ఆలస్యం అయింది - వెన్నెలకి చెట్టు కిందకు వచ్చేందుకు!

తననుకున్నట్టుగా అతను ముందు రోజులా చెట్టుబోదెనానుకుని లేడు.

పదిరోజులుగా అలవాటుపడిన వ్యక్తి ఆ వేళప్పుడు అక్కడ కూర్చుని లేకపోవటం వెన్నెలకి ఆశ్చర్యం కలిగించింది.

ఓసారి చుట్టూ కలియజూసింది. చెట్టుకి తూరుపు వేపు కాలవ్వొడ్డున ఇసుకలో వెల్లకిలా, ఆకాశంలో చంద్రుడిలో తన ఆలోచనల నీడల్ని వెదుక్కుంటూ పడుకున్న అతను కనిపించేడు.

వెన్నెల కప్పుడు - అతనక్కడ ఇసుకలో పడుకున్నందుకు ఆశ్చర్యం కన్నా ఇంకేదో అనిపించింది.

అందుకే -

"అరె! మీరు అక్కడున్నారా?" అని అన్నది.

అతను వెన్నెల పలకరింపుకు లేచి కూర్చున్నాడు. ఆ మాట అతనికి ఆ కాలువ నీటికి మల్లే గలగలల శబ్దంలా, సంగీతంలో అతనికి వెన్నెల మాటల కన్నా రాధిక మాటలే వినిపించాయి.

అతను లేచి కూచున్నంత లోపలే వెన్నెల ఇసుకలోకి అతనికి దగ్గరగా వచ్చి కూర్చుంది.

"పాత చోటు మార్చారేం?" ముడుచు క్కూర్చుంటూ అన్నది వెన్నెల.

"పాత బ్రతుకు పాతచోటునే పాతిపెట్టాను. నీకీ రోజు మంచి శుభవార్త చెబుతాను వెన్నెలా! నిన్నసలు మనం మాట్లాడుకోకుండానే కాలం మనల్ని నిలదీసింది - నన్నూ రాధికను విడదీసినట్టు. అయినా మళ్ళీ నువు వచ్చావు. విడిపోయిన నీకులాగే మళ్ళీ రాధిక నాకు దొరికింది. నువు నమ్మవు కదూ! నిజం వెన్నెలా!

"రాధిక నాకు దూరమయిన మాట ఒకరకంగా అబద్ధమయ్యిందీరోజున. తనే చెప్పింది. లోకం కోసం, సంఘం కోసం తనతన్ని పెళ్ళి చేసుకుందనీ చెప్పింది. మొన్నప్పుడో నేను పట్నం వెళ్ళినప్పుడు యవ్వనంలో కాలుజారి చలపతికి దగ్గరయినందుకు పెళ్ళి చేసుకోవలసి వచ్చిందనీ పశ్చాత్తాపపడింది.

నువు నమ్మవుగానీ వెన్నెలా! రాధిక ఇవాళ ఎంత బాధపడిందని? నిజానికి చలపతిని పెళ్ళి చేసుకున్నదన్నమాటే కాని, నామీదే తనకు ప్రేమ ఉందనీ, తన జీవిత కాలం నా జీవననావలోనే గడుపుదామన్నదే తన ఆలోచనట. నిజంగా నాకే జాలేసింది. అప్పట్లో, ఆ పరిస్థితుల్లో ఎవరయినా అంతే చేస్తారేమో! ఏమో ఏమిటి? నేనయితే అలాగే చేసేవాణ్ణి! రాధిక నన్నుకాదని చలపతిని పెళ్ళిచేసుకోవటం తప్పని సరయింది. అందుకు నేనిప్పుడు బాధపడటం లేదు..."

వెన్నెల నిశ్చేష్టితయ్యింది.

అతను చెప్పుకుపోతున్నాడు.

"మొదట నేను నమ్మలేదులే! కానీ నిజంగా నా మీద తనకి ప్రేమ ఉన్నట్టూ, అందుకు నిదర్శనంగా తనని తాను సమర్పించుకునేందుకివాళ ఈ కాలువవడ్డుకి వస్తానంది.

నిజం వెన్నెలా! ఇన్ని సంవత్సరాలుగా నేను ఎన్ని సార్లు అనుకున్నాను - రాధిక యవ్వనంతో ఆడుకోవాలనీ, రాధిక మనసులో నిలిచిపోవాలనీ, రాధికలో లీనమయిపోవాలనీ, నా కలలన్నీ ఇవాళ ఈ కాలవ్వొడ్డున నీ వెలుగులో తీరతాయి. రాధిక నా కోసం ఇంకాసేపట్లో ఇక్కడికి వస్తుంది. నీకు రాధికను పరిచయం చేస్తానుగా? చూద్దువుగాని! నిన్నటివరకూ నాది కాకుండా పోయిందన్న అందం ఇంకాసేపట్లో నా చేతిలో గులాబీ పువ్వయిపోతుంది. పిచ్చెక్కి రాధికను మోహావేశంతో కౌగిలించుకుంటాను. ఈ లోకంలో నా జీవితానికల్లా ఎక్కువయిన ఆనందాన్ని ఈ రాత్రి అనుభవిస్తాను. ఆమె యవ్వనాన్ని మధువులా తాగేస్తాను. నన్ను నమ్ము వెన్నెలా! నేనటం కాదుగానీ... చూస్తావుగ..."

నవ్వుతున్న అతడిని చూస్తుంటే వెన్నెలకి పిచ్చెక్కిపోయేలా అనిపించింది. అటూ ఇటూ చూసింది. అడ్డువస్తున్న మబ్బుని చూసి వెన్నెల చటుక్కున లేచి చంద్రుడికేసి పరుగెత్తి వెళ్ళిపోయింది.

ఎంతకీ మబ్బు తునక అడ్డుతొలగనందుకు కాస్సేపు అతని గురించి కన్నా ఆమె గురించి - రాధిక గురించి ఆలోచించాలనిపించింది.

అగ్నిసాక్షిగా పవిత్రంగా పెళ్ళాడిన భర్తను కాదని, తన సర్వస్వం తన స్త్రీత్వం అర్పించిన భర్తను కాదని మరో మగాడికి దాసోహం అయ్యేందుకు సిద్ధపడిన ఆమెను తప్పకుండా చూడాలనిపించింది వెన్నెలకి!

మబ్బుతెర తొలగినప్పుడు రాధికను చూడాలన్న అత్యంతాశతో నేలకేసి పరుగెత్తి వెళ్ళి, కాలవ వడ్డున అతనామెని గొంతు నులుమి చంపుతూండటం కనిపించి ఆశ్చర్యపోయింది వెన్నెల!

ప్రముఖ చిత్రకారుడు చంద్ర గారి గురించి కౌముది పాఠకులకి వేరుగా పరిచయం చేయాల్సిన అవసరం లేదనుకుంటాము. 'కౌముది' పత్రిక లోగోని డిజైన్ చేసి ఇచ్చింది చంద్ర గారే. చిత్రకారుడు చంద్ర మంచి రచయితకూడా అన్న విషయం చాలా మందికి తెలియక పోవచ్చు. ఆయన 40 సంవత్సరాల క్రిందట రాసిన కథని ఈ నెల 'అనగనగా ఒక మంచికథ' గా మీ ముందుకి తీసుకువస్తున్నాం.

ఆప్తస్వరం

- కుప్పిలి పద్మ

(రచనా కాలం -1989)

తాటాకులు నేసిన విశాలమైన ఇల్లు. తాటాకులు చాలా పాతగా ఆనుతున్నాయ్. ఎండిపోయిన కంది కంచె మొహమాటంగా ఆ ఇంటిని కాపలా కాస్తోంది. కంచెపై అల్లిబిల్లిగా అల్లుకుంది కాకరపాదు. తాటాకుల ఇంటిపైకి పాకిన బూడిద గుమ్మడి పిందెలు ముద్దు ముద్దుగా నవ్వుతున్నాయి. ఆ ఇంటి ఆవరణలో ఓ వైపు పెద్దరికం సంతరించుకున్న మామిడిచెట్టు పూత పెట్టడానికి వసంతమెప్పుడు ఆదేశిస్తుందాని ఎదురు చూస్తోంది. అంతకుముందు శరత్ వెన్నెల్లో జలకాలాడిన చామంతి వింత సోయగంతో విరాజిల్లుతూ పుష్యమి బాలభానుణ్ణి చిన్నగా వెక్కిరించింది. ఉదయపు టెండకి పూసిన మందారాల అరుణకాంతులతో ఆ ఆవరణంతా వెలిగిపోతూంది.

అరుగు మీద మడత కుర్చీ వాల్చుకుని తెల్లని పంచె, లాల్చీ కట్టుకుని కూర్చున్నాడు సత్యం. పక్కనే ట్రాన్సిస్టర్‌లో వస్తున్న వార్తలను తదేకంగా వింటున్నాడు.

డెబ్భై సంవత్సరాల సత్యానికి పుట్టుకతో అంధత్వం లేదు. పుట్టిన నాలుగురోజులకు మసూచి పోసి అంధత్వాన్ని శాశ్వతం చేసింది. సత్యం తండ్రి ఆస్తిపరుడు. అతనికి మామిడి తోటలూ, ఇళ్ళూ ఉండేవి. భీమ్లి చుట్టుపక్క ఊర్లలో గొప్ప ధనవంతుడిగా పేరుపొందిన అతడికి తన కొడుక్కి పెళ్ళిచెయ్యటం పెద్ద కష్టం కాలేదు. సత్యానికి ఇరవై సంవత్సరాలప్పుడు పదమూడేళ్ళ లక్ష్మితో వివాహం అయింది.

లక్ష్మి కుందనపు బొమ్మలా ఉండేది. పసితనంలోనే పెళ్ళి అవటం వలన ఆమె మనసు చాలా త్వరగా వికసించింది. సత్యానికి ఆరుగురు అక్కచెల్లెళ్ళు. ఒక తమ్ముడు, లక్ష్మి ఆ ఇంటి పెద్ద కోడలిగా అందరి ఆలనా పాలనా చూస్తుండేది.

సత్యం బ్రతుకు తెరువు ఏమిటని ఎవ్వరూ ఏరోజూ ఆలోచించలేదు. ఆ అవసరంకుడా రాలేదు.

సత్యానికి ఎలా కాలక్షేపం అవుతుందని మాత్రం ఆలోచించారు అంధులకు గొప్ప కాలక్షేపం సంగీతం.

సత్యాన్ని విజయనగరం మహారాజా మ్యూజిక్ కాలేజీలో చేర్పించారు.

వయొలిన్ నేర్చుకోవటం మొదలు పెట్టాడు సత్యం.

''నీ లీల పాడెద దేవ'' - అంటూ జానకిగారి స్వరం సన్నాయితో పోటీ పడటం చూసి ఆ మధ్య ఎవరో ''ఎంత గొప్ప సంగీత బాణి'' అని మెచ్చుకుంటే ''సాలూరి రాజేశ్వర రావు సంగీతం అంటే ఏమనుకున్నారు? - మా కాలేజీలోనే చదువుకున్నారు'' అన్నాడు సత్యం ఆనందంగా.

ఘంటసాల గారి పుష్పవిలాసం తన్మయంగా వింటూ ''కాలేజీలో నా స్నేహితుడు - చూడు, ఎంత గొప్పగా పాడుతున్నాడో'' అంటూ గర్వంగా ఆనాటి ముచ్చట్లు కథలు కథలుగా చెప్పటం అతని అలవాటు.

సత్యానికి ఒక కొడుకు పుట్టాడు. సత్యానికి కళ్యాణి రాగమంటే చాలా అభిమానం. కొడుక్కి కళ్యాణ్ అని పేరు పెట్టాడు. కళ్యాణ్‌కి ఊహ వచ్చేసరికి ఆరుగురు మేనత్తల పెళ్ళిళ్ళు అయి, పిల్లలు నడక నేర్చే వయసుకు వచ్చారు.

''నాకు అర్జంటుగా పదివేలు కావాలి'' సత్యం తమ్ముడు సారధి అడిగాడు తండ్రి బుచ్చిబాబుని.

''ఎందుకు?''

''ఎందుకు అని అడగొద్దు. ఇస్తే ఇవ్వండి, లేకపోతే లేదని చెప్పండి. నాదారి నే చూసుకుంటాను'' మొండిగా అన్నాడు సారధి.

''ఏం చేస్తావ్?''

''సముద్రంలో దూకుతాను'' స్పష్టంగా చెప్పాడు సారధి.

పాపమా తండ్రి ఆ బెదిరింపుకు లొంగిపోయాడు. పదివేలు సారధికి ఇచ్చాడు.

అదీ మొదటిగాలి, ఆస్తి కర్పూరంలా హరించుకుపోవడానికి.

కళ్యాణ్ డిగ్రీ పూర్తి అయింది. అతడికి అరుణతో వివాహం అయింది. స్టేట్ గవర్నమెంట్‌లో అతడికి ఉద్యోగం వచ్చిన మూడు నెలలకు తాత బుచ్చిబాబు పరమపదించాడు.

ఎప్పుడూ పాతికమంది వ్యక్తులతో కళకళలాడే ఆ ఇల్లు వెలవెలబోయింది.

కళ్యాణ్ అరుణతో హైదరాబాద్‌లో మకాం పెట్టాడు.

ఉన్న ఊరిలో ఓ స్థలంలో ఓ పాక వేసుకుని భార్యతో ఉంటున్నాడు సత్యం. అతనికి తోడు వయొలిన్, ట్రానిస్టర్, అక్కచెల్లెళ్ళు రాసే ఉత్తరాలు. అందరిమధ్య ఆప్యాయతలకేం కొదవలేదు. కానీ రాకపోకలే తగ్గాయి. చాలా కాలం క్రితం సారధి ఓ యాక్సిడెంట్‌లో పోయాడు.

ఈ సంక్రాంతి పండగకు కళ్యాణ్ వస్తావని రాశాడు. కొడుకు కోసం కళ్ళింత చేసుకుని ఎదురు చూస్తోంది లక్ష్మి.

''అబ్బాయ్ రావటానికింకా టైం ఉందాండి?'' అడిగిందామె.

''చాలా ఉంది. ఏదీ ఇంకా ఎనిమిదే కాలేదు. ట్రైన్ ఇంకా విశాఖే వచ్చుండదు'' అన్నాడు సత్యం.

''కోడలు, పిల్లలూ కూడా వస్తే బాగుంటుంది కదండి'' అంది లక్ష్మి.

''అబ్బాయి నా కోసం ఓ కొత్త ట్రాన్సిస్టర్ తెస్తే బాగుండును. ఇది పాతదై గరగరలాడుతూంది'' అన్నాడు సత్యం.

''మీకెప్పుడూ ఆ రేడియో గొడవే. నాకేమో పిల్లలతో కొన్నాళ్ళు గడపాలని ఉంది'' అంది లక్ష్మి.

''అబ్బాయి మనల్ని అక్కడికి వచ్చేయమని రాస్తూనే ఉన్నాడు. ఈ ఊరిపై, ఈ ఇంటిపై మమకారం మనల్ని ఇక్కడనుండీ కదలనివటం లేదు. కానీ ఇక్కడ మనమేం ఆనందంగా ఉన్నాం చెప్పు. ఏ గాలికి రాలిపోతుందో తెలియదా కంచె, ఏ వర్షానికి కూలిపోతాయో ఈ ఇంటి గోడలు, ఏ నిప్పులు చెరిగే ఎండకి అంటుకుపోతుందో ఆ కప్పు. నీకు - నాకు రోగం వస్తే గుక్కెడు నీళ్ళు పోసే దక్షతా లేదు. ఈసారి అబ్బాయి పిలిస్తే వెళ్ళిపోదాం, ఏమంటావ్?'' అడిగాడు సత్యం.

''వెళ్ళిపోదామండి ఇక్కడ మనకెవరున్నారు? నా అనే నలుగురు మధ్యే ఉందామండి అంది లక్ష్మి.

''నాతో వచ్చేయండమ్మా, ఎందుకిక్కడ ఒంటరిగా'' అన్నాడు కళ్యాణ్.

''అలాగే వచ్చేస్తాం కాని ఈ ఇల్లూ'' అన్నాడు సత్యం.

''అమ్మేద్దాం. మీకిష్టం లేకపోతే ఎవరైనా అద్దెకి ఇద్దాం'' అన్నాడు కళ్యాణ్.

''దీనికి అద్దె ఎవరిస్తారా, అమ్మేద్దాం'' అన్నాడు సత్యం.

ఇంటికి బేరం పెట్టారు

షావుకారు కొన్నాడు.

సత్యం ఆఖరిసారిగా ఆ ఇల్లంతా తడిమి తడిమి చూస్తూ తిరిగాడు.

లక్ష్మి తనివిదీరా ఆ ఊరి పొలిమేరల్ని చూస్తూంది.

''పొలిమేర దాటిపోతున్నాం ఓ గువ్వల చెన్నా

పొరుగూరు చేరిపోతున్నాం ఓ గువ్వల చెన్నా''

- ఎక్కడో విన్న పాట ఆమె మదిలో కదిలింది.

''గుళ్ళో నిన్ను చూడలేకున్నా ఓ గువ్వల చెన్నా

ఏ సీమలు తిరుగాడినా ఓ గువ్వల చెన్నా

నీ దీవెన బందించాలన్నా ఓ గువ్వల చెన్నా''

- సత్యం మనసులో మెదలిందా పాట.

''బాగున్నారా అత్తయ్యా'' ఆప్యాయంగా పలకరించింది అరుణ.

''తాతాజీ నా క్రాఫ్ చూడండి'' అంటూ తన బాబ్డ్ హేర్‌పై సత్యం చేతిని పెట్టి చూపించింది పద్నాలుగేళ్ళ రేఖ.

''బేషుగ్గా ఉందమ్మాయ్'' అన్నాడు సత్యం.

''తాతాజీ నే గిటార్ వాయించటం నేర్చుకుంటున్నాను వయొలిన్ నేర్పిస్తారా?'' అడిగాడు పదహారేళ్ళ కార్తీక్.

''కాళ్ళు నొప్పులు. నేనిప్పుడు వయొలిన్ వాయించలేను'' అన్నాడు సత్యం.

కోడలు, పిల్లలు చూపించే ఆదరాభిమానాలు మధ్య లక్ష్మి. సత్యంకి వారం రోజులు క్షణాల్లా గడిచిపోయాయి.

ఓ మారుమూల ఊరిలో జీవితమంతా గడిపి, ఆఖరి కాలంలో నగర జీవనంలోకి అడుగుపెట్టిన లక్ష్మి, సత్యానికి ఆ ఇంట్లో వారి జీవన సరళి చాలా వింతగా తోచింది.

అరుణ ఓ లిమిటెడ్ కంపెనీలో స్టెనోగా పనిచేస్తోంది. ఉదయం తొమ్మిది గంటల నుండీ ఆరుగంటల వరకు ఆఫీసు వేళ. ఇంటికి ఆఫీసు చాలా దూరం. ఆమె ఉదయం ఎనిమిది గంటలకి బయలుదేరితే సాయంత్రం ఏడున్నరకే ఇంటికి చేరుతుంది. కళ్యాణ్ తొమ్మిదికి బయలుదేరి సాయంత్రం ఆరున్నరకి వస్తాడు. రేఖ ఉదయం ఎనిమిది గంటలకి ఇల్లు వదిలి రాత్రి ఎనిమిది గంటలకే ఇంటికి చేరుకుంటుంది. ఆ మధ్యకాలంలోనే చదువు ట్యూషన్, టైప్, డాన్స్ క్లాసులకి వెళుతుందామె.

కార్తీక్ మధ్యాహ్నం కాలేజీకి వెళతాడు. సాయంత్రం ఏడుగంటలకి వస్తాడు ఉదయమంతా అతడు చదువుకుంటాడు. వివేక్ సి.ఏ. ఆర్టికల్స్ చేస్తున్నాడు. అతడికి పుస్తకాలే లోకం. ఉదయం పదిగంటలకి ఇంట్లోనుండి బయలుదేరి సాయంత్రం ఆరు గంటలకి వస్తాడు.

వంటిల్లు కాకుండా రెండు గదులున్న ఇల్లు అది. పక్కనే మరో పోర్షన్. ఇంటిగల వాళ్ళుంటారు.

టూ - ఇన్ - వన్, టీవీ, పేరుకి మాత్రమే ఉన్నాయి. వాటిని వాళ్ళు ఏ రోజూ ఆన్ చెయ్యరు.

అరుణ ఖాళీగా ఉన్నప్పుడే వంటచేసి ఫ్రిజ్‌లో ఉంచి వడ్డించే ముందు వేడి చేస్తుంది. ఏరోజూ అందరూ కలిసి భోజనం చెయ్యరు. వాళ్ళకి కుదరదు.

లక్ష్మి కోడలికి ఇంటి పనుల్లో సాయం చెయ్యటం మొదలు పెట్టింది. అరుణ అభ్యంతరం చెప్పినా "నాకెలా పొద్దుపోతుంది" అంటూ కల్పించుకుని చేస్తుండేది.

ఉదయం అయిదుగంటలు.

బాత్రూం దగ్గర నీళ్ళ చప్పుడవుతుంటే కార్తీక్ నిద్రలో అటునుండీ ఇటు కదిలి "ఎవరా చప్పుడు" అన్నాడు విసుగ్గా.

"నేనే" అన్నాడు సత్యం.

అయిదుగంటలకే దంతధావనం చేయటం సత్యానికి బాల్యం నుంచీ అలవాటు.

"ఏం తొందరొచ్చిందండి. ఓ గంట ఆలస్యంగా లేస్తే మీకేమైంది - పడుకోనివ్వకుండా" మరింత మునగదీసుకుని పడుకుంటూ అన్నాడు కార్తీక్.

"వీళ్ళకోసం నా అవాటు మార్చుకోవాలి" అనుకున్నాడు సత్యం.

"అమ్మా!" పిలిచాడు వివేక్.

ఆఫీసుకి రెడీ అవుతున్న అరుణ "ఏం?" అంది.

"తాతాజీని రేడియో చిన్నగా పెట్టుకోమని చెప్పు. చదివేది ఏదీ తలకెక్కట్లేదు" అన్నాడు.

"నువ్వే చెప్పు."

"ఊహూఁ నే చెప్పను. నువ్వయితే ఆయన నొచ్చుకోకుండా చెప్పగలవ్" అన్నాడు వివేక్.

"సమయం చూసి చెపుతాలే" అంది అరుణ.

రాత్రి పదిగంటలు.

కార్తీక్, వివేక్ చదువుకుంటున్నారు. అదే గదిలో లక్ష్మి ఓ మూల మంచంపై నిద్రపోతుంది. ట్యూబ్ లైట్ కాంతి ఆమె నిద్రని చెదరకొట్టట్లేదు. మరో గదిలో అరుణ మత్తుగా నిద్రపోతుంది. కళ్యాణ్ పేపర్ చదువుతున్నాడు. పిల్లలు చదువుతున్న గదిలోనే సత్యం మడత కుర్చీలో కూర్చుని ఉన్నాడు. ఆయన ట్రాన్సిస్టర్ ఆన్ చేశాడు. రేడియోలో సంగీత కచేరీ మొదలయింది. కచేరీ మొదలైన క్షణాల్లో అతని మనసునిండా ఉద్వేగం నిండుకుంటుంది. రాగం మెల్లమెల్లగా మొదలవ్వగానే ఉద్వేగం ఆనందాన్ని సంతరించుకుంటుంది. రాను రాను అతని హృదయం ఆ కచేరీలో లీనమైపోతుంది. ఆ క్షణంలో అతడికి తన అంధత్వం, బంధుమిత్రులు, హరించుకుపోయిన ఆస్తి, భార్య, కార్తీక్ అదిలింపూ ఏం గుర్తుకురావ్. అణువణువూ సంగీత ఝరి అలలుగా కదులుతుంటుంది. ఆకాశవాణి ధ్వని తరంగాలని అంధులు ఆస్వాదించినంత గొప్పగా ప్రపంచంలో ఏ ప్రాణీ ఆస్వాదించదు. అందులో ఆనంద విషాదాలు వారి మనసులకి తట్టినంత దివ్యంగా మరే హృదయానికి తట్టవ్.

"కట్టెయ్యండి ఆ రేడియోని" విసుగ్గా అంది రేఖ.

"వెధవ గోల. ఎప్పుడు చూసినా ఆన్ చేసి ఉంటుంది. అసలు చదువుకోవటమే కుదరట్లేదు" కోపంగా అన్నాడు కార్తీక్.

" ఆ రేడియో బయట విసిరేస్తే కానీ ఈ గోల విరగడవ్వదు" అన్నాడు వివేక్...

ఇవన్నీ అందరికీ వినిపిస్తున్నాయి.

''మరో గది తీసుకుంటే...'' అనుకున్నాడు కళ్యాణ్.

''అద్దె భరించటం కష్టం అంది అరుణ. ఈ గొడవకి ఆమె నిద్ర పారిపోయింది.

''తిరిగి ఆ ఊరే వెళ్ళిపోతే?'' అనుకుంది లక్ష్మి.

''కానీ అక్కడేం ఉంది? ఎలా బ్రతుకుతారు? ఇప్పుడేం తక్కువయిందని. చిన్న ఇల్లు. మనుషులు ఎక్కువ. యంత్రాల రొదలో నిశ్శబ్దమే కరువైపోయిన జీవితంతో కావాలని తెచ్చుకున్న మరో ధ్వని రేడియో. అది లేకపోతే కాస్త నిశ్శబ్దం'' తిరిగి ఆమె అనుకుంది.

''రేడియో కట్టెయ్యండి. పిల్లలు చదువుకుంటున్నారు'' అంది లక్ష్మి

సత్యానికి రేఖ రేడియో కట్టేయమన్నప్పుడే కోపం వచ్చింది. లక్ష్మి కట్టేయమనగానే కోపం గుండెల్లో బాధగా ఘనీభవించింది. అసహాయంగా రేడియో కట్టి మంచంపై నడుం వాల్చాడు. ఇలా ఒకటి.. రెండు.. మూడు.. నాలుగురోజులు కాదు. చాలా రోజులు గడిచాయ్. రేడియో పెట్టిన ప్రతిసారీ అనుభవిస్తున్నదే బాధ. అయినా ప్రతిసారి చాలా దుర్భరంగా తోస్తుంది. గుండెని నిప్పుల్లో పెట్టినట్టు శరీరమంతా బాధతో కణకణ మండిపోతుంటుంది. కానీ మాట అధరాలపై రాదు.

ఆ రేడియోలో సత్యం పొందే ఆనందం, తృప్తి ఏమిటో ఆ ఇంట్లో సభ్యులకు అర్థంకాదు. చాలా విషయాలు అనుభవం వలన అవగతమవుతాయి.

లక్ష్మికి రేడియోతో అతడి అనుబంధం ఏమిటో కాస్త తెలిసినా మిగిలిన వారికి వివరించే జ్ఞానం, ధైర్యం లేవు. తనవాళ్ళందరి మధ్య నిశ్చింతగా బ్రతికే మహద్భాగ్యాన్ని రేడియో గురించి వదులుకోవాలని ఆమెకి లేదు. అందుకే భర్త రేడియో పెట్టిన ప్రతిసారీ కట్టేయమంటుంది.

సత్యం కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయ్. అతని బాధతో ఎవరికి సంబంధం? రేడియోకి, అతని హృదయానికి ఉన్న అనుబంధం ఎంత అపురూపమైనదైనా ఎవరికి కావలి? తన కోపాన్ని, బాధని ఎవరిపై చూపించగలడు? రోజూ అనుభవించే బాధే కానీ ఎప్పటికప్పుడు కొత్తగా అదే తొలిబాధ అన్నట్టు అతడి హృదయంపై విషాదం దట్టంగా కదులుతుంది. చూపు కరువైన బ్రతుక్కి కాస్త తోడు, ఓదార్పు ధ్వని - రేడియోనుంచీ వెలువడే ఆ సంగీత స్వరాన్ని వినలేని వ్యధ ఏ హృదయానికి అర్థం అవుతుంది?

సత్యం చేతులు అప్రయత్నంగా రేడియోని ఆన్ చేశాయి.

''రేడియో కట్టెయ్యండి. వాళ్ళు ఏమైనా అంటారు. అర్థం చేసుకోరేం?'' విసుగ్గా అంది లక్ష్మి.

రేడియోతో అనుబంధాన్ని అర్థం చేసుకోని భార్యపై కోపం వచ్చింది సత్యానికి. ఏం చెయ్యగలడు? అనుబంధం కలిగించిన బాధ ఎవరిపై చూపించగలడు? చూపిస్తే ఎవరూరుకుంటారు. ఆ అనుబంధం తప్పా?

ఎన్నో సంవత్సరాలు అపురూపంగా ఏ వస్తువైతే స్పృశించాయో ఆ చేతులే నిస్సహాయంగా ఆ వస్తువుని నేలకేసి కొట్టాయి. ఛిన్నాభిన్నమైన రేడియోని చూసి అంతా ''అరే'' అంటూ సానుభూతి ప్రకటించారు. సత్యం హృదయ శకలాలని ఎవరు చూస్తారు? ఎవరు చూడగలరు? ఆ రేడియో తప్ప!

కవిత, కథ, నవల, వ్యాసం..చేపట్టిన ప్రతి సాహితీ ప్రక్రియలోనూ తనదైన సొంత బాణీని సృష్టించుకున్న ప్రముఖ స్త్రీవాద రచయిత్రి కుప్పిలి పద్మగారు దాదాపు ఇరవయ్యేళ్ళ క్రిందట రాసిన కథ ఇది.

శివరంజని

- వేదుల మీనాక్షీ దేవి

(రచనా కాలం -1962)

శివరంజని అంటే మాష్టారికి ఎంతో ఇష్టం. శిష్యురాలు చక్కగా వాయిస్తుందని ఆయనకు తెలుసు. ఎక్కడైనా కచేరీ చేస్తే ఎగిరిరానా అనీ అన్నారు. మరి ఇప్పుడు రమ శివరంజని వాయిస్తూంది. కచేరి అభాసుకావడం మాట అటుంచి మాస్టారి మాట ఏమౌతుందో ఎలా చెప్పడం?

'టింగ్' మన్న ధ్వని విని కళ్ళు తెరిచారు. శంకరం మాష్టారు. ఎదుట చాప మీద ఒడ్డిగలబెట్టి ఉంది ఫిడేలు. చుట్టూ పువ్వులున్నాయి. దగ్గరలోనే కర్పూరహారతి వెలుగుతూంది. ఆ వేడికి నాలుగు తీగలూ ఒక్కమారె తెగిపోయాయి.

రమకు తొమ్మిదవ ఏడు. బాసినపట్టు వేసుకుని దణ్ణం పెడుతున్నదల్లా తీగలు తెగిన చప్పుడు విని గడగడలాడింది.

అక్కడున్నవారి గుండెలు జారిపోయాయి.

సంగీతం ప్రారంభించేది ఆనాడే ఇదేం అపశకునం అనుకుంటున్నారు ఇంట్లో వాళ్ళు.

శంకరం మేష్టారు రమ చేత విఘ్నేశ్వర పూజ చేయించారు. తరువాత ఫిడేలు మీద పువ్వులు వేయించారు. కొబ్బరికాయ కొట్టించి నివేదన చేయించారు. హారతి వెలిగించారు.

విఘ్నేశ్వర ప్రార్థన, సరస్వతీ ప్రార్థన ప్రారంభించారు మేష్టారు. కళ్ళు మూసుకుని మైమరచి పాడుతున్నారు. చెంపలమీదుగా బాష్పాలు జారసాగాయి.

శ్రుతి చేసిన తీగలు తెగినప్పుడు చేసిన సంగీతం ధ్వని విని కళ్ళు తెరిచారు మాష్టారు.

తీగలు తెగిన ఫిడేలు, వెలుగుతున్న హారతిని, వణుకుతున్న రమని చూశారు.

"జయం" అన్నారు మేష్టారు.

"లే తల్లీ. అందరికీ దణ్ణం పెట్టు" అన్నారు రమ వీపు ఆప్యాయంగా నిమురుతూ.

ఆయన సజల నయనాలు ఆనందంతో మెరిశాయి.

"ఇదేమిటండీ జయం అంటారు? అడుగులోనే పిడుగు అన్నట్లు పాఠం ప్రారంభంలోనే తీగెలు తెగిపోవడమా! ఇది అపశకునం" అంది రమ అమ్మమ్మ.

"ఎంత మాట అన్నారు! సరస్వతీ ప్రార్థనకు ఆ విధంగా ఎవ్వరికోగానీ జరగదు. ఆ వాణి అమ్మాయికి ప్రసన్నురాలయింది. మన అమ్మాయి ఈ విద్యలో మంచి ప్రావీణ్యం సంపాదిస్తుంది" అన్నారు మేష్టారు.

అందరూ ఆశ్చర్యంగా విన్నారా విషయం.

రమ చేత ముందుగా మేష్టారికి నమస్కారం చేయించింది తల్లి.

రమ నాలుగేళ్ళ పిల్లప్పట్నుంచీ సంగీతం అంటే మహా ఇష్టం. ఎక్కడ ఏ పాట విన్నా సరే ఇట్టే పట్టుకుని ఇంటికి వచ్చి పాడేస్తూండేది.

వాళ్ళు కాపరం ఉండే ప్రక్కవాటాలో మరొక కుటుంబం ఉండేది. వారికొక అమ్మాయి ఉంది. ఆ అమ్మాయికి సంగీతం చెప్పిస్తున్నారు. గాత్రం చెప్పుకుంటుంది. ఆ అమ్మాయిని 'అక్కా' అని పిలుస్తుంది రమ. సంగీతం మేష్టారు పాఠం చెప్పినంత సేపూ అక్క ప్రక్కనే కూర్చుని వింటూండేది రమ.

నేల మీద మునివేళ్ళతో కొడుతూ కళ్యాణి కృతి, దర్బారు వర్ణం పాడేది. "నేను మేష్టార్నిట" అంటూ బొంగురు గొంతుకతో పాడేది. అక్క లాగ సన్నగొంతుకతో పాఠం చెప్పుకుంటున్నట్లు పాడేది.

ఆరేళ్ళు వచ్చేరికి రమకు సరళీ స్వరాలు, జంట స్వరాలు, అలంకారాలు, పిళ్ళారి గీతాలు, స్వరజతులు, నాలుగైదు వర్ణాలు వచ్చాయి. తాళం రాకపోయినా కట్టుగా పాడేది.

రమ ఉండే ఇంటికి రెండు ఇళ్ళు అవతల సరస్వతి అనే అమ్మాయి ఫిడేలు బాగా వాయిస్తుంది. ఇంకా ప్రైవేటు చెప్పించుకుంటూంది.

ఆ అమ్మాయి నేర్చుకుంటున్నా, సాధన చేసుకుంటున్నా రమ అక్కడ ఉందన్నమాటే.

"రమా" అని తల్లి పిలుస్తుంది.

"అదిగో వాళ్ళ సరస్వతి ఫిడేలు వాయింపు వినబడ్డంలేదూ? ఇంకా రమను పిలుస్తావేమిటి?" అని ఇంట్లో వాళ్ళు వేళాకోళం చేసేవారామెను.

"అక్క మేష్టారి చేత నీకూ సంగీతం చెప్పించనా" అని అడిగారు రమను వాళ్ళ నాన్నగారు.

"నాకు సరస్వతి మేష్టారే చెప్పాలి. అక్కలా ఊట్టినే చెప్పుకోను. నాకు ఫిడేలు కొను" అంది.

"హోసి భడవా" అని నవ్వుకున్నారంతా.

ఆ సాయంత్రం సరస్వతికి చెప్పే మేష్టారికి కబురంపారు. రమకు సంగీతం చెప్పమన్నారు రమ నాన్నగారు.

"మీరు అడగకుండానే చెబుదామనుకుంటున్నానండీ. అమ్మాయి ఆసక్తి చూస్తున్నాను. విద్యయందు ఆసక్తి ఉన్నవాళ్ళకు చెప్పకపోతే మహాపాపం. ఆ విద్యాధి దేవతకే అపచారం చెయ్యడం అన్నమాట. నాకు సొమ్ముతో పనిలేదు. తీరుబడి లేకపోయినా ఎలాగో వీలు చూసుకుని వస్తాను" అన్నారు శంకరం మాష్టారు.

కాలు తెగిన తీగలు తీసేశారు. కొత్త తీగలు కట్టారు శంకరం మేష్టారు.

కొత్త బైండు పుస్తకాన్ని తెరిచి మొదటి పేజీకి పసుపు వ్రాశారు కొద్దిగా.

"అవిఘ్నమస్తు" అని వ్రాశారు.

మొదటి సరళీ స్వరం చెప్పారు.

"రేపు అప్పజెప్పు" అన్నారు.

"రేపెందుకండీ? ఇప్పుడే అప్పచెప్పేస్తా" అంటూ తాళంతో కూడా కట్టుగా వచ్చేశాయి.

త్యాగరాజస్వామి ఉత్సవాలలో అందరి శిష్యులతోపాటు రమచేత కూడా పాడించారు మేష్టారు. ఆయన శిష్యులందరిలోనూ రమే చిన్నది.

ఒక గీతం, స్వరజతి వాయించింది. కళ్యాణి వర్ణం గాత్రాన్ని పాడింది. తానం మాత్రం రాదు. చిన్నప్పుడు విన్నది.

"ఇంత చిన్నమ్మాయి ఇంత చక్కగా పాడిందంటే ఆశ్చర్యంగా ఉంది. ఇది చెప్పుకున్నది కాదు. కేవలం వినికిడివల్ల నేర్చుకున్నదట. ఈ అమ్మాయి ముందు ముందుగా గొప్ప పాటకురాలు కావాలని దీవిస్తున్నాను" అన్నారు ప్రత్యేకాహ్వానంపై వచ్చిన ఒక పెద్దాయన.

"మీ ఆశీర్వాద బలం ఉంటే తప్పకుండా అవుతుంది" అన్నారు మేష్టారు.

"బాగా పాడిందండీ అమ్మాయి" అన్నారు మేష్టారు రమ నాన్నగారితో.

"ఇలాంటి శిష్యులుంటేనే గురువుగారికి పేరు, ప్రతిష్ట" అన్నాడు మాష్టారు.

"ఏదో దాని ముఖం" అన్నారు రమ నాన్నగారు. పెద్దవాళ్ళు చిన్నవాళ్ళను పొగడకూడదని ఆయన అభిప్రాయం.

"మీరు ప్రారంభించిన వేళావిశేషం" అంది రమ తల్లి.

ఆమె ఆ మాట వినగానే సరస్వతీ ప్రార్ధన, వెలుగు తున్న హారతి, తీగలు తెగిన ఫిడేలు కళ్ళకు కట్టినట్లయింది అందరికీ.

మూడు త్యాగరాజ ఉత్సవాలయ్యాయి. అది నాలుగవ సంవత్సరం. రమకు పన్నెండేళ్ళు. రాగాలాపన, స్వరకల్పన చేతయింది.

ఆ సంవత్సరం రమకు, మరొక నలుగురైదుగురికి గంట ప్రోగ్రాం ఇచ్చారు, అంతా బాగానే వాయించారు.

ఆ సభకు పెద్దలెందరో సభ్యులుగా వచ్చారు. సభ పూర్తయింది.

ముగింపు వాక్యాలు చెబుతూ, "ఈనాడు జరిగిన పోటీలో రమాదేవికి మొదటి బహుమతి ఇస్తున్నాం" అని కార్యదర్శి ప్రకటించారు.

రమ తెల్లబోయింది.

"పోటీ అంటే భయపడి వాయించలేవు సరిగ్గా నిజం చెప్పు. ఇప్పుడు వాయించినంత స్వేచ్ఛగా వాయించగలవా" అన్నారు మేష్టారు.

❀❀❀❀

రమ హైస్కూలు క్లాసులోకి వచ్చింది.

మేష్టారు రమను సంగీతం పరీక్షకు కట్టించారు.

స్కూలు పాఠశాలతోనూ, ఇంటికి ఇచ్చిన పనితోనూ సతమవుతూంది రమ. సంగీత సాధనానికి సావకాశం అవడంలేదు.

"శాస్త్రం అప్పచెప్ప"మనేవారు మేష్టారు.

"చదవటానికి తీరికలే"దంటుంది రమ.

"తీరిక లేకపోవడమేమిటి! నీ స్నేహితురాళ్ళతో మాట్లాడినంతసేపు పట్టదు" అని వేళాకోళం చేసేవారు మేష్టారు. అన్నారే కానీ ఆయనకీ తెలుసు కష్టమని.

అందుచేత శాస్త్రంలోని అంశాలు విడమరచి అర్థమయ్యేలాగా చెప్పేవారు. వెంటనే అప్పగించేసేది.

ఆ విధంగా శాస్త్రం, సంగీతం అతి శ్రద్ధగా, కుతూహలం కలిగేలాగ చెప్పేవారు మేష్టారు.

పాటకచేరీలకు తీసుకువెళ్ళి వినిపించేవారు. మెలుకువలు, బాగోగులు చెప్పేవారు.

సంగీతం లోయరు పరీక్ష ప్రధమ శ్రేణిలో ప్యాసైంది రమ!

మేష్టారి ఆనందానికి అవధిలేదు!

హయ్యరు కోర్సు ప్రారంభించారు మేష్టారు.

రకరకాల రాగాలు, తానం, స్వరకల్పన, పల్లవులు చెప్పారు.

నెలసరి కచేరీలలో రమకు తరచు అవకాశం లభిస్తుండేది. క్రమంగా రమ సంగీతం శ్రోతల మన్ననలకు పాత్రమైంది.

"ఇక ఆరు మాసాలు నేర్చుకుంటే చాలు. ట్యూషన్ అవసరం లేదు" అన్నారు మేష్టారు.

రమ సంగీతానికి అంతరాయం కలిగే పరిస్థితులేర్పడ్డాయి ఇంట్లో.

రమకు ఇద్దరు అన్నలు, ఇద్దరు తమ్ముళ్ళు ఉన్నారు. అన్నలిద్దరినీ ఆ సంవత్సరం పై ఊరు పెద్ద చదువుకు పంపాలి. సొమ్ము ఎత్తి పంపడం కష్టం.

కాపురం మారుస్తే తీరిపోతుంది. పెద్దపిల్లలకూ ఇబ్బంది ఉండదు భోజనానికి. రమకు, తమ్ముళ్ళకు హైస్కూలు ఆ ఊళ్ళోనూ ఉంది. ఆఖరి పిల్లవాడి చదువు అయ్యేదాకా అక్కడే ఉండిపోవచ్చు.

ఇలా ఆలోచించి కాపురం మార్చడానికే నిర్ణయించారు రమ నాన్నగారు.

రమకు చాలా నిరుత్సాహం కలిగింది.

ఈ సంగతి మేస్టారు విని నిర్ఘాంతపోయారు.

"నాకు పేరు తెచ్చే శిష్యురాలు దొరికిందని ఆనందించాను. ఇప్పుడు ఎక్కడపడితే అక్కడ కచేరీ చెయ్యగల సమర్థత వచ్చింది. ఇక కొంచెం మాత్రం చెప్పవలసి ఉంది" అన్నారు మేష్టారు.

రమకు ఏమీ తోచడం లేదు.

ఈ విద్య అంతు తెలుసుకోవాలని ఆమె కోరిక.

వెళ్ళే ఊళ్ళో తగిన మేష్టార్లున్నారో? లేరో? ఒకవేళ ఉన్నా శంకరం మేష్టారులాగ చెప్పడం వారి తరం కాదు.

ఇంతవరకు తాను నేర్చిన విద్య వృధాయేనా? కొన్నాళ్ళయ్యేటప్పటికి తను సంగీతం క్రమంగా మరచిపోవడానికి అవకాశం లేకపోలేదు.

ఇలా తలుచుకుంటే ఎంతో బెంగగా ఉంది.

"అమ్మాయీ, అనగనగరాగమతిశయిల్లుచునుండు అన్నారు వేమనయోగి. సంగీతానికి సాధనే ముఖ్యం. ఎంత తీరుబడిలేకపోయినా రోజుకు రెండు గంటలు ఖచ్చితంగా సాధకం చేసి తీరాలని అనుకుంటే వాయించగలవు" అంటూ ఏడుస్తున్న రమకు ధైర్యం చెప్పారు మేష్టారు రైలు కిటికీ దగ్గర.

"ఆ ఊళ్ళో నేనెరుగున్న ఒక పాటకుడున్నారు. ఆయనకు ఉత్తరం వ్రాస్తాను. అమ్మాయికి అక్కడ కూడా శ్రద్ధగా చెప్పించండి" అని మరీ మరీ రమ నాన్నగారితో చెప్పారు.

మేష్టారికి నమస్కారం చేసింది కదులుతున్న రైల్లోనుంచి రమ.

మేష్టారు కండువాతో కళ్ళు అద్దుకున్నారు.

రమకు ఊరు కొత్త. ఇల్లు కొత్త. స్కూలు కొత్త.

మెల్లిగా అలవాటవుతున్నాయి.

అనుకున్న ప్రకారం రోజూ రెండుగంటలు ఖచ్చితంగా సాధన చేసేది రమ. కొన్నాళ్ళయేసరికి వాయించిందే వాయించడం, అవే రాగాలు, అవే వర్ణాలు - వాయించి, వాయించి విసిగిపోయింది.

ఇంతకన్నా ప్రాప్తం లేదు కాబోలు అని నిరాశ చెందింది.

ఇక ఇది పని కాదనుకుంది.

కొత్త కొత్త రాగాలు తీసుకుని వాటి ఆరోహణ, అవరోహణ క్రమం, స్వరస్థానాలు తెలుసుకుని మెల్లి, మెల్లిగా ఆలాపన చేసేది. ఆ రాగాలు రేడియోలో పాడుతుంటే కూడా వాయించేది.

అదే తన విద్యాభివృద్ధికి ఆధారం. ఏకలవ్యుడులాగ గురువుగారి గురివుంచి విద్య సాధించాలి. తానీ విద్య మరచిపోకూడదు - అని పట్టుదల వహించింది.

ఇల్లు వెతుక్కుంటూ వచ్చారు కొత్త సంగీతం మేష్టారు. శంకరం మేష్టారు ఉత్తరం వ్రాశారట ఆయనకు.

రమ నాన్నగారు ఆయన్ను పాఠం చెప్పడానికి ఏర్పాటు చేశారు.

రమను వాయించమన్నారు. మేష్టారూ వాయించారు.

ఇద్దరూ ఒక కీర్తనే వాయించినా ఎక్కడా పోలిక లేదు.

కొత్త మేష్టారు ఆ రోజు పాఠం చెప్పి వెళ్ళిపోయారు.

ఆ మధ్యాహ్నం రమ ఇంటికి వాళ్ళ బంధువు ఒకాయన వచ్చారు. ఏదో మాట వరసగా కొత్త మేష్టారి మాట వచ్చి "ఈయన కూడా చాలా సమర్థులు. అయితే చిన్నప్పటినుంచీ శంకరం మేష్టారి దగ్గరే నేర్చుకోవడం వల్ల మరొకరు ఎలా చెబుతారో తెలియదు. అమ్మాయికి ఈయన పద్ధతి కొత్తగా ఉంది" అంది రమ తల్లి.

"అన్నట్లు చెప్పడం మరచిపోయాను. శంకరం మేష్టారు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయారట. వాళ్ళ పిల్లలు చెప్పారు" అన్నాడు వచ్చిన బంధువు.

"అయ్యో! అదేమిటి! ఎందుకు వెళ్ళిపోయారో!" అంది ఆవిడ.

అక్కడే చాప మీద కూర్చుని రాసుకుంటుంది రమ. ఈ మాటలు విని వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించింది.

"ఎప్పుడైనా ఆ ఊరు వెడితే మేష్టారి దగ్గర పాఠం చెప్పుకోవచ్చునని ఇంకా ఆశపడ్డాను" అని వాపోయింది.

"మీరు వెళ్ళేముందు కూడా జ్ఞాపకం ఉంచుకుని ఈ ఊళ్ళో నాకు విద్యకేర్పాటు చేశారా! ఎందుకు నామీద ఇంత వాత్సల్యం మేష్టారూ?" అని విలపించింది రమ.

రెండవరోజు పాఠానికి వచ్చారు మేష్టారు.

పాఠం అంటే బెంగగా ఉంది రమకు.

అంతా అగమ్యగోచరంగా ఉంది.

"ఏయే రాగాలు చెప్పారమ్మా శంకరం మేష్టారు?" అన్నారు కొత్త మేష్టారు?".

తన బైండు పుస్తకం ఇచ్చింది. మొదటి నుండీ చివరిదాకా పేజీలు తిరగవేశాడు. ఆఖరి పేజీలో రమ నేర్చుకున్న రాగాలన్నీ వరుసలో ఉన్నాయి వ్రాసి.

ఆ వరుసలోని ఆఖరి రాగం శివరంజని.

అదే తను శంకరం మేష్టారి దగ్గర నేర్చుకున్న కడసారి రాగం.

'శివరంజని' అని మెల్లిగా నోట్లో గొణుక్కుంది రమ.

రమ శూన్యంలోకి చూస్తుంది. ఏవో ఆలోచనలు... గతంలోనికి....

తెల్లవారితే ఆ ఊరి నుండీ వెడతారనగా వీధిగదిలో ఒక్కర్తే కూర్చుని శివరంజని రాగం వాయిస్తుంది రమ. మేష్టారి దగ్గర వాయించేటప్పుడు తప్పు వాయిస్తుందేమోనన్న భయంతో సిగ్గుతోనూ, స్వేచ్ఛగా వాయించలేదు. ఒక్కర్తే ఉన్నప్పుడు తన ఇష్టం వచ్చినట్లు వాయించేస్తుంది.

ఆ రోజున కూడా పాఠం చెబుదామని వచ్చారు శంకరం మేష్టారు. ఆ సంగతి రమకు తెలియదు.

రమ తలవంచుకుని శివరంజని వాయిస్తుంది. రమ దృష్టి రాగంమీద లేదు.

తను కొత్త ఊరు వెడితే ఇంత చక్కని రాగాలెవరు చెబుతారు తనకు? ఎవరు చెప్పగలరు?

ఇక సంగీతానికి ఫుల్‌స్టాపే.

ఇంతవరకూ వచ్చిన విద్యకిక భవిష్యత్తే లేదా?

మనస్సు ఆలోచనామగ్నమైనా రాగం మాత్రం స్వరస్థానాలు తప్పడం లేదు. ఎంతో హృదయంగమంగా ఉంది వాయింపు.

ఆలాపన ముగియగానే మేష్టారు చిన్నగా దగ్గారు.

వెనక్కు తిరిగి చూసింది రమ.

మేష్టారు!!

ఎంతసేపటినుండి వింటున్నారో?

ఖంగారుగా లేచి నిలబడింది.

"చాలా బాగా వాయించావమ్మా. రేడియోలో ఎవరో వాయిస్తున్నారనుకున్నాను. నువ్వనుకోనే లేదు సుమా! అమ్మదొంగా! నా దగ్గర ఎప్పుడూ ఇలా వాయించలేదేం?" అన్నారు శంకరం మేష్టారు.

"మేష్టారూ, మీకు శివరంజని అంటే ఎంత ఇష్టమో నాకు తెలుసు. ప్రతి ప్రోగ్రాంలో ఆ రాగం వాయించి మిమ్మల్ని స్మరించుకుంటాను. ఆ రాగం మీకు నా ఆహ్వానం" అంది రమ కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"రేడియోలో వాయించితే ఇంట్లో కూర్చుని వింటాను. ఎక్కడైనా కచేరీ చేస్తే ఎగిరి రానూ నా చిట్టి తల్లి కచేరీకి!" అన్నారు మేష్టారు.

ఆ రోజు కూడా పాఠం చెప్పాడు. శాస్త్రానికి సంబంధించిన ముఖ్యవిషయాలెన్నో చెప్పారు...

❀❀❀

మరి ఇప్పుడా మేష్టారెక్కడ?

ఎక్కడికి వెళ్ళారో? ఫిడేలు తీసుకెళ్ళారట!

పాపం. ఇంటి దగ్గర భార్య, బిడ్డలు బెంగ పెట్టుకుని ఉంటారు ఆయనకోసం.

శివరంజని వాయిస్తే వస్తానని మాట ఇచ్చారు.

ఇప్పుడు తను వాయించినా ఎలా వస్తారు? రారు.

"ఏ కొండల్లోకైనా వెళ్ళి హాయిగా పాడుకుంటూ జీవితం గడపాలని ఉంది. నేను ఎక్కడికైనా వెళ్ళిపోయానని వింటే నా శిష్యులను మోసం చేసి పోయాననుకోకండేం" అనేవారు అప్పుడప్పుడు.

"అదేమిటండీ!" అంటే "ఏమీ లేదు. ఊరికినే అలా తోచింది" అనే వారు మాష్టారు.

ఇందుకే అని ఉంటారు. ఆయన మనస్సులో ఏమి తుఫానులో! రమ ఆలోచనలతో కరిగిపోయింది.

"ఏదీ, శివరంజని వాయించమ్మా" అన్నారు కొత్త మేష్టారు.

రమ చిన్నమనస్సుకు శివరంజని కరుణామయమై పోయింది. తను శివరంజని పాడితే అది మేష్టారికాహ్వానం.

వయోలిన్ మీద ఆలపించింది శివరంజని రాగం.

అన్ని అవధులూ దాటి, శిఖరాలనధిగమించి, శివరంజని రాగం ఆరోహణలో జాలిగా, బాధగా, తన వాళ్ళందరినీ వదిలిపెట్టి, అర్ధరాత్రి లేచి అంధకారంలోకి పయనిస్తున్న బుద్ధుడులా ఫిడేలు చేత్తో పట్టుకుని హిమాలయాలవైపు తలవంచుకుని నడిచిపోతున్న తన మేష్టారులాగ అనిపించి, వినిపించి రమ మనస్సు దడదడలాడిపోయింది.

"రండి మేష్టారూ రండి. ఎన్నిసార్లు వాయించాను ఈ శివరంజని? మీకు ఎప్పటికి వినబడేను? నాకు సంగీతంలో తల్లీ తండ్రీ అయిన మీరు ఎక్కడో తిరగాడుతుంటే నేనేమయిపోతాను? నా ఆహ్వానం వినిపించుకోండి మేష్టారు... తిరిగి రండి" రమ మనస్సు పరిపరివిధాల బాధపడిందానాడు.

"ఎవరికో రైల్లో కనబడ్డారంట" అన్నారొకరు.

"తంజావూరు సంగీత పండితులకు ప్రసిద్ధి. ఇంకా ఏమైనా నేర్చుకుందామని ఉంది కాబోలు. అక్కడ ఒక మహా పండితుని ఆశ్రయించి శుశ్రూష చేస్తున్నారని విన్నాను. 'గురుశుశ్రూష యా విద్యా' అన్నారు కదండీ " అన్నారు ఆ ఊళ్ళోని పురాణం శాస్త్రులుగారు.

అక్కడ వారికి కనబడ్డారనీ, ఇక్కడ వీరికి కనబడ్డారనీ చెప్పడమే కానీ స్వయంగా ఆయన్ను చూసినవాళ్ళు ఒక్కరూ లేరు.

ఆయన గురించి వాళ్ళ వాళ్ళు పేపర్లో వేయించారు. రేడియోలో ప్రకటన చేయించారు.

ఏమీ ప్రయోజనం కనిపించలేదు.

రమ శివరంజని వాయించడం పూర్తిగా మానేసింది. వాయించడం అనే ఆలోచన వచ్చేసరికే మేష్టారు చేసిన వాగ్దానం జ్ఞాపకం వచ్చి కన్నీళ్ళు వచ్చేవి.

"ఎంతో బాగా చెప్పేవారు శంకరం మేష్టారు. చిన్నపిల్లకు అన్నం కలిపి తినిపించినట్లేకదా! ఎంతో బుజ్జగించి చెప్పేవారు" అంటుంది రమ అమ్మగారు.

"మర్మం లేకుండా విద్య చెప్పారు. అమ్మాయి సంగీతాన్ని ఎవ్వరూ తప్పు పట్టలేదు" అంటారు నాన్నగారు.

సంగీతం ప్రారంభించిన కొత్తలో వేళ్ళు సరియైన స్థానంలో పడేవి కావు. అపస్వరం వచ్చేవి. అప్పుడు వేలు పట్టుకుని వాయించేవారు మేష్టారు.

ఒకమారు త్రిస్థాయి సాధన చేయిస్తున్నారు.

పావుగంట అయేసరికి రమకు చేతులు లాగాయి. కాళ్ళు తిమ్మిరెక్కాయి.

"ఇక వాయించలేను" అంది రమ.

"ఎందుకు వాయించలేవు? ఒక గంటవరకు కమాను ఆపినా, కాలు కదిపినా జాగ్రత్త" అన్నారు మేష్టారు.

అంతే! గంటా వాయించేసింది.

అలాగ నయానా, భయానా చెప్పేవారు.

ఆ విషయాలు చెబుతూంటుంది రమ.

ఈ విధంగా తరచూ మేష్టారిని గురించి వాళ్ళ ఇంట్లో చెప్పుకోవడం పరిపాటైపోయింది

రమ సంగీత నైపుణ్యాన్ని చూస్తున్న కొత్త మేష్టారు సాటి పాటకులతో చెప్పారు.

ఆ ఊళ్ళో అప్పుడప్పుడు జరిగే కచేరీలకు రమ వెడుతుండేది.

ఆమెను కూడా ఒక ;రోగ్రాం ఇమ్మని కోరారు పాటకులంతా.

రమ నాన్నగారు అంగీకరించారు.

ప్రోగ్రాం పేపరు అచ్చువేయించి పంచి పెట్టారు.

రమకు సాయంగా తల్లీ, తండ్రీ వచ్చారు సభకు.

వేదిక మీద అడుగుపెట్టేటప్పుడు తన పూర్వపు గురువుగారిని తలచుకుని నమస్కారం చేసింది మనస్సులో.

చిన్నప్పటినుండీ నలుగురిలోనూ పాడడం అలవాటు చేశారు శంకరం మేష్టారు. అందుచేత ఆ అమ్మాయికి సభాకంపం అంటే ఏమిటో తెలియదు.

హంసధ్వనిలో "వాతాపి గణపతి" ప్రార్థనతో కచేరీ ప్రారంభించింది. క్రమ ప్రకారం వాయించింది.

రాగం, తానం, పల్లవి అయింది.

కచేరీ పూర్తికావచ్చింది.

ఇక తిల్లానా వాయించాలి. అదే ఆఖరిపాట. ప్రోగ్రాంలో అచ్చువేశారావిధంగా.

అయితే ఆమె వాయిస్తున్నది తిల్లానా కాదు!

శివరంజని!!

ఎందుకు వాయిస్తుందో ఆమెకే తెలియదు. ఆ రాగం మానేసి చాలారోజులైంది.

"ఇదేమిటి? ఇది ప్రారంభించింది? అంతా బాగానే ఉందనుకుంటుంటే చివరికి పాడు చెయ్యరు కదా" అనుకుంటూ కంగారు పడుతున్నారు తల్లీ, తండ్రీ.

ఆమె కిదేమీ తెలియదు. ఆవేశంగా వాయించేస్తుంది. బాగా సాధనలో ఉన్నట్టే ఉంది అందరి కళ్ళూ చెమ్మగిల్లుతున్నాయి.

శివరంజని జాలి రాగం అంటారు. ఆ రాగం వింటూంటే హృదయం ద్రవించిపోతున్నట్లనుభూతి కలుగుతుంది.

ఆరోజుల్లా మబ్బుగా ఉంది.

రమ శివరంజని వాయిస్తుంది.

వానజల్లు ప్రారంభమైంది.

బయట లౌడ్ స్పీకరు దగ్గర వింటున్న జనం లోపలకి సర్దుకుంటున్నారు. వారిలో తలమీద కండువా కప్పుకుని ఒకాయన అందరినీ తప్పించుకుంటూ వచ్చి సభా వేదికముందు వరుసలో కూర్చున్నాడు. గడ్డం మాసి ఉంది. బట్టలు ధూళిగా ఉండి చాలా దూరప్రయాణాలు చేసిన లక్షణాలు కానవస్తున్నాయి. ముగ్ధుడై వింటున్న ఆయన్ను కుతూహలంగా చూసి "ఏ ఊరు తమది" అన్నారు పక్కనున్న ఒకరు.

'ఈ ప్రాంతమే. యాత్రలు చేసుకుని వస్తున్నాను. ఇందాకనే ఈ ఊరు వచ్చాను. ప్రోగ్రాం కాగితం చూశాను. నాకు సంగీతం అంటే సరదా. శివరంజని రాగం అంటే అన్ని రాగాలకంటే చాలా ఇష్టం" అన్నాడా వ్యక్తి.

రమ కళ్ళు మూసుకుని వాయిస్తుంది.

చెంపలమీదుగా కన్నీళ్ళు ప్రవహిస్తున్నాయి. నాగస్వరం వింటున్న నాగుపాములాగా తలలూపుతున్నారు సభ్యులు.

ఇవేమీ రమకు తెలియవు.

కొంతసేపటికి రాగం ఆపింది.

ఫిడేలు క్రిందపెట్టి కళ్ళు తెరిచింది.

కళ్ళు తెరిచింది రమ!

తనకు...ఎదుట...

మేష్టారు!!

తేరిపార చూసింది రమ తలమీదుగా అదే రుద్రాక్షంచు కండువా కప్పుకుని మొదటి వరుసలో కూర్చున్నారు.

"నీ శివరంజని విని వచ్చానమ్మా" అన్నారు నవ్వుతూ శంకరం మేష్టారు.

రమ చేతిలోని కమాను తెలియకుండా క్రిందపడిపోయింది.

వర్షంలో వచ్చిన మనిషి

- విజయలక్ష్మి రామకృష్ణన్

(రచనా కాలం -1960)

రాత్రి ఇంకా తొమ్మిది కాలేదు భోంచేసి తలుపులు మూసుకుని గదిమధ్య దీపం ఆర్పి, మంచం దగ్గరగా ఉన్న బల్లమీద లైటు వేసుకుని, పడుకుని, చదువుకోడం మొదలుపెట్టింది కాంచన. హరికేన్ లాంతరు బాగా తగ్గించి గదిమూలగా పెట్టింది. మూడు రోజులుగా నగరంలో గాలివాన కారణంగా కరెంటు 'వచ్చే - పోయే'దిగా ఉంది. ఈదురుగాలి మోత రాక్షసి ఊపిరి చప్పుడలాగ ఉంది. రోడ్డుప్రక్కల ఊరూ పేరూ లేని చెట్లు కూడా గాలికి పడి, వ్రేళ్ళుకూడా బైటపడగానే, ఫోటోలు తీయించుకుని పేపర్లకెక్కాయి. కాంచన మేనత్త వరలక్ష్మి ప్రక్కగదిలో పడుకుంది.... అప్పుడే నిద్రపోయింది కూడాను. చదువుకుంటున్న కాంచన తలుపు చప్పుడు విని పుస్తకం మూసి లేచి కూర్చున్నది, పరీక్షగా విన్నది. తన ఇంటి తలుపే! సందేహం లేదు. "ఇంత వానలో! ఈ వేళకు ఎవరబ్బా" అనుకుంది. తలుపు కాస్త తీసి ఒక రెక్క చేత్తో పట్టుకుని "ఎవరూ?" అన్నది. వానజల్లు లోపలకు వచ్చి క్షణంలో కాంచన, ముఖమూ, పమిటా తడిసిపోయాయి. "వానలో తడుస్తున్నాను. లోపలకు రానిస్తే, ఈ రాత్రి పడుకుని తెల్లవారే వెళ్ళిపోతాను" అన్నాడు తలుపవతలి మనిషి, కాంచన తెల్లబోయింది. "ఏమిటీ సంఘటన? దేవుడిచ్చిన పరీక్ష కాదు కదా," అనుకుంది.

మొండి ధైర్యం ఆవహించిందామెను. తలుపురెక్క వదిలి "చప్పున రండి లోనికి, జల్లుకు ఇల్లు తడుస్తోంది" అని వెనకకు జరిగింది. అపరిచితుడు లోపలకు వచ్చి తలుపు గడియపెట్టాడు. కాంచనకు ఏమి చెయ్యాలో తోచలేదు. ఆ మనిషి బట్టలు నీరుకారుతూ హాల్లో మడుగయ్యింది. కాంచన "అదిగో, ఆ బాత్‌రూంలోకి వెళ్ళి మీ బట్టలుపిండుకొండి ముందు" అన్నది.

మారుమాట్లాడకుండా అతడు స్నానాల గదిలో కెళ్ళాడు. కాంచన గబగబా ఒక గోనెపట్టా తెచ్చి మడుగైనచోట పరచింది. అల్మైరా తెరిచి ఒక తుండుగుడ్డ తీసింది. 'అతనికి కట్టుకోవడానికి ఏం ఇచ్చేది?' అనుకుంది. నవ్వు వచ్చిందామెకు. బాతురూము నుంచి బైటకు వచ్చిన ఆగంతకునితో "చూడండి, ఆ స్టూలుమీద తువాలు పెట్టాను. తలా, ఒళ్ళూ తుడుచుకుని, ఆ తెల్ల దుప్పటి కట్టుకొండి. మీ బట్టలు ఆ పైన తీగమీద ఆరవేసుకోండి తెల్లారికి ఆరిపోతాయి. పాలు తోడు పెట్టేశాము. టీనో, కాఫీనో, చెయ్యడానికి లేదు. హార్లిక్స్ బల్లమీద పెట్టాను. తీసుకోండి" అన్నది కాంచన,

అతడు ఏం వినిపించుకోకుండా ఎదురుగా కనబడిన ప్లేటులో బిస్కట్లు గబగబా తినేసి, హార్లిక్స్ త్రాగాడు. కాంచన ఆశ్చర్యంగా అతన్ని చూస్తూ నిలబడింది. అతడు నిలుచున్న వైనం, అతడు తింటున్న తీరూ చూసి ఏదో గుర్తుకువచ్చి చకితురాలైంది.

"నిజమేనా! ఏమిటీ వింత! కావాలని రాలేదుకదా!" అనుకుంది. హార్లిక్స్ ముగించాక అతనికి తెలివొచ్చింది. గబగబా తువాలు తీసుకుని తల, ఒళ్ళు తుడుచుకున్నాడు. "దుప్పటి ఇచ్చారు దేనికి?" అన్నాడు.

కాంచన "క్షమించాలి. మా ఇంట్లో మగవాళ్ళకు పనికివచ్చే బట్టలేమీ లేవు మరి. తెల్లారేసరికి ఆరిపోతాయిలెండి" అన్నది.

సర్పదష్టుడైనట్లు అతడు ఉలిక్కిపడి "క్షమించాలి నా సాహసానికేమనుకోకండి. పనిమీద ఈఊరు వచ్చాను. వానకు గండ్లు పడి రైళ్ళు ఆగిపోవడంతో మొన్ననే మా ఊరు చేరవలసిన వాణ్ణి ఇక్కడే దిగబడిపోయాను. రాత్రి హోటలు దగ్గర ఎవరో నా జేబు కత్తిరించి, పర్సు కాజేశారు. ప్రొద్దుటి నుండీ కాఫీ కూడా త్రాగలేదు. ఆకలిగా ఉన్నది. ఇంటికి టెలిగ్రాం ఇచ్చి డబ్బు తెప్పించుకోవచ్చు కానీ, వైరివ్వడానికి అప్పిచ్చేవాళ్ళు కూడా ఈ ఊళ్ళో ఎవరూ లేరు నాకు. ఆకలీ - వానలో తడవడం - మొండిధైర్యంగా మీ తలుపు తట్టాను. ఇవాళ మీరిచ్చిన హార్లిక్స్‌కు మించిన విలువైన విందు నేనెరగను మీకు కష్టం కలిగించను. వెళతాను చాలా కృతజ్ఞుణ్ణి."

కాంచన అప్రతిభురాలై వింటున్నది.

అతడు తలుపు తెరిచేసరికి ఆమె ఉలిక్కిపడింది! ఒళ్ళు తెలియలేదామెకు. గబుక్కున ముందుకు దూకి అతని చెయ్యి పట్టుకున్నది. జ్వరంతో కాలిపోతున్నదతని ఒళ్ళు. ఆమెకు ఏడుపు వచ్చింది."ఫరవాలేదు, ఈ రాత్రికి పడుకోండి. దుప్పటి కట్టుకోడానికి నామోషీ పడనక్కరలేదు ఒక్క రాత్రికి. ఈ ఇంట్లో మీరు పడుకుంటే నా సచ్చరిత్రకు కళంకము అంటదు. మా మేనత్త నాకు తోడు ఉన్నది. మీకు సందేహమక్కరలేదు! నా తలుపు తట్టినవాళ్ళను, ఇటువంటి చీకటి రాత్రిలో, ఇంత జడివానలో, త్రిప్పి పంపి సత్కీర్తిని సంపాదించుకోలేను" అన్నది. ఆమె గుప్పిటలోని అతని చెయ్యి వణికింది.

వెంటనే "మీరు, మీరు -" అని మాట పూర్తి చెయ్యలేక తడబడ్డాడు. ఆమె చెయ్యి వదిలి ముఖం ప్రక్కకు తిప్పేసుకుని గదిలోకి వెళ్ళింది. రెండు నిమిషాలపాటు అతడలా నిల్చునిపోయి, తర్వాత దుప్పటి పంచలాగా చుట్టుకుని తడి పంచె, షర్టు వగైరా తీగ మీద ఆరవేసి వచ్చాడు. హాల్లో మడతమంచం మీద దుప్పటి పరచి ఒక ప్రక్క దిండూ, ఇంకో ప్రక్క రగ్గూ అమర్చింది కాంచన. ఆలోచనకు కూడా పనికిరానంత నీరసంగా ఉన్నదతని మనసు. పడుకుని రగ్గు కప్పుకున్నాడు. కాసేపటికి ఏదో చప్పుడు కాగా కళ్ళు తెరిచి చూచాడు. కాంచన లోపలివైపు తాళం వేసి వెళుతున్నది.

"ఏమిటింత అక్కర ఈమెకు నామీద?" అనుకున్నాడు. ధైర్యంగా "కాంచనా!" అన్నాడు. కాంచన బదులాడలేదు. వెనక్కి తిరిగి చూడలేదు. వినబడనట్టే గదిలోకి వెళ్ళి గడియపెట్టుకుంది. అతడు నిట్టూరుస్తూ "కాదు, పొరపడ్డాను. ఎవరో ఈమె! కాంచన అందం చెడిందని విన్నాను. కానీ ఇంతగా చెడిపోయి ఉండదు!" అనుకున్నాడు. తలనిండా ముసుగు పెట్టుకున్నాడు. కాంచన వెళ్ళిపడుకున్నదేగానీ ఆమె కన్ను మూతపడలేదు.

తెల్లవారి ప్రొద్దున మేనకోడలుకు కాఫీ తెచ్చిస్తూ, "రాత్రి ఏవేళకు వచ్చాడు రాంబాబు? నేను చూడలేదు!" అన్నది వరలక్ష్మి. రాంబాబు కాంచనకు పినతల్లి కొడుకు. అడపాదడపా ఆ ఇంటికి వచ్చే చుట్టమతడొక్కడే

" రాంబాబు కాదత్తయ్యా !" అంది వరలక్ష్మి.

కాంచనకు ఎట్లా చెప్పాలో, ఏం చెప్పాలో, ఏం చెప్పాలో తెలిసిందికాదు. పెగల్చుకుని, "ఆయనే సారధిగారు" అంది.

వరలక్ష్మి ఆశ్చర్యపోయి "సారధేమిటి, రాత్రిరావడమేమిటి! సరిగ్గా చెప్పు" అంది. కాంచన, సారధి ఆ ఇంటికి ఎట్లా వచ్చిందీ విశదపరచింది.

వరలక్ష్మి కాసేపయ్యాక "కాంచీ, నిన్ను గుర్తుపట్టాడా?" అడిగింది.

"లేదత్తయ్యా!" అంది కాంచన.

వరలక్ష్మి నిట్టూరుస్తూ, 'రాత్రి చీకట్లో గుర్తు తెలిసివుండదు. సరిగ్గా ఏడేళ్ళయ్యింది మొన్న శ్రావణమాసానికి, సరే, అతను లేస్తే నువ్వు కనపడకు నేనిస్తాలే కాఫీ. రైలు ఛార్జీకి పాతికో పరకో ఇచ్చి పంపిద్దాం" అంది.

కాంచన గుండె బరువెక్కిపోయిందిక ఆమె బదులు చెప్పలేదు.

తొమ్మిదిన్నరకల్లా వంట పూర్తి చేసి మేనకోడల్ని భోజనానికి పిలిచింది వరలక్ష్మి.

కాంచన వంటింట్లోకి వచ్చి, "ఆయనింకా లేవలేదేమిటత్తయ్యా? అంది.

వరలక్ష్మి, "నేనీ వంటగొడవలో ఆ సంగతే మర్చిపోయాను. ఇంకా లేవకపోవడమేమిటి? నే చూస్తాలే! ఏదో ఒహటి! దారినపోయే తద్దినాన్ని ఇంటికి పిలుచుకురావడంలో గొప్పదానివి!" అంది.

కోపంగా, "ఛీ! ఏమిటామాటలత్తయ్యా, నువ్వేం చూడనక్కరలేదులే, నేనే వెళ్ళి లేపుతా!"నంది కాంచన.

వరలక్ష్మికి కాంచన మనసు అర్థమైంది. "సంతోషించాంలే తెలివికి! ముందు భోంచేసి స్కూలుకు వెళ్ళు. నేను వెళ్ళి చూస్తానతని పని! కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకో! అతనికి పెళ్ళాం బిడ్డలూ ఉన్నారు" అంది. కాంచన పీట వాల్చుకుని పళ్ళెం పెట్టుకుంది. వరలక్ష్మి చెంగుతో చేతులు తుడుచుకుంటూ హాల్లోకి వెళ్ళింది. తలనిండా ముసుగుతన్ని పడుకున్న మనిషిని ఎలా లేపాలో తెలియలేదామెకు. అతన్ని పేరుతో పిలవబుద్ధికాలేదామెకు.

"ఇంకా పడుకున్నారా! చాలా పొద్దెక్కింది. పదికాబోతుంది. ఇంక లేస్తారా?" అంది అతనినుద్దేశించి.

అట్లా రెండు మూడుసార్లు అరిచిన తర్వాత సారధి ముఖం మీది రగ్గు తొలగించాడు. అతని ముఖమంతా చెమటతో తడిసిపోయింది. కళ్ళు తెరిచాడు కానీ మూసుకుపోతున్నాయి. వరలక్ష్మికి భయంవేసింది. ఇంట్లోకి వెళ్ళింది. కాంచన పళ్ళెంలో అన్నం పెట్టుకోకుండా మోకాలి మీద తల ఆన్చుకుని కూర్చునుంది. "అతనికి జ్వరంలాగా ఉన్నది. ఏమిటిప్పుడు చెయ్యడం!" అంది.

కాంచనకు రాత్రి అతని చేతి వేడి గుర్తుకువచ్చింది. లేచి హాల్లోకి వెళ్ళింది. వరలక్ష్మికి ఏమీ అనడానికి లేక మెదలకుండా ఉండిపోయింది. కాంచన వెళ్ళి, రగ్గు తొలిగించి, నుదుటిమీద చెయి వేసి చూసింది. నిజంగా జ్వరంతో కాలిపోతుందతని ఒళ్ళు.

"లేచి ముఖం కడుక్కోండి. కాఫీ త్రాగి పడుకుందురుగాని" అంది. అతడు లేచి వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చాడు. వరలక్ష్మి కాఫీ తెచ్చి స్టూలు మీద పెట్టింది. కాఫీ త్రాగి మళ్ళీ పడుకుని రగ్గు ముసుగు పెట్టాడు సారధి.

కాంచన చెప్పులు తొడుక్కుని బయలుదేరింది. "ఎక్కడికే భోంచెయ్యకుండా?" అన్నది వరలక్ష్మి. కాంచన బదులు చెప్పకుండా వెళ్ళిపోయింది. అరగంటకల్లా డాక్టరును వెంటబెట్టుకుని వచ్చింది.

డాక్టరు సారధికి ఇంజెక్షను ఇచ్చి, మందులు వ్రాసిచ్చి వెళ్ళిపోయాడు. వరలక్ష్మికి వళ్ళంతా మంటగా ఉంది. "ఇహ స్కూలుకు వెళ్ళవా ఏం?" అంది.

"హెచ్.యంకు డాక్టరింటినుండీ ఫోన్ చేశాను - ఇవాళ సెలవు కావాలనీ, రేపు వచ్చి లీవులెటర్ ఇస్తాననీ!" అంది. మందులు తేవడానికి మళ్ళీ బైటకు వెళ్ళింది. "భగవంతుడా నీ లీల!" అనుకుంది వరలక్ష్మి.

ఆ రోజంతా కాంచనకు, సారధి తలమీద మంచు పెట్టడంతో, నుదుటిమీద ఉడుకులాం పట్టీలు వేస్తుండడంతో, మూడుగంగంటలకోసారి టెంపరేచర్ చూడ్డంతో, జావ త్రాగించడంతో సరిపోయింది. ఒక్క రాత్రంతా సారధి కలవరిస్తూనే ఉన్నాడు. వరలక్ష్మి అయోమయంగా "వాళ్ళ వాళ్ళకు టెలిగ్రాం ఇచ్చి తీసుకు వెళ్ళమనక ఇదేమి వెట్టిచాకిరీ మనకు? అంది.

కాంచన బదులు చెప్పలేదు. నాల్గోరోజు టెంపరేచరు నార్మల్‌కు దిగింది. సారధి ముఖం కడుక్కోవడానికి లేవబోయి తూలాడు. కాంచన చప్పున పట్టుకుంది. సారధి "అయ్యో!" అన్నాడు బాధగా.

"ఫర్వాలేదు, నన్ను పరాయిదాననుకోకండి" అంది కాంచన.

సారధి సంభ్రమంగా హసించి, ఆమె ముఖాన్ని పరీక్షగా చూస్తూ "మీరు - నీవు - కాంచనవు?" అన్నాడు. సారధికి జ్వరం తగ్గడమే కాంచనకెంతో సంతోషంగా ఉంది. అతడు తనను గుర్తుపట్టడంతో పొంగిపోయింది. "ఔను, నేనే" అంది. సారధి ఏం మాట్లాడలేదు. కాఫీ త్రాగిన కాసేపటికి స్నానాలగదికి వెళ్ళాడు. వేడినీళ్ళు తొలిపి ఉన్నాయి. వంకెకు కొత్తపంచె, రెడీమేడ్ షర్ట్, తువాలు కనిపించాయి. అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఒళ్ళు తుడుచుకుని క్రొత్తబట్టలు వేసుకుని హాల్లోకి వచ్చాడు. కాంచన అతని పక్కమీద దుప్పటి, దిండుగలీబూ మారుస్తున్నది.

సారధి బల్లమీద పేపరుచేత్తో తీసుకుని ప్రక్కనే ఉన్న పడక్కుర్చీలో కూర్చున్నాడు.

పదిన్నరకు కాంచన ఉసిరికాయ పచ్చడి, పొట్లకాయకూర, మిరియాలచారుతో పథ్యపు భోజనం పట్టుకు వచ్చి, అతని ముందుకు బల్ల జరిపి బల్లమీద పెట్టింది. సారధికి నిగ్రహం పోయి కన్నీళ్ళు క్రిందకు జారాయి.

కాంచన హృదయం ద్రవించిపోయింది, "ఏమిటి బెంగపడుతున్నారు? ఇంకో నాలుగురోజుల్లో మీ బలం మీకు తిరిగి వస్తుంది. లేచి తిరుగుతారు. నా మాట వినండి, భోంచెయ్యండి" అన్నది. సారధి యాంత్రికంగా భోజనం ముగించాడు.

తృప్తిగా లోపలకు వెళ్ళి తనుకూడా భోజనం ముగించుకు వచ్చింది. సారధి కళ్ళు మూసుకున్నాడు.

"లెండి లెండి, పథ్యం తిని నిద్రిస్తే, మళ్ళీ జ్వరం వస్తుంది. నాకు మరి సెలవు దొరకదు" అంది కాంచన.

"అబ్బ! చాలా నిద్రవస్తోంది" అన్నాడు సారధి.

"పేకాడదామా పోనీ?" అని లోపలకు వెళ్ళి పేక తీసుకు వచ్చి కలిపి తనే ముక్కలు పంచింది.

ఆ మర్నాడు వరలక్ష్మి రాములవారి గుళ్ళో కోటి అర్చన చివరిరోజు ఉత్సవం చూడ్డానికి వెళ్ళింది. సారధి హఠాత్తుగా "కాంచీ! నువ్వు నన్ను అసలు ఎందుకు వదిలిపెట్టి వచ్చావో చెప్పవూ?" అన్నాడు.

కాంచన దుఃఖం పట్టలేక చేతులతో ముఖం కప్పుకుంది.

"ఏడవ్వద్దు కాంచనా! ఏడేళ్ళనుంచీ ఆలోచిస్తున్నా, నాకు నిజం తెలియనేలేదు. ఇవాళ నువ్వు చెప్పి తీరాలి!" అన్నాడు.

కాంచనకు ఇన్నేళ్ళగా ఒంటరిగా మోసిన ఆలోచనలను పంచుకోవాలనిపించింది.

"నాకూ, మా శేఖరం బావకూ ఆరేళ్ళ వార!" అంది కాంచన కథ మొదలపెడుతూ. సారధి ముఖం నల్లబడిపోయింది. నిర్లిప్తంగా వినసాగాడు. కాంచన కిటికీలోంచి బైట తోటలో పూసిన పూలచెట్లవంక చూస్తూ చెప్పసాగింది. "బావ మెట్రిక్ తప్పినరోజున మామయ్య చావబాదాడు. బావ ఇంట్లోంచి పారిపోయాడు. నాలుగేళ్ళ తర్వాత ఇంటికి వచ్చాడు.

మిలటరీ యూనిఫాంలో బావను చూసి నేను పొంగిపోయాను. నేను మెట్రిక్ పాసయింతర్వాత చదువు మానిపించారు నాన్న. మా పెద్ద మేనత్త - అంటే శేఖరం బావ తల్లి కబురు పంపింది మా నాన్నకు. నన్ను తన కొడుకుకిమ్మని. మిలటరీలో చేరినవాడికి పిల్లనివ్వనన్నాడు నాన్న. నేను ప్రేమ భంగం పొందినట్లు ఏడవలేదు. నేను ఇష్టపడింది బావ చొరవనూ, సాహసాన్ని కానీ, బావను కాదని నాకెప్పుడూ తెలుసు. సరే, నాన్నకు నచ్చిన సంబంధం స్థిరపరచారు. మీతోటి సంసారం హాయిగానే ఉండేది నాకు. మీకు గుర్తుందా - మీ అమ్మగారు తేలు మంత్రం పెట్టేవారు," అంది కాంచన.

సారధి తల్లి పెట్టే తేలు మంత్రానికీ, భార్య వెళ్ళిపోవడానికీ సంబంధం తెలియలేదు. "ఔను, అమ్మ ఇప్పుడు కూడా పెడుతుంది" అన్నాడు.

కాంచన మళ్ళీ అందుకుంటూ, ఒకరోజు అరమైలు దూరం నుంచి మనింటికి ఒక ముసలమ్మ తేలుకుట్టిన మనుమణ్ణి నడిపించుకుంటూ వచ్చింది మంత్రం పెట్టించుకోడానికి. ఆ రోజు అత్తయ్య ఊళ్ళో లేరు. ఆ వృద్ధురాలు దిగాలుపడిపోయి, "అయ్యో! నా

కొడుకు ఉంటే ప్రక్క బస్తీకి తీసుకెళ్ళి డాక్టరుకు చూపించేవాడు. ఇప్పుడేమిటి దారి? " అంటూ వాపోయింది. మీ స్కూటర్ వున్నది ఇంట్లో! మీరా అబ్బాయిని డాక్టరు దగ్గరకు పిలుచుకు వెళ్ళాలని అనుకున్నాను. ఇంతమాత్రం తట్టదా, నేనెందుకు చెప్పాలని నోరు విప్పలేదు నేను. ఆ ముసలమ్మ వెళ్ళింతర్వాత మీరంటే నాకు మొదటిసారిగా అసహ్యం కలిగింది. మీది పిరికితనమో, స్వార్థమో తెలియలేదు. క్రమంగా మర్చిపోయానా సంగతి. ఇంకోరోజు - ఆనాడు అత్తయ్యకూడా ఉన్నారు. సాయంత్రం ఆరింటికి, ఒక పసిబిడ్డ తల్లి బస్సు తప్పిపోయిందని, ఆ ఊళ్ళో బంధువులెవరూ లేరూ లేరని మనింట్లో రాత్రి ఉండి తెల్లారి వెళ్ళిపోతానని వచ్చింది. నాకూ, అత్తయకూ ఆ బాలింతరాలికి ఒక రాత్రి ఆశ్రయమివ్వడంలో ఆక్షేపణ కనపడలేదు. కానీ మీరు 'ఇంకెక్కడైనా చూసుకో' మంటూ తలుపులు మూశారు. నేను కోపంగా ఎందుకట్లా చేశారని అడిగితే మీరు 'ఏ పుట్టలో ఏ పామున్నదో. ఇవాళ దయదలచి పడుకోమంటాం. తెల్లారేసరికి తల్లి మాయమై పిల్ల మిగిలితే ఏంచేస్తా?' అన్నారు. నాకు మీరంటే విపరీతమైన జుగుప్స కలిగింది. 'భగవంతుడా, నా నుదుట నువ్వు వ్రాయగలిగింది ఇదేనా?' అనుకున్నాను. ఆ రెండు సంఘటనలు నాకు తరచు గుర్తుకు వస్తుండేవి. మీరంటేనే నా రక్తం తిరగబడేది. ఆ జుగుప్సను అణుచుకుని మామూలుగా ఉండటానికి ఒక్కోసారి ప్రాణసంకటమయ్యేది నాకు. అటువంటి రోజుల్లోనే ఒకసారి మీరు ఆఫీసు పనిమీద పొరుగూరు వెళ్ళారు. అత్తయ్య యాత్రలకు వెళ్ళారు. పనిమనిషి రంగమ్మ వచ్చి పడుకునేది రాత్రిళ్ళు నాకు తోడు. ఆ సాయంత్రం శేఖరం బావ వచ్చాడు. సెలవలో వచ్చాడట. నా పెళ్ళికి రాలేదు కనుక, వెళ్ళేముందు నన్నూ, మిమ్మల్నీ చూడ్డానికని వచ్చాడు. ఇంట్లో మీరూ అత్తయ్య లేరనేసరికి అప్పుడే వెళ్ళిపోతానని ప్రయాణం కట్టాడు. ఉన్నట్టుండి వాన మొదలయింది. 'ఫరవాలేదు వెళతానన్నాడు'. 'వానలో బస్సు కూడా రాదీ ఊరికి. ఎట్లా వెళ్తావన్నాను.' నేను. పెందలకాడే భోజనాలు చేశాం. పనిమనిషి కోసం ఎదురుచూశాను. ఆ సాయంత్రం కొడుక్కి జ్వరం తగిలిందని రాలేదు రంగమ్మ. బావ ఒకటే బెంగపడిపోయాడు. వాననూ నన్నూ కలిపి తిట్టాడు. నేవెళ్ళి నా గదిలో పడుకున్నాను. తెల్లారేక బావ చెప్పాడు. 'రాత్రంతా నిద్రపట్టలేదనీ, చదువుకుంటూ కూర్చున్నాననీ'. వాన వెలిసింది. కాఫీ త్రాగి మొదటి బస్సుకెళ్ళిపోయాడు బావ. మీరు వచ్చాక సంగతంతా చెప్పాను. 'అతను వెళ్తానన్నా ఎందుకు ఆపావు?' అన్నారు. అంతటితో ఆగక, 'ఇంకెవరికైనా తెలుసా?' అన్నారు. ఒళ్ళు మండిపోయింది నాకు. అన్నాళ్ళు నాతో కలిసిఉండికూడ నన్ను సందేహించారు! మీకు అనుమానం కలిగాక, మరెవరికీ తెలియకపోతే సరిపెట్టుకుంటారా!' నాకు చాలా అసహ్యం కలిగింది మీమీద. అసహనంగా మిమ్మల్ని ఏమేమో అన్నాను. మీక్కూడా కోపం అవధులు దాటింది. మాటలు తూలారు. పెట్టె సర్దుకుని పుట్టింటికి వెళ్ళాను. అమ్మ తిట్టింది. నాన్న 'అంత మాత్రానికి అనుమానిస్తాడా నిన్ను? చదువుకున్నాడు కాదూ? నీకిష్టంలేకపోతే మళ్ళీ వెళ్ళకు', అని నన్ను సమర్థించారు. మీరు కొన్నాళ్ళకు జాబు రాశారు. నేను బదులియ్యలేదు. అంతే మూడేళ్ళకు మనం చట్టసమ్మతంగా విడిపొయ్యాం. తర్వాత ఏడాదికి మీరు పెళ్ళి చేసుకున్నారని విన్నాను. ఇంటిదగ్గర ఊరికే ఉన్న మూడేళ్ళలో హిందీ పరిక్షలకు కట్టి పాసయ్యాను. నాన్న పోయింతర్వాత, ఇంట్లో ఉండడం ఇష్టంలేక అత్తయ్యను వెంటబెట్టుకుని ఈ ఊరు వచ్చి, స్కూల్లో హిందీ టీచరుగా ఉంటున్నాను. అమ్మకు, అన్నయ్యకు నామీద ఎప్పుడూ సానుభూతిలేదు" అంటూ పూర్తిచేసింది కథ.

"ఎంత పనిచేశావు కాంచనా? నేను నిజంగా నిన్ను సందేహించనే లేదు. నిన్ను చాలా ప్రేమించాను నేను. నీకాలికి ఎదురు దెబ్బ తగిలితే, కూరలు కోస్తూ వ్రేలు కోసుకుంటే, వంత చేస్తూ చెయ్యి కాల్చుకుంటే, నా ప్రాణం విలవిలలాడిపోయేది. అటువంటిది నీ పేరుకు మచ్చ వస్తే ఎట్లా సహించగలను? రాముడు సీతను అడవికి పంపి అయోధ్యలో ఆనందంచాడంటావా? నువ్వు నిష్కళంకవని నాతోపాటు ప్రపంచం కూడా నమ్మాలని తహ తహలాడాను. అందుకే 'ఎవరికేనా తెలుసా', అనడిగాను. వేరేమీకాదు. కానీ నువ్వు నన్ను రెచ్చగొట్టావు. నా నోట వెలువడిన మాటలు తలచుకుని తర్వాత నేను పడ్డ సిగ్గూ, బాధ ఎట్లా చెప్పను నీకు? దేనికీ వ్యవధినివ్వకుండా నన్ను ఏకాకిని చేసిపోయావు నువ్వు. నా జాబు చదవకుండా చింపివేశావని విన్నాను. బదులివ్వలేదు. అమ్మ రోజూ ఏడుపు. ఒక్కగానొక్క

కొడుకు సంసారం ఇట్లా భంగమైతే ఏడవక ఏం చేస్తుంది? ఆమె తృప్తికోసం, ఆమె కుదిర్చిన పిల్లను చేసుకున్నాను'' సారధి కళ్ళు చెమర్చాయి.

కాంచన బుగ్గలు తడిసిపోయాయి. ఆమె తన చెక్కిళ్ళు తుడుచుకోడం మర్చిపోయి, సారధి కళ్ళు చెంగుతో తుడుస్తూ ''మీ భార్య ఎట్లా ఉంటుంది చెప్పరూ?'' అంది.

సారధి జాలిగా చూస్తూ ''పేద ఇంటిపిల్ల, చదువూ, నాగరికతాలేని అమ్మాయి నాకు భార్యగా వచ్చింది. చూడ్డానికి నీకన్నా మెరుగే స్త్రీలలో పద్మినీజాతి స్త్రీలుంటారని వింటాం. నా భార్య పనిమనుషుల్లో పద్మినీ జాతికి చెందినది. వంట అద్భుతంగా చేస్తుంది. ఇల్లెప్పుడూ పరిశుభ్రంగా ఉంచుతుంది. 'నేను ఊరువెళుతున్నానంటే', 'ఎందుకు' అని అడగదు. ఆలస్యంగా వస్తే 'ఏమ'ని అడగదు. అంతా నౌకర్ల మనస్తత్వం, అటువంటి ఇల్లాలుతో కాపరంలోని కమ్మదనం గురించి కథలు వ్రాయమంటావా, పాటలు పాడమంటావా?'' అన్నాడు సారధి.

కాంచనకు జాలిలో కూడా కాస్త నవ్వు వచ్చింది. ''నాలుగేళ్ళనాడు నీకు అమ్మవారు వచ్చి, రూపు చెడిందని విన్నాను. ఒక క్షణం మంచి శాస్తి జరిగింది' అనుకున్నాను. తర్వాత వారం రోజులు నువ్వే నా కలల్లో! నిన్ను చూడాలని అంత ఆరాటపడ్డాను. నా భార్యా, నా సంసారం, నా అంతరాత్మ అడ్డునిలిచాయి. ఇన్నాళ్ళకు నాకు రోగం వచ్చి, నీ సపర్యలు పొందడం, నాకు శాస్తి జరగడంలాంటిదే! కాని నాకిది దివ్యవరంలాగా ఉంది కాంచీ! నిన్ను వదిలి వెళ్ళాలనిపించడంలేదు'' అన్నాడు సారధి ఆమె చెయి గుప్పిట్లో పట్టుకుని, కాంచన అంతా విని, నిలువెల్లా వణికిపోయింది.

నాకు దేవుడిచ్చిన అమృత కలశాన్ని నిర్లక్ష్యంగా జారవిడిచాను. కానీ, నేను చేసిన పొరపాటుకు శిక్షపడటమే విచారంగా ఉంది! మీరు నా దగ్గర ఉంటానంటే ఎట్లా? రేపు రాత్రి మెయిల్లో వెళ్ళడానికి మీకు టిక్కెట్టు బుక్ చేసాను. నేను చేసిన పాపం చాలు మీ జన్మకు!'' అంది. దుఃఖం పట్టలేక బిగ్గరగా ఏడ్చింది.

''గుండెలో నా కోసం ఇంత ప్రేమదాచుకుని, నన్ను రిక్తహస్తాలతో వెళ్ళగొడతావా,'' అన్నాడు సారధి జాలిగా, ప్రేమగా.

కాంచన, ''నాదెంతటి ప్రేమైనా మీకు అపథ్యాహారంలాంటిదే అవుతుంది. నన్ను మనసారా క్షమించండి అదే చాలు నాకు'' అంది.

వెళ్ళేటప్పుడు సారధి పాతబట్టలు కట్టుకున్నాడు. కాంచన రోషంగా ''ఓహో, నేను ఇచ్చిన బట్టలు పనికిరావు కాబోలు! ఫరవాలేదు ఉండనివ్వండి. మళ్ళీ నా ఇంటికి ఎవరైనా వానలో తడిసి వస్తే ఉపయోగపడతాయి'' అంది. సారధి కళ్ళు చెమర్చగా నవ్వి, ''కాంచీ నీ రోష కషాయిత నేత్రాలు, నీ పరుష భాషణాలు నాకెప్పటికీ లేకుండా చేశావు కదా! ఆడవాళ్ళు పెళ్ళిచీర దాచుకుంటారు చూడు, అట్లా దాచుకుంటాను, నువ్విచ్చిన బట్టలు. అవి రైల్లో మాసిపోకూడదు'' అన్నాడు.

సారధి ఎక్కిన రైలు కదిలిపోయింది. ''నా చేతులారా, నా సర్వస్వమూ పోగొట్టుకున్నాను. దేవుడా! నువ్వు చాలా దయగలవాడివి! నేను పారవేసుకున్నాననుకున్నది నా దగ్గిరే ఉన్నదిన్నాళ్ళు! దాని వెలుగు ఇవాళే గుర్తించాను!'' అనుకుంది కాంచన.

అలరాస పుట్టిళ్ళు

- కళ్యాణ సుందరీ జగన్నాథ్

(రచనా కాలం -1962)

శ్రీమతి నిడుమోలు కళ్యాణ సుందరీ జగన్నాథ్ గారు 1941లో 'భారతి' సంపాదకులు శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మ గారి ప్రోద్బలంతో మొదటి కథకి శ్రీకారం చుట్టారు. ఆవిడ రాసిన మొత్తం కథలు 20 దాటకపోయినా ప్రతి ఒక్కటీ ఆణిముత్యమే. వారు జులై 19, 2002 న పరమపదించారు.

అమ్మవారి గుడి పాడుపడి ఉంది. తల వాకిళ్ళు దుమ్ము, సాలీళ్ళు.

మునసబుగారి లోగిలి అరుగులు విరిగి, రాళ్ళు బయటపడ్డాయి. అరుగు మీద స్థంభంలోనుంచి కూడా రాళ్ళు ఊడిపోయినయి. లోగిలి సింహద్వారం వద్ద మెట్లు గచ్చుపోయి, రాళ్ళు పెల్లగిలిన చోట్లల్లో రావి మొక్కలు, చిన్న గడ్డిపరకలూ మొలుచుకొచ్చినయి. మేడ మీద వేసిన కిటికీలకి సాలీడు పట్టింది. భవంతి గోడలన్నీ, నల్లబడి పోయి, అక్కడక్కడా పెచ్చులు రాలుతూ, బీటలు కూడా పడ్డాయి. లోగిలి పెరట్లో ఒక్క నూతి చుట్టూ తప్ప అంతా నిలువెత్తు గడ్డి పెరిగి ఉంది. నుయ్యి ఒక వేపు కూలింది. ఖాళీ ధాన్యపు గాదులకన్నీ పందికొక్కులు కన్నాలు.

లోగిలిలో ప్రక్కగా, వీధికటు ప్రక్క వున్న పెద్ద దొడ్డిలో గడ్డివాములు వున్న చోట వరిగడ్డి కుళ్ళి మోకాటి లోతున పడి ఉంది. గచ్చు పగిలిన సగం విరిగిన చావడిలో, ఒక మూలన నులక మంచాలూ, విరిగిన గోనె మడత మంచాలూ, కొడవళ్ళూ, గొడ్డళ్ళూ విరిగిన నాగలి కొయ్యలూ, చీకిపోతున్న గోనెలు, పాపులూ మేటగా పడివున్నాయి. కట్టుకొయ్యలన్నీ ఖాళీ. పైకప్పు మీద పెంకులు లేచి పోయాయి. చాలా చోట్ల పెద్ద గాలివానకి విరిగిన కొబ్బరి చెట్లు, బాదం చెట్లూ పడినవి పడినట్లే ఎండిపోయినయి. సగం విరిగిన కమ్మరేగు చెట్లు రెండూ విరిగినంతవరకూ తల్లి చెట్టునించి వేళ్ళాడుతూ, అల్లాగే ఎండిపోయినాయి. కుంకుడు, భూరుగ చెట్ల క్రింద పండాకులు మోకాళ్ళ ఎత్తున రాలి ఎండుతూ ఉన్నాయి. చుట్టూ ఉమ్మెత్త, జిల్లేడు చెట్ల మయం -

పున్నయ్య చెరువు పావంచాలు విరిగి చెరువులోకి ఒరిగి ఉన్నాయి. వాట్లల్లో పెద్దరాళ్ళు మాత్రం కొంచెం దూరంగా పడేసి ఊరు వాళ్ళు బట్టలు ఉతుక్కుంటున్నారు. పాలంలో ఉన్న పున్నయ్య, చిన్నాయనమ్మగార్ల సమాధుల సున్నం రాలిపోతోంది. చుట్టూ గడ్డి మొలిచి సమాధుల్ని కప్పుతూంది. సమాధుల మీద రాళ్ళు రెండు మూడుచోట్ల ఊడి వచ్చేసినయి.

తాడి చెట్ల మీద కాకులు గుంపులు గుంపులుగా కూచుని 'కావు కావు'మని కూస్తున్నాయి. లోగిలి వెనుక వేపు నుంచి తుమ్మ చెట్ల మీదుగా సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఆ సాయంత్రం ఎర్రటి ఆకాశం ముందు నల్లగా నిటారుగా మొండి తాడి చెట్టు ఒకటి నించుని ఉంది. దానికీ తామర గుంటకీ మధ్య వున్న మంటి దారిలో నుంచి రిక్షా ఒకటి వస్తూంది. తామర గుంట అంతా నాచుతో నిండి ఉంది. చుట్టూ బురద పాములు, వరుసగా తలలు మాత్రమే నీళ్ళలోంచి బయటికి పెట్టి గాలి పీల్చుకుంటున్నాయి.

ఆ రిక్షా లోగిలి సింహద్వారం దగ్గర ఆగింది. దానిలోంచి ఒక వృద్ధాప్యం సమీపిస్తున్న ఆవిడ దిగింది చేతిలో ఒక సంచి పట్టుకుని. లోపలనుంచీ అడుగుల చప్పుడు ఖాళీ భవంతిలో ప్రతిధ్వనించింది. ఈవిడ కంటే మరికాస్త పెద్ద వయస్సులోగల మరో ఆవిడ లోపలి నుంచీ వచ్చింది. ఎండలో వెలిసి, వానల్లో తడిసిన ముఖం. ఈవేళ, ఆ ముఖం దుఃఖంగా కూడా ఉంది. "వచ్చేశారు కదా, అక్కమ్మగారూ! మీరు అందుకోలేరేమో అనుకున్నామండి" అంది. అక్కమ్మ పవిట కొంగు ముడి విప్పి చిల్లర తీసి రిక్షావాడికిచ్చాక క్రింద పెట్టి ఉన్న సంచీ పట్టుకుని చంద్రమ్మ ముందూ, అక్కమ్మ వెనక ఆ శిధిల సోపానాలు ఎక్కి ఆ నిశ్శబ్దాలలోకి వెళ్ళారు. వీధి అరుగు మీద నిశ్చలంగా పడుకుని ఉన్న మేకపిల్ల బేబే అని అరిచి, ప్రక్కనించి దూకి పారిపోయింది, ఈ మాత్రం అలజడికే.

లోపల కెళుతూంటే, గుమ్మంలో నుంచీ వ్రేళ్ళాడుతున్న సాలీడు అక్కమ్మ ముఖానికి చుట్టుకుంది. "ఇల్లంతా తుడిశానుమ్మా, ఇంకా బూసు ఇక్కడ ఉండిపోయిందన్నమాట. ఈ పెద్ద గవిడి కూడా నేను వచ్చాక తెరిశానుండి, నాలుగురోజులే అయింది. ఆరూ ఈరూ రావాలిగందా ఇక ఉప్పుడు అని తెలిసి తెరిసేశాను" అంది చంద్రమ్మ. అక్కమ్మ సాలీడు తుడుచుకుంటూంటే, ఎత్తయిన స్థంభాల మధ్య చంద్రమ్మ గొంతు 'బొంయ్ బొంయ్' అని మారుమ్రోగింది. ముందర మండువాలో గచ్చు పూడిపోయిన చోటా, బీటలు వారిన చోటా, గడ్డి మొలిచింది. మండువా వసారా అంచులలో నుంచీ రావి మొక్కలూ, మర్రి మొక్కలూ మొల్చుకొచ్చినయి. మండువాలో అడ్డంగా ఒక తొండ ప్రాకుకుంటూ వెళ్ళిపోయింది.

"ఏమన్నా ధారకం దిగుతుందా?" అంది అక్కమ్మ నడుస్తూనే విచారంగా,

నిమ్మళంగా "కొంచెం గంజి" అంది చంద్రమ్మ.

"ఈపాటికి వాళ్ళందరికీ ఉత్తరాలు అందేవుండాలి. వచ్చే సమయం అయింది" అంది అక్కమ్మ రెండో మండువా దాటుతూ. ఆ మండువా వెనక వసారాలో నులక మంచం మీద ఒక వృద్ధుడు పడుకుని ఉన్నాడు. పైన మెడ వరకూ బూర్నిసు కప్పివుంది. నేల అంతా అక్కడక్కడ గోతులు పడి ఉంది. మంచానికి కొంచెం దూరంలో ప్రక్క వసారాలో పాతదై, తుప్పు పట్టి వూడి పోతున్న ఒక చిలక పంజరం వ్రేళ్ళాడుతుంది. అక్కమ్మ మంచం దగ్గర కొంచెం వంగి "అన్నా!" అని నిమ్మళంగా పిలిచింది.. వృద్ధుడు పలకలేదు.

"ఒక అరగంటనుంచీ కొంచెం నెమ్మదిగా ఉండారమ్మా. మూలుగుడూ అదీ లేదు" అంది చంద్రమ్మ.

లోపలి గదిలోంచీ సుబ్బారాయుడు భార్య వచ్చింది, అడుగులు పట్టి వేసుకుంటూ. "డాక్టరు ఏమన్నాడు వదినా?" అంది

అక్కమ్మ.

"వచ్చావా అమ్మా, కాళ్ళు కడుక్కున్నావా? ఎవ్వరేమంటారు? ఏం లాభం లేదట. పేరంటాలయ్య కొడుకు అన్నాడు" అంది.

"తెల్ల వైద్యం తెలిసిన వాళ్ళని పిలవక పోయావా?" అంది అక్కమ్మ.

"సరే! మందూ వద్దు, మాకూ వద్దు, డాక్టర్ అసలే వద్దని ఎంత పట్టుపట్టారో చంద్రాయినడుగు. అసలే పట్టుదల మనిషాయె" అంది సుబ్బారాయుడి భార్య.

"అసలు ఆయన బ్రతుకులో ముందెప్పుడైనా తిన్నారేంటుండి?" అంది చంద్రమ్మ. అంతలో లోపలి గదుల్లోంచి ఒక చూరు గబ్బిలాయి, గది కడ్డంగా ఎగురుతూ వచ్చి రోగి మంచమూ, ఆడాళ్ళనీ దాటి, ఇవతల గదుల్లోకి వెళ్ళిపోయింది శబ్దంలేకుండా. క్రింది పడివున్న విసినకర్ర అందుకుని కాస్సేపు రోగికి విసిరింది అక్కమ్మ నుంచుని.

"నేను వంట చేస్తాను. నువ్వు కాస్సేపు గాలికి బైట వీధి అరుగు మీద కూచో, లోపల మరీ ఒంటరిగా ఉంటూంది" అంది సుబ్బారాయుడి భార్య. "ఎందుకొదినా, నేను చేస్తానులే. నువ్వన్న దగ్గర కూచో" అంది అక్కమ్మ. "రేపటినుంచీ ఎల్లాగా చాకిరీ తప్పదు కదమ్మా నీకు" అంది ఆమె.

"ఉప్పుడెట్టాగా నిద్రోతుండగారుగిందా అయ్య, మీరూ అల్సిపోయారు గిందా, కాళ్ళు కడుక్కోండి. బయట కూకుందాం" అంది చంద్రమ్మ.

బయట గోడ నానుకుని అరుగు మీద కూచుంది అక్కమ్మ. చంద్రమ్మ స్థంబాన్ని ఆనుకుని కూచుంది. దూరంగా ఎక్కడ నుంచో ఆవు 'అంబా' అని అరిచింది.

"ఎసువంతి మారాజు! ఎంత మెత్తనిగుండెకాయ! ఏం కథలే" అంది చంద్రమ్మ తల వంచుకుని.

"ఒకప్పుడు మా ఇంటి మడిసి" అని తలెత్తుతూ చెప్పసాగింది - "నన్ను బాదాడు ఒక్క పరుగుచ్చుకుని ఇక్కడ కొచ్చిపడ్డా. ఈ మారాజు కూసోని ఉండాడు. నాకింకేం తోసలే. ఆయన రెండు పాదాలు పట్టుకున్నా. మా ఇంటోడు నా యనకాల్తే వచ్చేశాడు బడితుచ్చుకుని. ఈ బాబు లేసి ఒక్కటుచ్చుకున్నాడు. కళ్ళల్లో నీళ్ళు తిరిగినయి అతగాడికి. నాకడుపాగలే, మల్లా కాళ్ళుచ్చుకున్నా, 'బాబయ్య బాబయ్య కొట్టబోకుండి, ఒదిలెయ్యండి' అని ఏడిశా. ఆయన నా మాట ఇన్నాడో లేదో గాని జేబులో సెయ్యేట్టి, శేతికొచ్చిన రూపాయిలిచ్చేశారు మావోడి దోసిట్లో.

మావోడు అన్నాడు గిందా "నేను ఉత్తినే కొట్టానేవుండి అయగారూ! నేను గొడ్డెల్లె కట్టపడి ఇంటికొచ్చేతలికి ఇది కూడు ఒండకుండా ఆ కన్నిగాడితో మాట్టాడతా కూకుంది. ఆడేంటో వూసులు సెపుతున్నాడు - ఇది ఇంటా ఇకిలిత్తా ఉంది" అన్నాడు. అయ్యగారి కళ్ళు శింతనిప్పులయినయి. 'ఈసారి కన్నగాడితో మాట్లాడితే, దీన్ని ఒక్క ఏటున ఏటున నరికెయ్యారా' అన్నారు మా మడిశితో. ఆయన ముఖం సూత్తే అంత బయ్యం ఏసింది నాకు - ఆ బయ్యం ఉప్పుడుకి వదలలే నాకు. మా నీతిమంతుడుండి ఆయన! కోపం ఉంటే ఉండాదిగాని, ఎంత కనికారం! ఆయన రూపాయలు పెట్టుకుని కడుపారా, ఇందు చేసుకుతిన్నాం. మా వోళ్ళు శానా మంది ఇంకా నిలకడ లేకుండా కుప్పలూ గట్రా నలుపుకుతింటా, దొంగతనాలే గిందా! ఇంకా కులవుత్తేగిందా! ఈ మారాజు మమ్మల్ని పిల్చి పున్నయ్య సెరువు మీద కావిలిగా పెట్టి ఇళ్ళూ వాకిలీ ఇచ్చేరు. మారాజుకి పువ్వుల ఇమానం వత్తాది, ఎల్లేటప్పుడు .... ఆ సెరువు కూడా ఈరి తాతగారు తొవ్వించిందేనంటగా. ఆ తాతగారియేనంతగా ఆ సమాధులు" అంది.

కాస్సేపు అంతా నిశ్శబ్దం - అంతా.

ఎదురుగా తామర గుంట గట్టు మీద నించీ కప్పలు బెకబెకమని అరుస్తున్నయి. కనుచీకటి పడుతూంది. " ఈ జబ్బు ఫలానా అని తేల్చిన వైద్యులు లేరు గదా, ఇన్నేళ్ళున్నా!"అందక్కమ్మ. "అసలే వైద్యుగుల్ని పలకరిచ్చారు ఆయన? అసలు ఒకళ్ళతో మాట్టాడారా,

ఇన్నేళ్ళూ? ఏదో గట్టికాయం గనక ఇట్టా గెంటుకొచ్చారుగానుండీ!" అంది చంద్రమ్మ. అక్కమ్మకి, ఈ లోగిలిలో తను గడిపిన బాల్యం అన్నీ మనస్సులో కొస్తున్నాయి. "ఈ ఇంటి సిరిసంపదలేమయిపోయినయ్యో" అంది అక్కమ్మ నిమ్మళంగా. "ఎందుకు సెపుతారమ్మా ఆ సత్తవతమ్మ గారి పెళ్ళి అయింది. లచ్చిమి తొలిగిందే ఒకేల ఏమన్నా శాపమా, గిట్టనోళ్ళు యామన్నాసేసారా అనిపిత్తాది నాకు" అంది చంద్రమ్మ.

సత్యవతి పేరు ఎత్తేటప్పటికి అక్కమ్మకి మనసు బరువెక్కింది. సత్యవతీ, అక్కమ్మ కలిసి పెరిగారు. దూరపు బంధువులు. చిన్న బ్రతుకు బ్రతకడంవల్ల అక్కమ్మ తండ్రి వీరయ్య, సుబ్బారాయుడు తండ్రి మునసబుగారిని ఆశ్రయించి లోగిట్లోనే ఉండిపోయాడు సకుంటుంబంగా. తల్లిలేని సత్యవతికి పాలిచ్చింది అక్కమ్మ తల్లి. బ్రతికి ఉన్నన్నాళ్ళూ లోగిలి సువ్వారాలన్నీ ఆవిడే నిర్వహించింది. అక్కమ్మకీ సత్యవతికీ బలీయమైన స్నేహం. ఇద్దరికీ మరుగులు లేవు. ప్రాణ స్నేహితురాళ్ళు కూడాను.

చంద్రమ్మ లాంతరు వెలిగించుకు రావడానికి లోపలికి వెళ్ళింది. అక్కమ్మ మనసులో జ్ఞాపకాలు కదిలినయి బాధతో, సుమారు నలభై ఏండ్ల క్రితం జరిగిన గాధ అదంతా.

సుబ్బారాయుడి తరుణప్రాయంలో అది.

నెలపొడిచింది - రాత్రి రెండు జాములయింది. ప్రపంచం పగటి వేసవి తాపం అంతా మరచి నిద్రపోతూంది.

తన మామూలు ప్రకారం లేచి చేతిలో హరికేను లాంతరు పట్టుకుని గొడ్లచావిడి అంతా కలియచూచి, ధ్యాన్యపు కొట్ల తాళాలు లాగి చూచి, వాకిట్లో ధ్యాన్యం గరిసెల చుట్టూ తిరిగి వచ్చి, చెప్పులు వదిలి, మండువాలో మంచం మీద పండుకోబోతున్నాడు సుబ్బారాయుడు. ముందరి వాకిట్లో ధాన్యం పాతర మీద వరిగడ్డి మీద చాపలు పరిచి పండుకున్న చింతాలూ, నల్లిగాడూ పెట్టే గుర్రు తప్ప అంతా నిశ్శబ్దం. ఒక్కసారి చిన్నగాలి గట్టిగా విసిరింది - ఇంటి ముందర తామర గుంటమీద నుంచీ, పెద్ద గుమ్మానికి కట్టివున్న కొంచెంగా ఎండిన మామిడాకుల తోరణాలు ఆ చిరుగాలికి 'గలగల'మన్నయి. ఎక్కడో చిన్న అడుగుల చప్పుడైంది. పండుకోబోయే సుబ్బారాయుడు తిరిగి లేచి కూచున్నాడు. మరికాస్త ఆలకించాడు. అవును. అడుగులే! అడుగులు ముందరి వాకిట్లోకి వస్తున్నాయి - ధాన్యం పాతర వద్దకేలాగుంది. గరిసెల సుమారున ఆగినట్టుగ వున్నాయి. ఊళ్ళో దొంగల ముఠాలు తిరుగుతున్నట్టు వినికిడి. సుబ్బారాయుడు బస్తాల మీద వున్న వాకిలి లోంచి బయటకు వచ్చాడు. గరిసె దగ్గర ఎవ్వరూ లేరు.

ఒక్కసారి గొంతు సవరించుకుని "ఎవ్వరదీ" అన్నాడు ధృఢంగా. ఎవ్వరూ పలకలే. మళ్ళీ పిలిచాడు. అంతా నిశ్శబ్దం. కానీ గరిసెకి అవతల ప్రక్కగా వెళ్ళాడు. "ఎవ్వరది?" వాడిన పువ్వుల వాసన కొట్టింది. ఆ ప్రక్క వేపచెట్టు నీడబడుతూంది. ఆ నీడలో మసక వెన్నెలలో ఒక స్త్రీ రెండు చేతులతోనూ ముఖం అంతా కప్పుకుని ఉంది. ఈసారి "ఎవరు నీవు" అని గర్జించాడు. బదులు లేదు. కానీ ఆ అరుపుకి, ఇంటికి దూరంగా మొండి తాడిచెట్టుకి రెండు పలుపులతో కట్టేసిన కారుదున్న ఒకటి తలకాయ క్రిందకి చాపి 'హు! హు!' అని అరిచి ముందరి కాలుతో కోపంగా నేలని వెనక్కి త్రవ్వింది నాలుగైదు సార్లు. బండెడు దుమ్ము లేచింది. పలుపు తెంపుకోడానికి ప్రయత్నించింది. సుబ్బారాయుడు అక్కడే ఆగాడు - ఒక్క క్షణం ఆ స్త్రీని పరకాయించి చూచాడు. ఆవిడ తల్లో వాడిన ఎర్రబంతి పువ్వు, బొగడ చెండూ ఆ మసక వెన్నెలలో కొంచెం నల్లగా కనిపించాయి. ఇంకా దగ్గరగా వచ్చాడు. సుబ్బారాయుడికి అనేక తలంపులు ఒక్కసారిగా వచ్చాయి.

"సత్యవతీ!" అన్నాడు.

"అన్నా!.. నేనే" సత్యవతి దీనస్వరం వినేటప్పటికి సుబ్బారాయుడికి మనస్సు కరిగిపోయింది. వెంటనే బయంకూడా కలిగింది.

"కూడా వచ్చిందెవరు?" అన్నాడు సత్యవతి మాట్లాడలేదు. ఇంత అర్ధరాత్రి సత్యవతి ఎందుకొచ్చింది? ఎల్లా వచ్చింది? ఏ మాపద కలిగిందో? ఏ మాపద కలుగుతుంది?

పెండ్లి అయ్యి రెండువారాలే గదా అయింది. పందిరైనా విప్పలేదే! ఎంత ఆపద అయితే మాత్రం అర్ధరాత్రి పూట, ఆడకూతురు ఇల్లు విడిచి రావడమా - ఇంతదూరం! అందులోనూ అత్తవారిల్లు విడిచి పుట్టింటికి! ఏమీ అఘాయిత్యం! భూమి పుట్టినప్పటినుంచీ ఈ ఇంట్లో ఆడవాళ్ళు ఇట్లా చేశారా? అట్లాని ప్రపంచంలో ఎవ్వరైనా విన్నారా! రేపు ప్రొద్దున్న నలుగురిలో తల ఎత్తుకోడం ఎట్లాగ? సుబ్బారాయుడు కోపం ఆపుకొని "లోపలికి రా" అన్నాడు. అన్నా చెల్లెలూ ఎదురుపడి మాట్లాడుకోవడం అరుదు - అందులోనూ అతను పెద్దవాడైన తరువాత, అసలు ఆ మాటకొస్తే, పెద్దన్నగారితో అతని ఆరుగురు తమ్ములూ బదులు మాట్లాడరు. పిలవకుండా ఎదురురారు. అతను చావిట్లో ఉన్నంత సేపూ ఆడపిల్లల గొంతులు బయట ఆ ప్రాంతాల్లో వినిపించవు. పైగా పెద్దబ్బాయంటే తండ్రి మునసబుగారికే అదొక మొస్తరు.

సత్యవతి ఆడవాళ్ళంతా పడుకున్న రెండో మండువాలోకి వెళ్ళింది. మండువాలో తూర్పున వసారాలో సత్యవతి గదిముందు వ్రేళ్ళాడగట్టిన పంజరంలోనించీ చిలుక సత్యవతి చూడంగానే పాట మొదలెట్టిందది కీచు గొంతుతో -

"వచ్చేపు పోయేవు ఓ రామచిలుకా
అలరాస పుట్టిళ్ళు లా వార్తలేమి?
పట్టుచీరలు కొన్నారు పణతి మీయన్నలు
వనిత మీ యన్నలూ వచ్చుచున్నారు".

నడిరేయి ఈ సందడికి పండుకున్న వదినెలు లేచారు. "ఇదేమి ఆగడమమ్మా ఎప్పుడూ ఎరగం ఈ విచిత్రం. పేరూ, ప్రతిష్టలూ మన్నుగలిశాయి" అన్నారు.

"నలుగురు నోళ్ళలో వేస్తావుంది నాయనా ఈ ఇంటిని, మిగతా ఆడపిల్లలికి పెళ్ళిళ్ళు ఎట్టా అవుతాయి ఇక?" అంది సత్యవతి మారు తల్లి ప్రక్క మీద లేచి కూచుని విసెనకర్ర చేత్తో అందుకుంటూ. ఈ మాటలకి మారుటి చెల్లెళ్ళు నలుగురూ లేచారు. ఆవలిస్తూ, విరుచుకుంటూను. సవతి తల్లి పెద్ద మంచం మీద పడుకున్న మునసబుగారి చెవిలో, అప్పటికప్పుడే వెళ్ళి ఊదేసింది. ఆయన ప్రక్కగానే మడతమంచం మీద పడుకున్న వీరయ్యా లేచాడు దిగ్గున. ప్రక్కన వున్న తువ్వాలతో మెడ చెమట తుడుచుకుంటూ. పై మేడ మీద పడుకున్న మునసబుగారి కొడుకులందరికీ కూడా తెలిసింది. ఆ రాత్రి ఇక మునసబుగారి ఇంట ఎవ్వరూ నిద్రపోలేదు.

అక్కమ్మ వచ్చింది సత్యవతి గదిలోకి. అక్కమ్మని చూచి కళ్ళు తుడుచుకుంది సత్యవతి. అక్కమ్మ తలుపు జారగిలవేసి దగ్గరగా వచ్చి కూచుంది.

"బయట దారులన్నీ దొంగలు తిరుగుతున్నారంట. ఎట్టా రాగలిగావు సత్యవతీ?" అంది

"ఇవిగో అందెలూ, కడియాలూ దారాలతో కట్టాను మోగకుండా. మిగతా నగలన్నీ తీసేసి వాళ్ళింట్లోనే పారేశాను" అంది సత్యవతి తలవంచుకుని. కొంచెం సేపు ఇద్దరూ మౌనం.

"ఏమయిందీ?" అడిగింది అక్కమ్మ.

సత్యవతి ఇంకా తలవంచుకుంది.

"నిన్న సాయంత్రం నన్ను బలవంతంగా ముస్తాబు చేశారు. పడకటింటివేపు తొంగిచూడనైనా చూడకుండా పారిపోయి వచ్చేశాను."

అక్కమ్మ, తన పవిట కొంగుతో సత్యవతి కళ్ళు అద్దింది, "ఏటికి ఎదురీదడం కష్టం సత్యవతీ" అంటూ

మరునాడు మధ్యాహ్నం వేళకల్లా అత్తవారి పాలేరు వచ్చాడు.

చింతాలు సవ్వారి బండి కట్టాడు. వీరయ్య, అక్కమ్మా సత్యవతి వెంట దిగబెట్టడానికి బయలుదేరారు - అత్తవారి ఇంట్లో.

"అసలు ఆడదానికి ఇష్టమూ అయిష్టమూ ఏంటి?" అంది సవితి తల్లి.

"పరువు ప్రతిష్టలు గల కొంప. బయటికి కీడ్చకు తల్లీ" అన్నారు మునసబుగారు, నిమ్మళంగా దగ్గుతూ,"తిరిగి వచ్చావా, గడప కడ్డంగా నరికేస్తాను" అన్నాడు కోపంగా సుబ్బారాయుడు.

బండిలో ఎవ్వరూ పైకి మాట్లాడలేదు. తన కష్టాలన్నీ మనస్సులో తలపోసుకుంది సత్యవతి. ఒక వారం దినాలకి ముందు ఇల్లాగే చడీ చప్పుడూ లేకుండా అత్తవారి ఇంటో నుంచీ చీకటి కడ్డం పడ్డది. ఎక్కడా మనుష్య సంచారం లేదు. చేల ప్రక్కనుంచీ బళ్ళదారిని నడిచింది. కొంతదూరం వచ్చేసరికి వెన్నెల వచ్చింది. ఎంతదూరం చూచినా వెన్నెల వెలుగులో అనంతంగా పొలాలు తప్ప మానవుడు కనిపించలే. పొలాల్లో ఎక్కడో ఒక నక్క అరుస్తూ పరుగెట్టింది. తనకాళ్ళ అడుగులు చప్పుడు తనకే పెద్దగా వినిపించి, ఆఖరుకి గోనలేరు దగ్గరికి వచ్చింది - అడ్డుదారిని. వేసవిలో ఏరు ఎండి నీళ్ళు నడుము వరకే వస్తాయి. ఏరు శాంతంగా ప్రవహిస్తూంది. అలల మీద చంద్రుడు మెరుస్తున్నాడు. కాని వెంటనే భయం ఇంకా ఉండిపోయింది. ఈ గోన లేట్లోనే చాలా భయపడ్డది ఒకసారి బాల్యంలో. మూడు రోజులు జ్వరం కూడా వచ్చింది. అప్పుడు ఒకనాడు రోహిణి కార్తె ఎండలకి, భూమి మాడీ మాడి ఉంది. ఆనాడు మృగశిర కార్తె వచ్చిన క్రొత్త. కాలువలు వదిలే రోజులు. ఎవ్వరూ చూడకుండా అక్కమ్మా తనూ ఆ ఏట్లో దిగారు ఒడ్డున ఆడుకోడానికి. ఇంకా దిగువన, ప్రక్కవూరి పిల్లలు, తడి ఇసక ముద్దలు మీద జల్లుకుంటూ ఆడుకుంటున్నారు. కాలువకి ఎగువనించీ క్రొత్తనీళ్ళు వస్తున్నాయి. నీళ్ళు ఎవళ్ళూ చూడలేదు. నీళ్ళు చిక్కగా ఎర్రగా బురదతో నురగలతో పొర్లుకుంటూ వస్తున్నాయి. వీళ్ళని దాటుకుంటూ పోతున్నాయి. పిల్లలు కాస్త ఇంకా ఒడ్డుకి తప్పుకున్నారు. చెట్ల మొద్దులూ, విరిగిన పచ్చి చెట్ల కొమ్మలూ అన్నీ నీళ్ళలో కొట్టుకొస్తున్నాయి. ఒడ్డుకి తప్పుకోబోతున్న సత్యవతికి ఒక ముళ్ళకంప నీళ్ళలో గీచుకుపోయింది. ఆ గాయాలు తడుముకుని, తల పైకెత్తేలోపుగా నీళ్ళలో ఒక ఆడమనిషి చెయ్యి కనిపించింది. గాజులతో సహా ఆ చేతి ప్రక్కనే నల్లటి జుట్టూ నీళ్ళ మీద సగం ముణిగి సగం తేలీ చేతితో సహా ప్రవాహ వేగంలో, ఏటి మధ్య నుంచీ వెళ్ళిపోయింది క్షణంలో కళ్ళ ముందు. ఆ శవం, ప్రవాహవేగమూ, ఇప్పుడు జ్ఞాపకం వచ్చి ముచ్చెమటలు పోసినయి, కాళ్ళు శక్తిహీనమై మడతలు బడ్డాయి. ఒక నిముషానికి ధైర్యం తెచ్చుకుని, కాళ్ళు నిలద్రొక్కుకుని వచ్చిన దారినే వెనక్కి తిరిగింది - వెనక్కి చూడకుండా గబగబా నడిచింది. అత్తగారు అప్పుడే లేచి పెరట్లోకి వెళ్ళి వస్తుందనుకుని "ఒంటరిగా ఎందుకు లేచివెళ్ళా"వంది.

ఈ ఆలోచనలూ, భయాలతో అత్తవారిల్లు సమీపిస్తూంది - బండికి - బండిలో సత్యవతికి.

ఇక్కడ సాలూరులో బండి వెళుతున్న దారే చూస్తూ నిలబడ్డాడు సుబ్బారాయుడు. బండి పది బారలు పోయాక వెనక్కి తిరిగాడు లోగలి వేపు. అరుగు మీద కూచుని అరుగు క్రింద వున్న పెంపుడు లేళ్ళు గౌరీ, రాజాలకి లేతగడ్డి మేపుతున్నాడు. లోపలనుంచీ కొండలయ్య వచ్చాడు. అమ్మవారి కొలువులు ఖర్చులు వివరాలకి, ఉత్సవాలకి, ప్రభలకీ అయ్యే రొక్కం విషయం అంతా మాట్లాడి, ఇనుప పెట్టి తాళం తీసుకుని లోపలికి వెళ్ళాడు. కొండలయ్య దూరపు మేనల్లుడు, ఆశ్రితుడు కూడాను, మునసబుగారికి. ఈ వ్యవహారాలన్నీ చూచే బాధ్యత ఈ మధ్యనే సుబ్బారాయుడు తల మీద పడ్డది. మునసబుగారి వయస్సు క్రుంగిన తరువాత ఈ నిర్వహణ అంతా చెంగల్వరాయుడు మోశాడు. అతని పేరు జ్ఞాపకం రాంగానే కొంచెం కళ్ళెర్రనైనాయి. "ఏమి అభిమానం! వెళ్ళేటప్పుడు డబ్బిస్తే పుచ్చుకోలే! వద్దంట!" ఇంకా ఇంట్లోనే వుంటే ఇంకా ముదురును వ్యవహారం. ఎందుకైనా మంచిది పంపిచెయ్యడం! ఇంకా నయం ఇంతగల ఇంటికి ఎంతఅప్రతిష్ట - బయట ఎక్కడైనా - ఏమన్నా మాట పుట్టుకొచ్చిందంటే ఇక చావాలిసిందే!

చేతిలో గడ్డి అయిపోయింది. అరుగు దూకి, చావిట్లోకి వెళ్ళి, కొయ్య పడక కుర్చీలో కూచుని లంక పుగాకు చుట్ట చుట్టుకుంటున్నాడు. మనసు కొంచెంగా కుదుట బడుతూంది. గుమ్మం ముదరనుంచీ గవిడిపోతుల్ని బీడుకి తీసుకెళుతున్నాడు నల్లిగాడు. సుబ్బారాయుడు "ఒరే నల్లిగా నెమళ్ళకి మేత పెట్టావుట్రా?" అని అరిచాడు. అతని గొంతు వినగానే, జతలో ఒక కారుదున్న 'హు!

హు!' అని కొమ్ములు పైకి పెట్టి, తల నేలకి వంచి ముందర కాళ్ళతో వెనక్కి నేల దువ్వడం ఆరంభించింది - పలుపు త్రెంచుకోడానికి ప్రయత్నిస్తూ మిగతా పాలేళ్ళు కూడా పరుగెత్తుకుంటూ వచ్చి, పులుపులు బలంగా లాగి తీసుకుపోయారు మేతకి. నల్లిగాడి వల్ల ఒక్కడి వల్ల కాలేదు దున్నపోతుని ఆపడం. అతను ఉన్నంత కాలమూ, అతను ఒక్కడు ఆ దున్నను అదుపులో పెట్టగలిగేవాడే, ఇప్పుడు నలుగురు కావలసివచ్చారు. తిరిగి చెంగల్వ రాయుడే గుర్తుకొచ్చాడు సుబ్బారాయుడికి. మనిషి ఏమంత వీళ్ళందరికంటె బలాడ్యుడేమీ కాదు. కాని అదేమి మాయో "దాదా" అంటూ అతను దగ్గరికి వెళ్ళేసరికల్లా ఆ పాపిష్టి దున్న తల పైకెత్తి కాల్లు దువ్వటం ఆపేసి పసిపిల్ల చూచినట్టు చూచేది.

సుబ్బారాయుడు లేచి గొడ్లచావిడి ఉన్న పెద్ద దొడ్లోకి వెళ్ళాడు. దొడ్లో వరిగడ్డ మేటల్లో మీదేసుకుని ఆటలాడుకుంటున్న పాలేళ్ళ పిల్లలందరూ ఎక్కడవాళ్ళక్కడ మీద వున్న వరిగడ్డి కదలనీయకుండా గుప్‌చిప్‌గా ఉండి పోయారు. సుబ్బారాయుడు వెనక చేతులు కట్టుకుని తల వంచుకుని ఆలోచనగా, నిమ్మళంగా అడుగులు వేస్తూ ఇంకా దొడ్డి లోపలికి వెళ్ళాడు. పందెపు కోడిపుంజులకి తవుడు కలిపి పెడుతున్న చిన్నపాలేళ్ళు లేచి నుంచున్నారు. కాని సుబ్బారాయుడు అక్కడ కూడా ఆగకుండా ఇంకా వెళ్ళాడు. చిన్న చావిట్లో ఏడు సంవత్సరాలు చెంగల్వ రాయుడు పడుకున్న మడత మంచం జారవేసివుంది. చావిట్లో ఒక ప్రక్క కప్పుకంటుకుంటూ పేర్చిన తుమ్మ మొద్దులు, సరుకు మొద్దులు ఉన్నాయి సువ్వారాలకి. పెద్ద గొడ్ల చావిట్లో ఆరులేగలు మూతులకి చిక్కాలు కట్టుకుని పండుకుని వున్నాయి. నాలుగు ముసలి ఎద్దులు కట్టుకొయ్యల వద్ద పండుకుని నిమ్మళంగా నెమరు వేస్తున్నాయి. లేవలేక రోజులు లెక్కపెట్టుకుంటున్నట్టుగా, పెద్ద ఎద్దు వీపు మీద జోరీగని చేత్తో కొట్టేశాడు. ఎద్దు తృప్తిగా ఎత్తలేక ఎత్తలేక తల పైకెత్తి చూచింది. ఆ కట్టు కొయ్యల దగ్గరనుంచీ, పావురాయి గూళ్ళ దగ్గరకెళ్ళి పావురాలని బయటకి తీసి, ఒక్కొక్కటే ఎగర వేశాడు. పావురాలు కాళ్ళ అందెల రవళితో గలగలమంటూ ఆకాశంలోకి గుంపుగా ఎగిరి మొగ్గలేస్తున్నాయి. సుబ్బారాయుడు ఒక తుమ్మమొద్దు మీద కాళ్ళు దగ్గరగా తీసుకుని కూచ్చున్నాడు. తృప్తిగా చుట్ట పీలుస్తూ, పాలేరు ఒకడు బుట్టేడు పెసలు పావురాల మేత కోసం తెచ్చి అతని కాళ్ళ వద్ద పెట్టి వెళ్ళిపోయాడు.

"ఛ ఛ పేరూ ప్రతిష్ట! ఈసారి తిరిగి రానియ్యి చెబుతా!" అన్నాడు తనకు తానే పండ్లు బిగించి, కనుబొమలు చిట్లించి.

అక్కమ్మ మనస్సులో ఈ గాధ నడుస్తూనే ఉంది. పైకి మాత్రం ఏమీ మాట్లాడటంలేదు. చంద్రమ్మ కూడా మాట్లాడకుండా కూచునే ఉంది. ఇద్దరి మధ్యా లాంతరు వెలుగుతూంది. దూరాన కుక్కలు మొరిగినయి. తామర గుంటలో కప్పలు ఇంకా పెద్దగా అరుస్తున్నాయి. ఇంకో రిక్షా వచ్చి ఆగింది గుమ్మం ముందు. సుబ్బారాయుడి మూడో తమ్ముడూ, అతని భార్యా మనవడూ వచ్చారు వాళ్ళను తీసుకుని లాంతరు చూపిస్తూ, అక్కమ్మ చంద్రమ్మా లోపలికి వెళ్ళారు.

"అన్నా... అన్నా ఇదిగో చూడు. కళ్ళు తెరువు. చిన్నన్న వచ్చాడు" అంది అక్కమ్మ.

సుబ్బారాయుడు నుదురు మీద వెయ్యి వేస్తూ. "ఎవరు నువ్వు? సత్యవతా? ఆ!" అంటూ కళ్ళు తెరిచి చూచి "నీవా అక్కమ్మా వచ్చావా?" అన్నాడు.

"ఆ, వచ్చానన్నా,"

"సత్యవతి ఏదీ? ఇంకా రాలే" కొంచెం ఆయాసంగా అడిగాడు.

అక్కమ్మ కళ్ళు తుడుచుకుంటూ, ఒక చాప పరిచింది. వచ్చిన వదినగారిని కూచోమంటూ చంద్రమ్మ గోడకి ఆనించి ఉన్న బెంచీ మీద, దుమ్ము దులిపి చిన్నన్న గారినీ, మనుమణ్ణీ కూచోబెట్టింది.

మళ్ళీ బయట కొస్తూంటే మండువా వసారాలో తగిలించివున్న పాత చిలక పంజరం అక్కమ్మ తలకి తగిలింది. చిలుకలేదు. పంజరం మాత్రమే ఉంది. ఆ చిలుక మీద చెంగల్వరాయుడు జ్ఞాపకం వచ్చాడు. తిరిగి వచ్చి బయట అరుగు మీద కూచుని ఉన్న అక్కమ్మకు పంజరాన్ని చూడకపోయినా జ్ఞాపకం రాక తప్పదు. అతను పుట్టిందెక్కడ? వచ్చిందెక్కడికి? ఈ లోగిలి సిరిసంపదలతో, అతని బ్రతుకు పెనవేసుకుని పోయింది. విధి నిర్ణయాలు, భగవల్లీలలు, ఎంత విచిత్రం!

"ఆ చెంగయ్య ఎక్కడున్నాడో పాపం! సత్తవతమ్మ గారిని తల్చుకుంటే ఆయన మతికొత్తారుండి.... అయినా మాదొడ్డ మడిశండి. ఊరంతా అట్టుడికినట్టు ఉడికిందిగిందా!" అంది చంద్రమ్మ సగం పైకి వినబడుతూ సగం తనలో తానే. ఎదురుగా స్థంభాన్ని ఆనుకుని కూచుని తల గోడకి చేరవేసి కూచున్న అక్కమ్మకి మరికొన్ని గడిచిన దృశ్యాలు మనసులో మెదిలాయి

అప్పుడు సుబ్బారాయుడికి మంచి ప్రాయం. సత్యవతి గాలిలో పువ్వు ఎగిరినట్టూ, బంగారు జడ కుచ్చులతో, కాళ్ళ గజ్జెలతో, చేతి కంకణాలతో, లోగిలి ఆవరణంతా ఎగిరి, ఆడుతుండేది - ఎనిమిది సంవత్సరాల వయస్సు.

చెంగల్వరాయుడు వచ్చింది ఒక ఉదయం. చేతిమీద బాగా గీసుకు పోయిన గాయాలున్నాయి. పచ్చి రక్తం చారికలున్నాయి చేతి మీద. చెయ్యి కొంచెం పైకెత్తి పెట్టుకున్నాడు. ప్రక్కన ఇంకా బండ్లవాళ్ళు నుంచుని ఉన్నారు. సుబ్బారాయుడు వచ్చి పడక కుర్చీలో కూచున్నాడు. ఒక బండివాడు చెబుతూ ఉన్నాడు.

"ఇందాకుండీ, పొద్దుటేల చెరువు ప్రక్కనుండీ, ఈయనగారు చెట్టెక్కారండీ, వణ్ణం చేసుకోవడానికి - ఎండు కొమ్మలగపడతా ఉండాయి పైన ఆయనేమో చెరువులో తాపేలాతో నీలు ముంచాడుండీ. ఈయనగారి తండ్రి - మా ముసిలాయనలెండి. ఒడ్డుకు చేరాడుండీ. అంతే "రామా' అన్నాడు. నేల మీద కూలబడిపోయాడు. మరి ఏమన్నా పురుగే ముట్టిందో ఏమో నుండి. మేమంతా దగ్గరికి, లగెత్తే తలికి, ఈయనగారు చెట్టు మీద నుంచీ కిందకి గాబరాగా దగ్గరికి దూకబోయాడుండి. చెట్టుమీద ఎండిన కొమ్మ ఒకటి ఇరిగి చేతి మీద నుంచీ చీరుకు పోయిందండీ. సూడండీ ఈ నెత్తురు, మా మంచోరండీ, కామందులు పొలంలోకి వెల్లారు కాస్త ఆగమన్నారండి. తవురు దయచేయించాలుండి. తెచ్చిన దాన్నెం తెచ్చినట్టుగానే ఉండాది. రొక్కంలేకపాయె. ఏదో ఇంటికో పువ్వేత్తే ఈస్సరుడికి ఒకమాలన్నారు కదాండి" అంతవరకూ మౌనంగా వున్న సుబ్బారాయుడు "అట్టాంటిదేమీ అక్కర లేదు. అంతా మేమే చూస్తాం. ఇంకొకళ్ళ ప్రసక్తి ఏంటి, అక్కర్లేదు మనకి అలవాటూ లేదు" అన్నాడు కఠినంగా. అంతవరకూ ఏదో మైకంలో ఉన్న చెంగల్వరాయుడు "ధాన్యం ధర కట్టి మీరే తీసుకోండి" అన్నాడు సుబ్బారాయుణ్ణి. సుబ్బారాయుడు కొంచెం వెటకారంగా చిరునవ్వునవ్వాడు. చిన్నగా
చిరునవ్వు నవ్వాడు.

చిన్నగా "నీపేరబ్బాయి?" అడిగారు మునసబుగారు. "ఇనుగంటి చెంగల్వరాయుడుండీ?"

"ఇనుగంటా?" అన్నారు మునసబుగారు తిరిగి ప్రశ్నార్థకంగా. "మా ఊళ్ళో ఈరిని ఎరగనోళ్ళంటూ లేరుండి. బాగా బతికిన మారాజులేనుండీ. తమరికేమన్నా బందుగులేవోనుండీ, సుట్టరికాలు తిరగేత్తే" అన్నాడు కూడా ఉన్న బండివాడు. "కాదు కాదు" అన్నాడు, పడక కుర్చీలోనుంచి సుబ్బారాయుడు - కత్తిలా. చెంగల్వరాయుడు చట్టుక్కున తల పైకెత్తాడు. నల్లటి గిరిజాలు ముందర కళ్ళలో నుంచీ వెనక్కి చెదిరినయి "ఇనుగంటారు అన్న పేరు ఎక్కడో విన్నట్టుగా వుందే" అన్నారు మునసబుగారు. లోపలనుంచీ ఆటల్లో వగర్చుకుంటూ, అప్పుడే గుమ్మంలోకి వచ్చిన సత్యవతి అతన్ని చూచి అట్టే ఆగిపోయింది. మౌనంలో మాటలాగు అతనిముఖంలో ఆగివున్న దుఃఖాన్ని చూచి, చైతన్యం లేనట్టు అయిపోయింది. చెంగల్వరాయుడు ఒక్కక్షణం సజీవంగా చూచాడు - సత్యవతి కేసి.

"తోబుట్టువులూ, అన్నదమ్ములూ ఎంతమంది?" అన్నారు మునసబుగారు.

"ఈయన ఒక్కడే సంతుండి. కొండ్ర గట్రా ఏమీ లేదు. ఉప్పుడు అంతా పోయింది. ఒట్టి కొళ్ళకే చేత్తావుండారు. ఇటుపక్క బత్తీలో, మరి కాసిని రాళ్ళు గిట్టుబాటు అవుతయ్యున్నారు. అందుకని మాతోపాటూ ఆయన బండి కట్టుకొచ్చారండి" అన్నాడు వెంట వున్న మరొక బండివాడు. ఈలోపుగా సత్యవతి తడిసిన గుడ్డ ఒకటి తీసుకొచ్చి గుమ్మంలోనించి చెయ్యి చాపింది. ఎవ్వరూ అందుకోలేదు. సుబ్బారాయుడు "సత్యవతీ! ఏంటది?" అని గర్జించాడు. గుమ్మం మీదనే ఆ గుడ్డపెట్టి సత్యవతి వెనక్కి పారిపోయింది. రెండంగలలో చెంగల్వరాయుడు ఆ గుడ్డ అందుకుని చేతినున్న రక్తపు చారికలు తుడుచుకున్నాడు.

తభిశీళ్ళన్నీ తెలుసుకున్న మీదట "ఇక్కడే ఉండిపో అబ్బాయీ పాపం! మంచీ చెడ్డా అంతా మేమే చూస్తాంలే. భయం లేదు" అన్నారు మునసబుగారు.

చనిపోయిన తన తండ్రికి దహన సంస్కారాలు అన్నీ మునసబుగారే చేయించారు, లోగిట్లో. ఆ ధాన్యం అమ్మించి, ఆ రొక్కం దగ్గరే ఉంచుకోమన్నారు చెంగల్వరాయుణ్ణి.

ఆనాటి నుంచీ మునసబుగారికి కుడి భుజంలాగ మునసబుగారిలోగిట్లోనే ఉండిపోయాడు చెంగల్వరాయుడు.

చెంగల్వరాయుణ్ణి చూచినప్పటినుంచీ సత్యవతికి కన్నతల్లి తిరిగిలేచి వచ్చినట్టుండేది. పాలం వెళ్ళినా, బయటకెళ్ళినా సత్యవతికిష్టమైనదేదైనా ఒకటి తెచ్చి ఇచ్చేవాడు చెంగల్వరాయుడు. సత్యవతి జ్వరం పడిలేస్తే సోలెడు గుమ్మపాలు తెచ్చి సత్యవతి మంచం దగ్గర స్వయంగా పెట్టేవాడు. ఎవ్వరైనా అడిగితే, 'గుమ్మపాలు వంటికి మంచిదమ్మా' అని సమాధానం ఇచ్చేవాడు.

రోజులు గడుస్తున్నాయి.

సత్యవతి పెద్దదయింది. గడపదాటనివ్వడం లేదు, ఇంట్లో పెద్దవాళ్ళూ, సంప్రదాయమున్నూ. కానీ సత్యవతికి మాత్రం చెంగల్వరాయుణ్ణి తల్చినంతనే దేవగానం వినిపించిట్టుండేది. అతను ఎదుట ఉన్నంతసేపూ తన ముఖానికి వన్నెలు వచ్చేవి.

ఒకనాడు చెంగల్వరాయుడు ఎప్పట్లాగు పాలంలో పాలకోడు ఒడ్డుగా పెరిగిన పెద్ద పెద్ద మల్లి పొదలలోంచి దోసెడు మల్లి మొగ్గలు తెచ్చాడు ఉత్తరీయంలో.

"ఆ దుబ్బుల్లో పాము ఉందంట. ఎందుకక్కడికి పోతావు? ఈ పువ్వులు లేకపోతే పోయిందిలే వెళ్ళొద్దు" అంది పువ్వులందుకుంటూ సత్యవతి.

"నన్నే పామూ ఏమి చెయ్యదు. నీవు నా ప్రక్క చూస్తావున్నన్నాళ్ళూ" అన్నాడు కళ్ళు నేలకి వాల్చి నిండు చంద్రుణ్ణి చూచి సముద్రం పొంగినట్టు పొంగింది సత్యవతి హృదయం.

రోజులు గడుస్తూనే ఉన్నాయి. మరొక నాడు పాలం నుంచీ వస్తూంటే మొండి తాడి చెట్టుక్రింద ఎగరలేక పడిపోయిన చిలకపిల్ల కనిపించింది. ఆ చెట్టు క్రానిలో దాని గూడులోనించీ పడ్డది. దాన్ని తను సత్యవతికిచ్చాడు. ఆ ఇచ్చిన చిలుకని ఒక బుట్టలో పెట్టి అరటి పండ్లు పెట్టింది సత్యవతి.

ఆ సాయంత్రం ఇంటి ఖర్చులకి గాను చెంగల్వరాయుడు బండి కట్టుకుని సంతకి వెళుతున్నాడు. అతను ఎప్పుడు, ఎందుకు కట్టినా తన స్వంత బండి ఎడ్లనే కడతాడు. కొంత దూరం వెళ్ళేటప్పటికి సత్యవతి దారి కడ్డంగా నుంచుంది, ప్రక్కనుంచీ చెట్టు కిందినుంచీ దూకి వచ్చి ముందర రోజు వర్షానికి రోడ్డు అంతా తడిసి పారాణి పూసుకున్నట్లుగావుంది. సత్యవతిని చూచి చెంగల్వరాయుడు నిర్ఘాంతపోయాడు.

"ఎందుకొచ్చావు ఇంత దూరం? తిరిగి నిన్ను ఎట్లా తీసుకెళ్ళడం ఇంటికి?" అన్నాడు, చిరునవ్వు భయం కలిసి.

"ఏం భయంలేదులే. నన్నెవ్వరూ ఈ చుట్టుపట్ల ఏం చెయ్యలేరు. నేనందరికీ తెలుసుగా ఇక్కడ. నీవు మాత్రం భద్రంగా వెళ్ళిరా" అంటూ తన తలలో వాడి పోయిన మల్లెపూలచెండ్లు తీసి ఎడ్ల కొమ్ములకి కట్టింది.

"ఇదిగో అమ్మవారి కుంకం" అని చెంగుముడిలో ఉన్న కుంకం తీసి నించుని వున్న అతనికి బొట్టు పెడుతూ "నీకూడా నేనుండనుగా సంతలో అమ్మవారే కాపాడుతుందిలే. అందుకునే ఇది" అంది. చెంగల్వరాయుడి హృదయంలో పువ్వులు వికసించి, కళ్ళలో తేనెలొలికినయి.

ఆ సాయంత్రం తిరిగి వచ్చేటప్పుడు, చిలకకి ఒక పంజరమూ, గోధుమ పూసలూ తెచ్చాడు సత్యవతికి. ఈ పెరుగుతున్న మైత్రి సుబ్బారాయుడికి అంత నచ్చలేదు. కళ్ళు చిట్లించాడు. వదినలు 'రుసరుస'లాడారు.

మరో సంవత్సరం పైబడుతూంది. ఒకనాడూ రవికె అంచులకి చెంగల్వరాయుడు తెచ్చిన గోధుమ పూసలు కుట్టుకుంటూ, చిలుకకి పాటలు నేర్పుతూంది సత్యవతి. మధ్యాహ్నం ఎండకి నిద్రపోతున్న సుబ్బారాయుడు త్రుళ్ళిపడి లేచాడు. "ఏం సత్యవతీ, ఏంటీ శని? ఈ చిలుకని ఎప్పుడో పీక పిసికేస్తాను. ఏం గోల నిద్రలేకుండా!" అని అరిచి ఛటాలున లేచి బయటకెళ్ళిపోయాడు. క్రొత్తగా కొన్న కారె దున్నల జతని కట్టేస్తున్నాడు చింతాలు. దున్నపోతులు గున్న ఏనుగుల్లా ఉన్నాయి - ముక్కులు కుట్టారు. చింతాలుని ముప్పతిప్పలు పెడుతున్నాయి. ఇంట్లో కోపం మీద చావిట్లోకి వచ్చిన సుబ్బారాయుడు చెట్టుకు నిలబెట్టి ఉన్న దుక్కి కర్ర తీసి, దున్నల్ని ఒక్క పెద్ద దెబ్బ వేశాడు. జతలో ఒక పోతుకి నడుం మీద పడ్డది దెబ్బ. దున్న దద్దరిల్లిపోయింది. అప్పటినుంచీ, ఆ దున్న పొగరుమోతు అయింది. సుబ్బారాయుడి గొంతు వినిపించినా, నీడ మీద పడినా అతన్ని చీరెయ్యడానికి చూస్తోంది. పగపట్టింది అతనిమీద.

"దోసెడు ముత్యాల్లోనూ దోసెడు రత్నాలలోనూ పుట్టావు నువ్వు. నేనంటే, ఎందుకిట్లా నీకూ!" అన్నాడు చెంగల్వరాయుడు ఒకనాడు - పైకొమ్మలనించీ ఎర్రమందారపువ్వులు కోస్తూ. పువ్వుల కోసం దోసిలి పట్టి పైకి చూస్తూ, ప్రతిమలా నించుంది సత్యవతి.

"నా పుట్టుక మాటకేం గాని, నాకు నువ్వే పుట్టెడు బంగారం" అంది కొంచెం కొంటెగా.

"నేనూ ఆలోచిస్తావుండా. నాకు చిన్న తాత కొడుకు ఉండాడు - నాకు పినతండ్రి, ఆయనతో నీకోసం అడిగిద్దామని. ఎటొచ్చీ డబ్బు సంపాదించాలి. అదే చిక్కు" అన్నాడు విచారంగా.

ఒకనాడు సుబ్బారాయుడుతో "వయస్సు వచ్చిన పిల్ల అతగాడితో ఈ సఖ్యం ఏమిటండీ?" అంది ఆయన భార్య. అతను ఉలికిపడ్డాడు. కోపంగా చూచి ఊరుకున్నాడు. కాస్త ఆగి "ఏం ఎవరన్నా ఏవన్నా అన్నారా? ఊళ్ళో?" అన్నాడు.

తన మేడ మీద గదిలో ఒకడే పచారు చేస్తున్నాడు. ఆనాడు ఆ నగల మూట విషయమూ అంతేగా. ఈ పేరూ ప్రతిష్టల కోసమేగా అంత భయపడ్డది? ఆ రోజు ఎవ్వరూ వెళ్ళని, ఆ మల్లి దుబ్బుల దగ్గరికి ఎందుకు వెళ్ళడం? ఆ చెంగల్వరాయుడు - దానికి పువ్వులకి అంటే, ఆ సత్యవతికి. ఎవ్వరో దొంగాళ్ళు దాచిపెట్టుకున్న ఆ నల్లగుడ్డ మూట వాటి కంట బడ్డది.. అనుకుంటూ తిరిగాడు తనలో తాను. ఆనాడు ఆ మూట దొరికిందని మల్లి పాదలో పెట్టారనీ, వచ్చి సుబ్బారాయుడితో చెప్పాడు - చెంగల్వరాయుడు. సుబ్బారాయుడి వళ్ళంతా వణికిపోయింది.

"మన పంట బోదెలోనా? మన పంట పొలంలోనా? దొంగల సొమ్ము? రెండో కంటివాడికి తెలియనివ్వద్దు" అని ఆ మూట మోయించుకెళ్ళి గోనలేట్లో వదిలేయించేశాడు. లోకనింద ఏదైనా ఎట్లాగా భరించడం? ఎందుకైనా మంచిది, ఈ చెంగల్వరాయుణ్ణి వదుల్చుకోవడం మంచిది. కిటికీలో నుంచీ చూస్తూ నిలబడ్డాడు. ఎదురుగా తామర గుంటలో నించీ మునసబుగారి గూసుబాతులు ఈదుకుంటూ ఒడ్డుచేరుతున్నాయి, గట్టుమీద వెళుతున్నవాళ్ళని పొడవడానికి మెడలు బారెడేసి చాచుకుంటూ మునసబుగారి రాశికావలి కుక్కలు, చెరువుగట్టుమీద తోకల మీద కూచుని నీళ్ళూ చూస్తూ ఈగల్ని నాలికతో పడుతున్నాయి. చుట్టూ పచ్చ చేలన్నీ పసిరి కప్పినట్టున్నాయి.

ఆ రాత్రి పొలంలోంనుంచీ రాగానే వీరయ్య చెప్పాడు, రమ్మన్నారని. చెంగల్వరాయుడు లోపలికెళ్ళాడు. సుబ్బారాయుడి గదిలోకి.

ఒక అరగంట అయ్యాక, మేడమీద నుంచి నీళ్ళు పెడుతూ అక్కమ్మ చూచింది - చెంగల్వరాయుడు, సుబ్బారాయుడి గదిలోనుంచీ బయటికొస్తూ, అతని పలుచటి, తెల్లటి ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకున్నాడు గుమ్మం బయట.

మరునాడు ఉదయం - తెల్లవారక ముందర్నించీ సత్యవతి గదిలో లేదు. అక్కమ్మ చూచేటప్పటికి చెంగల్వరాయుడు తన బండి కట్టుకుని వెళ్ళిపోయిన దారినే నడుచుకుంటూ, వెతుక్కుంటూ, వెతుక్కుంటూ వెళ్ళింది అక్కమ్మ. కొంత దూరంలో పున్నయ్య కోనేటి ప్రక్కన, పున్నయ్యగారి సమాధుల కెదురుగా, ఒక చెట్టు కింద, ఒక ప్రక్కగా ఒరిగి ముడుచుకుని పండుకుని ఉంది, సత్యవతి. కౌగిట్లో ఒక తెల్లటి ఉత్తరీయం ఉంది. నిన్న రాత్రి చెంగల్వరాయుడు వేసుకున్నదే అది. ఉత్తరీయం కొంచెం ఒకచోట తడిగా ఉంది. గడ్డం క్రింద మొఖం అంతా కన్నీళ్ళు జారిన ఆనవాళ్ళున్నాయి. కనురెప్పలు ఇంకా వాచి, తడిగానే ఉన్నాయి. అప్పుడే నిద్రపట్టినట్టుగా ఉంది సత్యవతికి. తెలియకుండా ఆ ఉత్తరీయం లాగుకుని మరుగుగా ఒళ్ళోపెట్టుకుని దాచింది, అక్కమ్మ ఎవ్వరికీ కనబడకుండాను. రోడ్డు మీదనుంచీ, చెట్టువరకూ ఉన్న పల్లంలో సన్నమన్ను మీద రెండు జతల అడుగులు కనిపించినయి. ఒకటి చిన్నది, ఇంకొకటి పెద్దది. అక్కమ్మ అడుగు జాడలు చేత్తో తుడిచేసింది.

ఆ ఎండల్లో ముహూర్తాల రోజుల్లోనే సత్యవతికి పెండ్లి అయింది.

పక్షం తిరగక ముందే పుట్టింటికి పారిపోయిరావడమూ, అక్కమ్మ, వీరయ్య తిరిగి తీసికెళ్ళడమున్నూ.

మరొక వారంపోయాక, జుట్టు విరియబోసుకుని మునసబుగారి అమ్మాయి పాలాల్లో తిరుగుతూందనీ, ఎక్కడో తూము మీద కూచుని ఉందనీ రకరకాల వార్తలు చేరినయ్యి. సాలూరు గ్రామానికి. ఊళ్ళో అమ్మలక్కలు చెప్పుకోసాగారు:

"అదేంటి, ఆ అన్నల్ని చూస్తే మనలాంటి వాళ్ళకే బయ్యం. ఆ పిల్లదేమి రాతిగుండెమ్మ! బయమే లేదుగదా!" అంది ఒకావిడ. "ఏమీ ఎరగనట్టే ఉంటాది. ఎంత జాణతనము, జట్టీల్లాంటి అన్నలుండగా ఇట్లా కాపరం ఎగెయ్యటం!" అంది రెండవ ఆవిడ బిందె తోముతూ, నీళ్ళాట రేవులో "కాపురం మీద ఎట్లావుంటాది?" అన్నాడు ఒక అతను ఎడ్లని కడుగుతూ.

"ఆ! ఆ చెంగల్వరాయుణ్ణి ఇన్నాళ్ళు ఇంట్లో. ఇట్లాగే అవుతాయి" అంది మరొక వేదాంతి - బిందె భుజం మీద పెట్టుకుంటూ. అన్ని వార్తలు, సేవకులద్వారా మునసబుగారి కోడళ్ళకి తెలుస్తున్నాయి. సుబ్బారాయుడు వినక తప్పింది కాదు. పిచ్చివాడిలా కోపం తెచ్చుకున్నాడు. పండ్లు పటపట కొరికాడు, పరవళ్ళు త్రొక్కుతున్నాడు.

మునసబుగారి ఒత్తిడివల్ల సత్యవతిని భూతవైద్యం చేయించడానికి పుట్టింటికి తీసుకొచ్చారు నిశ్చయంగా, సత్యవతికి దయ్యం పట్టింది - అన్నాడు వైద్యుడు పేరంటాలయ్య. అక్కమ్మ మరిది, రంగం నుంచి ఉత్తరం వ్రాశాడు. చెంగల్వరాయుడు రంగంలో ఉన్నాడనిన్నీ అక్కమ్మ సత్యవతితో చెప్పింది.

"అవును డబ్బు సంపాదించుకుని వస్తానన్నాడు" అంది సత్యవతి, విచారంతో.

"ఏం లాభం సత్యవతీ, ఇక ఇప్పుడు?" అంది అక్కమ్మ. సత్యవతి ముఖం కప్పుకుంది చేతులతో, చిన్నగా వెక్కి వెక్కి ఏడ్చింది ఆపుకుంటూ.

సత్యవతిని తిరిగి పంపించే రోజున, సుబ్బారాయుడు అగ్ని పర్వతంలా బుస్సులొదిలాడు. మొండి తాడికి కట్టేసిన కారుదున్న ఇంకా బుస్సుకొట్టింది. ఇంకా పగపట్టే ఉంది.

రోజులు గడుస్తున్నాయి. తొలకరి వచ్చింది. రాత్రుళ్ళంతా తామర గుంటలో కప్పలు బెకబెకమంటున్నాయి. పున్నయ్య చెరువులోనూ, తామరగుంటలోనూ, తామర పువ్వులు వర్షానికి నలిగిపోయినయి. మొండి తాడిం మీద చంద్రుడుదయించాడు., పౌర్ణమి చంద్రుడు, ఎర్రగా - నిశాదేవి కుంకుమ బొట్టులా, రాత్రి గడిచిన కొద్దీ పున్నమి నెల తెల్లబారింది. భోజనాల వేళకి సత్యవతి వచ్చింది - ఈసారి నగలు తీయాలన్న స్పృహ లేదు. తిరిగి సత్యవతిని చూచేటప్పటికి, పంజరంలో చిలక "కిల కిల"లాడింది. రెక్కలు "రెపరెప"

కొట్టుకుంటూ, పాట మొదలెట్టింది. ఆ గోలకి పెంపుడు కుక్కని పరీక్షిస్తున్న సుబ్బారాయుడు, తలపైకెత్తి చూచాడు. కళ్ళు ఎర్రబారినాయి. వళ్ళువణికింది, కోపంతో

"ఈ గడప తొక్కద్దు అనలే? ఈ శని ఇంకామాకు విరగడకాలే? తల ఎత్తుకుని బ్రతకనివ్వదల్లే ఉంది?" అంటూ అంగల మీద లేచి, చావిట్లో చిలకకొయ్యకి వున్న ఉత్తరీయం మీద వేసుకుని, చెప్పుల్లో కాళ్ళు పెడుతూ "వచ్చినదారినే నడు!" అన్నాడు. సత్యవతి వెనక్కి వెనక్కి చూచింది వెళ్ళబోతూ. తనకేసే చూస్తూ గూట్లో చిలకపాట పాడుతూనే ఉంది.

"పరువుగల అన్నలూ పయనమైనారా?

రాకాసి వదినలూ, రానివ్వరేమో"

మండూవాలోకి వచ్చిన పెద్దవదిన "తెల్లారాక తీసికెళ్ళండి" అంది.

"ఎవ్వళ్ళన్నా చూస్తే - తిరిగి వచ్చేసినట్టూ?" అంటూ అతను ముందూ, సత్యవతి వెనకా, నడిచి పోతూనే ఉన్నారు. దారిలో తుమ్మమానులు నల్లగా నుంచుని ఉన్నాయి. నేవళంగా, పచ్చగా పెరిగివున్న చెట్లన్నీ పూర్తిగా విబూదిలో ముచెత్తినట్టూ ఉన్నాయి - ఆ పున్నమ వెలుగులో, అతని కిరుచెప్పుల చప్పుడికి, దారికి అడ్డంగా వున్న ఒక పెద్ద పాము ప్రక్కగా తప్పుకుపోయింది. దారి ప్రక్కన, మళ్ళల్లో నీళ్ళు తళతళలాడుతున్నయి.

సుబ్బారాయుడు ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి చుక్క పొడిచింది. "వాళ్ళు గుమ్మం వరకూ పంపించి వచ్చాను. లోపలకి వెళ్ళడానికి నాకు ముఖం చెల్లలేదు" అన్నాడు భార్య అడుగగా.

తిరిగి మరునాడు వాళ్ళ అత్తవారి మనుష్యులు వచ్చారు - వెతుక్కుంటూ అన్నగారి ముఖం వెనక్కి తిరగంగానే, ఇంట్లోకి వెళ్ళకుండా ఎక్కడికో పారిపోయింది. నూతులూ, గోతులూ దేవించారు. చెరువులు గలించారు. ఆ చుట్టుపక్కల ఎక్కడా సత్యవతి జాడ కనబడలేదు.

వెతికి వెతికి వేసారిపోయి, మునసబుగారు మంచం ఎక్కారు. చేతినున్న షాహుకారు ముద్దుగు అరిచేతిలో పడుతూంది. క్షీణించిపోయి మూడు నెలలు తిరగక ముందే కాలం చేసారు.

సుబ్బారాయుడు, ఇంటి విషయం, ఆస్తివిషయం ఏమీ శ్రద్ధ పట్టుకోవడం లేదు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ చావిట్లోనే కూచుని ఉంటాడు. సత్యవతి పరారి అయి పోయిన సంవత్సరంలోనే గుమిడిపోతుల జత అమ్మేశారు. వెంట వెంటనే దుక్కిటెడ్లు, పాడి పశువులూ అన్నీ అమ్ముడూ పోయినయి. సుబ్బారాయుడు తన పట్టె మంచం పడక మానేశాడు, చావిట్లో ఒక నులక మంచం వేసుకున్నాడు. భోజనం, పడక అన్నీ అక్కడే అమ్మవారి గుడి ముఖం చూడడం మానేశాడు. సత్తెమ్మ సంబరాలు ఆగిపోయినయి. ఆస్తి క్షీణించసాగింది. అశితోవక వర్గం లోగిలి విడిచిపోయారు క్రమంగా. ఏదో తగుపాటి సంబంధాలకి ఆడపిల్లల్ని ఇచ్చేశారు.

"ఎంత పౌరుషవంతుడు! ఆ సంబంధాలు ఎట్లా అందాడో! ఏదో మతి పోయిందతనికి - చెల్లెలు తెచ్చి పెట్టిన తలవంపులకి" అని అందరూ ఉసూరుమన్నారు. ఆస్తి ఆఖరుకి అంతా పోయింది. ఆ లోగిలి ఒక్కటి నిల్చింది. దానికో రక్షణ లేదు. దాని మీద అప్పులవుతున్నాయి.

సుబ్బారాయుడు అకాలంలోనే వృద్ధుడయ్యాడు. ముఖం అంతా తీరని భారంతో ముడతలు పడ్డది - మండుటెండలకి తన పొలంలో నల్లరేగడి బీటవారినట్టూ.

అతన్ని చూడగానే పంజరంలో చిలుక భయపడి రెక్కలు 'టపటప' లాడించి బయటికి ఎగిరిపోవడానికి ప్రయత్నించేది. సుబ్బారాయుడు చిలక మీద కోపం కూడా తెచ్చుకోవటంలేదు. సత్యవతి వెళ్ళిపోయిన దగ్గరనుంచీ చిలక తిండి తీర్థాలు మానేసింది - అక్కమ్మ పెట్టినా తినకుండా ముక్కు రెక్కలలో పెట్టుకుని అలాగే పడి ఉండేది.

రంగూను నుంచీ వచ్చిన మరిది, చెంగల్వరాయుడు జ్వరం పడి రంగూనులోనే పోయాడని అక్కమ్మతో చెప్పాడు. అక్కమ్మ గుండెలో బరువుతో వెళ్ళి, చిలక పంజరం తెరిచి చిలకను వదిలేసింది.

పేదరికం భరించలేకనూ, పువ్వులమ్మిన ఊళ్ళో కట్టేలమ్మడం కష్టమయిన్నీ, తమ్ములందరూ తలొకదారిని బస్తీలు పట్టారు - వాళ్ళ వాళ్ళ కుటుంబాలతో, దుకాణాలు పెట్టుకుని, గుమాస్తా గిరుల సంపాదించుకుని చిన్న బ్రతుకులు బ్రతుకుతున్నారు.

జరిగిన ఈ గాధ అంతా ఈ లోగిలి విచిత్ర పరిణామం అంతా ఆ అరుగు మీద కూచున్న అక్కమ్మ తలపోసుకుంది.

ఆ రాత్రంతా వచ్చిన కొద్ది మంది బంధువులూ, అందరూ సుబ్బారాయుడు మంచం చుట్టూ జాగారం చేశారు. మధ్య రాత్రికి వృద్ధుడికి మళ్ళా మెలుకువ వచ్చింది.

"ఇంకా రాలేదూ? సత్యవతి?" అన్నాడు.

"లేదన్నా" అంది అక్కమ్మ.

"అక్కమ్మా ఇంక మీదట సత్తెమ్మ సంబరాలు చేయిస్తావా? ఆ యమ్మ పేరే సత్యవతిది" అన్నాడు ఆగి ఆగి కొంచెం ఆయాసంతో

"అట్లాగే అన్నా తప్పకుండా చేయిస్తాం" అంది నుదురు మీద చెయ్యివేస్తూ.

రోగికి కాస్త ఆయాసం ఎక్కువయింది. బయటినుంచి తొలకరి గాలులు చల్లగా వీస్తున్నాయి. ఆ చిన్నగాలిలో ఆ పాత చిలక పంజరం కొంచెం ఊగిసలాడింది. నీళ్ళల్లో వజ్రంలా వెలిమబ్బు చాటునుంచీ చంద్రుడుదయించాడు. నడిరాత్రి గడిచిపోయింది.

మలికోడి కూసేటప్పటికి "సత్యవతీ, సత్యవతీ!" అని గట్టిగా అరిచాడు.

"అన్నా అన్నా, ఇంకా రాలేదు" అంది అక్కమ్మ.

"ఆ! ఆ! గోనలేరు పొంగింది. అదిగో నురగలు. కన్నయ్య లేడూ!" అన్నాడు ఆగుతూ ఆగుతూ ఆయాసంతో. కొంచెం ఆగాడు. "బల్లకట్టు మీద పడేశానే... అక్కమ్మా... అక్కమ్మా... అంతే!" అన్నాడు. అంతా నిశ్శబ్దం... మళ్ళీ "సత్యవతీ!" అనే కేక.

"వస్తాదిలే పడుకో అన్నా" అంది అక్కమ్మ మృదువుగా. సుబ్బారాయుడు కండ్లు ఇంకా కొంచెం తెరిచాడు.

"ఎర్రిదానా! సత్యవతి రాదు! గోనలేరు మింగేసింది. బల్లకట్టుమీద నింపనీళ్ళలోకి పోయింది... అదిగో.. నేనే... నా చేతులారా..." సగం తెరిచిన కళ్ళు మూతలు బడ్డాయి.

గదిలో చుట్టూ వస్తూన్న కన్నీళ్ళన్నీ గడ్డలు కట్టాయి. శ్వాస వినబడడం ఆగింది - రోగిది.

నీడలా ప్రమిద వెలిగింది, గాలికి చెయ్యి అడ్డం పెట్టుకుని దీపంతో లోపల్నించి వచ్చింది - చంద్రమ్మ - తల దగ్గర పెట్టటానికి.

చితనళినీయం

- యద్దనపూడి సులోచనారాణి

(రచనా కాలం -1957 - సులోచనారాణిగారు రాసిన మొట్ట మొదటి కథ)

అప్పుడే వేసవికాలం వచ్చేసింది. వెచ్చని వడగాల్పు ఈ చెవిలోంచి ఆ చెవిలోకి కొడుతోంది. పదిగంటలు దాటితే జనం వీధుల్లోకి రావటానికి జడుస్తున్నారు. కలవారి ఇళ్ళకి వట్టి వేళ్ళ తడికలు బిగింపబడ్డాయి. లేనివారు విసినకర్రలు, కుండల్లో చల్లని నీళ్ళు దగ్గర పెట్టుకుని కూర్చుంటున్నారు. ఎంత వేసంకాలమైనా, వడగళ్ళ వానైనా ఆ ఊరి రాజగోపాలస్వామి దేవాలయంలో రెండు గంటలయ్యేసరికి ఊళ్ళో ఆడవాళ్ళందరూ చేరవలసిందే. గుళ్ళో ఉన్న గన్నేరు, రావి చెట్టూ ఎండ వేడిమిని తగలనీయకుండా చల్లదనాన్ని ప్రసాదిస్తూ ఉంటాయి. కొంతమంది శాస్త్రులుగారి పురాణం కోసం వస్తే, మరికొంతమంది గుళ్ళో గల చల్లదనానికి, లోకాభిరామాయణానికి జేరుతూ ఉంటారు. మొత్తం ఊళ్ళో ఆడవాళ్ళందరూ అక్కడికి చేరి సాయంత్రం నాలుగ్గంటల వరకూ అక్కడ కూర్చుంటారు.

ఆ ఊరిలో కాస్త ఉన్నవాడు, దయాధర్మం, పాపపుణ్యాల భీతిగలవాడు నారాయణరావుగారు. వారి తాత ముత్తాతలెవరో ఈ దేవాలయాన్ని కట్టించారు. అందుకనే ఆయనకు, ఆయన తల్లికి, ఆయన భార్యకు (ఒక్క కూతురు నళినికి తప్ప) ఆ ఇంట్లో అందరికీ నౌకర్లు చాకర్లతో సహా ఆ గుడి అన్నా, ఆ గుళ్ళో పురాణాల శాస్త్రులగారు, పూజారి అన్నా అపరిమితమైన గౌరవమూ, భక్తీనూ. ఆ రాజగోపాలస్వామి దయవల్లనే తామింతవరకూ ఏ కష్టమూ లేకుండా బ్రతుకుతున్నామని అనుకుంటూ ఉంటారు.

ఇంటరు వరకు మెడ్రాస్‌లో చదివిన నళినికి మాత్రం ఇవన్నీ ఒళ్ళుమంట. నారాయణరావుగారు నళినిని ఇంకా ఏ బి.ఎ. వరకో, ఎమ్.ఏ వరకో చదివించేవారేగాని ఆయన తల్లి, "ఇప్పటికే అది తెలివి మీరిపోయింది,, ఓ దేముడూ లేదూ దెయ్యమూ లేదు. ఇంక చాల్లే ఇంటికి తీసుకురా, ఈడొచ్చిన పిల్లని మనఊరు కాకుండా ఎక్కడో ఉంచుతానంటావేం. చాలు చాల్లే, రేపేదైనా అయితే ఏడ్చేందుకా?" అని కొడుకుని మందలించి నళిని చదువుకి ఫుల్‌స్టాప్ పెట్టించింది.

ఆ ఇంట్లో బామ్మ ప్రభావమెంతో తెలిసిన నళిని తండ్రి, "చదువుకున్నది చాల్లే అమ్మా!" అంటే మరేం మాట్లాడలేక పోయింది. కాలేజి చదువుకి స్వస్తి చెప్పబడినా నిస్పృహ చెందలేదు. తండ్రి సహాయంతో ఇతర రంగాల్లో కృషి చేయసాగింది. ఇదివరకు పత్రిక ముఖం చూడని నళిని రోజూ పత్రిక చూస్తూ, ప్రపంచ వార్తలు తెలుసుకోసాగింది. మూలపడిన వీణ తీసి శ్రుతులు సరిచేసింది. ఆ మధ్య బద్ధకంవల్ల మానేసిన డాన్స్ తిరిగి క్రమబద్ధంగా అభ్యసించడం మొదలు పెట్టింది. నళిని పుణ్యమా అని ఆ ఊళ్ళో మొట్టమొదటగా నారాయణరావు రేడియో కొన్నారు.

ఒకరోజు తండ్రి మద్రాసు వెళుతుంటే తనుకూడా వెళ్ళి ఒక బండెడు పుస్తకాలు, కొత్తరకం కుర్చీలు, కొన్ని కర్టెన్‌లు, క్యారంబోర్డు, బాడ్‌మింటన్ ఆడటానికి నెట్టు, బాట్సు మొత్తానికి ఒక నాలుగయిదు వందలు వదిలించి ఇంటికి ఒక స్పెషల్ బస్

చేయించుకుని ఆ సామానంతా వేసుకొచ్చింది. అప్పుడే పూజ ముగించుకుని బయటకు రాబోతున్న నళిని బామ్మ ఈ చిత్రమంతా చూస్తూ నోట మాటరాక అలాగే నిలబడి పోయింది. అత్తగారు అలాగే వచ్చి నిలబడిపోవటం చూసి నళిని తల్లి బయటకు వచ్చి తనూ అత్తగారి సరసన నిలబడి చూడసాగింది. నౌకర్లు సంతోషంగా, ఆశ్చర్యంగా అతి పదిలంతో ముట్టుకుంటే మాసిపోతాయన్నట్లుగా ఒక్కొక్క సామానే లోపలికి పట్టుకొస్తుంటే కళ్ళప్పగించి చూడటం తప్ప అత్తాకోడళ్ళిద్దరూ ఏమీ చెయ్యలేకపోయారు. ఆనాటితో నళినిని వంచటమనేది శుష్కప్రయాస అని మటుకు అనుకున్నారు.

ప్రయాణపు బట్టలన్నా మార్చుకోకుండా నళిని తెచ్చిన సామానంతటిని ఏవేవి ఎక్కడ ఉంటే బావుంటాయో నిర్ణయించి నౌకర్లతో సర్దించేసింది. వీధిలో వచ్చేపోయే జనాన్ని కనిపింపజేసే సింహద్వారాన్ని నీలం పూల కర్టెన్‌తో మూసేసి ఇక వీధిలోకేమీ కనిపించకుండా చేసేసింది. విడిచిన బట్టలను పారేసే హాలులో ఒక మూల రేడియో ఆక్రమించుకుంది. విడిచిన బట్టలన్నీ అందమైన ఒక బుట్టలోకి వెళ్ళిపోయాయి. రేడియోకి, కొంచెం దూరంలో ఒక చక్కని టేబిలూ, దానిచుట్టూ కుర్చీలు నుంచున్నాయి. సర్దుతూ, సర్దుతూ మధ్య మధ్య ఆగి తన పని తనే చూసుకుంటూ, ప్రశ్నలూ, జవాబులూ రెండూ తనే చెప్పుకుని, ఓరకంట బామ్మ, అమ్మల ఆశ్చర్యాన్ని చూసీ చూడనట్లుగా నటిస్తూ, నళిని తన్లో తనే మురిసిపోయింది. నౌకర్లకి కూడా నళిని తన చేతి మంత్రదండంతో ఈ ఇల్లు హఠాత్తుగా మార్చివేసినట్లుగా అనిపించింది. పురాతన పద్ధతులకు తనింట్లో ఈ రోజుతో స్వస్తి చెప్పబడిందికదాని, ఇకనుంచి ఊళ్ళోకి ఎవరైనా పెద్దమనుషులు వస్తే ఇంక తన ఇంటికి తీసుకురావచ్చని నారాయణరావుగారొక్క నిట్టూర్పు విడిచి, తనకు ఆ అవకాశం కల్పించిన నళినిని హృదయంలోనే ప్రశంసించుకున్నారు.

దేవాలయంలో ఆ రోజు మొదటగా వచ్చిన ప్రసక్తి నళిని మీద.

ఒక ప్రక్కన కూర్చుని తన్మయత్వంతో పురాణం వింటున్న నళిని బామ్మ దగ్గరకు మునసబుగారమ్మాయి విమల వచ్చి మెల్లగా,"ఏమండీ! నళిని మెడ్రాస్ నుంచీ ఏమిటేమిటి తీసుకు వచ్చింది?" అంది.

వచ్చిన పిల్లని కళ్ళెరజేసి ఒకసారి ఎగాదిగా చూసింది నళిని బామ్మ.

దాంతో విమల హడలిపోయి అక్కడి నుండి మెల్లగా జారుకుంది. తమ ఇంటికి ఎలాంటి దుష్టితి కలిగిందో, దాన్ని గురించి నలుగురూ ఏవిధంగా చెప్పుకుంటున్నారో ఊహించిన నళిని బామ్మ ఒక బరువైన నిట్టూర్పు వదిలింది. అలవాటు చొప్పున తన కష్టాన్ని రాజగోపాలునికి మనసులో వెళ్ళబోసుకుని, చివరకు భక్తిపూర్వకంగా చేతులు జోడించి 'అంతా నీ దయ స్వామీ' అనుకుని మళ్ళా పురాణం వినడంలో మునిగిపోయింది.

నారాయణరావుగారింటి పక్క శారదాంబ కారులోంచి ఏమేమి దింపారో తాను చూశానని, లోపలికి కూడా వెళ్ళి అంతా చూసొచ్చానని చెప్పడంతో అందరూ ఆవిడ చుటూ ఆసక్తిగా మూగారు. ముఖ్యంగా మునసబుగారమ్మాయి విమల, కరణంగారమ్మాయి కమల, పూజారి కూతురు అన్నపూర్ణ, శాస్త్రులగారమ్మాయి శ్యామల - వీళ్ళకి మరీ ఆసక్తి హెచ్చింది. అదంతా ఒకసారి తాముకూడా చూస్తే ఎంత బాగుంటుందో ననిపించింది.

"ఒకటుందమ్మా, దానిని ఏదో ఇట్లా తిప్పింది! అంతే.. "శారదాంబ తర్వాత చెప్పడం మానేసి కళ్ళు పెద్దవి చేసి చూడడం మొదలుపెట్టింది.

కమలకి ఉత్సాహం ఆగలేదు - "అప్పుడేమయింది?" ఆత్రంగా ప్రశ్నించింది.

కాసేపటికి శారదాంబ, "ఏముంది? దాంట్లోంచి సంగీతం వచ్చేసింది! నిజంగా ఆశ్చర్యంగా లేదూ?" అంది.

"ఆహా!" అంటూ అందరూ తలలూపారు.

"ఇంకా ఇట్లాంటివి ఎన్నో ఉన్నాయి" శారదాంబ చెప్పడానికుపక్రమించింది.

"అబ్బా! మనం ఒక్కసారి వెళ్ళివస్తే ఎంత బాగుంటుంది!" విమల పట్టలేక పైకి అనుకుంది.

"దానికేముంది వెళ్ళవచ్చు. నళిని ఎంతో మర్యాదగా మాట్లాడుతుంది. అంత చదువుకున్నానని కాస్తంత గర్వం కూడా లేదు. ఇంకా మనకేమీ లేకపోయినా నీటూ గోటూ జాస్తి" శారదాంబ భావగర్భితంగా కమలను చూస్తూ అంది.

గుళ్ళోంచి ఆ సాయంత్రం వెళ్ళిపోయే ముందు కమల, విమల, అన్నపూర్ణ, శ్యామల మర్నాడెలాగయినా సరే తప్పకుండా నళిని దగ్గరకు వెళ్ళాలని నిర్ణయించుకున్నారు.

మర్నాడు వాళ్ళు వచ్చేసరికి నళిని సోఫాలో కూర్చుని ఏదో ఇంగ్లీష్ నవల చదువుకుంటోంది. వాళ్ళని చూడగానే లేచి ఆప్యాయంగా పలకరించి లోపలకు రమ్మనమని ఆహ్వానించింది. ఎవరు ముందు మాట్లాడాలీ, ఏం మాట్లాడాలి అని సతమతమౌతున్న వాళ్ళకు నళిని ఆ బాధని తొలగించి, తనే ముందు చక్కగా స్నేహంగా మాట్లాడింది. ఒక అరగంట గడిచేసరికి అయిదుగురు ఆప్తమిత్రులు అయినారు. తర్వాత ఎన్నో విషయాలను గురించి మాట్లాడుకున్నారు. నళిని తన ముందు కొన్ని విషయాలు చెప్పింది. తర్వాత వాళ్ళని చెప్పమని తను విన్ది. మూడు గంటలు ఎలా గడిచాయో వాళ్ళకే తెలియదు. నళిని లేచి తను మద్రాసు నుంచీ తెచ్చిన వస్తువులన్నీ చాలా సహజంగా ప్రాణస్నేహితులకు చూపించినట్లు చూపించింది. వాళ్ళు ఇంక వెళతామని లేవబోతుంటే ఒక్క నిముషం ఉండమని ఇంట్లోకి వెళ్ళి షరబత్ గ్లాసుల్లో నింపి తీసుకొచ్చి ఇచ్చింది. మొదట మొహమాట పడ్డా చివరికి నళిని బలవంతం వల్ల నలుగురూ తాగారు. అది తనే తయారు చేశానని చెప్పి వాళ్ళను ఇంకా ఆశ్చర్యపరచింది. వాళ్ళు వెళుతుండగా లేచి వీడ్కోలు ఇస్తూ తప్పకుండా రోజూ వస్తే తనకి వచ్చిన విద్యలన్నీ వాళ్ళకీ నేర్పుతానని వాగ్దానం చేసి, మరునాడు తప్పకుండా వస్తామని వాళ్ళ చేత ఒట్టు వేయించుకుని మరీ వదిలింది.

వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత నళిని చూస్తూ అక్కడే నిలబడిపోయింది. తను మొదట చదువుమానేసిన రోజుల్లో కాలం ఎలా గడపాలో తెలియక తనని తను తిట్టుకుని ఇంట్లో వాళ్ళని మనసులో తిట్టిపోసేది. తన అవస్థంతా కలం స్నేహితురాలు చిత్రకి తెలియజేసుకునేది.

చిత్రకీ, నళినీకి రెండు సంవత్సరాలనుండీ కలం స్నేహం కొనసాగుతోంది. నళిని ఇంటర్ లో చేరిన కొత్తలో విశాఖపట్నం నుంచి ఒక తెలియని అపరిచితురాలి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. అందులో మూడే మూడుముక్కలు ముక్తసరిగా ఉన్నాయి అవి:

"నీ స్నేహాన్ని వాంఛిస్తున్నాను. అంగీకరిస్తావా? అంగీకరిస్తే ఈ క్రింది ఎడ్రస్‌కు వ్రాయి" - అడ్రస్‌లో కుమారి చిత్ర అని ఉంటే పేరు చిత్ర అని తెలుసుకుంది.

"నీ గురించి నాకేమీ తెలియదు. కలం స్నేహం విచిత్రంగా సాగుతున్న ఈరోజుల్లో మగవాళ్ళుకూడా ఆడవారి పేర్లు పెట్టుకుంటున్నారు. పేరును బట్టి స్త్రీయో పురుషుడో నిర్ణయించడం కష్టంగా ఉంది. నువ్వేం చేస్తుంటావో కూడా నాకు తెలియదు. ఇలాంటి పరిస్థితులలో మన స్నేహలత ఎలా ముందుకు ప్రాకుతుంది?" - నళిని అనుమానంగా వ్రాసింది.

దానికి వెంటనే జవాబు వచ్చింది.

"నేనెవర్నయినా నీకు పర్వాలేదు, ఆడపిల్లనైనా, మగపిల్లవాడినైనా నీకొచ్చే ప్రమాదం లేదు. పోనీ కలం స్నేహం బాగా పిచ్చిగా ఉన్న ఈ రోజుల్లో ఒక మూలనున్న ఒక ముసలమ్మకు ఈ ఉత్సాహం పుట్టిందనుకో, మనకి కావల్సిందల్లా నీలో నాలో ఉన్న ఉన్నతాభిప్రాయాలు, ఆశయాలు, అవి కలవటమూను, నిజానికి నీ గురించి నాకేం తెలుసు? నాకేమి తెలియదు. అయినా నీ స్నేహం వాంఛిస్తున్నాను. అంగీకరిస్తున్నాను."

దానికి నళిని వ్రాసిన సమాధానము:

''నన్ను గురించి నీకేమీ తెలియదంటే ఎలా నమ్ముతాను? నన్ను చూడకపోయినా, కనీసం నా గురించి వినైనా ఉంటావు. లేకపోతే నువ్వు నాలో ఉన్నతభావాలున్నాయని ఎలా అంటున్నావు? నీ గురించి నేను కనీసం వినికూడా ఉండలేదు. నీ అడ్రస్‌లో ఎం.బి.బి.యస్. ఫోర్తియర్ అని ఉన్నది కాబట్టి నువ్వు డాక్టరు చదువుతున్నావని అనుకుంటున్నా. మొత్తానికి మూలనున్న ముసలమ్మని మాత్రంగాదు. ఇక తేలవలసింది ఆడపిల్లవా? మొగపిల్లవాడివా? అయినా ఇద్దరు మనుష్యులలో ఉన్నతాభిప్రాయాలున్నంత మాత్రాన వారి స్నేహలత పెనవేసుకుని పూలు కోసి, కాయలు కాస్తుందా?''

''ఈ విధంగా మనకు స్నేహం ఎలా కుదురుతుంది'' అనుకుంటూనే వాళ్ళిద్దరూ ఆప్తమిత్రులయ్యారు. ఈనాటికి కూడా 'చిత్ర' ఆడపిల్లో మగపిల్లవాడో నళినికి తెలియనే తెలియదు. ఉత్తరాల్లో ఎక్కడైనా దొరుకుతుందేమోనని నళిని ప్రతి ఉత్తరం రెండు మూడుసార్లు చాలా నిశితంగా పరీక్ష చేసేది. కానీ ఫలితం దక్కలేదు. విసిగిపోయి చివరికి నళిని కోపంగా ఒకసారి ఇలా వ్రాసింది.

'చిత్రా!

నువు మగపిల్లవాడివయినా, ఆడపిల్లవయినా నాకు బాధలేదు. నాకు కావాల్సిందల్లా నీ స్నేహం. అది మటుకు ఎన్ని అవాంతరాలొచ్చినా మానుకోను. ఏ కారణం చేత నువ్వీ విషయం దాస్తున్నావో నాకర్థం కావటం లేదు. సరే మొత్తానికి నీవు మానవజాతికే సంబధించుతావుకదా? నీ ఇష్టమైనప్పుడే తెలుసుకుంటాను.

నళిని'

దానికి చిత్ర జవాబివ్వలేదు. నళిని తన్ని కాలేజి మాన్పించిన తర్వాత ఇలా వ్రాసింది

'చిత్రా!

నన్నందరూ అన్నివిధాలా నాశనం చేస్తున్నారు. మా బామ్మ ఏడుపులూ, శోకాలు పెట్టి నా చదువు మాన్పించింది. మా బామ్మని మింగాలనంత కోపం వస్తుంది. కానీ ఏం చెయ్యను, కాస్తా కూస్తా మనిషికాదయ్యె! ఏం చెయ్యాలో తోచటం లేదు. బొత్తిగా కాలం గడవటం లేదు. ఇంక నీ ఉత్తరాలే నాకు శరణ్యం.

నీ నళిని.

ఆ విధంగా మొదలయిన వాళ్ళ స్నేహానికి చివరకి ఏ చిన్నవిషయమైనా సరే చిత్రకు తెలియజేసి, చిత్ర తన అభిప్రాయం తెలియచేస్తే గాని నళిని ముందుకు అడుగు వెయ్యనంత వరకు వచ్చింది. జరిగిన ప్రతి సంఘటననూ చిత్రకు ఉత్తరం వ్రాసుకోవడం ప్రస్తుతం నళిని ముఖ్యకార్యాలలో ఒకటి.

కమలా వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత నళిని తీరికగా ఉత్తరం వ్రాయడం మొదలుపెట్టింది.

'చిత్రా!

ఈ పల్లెటూళ్ళో కాలం ఎలా గడుస్తుందిరా భగవంతుడా అనుకున్న నా ఆ సమస్య తీరి, చక్కని మార్గం దొరికింది. నేను అనుకున్నపని సక్రమంగానే నెరవేరింది. నెరవేరటమే కాదు అనుకోని విభిన్న ఫలితాలను కూడా చూశాను. ఈరోజు మధ్యాహ్నం ఈ ఊళ్ళో పిల్లలు వచ్చారు. నిజంగా వాళ్ళెంత మంచివాళ్ళనుకున్నావు! ఉత్త నిష్కల్మ హృదయులు, రోజూ పాపం ఇంట్లో ఏమీ తోచక వాళ్ళ నాయనమ్మలతో చేరతారట. అక్కడ వీళ్ళు మాత్రం వేరే జట్టుగా కూర్చుని ఏ సినిమాను గురించో, లేకపోతే ఊళ్ళో అమ్మలక్కలను గురించో కబుర్లు చెప్పుకుంటారట. వీళ్ళు నలుగురూ సరిగ్గా నా ఈడువాళ్ళే పాపం అవకాశాలు లేకనిజంగా ఈ రోజుల్లో ఎంతమంది పాడయిపోతున్నారో! రోజూ నా దగ్గరకు రమ్మనమని చెప్పాను. ఏదో నాకొచ్చిన సంగీతం, చదువు వాళ్ళకి నేర్పాలని నాకు మహా ఆసక్తిగా ఉంది. వాళ్ళు చాలా మంచివాళ్ళు నాతో చక్కగా కలిసిపోతారు. నిజంగా ఇక నీకు ఉత్తరాలు వ్రాసే టైం కూడా నాకు ఉండదు. నాకిలాంటి ప్రణాళిక తయారుచేసి ఇచ్చి ప్రతి ఉత్తరంలోనూ నన్ను హెచ్చరించి నాలోని ఆసక్తిని మేల్కొలిపినందుకు నీకెలా కృతజ్ఞతలు

తెల్సాలో నాకు తెలియడంలా. నువ్వీసారి వేసంకాలంలో మా ఊరు రాకూడదా? చిత్రా, ఇదంతా చూసి బామ్మ ఇంట్లో చిందులు త్రొక్కుతుంది. ఇవాళ రాజగోపాలస్వామికి పది కొబ్బరికాయలు ఎక్కువ కొట్టింది. నా మెదడులో తొలుస్తున్న పురుగును తొలిగించి వేయమని ప్రార్థిస్తూ అబ్బో! అప్పుడే ఆరుదాటుతోంది. ఇంకా స్నానం చేసి వీణ వాయించుకోవాలి. ప్రతి ఉత్తరంలోనూ వీణ బాగా అభ్యాసం చేయమని రాస్తున్నావెందుకు? నీకు సంగీతం అంటే అంత ఇష్టమా? డాన్సు చెయ్యడానికి ఈ ఇంట్లో ఎక్కువ అవకాశాలు లేవు చిత్రా. డాన్సు చేసుకుంటుంటే ఏమిటా భోగం దాని గంతులూ నువ్వూను అని బామ్మ సాధించిపోస్తుంది. నేనా సాధింపును పడలేను బాబూ. ఆ టైమ్ కూడా సంగీతానికి వినియోగించమంటుంది బామ్మ.

ఇంతకంటే విశాషాలు లేవు.

నళిని'.

దానికి చిత్రనుండి కాస్త ఉపన్యాస ధోరణిలో జవాబు వచ్చింది.

'నళినీ -

వాళ్ళు నువ్వనుకున్నంత మంచివాళ్ళు కాకపోవచ్చు. బహుశ కొత్త మురిపెం కూడా కావచ్చు. కాస్త జాగ్రత్తగా మెలగడమే మంచిది. ఏదయినా నీకు మొత్తానికి కాలక్షేపానికి మంచి అవకాశం. మీ బామ్మని అడిగానని చెప్పు. ఎప్పటికైనా ఆవిడ చల్లని చూపు కూడా పడుతుందని ఆశిస్తున్నాను.

నీ

చిత్ర.

మర్నాడు రెండు గంటలు దాటేసరికి నలుగురూ వచ్చారు. నళిని అత్యంతోత్సాహంతో ఆహ్వానించింది. ఒక టైంటేబులు తయారు చేసుకున్నారు. మొదటి అరగంట చదువు, రెండవ అరగంట సంగీతం, మూడవ అరగంట నాట్యం, నాల్గవ అరగంట ఆటలు. ఆ రోజు వారు వెళ్ళిపోయిన తర్వాత తనలో ఒక విధమైన ఆకర్షణ ఉందని, దానిమూలంగానే వీళ్ళు తన దగ్గరకు వస్తున్నారని అనుకుంది. కానీ నళిని ఈ అభిప్రాయాన్ని త్వరలోనే మార్చుకోవాల్సివచ్చింది.

మొదటి వారం రోజులు నళిని చెప్పింది ఒక్క అక్షరం కూడా తుచ తప్పకుండా చేశారు. తరువాత ఒక రోజున కమల నాకు నాట్యం, ఆటలు వద్దు, ఆ కాలంకూడా చదువుకి ఉపయోగిస్తానంది. నళిని ఎన్నో విధాల చెప్పి చూసింది. కానీ కమల వినలేదు. ఇంకా పైగా, "మా అన్నయ్య నన్నలా చెయ్యమని వ్రాశాడు. అన్నయ్య మాట నాకు కూడా సబబుగానే తోస్తోంది" అన్నది.

"ఏ అన్నయ్య, మహాలావ్ దున్నయ్య" - నళిని కోపం పట్టలేక పైకే కక్కేసింది. ఆ సమయంలో తెలియని కమల అన్నయ్య మీద నళినికి వచ్చిన కోపం అంతా ఇంతా కాదు. ఎన్ని చెప్పినా వినకపోవడంతో ఇంక గత్యంతరం లేక నళిని తనే తగ్గింది.

ఆ తర్వాత మూడో రోజున విమల "నేను ఆ పాడు డాన్సు చెయ్యలేను బాబూ!" అని కూర్చుని ఊరుకుంది.

"ఏం? అంది నళిని - ఈసారి విమల నేమయినా సరే వదలకూడదని.

"అబ్బే ఏం లేదు. నిన్న కాలు కొంచెం నొప్పి పుట్టింది. అయినా నీకు మళ్లే ఆ కాళ్ళూ, కళ్ళు, చేతులు తిప్పడం నాకు చేతకాదు బాబూ! చచ్చే ఆయాసం పుడుతుంది" - విమల తాపీగా ఒక పుస్తకం తీసి చదువుకోవడం మొదలు పెట్టింది.

వచ్చిన కోపం తమాయించుకుని నళిని నెమ్మదిగా చెప్పడం మొదలుపెట్టింది.

"ఇదిగో! నాట్యం చెయ్యడం వల్ల శరీరానికి ఎంత వ్యాయామమో తెలుసా? మగవాళ్ళకు దండాలు, బస్కీలు ఉంటాయి. ఆడవాళ్ళకి ఈ నాట్యం, ఒక విధంగా మన శరీరాన్ని పోషించుకుంటూ, మరో విధంగా కళని పోషించడం జరుగుతుంది. చూడు నేనెంత తేలికగా వెనక్కు వాలతానో! అట్లా మీరిప్పుడు వాలగలరా? ప్రయత్నం చేస్తే ఫలితం దక్కుతుంది."

"నాకసలు ఆ నాట్యమంటేనే మంట. హాయిగా పైరగాలికి, పల్లెటూరి వాతావరణానికి పెరిగిన ఈ శరీరం అలాంటివి భరించలేదు. అది మొదటి నుంచీ రావాలిగాని ఇలా హఠాత్తుగా మొదలుపెడితే అవయవాలు వంగకపోగా, ఎక్కడైనా నొప్పి పుట్టించి, తిరిగి వాటికి సేవచేయించుకుంటాయి. ఇహ నీ మొహమాటానికి ఈ వారం పదిరోజులు చేశానుగాని, అసలు నేను నడవడమే కొంచెం నెమ్మదిగా నడుస్తాను" విమల ఎదురు ఉపన్యాసం ఇచ్చి నిశ్చలంగా చూస్తూ కూర్చుంది.

"అయితే నా మొహమాటం ఇప్పుడు లేదుగాబట్టి నేను చెప్పిన పని చెయ్యనంటావు కదూ?" - నళిని మొహం ఎరుపు రంగుకి తిరిగింది.

"నీ ఇష్టం బాబూ! మిగతావి చెపుతానంటే వస్తాను. లేకపోతే రానే రాను. మా అమ్మ రోజూ అసలే కేకలేస్తోంది బాబూ!" నళిని గత్యంతరం లేక ఊరుకుంది.

"మా అమ్మ కేకలు వేస్తుంది, రోజూ ఇదేనా?" అని శ్యామల మానేసింది.

నళినికి శ్యామలంటే బాగా ఇష్టం. చెప్పింది త్వరగా బుర్రకెక్కించుకునేది. శ్యామలొక్కతే. నళినికి ఏడుపొచ్చినంత పనయింది. అన్నపూర్ణ స్వతః అన్నిట్లో నెమ్మదే. ఇక డాన్సు చేసేవారు లేక ఆ ప్రోగ్రాం ఎత్తేసారు. ఆ అరగంటా ఏవో కబుర్లతో వెళ్ళిపోయేది. కబుర్లు చెప్పడంలో ఉన్నంత ఆసక్తి వీళ్ళకి ఇతర విషయాలలో ఎందుకుండదోనని నళిని అనుకునేది.

ఒకరోజు కబుర్లలో కమల, "వాళ్ళ లక్ష్మి కనిపించడంలేదటగా" అంది.

"అవును, రంగయ్యగారి సుబ్బన్నకూడా కనిపించడంలేదు" విమల అదోమాదిరిగా చూస్తూ అంది.

"అబ్బా! ఏం విచిత్రాలో బాబూ! మరీ పాడుగా తయారవుతోంది లోకం" అంది అన్నపూర్ణ నళినీ వాళ్ళ బామ్మలా వ్యంగ్య కంఠంతో.

నళిని ముందర సన్నసన్నగా చీవాట్లు పెట్టింది.

"అలాంటి విషయాలు విని ఊరుకోవాలిగాని, తర్కించి విమర్శించకూడదు. చేసింది కాస్త తప్పు అయినా ప్రతివాళ్ళు విమర్శలు మొదలుపెడితే అవే పెద్దవై గాలిదుమారమై వాళ్ళమీద విరుచుకుపడుతుంది"

"నలుగురూ ఉన్నాం కాబట్టి అనుకున్నాం. అయితే ఇందులో తప్పేముంది? లేని విషయం మనమేమీ కల్పించడం లేదుగా, అందరూ అనుకుంటున్నదే, ఉన్నవిషయమే" - కమల కాస్త ఎదురు చెప్పింది.

"అది నిజమో అబద్ధమో నీకు పూర్తిగా తెలుసా? ఒకవేళ తెలిసినా అంత వ్యంగ్యంగా మాట్లాడుకోవడం దేనికి? ఒకవేళ నిజమైనా ఏం? లక్ష్మికి సుబ్బన్న పరాయివాడు కాదుగా - స్వంత మేనమామేగా! అలాంటప్పుడు చెప్పుకోవడం దేనికి?" నళిని తీవ్రంగా ప్రశ్నించింది.

"ఓయబ్బో! " విమల మూతి విరిచింది.

"అది సరేగాని ఇంతకీ చిత్ర అబ్బాయా? అమ్మాయా?" కమల ప్రసంగం మార్చినా వ్యంగ్యం కనిపిస్తూనే ఉంది.

దానికి నళిని మాట్లాడలేదు కాని అడగడంలో గల వ్యంగ్యం అర్థంచేసుకున్న నళిని బుగ్గలు కెంపురంగు పులుముకున్నాయి. అది నిజమైతే ఎంత బాగుంటుందో అనుకుంది నళిని. నళిని బుగ్గల మీద ఎరుపు చూసి కమలా, విమలలు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

మర్నాడు అన్నపూర్ణ ఒక్కతే రావడం చూసి 'వాళ్ళేరి?' నళిని చదువుకుంటున్న పుస్తకం అవతలపెట్టి అడిగింది.

"ఏమో నాకు తెలియదు" అని అన్నపూర్ణ ముక్తసరిగా వచ్చినపని చూసుకుని వెళ్ళిపోయింది.

'చిత్రా!

నిజమే, నువ్వన్నట్లు వీళ్ళని అర్థం చేసుకోవడం కష్టం. మనలాంటి వాళ్ళు మనిషిలో మంచిని మాత్రమే చూసి దానితో మటుకే స్నేహం చేస్తారు. వీళ్ళలా కాదు. ఇవాళ హఠాత్తుగా రావడం మానేశారు. రేపు బహుశా అన్నపూర్ణకూడా మానవచ్చు. ఎందుకు మానేస్తున్నారో తెలియడం లేదు. ఇది నాకు తీరని సమస్యగా ఉంది. నీకేమయినా అర్థమయితే వ్రాయి.

ఇట్లు,

తలనొప్పితో ఉన్న

నీ నళిని'

అనుకున్నట్లుగానే అన్నపూర్ణ మానేసింది. కానీ కారణం కబురు పంపింది - తనకి జ్వరం వస్తోందని.

ఇష్టం లేకపోయినా నళిని నమ్మక తప్పలేదు. ఒకరోజున ఉండబట్టలేక నౌకర్ని కమలా వాళ్ళింటికి పంపింది. రాములు తిరిగి వచ్చి నళినితో ఏ సమాధానం చెప్పకుండా తనపని తాను చేసుకోవడం మొదలుపెట్టాడు. బహుశా మర్చిపోయాడేమోనని తనే దొడ్లో గొడ్లని చూస్తున్న వాడి దగరకు వెళ్ళి అడిగింది:

"ఏరా రాములూ, కమల ఏమంది?"

రాములు ముఖం తిప్పుకుని, "రావడానికి ఈలు లేదంటమ్మా, ఇంక ఎప్పుడు ఆరమ్మాయి కోసం వాళ్ళింటికి రావద్దన్నారు" రాములు కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

నళినికిదేం అర్థంకాక, "ఏమిటిరా? అసలు సంగతేమిటి? కళ్ళంబడి నీళ్ళు పెట్టుకుంటావెందుకు?"

"ఏం సెప్పమంటారమ్మా, మీకేమో మాయదారి ప్రపంచం తెలియదు. లోకంలో చాలా కుళ్ళుందమ్మా. ఎట్టాంటి కుళ్ళనుకున్నారు? ఛీ! చూసి ఓర్వలేక..." రాములు ముఖం కోపంతో జేవురించింది. వాడు తొందరతొందరగా అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

నళిని తెల్లబోయింది. ఎంత ఆలోచించినా సంగతేమిటో అర్థంకావడంలేదు. ఒకవేళ ఏమయినా తను కమలని అన్నట్లుగా చెప్పిందా ఇంట్లో? ఛీ కమల స్వభావం అలాంటిదికాదే! పరధ్యానంగా ఇంట్లోకి వచ్చేసింది నళిని.

నాలుగురోజులు పోయిన తర్వాత మధ్యాహ్నం పూట ఏమీ తోచక నిద్రపోయి లేచి మంచినీళ్ళకని ఇంట్లోకి వస్తున్న నళినికి తండ్రి గదిలోంచి మాటలు వినిపించాయి. అందులో తన పేరు వినడం మూలాన నళిని ఆగిపోయింది. లోపల నాన్న, బామ్మ మాట్లాడుకుంటున్నారు.

బామ్మ కాస్త బిగ్గరగానే ఏడుస్తూ "దానికి పెళ్ళి చెయ్యరా అంటే విన్నావూ? ఇప్పుడు చూడు, ఇంక దానికి పెళ్ళవుతుందా?" అంటోంది.

"ఏం అమ్మా! అవకయేం? ఇదిగో పిల్లాడి కోసం చూస్తూనే ఉన్నాంగా! నచ్చిన పిల్లాడు దొరికితే ఈ సంవత్సరం చేసేస్తానని చెపుతున్నాగా"

"అయ్యో ఏం చెయ్యడంరా నాయనా! అప్పుడే ఊరంతా తెలిసిపోతే" - బామ్మ ముక్కు చిరున చీది మళ్ళారాగాలాపన మొదలుపెట్టింది.

"ఏమిటమ్మా అది! సరిగ్గా చెపు" తండ్రి కంఠంలో ఆదుర్దా వినిపిస్తోంది.

"ఏం చెప్పనురా బాబూ! ఏనాడయినా ఉందా? ఆ రాజగోపాలుని దయ మనమీద తప్పిందిరా నాయనా. గుళ్ళో ప్రతివాళ్ళూ అడగడమే..."

''ఏమిటమ్మా అది నువ్వు చెప్పకుండా ఊరికే ఏడిస్తే నాకేం తెలుస్తుంది?''

తండ్రి గర్జనకి నళిని హృదయం గజగజలాడింది - బామ్మ ఏం చెబుతుందోనని.

బామ్మ ఏడుపుని కాస్త ఆపి, ''ఉత్తరాలటరా బాబూ! రోజూ మన నళినికి ఎక్కడినుంచో వస్తున్నాయట. అవేం ఉత్తరాలో మరి భగవంతుడికే తెలియాలి. మనకి తెలియందే ఆ దిక్కుమాలిన వాళ్ళకి ఎలా తెలిసిందో?'' - మళ్ళా శ్రుతి సరిచేసుకుని రాగాలాపనకి ఉపక్రమించబోతుండగా -

''ఉత్తరాలు! ఎక్కడనుంచమ్మా?'' - తండ్రి కంఠం కొంచెం కంపించింది.

''విశాఖపట్నం నుంచిటరా, అన్నీ వాళ్ళకెలా తెలిశాయో మరి?''

''విశాఖపట్నం నుంచే కదా అమ్మయ్య నన్ను కంగారు పెట్టేశావే అమ్మా! విశాఖపట్నం నుంచయితే పర్వాలేదు. ఆ రాజగోపాలుని దయ మనమీద సరిగ్గానే ఉంది. నువ్వేం భయపడనవసరంలేదు. నిశ్చింతగా ఉండు. దాని పెళ్ళి సలక్షణంగానే అవుతుంది'' - నాన్నగారి కంఠంలో తేలిక కనిపించింది.

నళినికి ఒక్కసారి విరగబడి నవ్వాలనిపించింది. కానీ నవ్వలేకపోయింది. అక్కడ నిలబడలేక భారంగా అడుగులు వేసుకుంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది. తన మీద ఇలా ప్రచారం అవుతోందన్నమాట. కమలా వాళ్ళెందకు మానేశారో నళినికి సులభంగా అర్థమయింది. వెంటనే ఆవేశంతో చిత్రకు ఉత్తరం వ్రాయడం మొదలుపెట్టింది.

'చిత్రా!

నువ్వెంత పని చేశావో చూశావా! నేను తలపెట్టిన కార్యం అలా మధ్యలోనే ముగిసిపోవడానికి కారణం తెలియక ఇన్నాళ్ళూ రాత్రింబవళ్ళు తలపగలగొట్టుకుంటున్నా అర్థంకాలేదు. ఇప్పుడు మా బామ్మ పుణ్యమా అని తెలిసింది. దానికి నీ ఉత్తరాలే కారణం. కానీ చిత్రా, ఏ ఉత్తరాలయితే ఈ పని చెయ్యడానికి ఉపయోగించాయో ఆ ఉత్తరాలే ఆ పని మధ్యలో నిల్చిపోవడానికి కారణమైతే చిత్రం కదూ! ఈ వార్త వింటుంటే అందరిలో నిలబడి అసలా ఉత్తరాలే ఈ పని మొదలుపెట్టడానికి కారణమని గొంతు చించుకుని అరవాలనిపిస్తోంది. ఇంత గ్రంథం జరుగుతున్నా చివరికి నువ్వు మగపిల్లవాడివో ఆడపిల్లవో నాకీక్షణం వరకూ నిజంగా తెలియనే తెలియదు. నాకింక పెళ్ళికాదని మా బామ్మ దిగులు పెట్టుకుంది. మా నాన్నగారు నువ్వు ఆడపిల్లవనే అనుకుంటున్నారు. ఆడపిల్లవైతే ఒక్కసారి తప్పకుండా ఇక్కడకు రా! మరి మగపిల్లవాడివైతే - ఏమో చెప్పలేను - వెంటనే ఉత్తరం వ్రాయి. నీ మూలంగా ఇక్కడ నేను అపఖ్యాతి పాలవౌతున్నాను. ఇందులో సగం నువ్వుకూడా పంచుకోవాలి. బాధ్యత గుర్తిస్తే వెంటనే బయలుదేరిరా. ఇంతకంటే నేను ఇప్పుడు వ్రాయలేను. నీలో విశాలభావాలూ, నాయందు ఆత్మీయతా చూపించడానికిదే సమయం.

నీకోసం ఎదురుచూస్తున్న

నీ

నళిని.

దానికి వెంటనే సమాధానం వచ్చింది. నళిని గుండె గుబగుబలాడింది. అనుకోకుండానే ఎందుకో బుగ్గలు మొగ్గలయ్యాయి. ఉత్తరం తీసుకుని గదిలోకి పరుగెత్తి మంచమ్మీద వాలి చదువుకోవడం మొదలు పెట్టింది.

'నా నళినీ!

ప్రతిసారీ 'ప్రియమైన నళినీ' అనే చిత్ర ఈ సారి 'నా నళినీ' అంటోంది అనుకుంటున్నావా? దానికి కారణం నీదగ్గరకు వచ్చినప్పుడు చెపుతాను. జ్ఞాపకముంచుకుని అడుగు. నీతో నేను స్నేహం మొదలుపెట్టే రోజున మన స్నేహం ఇలా నీమీద

విరుచుకుపడుతుందని, దాంతో నీ భవిష్యత్ నాశనమవుతుందని, మీ బామ్మ తారాస్థాయిలో శోకాలు తీస్తుందని కలలో కూడా అనుకోలేదు. కానీ అంతా విధివిలాసం. నీలో కార్యశూరత ఉంది. కాని దాన్ని నీకు నువ్వే మేల్కొలుపుకోలేవు. ఈ శెలవల్లో మీ ఊరు తప్పకుండా వస్తాను. కానీ మీ బామ్మ రానిస్తుందా? అయినా నన్ను చూసిన తర్వాత మీ బామ్మ తప్పకుండా దేవుడికి కనీసం ఒక డజను కొబ్బరికాయలన్నా కొడుతుందని నా నమ్మకం. మరి నువ్వెలా ఉంటావో? - ప్రత్యక్షంగా చూడాలని ఉంది. మీ బామ్మ ముందు రానిచ్చి తర్వాత కొబ్బరికాయలు కొట్టినా పర్వాలేదు. అంతగా అయితే తర్వాత మనిద్దరం కలిసి అంతకు రెట్టింపు కొట్టవచ్చు. అసలు నేనెలాగూ ఈ శెలవుల్లో మీ ఊరు రావాలనుకుంటున్నాను. కాని ఇంకా అనుకోవడంలోనే ఉన్నాను. నీ ఉత్తరం దానికి ఒక స్థిర రూపాన్ని ఇచ్చింది. పరీక్షలు అయిపోతున్నాయి. ముందు మా ఊరు వెళ్ళాలి, అక్కడినుంచి మీ ఊరు. సరే, మిగతా విషయాలు ముఖాముఖిని మాట్లాడుకుందాం. పరీక్షలకు నీ అజ్ఞానుసారం బాగానే చదువుతున్నాను.

ఇంతే,

ఇక చదువుకోవద్దు మరీ?

నీ చిత్ర‘

షరా. నేను వచ్చినప్పుడు రంభలాగా డాన్సు చేసి (మీ బామ్మ చూడకుండా), సరస్వతిలాగా వీణ వాయించాలి (దీనిని మీ బామ్మ చూసేట్లుగానే) - అలాగని ముందర మాట ఇస్తేనే వస్తాను.

చిత్ర

నళిని ఉత్తరాన్ని రెండుమూడుసార్లు చదివి తనలో తాను తర్కించుకుంది. కానీ కొన్ని విషయాలు మగపిల్లవాడని నిరూపిస్తే మరికొన్ని ఆడపిల్లని ఖండితంగా చెపుతున్నాయి.

నళిని దానికి జవాబిలా వ్రాసింది:

‘చిత్రా!

నిన్ను చూడగానే మా బామ్మ తప్పుకుండా కొబ్బరికాయలు కొడుతుంది అంటున్నావు కాబట్టి నువ్వు బహుశా ఆడపిల్లవనే నమ్ముతాను. మగవాళ్ళకింత ఆటపాటలయందు ఆసక్తి ఉండదు. నీకోసం ఎల్లవేళలా మా తలుపులు తెరచే ఉంటాయి. శలవులివ్వగానే మీ ఊరు కూడా వద్దు - సరాసరి మా ఊరు వచ్చేసెయ్. మరీ మరీ అడుగుతున్నాను. వచ్చేముందు ఒక చిన్నఫోటో పంపవూ? తప్పకుండా పంపిస్తావని ఆశిస్తున్నాను.

నీ కోసం ఎదురు చూసే

నీ నళిని‘

మూడోరోజు టపాలో ఉత్తరం, ఫొటో రెండూ వచ్చాయి. కానీ ఫోటో కవరప్ చేసి దానిపైన ‘ఉత్తరం చదివి ఫోటో చూడు‘ అని ఇంగ్లీష్ లో ఉంది. నళిని గబగబా ఉత్తరం తీసింది.

నళినీ,

అసాధ్యమైన కోరికలు కోరుతున్నావు. సరే - ఫోటో పంపుతున్నాను. నీ ఉత్తరాల పోకడ చూస్తుంటే ఏవో చాలా ఆశలు పెట్టుకున్నట్లుగా తోస్తోంది. నీ కోరిక చూస్తుంటే ఈరరానిదిగా ఉంది నన్నన్నివిధాలా బంధించుతున్నావు. ఇది నాకున్న ఒకే ఒక్క ఫోటో. ఈసారి మంచిది పంపుతాను. ఒకసారి మల్లెపూల జడ వేసుకుంటే వెనక నుంచి మామయ్య తీశాడు.

నీ

చిత్ర‘

ఫోటో చూడబ్బుర్లేదనుకుంటూనే తీసేసి చూసింది. నళిని ఆలోచనా శిఖరాల నుండి ఒక్కసారి కిందకి దొర్లిపోయి ఫోటో వంక అలా శూన్యంగా చూస్తూ ఉండిపోయింది. ఫోటోలో ముఖం కనిపించడం లేదు. జడా, పూలు, ఏదో గళ్ళ జాకెట్ కనిపిస్తున్నాయి. అనుకోకుండా నళిని హృదయంలోనుంచి బరువుగా ఒక్క నిట్టూర్పు బయటకు వచ్చింది. అందులోని చిత్రం అంటే తనుకున్న కల్పనాభావం ఆనాటితో కరిగిపోయి నట్లనిపించింది. గుండెల్నెవరో బలవంతంగా నొక్కుతున్నట్లు ఒకవిధమైన బాధ బయలుదేరింది.

'చిత్ర చిత్రంగానే ప్రవర్తించింది. తను ఆడపిల్లన్న సంగతి రెండు సంవత్సరాల క్రితమే తెలియజేస్తే ఎంత బాగుండేది. ఏమీలేకుండానే ఈ ఊళ్ళో తానెంత అపవాదు మోస్తోంది. చిత్ర ఎవరో తెలియక ముందు ఆ అపవాదులో ఒక విధమైన మాధుర్యం ఉండేది. ఇప్పుడది లేదు. నిజంగా చిత్రెవరో తనకు తెలియకుండా ఉంటేనే బాగుండేది. తెలిసినా చిత్ర ఆడపిల్ల కాకపోతే తాను సంతోషించేదేమో. నళినికి ఈ ఊళ్ళో వాళ్ళందరినీ పిలిచి చిత్రని చూపించాలనిపించింది. కానీ వాళ్ళు నమ్ముతారా? తాము అంటున్నాం కాబట్టి ఎవరో అమ్మాయిని తీసుకు వచ్చింది అనుకుంటారు' - చిత్ర మీద మొదటిసారిగా నళినికి అంతులేని కోపం వచ్చింది. కాగితం తీసుకుని గబగబా ఉత్తరం వ్రాయడం మొదలుపెట్టింది.

'చిత్రా!

నీపేరుకు తగ్గట్లు చిత్రంగానే ప్రవర్తించావు. నీ ఫోటో చూచాను. చాలా సంతోషించాను. ఏమీ లేకుండానే, ఎవరి ప్రమేయం సంబంధం నాకు లేకుండానే ఈ ఊళ్ళో నా పేరుకు మసిపూసుకున్నాను. ప్రతి ఉత్తరంలో నువ్వు కావాలని నాలో అనుమానాలని రేకెత్తించి ఉంటావు. నువ్వు మగపిల్లవాడివిగా ఊహించుకునేందుకు నాకు ఎన్నో అవకాశాలను చిత్రించావు. చివరకు నా ఉత్తరం చూసి బహుశా నీలో నువ్వు చిరునవ్వు నవ్వుకుంటావనుకుంటాను. అది నా ఉద్దేశ్యంలో చిరునవ్వుకాదు. పైశాచికపు నవ్వు. చిత్రా ఇది నీకు ఆనందాన్నిస్తోంది కదూ? ఇది మామూలు ఆనందం కాదు. అందులో ఒకవిధమైన రాక్షసత్వం ఉంది. నువ్వు చాలా తెలివిగలదానివని నేను ఒప్పుకుంటున్నాను. లేకపోతే రెండు సంవత్సరాలు నీతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూ నిన్ని తెలుసుకోలేకపోతానా? మగపిల్లవాడివైతే నిన్ను పెళ్ళి చేసుకుని ఊళ్ళో కల్గిన అపవాదును తొలగించుకుందామనుకున్నాను. ఇప్పుడు నాకు మరో పెళ్ళయినా ఇదివరకు ఎవరికో విశాఖపట్నం ఉత్తరాలు వ్రాసేదనేవారు మానతారా? మానరు. ఏమీ లేకుండా నాకు కళంకం కలిగింది. దీనికి నువ్వేం సమాధానం చెపుతావు చిత్రా? నీసాటి ఆడపిల్లను గదూ! ఇలాంటి అవమానం జరిగితే సహజంగా ఆడపిల్ల ఏం చేస్తుందో ఆలోచించగలవా?"

నళిని కన్నీటిబొట్లు ఉత్తరం మీద పడి అక్షరాలను చెరిపివేశాయి. వాటిని ఇంక్‌తో సరిదిద్ది మళ్ళా వ్రాయడం మొదలుపెట్టింది.

"నాది గొప్ప హృదయం కాబట్టి నాతో స్నేహం చేస్తానన్నావు. నీ మూలంగానే నాకు కళంకం కలిగినా నీతో స్నేహం వదులుకోను. ఇంకా హృదయ రహస్యాలు కూడా వ్రాసి నా గొప్పతనాన్ని మరోసారి బుజువు చేసుకుంటాను. కానీ ఈసారయినా సద్వినియోగపరుచుకో.

ఇంతే

నళిని'

చిత్రనుండి వెంటనే జవాబు వచ్చింది.

నా నళినీ,

నామీద అంత ఆగ్రహం వచ్చిందే - నేనేం చేశాను? నేను నీకు మొదటే వ్రాశాను. మనకు లింగాల్లో భేదం ఉండకూడదని. కానీ నువ్వే నా మీద ఆశలు పెట్టుకున్నావు. దానికి నేనేం చెయ్యను? మగపిల్లవాడినైతే పెళ్ళి చేసుకునేదానివా? ఎంత విచిత్రంగా మాట్లాడుతున్నావు. ఎంత ధీమాగా గొప్పతనాన్ని వెళ్ళబోసుకున్నావు. మంచిది, నేను వస్తాను. నన్ను చూసి నా చిరునవ్వు చల్లని వెన్నెల నిస్తుందో పైశాచిక విస్ఫులింగాలు వెదజల్లుతుందో స్వయంగా చూద్దువుగాని. తీవ్రంగా ఆశాభంగం పొందినవాళ్ళెంతర్ధం లేకుండా

మాట్లాడతారో చక్కగా నిరూపించావు. నాకోసం ఎల్లవేళలా మీ తలుపులు మరి ఇప్పుడు కూడా తెరిచి ఉంటాయా? నన్ను క్షమించి ఇంకా నాతో స్నేహం చేస్తున్నందుకు నా కృతజ్ఞత ఎలా తెలపాలో తెలియడంలేదు. శలవులిచ్చారు.

కోపంతో ఉన్నప్పుడు నీ ముఖం చూడాలనే కుతూహలంతో ఉన్న -

నీ

చిత్ర'

వారం రోజుల తర్వాత నళిని ఒకరోజు రాత్రి చిత్రకి ఉత్తరం వ్రాసింది.

'చిత్రా!

ఏకారణం చేత నువ్వు నన్నిలా ఆకర్షిస్తున్నావో నాకు తెలియటం లేదు. మా నాన్నగారు ఓ సంబంధం తీసుకొచ్చారు. అతను కూడా విశాఖపట్నంలో డాక్టరు చదువుతున్నాడు. బహుశా నీకు తెలిసే ఉంటుంది. కాస్త అందమైన విగ్రహమే అనుకోవచ్చు. పేరు రవికుమార్. కమల లేదూ? ఆ అమ్మాయి పినతల్లి కొడుకు. నన్ను చూసి చేసుకుంటానన్నాడు. కట్నం కూడా వద్దట. అంత ఆకర్షణ ఈ ముఖంలో ఏం కనిపించిందో మరి. తాంబూలాలు పుచ్చేసుకున్నారు. నాతో మాట్లాడాలని అవకాశం ఇప్పించమని నాన్నగారిని అడిగాడట. తర్వాత తెలిసింది. నేను రోజూ సాయంత్రం పూట సన్నజాజి పూలకోసం మా తోటలోకి వెళతాను. నిన్నకూడా అలాగే వెళ్ళాను. అక్కడకు వచ్చి అతనుకూడా ఉన్నాడు. నేను వెనక్కి తిరిగి గబగబా వచ్చేయబోతూంటే "మీతో మాట్లాడాలని వచ్చాను. వెళ్ళిపోకండి" అన్నాడు ప్రాధేయపూర్వకంగా. నేనాగిపోయాను. సన్నజాజి పందిరికి నేనీ చివరా, అతనా చివరా నుంచుని ఉన్నాం.

"నన్ను చేసుకోవటం ఇష్టమనే అనుకుంటున్నాను" - అతను సన్నజాజి మొగ్గని మృదువుగా గిల్లుతూ అన్నాడు. నేను మాట్లాడలేదు. నిస్సంకోచంగా అతని వంక చూస్తున్నాను. అసలే నాకు ఈ జన్మలో పెళ్ళికాదని శోకాలు పెడుతున్న మా బామ్మ ఇతనిని చూస్తే రాజగోపాలస్వామికి ఎన్ని కొబ్బరికాయలు కొడుతుందో? అని అంచనా వేస్తుండగా - "చెప్పండి, మరేం ఫర్వాలేదు సందేహించకండి" - లాలిస్తున్నట్లుగా అన్నాడతను. నేనక్కడ నుంచోలేక ఇంట్లోకి పారిపోయి వచ్చాను. ఎందుకు? సిగ్గుపడి కాదు చిత్రా గుండెల్ని పిండే బాధతో. నా వ్యధిత హృదయం అతనికి కనిపిస్తే మరో విధంగా అర్థం చేసుకుంటాడని పారిపోయి వచ్చాను. లోతుల్ని కొలిచే అతని కళ్ళకి అందనిదంటూ ఉండదనిపించింది. నా బాధెందుకో తెలుసా చిత్రా - నీకోసం. అతని అందాన్ని, ధీరత్వాన్ని నాకు ఇంత సన్నిహితంగా ఉన్న నీలో ఆశించాను. కాని అవి నీలో నాకు అందలేదు. పరాయి పురుషుడి రూపంలో అందుతున్నాయి. అందం, ఆనందం దొరికిన చోట మనసు, మమత నాకు లభించలేదు. లగ్నాలు కూడా నిశ్చయించారు. పద్దెనిమిదొవ తారీఖున నా వివాహం జరుగుతుంది. అప్పటికి నీకు శలవులిచ్చి చాలా రోజులవుతుంది. ఈ వివాహానికి తప్పకుండా రా - నీలోని గుణాలు ఎలాంటి వ్యక్తిలో ఆశించావో తెలుసుకుందువుగాని

నీ

నళిని'

వారం తిధి బాగాలేవని మూడురోజుల ముందరే నళిని బామ్మ నళినిని పెళ్ళికూతుర్ని చేయించింది. పెళ్ళి లక్షణంగా కావాలని ముందర ఇంట్లో కూతురు చేత, తర్వాత గుళ్ళోను మొత్తం ఓ 50 కొబ్బరికాయలు రాజగోపాలస్వామికి ముట్టాయి.

నళిని చిత్రకోసం ఎదురు చూస్తుంటే కాస్త ఆలస్యంగా చిత్రనుండి ఉత్తరం మాత్రమే వచ్చింది.

ఇల్లంతా చుట్టాలు, స్నేహితులు అంతా నానా హడావిడిగా ఉంది. కమల మళ్ళా రాకపోకలు సాగించింది. పెళ్ళిపందిట్లో నళిని చిత్ర ఫోటో చూపించి అందరికీ 'ఈ అమ్మాయే విశాఖపట్నం నుంచి ఉత్తరాలు వ్రాసేది' అంది.

అంతకు ముందు నళిని మీద అభాండాలు వేసిన వారందరూ ముఖాలు ప్రక్కకు తిప్పుకున్నారు ఫోటో చూడడానికిష్టంలేక.

కమలకి కొంచెం ఉపన్యాసం ఇవ్వాలనుకుంది నళిని. కానీ తీరా చూస్తే కమల అక్కడ కనిపించలేదు. ఇంతలో చిత్రనుండి ఉత్తరం వచ్చింది. తన గదిలోకి పోయి నళిని చదువుకోసాగింది.

ప్రియాతిప్రియమైన నా నళినీ,

బహుశా నీకిది నా ఆఖరి ఉత్తరం అనుకుంటాను. నీ పెళ్ళికి బహుశా రావటంకానీ సాధ్యమైనంతవరకూ రావటానికి ప్రయత్నం చేస్తాను. ఇప్పుడు సరాసరి మా ఊరు వెళ్ళిపోతున్నాను. ప్రస్తుతపు పరిస్థితులలో నా ఎడ్రస్ నీకివ్వలేదు. అందుకు క్షమిస్తావనే ఆశిస్తాను. తిరిగి తొందర్లో నా అడ్రస్ ఇస్తూ ఉత్తరం వ్రాస్తాను. రవిని గురించి విన్నాను గానీ చూడలేదు. అందగాడని నా స్నేహితులంటే విన్నాను. కానీ నీకు భర్తగా లభించుతున్న అతని అదృష్టం మటుకు సాటిలేనిదని నా అభిప్రాయం. నాకు మెయిల్‌కి టైమవుతోంది. మీ కాబోయే నూతన దంపతులకు నా హృదయపూర్వక అభినందనలు.

నీ

చిత్ర.

ఉత్తరాన్ని గురించి ఎక్కువగా ఆలోచించడానికి నళిని టైమ్ లేకపోయింది.

వాళ్ళ బామ్మ కొట్టిన కొబ్బరికాయల ఫలితంగాని లేక ముహూర్తబలంగాని నళిని పెళ్ళి లక్షణంగా అనుకున్న ముహూర్తానికి ముచ్చటగా, వేడుకలతో ముగిసింది.

ఎంత సంతోషంలో ఉన్నా నళినికి ఒక చెవి, ఒక కన్ను పరధ్యాసగానే ఉన్నాయి. కాని చిత్ర రాలేదు సరికదా మళ్ళా ఉత్తరం కూడా వ్రాయలేదు. క్రమంగా రోజులు నెలలు కూడా దొర్లిపోయినాయి. నళిని రవికిదేమీ చెప్పలేదు. కానీ ఒకరోజు మటుకు అడిగింది - ఊళ్ళోవాళ్ళు తనమీద ఏమీ చెప్పలేదాని. రవి ఈ ప్రశ్నకు జవాబివ్వకుండా వెళ్ళిపోయాడు. నళినికి బాధ కలిగింది. ఎందుకు చెప్పరు? చెప్పినా లెక్కచేయకుండా తన్ని పెళ్ళి చేసుకున్నాడన్నమాట. నళినికి కృతజ్ఞతాభావంతో కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఒకరోజు నళిని పట్టలేక రవిని అడిగింది 'చిత్ర అనే అమ్మాయిని గురించి తెలుసునా?' అని.

"అమ్మాయిల్ని గురించి తెలియదు గానీ, అబ్బాయిల్లోనే చిత్ర అనే పెన్‌నేమ్‌గల వాడొకడున్నాడు' అన్నాడు రవి సహజంగా.

నళిని ఆకాశాన్నుంచి క్రిందపడినట్లనిపించింది. ఇంతలో కమల అక్కడకి రావడంతో భార్యాభర్తలు సంభాషణ ఆపేశారు.

కమల కాపురానికి వెళుతూ త్రోవలో అన్నగారి దగ్గర దిగింది. మళ్ళా వెళ్ళిపోవడానికి ప్రయత్నాలు జరుకుతున్నాయి.

రవి కమలకి మంచి చీరా జాకెట్ తెచ్చాడు. కమల భర్తకు గడియారం కొనుక్కోమని డబ్బిచ్చాడు. భర్త ఉదారత్వానికి నళిని మురిసిపోయింది.

వెళ్ళబోతూ కమల హఠాత్తుగా నళిని పాదాలమీద వ్రాలి "వదినా నన్ను క్షమించు. తెలియక నిన్ను గురించి అమ్మా వాళ్ళతోబాటు నేనుకూడా వాగాను" అంది.

నళిని ముఖం జేవురించింది.

వెనకాల రవి వచ్చి నిలబడిన సంగతి ఇద్దరూ చూడలేదు.

"నిన్నని లాభం లేదు కమలా. ఇది కేవలం నా దురదృష్టం. అయితే అది మీ అన్నయ్యకు కూడా తెలుసా?"

కమల తెలుసునన్నట్లు తలూపింది.

నళిని భారంగా నిట్టూర్పు విడిచి, "ఇందులో ఏమీ లేదని చెప్పినా ఆయన నమ్మరేమో బహుశా. ఆవాళ నీకు చూపించానా చిత్రఫోటో?" అని అడిగింది.

కమల చూపించలేదన్నట్లుగా తలూపింది.

''రా అయితే చూపిస్తాను. నా పెళ్ళికాక ముందు ఒక ఉత్తరం వ్రాసింది. మళ్ళా ఉత్తరం కూడా వ్రాయలేదు. బహుశా పెళ్ళయిందికదాని మానేశాడేమో?'' నళిని తనకు తానే ఉలిక్కిపడి కమల ముఖంలోకి చూసింది.

కమల ఇది గ్రహించే పరిస్థితులలో లేదు. తన చీర ఖరీదు ఎంతుందో అంచనా వేసుకుంటోంది.

''నాకు తొందరలో చావుకలిగితే చాలా బాగుంటుంది'' - నళిని శూన్యంలోకి చూస్తూ అంది.

''నళినీ!'' వెనకనుంచీ బిగ్గరగా రవి కేక పెట్టాడు.

చీర ఖరీదు లెక్క వేస్తున్న కమల, శూన్యంలోకి చూస్తున్న నళిని ఉలిక్కిపడి వెనక్కు తిరిగారు.

రవి చేతులు చాచి నళినిని పట్టుకున్నాడు.

ఏడుస్తూ, నళిని తన ముఖాన్ని అతని వక్షస్థలం మీద తలదాచుకుంది.

''నా ముందే ఇలాంటి మాటలు మాట్లాడతున్నావా? నీమీద నాకేమీ అనుమానం లేదు నళినీ. నిన్ను హృదయపూర్వకంగా నమ్ముతున్నాను. చిత్ర మగవాడని తెలిసినా కూడా నన్ను బాధించడంలేదు. ఇంకొైగా ఆ సంఘటన తలుచుకున్నప్పుడల్లా నా మనసు పరవశత్వంతో ఊగిపోతోంది. నీకు చిత్ర ఒకటి, నేను ఒకటికాదు. చిత్రని గురించి నువ్వేమీ చెప్పకపోయినా నాకంతా తెలుసు. నా ఆనందాన్ని నీకెలా తెలియజెయ్యాలో తోచడంలేదు'' - అతని కళ్ళలో ఆనందాశ్రువులు నిలిచాయి.

కమల అక్కడ్ననుంచి తప్పుకుని వెళ్ళిపోయింది.

అతని ఉదారహృదయాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలో నళినికి తెలియలేదు.

కమలా వాళ్ళు వెళ్ళిపోయాక ఒక రోజున సాయంత్రం రవి ఇంట్లో లేని సమయంలో నళిని ఏమీ తోచక అతని లైబ్రరీ రూములోకి వెళ్ళింది. నళిని సాధారణంగా అక్కడికి వెళ్ళదు. తనకు కావాల్సిన పుస్తకాలు రవే ఇవతలకు తీసుకొచ్చి ఇస్తాడు. పుస్తకాలని ఎవరిని పడితే వాళ్ళని ముట్టుకోనివ్వడు. నళిని ఈ నిబంధనకు తనుకూడా తలొగ్గింది. ఇవాళ తప్పనిసరికి వెళ్ళింది. రవి తొందర తొందరగా బట్టలు మార్చుకుని వెళ్ళాడులా ఉంది. విడిచిన బట్టలు సోఫాలో గిరాటు కొట్టి ఉన్నాయి. నళిని ఆ బట్టలు తీసి మూలనున్న బుట్టలో వేయబోతూ అలవాటు చొప్పున జేబులు చూసింది ఏమయినా ఉన్నాయేమోనని, చొక్కా జేబులో తాళం చెవులగుత్తి, చిల్లర డబ్బులు, జేబురుమాలు, మరో చిన్న తాళం చెవీ ఉన్నాయి. ఆ చిన్న తాళం చెవిని గురించి ఎన్నిసార్లడిగినా, అతను చెప్పలేదు.నవ్వుతూనే తోసేస్తున్నాడు. నళినికి అనుమానం వేసి తిన్నగా ప్రక్కకు తిరిగి అతని రూంలోకి వెళ్ళింది.

అక్కడ స్టాండుకు బట్టలు, డ్రాయరు, కుర్చీ తప్ప ఏమీ లేవు. నళిని కాస్త కష్టపడి డ్రాయర్ని తెరిచింది. అందులో ముందరగా అతని డైరీ కనిపించింది. అందులో ఒకచోట నళిని దృష్టి ఆగిపోయింది. అందులో -

''నేనే చిత్రనని నళినికెలా తెలియబర్చాలో తెలియడం లేదు''

క్షణం సేపు నళిని కళ్ళు బయర్లు కమ్మాయి. తిరిగి మళ్ళా చూసింది. అసలు శబ్దాలకు అర్థం లేదనిపించింది. డైరీని ఇవతలకు లాగి ఇంకా ఏమున్నాయోనని చూసింది. ఎత్తు చాలా తక్కువగా ఉండి ఒక సన్నని పొడుగాటి పెట్టె ఉంది. దానిని ఎలా తెరవాలో నళినికి తెలియలేదు. తర్వాత ఆకుపచ్చగా బైండ్ చేసిన ఒక పుస్తకం కనిపించింది. దానిలోపల పేజీ మీద ''రవికుమార్'' అని అందంగా పెయింట్ చెయ్యబడి క్రింద 'పెట్ నేమ్ చిత్ర' అని గోల్డెన్ రంగుతో పెయింట్ చేయబడి ఉంది.

నళిని యంత్రంలాగ పేజీ తిప్పింది. గుండె చలించడం మర్చిపోయిం ది. తను మొదట చిత్రకి వ్రాసిన ఉత్తరం అందులో జాగ్రత్తగా పిన్ చేయబడి ఉంది.

ఇంతలో వెనుక నుంచి 'హచ్' అని తుమ్ము వినిపించింది.

నళిని ఉలిక్కిపడి వెనక్కు తిరిగి చూసింది.

రవి నించుని ఉన్నాడు. అతని కళ్ళు ఒక విధమైన కాంతితో మెరుస్తున్నాయి. దగ్గరకు వచ్చి కందగడ్డలాగ అయిన నళిని ముఖం చూసి ఎందుకలా సిగ్గుపడతావ్? దొంగతనం పట్టుకోబోయె దొంగనయ్యానా? నా బరువుని దించావు. రాత్రింబవళ్ళు నీకి ఈ విషయం ఏ విధంగా చెప్పటమా అని సందేహిస్తున్నావ్ నాకు విశ్రాంతి ఇచ్చావు పోనీలే కాసిని మంచినీళ్ళు తెచ్చిపెట్టు" అన్నాడు.

నళిని ఇంక అక్కడుంటే నోరు మెదపడని సంబాళించుకోవడానికి కాస్త ప్రక్కకు వెళితే బాగుంటుందని మంచినీళ్ళు కావాలన్నాడు. రవి అనుకున్నట్లే అయింది. నళిని తన్ని తాను పూర్తిగా సబాళించుకుని వచ్చింది. మంచినీళ్ళు అందిస్తూ, 'ఇంత నాటకం ఆడగల సమర్థులనుకోలేదు' అంది.

'అవును ఎలా అనుకుంటావు? నీ చూపంతా చిత్రమీదే ఉంటే? సరేగానీ నీ దగ్గర ఉన్న ఆ ఉత్తరాలు కూడా ఇటు ఇవ్వు రెండూ కలిపి బైండు చేయింది పేరు పెడదాం' అన్నాడు.

'గొప్పే,పాపం కష్టపడిపోతారు' - నళినికి కాస్త ధైర్యం వచ్చింది.

'గొప్పకాదూ మరి. నీతో ఇంత నాటకమాడడం ఎవరికి చాతనవుతుంది. పెళ్ళిలోనే చెపుదామనుకున్నాను. కానీ నువ్వు చెప్పనిస్తేనా?" అని రవి నవ్వుతూ అన్నాడు.

నళినికి ఉత్తరంలో మాటలు జ్ఞాపకం వచ్చాయి.

"నన్ను చూచి నిర్ణయించుదువుగాని నా నవ్వు వెన్నెలలు వెదజల్లుతుందో లేక పైశాచికపు విస్ఫులింగాలు రాలుతాయో?" - ఎంత ధీమాగా రాసుకున్నాడో.

"మరి నాకు మీరు పంపిన ఫోటో..." సందేహం దాచుకోలేకపోయిందినళిని.

"అది మా కమలది. దానికి చూపించలేదుగా, అందుకని రంగం బయటపడలా. ఒకసారి నేనే ఆ ఫోటో తీసాను. తరువాత అది పంపటానికి వీలులేక నా దగ్గరే ఉండిపోయింది. ముందర నిన్ను ఏడిపించి తర్వాత నా ఫోటో పంపుదామనుకున్నాను. కాని పరిస్థితి విషమించడం వల్ల నోరు మూసుకుని ఊరుకున్నాను. నేనే నీ వాడనవుతున్నప్పుడు ఇంకా ఫోటో ఎందుకని సరిపెట్టుకున్నాను. ఆవాళ మీ తోటలో చెప్పాలని ప్రయత్నం చేశాను. కాని నువ్వు చెప్పనివ్వలేదు."

"ఎంత గొప్పవారండి" - నళిని హృదయకుహరం నుండి ఒక నిట్టూర్పు బయటకు వచ్చింది.

"నేనేం గొప్పవాడిని. నువ్వుగాని. సర్లే నా ఉత్తరాలిటియ్యి -" రవి ఎత్తిపొడుపుగా అన్నాడు నళిని పెదవుల మీద చిరునవ్వు కదిలింది.

"ఏం పేరు పెడతారు?"

"నువ్వు చెప్పు మరి" - రవి నళిని కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

"ఏమో నాకు తెలియదు" - నళిని అక్కడ నుంచి పారిపోబోయింది.

"ఆగాగు!" రవి నళిని జడ పుచ్చుకుని - "చిత్రనళినీయం తెలుసా?" అన్నాడు.

మనసులో తెరలు వీడిపోయినట్లయి ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు.

మీ పేరేమిటి?

- గురజాడ అప్పారావు

(రచనా కాలం 1910)

గురజాడ అప్పారావు గారు తన మొదటి కథ 'దిద్దుబాటు' వ్రాసిన సంవత్సరం 1910 లోనే వ్రాసిన రెండోకథ ఇది. వందేళ్ళ క్రిందటే అప్పారావు గారు చాటి చెప్పిన అభ్యుదయభావాలూ, మత సామరస్యత మాత్రమే కాక వందేళ్ళ క్రిందటి అందమైన తెలుగు భాషా నుడికారానికి కూడా ఈ కథ చక్కటి నిదర్శనం. గత వందేళ్ళ లోనూ ఇదే కథా వస్తువుని వందలాది మంది రచయితలు కొన్ని వందల సార్లు మళ్ళీ మళ్ళీ చెప్పారు. ఐనా వందేళ్ళ క్రిందటి ఈ కథ ఇప్పటికీ మెరుగు తగ్గని బంగారం..!

దేవుడు చేసిన మనుషుల్లారా!

మనుషులు చేసిన దేవుళ్ళారా! మీ పేరేమిటి?

పురాణములను గురించి మేము శంకలు వేస్తే, మా గురువుగారు 'వెధవ చదువు! మీ మతులు పోతున్నాయి. మీరు ఒట్టి బౌద్ధులు' అనేవారు.

'బౌద్ధులు ఎటువంటి వారు శాస్త్రులుగారూ!?' అని రామ్మూర్తి అడిగాడు. రామ్మూర్తి శత పెంకె.

'రేపు ఆదివారం నాడు పువ్వుల తోటలో ఉపన్యాసం ఇస్తాను. అంతా రండి' అని శాస్త్రులుగారు శలవిచ్చారు.

ఆదివారం మధ్యాహ్నం నాలుగు గంటలప్పుడు పువ్వుల తోటలో ఒక పరువు మావిడి చెట్టు కింద ఇసకలో మేవఁంతా పాతికమంది కూచున్నాం. మధ్య గావంచా పరుచుకుని, మాకు అభిముఖంగా శాస్త్రులుగారు కూచున్నారు. నేను బల్ల చెక్క తెచ్చి వెయ్యబోతే 'ఒద్దురా, మీరంతా కింద కూచుంటే నేను బల్లమీద కూచుంటానా!' అన్నారు. రెండు కొబ్బరికాయల నీళ్ళు తాగి, తాంబూలము వేస్తూ శాస్త్రులుగారు బౌద్ధమతం విషయమై ఉపన్యాసం ఉపక్రమించారు. పదినిమిషములు అయ్యేసరికి, రామ్మూర్తి తన చేతనున్న పుస్తకం విప్పి చూచి, 'శాస్త్రులు గారూ, తాము శలవిస్తున్నదంతా సర్వదర్శన సంగ్రహములోనిది కాదండి' అని అడిగాడు. ఆశ్చర్యపడి శాస్త్రులుగారు, 'ఔరా! నీకెలా తెలిసెనురా! అదేం తర్జుమా కాదు గద?' అన్నారు.

'ఔనండి.'

'ఈ ఇంగిలీషు వాడు ఉద్దండ పిండమ్మా! ఆ రెండో పుస్తకమేమిటో?'

'బుద్ధ చరిత్రండి.'

'ఎక్కడ సంపాదిస్తారా ఈ అపూర్వ గ్రంధాలు, ఏదీ తే'

శాస్త్రులుగారు పుస్తకం అందుకుని, అతి మధురమైన కంఠంతో చదివి, అర్ధం చెప్పడం ప్రారంభించారు.

నాలుగు రోజులు పోయిన తరువాత, శాస్త్రులుగారు క్లాసులో ఇలా శలవిచ్చారు. 'ఒరే ఈ పుస్తకం చదివిందాకా బుద్దుడి మహిమ నాకు తెలియలేదురా. తప్పకుండా ఈ మహానుభావుడు శ్రీ మహావిష్ణు అవతారఁవేనా'

ఆనాటి నుంచీ శాస్త్రులుగారు మమ్మల్ని బౌద్దులని దూషించడం మానేశారు. కిరస్తానులమై మట్టుకు అంటూ వచ్చారు. క్రీస్తును, శ్రీ మహావిష్ణువు యొక్క పదకొండవ అవతారంగా చేయడానికి సాధ్యంకాక ఒడంబడి ఊరుకున్నాం.

మా గురువుగారి వంటి గురువులు లోకంలో లేరు. చిరకాలం కాశీవాసం చేసి తర్కశాస్త్రం చదువుకున్నారు. మన దేశంలో అంగ్ల తార్కికుడు లేడని ప్రతీతి, శాస్త్రం మాటకేంగానీ, కావ్యాల్లో మంచి రసగ్రాహి, మరి సుగుణ సంపత్తికో అంటే, సత్యకాలపు మనిషి అన్నప్పుడు ఆయన సత్యకాలం మనిషి. అంత పాండిత్యం యింత సత్యకాలం ఒక్క బుట్టలో యెలా యిమిడి వున్నాయో, ఆశ్చర్యం?

ఈ జరిగినది పది సంవత్సరముల కిందటి మాట. ఇప్పుడు శాస్త్రులుగారు ఫించను పుచ్చుకున్నారు. మాలాంటి శిష్యుల శుశ్రూష పొందుతూ, మాకు సంస్కృత గ్రంధాలు చెపుతూ, సంతోషిస్తూ, సంతోష పెడుతూ, కాలం వెళ్ళబుచ్చుతున్నారు.

నేను వర్తకం చేస్తున్నాను. రామ్మూర్తికి భూములు లావుగా ఉన్నాయి. కొత్త కొత్త మోస్తర్లను వ్యవసాయం చేస్తున్నాడు. పూట గెడ్డ దరిని సీతారామ కోరుతున్న (?) ఒక బ్రహ్మాండమైన తోట వేశాడు. అవి పువ్వులు కావు. తొలి ఫలాలు గురువు గారు ఆరగించనిదీ రామ్మూర్తి చెట్టు ముట్టడు. ఆ తోటలో విహరించడం గురువుగారికి అత్యానందం. అక్కడనే మేం తరచు మీటింగులు చేస్తూ ఉంటాం. వెంకయ్య స్కూలులో మేష్టరు. ఖాయదా లావు చేసి, తిట్లు తింటూ ఉంటాడు. మా స్కూలు జట్టులో ఆరేడుగురం ఇక్కడనే ఉన్నాం. గురువుగారూ మేమూ కలిసినప్పుడల్లా స్వర్గ ఖండం ఒకటి అక్కడికి దిగినట్లు ఉంటుంది

ఇక ప్రస్తుత కథ

మా పట్నానికి ఎనిమిది మైళ్ళ దూరంలో రామగిరి అని ఒక విష్ణుక్షేత్రం కలదు. దాని వర్ణన మరి ఒక మాటు చేస్తాను, ఇప్పటి మట్టుకు మీకు తెలియవలసినదేమంటే - అక్కడి విష్ణుక్షేత్రం ఆధునికం. ఆ ఊరి నల్లకొండలనంతటను శిధిలమైన బౌద్ధ కట్టడములు కలవు. అక్కడివారు వాటిని పాండవుల పంచలంటారు. ఈ దేశంలో పాండవులు ఉండని గుహలూ, సీతమ్మవారు స్నానమాడని గుంటలూ లేవు.

ఒక పెద్ద గుహలో నున్న బౌద్ధ విగ్రహమును శివుడని, దాని పక్కనున్న దేవీ విగ్రహమును గౌరి అని భావించి జంగాలు పూజ చేస్తున్నారు.

ఉండగా, ఉండగా, కొన్నాళ్ళకి, ఒక దొర, గుమాస్తాలతోను, బిళ్ళ బంట్రోతులతోను వచ్చి, మెట్టల పడమట నున్న ముదర మామిడి తోటలో కాంపు ఖణాయించాడు. మరిన్ని వందల కొలది కూలీలను కూర్చి ఆ కొండల మధ్యనున్న దిబ్బలు తవ్వించడం ఆరంభించాడు. ధనం కోసం తవ్వుతున్నాడని అక్కడి వాళ్ళంతా అనుకున్నారు. కాని, విరిగిన ప్రతిమలూ, జిలుగు చెక్కిన రాళ్ళూ, పాతుకుపోయిన పాత కుండలూ, మండలూ బళ్ళమీద పెరికి ధనం కంటెనూ ఎక్కువ భద్రంగా ఏర్చి పేర్చాడు. ఇవి చూచుటకే మేం వెళ్ళాం.

మేం ఆ ఊరు వెళ్ళే సరికి జంగాలు పూజ చేసే పాలరాతి బుద్ధ ప్రతిమ గూర్చి ఊరంతా కోలాహలంగా ఉండెను. ఆ బొమ్మ మేం చూశాం. బుహు సొగసైనది. ఇంత తీరైన చిత్రం గాంధార దేశం వైపు తప్ప మరెక్కడా చూడలేదని దొర మాతో చెప్పారు. దాని పీఠం మీద 'హే ధర్మా హేతు ప్రభవా' ఇత్యాది బౌద్ధ సిద్ధాంతము సొంపుగా వ్రాయబడి యున్నది. దొరగారు దానిమీద కన్నువేసి 'ఇస్తారా?' అని అడగగా, శైవులలో పెద్దలు 'ప్రాణములయినా యిత్తుము గాని దానిని యివ్వజాలము' అనిరి. దొరగారు నలుగురితో సాయిలా పాయిలాగా తిరిగేవారు గనుక మర్యాదగా జవాబు చెప్పారు. మరొకరైతే కథ చాలా దూరం వెళ్ళి ఉండును. దొరగారు అంతటితో ఆ ప్రయత్నం మానుకున్నారు.

ఇలా ఉండగా ఒకనాటి రాత్రి పూజ చేసే జంగం శరభయ్య ఆ ప్రతిమను పెగిల్చి, కొనిపోయి దొరగారికి రెండూ వందలకి అమ్మజూపాడు. దొంగతనంగా తెస్తివని పుచ్చుకోజాలను అని, దొర తనకు మాట రాకుండా ఉండగలందుకు ఊరి పెద్దలకు కబురు పెట్టాడు. ఏమిటీ, ఈ దొర బుద్ధి తక్కువా అని శరభయ్య కొంత ఆశ్చర్యపడి, దొర కొంచెం కనుచాటు కాగానే, మెట్టలవైపు పరుగుచ్చుకున్నాడు. నాటికీ నేటికీ మరి పికరు లేదు.

శాయన్న భుక్త గారి ఇంట బస చేసి ఆ ఊళ్ళో మేం మూడురోజులు ఉన్నాం. శాయన్న భుక్త మా గురువుగారి దగ్గర కొన్నాళ్ళు తర్కం చదువుకున్నాడు. మంచి సాహిత్యం కద్దు. కొంచెం కవిత్వం కూడా అల్లుతాడు.

మూడోనాడు రాత్రి భోజనం చేసుకుని డాబా మీద నలుగురం కూచున్నాం. చిన్న గాలి రేగి తోటలో కొబ్బరి మట్టలు అల్లాడడం ఆరంభించాయి. ఎదుట దేవుడి కొండ బ్రహ్మాండమైన మహాలింగము వలె చీకటిని చీల్చుకుని మిన్నుముట్టి మనిషి యొక్క అత్యల్పతను సూచించుచు, ఏదో చెప్పరాని చింతను భీతిని మనస్సులకు కలుగ జేయుచుండెను. దేవతలు పూజ చేసిన దివ్య కుసుమముల వలె చుక్కలు శిఖరము చుట్టు చెదిరి వెలిగెను. మా మనస్సులు గత కాలము నాటి స్థితిగతులను గూర్చిన ఊహలతో నిండియుండెను. తలపోసి తలపోసి ఆనాడు ఈ స్థలం ఎలా ఉండెనో బౌద్ధులు ఏమి ఏమి చేసేవారో అని నేనంటిని.

"ఆ పీనుగులు మనలాగే ఏడుస్తూ ఉండేవారు. మనకంటే అద్ధ్వానంగా ఉండేవారు" అని సున్నితమైన తలంపులు బెదిరి చెదిరే పెళుసు గొంతుకతో వెంకయ్య అరిచాడు. నాకు కళ్ళ మొయా కోపం వచ్చి 'నీ అమూల్యమైన ఊహలతో నువ్వు ఆనందించరాదా, నా తలలో నే కల్పించుకున్న బౌద్ధ ప్రపంచము పెటుకు మాటలాడి ఏల కలత పరిచెదవు' అని అడిగాను.

'గాని' శాస్త్రులుగారు అన్నారు. 'బుద్ధుడు విష్ణ్వవతారం కదా ఈ జంగాలు శివుడని ఏల పూజ చేస్తున్నారా?' అని శంక వేశారు.

శాయన భుక్త పొడుం డబ్బీ తీసి, పెద్ద పట్టు పీల్చి, గావంచాతో ముక్కు తుడుచుకుని 'ఒక కథ ఉంది' అన్నాడు. కథంటే శాస్త్రులుగారికి సరదా. 'అయితే చెప్పు' అనారు. చెవి నొగ్గి విన్నాం. ఇదీ కథ.

ఈ గ్రామంలో శైవ వైష్ణవ మతాలకు వైరం చిరకాలం నుంచి కద్దు. శివమతానికి మొనగాడు జంగం శరభయ్య అనగా ఇప్పుడు పారిపోయిన పూజారే. మొన్న ప్రతిమను పెరికి పలాయనం అయిందాకా అతగాడు సాక్షాత్తూ నందికేశ్వరుడి అవతారమని రాత్రులు గృహయెదుట వృషభ రూపమైఁ మేస్తూ ఉంటుందని ఇక్కడి జంగాలకూ, దేవాంగులకూ నమ్మకం. ఇపుడైనా ఆ దొర కిందటి జన్మలో పరమ మహేశ్వరుడౌటచేత ఆ విగ్రహమును కోరినవాడనీ, భక్తవాత్సల్యం చేత శివుడిచ్చిన శలవులను అనుసరించే శరభయ విగ్రహాన్ని పెరుక్కు వెళ్ళాడనీ డేరా నుంచి పారిపోవడంతో వృషభ రూపం ధరించి రంకె వేసి మరీ దాటేశాడనిన్నీ ఒక వార్త అప్పుడే అతని శిష్యులు పుట్టించారు. రేపో నేడో వీరాననం వేసుకుని బక ధ్యానం చేస్తూ కొండమీదనో, గోపురము మీదనో ఆవిర్భవిస్తాడు. బాజా భజంత్రీలతో వెళ్ళి ఉల్లభంబట్టి తోడ్కుకు వస్తారు. ఆపైని కంసాలి వీరయ (వీరణాచారి అని పిలిస్తేనేగానీ కోపగిస్తాడు) ఆ కథకు చిలువలూ పలువలూ కల్పించి ద్విపద కావ్యం రచించి అచ్చు వేస్తాడు ఆ ఉభయుల కీర్తి దిగ్దంతులకు వెళ్ల వేస్తుంది.

'ఔరా వీళ్ళ మూఢ భక్తి! ఈ ప్రపత్తి పండితులకు ఉండదురా, వీళ్ళది ఏమి అదృష్టం' అని గురువుగారు అన్నారు. ఆ పైని వెంకయ్య ఏమో అనబోతే చేతితో నోరు అడ్డాను. ఎవరి అభిప్రాయం వారు చెప్పకుండా నీ శాసనం ఏమిటి అని అడిగాడు. మాటాడవద్దని చై సొజ్ఞ చేశాను. శాయన్న భుక్త తిరిగి ఎత్తుబడి చేశారు.

'అవును, తాము శెలవిచ్చినట్లు పామరులకు ఉండే గాఢ భక్తి పండితులకు ఉండదుగాని ఈ మూడభక్తి ఒకప్పుడు ప్రాణాంతం తెస్తుంది. అదే చెప్పబోవుచున్నాను వినండి.'

'నేనూ ఆ మాటే చెప్పబోతే చెప్పనిచ్చాడు కాడు' అని వెంకయ్య అన్నాడు. 'అవును నీకంటూ తెలియని సంగతి లేదు మరి ఊరుకో' అన్నాను.

శివ స్థలం యొక ఉత్పత్తి మీకు తెలియనే తెలుసును. పూజారి శరభయ్య చాలా కథకుడౌటచేతను, వీడి రోజుల్లో శివ స్థలానికి మిక్కిలిగా వైభవం కలిగింది. చుట్టుపట్ల గ్రామాల వాళ్ళందరూ మొక్కుబళ్ళు చెల్లిస్తారు. ఉత్సపు రోజులలో పెద్ద జాతర్లు సాగుతాయి. మరిన్నీ ఇక్కడ దేవాంగులు కలిగిన వాళ్ళు జంగంపాడు యావత్తున్నూ, దేవర పేటానున్నూ శరభయ్య మాట మీద నడుస్తారు. ఈ గ్రామంలో ఉండే విష్ణుస్థలం రెండు వందల ఏళ్ళ కిందట ఈ దేశం ఏలే ఒక మహారాజు కట్టించి రాగభోగాలకు ఒక గ్రామం స్వామికి సమర్పణ చేశారు. అప్పటి నుంచి రంగాచార్యులు గారి కుటుంబస్థులే ఈ స్థలానికి ధర్మకర్తలై ఉంటూ వచ్చారు. ఈయన ఇద్దరు ముగ్గురు వైష్ణవులను జీతమిచ్చి ఉంచి వాళ్ళచేత మిక్కిలి భక్తిశ్రద్ధలతో స్వామివారి కైంకర్య జరిపిస్తున్నారు. రంగాచార్యులు గారు బహు యోగ్యులు. ఆయన యొక సంస్కృత సాహిత్యం మీరు చూడనే చూశారు. ద్రావిడ వేదములోకూడా గట్టివారని ప్రతీతి కద్దు. ఆయన కొమాళ్ళు క్రిష్ణమాచార్యులు కూడా సంస్కారే గాని విశేష ప్రయోజకుడు కాడు. ఆ ఇంటికి వెలుగు తెచ్చినది ఈ కృష్ణమాచార్యులు భార్య నాంచారమ్మ. ఆమె తల్లీ తండ్రీ కూడా పండితులౌటచేత ఆంధ్ర గీర్వాణముల యందు మంచి జ్ఞానం సంపాదించిరి. పురాణం ఆ ఇల్లాలు చదివినంత శ్రావ్యంగానూ, రసంతోనూ ఎవరూ చదవజాలరు. రూపమూ రూపానికి సదృశ్యమైన గుణసంపత్తి కలదు. ఆమెకు ఒక కుమార్తె, ఒక కుమారుడున్నూ, ఇల్లూ, దేవాలయం కూడా ఆమే చక్కబెట్టుకుంటారు.

'ఇది కవిత్వమా, నిజమా?' అని వెంకయ్య అడిగాడు.

'మాకూ వాళ్ళకూ రాకపోకలు గలవు నా భార్య చెప్పిన మాటలు నే చెపుతున్నాను. ఆమె పురాణం చదవడం చెవులారా విన్నాను. మీకూ వినడపు అభిలాష ఉంటే రేపటి దాకా ఉండిపొండి. విష్ణుస్థలం యొక్క స్థితి ఇది. కాని, అయవార్లం గారు మత సంబంధమైన జట్టీలలో ఎన్నడూ జోక్యం కలగజేసుకోవడం లేదు. వైష్ణవ పక్షానికి కెప్తాను సాతాని మనవాళ్ళయ్య. అనగా రోజూ పొద్దున్న ఉపాదానాకు వచ్చి, స్తోత్ర పాఠాలతో పెణక ఎగరగొట్టేస్తాడే, అతగాడే ఒకనాడు తెల్లవారుగట్ల కలక్టర్లగారు గుఱ్ఱమెక్కి వస్తూ ఉండగా, గ్రామ పాలిమేరలను మనవాళ్ళయ్య ఎదురై, పెళ ఫెళమని శ్లోక ఎత్తుబడి చేసే సరికి, ఇతని స్థూలకాయం, బట్టె నామాలు, రాగి ధ్వజం, కోలాహలమూ చూసి గుఱ్ఱం బెదిరింది. కోపం వచ్చి కలక్టరు అయిదు రూపాయలు జుల్మానా వేశారట. ఈ కథ శుద్ధ అబద్ధం అనీ, తన చేత శ్లోకాలు చదివించి దొరగారు ఐదు రూపాయలు పైజంటిచ్చారని, అవి పెట్టి కొత్త వ్యాయపార పాత్ర కొన్నానని మనవాళ్ళయ్య చెబుతాడు

2

శైలవులలో ఉన్న ఐకమత్యం వైష్ణవుల్లో లేదు. సాతాన్లు చాలా మంది మనవాళ్ళయ్య శిష్యులే. అయినప్పటికీ కొందరు మట్టుకు అతను అవతారపురుషుడని చెప్పరు. అతనంటాడు. 'శరభయ్యే వృషభావతారమైనప్పుడు నేను గరుడాళ్వారి పూర్ణావతారం కాకపోతే కాకపోవచ్చును గాని వారి యొక్క అత్యల్పాంశ వల్లనైనా జనించి ఉండకూడదా. గరుడాళ్వారి నఖములయొక్క తేజస్సు నా యందు ఆవిర్భవించి ఉన్నది కాబట్టే, శరభయ్యను ఇలా చీల్చి పేల్చుతున్నాను.'

అయ్యవార్లంగారికి ఒక మాటు ఈ మాట చెవి సోకి గట్టి చీవాట్లు పెట్టారు. ఆ చీవాట్లు తిని పైకి వచ్చి, 'ఈ బ్రాహ్మణులదీ, జ్ఞానమూ కాదు. అజ్ఞానమూ కాదు. కడజాతి మనుష్యులే భక్తి ప్రభావం చేత ఆళ్వారులై ఉండిరి కదా? ఇంతకాలవాఁయి రాముడి ధ్వజమును జయప్రదంగా మోస్తూ శైవ సంహారం చేసిన నేను శ్రీ మద్గరుడాళ్వారి నఖాగ్రాగ్రం యొక్క అవతారం ఏల కాను? గరుడాళ్వారి నఖములు పెరిగి, ఖండన ఐనప్పుడూ ఆ ముక్కలు నా వంటి భక్తులుగా ఆవిర్భవించి పరమత సంహారం చేస్తవి గాని, వృధాగా పోనేర్చునా? వట్టి మాట!' అన్నాడు. 'ఔర, ఏమి మూర్ఖత; ఏమి అహంభావము, ఈ అజ్ఞులా అవతార పురుషులు? ఇలా అన్నందుకు వీళ్ళ తలలు పగిలిపోవురా?' అని గురువుగారు అన్నారు.

'శాస్త్రులుగారూ! పాత రోజులైతే వీళ్ళే అవతరాలయిపోదురు. వీళ్ళ పేరిట బొమ్మలు నిలిపి, దేవాలయాలు కట్టి, మనవేఁపూజ్జేతుం. మరి బుద్దుడూ ఇలాంటి మనిషే గదండి' అన్నాడు వెంకయ్య.

'చాకి బట్టెకీ సముద్రానికీ సాహిత్యం తెస్తివి' అన్నారు గురువుగారు

'అన్న మాటకల్లా వ్యాఖ్యానం చేస్తేగాని పూస్తుపోదురా?' అని నే అన్నాను.

'ఈ ఊరి నాయలు స్తోమం కలవాళ్ళు. అందులో సారధి నాయుడు లక్షాధికారి. అతని బావమరిది రామినాయుడు గ్రామ మునసబు. కొంచ ధూర్తూ, నిషా బాజీన్నీ. భోజన ప్రియుడు, ఈ తాలూకాలో కల్లా పెద్ద సారా దుకాణం ఈ ఊళ్ళోనే ఉంది. దాన్నిబట్టి ఈ ఊరి యోగ్యత మీరు ఊహించుకోవచ్చును.

నాలుగు సంవత్సరముల కిందట ఇక్కడకి దక్షిణ దేశం నుంచి ఒక అయ్యవార్లంగారు వచ్చి, సారధి నాయుడికీ, ఇంకా మరికొందరు నాయకులకూ, చక్రాంకిత చేసి, వైష్ణవవిఁచ్చారు. ఆనాడు మునసబు రామినాయుడు రామస్వామి వారి ఆలయములో తూంపట్టు పులిహోరా, వైష్ణవమూ ఏక కాలముందే గ్రహించాడు. నాటికీ, నేటికీ, రెంటియందూ ప్రవత్తి ఏకరీతిగానే ఉంది. అప్పటినుంచీ సారధినాయుడు ద్వాదశి ద్వాదశికీ స్వాం వారికి విరివిగా రాగ భోగాలు నడిపిస్తున్నాడు. ద్వాదశి అంటే రామినాయుడికి పెద్ద పండగ.

నాయళ్ళంతా వైష్ణవం పుచ్చుకుని, శివకోవిల వైపు తిరిగి చూడకపోవడం, శరభయ్యకు కంట్లో మిరపకాయలు రాసుకున్నట్లు ఉండెను. ఆలోచించి ఒక ఎత్తు ఎత్తాడు.

ఆ రోజుల్లో హైదరాబాదు రాజ్యం నుండి శివాచార్లు కొందరు దేశ సంచారార్థం ఈ ప్రాంతానికి వచ్చారు. మరి రెణ్ణెల్లనాటికి పీఠంతోనూ, ప్రభలతోనూ, రుంజలతోనూ, పెను ప్రళయంగా వచ్చి యిక్కడికి దిగబడ్డారు. రోజూ అర్ధరాత్రి వేళ శివార్చన చేసేవారు. ఆ సమయంలో శంఖాలు, జయఘంటలు, ఢమామామీలు, వీటి ధ్వని పామరుల మనస్సులో భయోత్సాతం పుట్టించేది. ఈ నల్లరాతి కొండల్లో ఆ ధ్వనులకు ప్రతిధ్వనులు కలిగి, కోలాహలంగా ఉండేది. ఈ అట్టహాసంతో వైష్ణవం పుచ్చుకున్న ఒక్కొక్క నాయడే, నామాలకి నామం బెట్టి, వీబూది రుద్రాక్షధారణం చెయ్యడం ఆరంభించాడు. వచ్చిన పదో రోజున శివాచార్లు గుండం దొక్కడానికి పెద్ద ప్రయత్నాలు చేశారు. సారథి నాయణ్ణి కదిలించడమే వాళ్ళ ముఖ్యప్రయత్నంగా వుండెను. అదివరకే సారథి నాయడికి శివమతం వేపు తూగు లావాయెను. గుండం తొక్కడం చూసిన తరువాత సారధి నాయుడు సిద్ధాంతంగా శైవం పుచ్చుకుంటాడని అంతా నమ్మారు. అందుచేతనే, శైవుల్లో మొనగాళ్ళంతా రుంజులతో సారధినాయుడి ఇంటికి వెళ్ళి, చాలా కైవారం చేసి ఉత్సవం చూచుటకు రాక తీరదని పిలిచారు.

ఈ మాట చెప్పగా, అయ్యవార్లంగారు ఏవఁన్నారంటే 'రాముడి ఆజ్ఞ ఏలా ఉంటే, అలా జరుగుకాక, వైష్ణవుడు, శైవుడు కావాలని కోరితే, అడ్డియేమి కార్యం? కాక కాశీలో మృతిపొందిన వారికి శివుడే కదా, తారక మంత్రోపదేశం చేస్తాడు. గనుక ఈ జన్మంలో పరమ శైవుడైనవాడికి, వచ్చే జన్మలో తారకమంత్రోపదేశం చేసి, ముక్తి ఇవ్వకపోతాడా? ఏ మతమైనా ప్రవృత్తి ఉన్నవాడికి తోవ ఉంది. అది లేకుంటే వైష్ణవుడైనా, కార్యం లేదు'. సాతాన్లకి అయ్యవార్లంగారి ఉదాసీనత చేయి విరుచుకున్నట్లు ఉండెను.

'ఈ బ్రాహ్మడికి వైష్ణవాభిమానం తక్కువ. గనక మనం విజృంభిస్తేనే గాని వైష్ణమతప్రభావానికి అగౌరవం వస్తుందని మనవాళ్ళయ్య ప్రగల్భించి, శివాచార్లు గుండం దొక్కేనాటి రాత్రి రెండు ఝాములప్పుడు కోవిల ఎదటి రావిచెట్టు కింద పెద్ద మీటింగు చేశాడు. సాతాన్లూ నాయలూ వందలకి జమ అయినారు. అందులో యోధులు దుకాణంలో రహస్య శేవ సేవించి, ఒక్కొక్కరే దిగబడ్డారు. అంతట మనవాళ్ళయ్య చెట్టు మొదటి రచ్చ రాతి మీద వంగి నిలిచి, గెడ్డము కింద వక కట్టు ఆనుకుని, ఏమని పలికెను. 'పరమ భాగవతోత్తములారా, వింటిరా ఈ శైవుల యొక్క రాక్షస మాయల్లోపడి, అప్పుడే చాలా మంది నాయలు వైకుంఠానికి పోయే రాజమార్గమైన వైష్ణవ మతం విడిచి, అంధకార బంధురమైన శైవమతంలో కూలిపోయినారు. ఇక మన పరమ మిత్రుడున్నూ, భక్తాగ్రేసరుడున్నూ అయిన సారధినాయుణ్ణి మాయగమ్మి తమలో పడవేసుకొనుటకు, ఇప్పుడు విపుల ప్రయత్నం గనక అతన్ని కాపాడి శ్రీ మహావిష్ణువు యొక్క మహిమ ప్రజ్వలింపజేసే సాధనం ఏమిటో తాము అంతా ఆలోచించండి. సారధి నాయుడు ఈ రాత్రి అక్కడకు వెళ్ళకుండా ఉపాయము కల్పించడము కర్తవ్యమని నా అభిప్రాయము. '

ఎలాగంటే, ఎలాగని నలుగురూ తలపోయుచుండగా, రామానుజయ్య లేచి అన్నాడు 'దీనికింత ఆలోచనేలా? ఏమి? వాళ్ళు చేసే పని మనమేల చేయరాదూ? రామభక్తుడైన శివుడికే అంత మహిమ ఉన్నప్పుడు సర్వేశ్వరుడైన ఆ రాముడికి అంతకన్న వెయ్యి రెట్లు మహిమ ఉండకపోయెనా? గనక నా సలహా ఏమిటంటే శ్రీమద్గరుడాళ్వారి అవతారమైన మనవాళ్ళయ్య రాగి ధ్వజం చేత పట్టుకుని నాలాయిరం పఠిస్తూ గుండం తొక్కితే సరి. శైవ వైష్ణవ మతాల తారతమ్యం లోకానికి వ్యక్తం కాగలందులకు, శివాచార్ల గుండం కంటే మరి బారెడు ఆస్తి లావుచేసి ఈ చెట్టుకిందే ఈ క్షణమందు బ్రహ్మాండమైన గుండం తయారు చేస్తాను. ఇందుకు అభ్యంతరం చెప్పే వాణ్ణి వైష్ణవుడని భావించను. '

చీకట్లో ఎవరికీ కానరాలేదు గాని మనవాళ్ళయ్య నోరు వెళ్ళబెట్టాడు. నలుగురూ 'బాగుంది! బాగుంది!' అనేసరికి అతని ప్రాణాలు ఎగిరిపోయినాయి. ఒక్క నిమిషం ఆలోచించి అన్నాడు. 'అన్నలారా! తమ్ముల్లారా! పరమ భాగోత్తముల్లారా! రామానుజయ్య నన్ను ఆక్షేపణ చేస్తున్నాడు. నేను పడవలసిందే! ఈ శరభయ్యే వచ్చి తాను వృషభావతారవఁని నిక్కి నీలుగుతున్నాడు కదా, మనం దెబ్బకి దెబ్బతీద్దాం, అని కేవలం వైష్ణవాభిమానం చేత నేను గరుడ వేషం వేశానే గాని, ఇంత భారమైన శరీరంతో నేను గరుడాళ్వారిని ఎన్నడూ కానేరనే? ఆ మాట నాకు తెలియదా? ప్రాజ్ఞులైన మీకు తెలియదా? రామానుజయ్య అయితే, చలాగ్గా డేగలా ఉన్నాడు గనుక, అవస్యం అతగాడే గరుడాళ్వారి అవతారం. అతణ్ణే గుండం తొక్కమనండి. నేనుగానీ నిప్పుల్లో కాలుబెట్టానంటే గజం లోతుక్కూరుకుపోయి చస్తాను. రామానుజయ్య తేలిగ్గా ఉన్నాడు. అంటి అంటనట్టు చప చప అడుగేసుకుపోతాడు. అన్నల్లారా! న్యాయం ఆలోచించండీ' అనేటప్పటికీ రామానుజయ్య సన్న సన్నగా జారాడు.

రామినాయుడు జల్దుకొని అన్నాడు. 'రావఁస్సోవిఁకి మయిమం ఉందా లేదా? ఉందా ఈ ఏషాలు మాని తిన్నగా గుండం దొక్కు.' ఆ మాట విని మనవాళ్ళయ్య మొహం జుమాల్మంది. రామానుజయ్యలాగ మందలో జొచ్చి మాయ వొఁదాఁవంటే, చీమా దోమాకాడు. పది ఇరవై మణుగుల పట్టు. 'హా దైవమా, నేను ఒక్క అరగడియ గరుడాళ్వారానే అయితే, ఎక్కడనైనా ఎగిరి ప్రాణం దాచుకుందును కదా' అని అనుకున్నాడు.

'ఏం, పల్లకుంటావేం?' రామినాయుడు పాడవడం ఆరంభించాడు. 'అల్లాండం బెల్లాండం అని తెల్లారకుండగ వచ్చి, తెగ అరుస్తావు కదా, ఆ ముక్కలన్నీ మావంటోళ్ళని బెదిరించి కూరా నారా లాగడానికేనా అటి మయిమం యేం కాసింతైనా కద్దా?'

మనవాళ్ళయ్య నిట్టూర్పు విడిచి, రామానుజులను స్మరించి ఇట్లా అన్నాడు. 'రామినాయుడన్నా, నువ్వూ నేనూ చిరకాలం నాటి నేస్తులం, నువ్వు గవర్నమెంటు వారి తరపున మనసబీ అధికారం చాలా కాలవాఁయి చలాయిస్తున్నావు. యుక్తాయుక్తం ఎరిగిన మనిషివి. అవును గాని, వైష్ణవ మతం యొక్క, ఆధిపత్యత అగుపర్చాలంటే, ఆ శరభయ్య చేసే తక్కువ పనా, చేయమంటావు? పృధి వ్యాపస్తేజో

వాయురాకాశాత్ అన్నాడు. విష్ణుభక్తుడైన వాడికి కర్తవ్యం ఉత్తమోత్తం పృధివీ అనగా భూమి మీద నడవడమే పంచ భూతములలో మరి ఒక భూతం మీద వైష్ణవుడున్న వాడు అడుగువేసి నడవనే కూడదు. అంతకు ఒక వీసం తక్కువ ఆపః అన్నాడు. అనగా నీట్లో ఉరకడం ఒకపాటి కర్తవ్యం కావచ్చు. అధమాధమం అగ్ని తొక్కడం గనక మీరు యావన్మందిన్ని ఇప్పుడే నా వెంట రండి. ఈ నిశీధి సమయంలో శ్రీ మహావిష్ణువు నామస్మరణ చేసి అమాంతంగా సీతా గుండంలో ఉరుకుతాను అప్పట్లో నా మహిమ మీకుతెలియగల్దు,'

రామినాయుడు దగ్గరకి వచ్చి, మనవాళ్ళయ్య చేయిబట్టుకుని గట్టిగా నొక్కుతూ అన్నాడు. 'ఇన్నావా వైష్ణపోడా, మా ఇయ్యంకుడు సారధి నాయుడు జంగపాళ్ళలో కలిసిపోతే దోడసి పుళియోరి శక్కర పొంగళం పోతాయొ. ఆ మాట నీకూ ఎరిక; నాకూ ఎరిక. నువు సీతమ్మ గుండలో ఆనపకాయ తుంబలాగ తేలి, ఈతలాడితే, నీ మయిమం ఆడొప్పుతాడా. ఎట్టికుట్టె కబుర్లు మానేసి, మావాడు రెండు కళ్ళతో సూస్తుండగా అల్లాండం బెల్లాండం అంటూ అగ్గిదొక్కు!'

'సరే నేస్తం. నీ అభిప్రాయం ఆ ప్రకారం ఉన్నట్లయితే అలాగే కానీయండి. శ్రీ మహావిష్ణువు యొక్క మహిమ నిలబెట్టడానికి అగ్ని తొక్కుతానా, తొక్కి చూస్తానా. ఇప్పుడు చాలా రాత్రయింది. ఇళ్ళకు పోయి పరుందాం. రేపు ఈవేళ్ళప్పుడు ఈ స్థలంలోనే బ్రహ్మాండమైన గుండం వేసి దంద్యహ్యమానమైన ఆ గుండం తొక్కి వైష్ణవ మత ప్రభావం కనపరుస్తాను. అప్పట్లో ఆ గరుడాళ్ళారే నన్ను ఆవహించి, అంత గుండమునూ చెంగున ఒక్క దాటున దాటిస్తారు'

'ఆ పప్పు ఉడకదు. ఈ రాత్రి మా వాడు జంగపాళ్ళలో కలిసిపోతే రేపు నువ్వు దాటేం, దాటకేం, ఆ దాటే దాటేదో, ఈ యాళ ఆళ్ళ గుండంలోనే దాటు. లెండోస్సి ఈ వైష్ణపోణ్ణి మోసుకెళ్ళి గుండం తొక్కిద్దాం' అని రామినాయుడు అనే సరికి నలుగురు నాయలు మనవాళ్ళయ్య రెక్కలు పట్టుకు పచ్చరాతి మీద నుంచి కిందికి దించారు. మీరి వచ్చిందని మనవాళ్ళయ్య ఒక ఎత్తు పన్నాడు. 'ఆగండి ఆగండి, గుండం తొక్కవలసి వచ్చినప్పుడు అందుక్కావలసిన పరికం అంతా కూర్చుకోవడవాఁ, లేకుంటే కట్టుగుడ్డలతో గుండంలో పడేసి, ఒళ్ళు తెగ్గాలుస్తారా? ఆ శివాచార్లు వీరభద్ర విగ్రహం చేతబట్టి, మంత్రాలు పఠిస్తూ శంఖధ్వనికి వీరావేశం పుట్టి గుండం తొక్కుతారు. అలాగే శ్రీరామస్వాం వారి తాలూకు ఉత్సవ విగ్రహం ఒకటి నా నెత్తిన కొడితేగాని ఎలా చస్తాను? గరుడాళ్వారు అయినా ఎప్పుడూ పెరుమళ్వారిని వీపున మోసుకునే బయలుదేరతారుగాని ఒట్టినే రెక్క కదపరు. మీరెరగరా' - అనేటప్పటికీ, సారధి నాయుడు ' ఆమాట నిజవఁర్రా ఇగ్గరవిఁస్తాడు, అయ్యవోర్ని తెలుపుకు రండోస్సి' అన్నాడు. నలుగురు నాయలు పక్కనున్న అయవార్లంగారి ఇంటికి వెళ్ళి, పైమీద గుడ్డ అయినా లేకుండా ఆయన్ను మోసుకు వచ్చి రావి చెట్టు కింద రచ్చ రాతి మీద కూర్చోబెట్టారు. ఈ గడబిడ కనిపెట్టి కృష్ణమాచార్లు అటకెక్కి దాక్కున్నాడు.

3

అతి వినయమును నటిస్తూ మనవాళ్ళయ్య రంగాచార్యులు గారికి ప్రస్తుతాంశము విన్నవించి, ఉత్సవ విగ్రహమును ఇమ్మని వేడాడు. రంగాచార్యులు గారు అన్నారు: 'ఓరి మూర్ఖుల్లారా! మీకు మతులు శుభ్రంగా పోయినాయిరా? ఈ గుండం తొక్కడమనేది - గర్వ్యమైన తామస వ్యాపారము; వైష్ణవ మత నిషిద్ధము. మన గ్రంధాల్లో ఎక్కడా ఈ ప్రక్రియ లేదు. గుండం తొక్కడానికి ఒక విధీ, మంత్రం ఏడిస్తేనా?'

'శక్కరంతోటి ఒళ్ళల్లా తెగ్గాల్చడానికి మంతరం కద్దా! అట్టే మాటలు శెలవియ్యక, ఆ ఇగ్గరవేఁదో సాతానోడి కియ్యండి' రామినాయుడు అడిగాడు.

'ఛీ పొండి! మూర్ఖుల్లారా! నేను ఇచ్చేది లేదు. ఉత్సవ విగ్రహములు శూద్రులు ముట్టుకోవలసినవి కావు. ముట్టుగుంటే కళ్ళు పేలిపోతాయి' అని రంగాచార్యులుగారు అనేసరికి, మనవాళ్ళయ్య 'బతికానురా దేవుడా!' అనుకుని, సారధినాయుడితో 'చూశావా నేస్తం!

ఆ మాట నిజమే! నేను ఉత్సవ విగ్రహములు ముట్టుకోకూడదు. అందుచేత, ఇప్పుడు కర్తవ్యం ఏమిటంటే, ఆ విగ్రహం పట్టుకుని అయవార్లంగారే గుండం దొక్కవలసి ఉంటుంది. ఆ అధిక్యత అనేది వారికే ఉండవలసినది.'

మునసబు 'ముసలాయన ఇగ్గరాలట్టుకుని గుండం తొక్కేదేటి? సిన్న సోవిఁనిలెగదీసుకెళదాం రండి', అన్నాడు.

'వాడి జోలికి వెళ్ళకండి. మా బాగే; ఉత్సవ విగ్రహాలు పట్టుకుని, నేనే గుండం తొక్కుతాను. మావాడు పట్టణం వెళ్ళాడు. ఊళ్ళో లేడు' అని రంగాచార్యులుగారు అన్నారు.

'అయితో లెండోయ్!' అని మనవాళ్ళయ్య బొబ్బ వేశాడు. అంతట ఆ రావి చెట్టు మాను చాటున గుప్పని ఒక వెలుతురు పుట్టింది. అందరూ భీతిల్లారు. నిషాలు దిగజార జొచ్చాయి. వెంటనే మాను వెనకనుంచి ఒక చేత కరదీపము, రెండవచేత సూరకత్తి కట్టుకుని, ఉంగరాల జుత్తు గాలికి తూగులాడుతుండగా, నిబ్బరంగా అడుగు వేసుకుంటూ వచ్చి నాంచారమ్మ, మామగారి పక్కన నిలిచి, ఆయన రెక్కలు పట్టుకుని ఉన్న నాయల వంక బాకు మొన జూపి 'దుష్టుల్లారా! ఈ పరమ పవిత్రమైన బ్రాహ్మణ్ణి వదుల్తారా. బాకుకు బలి ఇచ్చేదా!' అని అడిగినది.

హఠాత్తుగా వచ్చిన ఈ వీర రూపమును చూచి, అందరి ధైర్యాలూ అడుగుంటాయి. అయ్యంవార్లంగారిని పట్టి నిలిచిన నాయలు బెదిరి దూరం సాగారు. అంతట ఆమె చేతి దీపం రచ్చ రాతి మీద ఉంచి, 'నీకేం కావాల'ని మనవాళ్ళయ్యను అడిగింది. మనవాళ్ళయ్య రెండడుగులు వెనక్కి వేసి, తనకేమి అక్కరలేదన్నాడు.

'నీకు ఉత్సవ మూర్తులు కావలెనంటివి?'

'నాకెందుకు తల్లీ, అపవిత్రుడను! వాటి ఎత్తు బంగారం కరిగి ఇస్తే నాకు అక్కర్లేదు. రామినాయుడు ఏమో కొంచెం -'

ఆమె అటుంచి ఇటు తిరిగి, రామినాయుడిని నిస్సారంగా చూస్తూ - 'నీకేం గావాలి, మునసబు నాయడా' అని అడిగింది.

మొహం ఒంచి, రామినాయుడు తనకేమి అక్కర్లేదని పైకి చెప్పి, 'ఆడదాయితో యవడు మాటాడగల్డు?' అని గొణుక్కున్నాడు. రామినాయుడి పెళ్ళాం గయ్యాలి.

నాంచారమ్మ - 'ఎవరికీ ఏమీ అక్కరలేకుంటే ఈ ముసలి బ్రాహ్మణ్ణి ఒంటిమీద బట్టయినా లేకుండా నిద్దర మంచం మీంచి ఎందుకు ఈడ్చుకు వస్తిరి? ఎవరూ మాటాడేవిఁ!'

రామినాయుడు కొంచెం ధైర్యం తెచ్చుకుని ' ఆడదాయితో మాటలకంటే సాల్లేంగాని ఈ రాత్రికాడ ఆ జంగపోళ్ళు శివుఁడు పేరు జెప్పి గుండం దొక్కుతారు గదా, మన రామస్సోంవోరి పేరు జెప్పి మనం కూడా గుండం దొక్కకుంటే, మన పెండెం ఇరిగిపోదా?'

నాంచా: (మనవాళ్ళయ్యతో) 'నువ్వెందుకు తొక్కకూడదూ?'

మనవాళ్ళయ్య: 'అమ్మా. ఈ వేళ ఏదో నా ప్రారబ్ధం చాలక ఈ మీటింగు తలపెట్టాను. బుద్ధి గడ్డి తిన్నది. ఇదిగో లెంపలు పడపడ వాయించుకుంటున్నాను. తల్లీ నన్ను ఈకాడికి వదిలిస్తే శ్రీరంగం వెళ్ళిపోతాను. ఈ నాలుగు ఊళ్ళ పాలిమేరనూ, నేనంటూ తిరిగి కనపడితే, నా నెత్తిమీద పెద్ద పిడుగు పడిపోవాలి.'

నాంచా: 'నీకు కొండంత గుండె ఉంది! (రామినాయుడుతో) మునసబు నాయడా, నీ వియ్యంకుడు సారధి నాయుడు విరిగిపోతే ద్వాదశి ద్వాదశికీ 'శంకర పొంగళం.' 'పులియోరో' లేకపోతాయని గదా దుఃఖం?'

మునసబు: (తలగోక్కుంటూ) 'నా కొక్కడికే అన్నమాటేమిటమ్మా, ఆ రామస్సోం వోరికి మాత్రం పులియోరం కరువైపోదా?'

మనవా: 'అమ్మా, శక్కర పొంగలి, దద్దోజనమూ అనేవి ముఖ్యములు కావు. వైష్ణవమతోత్కర్ష మహిమ కనపర్చి, ఉద్ధరించాలి అదీ కర్తవ్యం.'

నాంచా: ఆ ఉద్ధరించడం ఏదో నువ్వేల చేయరాదు? నీకు ఉత్సవ విగ్రహా మంటూ ఏలా! ఆకాశమంత రాగి ధ్వజం మోసుకు తిరుగుతావు గదా దానిలో అరకాసంతయినా మహత్తు లేదా?'

మనవాళ్ళయ్య: 'మళ్ళీ మొదటికొచ్చింద'ని, సణుక్కుంటూ, కష్టం మీద మందలో దూరి అంతర్ధానం అయిపోయినాడు.

నాంచా: 'రాముడే కాడు, ఏ దేవుడి మీదనయినా నిజమైన నమ్మకమన్నది ఏడిస్తే ఒక్క గండవేఁకాదు, అని కష్టాలూ తరించవచ్చును. నేను మా మామాగారి పేరు స్మరిస్తూ గుండం తొక్కుతాను. నావెంట రాగలిగిన వైష్ణవులెవరైనా ఉంటే ఎదటికి రండి'.

ఎవడూ పలకలేదు.

నాంచారమ్మ: నిరసన నవ్వు నవ్వి 'ముసలాయనను అగ్గిలో తోసి పై నుంచి చూడటానికి మీరంతా వీరులా?'

ఎవరూ ఉలకలేదు పలకలేదు.

నాంచారమ్మ అందరినీ కలయజూసి 'పీరు సాయీబు ఇక్కడ లేడా?' అని అడిగింది. పీరు సాయీబు వెంటనే ఎదటికి వచ్చి 'అమ్మా, ఇదిగో దాసుడ'ని చేయి జోడించి నిలుచున్నాడు. పీరు సాయీబు దూదేకుల సాయీబు అయినప్పటికీ, రామభక్తుడు, కీర్తనలు చెపుతాడు. హటయోగం అభ్యసిస్తాడు. రోడ్డు పక్క ఏటివొడ్డు తోటలో మఠం ఇతనిదే. ఇతనికి శిష్యబలగం లావు.

'సాయబు! నువ్వు గుండం తొక్కగలవా?' అని నాంచరమ్మ అడిగారు.

'మీ శలవైతే అవలీలగా తొక్కుతాను తల్లీ!' అని అన్నాడు.

నాంచారమ్మ: 'ఏడీ మనవాళ్ళయ్య? గరుడుడి అవతారం అంతర్ధానమై పోయింది. రామినాయడా, పరమ భాగవతోత్తములై యుండిన్ని, మీరు ఎవరూ గుండం తొక్క జాలినారు కాదుగదా? అట్టి స్థితిలో ఈ పచ్చి తురకకీ గుండం తొక్కడానికి భగవంతుడు సాహస ధైర్యాలు యిచ్చాడు గనుక మీ వైష్ణవ మతం గొప్పా అతగాడి తురక మతం గొప్పా? రామినాయడా, మీ దేవులాటంతా ఈ రాత్రి వైష్ణవులు శైవులకి పరాభవం చెయ్యాలని కదా? అందుకు ఉపాయం చెబుతాను వినండి. మతాలు సాత్వికాలూ, తామసాలూ అని రెండు విధాలు. ఈ రెండు విధాల మనుష్యులూ, శైవుల్లోనూ, వైష్ణవుల్లోనూ కూడా ఉన్నారు. గుండాలు తొక్కడం మొదలైన తామస కృత్యాలు చేసే వాళ్ళని శైవుల్లో శివాచార్లు అంటారు. మన వైష్ణవుల్లో అట్టి కృత్యాలు చేసే తెగ కూడా ఉన్నారు. ఎవరో మీకు తెలుసునా?'

మనవాళ్ళయ్య గుంపులో మరి వక పక్కనుంచి తన బుర్ర పైకి పెట్టి 'ఎవళ్ళమ్మా వాళ్ళు' అని అత్యాతురతతో అడిగాడు.

మునసబునాయుడు 'మరెవళ్ళు? సాతానోళ్ళు' అనేటప్పటికి, మనవాళ్ళయ్య బుట్ట మళ్ళీ మందలో మాయమైపోయింది.

నాంచారమ్మ: 'ఆ వైష్ణవులు ఎవరా? మరెవరు తురకలు? పీరు అనేది ఏమిటనుకున్నారు. శ్రీస్వామివారి తిరునామమే. పట్టణంలో ఎంతో మంది హిందువులే పీర్ల పంజాలు ఉంచి గుండాలు తొక్కుతారు. గనక శ్రీరామ స్వామి వారి నామం తెచ్చి పీరు కట్టి ఇస్తాను. ఆ పీరుపట్టుకు పీరు సాయీబు గుండం తొక్కుతాడు. పీరు సాయీబు యోగ్యత మీరెరిగినదే. అతగాడు - కబీరు దాసంత భక్తుడు. గనక భయాలు విడిచే అతని వెంట వెళ్ళి జయించుకుంరండి. వేళకి భక్తి నిలుస్తుందో నిలవదో చేతి కట్టలు మాత్రం మరవకండి?'

ఆమె విరమించేసరికి ఫెళ ఫెళమని ఆ మూకలోనుండి మనవాళ్ళయ్య శ్లోక పఠనం ఉపక్రమించి ఇటూ అటూ మనుషులను తోసుకుంటూ ఎదుటికి సాష్టాంగం చేసి 'అమ్మా, మీరు సాక్షాత్తూ శ్రీమహాలక్ష్మి అవతారం. వైష్ణవ మతం నిలబెట్టారు. మతమే అన్నమాట ఏమిటి? మా ప్రాణాలు కూడా నిలబెట్టారు. ఇహ నా విజృంభణం చూడండి' అన్నాడు. మనవాళ్ళయ్య పెద్ద హికమద్దారుడు. ఆ రాత్రి వైష్ణవ తంత్రం తరువాయి కథ అంతా అతనే నడిపించాడు.

అంతా చల్లారగానే అటక మీద నుంచి కృష్ణమాచార్యులు దిగాడు. కష్టసాధ్యమును సాధించిన సంతోషముతో, నాంచారమ్మ కరదీపం తిరిగి చేతపూని, ఇంటికి సవిలాసముగా నడిచి పోవుచుండగా పెనిమిటి ఎదురైనప్పుడు ఆమె ప్రేమ పరిహాసములు పెనుగొను

దృష్టితో చూసెను. ఆ దృష్టి తనకు దేవత్వమిచ్చి తన్ను అవతార పురుషుణ్ణి చేసిందని కృష్ణమాచారి మర్నాడు నాతో చెప్పి, ఆ అర్థంతో శ్లోకం రచించాడు. తమ రహస్య శృంగార చేష్టలు మిత్రులతో చెప్పితేగానీ కొందరికి తనివి తీరదు.

ఆ రాత్రి శివాచార్లు గుండం తొక్కడం చూడ్డానికి నేను వెళ్ళి ఉంటిని. తెల్లవారగట్ల నాలుగు గంటలవేళ చిరి చీకటిలో గుండంలో నిప్పులు కణకణలాడుచుండెను. ప్రాతఃకాలపు శీతగాలి సాగింది. ఒక్క పెట్టున గర్భనిర్భేధమయ్యేట్టు శంఖాది వాద్యములు రేగాయి. ఇంగిలీషు చదువుతున నాస్తికాగ్రేసురులకు కూడా ఆ కాలమందు బితుకు కలిగిందని వారే చెప్పుకున్నారు.

పందిటిలో నుంచి వీరగంధాలు పూసుకున్న నలుగురు శివాచార్లు గుండం దగ్గరకు వచ్చి నిలుచున్నారు. ఒకరు నెత్తిమీద భీకరమయిన రాగి ప్రతిమ పెట్టుకున్నాడు. ఎదురుగా నిలిచి మరి వకడు కత్తి ఝళిపించుచూ వీర వాక్యాలు కొలిపాడు. ఒకడు గుండంలో నెయ్యిపోసి గుమ్మడికాయ తుండలు గుండం లోకి విసిరాడు. వెంటనే శివార్లు గుండం జొచ్చి నడుచుకుపోయినారు. అవతల ఒడ్డు చేరి తిరిగి తొక్కుటకు వారు ఇటు అభిముఖులైఉండగా, 'అల్లా - రామ్' అని కెవ్వుమని ప్రళయమైన కేక ఒకటి వేసి, తక్షణం శివాచార్లు గుండం దిగిన వైపు నుంచి, మూకను చీల్చుకుని ఒక మనుష్య ప్రవాహము గుండము దాటుకుని పోయింది. వారిలో అందరున్నూ ముఖముల మీద ముసుగులు వేసుకున్నారు. ఆ మనుష్య ప్రవాహమునకు అగ్రమందు వెండి పీరు ఒకటి రెండు చేతులా పట్టి ఒక వీరుడు భీమునివలె నడుచుకు పోయినాడు. ఇది అంతా అరనిమిషం పట్టలేదు.

మూక, చకాపికలై చెదిరిపోయినది. కొందరు సాతాన్లకీ, శివాచార్లకీ కూడా యెత్కించిత్ కాళ్ళు కాలాయి. అది భక్తిలోపం కింద కట్టారు. తరువాత శరభయ్యకీ, మనవాళ్ళయ్యకీ రాజీనామా అయినదని అనుకుంటారు. పైకి మట్టుకు దెబ్బలాడుతున్నట్టే ఉంటారు.

అదుగో, మా ఇంటికి ఎదురుగా ఆ రచ్చసావిట్లో నిలిపిన పీరు ఆ పీరే. నాటి నుంచీ, ప్రతి సంవత్సరం ఆ పీరును పండుగ చేస్తారు. ఊరు ఆబాలగోపాలం శైవ వైష్ణవ భేదం లేకుండా పీరు దేవరకు మొక్కులు చెల్లిస్తారు. త్రిశూలాకారం గనక ఆ పీరు శివపీరే అని శరభమయ్య అంటాడు. ఆ వ్యవస్థదో వెంకయ్య పంతులు గారే చెయ్య సమర్థులు.

'శివుడూ విష్ణూ పీర్లే అయినప్పుడు, బుద్దుడు శివుడు కారాదా?' అని శాయన్న భుక్త కథ పరిసమాప్తి చేశాడు.

మా గురువుగారు ఈ చరిత్రకు చాలా ఆశ్చర్యపడి అన్నారు. 'ఔరా! కలికాలంలో మనుష్యులే కాదు. దేవుళ్ళు కూడా సంకరం అవుతున్నారు.'

'అయినా తప్పేమి? శివుడన్నా, విష్ణన్నా, పీరన్నా, బుద్దుడన్నా, ఆ పరమాత్మ మట్టుకు ఒక్కడే కదా!' వెంకయ్య ఊరుకుంటాడా, 'అందరు దేవుళ్ళూ ఒక్కరే ఐతే ఆ పీనుగుల్ని అందరినీ ఒక్కచోటే నిలిపి అందరూ కలిసి పూడ్చి తగలెట్టరాదా?' అన్నాడు.

అంత, గురువుగారు 'ఓరిదేవుళ్ళని పీనుగులంటారా? నువ్వు ఒట్టి కిరస్తానువి, ఇంకా కిరస్తానుకైనా దేవుడంటూ ఉన్నాడు? నువ్వు కిరాతుడివి. పీరో, బిట్రో, దెయ్యమో, దేవరో, ఈ అజ్ఞులకు మూఢ భక్తి అయినా ఉంది. నువ్వు అందరు దేవుళ్ళకీ ఒక పెద్ద నామం బెట్టావు'

'ఒక్క మీకు తప్ప శాస్త్రులుగారూ' అన్నాడు.

'నీ జన్మానికల్లా విలువైన మాట అంటివిరా' అని నేనన్నాను.

✡ ✡ ✡

మ్యాచ్ ఫిక్సింగ్

- కె.వి.నరేందర్

తెలతెలవారుతుండగానే ఆ రోజు పేపర్‌లో తన ఫోటో చూసుకుని మురిసిపోయాడు పరంధామయ్య. కొడుకు, కూతురు, భార్య, కోడలు, మనవళ్ళు తనకి 'పదవీ విరమణ శుభాకాంక్షలు' పేపర్ ద్వారా తెలిపారు. ఆ రోజు రిటైరవుతున్నందున ఒకింత బాధ కలిగింది. భారమైన నిట్టూర్పు విడిచాడు. 'పదవీ విరమణ' అనేది ఒకప్పుడు కుటుంబంలో, ఆఫీసులో బాధాకరమైన కార్యక్రమంగా కొనసాగేది. కానీ ఇప్పుడు పద్ధతి మారింది. పదవీ విరమణ పండగలా సెలబ్రేట్ చేసుకోవటం ఆరోగ్యకరమైన మార్పు.

"మీ ఫోటో వచ్చిందా?" అంటూ వచ్చింది అరుంధతి.

"ఆ ... నీ పేరు కూడా వేశారోయ్" అని నవ్వుతూ భార్యకి పేపరందించాడు.

"చూశారా... మీ రిటైర్మెంట్ అనగానే కొడుకు, కోడలు, కూతురు అంతా కలిసి మీమీద ప్రేమతో నాలుగువేలు ఖర్చుపెట్టి ఈ పేపర్‌లో వేయించారు" అంది ఆనందంగా.

"అయినా... రిటైర్మెంట్ అనగానే.... నువ్వింకా పనికిరావు పో.. అని విదిలించినట్టు కొంచెం బాధగానే ఉంది." అన్నాడు.

"భలేవారే.... మీ ఒంట్లో ఇంకా పాఠాలు చెప్పే శక్తి ఉండొచ్చు. కాని ప్రభుత్వం దృష్టిలో మీరింక విశ్రాంతి తీసుకోవాల్సిందే కదా... తరువాత రావల్సిన డబ్బులన్నీ సరిగా వచ్చేలా చూసుకోండి. ముందు... వచ్చిందాన్లోంచి మీ అలుడికి లక్షరూపాయలు ఇచ్చేయండి. వైదేహి వచ్చి ఇప్పటికే నెలయింది. ఫోన్‌లో విడాకుల నోటీస్ పంపిస్తానంటూ అల్లుడు అమ్మాయిని తరచూ బెదిరిస్తున్నాడు" అంది.

"అల్లుడికిచ్చేది యాభైవేలే కదే.." అన్నాడు బరువుగా.

"పెళ్ళయి అయిదేళ్ళయింది కదా.... ఈ అయిదేళ్ళలో ఫిక్సిడ్ చేసే మాకు రెట్టింపయ్యేది. అందుకే లక్ష ఇవ్వండని వైదేహి కూడా వాదిస్తోంది.

"అల్లుడికన్నా ఎక్కువ వైదేహి పోరు పెట్టడమే బాధగా ఉంది. డబ్బు ముందు అన్ని బంధాలు గడ్డిపరకలైపోవటం మరింత బాధగా ఉంది" అన్నాడు.

"వీటితో అన్నీ తీరిపోతాయిలెండి. మనకింక డబ్బు సమస్యలేముంటాయ్? కొడుకూ, కోడలూ ఇద్దరూ ఉద్యోగస్తులే కదా..." అంది.

అప్పుడే కోడలు టీ తీసుకొచ్చి ఇద్దరికి ఇచ్చింది.

''రాము క్యాంప్ కెళుతున్నాడామ్మా?'' అనడిగాడు పరంధామయ్య.

''ఈ రోజు వెళ్తారట.మళ్ళీ వారం తర్వాత వస్తారేమో'' అంది. పొడిపొడిగా నెలనుంచి ఇంట్లో తిష్టవేసి ఇంకా లేవని ఆడబిడ్డ మీద కోపంగా ఉంది కోడలు సరోజినికి. ''వైదేహి లేవలేదా సరోజినీ...'' అంది అరుంధతి.

''లేదు. రాత్రి వాళ్ళాయన ఫోన్ చేశాడు. విడాకుల నోటీస్ పోస్ట్‌లో వేశాడట. వారంలో లక్ష ఇస్తేనే... ఆ నోటీస్ వెనక్కి తీసుకుంటానని కూడా అన్నాడట'' అని వెళ్ళిపోయింది.

ఆ మాట విని అరుంధతి వైదేహి గదిలోకి పోగా, వాలు కుర్చీలోంచి లేచి పరంధామయ్య టీ కప్పుతో వరండాలోకెళ్ళారు.

✡✡✡

జనరల్ ఇన్సూరెన్సు, ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, లీవ్ శాలరీ అన్నీ కలిపి పరంధామయ్యకి మూడున్నర లక్షలు వచ్చాయి. అందులోంచి లక్ష రూపాయలు వైదేహికివ్వటంతో కొడుకు, కోడలు మొహాలు మాడ్చుకున్నారు. కాని అంతకుముందు రోజే పోస్ట్‌లో విడాకుల నోటీస్ రావటంతో అంతా కంగారుపడ్డారు. చివరికి అల్లుడికి ఫోన్ చేసి, పిలిపించి లక్ష చేతుల్లో పెట్టాకగాని వైదేహి బయల్దేరలేదు. ఆ రాత్రి కోడలు సరోజిని ఏదో నెపంతో ఇద్దరు పిల్లల్ని చితకబాదింది. కొడుకు పొద్దుననగా బయటికెళ్ళినవాడు అర్ధరాత్రి దాటాకగాని ఇంటికి చేరలేదు.

వైదేహి వెళ్ళిపోయాక అరుంధతి భర్తతో అంది.

''ఏమండీ... కూతురికి లక్షరూపాయలివ్వటం మీ కొడుక్కీ, కోడలికీ నచ్చనట్టుగా ఉంది. కాని అంతకంటే దారుణమైన విషయం సాయంత్రం వైదేహి గదిలో విన్నాను'' అంది.

''ఏమిటే?'' అన్నాడు పరంధామయ్య.

''మీరు విడాకుల నోటీస్ పంపించకపోతే... వాళ్ళు లక్షరూపాయలిచ్చేవాళ్ళే కాదు. అడ్వకేటుకి ఎంతిచ్చారేమిటి? అని భర్తనడుగుతోంది. ఆయనేమో... వెయ్యి రూపాయలడిగితే ఆరొందలిచ్చాను అంటున్నాడు'' అంది.

పరంధామయ్య ఏదో చెప్పబోతుండగానే... ఇంటి ముందు కారాగిన శబ్దమైంది. కారు దిగి ఓ అపరిచిత వ్యక్తి రావటంతో 'ఎవరు కావాలండీ' అనడిగాడు.

''పరంధామయ్యగారు...'' అంటూ నసిగాడు. ''నేనే... రండి... అరుంధతీ టీ తీసుకురా...'' అని అతనికి కుర్చీ చూపించాడు కూచోమన్నట్టుగా. అతడు కూచుంటూనే తనని తాను పరిచయం చేసుకుంటూ ''నా పేరు జయశంకర్. నేను మాన్సి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌నండి. మీరు హిందీ బాగా చెపుతారని చాలా సార్లు విన్నాను. ఈ సిటీలో ఓ హిందీ పండిట్ దొరక్క మా కాలేజీ పిల్లలకి చాలా ఇబ్బంది అవుతోంది. మీరు దయచేసి మా కాలేజీలో లెక్చరర్‌గా జాయనవ్వండి. రోజుకి మూడు పిరియడ్స్‌కి మించి ఉండవు. జీతం కూడా మూడువేలవరకూ ఇస్తాను'' అన్నాడుచాలా వినయంగా.

టీ తీసుకొచ్చిన అరుంధతి వైపు గ్వర్వంగా చూశాడు పరంధామయ్య. జయశంకర్ టీ తీసుకుని మీ నిర్ణయం వీలైతే రేపటిలోపు చెప్పండిసార్'' అన్నాడు.

పరంధామయ్య ఆలోచనల్లో పడ్డాడు.

''మా కాలేజీలో మీకు ఏ ఇబ్బంది ఉండదండీ. మేమంతా మెడిసిన్, ఇంజినీరింగ్ కోర్సులకి ప్రిఫరెన్స్ ఇస్తూ సైన్సు సబ్జెక్టుల్లో కష్టపడతాం కాని, లాంగ్వేజెస్ విషయంగా పెద్దగా పట్టింపు లేదుసార్. అందుకే మీకు ఏ ఇబ్బందీ ఉండదు'' అన్నాడు జయశంకర్.

''ఇదేదో మంచి అవకాశమే అన్నట్టుంది కదా'' అన్నట్టున్నాయి అరుంధతి చూపులు.

''సైన్సు చెప్పేవాళ్ళకు మీరెంతిస్తారు బాబూ?'' అంది అరుంధతి.

''ఇరవైవేలిస్తామమ్మా'' అన్నాడు టక్కున.

''అయ్యో... మీరు సైన్సు టీచర్‌గా రిటైరైనా బావుండేది'' అన్నట్టు మరోసారి చూసింది అరుంధతి.

''సరే.... నా నిర్ణయం రేపు చెపుతాను'' అన్నాడు పరంధామయ్య.

''చెప్పటం కాదు. మీరు తప్పక రావాలి... వస్తున్నారు'' అనేసి వెళ్ళిపోయాడు జయశంకర్.

పరంధామయ్య నిట్టూర్చి 'ఏమంటావ్' అన్నట్టుగా చూశాడు.

''ఒక్కసారిగా ఇంట్లోనే ఉండాలంటే మీక్కూడా బోర్‌గా ఉంటుందేమో. మంచి అవకాశం అదీగాక వెతుక్కుంటూ వచ్చాడు. ఆలోచించండి. చేతనవుతుందనుకుంటే మీ ఇష్టం...'' అంది.

కాసేపు ఆలోచించాక.... కాలేజీకి వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు పరంధామయ్య.

✡ ✡ ✡

నాలుగు నెలలు గడిచాయి.

అరుంధతికి ఉనట్టుండి ఓ రోజు ఛాతీలో నొప్పి ప్రారంభమైంది. ఆ రోజు ఆదివారం కావటంతో అంతా ఇంట్లోనే ఉన్నారు. స్ట్రోక్ ఎక్కువవటంతో హుడావిడిగా హాస్పటల్‌కి తరలించారు. ఆ దృశ్యం చూసి పిల్లలు సైతం ఏడుపు మొదలు పెట్టారు నానమ్మకేమో అయిందని.

ఆటోలో ఓ ఆస్పత్రికెళ్ళగానే... ఆదివారం కావటంతో డాక్టర్లెవ్వరూ లేక ఓ జూనియర్ డాక్టర్ అన్నిరకాల టెస్టులూ చేశాడు. పరంధామయ్యలో ఆందోళన పెరుగుతుంటే కొడుకు, కోడలు ధైర్యం చెబుతున్నారు. అరగంట తరువాత జూనియర్ డాక్టర్ ఆమెకి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయటం మంచిదని చెప్పి - ''ఈ రోజు డాక్టర్లెవరూ లేరు. హైదరాబాద్ తీసుకెళ్ళండి'' అని చెప్పాడు.

అది విని సరోజిని ''నా క్లాస్‌మేట్ శ్రీలక్ష్మి ఈ ఊర్లోనే డాక్టర్‌గా ప్రాక్టీస్ పెట్టింది. మావయ్యా. తను కూడా హార్ట్ స్పెషలిస్ట్. ఆదివారమైనా కూడా నాకోసం తప్పకుండా అత్తమ్మని పరీక్ష చేస్తుంది. అక్కడికెళదాం'' అంది ఆదుర్దాగా. రాము కూడా అక్కడికే వెళదాం అనటంతో మళ్ళీ ఆటోలో శ్రీలక్ష్మి నర్సింగ్ హోమ్ కి తరలించారు.

సరోజిని తన ఫ్రెండ్ అయిన డాక్టర్ శ్రీలక్ష్మిని కలిసింది. ఆమె హుడావిడిగా వచ్చీరాగానే అరుంధతి నాలుక కింద ఓ టాబ్లెట్ ఉంచింది. పదినిమిషాల్లో నొప్పి క్రమంగా తగ్గాక అన్ని రకాల పరీక్షలూ చేసింది.

''ఈవిడకు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాల్సినంత అవసరంలేదు. మెడిసిన్స్ రాసిస్తాను వాడండి'' అంది. తరువాత శ్రీలక్ష్మి ఎంతకీ ఫీజు తీసుకోలేదు.

అరుంధతి మామూలైపోయినా మొహంలో ఆందోళన ఇంకా తగ్గలేదు. తిరిగి అంతా ఇంటికి బయలుదేరారు. పరంధామయ్య రిలీఫ్‌గా నిట్టూర్చారు. కానీ ఆ రాత్రే అనుకోని ఘోరం జరిగిపోయింది.

అరుంధతి గుండెల్లో మరోసారి వచ్చిన నొప్పి.... ప్రాణాల్ని పైపైనే తోడేసింది. నొప్పి తీవ్రమవుతుంటే బాధగా, నిస్సహాయంగా భర్తవైపు, కొడుకూ కోడలివైపు, పిల్లల వైపు చూస్తూనే చనిపోయింది.

నెలరోజులదాకా ఆ ఇంట్లో స్మశాన స్తబ్ధత విలయతాండవం చేసింది. తరువాత అరుంధతి జ్ఞాపకాలు ఇంట్లో రోజురోజుకి బాధపెడుతుంటే కనీసం కాలేజీకెళితేనన్నా బావుంటుందేమోనని బయలుదేరాడు పరంధామయ్య, అప్పటికే తనూ వెళ్ళిపోవడానికి తయారైన వైదేహి సూట్‌కేస్‌తో వచ్చింది.

''నాన్నా... నేనూ వెళుతున్నాను. ఆయనకి వంటకి ఇబ్బంది అవుతుంది'' అంది.

''సరేనమ్మా... మీ అన్నయ్య క్యాంపులకీ, మీ వదిన ఆఫీస్‌కీ, పిల్లలు స్కూళ్ళకీ వెళ్ళాక నాక్కూడా ఈ ఇంట్లో మీ అమ్మ జ్ఞాపకాలు బాధపెడుతున్నాయి. అందుకే నేను కూడా మళ్ళీ ఈరోజు నుంచి కాలేజికెళుతున్నాను'' అన్నాడు.

''సరే నాన్నా...'' అంటూ ఆగింది.

''ఏంటమ్మా... బస్టాండ్ వరకూ రావా?'' అనడిగాడూ.

''అదికాదు నాన్నా. ఆరోజు నేనొచ్చే సరికే అమ్మని పాడెపై ఉంచారు. అమ్మ మీద నాలుగు తులాల పుస్తెల తాడు ఉండాలి. అన్నయ్యో, వదినో తీసుంటారు. తల్లి మీది సొమ్ములు కూతురికే చెందుతాయని ఆయన వచ్చేటప్పుడు చెప్పారు'' అంది.

పరంధామయ్య మనసులో గుండు పిన్నుతో గుచ్చినట్లయింది.

''మీ అమ్మ చనిపోయిన బాధలో నాకా విషయమే తెలీదు. బహుశా సరోజిని తీసుండొచ్చు. మళ్ళీ వచ్చినోజు ఆ విషయం ఆలోచిద్దామమ్మా'' అన్నాడు బయలుదేరుతూ.

''వదిన మాటవరసకైనా ఈ ప్రస్తావన తేలేదు నాన్నా'' అంది కొంచెం కోపంగా.

''మీ అమ్మ పోయాక ఇంటిపని, వంటపని, ఆఫీస్‌తో సరోజినిక్కూడా తీరికలేదమ్మా మర్చిపోయిందేమో. ఆమె అలాంటిది కాదులే'' అన్నాడు. బయటికి వచ్చాక ఆటోని పిలిచి వైదేహినెక్కించాడు.

కాసేపు ఆలోచించాక... కాలేజీకి వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు పరంధామయ్య.

✡ ✡ ✡

ప్రిన్సిపాల్ జయశంకర్ అటెండర్‌తో పరంధామయ్యని తన గదిలోకి పిలిపించాడు. అప్పటికే స్టాఫ్ మీటింగ్ ప్రారంభమైంది. ప్రంధామయ్య గదిలోకి రాగానే ''కూచోండి మీరు ఇంటర్ ఫస్టియర్‌లో సుజల అనే అమ్మాయిని చాలా సీరియస్సయ్యారట'' అనడిగాడు.

''అవునండీ. ఆ అమ్మాయి ప్రవర్తన బాగోలేదు. ఆ పిల్లతో క్లాసంతా డిస్టర్బ్ అవుతోంది'' అన్నాడు.

''అంతమాత్రానికే మీరు సీరియస్సయితే ఎలాగండీ? ఒకవేళ ఆ అమ్మాయి వేరే కాలేజీలో జాయినైతే ఎంత నష్టమో తెలుసా? ఏటా ముప్పై అయిదువేలు, అంటే రెండేళ్ళకి డెబ్భైవేలు నష్టపోవాల్సివస్తుంది. ఇంకోసారి ఎవర్నీ ఏమీ అనకండి. ఇక మీరు వెళ్ళొచ్చు'' అన్నాడు కొంత సీరియస్‌గా.

పరంధామయకి మిగతా స్టాఫ్ ముందు అవమానంగా అనిపించింది. లేచి వస్తుంటే వెనకనుంచి జయశంకర్ మాటలు వినిపించాయి. ''వీళ్ళబ్బాయి నా క్లాస్‌మేట్ కమ్ రూమ్మేట్. మా నాన్న ఖాళీగా ఉంటున్నారా! నీ కాలేజీలో జాయిన్ చేస్కో అని పోరుపెడితే తీసుకున్నా. కాని ఈ ముసలాడు చెప్పే హిందీకి ఆ మూడు వేలు కూడా వేస్టే'' అన్నాడు.

పరంధామయ్య నిశ్చేష్టుడయ్యాడు. రిటైరయ్యాక తన కొడుకు తన సంపాదనపై...?

ఇంకా ఆలోచించలేకపోయాడు.

కాలేజి నుంచి బయటపడి, రోడ్డుపై కొచ్చాడు.

భారంగా ఇంటివైపు నడక సాగిస్తుంటే ''నమస్కారం మేస్టారూ. నేను అటే వెళుతున్నాను కూర్చోండి'' అని స్కూటర్ ఆపాడు ఓ అబ్బాయి.

పరంధామయ్య అనుమానంగా చూస్తుంటే ''నేను ఒకప్పుడు మీ స్టూడెంట్‌ని. ఇప్పుడు డాక్టరునయ్యాను. శ్రీలక్ష్మి నర్సింగ్ హోంలో జూనియర్ డాక్టర్ గా పనిచేస్తున్నాను. స్కూటరెక్కండి. ఇంటి దగ్గర దింపేస్తాను.'' అనటంతో పరంధామయ్య కూచున్నాడు.

స్కూటర్ వేగంగా నడుపుతూనే అతడు ''మాస్టారూ.... మీరేమీ అనుకోనంటే ఒక విషయంచెపుతాను'' అన్నాడు.

''చెప్పు బాబూ!''

''అమ్మగార్ని ఆ రోజు హాస్పిటల్‌కి తీసుకొచ్చాక నిజానికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాల్సి ఉంది. కాని మీ కోడలు, డాక్టరమ్మ ఫ్రెండవటంతో 'రేపో మాపో చచ్చే ఈ ముసలావిడకి హార్ట్ సర్జరీ చేసి రెండు లక్షలు చేయటం ఎందుక'ని ఒప్పించింది''. అన్నాడు.

పరంధామయ్య గుండెల్లో బ్లాస్టింగ్‌లా పేలిందామాట.

కళ్ళు చీకట్లు కమ్మాయి.

ఇంకా అతడేదో చెపుతున్నా వినిపించట్లేదు. పావుగంటలో అతడు ఇంటిముందు దింపేసి వెళ్ళాడు.

ఇంట్లోకి నడిచే ఓపిక కూడా లేక వరండాలోని వాలుకుర్చీలో కూలబడ్డాడు.

మనసు అల్లకల్లోలమైంది.

ఇంటిముందు క్రికెట్ ఆడుకుంటున్న పిల్లలంతా ఒక్కసారిగా వచ్చి ''తాతయ్యా.. మ్యాచ్ ఫిక్సింగ్ అంటే ఏమిటి?'' అనడిగారు.

''బుకీలంటే ఎవరు తాతయ్యా?'' అనడిగాడు మరో మనవడు.

''బుకీలంటే... ఆ డాక్టరమ్మ, ఆ ప్రిన్సిపాలూ, నా అల్లుడురా.... మానవ సంబంధాలపై బెట్టింగ్ ఆడుతున్నారే మీ అమ్మ, మీ ఆంటీ వీళ్ళంతా ఫిక్సర్లు, జాతినీ, దేశాన్నీ ప్రేమించే సంస్కృతి కనుమరుగైపోతుంటే ఆటలేకాదు. కుటుంబాలే విచ్ఛిన్నమైపోతాయ్. ఇంతకన్నా విషాదకరమైంది మరేదీ కాదేమో. ఇంతకన్నా శాంతి భద్రతల సమస్య ఇంకేది లేదేమో. ఆటకన్నా కుటుంబం చాలా గొప్పది. మానవీయ మూలాల్ని చెల్లాచెదురు చేసే ఈ ఫిక్సింగ్‌లని ఎదుర్కోవడానికి ముందు ముందు మీరు అగ్ని పరీక్షలే కాదు, అణు పరీక్షల్లాంటి పరిస్థితుల్ని ఎదుర్కోవాల్రా పిల్లలూ...'' పరంధామయ్య చెప్పలేదు.

మనసు ఘోషించింది.

కళ్ళలోంచి నీళ్ళు ధారాపాతమయ్యాయి.

''అదేంటి తాతయ్యా... మ్యాచ్ ఫిక్సింగ్ గురించి అడిగితే నువ్వేడుస్తున్నావ్?''

అన్నారు భుజాలు పట్టి కుదుపుతూ....

అతడి కళ్ళు మూతలు పడ్డాయి. వాలు కుర్చీలోనే ఒరిగిపోయాడు. 'మ్యాచ్ ఫిక్సింగ్' అంటే తాతయ్యకి కూడా తెలీక నిద్రపోయాడనుకుని ..... వాళ్ళు క్రికెట్ ఆటలో మునిగిపోయారు.

✡ ✡ ✡

కాగితం ముక్కలు, గాజు పెంకులు

- బుచ్చిబాబు

వెనక తగిల్చిన పాత రైలు పెట్టెలను లాక్కొచ్చి వాళ్ళు ముందు గిరాటెట్టింది కొత్త రైలింజన్. బ్రతుకంతా భ్రమ అనుకుని మడిగట్టుకుని మూల కూర్చుని పెదవి చప్పరించే వారికి ఈ కొత్తింజన్ ఒక సవాల్. భీకరమైన కూత - ఎక్కడో భూమిని దొల్చుకుని గోళం మధ్యలో కాలం బంధించిన ప్రళయాన్ని కదిపి ఆ ధ్వనుల్ని తనలో జీర్ణించుకుని గతంలోంచి ప్రాణాన్ని తెచ్చుకున్న ఒక చారిత్రాత్మక కళేబరం ఆ ఇంజన్. దాన్ని చూస్తే రైలు నడిపేవారికీ ప్రయాణికులకీ కూడా భయమే. కావాలనుకున్న రైలు ఆలస్యంగా రావడానికి వీలు చిక్కనీదు ఆ ఇంజన్. అసలు నాలుగైదు నిముషాలు ముందే వెళ్ళి కూర్చుంటుందిట. రైల్వే వారికదొక సమస్య. ప్రయాణికులు ఎలాగొలా దానిలో వెళ్ళి పడాలి. తీరుబడిగా, తాపీగా, నిశ్చింతగా, సోమరిగా ప్రవర్తించకూడదు. అది రావడం, వెళ్ళడం కూడా ఒక స్వప్నం లాంటిదే. అది కదలడం, వేగంగా కదలడం రెండూ ఒకటే. మెల్లమెల్లగా వేగాన్ని పెంచుకోడం అంటూ లేదు.

"ఈ కొత్తింజన్‌కి తలకాయి లేదు కదూ - నాలా" అన్నాడు నరసింహం. పెట్టెలో సామాను పడేసిన చంద్రానికి నవ్వొచ్చింది. అవును నరసింహానిది పెద్ద తల - పెద్ద మెడ, మెడ మొహం కల్సిపోయినట్లు ఒక స్థంభంలాగుంటాయి. తల పెద్దదిగా ఉంటే, మెడ సన్నటిదిగా కనపడుతుందని, చదువుకునే రోజుల్లో జుట్టు పెంచేశాడు. పెద్ద ఉంగరాల జుట్టు విచ్చలవిడిగా పెరిగి నుదుటి మీద, కళ్ళల్లోనూ పడుతూ, వెనక్కి తోసినప్పుడల్లా చేతులకు పని చెబుతూ, మనిషి భీకరంగా ఉండేవాడు - అందరూ "సింహం" అని పిలిచేవారు. మరిప్పుడో - ఆ జుట్టు లేదు. ఆర్మీలో ఉద్యోగం అదంతా కత్తిరించేసి పొట్టి క్రాప్ మెడవెనక పై భాగం ఆకుపచ్చ చర్మం పాచిలా కనిపిస్తూనే ఉంటుంది.

"తల పెద్దదయితే భుజబలం ఉండదంటారుగా పెద్దలు. ఇంజన్‌కి అదుంది. ఈ రోజుల్లో కావల్సిందే అదిగా" అన్నాడు చంద్రం. కులాసా కబుర్లకు వ్యవధి నివ్వకుండా, ఒక పెద్ద కూత పెట్టింది. అది కూత కాదు. కంఠంలోంచి ధ్వనులు రావడం కాదు. మొత్తం శరీరం అంతా కంఠమై, అల్లాగయ్యే యత్నంలో ఆ కంఠం పగిలినప్పుడొచ్చిన ధ్వని. ప్లాటుఫారంపై జనం అదిరిపడ్డారు.

"చూస్కో - నే ఉన్నానని తెలిసి కాబోలు ఇంజన్‌గారు విర్రవీగిపోతున్నారు..." అన్నాడు 'సింహం.'

"రైలు కదులుతోంది" అన్నాడు చంద్రం.

"రైలు కదలడం లేదు" ఆ ధాటికి భూమే వెనక్కి పారిపోతోంది. చాలా థాంక్స్. ఈ నాలుగురోజులు హాయిగా గడిచాయి. అరుణకి మరీ మరీ థాంక్స్ చెప్పు. ఇదుగో ఈ హంటర్ అంటే మోజుపడ్డావు దగ్గరుంచుకో - జ్ఞాపకార్థం."

అంటూ చేతిలో హంటర్ చంద్రానికిచ్చాడు. అతను తటపటాయిస్తున్నాడు. ఇంజన్ మరొక్కసారి కేకేసింది - మిగిలిపోయిన ఆ కాస్త శక్తినీ ఇప్పుడు పూరించుకుని. జండా పట్టుకున్న గార్డు కూడా అదిరిపడ్డాడు. ఒక్క గంతేసి రైల్లో పడ్డాడు గార్డు.

"చూశావా - వద్దంటానికి వీల్లేదు. ఇంజన్ కూడా నోరు కట్టేసుకోమంటోంది..."

అప్పుడే చాలా దూరం వెళ్ళిపోయింది పెట్టె. 'సింహం' పెద్ద తలకాయ చిన్నదవుతోంది. చుక్కలాగై అంతర్ధానమైంది. హంటర్‌ని చేతిలో తిప్పుకుంటూ చంద్రం ఇంటికి బయలుదేరాడు. ఆర్మీలో పెద్ద ఉద్యోగస్తుడు వాడే హంటర్ అది. మూడడుగుల పొడవు, రెండంగుళాల వెడల్పు గల దండం చుట్టూ చాక్‌లెట్ రంగు తోలు చాపలా అల్లి ఉంటుంది. ముందు ఒక అడుగు పొడుగు, రెండూ తోలు పటకాలు లాగ వేళ్ళాడుతూ ఉంటాయి. అది తనకేమీ ప్రయోజనం లేదు. స్నేహితుడు జ్ఞాపకార్థం ఇచ్చింది. కాదనలేకపోయాడు. చదువుకునే రోజుల్లో మోటుగా, కరుకుగా ఉండేవాడు సింహం. పోకిరీ అని చెప్పుకోవడం కూడా తనకి జ్ఞాపకం. ఆర్మీలో ఈ ఉద్యోగం అతనికి సరి అయినదే. ఆర్మీలో ఉన్నాడంటే మోటుగా, కరుకుగా ఉండి ఉండాలని అనుకున్నాడు, చాలామందిలాగే తనూ. కాని సింహం అలాగ లేడు. నవ్వించడం కోసం కొంత చౌకబారు సంభాషణ సాగించినా - అరుణ ముందు మరీనూ - మొత్తం మీద నమ్రతగా, సంస్కారంతో వచ్చిన ఒక నాజూకుతో వ్యవహరించాడు. ఆర్మీలో ఉన్నవారికి ఎక్కువ వినోదాన్ని కల్పించి మామూలు సమాజంలో సాధ్యంకాని స్వేచ్ఛతో ప్రవర్తించే అవకాశాలు కల్పిస్తారట. కదిపితే ఆ విషయాలన్నీ అతను చెప్పునేమో. ఏకాంతంగా అవన్నీ చెప్పుకునే అవకాశం దొరకలేదు. వారిద్దరి మధ్య ఏదో ఒక తెరలాంటిది ఉంది. డబ్బువల్లనో, హోదా వల్లనో, సంస్కారం వల్లనో, మసలే సమాజం వల్లనో దేనివల్లనైతేనేం, వారిద్దరూ అనుకున్నంత అన్యోన్యంగా, దగ్గరగా ఉండలేకపోయారు. బహుశా 'అరుణ' సమక్షంలో వారిద్దరూ ఎక్కువగా గడపటంవల్లనేమో. చంద్రానికి నవ్వొచ్చింది. ఉన్న నాలుగురోజులు ఆమె ఎదురుగా ఉన్నా లేకపోయినా కూడా అరుణని అరుణగారూ అంటూనే వ్యవహరించాడు సింహం. రైలు కదిలేప్పుడు మాత్రం ఆ "గారూ" వదిలేసి "అరుణ" అనే వ్యవహరించాడు. అంటే ఈ నాలుగురోజుల్లోనూ వారి మధ్య పెంపొందిన అనురాగానికి అదొక చిహ్నం. ఒకర్ని ఒకరు "గారు" అని సంబోధించే అవసరం ఉన్నంతవరకూ వారిని నిజమయిన స్నేహితులుగా పరిగణించడం సాధ్యం కాదేమో!

ఇంటికి చేరుకున్నాడు. మెట్లెక్కి తలుపు కొట్టాడు - నౌకరు తలుపు తీసి హాల్లో కుర్చీలు బల్లలు, సర్దుతున్నాడు. గోడ గడియారం అప్పుడే పది కొట్టింది. పోస్టుకు వెళ్ళి టపా తెస్తానని నౌకరు బయటకి వెళ్ళాడు. హంటర్ హాల్లో మధ్య బల్ల మీద పడేసి, పత్రిక కోసం వెదుకుతూ పక్క గదిలోకి వెళ్ళబోయేముందు భార్యని పిలిచాడు. సమాధానం లేదు. మళ్ళా వెనక్కొచ్చి, ఏమీ తోచక బల్ల మీద హంటర్ చేతిలో పట్టుకుని, గది దగ్గరికెళ్ళి తలుపు కొట్టాడు. ఒక్క క్షణం ఆగి తలుపు తోశాడు. సరిగ్గా పడని గడియ కాబోలు, చప్పుడు చేస్తూ కిందకి జారింది. తలుపు తోసుకుని లోపలికెళ్ళాడు. ఎదురుగా అద్దం బల్లముందు మడత మంచం మీద కూర్చుని ఏదో కాగితం కేసి చూస్తూ ఉంది అరుణ. భర్త రాగానే కంగారు పడినట్లు ఉలిక్కిపడి తను చూస్తూ ఉన్న కాగితాన్ని గుప్పెట్లో దాచేసి అతనికేసి చూడకుండా "అబ్బ, అబ్బ. కాసేపు అవతలుండండి" అంది.

ఇదివరకెన్నడూ చూడని అరుణని చూచాడు చంద్రం. తలంటు పోసుకుని జుట్టు తడిని తువ్వాలులో బిగించి ఆర్పుకుంటూ, పల్చటి తెల్ల చీర పూర్తిగా కట్టుకోకుండా ఒంటికి సగం సగం చుట్టబెట్టుకుని, జాకెట్టు లేని భుజంపైన జారిన తడికొంగు మడతగా మంచం కిందకి జారిన కొంగు చటుక్కుని కనబడక, తువ్వాలును లాగి మెడచుట్టూ కప్పుకున్న అరుణ అదొక వింత దృశ్యం. అరుణ - పల్చటి మనిషి. బహు లేత శరీరం. స్ఫుటంగా ఆకృతి పొందిన అవయవాలు. గుండ్రతనం, నిండుతనం లేవు. అన్ని కోణాలు,

బలహీనమైన ఎముకలూ, నరాలు. బ్యాటరీ లైటు ఆమె శరీరంపైన ఫోకస్ చేస్తే ఇటు నుంచి అటు ప్రసరిస్తుంది కాంతి. బలంగా, లావుగా కనబడేందుకు ఆమె చేసే యత్నాలు చంద్రానికి తెలుసు. మందంగా ఉండే బట్టతో అనేక మడతలుగా తీర్చిన లంగా, దానిమీద ఎనిమిది గజాల చీర, బయటికెళ్ళినప్పుడు వెల్వెట్ జాకెట్టు, సన్నటి, పల్చటి నాజూకైన మొహం. ప్రశాంతమైన కళ్ళు, శాశ్వతమైన మందహాసాన్ని సూచించే నోరు, జాలిగా మెరిసే క్రమమైన చిన్న పళ్ళ వరస, ఒంపుకు ఆస్కారం లేని చిన్న చెక్కిళ్ళు, ఆ మొహం మరీ అంత చిన్నదిగా కనపడ్డానికి కారణం ఆమె జుట్టు, దట్టంగా ఒంపులు తిరిగిపోయిన మొహం, మెడ, భుజాలు ఆవరించే మందమయిన తలకట్టు. ఇప్పుడు ఆమె కళ్ళు ఎర్రగా ఉన్నాయి. నిప్పులు గ్రక్కడం అంటే అదే కాబోలు. క్రౌర్యంతో పెదవులు చలించి చిన్న రంధ్రంలోంచి సోకిన సూర్యకిరణంలా ఒక గీతగా పెదవులు చివరలో బిగుసుకున్నాయి. నొక్కిపెట్టిన గుప్పెటి పైన నరాలు పదునుగా తీర్చి ఉన్నాయి. ఏదో మహావృక్షం ఎన్నాళ్ళుగానో భూమికి పెనవేసుకున్న వ్రేళ్ళలాగా - చేష్టలో ఒక వికృతమైన ప్రాచీన శక్తి కనిపించిన వాడికిమల్లే అరుణని చూసి చంద్రం దిగ్భ్రమ చెందాడు. క్షణంలో తేరుకున్నాడు.

''చేతిలో ఏమిటది?''

సమాధానం లేదు.

ఒకడుగు ముందుకు వేశాడు.

ఆమె భుజాల తడి ఆరింది - కాని చీరమడతలు తడికి చర్మాన్ని అంటిపెట్టుకుని శరీరకాంతిని బైటపెడుతున్నాయి. పరాయి స్త్రీగా కనబడుతోంది అరుణ.

''నిన్నే''

''బైటికెళ్ళండి'' అంది గుప్పిడిని చీర మడతలో దాచుకుంటూ.

''ఏమిటది?''

''ఏమీ లేదు?''

''చెప్పాలి''

''ఏం లేదన్నానుగా''

చంద్రం మరో అడుగు ముందుకి వేశాడు. ఆమె మంచం మీద కొంచెం వెనక్కి జరిగింది. ఎడమ చేతిలో మంచం బద్దీని నొక్కిపెట్టినప్పుడు భుజం మీద ఒంపు రొమ్ములని కదిపి, చీర మడతలని కదుపుతున్నాయి.

''చెప్పి తీరాలి.''

చంద్రంలో అస్పష్టమైన వాంఛ రేగినట్లు కళ్ళు పదే పదే చిట్లిస్తున్నాడు.

''చెప్పకపోతే?''

అరుణ చూపులో, మాటలో పెంకితనం, కొంటెతనం కూడా ప్రకటించింది.

''ఏం మాట్లాడుతున్నావో, ఎవరితో మాటాడుతున్నావో తెలుసా?''

''తెలుసు.''

''మరిలాగియ్యి అదేమిటో''

''ఇవ్వను. ఏం చేస్తారేమిటి?

అరుణ సంసార బంధాన్ని విస్మరించింది. తను భార్య కాదు - వ్యక్తిత్వంతో ప్రజ్వరిల్లుతున్న ఒక ప్రాణి. ఆ తిరుగుబాటుతో ఆమె మరీ దూరమైపోతోంది. లోయలో నిలబడి దూరంగా శిఖరంపై కలని వెదుక్కుంటూ తిరుగాడే దేవకన్యని పిలిచినట్లుగా ఉంది.

అతనొక బురదగుంట. అందులో తారక ప్రతిబింబంగా అరుణ కదులుతోంది. ఆ తిరుగుబాటు అతనిని కవ్వించినట్లయింది. ఆమెను తన చేతుల మధ్య బిగించి ఆ శక్తికి ఆమె శరీరం వీడి రక్తం కారుతుంటే, అతనిలో కామజ్వాల చెలరేగి అందులో ఆమె హతమవుతే - ఏదో వెర్రి ఆవేశానికి లొంగిపాయ్యాడు చంద్రం. అతని ఆవేశం వెనక పురుషుడు, "మాన" ఉన్నాయి. చరిత్రలో కాయకష్టం చేసి, సౌందర్యాన్ని ఆరాధించి, విఫలులైన లక్షలాది మానవుల - పురుషత్వం ఉంది. తనింక ఆమె భర్త కాడు, చంద్రం కాడు. బలహీనమై, తన చేతిలో లొంగిపోయి, తనిష్టమొచ్చినట్లు వాడి ధ్వంసం చేసుకునేందుకు అనువైన ఒక స్త్రీ దొరికిన, పురుష, పశుశక్తుల కుప్ప.

"ఏం చేస్తానా?"

మీదికొస్తున్నాడు చంద్రం నల్లమేఘాన్ని తరుముకొచ్చిన పెనుగాలిలో అల్లల్లాడిపోయిన గడ్డిపువ్వులా ఆమె ఒణికిపోయింది. ఆ గడ్డి పువ్వుకి కూడా వేరుంది - విత్తనం ఉంది. అవి భూమిలో పాతుకుని ఉన్నాయి. భూమండలంలో శక్తికి కదిలినట్లుంది ఆమె. ఇంకా వెనక్కి జరిగింది. మడత మంచం చివర - చీర కొంగు జారి రొమ్ముల మధ్య ఇరుక్కుంది. శ్వాస వేడిగా, తెరలుగా వదులుతోంది.

"నాకు తెలుసు" అన్నాడు.

"తెలిస్తే ఇంకెందుకు? వెళ్ళండి."

"చూడకుండా వెళ్ళను."

"నేనే వెడతాను" అని లేవబోయింది అరుణ. చీర ముడి సరిగ్గా లేక నడుం మీదకి జారిపోతోంది. మంచంమ్మీద దుప్పటిని పైకిలాక్కుని కప్పుకుంటోంది. లేవలేదు. మళ్ళా అక్కడే చతికిలపడింది.

"అది ఉత్తరం, అవునా?"

"అవును"

"ఎవరు వ్రాశారు?"

"అది తెలుసుకున్న వారు ఇదీ తెలుసుకోండి."

చంద్రం తల తిరుగుతోంది. అతనికంతా తేటతెల్లమయింది. మరిప్పుడు ఆవేదన లేదు, నరాలు లాగడం లేదు - స్థిరపడి కార్యానికి సిద్ధపడుతున్నాయి. "సింహం" స్టేషన్‌లో "అరుణగారు" అనడం బదులు "అరుణ" అని ఎందుకన్నాడో తెలిసింది. వారిద్దరూ ఉన్నప్పుడు, ఆమె సంభాషణ అదొకలా నడిచింది. చెప్పుకున్న కబుర్లన్నీ ఎవరినో ఉద్దేశించి చెప్పినట్లుగా ఉన్నాయి. అరుణ "సింహం" కేసి అదొకలా చూసింది - ఆ చూపులో అమాయకత్వం బదులు, కుటిలత్వం కనబడింది. గుడ్లు ఒప్పచెప్పేసిన చూపులవి. "సింహం" గురించి చదువుకునే రోజుల్లో నలుగురూ చెప్పినవి గుర్తుకొస్తున్నాయి. అతనిలో సంస్కారం లేదు, నాజూకు లేదు - ఆర్మీలో వాళ్ళ మోటుతనం కరుకుతనం ఉన్నాయి. ఆ పెద్దతల, పాచిలా మెరిసే పెద్దమెడ, భీకరమైన కనుబొమలు - బొగ్గుగనిలోకి తొంగిచూసినట్లు, నల్లకళ్ళు - అబ్బ! ఆ స్థానంలో అతను తప్ప, ఇంక ఎవరున్నా, ఆమెను క్షమించివుండును చంద్రం. ఆమెలో నాజూకు, అమాయకత్వం, మృదుత్వం సహజంగా ఉన్నాయి. వాటికి వ్యతిరేకమైన లక్షణాలు సింహలో ఉన్నాయి. అందుకనే వాటిని కోరింది కాబోలు.

"ప్రేమలేఖ?"

"అవును"

"చూడనీ."

"చూడనివ్వను. మీకొచ్చిన ఉత్తరాలన్నీ నాకు చూపుతున్నారా?"

"వేళాకోళమా?"

"నిజంగానే"

''ఇస్తావా ఇవ్వవా?''

''ఇవ్వనంటినిగా.''

అర్థంలేని ధ్వని చేశాడు చంద్రం. ఆమె మీదకొచ్చాడు. అతని రెండు మోకాళ్ళు మంచం ముందు భాగంలో ఆనించి ఆమెను పట్టుకోబోయ్యాడు. అరుణ వెనక్కి కదిలింది. ఆమె చెయ్యి మెడ వెనకదాచింది. భుజం మీద పడింది అతని చెయ్యి. డేగ పాదం కప్ప పిల్ల మీద పడ్డట్టు మంచం చివరికి జరిగింది - పట్టులేదు. లుంగ చుట్టుకుని కిందపడింది. బరువుకి చంద్రం ఉన్న భాగం పైకి లేచిపడింది. అతను ఆ ఊపుకి కింద వెల్లకిల పడ్డాడు. దెబ్బ తగిలింది. అతని చూపు తడబడుతోంది. వస్తువులు కనిపించడం లేదు. బుర్రలో వాక్యం నిర్మాణం అవడం లేదు. ఏవో సగం ధ్వనులు - లేస్తున్నాడు. లేచాడు. దూరంగా అరుణ వాడి ఊడిన ఆకులా - ఒడ్డునపడి తెప్పరిల్లిన తెల్లపిల్ల కెరటంలా - చందమామను కప్పిన తెల్ల మేఘంలా అరుణ - ఊహలో అరుణం, జ్వాల నాలుక, కత్తి, బాణం, అగ్ని దేవుడు విప్పి పారేసిన వస్త్రం, చిలుక పొడిచిన ఎర్రపండు - ''సింహం'' నోట్లో నలిగిన పావురం అరుణ. తను బోనులో లేచాడు, బోను కడ్డీలు ఊడపీకుతున్నాడు. ''ఇస్తావా ఇవ్వవా?'' ఆమె మీదకి వెళ్ళి, ఒక్క ఊపుతో ఆమెను నిలబెట్టి మంచం పైన కూలదోశాడు. చేతిలో ''హంటర్''ని గిరగిర తిప్పి, వ్రేళ్ళాడుతున్న పటకాలతో ఆమె జబ్బ మీద కొట్టాడు. ఆమె పెనుగులాట విరమించి, మంచం మీద నుండి జారి, చేతి పట్టు విడిచేసి, కింద పడింది. చంద్రం ఆ ఉత్తరాన్ని చిక్కించుకున్నాడు. హంటర్‌ని భుజాన వ్రేళ్ళాడేసుకుని హాల్లోకి నడిచాడు. బల్లమీద గ్లాసులో మంచినీళ్ళు త్రాగాడు. ముందు గదిలోకెళ్ళి తలుపేసుకుని ఉత్తరం చదువుకున్నాడు.

ఆకుపచ్చ రంగు కాగితం, పై భాగం చిరిగిపోయింది. అక్షరాలు సరిగ్గా కనబడటం లేదు.

''....నేనింక సుఖపెట్టగలనేమో. ఇన్నాళ్ళు ఉద్యోగం లేక నాతోపాటు నిన్ను కూడా ఈ సమిష్టి కుటుంబానికి బానిసగా చేశాను.... నిర్మలమైన సెలయేటి అడుగున కనిపించే బంగారపు ఇసుకలాంటి నీ శరీర కాంతి, నా చీకటి కలను వెలిగించింది. అంతటి నిర్మలమైంది కూడా నీ హృదయం, సుకుమారమైంది నీ శరీరం. ఏటికి అటూ ఇటూ గట్లంట ముళ్ళ పొదలు - పెద్ద పెద్ద చెట్లు - ముసలివై ఊగిసలాడి కొన ఊపిరితో భూమిని అంటిపెట్టుకున్న ఆ చెట్లలాంటి నా జీవితానికి ఆ ఏరు మెల్లగా నృత్యం చేస్తూ, సున్నిత కంఠంతో గానం చేస్తూ ప్రవహిస్తూంటే చూసి ఆనందించటం తప్ప పరమావధి లేదు. అన్ని నదులూ ఎప్పుడో ఒకప్పుడు ఒక చోట సముద్రంలో పడాల్సిందే అన్నాడు ఒక కవి. ఇప్పుడా సమయం వచ్చింది. ఉద్యోగం దొరికింది. నీకు ఉయ్యాలంటే ఇష్టం కదూ?.... మనుష్యులు లేని ఏకాంత లోయలలో రెండు శిఖరాలకి మధ్య తగిలిద్దాం ఆనందం అనే ఉయ్యాలని.... సిగ్గుతో దూరంగా వెళ్ళని పిల్ల వాయువు ఆ ఉయ్యాలని ఊపుతుంది. చెట్ల ఆకులు సంతోషానికి తట్టుకోలేక మన మీద ఊడిపడి మన ఆనందాన్ని పంచుకుంటాయి.... అరుణా... కొండ వెనక నుంచి ఒక్కసారిగా నీ మోము వెలిగించే ప్రభాత కిరణం, నీ స్నానం కోసం వేచివున్న అడివి కొలను... మనకోసం ఎదురుచూస్తూ ఉన్నాయి.''

తరువాత అక్షరాలు బొత్తిగా కనబడటం లేదు. సంతకంకూడా లేదు. కాని చంద్రానికి తెలుసు. వివాహం అయిన మరుసటి సంవత్సరం ఉద్యోగం దొరకగానే అతను, అరుణకి వ్రాసిన లేఖ అది. అవుతే, అంత దాపరికం దేనికి? అర్థంలేని మొండిపట్టా? మూర్ఖత్వమా? హాస్యధోరణిలో ప్రారంభించిన పెంకిపట్టు. విషాదంగా అంతమొందిందా? అతని అర్థం కావడంలేదు. ఆ ఉత్తరం అరుణకి ఆనందం ఇచ్చివుండాలి, ఎన్నేళ్ళ క్రితమో తాను పొందిన ఆనందాన్ని మళ్ళా ఇప్పుడు చదువుకుని పొందుదామన్న సంకల్పానికి తనరాక అంతరాయంగా పరిణమించింది. ఆ ఉత్తరం వ్రాసిన చంద్రం వేరు. ఆ చంద్రం ప్రియుడు - యవ్వనంలో స్వప్నాలల్లే మాంత్రికుడు. ఇప్పటి చంద్రం భర్త. ఉద్యోగం, హోదా, డబ్బూ, నౌకర్లు, స్నేహితులు, మర్యాదలు - ఆమె భార్య - వంటొండి పెడుతుంది. ఆ ఉత్తరం చదవడంలో గతించిన కలలు తిరిగి ఊహలో సృష్టించుకుని, రహస్యమైన ఆనందం పొందుదామని, తలంటుపోసుకుని, అలంకరించుకుంటూ, ఏకాంతంగా గతంలో యాత్రకి బైలుదేరుతుండగా, భర్త అనే ఇప్పటి చంద్రం, వర్తమానాన్ని హంటర్ స్వరూపంలో

తన ముందు ప్రత్యక్షమై ఆ ఊహా జగత్తుని ధ్వంసం చేశాడు. అందుకే అతన్ని పరాయివాడిగా, విరోధిగా తూలనాడి, ఎదురుతిరిగి, స్వప్నజగత్తులో తన నిజ స్వరూపాన్ని ఒక్కసారి చూపెట్టింది.

వారికిప్పుడు ఏలోటూ లేదని చంద్రానికి తెలుసు. డబ్బుంది, ఉద్యోగముంది, ఆరోగ్యం ఉంది - అన్నీ ఉన్నాయి. కాని ఏదో లోపించింది. ఆ లోపించింది ఆ ఉత్తరంలో ఉంది. అందుకే అంత రహస్యం. గతానికో అద్దం ఆ ఉత్తరం. అందులో తన నిజస్వరూపం చూసుకుంటుంది. ఉత్తరం నలిగింది; అద్దం మసగ్గా ఉంది. అన్నీ మరకలు, తలంటు పోసి, శుభ్రం చేసినా బాగవదు... అంతే మరి.

చంద్రం హంటర్ తాళ్ళని తన వెన్ను మీద పేల్చుకు చూశాడు. శరీరానికి నెప్పి తెలుసు; బాధ తెలుసు. కాని హృదయానికి తెలిసేది గాయం. అద్దాన్ని పగలకొడుతుంది శరీరం. పగిలిన ముక్కల్ని ఏరి అతుకుపెడుతుంది హృదయం. హంటర్ బల్లమీద పడేసి, పైన పత్రిక కప్పి, అరుణగది కేసి నడిచాడు చంద్రం. ఆ పత్రికని హంటర్‌ని పూర్తిగా కప్పేటందుకు సర్దుతున్నప్పుడు, ఒక్క కన్నీటి బిందువు పడి, అక్కడ తడిసింది. ఒక్కటే బిందువు ఉంది - పగిలినవాటిని అతుకుపెట్టే జిగురులాంటిది. అది కాస్తా ఇప్పుడు పడిపోయింది.

✡✡✡



సెలవయింది

- గంధం యాజ్ఞవల్క్య శర్మ

(ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక ఫిబ్రవరి 27, 1963 సంచికనుంచీ)

నమ్మకం కుదరడం కష్టం. నమ్మకం ఉన్నా విడవకుండా దేవుని కొలవడం మరీ కష్టం. నమ్మి కొలిచేవారి సంఖ్యఎప్పుడూ స్వల్పమే అలాంటి వారికి స్వామిని కొలవడం వల్ల మాత్రమే తృప్తి చేకూరుతుంది. స్వామి సేవకు ఏమైనా అంతరాయం కలుగడం వారు సహించలేరు.

వర్షపు జల్లు కొంచెం వెనుకాడింది.

"నాయనా, రామూ, ఎవరో ఏమో అన్నారని సాక్షాత్తూ ఆ వెంకటేశ్వరస్వామికి అపచారం చేస్తామా? తెల్లవారితే ఆ స్వామి కళ్యాణ మహోత్సవం. మనం వెళ్ళి సేవించకుంటే ఆ పాపం మహాగ్రమై మనలను జన్మజన్మాలకు వెన్నాడదూ?" అన్నాడు కృష్ణంరాజు తమ్ముడు రామరాజుతో.

రామరాజు మొరాయించాడు? "నేను మళ్ళీ ఆ ఊరి పాలిమేర త్రొక్కను" అని.

కృష్ణంరాజుకు కొంచెంగా దగ్గు తెర వచ్చి సర్దుకుంది. కాని మనసు వికలమైంది. బాధతో సుళ్ళు తిరిగింది. రామరాజు తన నిర్ణయం అంతిమమన్నట్లు చెప్పి పోయాడు అక్కడి నుంచి. కృష్ణంరాజు హృదయం కలుక్కుమంది. ఆ బాధ శరీరమంతా వ్యాపించినట్లు అనిపించింది.

రాజు ఓపిక చేసుకుని బయటకు వచ్చి తొంగి చూశాడు. ఆకాశమంతా నల్లని మేఘాలతో పొంచి ఉంది. తూర్పు దిక్కుగా ఎర్రనైంది. మిన్నున ఇంద్రధనస్సు వెలసింది. దక్షిణ దిశగా చిన్న సౌదామిని భ్రమిసింది.

"రేపే స్వామివారి కళ్యాణ మహోత్సవం" గొణుక్కుంటున్నాడు రాజు. నలభై సంవత్సరాలు ఆ స్వామి సన్నిధిలో బ్రతికాడు. తన జీవితాన్నంతా ఆ స్వామి భజనలో పునీతం చేసుకున్నాడు. అలాంటిది ఈ నాటికి స్వామిని వదిలి వేయటమా? రాజు మనసు కలత పడింది. అలా జరగడానికి వీలులేదు. అలా జరిగితే తన ఈ జన్మకు అర్థం లేదు. నిష్కృతి లేదు. రాజు ఒక నిర్ణయానికి వచ్చాడు.

ఇంటిలోనికి వెళ్ళి కావడి పెట్టెలోని పాత శాలువా, నలువది సంవత్సరాలుగా తన్నంటి పెట్టుకున్న భజన చెక్కెలు తీసుకున్నాడు. ఎకాయెకిన ఒంటెద్దు బండి గంగులు దగ్గరికి వెళ్ళి, "వైకుంఠపురానికి బండి కావాలి" అని అడిగాడు.

గంగులు క్షణకాలం నిరుత్తరుడయ్యాడు. ఆ వయసులో కృష్ణంరాజు ప్రయాణం. అందులో ఒక ప్రక్క ముంచుకు వస్తున్న వర్షం.

"బాబూ! పైన మొగిలి లేచింది. మిన్నున కైవారం వేసింది. జల్లాగదు" అంటూ నసిగాడు.

''నా స్వామి కళ్యాణమూ ఆగదు'' తనలో తాననుకున్నాడు రాజు. పైకి, ''కాదు, గంగులూ! వెళ్ళాలి. కావలిస్తే రేటు ఎక్కువ తీసుకో'' అన్నాడు.

గంగులులోని ఆశ వెర్రులెత్తి అనుమానం, భయం సద్దుమణిగిపోయాయి.

సాయంత్రం నాలుగు గంటలకు, ఈదురుగాలి, చిరు చినుకుల జల్లుతో పాటు కృష్ణంరాజు వెక్కించుకుని గంగులు ఒంటెద్దు బండి ఎండ్రాయి గ్రామం నుంచి బయలుదేరింది వైకుంఠపురం కేసి.

✡✡✡

ఎండ్రాయి గ్రామం, గుంటూరు నుండి అమరావతికి వెళ్ళే మార్గంలో ఉంది. ఆ గ్రామంలో కృష్ణంరాజు వంశం ఒకటిన్నర శతాబ్దాలుగా ఉంటున్నది. అతని తాత ముత్తాతలందరు ఆస్తికులు; పాండిత్యం కలవారు. అనాదిగా వారు వృత్తిగా భజన పాఠాలు చెప్పుకుని జీవిస్తున్నారు. ఆ భజనలోనే వారి ఇహ పర పరమార్థాలు నిక్షిప్తమయ్యాయి. ఎండ్రాయి గ్రామానికి, వైకుంఠపురానికి ఐదు మైళ్ళుంటుంది. వైకుంఠపురంలో శ్రీ వెంకటేశ్వరస్వామి కోవెల ఉంది. అనాదిగా కృష్ణంరాజు కుటుంబానికి, వైకుంఠపురంలో ఉన్న ఆ శ్రీనివాసునికి అనుబంధ బాంధవ్యాలేర్పడ్డాయి. ఆ గ్రామ ప్రజకు రాజు కుటుంబం దైవసమానం. రాజు కుటుంబానికి ఆ గ్రామ ప్రజలంతా భక్తకోటే! వారినందరిని నిరంతర సేవా నిరతిలో ముంచి, ఆ జగన్నాధుని పాద సన్నిధికి చేరువ చేసే వ్యవస్థ తమది. ఆ ప్రయత్నంలో వారి జీవిత పారమార్థిక చింతన ఉంది.

సరిగ్గా 55 సంవత్సరాల క్రితం కృష్ణంరాజు పదిహేను సంవత్సరాల నూనూగు మీసాల వయస్సున ప్రవేశించాడు. తాత సుబ్బరాజుగారి చేత పండరి భజనకై జీవితాన్ని కైంకర్యం చేస్తున్నట్లు ఆన తీసుకుని, నడుముకు కాసె బిగించి, చేత చెక్కబట్టాడు. అది ఓ పవిత్ర విద్యా సంస్కారాభిలాష; కూచిపూడి వారు అయిదవ ఏట గజ్జె కట్టడంలాంటిది.

చేత చెక్క పట్టిన నాటి నుంచి రాజు పరవశమందాడు. లోన చిత్త సంస్కారం, అనాదిగా వస్తున్న వంశ సంస్కారం కలగాపులగంగా కలిసి రాజు తన జీవిత పరమావధి కేసి సాగిపోయే ప్రయత్నంలో ఉత్తీర్ణుడు కావడానికి ఎంతో ఉపకరించాయి. రాజు మిస మిసలాడే ఇరవై సంవత్సరాల వయసు నాటికి భజనలో ఉత్తీర్ణుడయ్యాడు. భద్రాచల రామదాసు కీర్తనలు పాడితే, గోపన్నే రాజులా జన్మమందాడనేవారు.

✡✡✡

ప్రకృతి ఫెళ ఫెళ మంది.

ఆలోచనల నుంచి తేరుకుని ముందుకు చూచాడు. కనుచూపు మేరలో వైకుంఠపురం కనిపించింది.

కృష్ణంరాజు 'అదిగో వైకుంఠపురం' అనుకున్నాడు, కొండ ప్రక్కగా కనపడ్డ కరణంగారి భవంతి చూచి, ప్రాణం లేచి వచ్చినట్లయింది. వెంటనే 'శ్రీరామచంద్రా!' అనుకుంటూ కనులు మూసుకున్నాడు ఆనందానుభూతితో. రామదాసు గానం చేసిన 'అదిగో భద్రాద్రి - గౌతమి ఇదిగో చూడండి!' అన్న భజన పాట జ్ఞప్తికి వచ్చింది. వైకుంఠపురంలో వేంచేసి ఉన్న వెంకటేశ్వరస్వామి రామస్వామిగా, వైకుంఠపురమే భద్రాద్రిగా, దాని ప్రక్కనే పారుతున్న కృష్ణమ్మ గౌతమిగా పాడకట్టాయి. మనసంతా సంతోషంతో కదను త్రొక్కింది. ''ముదమున సీత, ముదిత లక్ష్మణులు చేరి గొలవగా రఘుపతి యుండెడి, అదిగో భద్రాద్రి, గౌతమి ఇదిగో చూడండి'' అంటూ గొంతెత్తి కూనిరాగంతో ఆలపించాడు. మరో అర్క్రోసుపోతే చాలు, వైకుంఠపురం వచ్చేస్తుంది. వచ్చేసినట్లే భావిస్తూ రాజు కండ్లు మూసుకున్నాడు.

వైకుంఠపురానికి, తనకు, ఆ వెంకటేశ్వరస్వామికి ఏమిటో ఈ సంబంధం! తనకు ఆ ఊరికి తొట్ట తొలిసారిగా సంబంధం ఏర్పడిన నాటి సంఘటన జ్ఞాపకానికి వచ్చింది రాజుకు. తనప్పటికి ఇరవై ఏండ్లవాడు, తన తాత సుబ్బరాజుగారు తన వెంట ఇలాగే

స్వామివారి కళ్యాణం ముందు రోజు తీసుకుని వెళ్ళారు. అప్పటికి తాతగారికి తనకు ఇప్పటిలాగే డెబ్భై సంవత్సరాలు. మొట్టమొదట తనచేత భజన బృందం నడిపించారు తాతగారానాడు. ఆ రోజు తాను భజన చెబుతుంటే ఊళ్ళో వాళ్ళంతా ముక్తకంఠంతో అన్నారు, తాతను మించిన వాడని. తాతగారానాడు తనని ఊరికి, ఆ ఊరిని తనకు అప్పగించి, "నేను పెద్దవాణ్ణయ్యాను. ఇక అబ్బాయిని మీ కప్పగిస్తున్నాను" అన్నారు.

ఆ గ్రామ ప్రజ ఔదాలదాల్చింది.

"నాయనా, ఏనాటిదో ఈ బాంధవ్యం మనకు! ఈ స్వామిని కొలిచి, ఈ ప్రజకు ముక్తినిచ్చి నీవు ధన్యత గాంచు" అన్నారు తనతో. ఆ మాటలు ఈనాటికి ధ్వనిస్తున్నాయి తన ముందు. అంతా ఆ రోజు తనను చిన్నరాజుగారని ఎంతో గౌరవించారు. పెద్ద రత్తయ్య ఇంటికి పిలుచుకుని పోయి తాతగారికి, తనకు పంచల చాపు పెట్టి పంపించాడు.

"ఏరొచ్చింది రాజుగారూ!" అంటూ గంగులు వేసిన కేకకు రాజు గతం నుంచి మేల్కొన్నాడు. ఎక్కడ వర్షం పడ్డదో వైకుంఠపురాన్ని అంటిపెట్టుకుని ఉన్న ఏరు పరవళ్ళు త్రొక్కుతున్నది.

"సంగడన్నా లేడు, రాజుగారూ!" అన్నాడు గంగులు. రాజు ఆకాశం కేసి చూస్తూ ఉండిపోయాడు. దిగంతాన్నంతా వ్యాపించే కాంక్షతో వరుణుడు కారు మేఘాలతో వస్తున్నాడు. కుండపోత తప్పదు.

"బాబూ! తిరిగిపోదాం" నసిగాడు గంగులు. రాజుకు దగ్గు తెర వచ్చింది. ఆ తెరతగ్గేపాటికి ప్రాణాలు ఎగిరిపోయినట్లే అనిపించింది."

"వైకుంఠపురానికి వెళ్ళాల్సిందే"అన్నాడు రాజు. "నీవు తిరిగి వెళ్ళు, గంగులూ" అంటూ కిరాయి ఇచ్చివేశాడు.

గంగులు తిరిగి వెళ్ళిపోయాడు. ప్రక్కనున్న మర్రి క్రింద కూర్చున్నాడు రాజు. ఒంటరిగా, ఆ చీకట్లు క్రమ్ముతున్న సంధ్యలో రాజుకు ముప్పయి ఏండ్లనాటి సంఘటన జ్ఞప్తికి వచింది. ఆనాడూ ఇలాగే ఏరు ఉరికింది. పైన జోరున వర్షం కూడా పడుతున్నది. అయినా తానూ పట్టుదలగా కళ్యాణం చేయించాలి, గజ్జె కట్టి భజన చేయాలి - అనే పట్టుదలతో అదే మర్రి క్రింద నిలువబడ్డాడు. అంతలో ఆవలిగట్టు నుంచి భుజంగరెడ్డి గొంతు వినపడ్డది, "భజన పంతులుగారూ!" అంటూ. తాను పలికాడు. భుజంగం ఏరుకడ్డం పడి వచ్చి దాటించాడు. భగవంతుడే స్వయంగా భుజంగం రూపంలో వచ్చి దాటించాడేమో అనిపించింది. ఆనాటి భుజంగం ఈనాడు లేడు. రాజు కనులవెంట రెండు నీటి బొట్లు రాలాయి. "మరి ఈరోజే రూపంతో వచ్చి తీసుకొని వెళతాడో ఆ స్వామి!' అనిపించింది. చేతిలోని భజన చెక్కలు అప్రయత్నంగా కదిలాయి. గొంతుక "నను బ్రోవమని చెప్పు నారీశిరోమణి! జనకుని కూతుర జననీ జానకమ్మ, నను బ్రోవమని చెప్పవే -" అంటూ పాడసాగింది. చేతిలోని చెక్కలు తాళం మార్చాయి. "ప్రక్కన చేరుక... చెక్కిలి - నొక్కుచు" అంటూ ఆ చరణం వివిధ గతుల్లో, వివిధ పద్ధతులలో, వివిధ తాళాలతో తాండవం చేస్తూంది. రాజు పరవశమైపోయాడు. వెనుక ఒకసారి స్వామి కళ్యాణానికి బందరు నుంచి వచ్చిన సాని మేళపు నాయకురాలు, రాజు నోట ఆ పాట విని, మరునాడు ఆయనను పాడమని తాను అభినయం చేసింది. ఆహా అమోఘం! అని అబ్బురపడి పోయారు రాజుగారు. 'ఆహా! ఆలయ విన్యాసం అత్యద్భుతం!' అని మెచ్చుకుంది ఆ నాయకురాలు. ఆ యేడే రాజుకు బంగారు కట్లు, పూలూ వేయించిన భజన చెక్కలను ఇచ్చి సన్మానం చేశారు. ఆ ఊరిలో ఆ చెక్కలను చూచి తన్మయత చెందారు రాజు క్షణకాలం. గతంలోకి దూసుకు పోయాడు.

భామాకలాపాన్ని ప్రదర్శించింది ఒకనాడు నాయకురాలు. భామను చెలికత్తె ఉడికిస్తున్నది, "మల్లెపందిరదిగో సుందరి! మాధవుడల్లడుగో" అంటూ. ఆ పాట మనోజ్ఞంగా ఉంది. మర్నాటి కల్లా తను భజన కత్తుకు అతుక్కునేలా సాధించాడా పాటను. తాను ఆ పాట పాడుతూ, భజన వరస వేస్తూ చక్రభ్రమణం చేయిస్తూ ఉంటే వృద్ధుల్లా కనిపించే ఆ రసమూర్తులలో ఎంత ఆర్ద్రత విలసిల్లుతున్నదో! అంతా తాముగా భ్రమించి భ్రమణాలు చేయిస్తున్నట్లు, చేస్తున్నట్లు అనిపించింది. నాయకురాలు 'రాజుగారి చెక్కలకు

పలుకని పదమూ, పాటా ఏదీ ఉండదు. పద్యాలు కూడా పలుకుతయ్యేమో!' అంటూ, తన మెప్పును ప్రకటించింది. ఆ రాత్రికి రాత్రి రాజు గజేంద్ర మోక్షాన్ని భజన వరసకు అనుగుణంగా పాటలను ఏరి కూర్చాడు. అందులో గజేంద్రుడు దీనుడై లావు దప్పి, ప్రాణము మిన్ను పట్టుతుండగా ఆయాసపడుతూ, అటూ ఇటూ ఊగుపోతూ, త్రాణలేక ఆక్రోశిస్తున్నట్లే ఆ బృందమంతా ఏకంగా కదులుతున్నట్లనిపించింది. నాయకురాలు అర్ధనూట పదహార్లు తాంబూలంలో పెట్టి రాజుకు ఇచ్చి దండం పెట్టింది.

ఆనాటి కళాభిమానం అలాంటిది.

"బాబూ! దండం బెడతా!" అంటూ వినబడ్డ చుండి సీనుడి కేకకు మేలుకొన్నాడు రాజు.

చుండి సీమప్ప! వైకుంఠపురాన్ని ఏభై సంవత్సరాలుగా అంటి పెట్టుకున్న కావలివాడు. "ఏం బాబూ! ఏరు దాటనివ్వలేదా!" అంటూ దగ్గరగా వచ్చాడు సీనుప్ప.

"అవునా. స్వామివారి కళ్యాణానికి రావాలని వచ్చాను" అన్నాడు రాజు.

"నేను దాటవేస్తాను" అంటూ రాజు మనసు కదను త్రొక్కింది. "ననుబోవ నడిచి వచ్చితివా! నా పాలిట దైవమా! నా రామచంద్రా!" అంటూ చరణాన్నందుకుంది మనస్సు. సీనుడు రాజు వెంట నడుస్తూ, "ఏందో బాబూ! కాలమంతా పిదప కాలమైపోయింది. ఎనక మన రోజుల్లో భజన వరసబడితే దేవుడాడ ప్రత్యక్షమయ్యేవాడు. ఇప్పుడా ఓపికలూ లేవు. ఎంత సేపటికీ, ఆ బాకాల్లో పిచ్చి పాటలు పాడిత్తూ చెవులు గింగురుమనిపిత్తుండారు. డానుసులంట. పిల్లల్ని ఎగిరిత్తిన్నారు ఎద్వ గంతులన్నీ. కోటయ్య స్వామి తిరణాలకు కొండ కెళ్ళితే, ఈ ఏడు బాబూ, పెబలన్నిటికీ, ఎనక కట్టే శివలీల గుడ్డలు లేవు - అన్నీ సినిమా కాకితలే" అంటు చెప్పుకుపోతున్నాడు.

రాజు కెదురుగా సుళ్ళు తిరుగుతూ ఏరు గింగిర్లు పెడుతున్నది. రాజుగారి కళ్ళ వెంట నీళ్ళు అలాగే తిరిగిపోతున్నాయి. వెనక తాను కోటప్ప కొండకు వెడితే, తన భజన బృందానికి, మరోదానికి, లేదోపులో పోటీలు పడ్డాయి. జనమంతా ఏ భజన మిగులో తేల్చుకోవాలని కూచున్నారు. తాను నారాయణ తీర్థుల తరంగాలు పట్టించాడు.'శరణం భవ కరుణామయి కురు దీనదయాళో!' అంటూ మొదలు పెట్టాడు. అవతలి జట్టు చచ్చుపడ్డది. వాళ్ళంతా వచ్చి చూడటం మొదలెట్టారు. తానూ ఇట్టే గ్రహించాడు, వాళ్ళకు తరంగాల్లో

ప్రవేశం లేదని. "యజ్ఞా యజ్ఞా సంరక్షణా యాదవ వంశాభరణా" అన్న సాదాన్ని వివిధ గతుల్లో మెలికలు వేయించాడు. పై ప్రేక్షకులంతా మొగ్గలు వేశారు. అవతలి భజన పంతులు వచ్చి తన మెడలోని పూలదండను రాజు మెడలో వేసి, "కృష్ణంరాజుగారికి జై!' అన్నాడు. రాజు 'తప్పు నాయనా! కృష్ణపరమాత్మకు జై' అని జేజేలు కొట్టించాడు. ఆనాటి కోటప్ప కొండ ప్రభలలో నక్షత్రాలను తాకేది నల్లపాటి ప్రభ. ఆ ప్రభల నిండా శివలీలలు ఎంత సుందరంగా ఉండేనో! ఆనాటి ప్రజలే వేరు. ఆ చిత్త ప్రవృత్తే వేరు. ఆ వెర్రి వేరు. ఆ అనుభూతే వేరు.

"బాబూ! పై పంచ కట్టుకోండి. దాటుదాం!" అంటూ సీమప్ప, రాజును ఈ లోకంలోకి తీసుకు వచ్చాడు.

అవతలి ఒడ్డున చేర్చి, దండం పెట్టి, "సెలవు తీసుకొంటా బాబూ!" అన్నాడు సీమప్ప.

"కళ్యాణానికి రావా, సీమప్పా?" అన్నాడు రాజు.

"వడ్లమాను దాక పోయిరావాలి బాబూ!" అన్నాడు సీమప్ప. సీమప్ప వెళ్ళిపోగానే, రాజు తలెత్తి చూచాడు. ఎదురుగా వైకుంఠపురం కనిపించింది. చీకటి క్రమ్మింది. అంతటి చీకటిలోను, ఊరిలో ఎల్క్ట్రిక్ దీపాలు వెలిగిపోతునాయి.

రాజు రెండు ఫర్లాంగుల దూరంలో ఉన్న ఊరికేసి బయలుదేరాడు ఒంటరిగా ఆలోచనలు వెనకకు లాగినవి.

రాజు ప్రభ వైకుంఠపురంలో నలభై సంవత్సరాలు సాగిపోయింది, సరిగ్గా పది సంవత్సరాల క్రితం, స్వామి కళ్యాణం నాడు డొక్కలో పోటు వచ్చింది. అలాగే స్వామివారి కళ్యాణం ముగిసేవరకు ఓపికతో భజన చేయించాడు. ఆ తరువాత వైకుంఠపురంలోని ఆయుర్వేద వైద్యులు ఆచార్లుగారు రాజును పరీక్ష చేసి 'రాజుగారూ! వయసయింది. ఇక మీరు తట్టుకోలేరు. విశ్రాంతి అవసరం' అన్నారు. అప్పటికి రాజు వయసు అరవై సంవత్సరాలు.

"అంతేనంటారా?" అన్నాడు రాజు. "అంతే" అన్నారు ఆచార్యులుగారు. రాజు కళ్ళవెంట నీరు కారిపోయింది. 'నా స్వామి కళ్యాణం చేసుకోవటానికి నాకీ అవరోధమేమిటి?' అని. కన్నీరు మున్నీరయింది. 'స్వామీ! నీ భజన చేసుకోవటానికి, నాకీ అలసట, సొలసట ఏమిటి?' అంటూ వాపోయాడు.

ఆ మరుసటి సంవత్సరం తన తమ్ముడు రామరాజును వైకుంఠపురానికి అప్పగించాడు, కృష్ణంరాజు. ఈ పది సంవత్సరాలుగా కృష్ణంరాజు అస్వస్థతతో, స్వామివారి కళ్యాణానికి రాలేకపోతున్నాడు. తమ్ముడు రామరాజే భజన చెప్పి ఆ కళ్యాణ మహోత్సవాలను జరిపిస్తున్నాడు. వైకుంఠపురం నుంచి తమ్ముడు రామరాజు స్వామి వారి కల్యాణం చేయించి వచ్చాక, అక్కడి విశేషాలు ఓపిగ్గా విని ఆనందించేవాడు. ఆ స్వామి వారికి ఏ అలంకరణ జరిగింది, స్వామి కల్యాణం నాడు ఏయే కీర్తనలు రామరాజు గానం చేసింది అడిగి తెలుసుకుని ఆనందానుభూతిలో మునిగిపోయే వాడు.

ఈ పది సంవత్సరాలలోనూ ఎంత మార్పో! వృద్ధులు ఒక్కొక్కరే పండుటాకుల్లా రాలిపోయారు వైకుంఠపురంలో. రెడ్డెమ్మలాంటి సహృదయుడు వివేకి, జ్ఞాని స్వామి సన్నిధి చేరిపోయాడు. ఆ వార్త విన్న రోజు రాజు శోకమూర్తి ఆయ్యాడు. అలాగే బొల్లయ, అవధాని... ఇలా ఎందరో భక్తులు రాలిపోయారు. ఆ తరం పోయింది... మరో తరం తరలి వచ్చింది.

ఈ సంవత్సరం రామరాజు స్వామి వారి కల్యాణానికి వెళ్ళాడు వైకుంఠపురానికి. కాని కల్యాణం ముందు రోజే తిరిగి వచ్చాడు. అలా అర్ధాంతరంగా తిరిగి వచ్చిన తమ్ముణ్ణి చూసి కృష్ణంరాజు నిరుత్తరుడయ్యాడు. "ఏమిటిది?" అని ప్రశ్నించాడు.

"ఆ ఊరికి, మనకు ఋణం తీరిపోయింది" అన్నాడు రామరాజు.

ఫెళఫెళమని పిడుగు పడినట్లు అయింది. "ఊరు మారిపోయింది. వెర్రి తలలు వేస్తోంది. జ్ఞాననలవ దుర్విదగ్ధులంతా పెత్తందారులైనారు. మన భజనను అవమానించారు. ఇంకెక్కడి స్వామి!" అన్నాడు రామరాజు.

కృష్ణంరాజు కూలి పోయాడు. అతని ముందు నలభై సంవత్సరాలనాటి స్వామి సాక్షాత్కరించాడు.

'అంతటి వేలుపుకెంతటి దీనస్థితి!'

రామరాజు వైకుంఠపురం వెళ్ళననటంతో, కృష్ణంరాజు బయలుదేరాడు స్వామి కళ్యాణానికి.

✡✡✡

నల్లని మేఘాల నుండి మెరుపొకటి రాజు హృదయ నైర్మల్యంలా భ్రమసి పోయింది. మరులిప్తలో ఫెళ ఫెళ మంటూ ఉరుమొకటి రాజు మనోవ్యధలా ధ్వనించింది. చలిగాలి వీచింది, వైకుంఠపురంలోని నాస్తికతలా.

రాజు కనులు తెరిచి చూచాడు. ఊరు వచ్చేసింది.

✡✡✡

వీధి దీపాల వెలుతురున నడిచి వెళ్ళాడు రాజు. ఆయనను గుర్తుపట్టి పలుకరించిన వాళ్ళే లేకపోయారు. పెదరత్తయ్య గారింటికి వెళ్ళాడు. పెదరత్తయ్య మనమడిప్పుడు పెత్తందారు. ఆ పెత్తందారిల్లు తాళం వేసి ఉంది. కరణం గారింటికేసి వెళ్ళాడు. కరణంగారు బెజవాడలో మకాం పెట్టారట. ఆ ఇంటిలోనూ ఎవరూ కనిపించలేదు. లంకంత కొంప బావురుమంటున్నది. ఒకప్పుడు బ్రహ్మరథం పట్టించుకున్న ఆ ఊళ్ళో రాజును గుర్తించిన వారే లేకపోయారు. వీళ్ళంతా గుర్తుపట్టలేకపోయినా, 'ఆ వెంకటేశ్వరస్వామి గుర్తుపడతారు' అని, గుడి వీధికేసి బయలుదేరాడు.

ఆ వీధి అంతా జన సమ్మర్ధంగా ఉంది. ఎలక్ట్రిక్ దీపాలు వెలిగిపోతున్నాయి. కాని ఏమిటో ఆ గత శోభ కనిపించలేదు రాజుకు. అతి కష్టం మీద దేవాలయం చేరుకోగలిగాడు. కాని, లోపలకు పోవటానికి వీలుపడింది కాదు. కళ్ళవెంట నీరు తిరిగింది, చివరికి ఆ దేవాలయం కూడ తనను గుర్తించనందుకు. అంతలోనే, ఎవరో "డాన్సు, డాన్సు" అన్నారు. అక్కడి జనమంతా విరగ్రొక్కుకున్నట్లు బయటకు కదిలారు. ఆ సమ్మర్ధంలో రాజు తూలి పడిపోయాడు. ఒకరిద్దరు ఆయన మీదగానే నడిచి వెళ్ళారు. ఆ జనసందోహం తరిలి వెళ్ళి, దేవాలయానికి కొంచెం దూరంలో బండి మీద సాగుతున్న 'డాన్సు' చూస్తున్నారు. రికార్డు సంగీతానికి అనుగుణంగా చిందేస్తున్నారు, ఆ బండి మీద డాన్సు వాళ్ళు. నేల మీద నుండి దగ్గుతెర నుండి తేరుకుని, గోడ నాధారం చేసుకుని గర్భాలయంలోకి వెళ్ళాడు రాజు. స్వామి మోము వెల వెలపోతున్నది ఆ విద్యుద్దీపాల ముందు. ఆ ఆముదపు దీపాల కాంతి, ఆ కాగడాల దీప్తి లేదీనాడు.

బయట "ఓ వయసుకాడ ఇటు రారా!" అంటూ హోరు వినిపిస్తున్నది. రాజు కూలబడ్డాడు స్వామి ముందు.

రాజు మనస్సు శిధిలమయింది. చిన్నగా "ఏ తీరున నను దయచూచెదవో ఇలవంశోత్తమ రామా! నా తరమా భవసాగరమీదను...." అంటూ చెక్కలను ఆడిస్తూ, చిన్నగా పాడుకోసాగాడు. ప్రక్కగా, ఒక్కగా నొక్క స్త్రీమూర్తి వృద్ధురాలు, కండ్లు మూసికుని కూర్చున్నదల్లా కండ్లు తెరిచి చూడసాగింది రాజును. ఆమె పాటను ఆనందానుభూతితో నిమీలిత నేత్ర అయి వినసాగింది. చివరి సారిగా రాజు "లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె ప్రాణముల్ చావుల్ దప్పెను, మూర్ఛ వచ్చె..... నీవే తప్ప నితఃపరంబెరుగ మన్నింపం దగున్ దీనునిన్ రావే ఈశ్వర కావవే వరద సంరక్షించు భద్రాత్మకా!" అంటూ వాలిపోయాడు. పాటగా సాగిన ఆ పద్యాన్ని, ఆ స్తోత్ర గీతాన్ని పూర్తిగా వింటూనే కనులు తెరిచిన ఆ స్త్రీమూర్తి "రాజుగారూ! రాజుగారూ!" అంటూ వచ్చి వాలిపోతున్న ఆ రాజుగారిని పొదవి పట్టుకుంది. ఆఖరిసారిగా కండ్లు తెరిచిన రాజు, "అమ్మా నీవింకా ఉన్నావా? సెలవయింది, స్వామి సెలవయింది" అంటూ కనులు మూశాడు.

నాయకురాలు ఏనాడో చూచింది వైకుంఠపురం. ఈనాడు ఎలా ఉందో చూదామని పనిగట్టుకుని వచ్చింది. రాజు దహన సంస్కారానికి కావలసిన డబ్బిచ్చుకుంది. అది కర్మభవ బంధం. అగ్ని సంస్కారం చేయబోయేముందు చితి చుట్టూ తిరిగి నమస్కరించి "సరస్వతమ్మ కళలలో మరో కళ రాలిపోయింది" అనుకుంటూ కృష్ణవేణమ్మ పాయ అయిన ఏటిలో స్నానం చేసింది. తెల్లవారేసరికి అనుకోనంత కృష్ణకు వరద వచ్చి, ఏటి పాయ నంటి ఉన్న రాజుగారి చితాభస్మాన్ని చిటికెడు మిగల్చకుండా తనలో లీనం చేసుకొంది. చుండు సీనుడు కాటికెళ్ళి "నిన్ననే చివరి దర్శనం స్వామీ!" అంటూ ఆక్రోశించాడు.

కృష్ణమ్మ భీకరంగా, దీనంగా ఏదో అవ్యక్తభావాన్నాలాపించింది ఆ నీటి ఉరవడిలో.

✡✡✡

అశ్వహృదయం

- శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రి

(ఆంధ్రపత్రిక మే।5, ।940 సంచిక నుంచీ)



శ్రీ శ్రీ శ్రీ వత్ససాయి చతుర్భుజ తిమ్మ జగపతి మహారాజుకి ఉదయం గరిడి సాములూ, సాయంకాలం పంచకల్యాణి ఎక్కి షికారు వెళ్ళడమూ తప్పని నిత్యకృత్యాలు.

ఎప్పుడైనా ప్రళయం వంటి ఆ సందర్భము తటస్థించి గరిడి సాములు మానెయ్యడం, జరిగితే జరగవచ్చు. కాని గుర్రపు స్వారీ మాత్రం కట్టిపెట్టడానికి వీలు లేదు.

అలా జరగనినాడు ఆ పంచకల్యాణి నానా హంగామా చేసేస్తుంది.

కోట అంతా గగ్గోలు పరిచేస్తుంది.

ఒకనాడేం జరిగిందంటే?

ఆవేళ సాయంత్రం దీపాలు పెట్టగానే సంగీత కచేరీ ప్రారంభం కావలసి ఉంది.

అయితే నెల్లూరినుంచీ ఒక గజ ఆటగాడు వచ్చి ఉండగా, అప్పటికి తేల్చుకోలేకపోతామా అని మహారాజు జామున్నర పొద్దువేళ చదరంగంలో కూచున్నాడు.

మొదటి జాముకి అనుకూలంగానే నడిచింది, కాని నాలుగవ పొద్దువేళ, అక్కడ శ్రోతలొక్కక్కరే వచ్చి కిక్కిరిసిపోతూ ఉన్న సమయంలో ఇక్కడ ఆట బిగిసిపోయింది.

రాజెంత మెళుకువగా ఎత్తులు వేసినా మొదటి ఉజ్జీ గుర్రం పట్టపగ్గాల్లేకుండా చెలరేగిపోసాగింది.

గుర్రం బారి పడకుండా రాజును తప్పించుకుంటూ, బంట్లతో పిడికితాళుకుంటూ, మధ్య మధ్య తన మంత్రితో ఉసికొలుపుతూ అతి కష్టం మీద నిలవ తొక్కుకుని మహారాజు స్వగతంగా నిట్టూర్పు విడిచారప్పటికి. కింద నుంచి "గుర్రం గుర్రం" అంటూ పెద్ద గందరగోళం వినవచ్చింది.

మొదట వసారాలో ఉన్న పరిచారిక "పంచకళ్యాణి కట్టు తాళ్ళు తెంపుకుంది" అని ఆర్తంగా అంది.

తరువాత సన్నిధిని ఉన్న గుబ్బెతలలో నొకతె వెళ్ళి చూసి వచ్చి "పంచకల్యాణి పరవళ్ళు తొక్కేస్తుంది మహాప్రభూ! లచ్చిగాడు పట్టలేక హైరానయిపోతున్నాడండీ!" అని విన్నవించింది.

అక్కడ ఎవరూ లేరా! అని ఆదుర్దా పడుతూ లేచి వెళ్ళి మహరాజు "ఏమిట్రా ఇది" అని అడిగాడు.

వెంటనే పంచకల్యాణి రాజుకి ఎదురుగా వచ్చి 'కిందకి దిగిర'మ్మన్నట్టు తపవూపుతూ సింహనాదం అన్నంతగా సకిలించింది.

అప్పుడు లచ్చిగాడు చేతులు కట్టుకుని "షికారు బయలుదేరాలి మహాప్రభూ! లేకపోతే గుర్రాన్ని పట్టలేము దేవరా!" అని విన్నవించాడు.

2

ఆ గుర్రం అంటే మహరాజుకి ప్రాణం.

పేరుపడ్డ గాయకురాలు రావడం వల్లా, తానున్నూ సంగీతంలో నిధి కనకనూ, ఎందరెందర్నో ఓడించి తోడా వేసుకున్న ఆటకాడెంతో దూరం నుంచి పనికట్టుకుని వచ్చాడు కాబట్టిన్నీ "ఈ ఒక్కనాడూ గుర్రపు స్వారి లేకపోతే యేం" అనుకున్నాడు, కాని మహరాజు కూడా ఒక్కనాడయినా ఆ గుర్రం ఎక్కకుండా ఉండలేదు.

ఇంతేకాక,

మహరాజుకి దాని విషయమై లచ్చిగాడెంత చెబితే అంతే. దానికి మరి తిరుగులేదు.

ఎంచేతనంటే!

తనకోసమే ఆ గుర్రం పుట్టిందనీ, ఆ గుర్రంకోసమే లచ్చిగాడున్నూ పుట్టివున్నాడనీ మహరాజుకి నమ్మకం కుదిరిపోయింది.

దీనికి పెద్ద కారణమే ఉంది.

ఏడాది కిందట లచ్చిగాడు చుట్టపుచూపుగా నొకనాడు పెద్దాపురం వచ్చాడు.

పుట్టిన పాతికేళ్ళకి వాడదే పెద్దాపురం రావడం. వాడి పెత్తల్లి కొడుకు గంగులుగాడే మహరాజు సొంత గుర్రాలను చూస్తూ ఉంటే గుర్రపువాళ్ళకి మొనగాడు.

సహజంగా లచ్చిగాడు కూడా కొంచెమో గొప్పో అశ్వలక్షణాలు తెలిసినవాడే

తరచు గుర్రాలతో మసులుతూ ఉండేవాడే కాని ఏక కాలంలోనూ, ఏక త్రానూ, పెద్దాపురంలో ఉన్నన్ని గుర్రాలను వాడెప్పుడూ చూచి ఉండలేదు.

అంతలేసి గొప్ప గుర్రాలను కూడా చూసి ఉండలేదు. కానీ, వాడికి, గుర్రాలలో మసలడం గంగులు గాడి దగ్గర ఏదో వొకానొక లోపం ఉండినట్టు స్ఫురించింది.

"పెట్టిపుట్టాడు కాని లేకపోతే వీడేమిటి గుర్రపువాళ్ళకి మొనగాడు కావడం ఏమిటి?" అని కూడా అనిపించింది.

అయితే, ఏమనడానికి సాహసించలేకపోయాడు.

అక్కడికీ మెల్లగా వెళ్ళి భద్రాశ్వాన్ని దువ్వుతూ "ఏమిరా అన్నయ్యా! చిగుళ్ళు కత్తిరిస్తే కుచ్చులాగుండదూ తోక?" అన్నాడు. కాని వెంటనే గంగులుగాడు "గుడ్డి గుర్రపు తట్లతో మసిలేవాడివి. మహరాజులుంగారెక్కే గుర్రాల సంగతి నీకేం తెలుసురా?" అంటూ ఈసడించి కూచోపెట్టాడు.

ఈ మాట అలుగులాగే గుచ్చుకుంది. కాని ఆ గుర్రాలను విడిచి ఉండలేక మాటలు పెంచడం మానుకున్నాడు లచ్చిగాడు.

3

సరిగ్గా ఆ వేళే అయిదు గుర్రాలు వెంట పెట్టుకుని ఒక అరబ్బీ వర్తకుడు పెద్దాపురం ప్రవేశించాడు.

వాటిలో మూడింటిని చూసి పెద్దాపురంలో ఉన్న రౌతులందరూ ముగ్ధులయిపోయారు.

మళ్ళీ ఆ మూడింటిలోనూ ఈ పంచకల్యాణిని చూసి వారు గుటకలే మింగారు.

దీంతో, వర్తకుడి దరఖాస్తుకంటే ముందు ఈ సంగతే మహారాజుకి అందింది.

వర్తకుడు, అలంకరించి యుక్తకాలంలో గుర్రాలను కోటకి తీసుకు వెళ్ళాడు. పదస్థులూ, రాజు బంధువులూ, పిన్నలూ అనేకులూ వచ్చి చూశారు.

వారితో పాటు, వెన్ను విరుచుకుంటూ గంగులు గాడున్నూ వచ్చి చూశాడు గాని వాడి మొగం విడలేదు.

పైగా కొంతసేపటికి పక్కకి తప్పుకుంటూ "మా గుర్రాలకి చాలవు" అని మూతి ముడుచుకున్నాడు వాడు.

అది విని, మనస్సులో చాలా నొచ్చుకుని లచ్చిగాడు "సెబాస్! గుర్రాలంటే ఇవీ. ఇందులోనూ మళ్ళీ అదిగదిగో అది పంచకల్యాణి. రాజా గుర్రం అది. దాని దగ్గర నాకు నౌకరీ దొరికితేనా నా రంగా" అంటూ ఉర్రూతలూగిపోయాడు.

ఇంతలో మహారాజు వచ్చాడు.

అందరూ తప్పుకున్నారు.

గుర్రాలకి అయిదారు గజాల దూరాన నుంచున్నాడు మహారాజు.

వెంటనే పంచకల్యాణి పరమోత్సాహంతో సుతారంగా సకిలిస్తూ నాట్యం చేసింది.

దాన్ని చూసేటప్పటికి మహారాజు మనస్సు కూడా గుబగుబలాడిపోయింది.

ఇలాగ మహారాజుని చూసి గుర్రమూ, గుర్రాన్ని చూసి మహారాజూ ముగ్ధులు కావడం కనిపెట్టి వర్తకుడు ఉప్పొంగి పోయాడు.

వెంటనే అతను "మహాప్రభూ! మా దేశం మొదలు ఇక్కడికి వచేదాకా ఈ క్షణం దాకా దీన్ని అనేకులు చూశారు. కాని ఇది వారికేసి చూడలేదు. ఏలినవారు కళ్ళబడగానే నృత్యం చేసిందిది. దీన్ని బట్టి ఇది యేలిన వారి కోసమే పుట్టినట్టు కనబడుతోంది" అని చెబుతూ దాన్ని మహారాజుకి నజరు పెట్టాడు.

అందుకు మరీ సంతోషించి మహారాజు వర్తకుణ్ణి చాలా గొప్పగా సత్కరించి, మరో రెండూ గుర్రాలు ఖరీదుకి పుచ్చుకున్నాడు.

ఇదంతా చూసేటప్పటికి లచ్చిగాడికి పారవశ్యం కలిగింది.

4

ఎప్పుడూ సన్నిధిని ఉండే హితైషులు "వెంటనే ఒకమాటు స్వారి వెళ్ళడం మంచి"దని చెప్పారు.

ఈ సమయం దాటితే మరి నెలా పది రోజులదాకా మంచి ముహూర్తంలేదని ఆస్థాన సిద్ధాంతి కూడా విన్నవించాడు.

"ఈ గుర్రాన్ని ఎక్కడానికి తమరే మొదటివారు మహాప్రభూ! కనక ఇప్పుడే ఒకమారు స్వారీ వెడితే చూసి నేను కూడా సంతోషిస్తాను దేవరా" అంటూ వర్తకుడున్నూ చాలా చాలా ప్రార్థించాడు.

తన కోరిక కూడా అదే కాగా "సిద్ధం చెయ్యరా" అని గంగులు గాడికి చెప్పి, దుస్తులు మార్చుకోడానికి మహారాజు లోపలికి వెళ్ళాడు."

వెంటనే గంగులుగాడు కళ్ళెం పుచ్చుకుని బయలుదేరాడు.

జీను పట్టుకుని వాడి వెనుక మరొక గుర్రపువాడు బయలుదేరాడు.

తక్కిన అలంకారాలు పుచ్చుకుని మరికొందరున్నూ వెంబడించారు.

కాని ఆ గుర్రం ఒక్కణ్ణీ చేరనివ్వలేదు.

మొదట అది గంగులుగాడి గుండెలు పగిలేటట్టు ముట్టెతో విసిరి కొట్టింది.

తరువాత ఎగిరి మరిద్దర్ని తన్నింది.

చివరికి, తోక ఝాడించి మరొకడికి దిమ్మెక్కించింది.

ఈ పెంకితనం చూసి మొదట రిచ్చపడి, తరువాత సిగ్గుపడి, చివరికి దిగాలుపడి ఎలాగయినా తన మర్యాద కాపాడుకోలని బుజ్జగిస్తూ వర్తకుడున్నూ ప్రయత్నించాడు, కాని అతని సత్కారం అతనికి ముట్టింది కనుక అతగాణ్ణి కూడా అది విదిలించి కొట్టింది.

అందరూ ఖిన్నులయిపోయారు.

5

ప్రభువు మళ్ళీ వచ్చేటప్పటికిదీ స్థితి.

ఎప్పుడెప్పుడనుకుంటూ మనోవేగంతో వచ్చిన ప్రభువు వచ్చిన గుర్రం వచ్చినట్లే ఉండడం చూసి "ఏమిరా?" అన్నట్టు గంగులుగాడికేసి కొంచెం కరుగ్గా చూశాడు.

దాని మీద గజగజ వణికిపోతూ జరిగినదంతా చెప్పి గుర్రపు వాళ్ళు పడి పడి దణ్ణాలు పెట్టారు.

ఇదంతా చూస్తూ లోపల్లోపల నవ్వుకుంటూ నిశ్చలంగా నుంచుని ఉన్నాడు లచ్చిగాడు.

మహారాజు వాడి నైలక్షణ్యం గుర్తించాడు. కాని కొత్తవాడు కావడం వల్ల పలకరించలేదు. వాడుకూడా మహారాజుతో సాహసించి మాట్టడలేక మిడుతూ మిడుతూ చూసి ఊరుకున్నాడు.

గంగులుగాడి కిది పౌరుషం కెళ్ళించింది.

తక్కినవాళ్ళు కూడా లచ్చిగాడి కేసి గుర్రుగా చూసి, "ఊరుకుంటే ఎలాగా?" అన్నట్టు గంగులుగాడికేసి చూశారు.

అందరూ కలిసి మళ్ళీ మళ్ళీ ప్రయత్నించి, తన్నులు తినడం తరవాయిగా, మళ్ళీ విఫలయినారు.

అది చూసి లచ్చిగాడు అలాగే నుంచుని చిరునవ్వు నవ్వాడు.

అది మహారాజు కళ్ళబడింది.

ఆ చిరునవ్వులో అహమిక ఉండడం గుర్తించి మహారాజు "ఎవర్రా నువ్వు" అని గంభీరంగా చూస్తూ అడిగాడు.

"నేను గంగులుగాడి పింతల్లి కొడుకుని బాబయ్యా! నా పేరు లచ్చిగాడండి" అని వంగి దణ్ణం పెడుతూ బదులు చెప్పాడు వాడు.

"ఏ ఊరు నీది?"

"పుట్టకొండ మహాప్రభూ"

"ఎందుకురా నవ్వుకుంటున్నావూ?"

"కారణం తరువాత మనవి చేసుకోవడానికి ముందు గుర్రానికి కళ్ళెం పెట్టి జీను వెయ్యడానికి పెలవిప్పించండి దేవరా."

ఇది విని గుర్రపువాళ్ళందరూ ఏక కాలంలో "వాడి వల్ల ఏమవుతుంది మహాప్రభూ?" అని తమ అభిజాత్యం ఒలకపోసుకున్నారు.

దాని మీద మళ్ళీ చిరునవ్వు కనపరిచాడు లచ్చిగాడు.

మహారాజుకి ఆ చిరునవ్వులో చాలా ఆత్మవిశ్వాసం కనపడింది.

"ఎందుకు సెలవివ్వకూడదూ?" అనిన్నీ అనిపించింది. అయినా తొందర పడక "ఎంతో అనుభవం ఉన్న అంత మందిని విసిరికొడుతోందే అది, నీ ధైర్యం ఏమిటిరా?" అని అడిగాడు.

"నన్ను చేరదీస్తుంది బాబయ్యా"

"కారణం"

"చెప్పలేనండి. కాని నిదర్శనం చూపించుకుంటాను, సెలవు దయచేయించండి."

"చూపించలేకపోతే?"

"తల కొట్టి వెయ్యవచ్చునండీ"

దీని మీద వాడివల్ల ఎంతో అపరాధం జరిగిపోయినట్టు ఆక్షేపపడుతూ "నీకు బతకాలని లేదుట్రా?" అని ఉరుముతూ లచ్చిగాణ్ణి కసిరి, "వాడు కళ్ళు తెరవని పసిరికుంక మహాప్రభూ! తల్లికీ, తండ్రికీ ఒక్కడే బిడ్డడండి. వాడి మాటలు లెక్క చేయక కరుణించి విడిచి పెట్టండి దేవరా" అని మహారాజుని ప్రార్థించాడు గంగులుగాడు.

"అయితే మరి చెయ్యవలసిందేమిట్రా?" అని అడిగాడు మహారాజు.

"ఇది పెంకి గుర్రం దేవరా! వారం దినాలు తిండీ తిప్పలూ మానేస్తే తరువాత చెప్పినట్టల్లా వింటుందండి" అని జవాబు చెబుతూ గంగులుగాడు మీసాల మీదకి చెయ్యిపోనిచ్చుకున్నాడు.

దీనికి మహారాజు మనస్సు చివుక్కుమంది.

అందుకు సాయం "రామరామా" అంటూ వొకమాటు చెవులు మూసుకుని, లచ్చిగాడు "అది జాతయిన గుర్రం మహాప్రభూ! దాన్ని పస్తు పెట్టడం జయకరం కాదండి. దాని సంగతి వీళ్ళు తెలుసుకోలేకపోయారండి. అది గంగిగోవు దేవరా! నీతయినవాణ్ణని కాని అడ్డమైన వాళ్ళనీ చేరనివ్వదండి అది" అని గుర్రానికి దణ్ణం పెడుతూ చెప్పాడు లచ్చిగాడు.

ఈ మాట మహారాజు నల్ల గుండెలో నాటుకుంది. అచ్చిగాడి సంగతి అలా ఉండగా తన మాట తాను ఆ స్వారీ చెయ్యలేకపోతే? అసలు ఆరోహణమే చెయ్యలేకపోతే?

మహారాజు హృదయం కుతకుతలాడిపోయింది. మనస్సు గజిబిజి అయిపోయింది.

అప్రయత్నంగా నాలుగు వేపులా చూశాడు.

అందరి కళ్ళూ తన మీదే ఉన్నాయి.

ఆ కళ్ళలో 'నీతయిన వాళ్ళెవరెవరో ఇప్పుడు తెలిసిపోతుంది' అన్న భావం ఉన్నట్టున్న స్ఫురించింది.

దాంతో ఉద్రిక్తుడయినాడు.

వెంటనే "ఏదీ నిదర్శనం చూపించూ" అని లచ్చిగాణ్ణి చురుగా చూశాడు.

ప్రభువు చూపుల్లో 'జ్ఞాపకం ఉందా? తల ఎగిరిపోతుంది సుమా' అన్న ముదలకింపు ఉండడం లచ్చిగాడికి స్పష్టంగా కనబడింది.

అయినా అధైర్యం కాక సాహసమే కలిగింది వాడికి.

శరీరం పొంగి పోయింది.

నూత్నావేశం కూడా కలిగింది.

దాంతో పరవశుడై ముందు మహారాజు ఆజ్ఞ వంగి దోసిలి వొగ్గి అందుకుని తరువాత పదడుగులు ముందుకు వేసి, పాగా తీసి నడుముకి చుట్టుకుని గుర్రం కేసి చూస్తూ నేల అంటి కళ్ళకద్దుకుని మళ్ళీ ముందుకి అడుగు వేశాడు.

వెంటనే ప్రసన్నంగా చూస్తూ గుర్రంవాడికభిముఖం అయింది.

రాజు చకితుడైనాడు.

గుర్రపు వాళ్ళు పిడుగు పడ్డట్టయిపోయారు.

తక్కిన వారందరూ విస్మితులైయినారు.

కళ్ళు చికిలించుకుని మళ్ళీ అందరూ చూసేటప్పటికి లచ్చిగాడి భుజం మీద తన మెడ ఉంచుకుని గుర్రం ప్రీతి నెరుపుతోంది.

"బాబా! నా బాబా! దేవలోకం నుంచి వచ్చావు నువ్వు. భూలోక దేవేంద్రులవారి దివాణంలో పడ్డావు. నీకేం లోటురా బాబా" అంటూ దాని మెడ తట్టుతున్నాడు లచ్చిగాడు.

గుర్రపు వాళ్ళందరూ తలకాయలు పొట్టల్లో పెట్టుకున్నారు.

వర్తకుడు మొదట కొంచెం స్థబ్ధుడై, తరువాత సంతుష్టుడై మహారాజుకి సలాం మీద సలాం చేసి "అంతా ఇంద్రజాలంగా ఉంది మహాప్రభూ! ఈ గుర్రం కోసమే ఈ పెద్ద మనిషి పుట్టినట్టు కనపడుతోంది. ఈ అనుబంధం ఆశ్చర్యకరంగా ఉంది. నా జన్మ ధన్యం అయింది దేవరా" అంటూ పొంగిపోయాడు.

ఈ సందుబాట్లో, లచ్చిగాడూ క్షణంలో అలంకారాలన్ని తొడిగి, కళ్ళెం పెట్టి, జీను కట్టి గుర్రాన్ని మహారాజు సన్నిధికి విడిచి పెట్టి, అందర్నీ తప్పుకోమన్నట్లు ఒక్కమాటు దర్జాగా చెయ్యి తలఊపి, "ఒక్కమారు దేవుణ్ణి ప్రార్థించుకుని, బాబాని బుజ్జగించి ఎక్కండి దేవరా" అని విన్నవించాడు.

మహారాజు ఆనంద ముగ్ధుడయిపోయాడు. వెంటనే లచ్చిగాడు చెప్పినట్టుచేసి ఒక్క విసురున గుర్రం ఎక్కాడు. గుర్రం ఎగిరిపోయింది.

6

అది మొదలు

ఏదన్నా మానవచ్చుగాని, అనుదినమూ గుర్రపుస్వారి మానడానికి వీలులేదు.

మహారాజయినా మానలేడు.

గుర్రం ఎక్కగానే ప్రభువు ఏదో దైవిక శక్తి ఆవహించినట్టవుతాడు. ప్రాభవం పెరిగిపోయింది. వయస్సు కొంచెం మళ్ళినా, మళ్ళీ నవయౌవనం అంకురించినట్టయింది

ఇదిలా ఉండగా –

మహారాజుకి, లచ్చిగాడి మీద అమిత పుత్రవాత్సల్యం కలిగిపోయింది.

వాడు గుర్రపు వాళ్ళందరికీ మొనగాడు అయిపోయాడు.

వాడిలో కూడా చాలా మార్పు, చాలా విశిష్టతా ఏర్పడింది.

షష్టీగడియలూ వాడికి గుర్రంతోనే సరిపోతుంది. గుర్రం కూడా వాడి కను సన్నల్లోనే మెలుగుతుంది.

గుర్రమూ, వాడూ ఒకచోటున్నంతసేపూ ఏదో ముచ్చటలాడుకుంటున్నట్టే ఉంటారు.

ఆడుకుంటున్నట్టూ ఉంటారు.

మాలీషు చేస్తూ, ఆగి ఆగి కువ కువలాడినట్టు వాడేమిటేమిటో చెబుతూ ఉంటాడు.

అందులో గుర్రానికి చక్కని ముక్తాయింపులు కనబడతాయి.

గుర్రమున్నూ మహానందంతో సకిలిస్తూనే ఉంటుంది.

అందులో లచ్చిగాడికి స్వర కల్పన కనబడుతుంది. దాంతో ఉభయులకూ పారవశ్యం కలిగినట్టుంటూ ఉంటుంది.

రోజల్లా ఇల్లా మల్లెపూల తెప్పమీద తేలిపోతూ ఉండగా సాయంత్రం స్వారి.

సరిగా ఆ సమయం సమీపించేటప్పటికి గుర్రానికి నరాలు పొంగుతున్నట్టు కనబడతాయి.

లచ్చిగాడికి శరీరంలో మెరుపు తీగలు పాకిపోతున్నట్టుంటాయి.

అంతా సిద్ధమయిందని కబురు వచ్చేటప్పటికి మహారాజు ఎలా వున్నవాడలా లేచి బయలుదేరతాడు.

ముగ్గురికీ, చివరికి, క్షణంలో ఒక్కమాటు భూప్రదిక్షిణం చేసి వచ్చినట్టనిపిస్తుంది.

అప్పటికీ దివ్య సుఖానుభూతీ, ఆనంద పారవశ్యమూ మేళవించగా ముగ్గురికీ హృదయాలు తేరుకుంటాయి.

కాగా, లచ్చిగాడు గుర్రం విషయమై తనకి తోచింది తోచినట్టు చెప్పేస్తూ ఉంటాడు.

వినీ వినడంతోనే మహారాజు లచ్చిగాడు చెప్పినట్టల్లా చేసేస్తూ ఉంటాడు.

ఆవేళ కూడా అలాగే చేశాడు.

గుర్రం ఇంగితం తెలిశాక, లచ్చిగాడి పిలుపుకూడా అందాక మహారాజు ఒక్క క్షణమయినా అక్కడ ఉండలేకపోయాడు.

ఎప్పుడూ లేంది దుస్తులు మార్చుకోవడం క్షణంలో అయిపోయింది.

అవలగ్న బంధంలో కట్టారి ఉంచడానికి వచ్చిన యువతితో "చదరంగం ఇక రేపే" అని శిరస్సున పాగా అమర్చడానికి వచ్చిన గుబ్బెరతో "సంగీత కచేరీ భోజనాలయినాకే" అని పాదాలకి పావూసులు తొడగడానికి వచ్చిన ముద్దరాలితో "అభ్యంగానికి సిద్ధం చేయించు" అని చెప్పి మహారాజు కిందకి వచ్చేటప్పటికి అలంకృతమై పంచకల్యాణి సర్వసిద్ధంగా ఉంది.

"కొంచెం ఆలస్యం అయినందుకు, ఇవాళ గుర్రం మేఘాల మీద ఎగిరిపోతుంది దేవరా! కనుక మొదట కోట చుట్టూరా తిరిగి ఉద్రుతం తగ్గాక, అప్పుడు పాండవుల మెట్టకేసి బయలుదేరండి మహాప్రభూ" అని విన్నవించుకుని లచ్చిగాడు పది అంగలు కూడా వేశాడు.

7

పాండవుల మెట్ట దాటి అరకోసుదూరం వెడల్పున కాలువ. దాని నిండా ఎప్పుడూ ఏనుగీత నీరు. అది తిరగేసుకు వెళ్ళాలంటే ఎగువకి, దిగువకీ కూడా రెండేసి కోసులు వెళ్ళాలి.

మొదటినాడు "ఏమిటి చెయ్యడం" అని మహారాజు ఆలోచనలో పడగా "ఫరవాలేదు, గుర్రం దాటేస్తుంది దేవరా" అని లచ్చిగాడు ధైర్యం చెప్పాడు.

ప్రయత్నించగా , గుర్రం వేళ్ళేటప్పుడూ, వచ్చేటప్పుడు కూడా అతి సునాయాసంగా దాటేసింది.

మహారాజుకి చాలా ఆనందం కలిగింది.

అది చాలా ముచ్చటగా కూడా కనపడింది.

అంచేత ప్రతి దినమూ, గుర్రపు స్వారీ కదే దారి.

కానీ ఆ వేళ, కాలవ ఇంక వంద గజాలలో ఉందనగా వేగం హెచ్చించిన్నీ గట్టుమీదకి వచ్చేటప్పటికీ గుర్రం హఠాత్తుగా ఆగిపోయింది.

మహారాజు నిర్విణ్ణుడయిపోయాడు.

''ఏం చెప్మా?'' అనుకుంటూ అలాగా ఇలాగా పారజూసిన్నీ కారణం కనిపెట్టలేక, అయినా వెనక్కి మళ్ళడానికిష్టపడక, మళ్ళీ మళ్ళీ ప్రయత్నించాడు.

గుర్రం కూడా కసిగానే ఉండినట్టు కనపడింది. కాని దాటదు. ఎంత హెచ్చరించినా ఉండాయించదు.

ఈ వెనక్కి ముందుకీ వెళ్ళడాలు అంతదూరం నుంచే చూసి, కంగారు పడుతూ లచ్చిగాడు వచ్చేటప్పటికి ప్రయత్నం మానుకుని మహారాజు అలాగే ఉండిపోయాడు.

''ఏం బాబయ్యా!'' అంటూ ఆత్రంగా అడిగాడు లచ్చిగాడు.

''గుర్రం దాటటం లేదురా''

''.....''

''ఉడాయించటమే మానేసిందిర''

''.....''

''అవతలి గట్టున కాని, కాలవలో కాని ఏవయినా భయకారణం ఉందేమో చూడు''

లచ్చిగాడు బాగా పరకాయించాడు కానీ ఏమీ కనపడలేదు. తల గోక్కుంటూ, ముందుకి వెళ్ళినుంచుని కళ్ళలోకి గంభీరంగా చూశాడు వాడు.

గుర్రం తల విసిరింది.

ఏదో పొరపాటు జరిగినట్టు తోచింది కాని విడిపోలేదు. ఏర్పడించుకోలేక ''మళ్ళీ నా ఎదుట ఒకమాటురికిందండి బాబయ్యా'', అన్నాడు వాడు.

మహారాజు చాలా కసిగా ఉరికించాడు.

కాని అంతా వ్యర్థం.

గుర్రం సరిగ్గా పరిగెత్తనే లేదు.

మహారాజు మనస్సు చెడిపోయింది.

లచ్చిగాడికి గుండెలు కొట్టుకుంటున్నాయి. దానిమీద ''ఏం బాబా లచ్చిగాడికి ఇవాళతో భూమ్మీద నూకలయిపోయాయా?'' అంటూ ఒక్క క్షణం కళవళపడి అయినా ఉత్తర క్షణంలో ప్రయత్నించి నిలవరించుకుని మోకాళ్ళ మీద చేతులానుకుని వంగుని చూసి ''పాగా వొరిగినట్టుంది చూడండి బాబయ్యా!'' అంటూ పక్కకి తప్పుకున్నాడు వాడు. చూడగా అలాగే ఉంది.

అందుకాశ్చర్యపడుతూ మహారాజు పాగా బాగా సర్దుకున్నాడు.

అంతే

వెంటనే గుర్రం తనకితానే వెనక్కి వెళ్ళి గుండెలు దూసుకుపోయేటట్టు చూస్తూ ఒక్క పరుగున వచ్చి, ఒక్క వూపున కాలవేకాక కాలువ గట్టుకూడా దాటేసింది.

ఇది జరిగిందీ, విన్నదీని, రచన మట్టుకు నాది.

✡✡✡

మనకొద్దీ మంచితనం

- మల్లాప్రగడ రామారావు

(స్వాతి మాసపత్రిక, డిసెంబర్, 1971)

వెంకటరత్నం పట్ల నాకు సానుభూతిలేదు. వెంకటరత్నం పట్ల సానుభూతి చూపించే వారిపట్ల నాకు అసహ్యం మాత్రమే ఉంది.

వెంకటరత్నం పట్ల అసహ్యం చూపించే వారిపట్ల నాకు సానుభూతి ఉంది.

వెంకటరత్నం శేషాచలం, నరసమ్మల కొడుకు. 'ఒక్కగానొక్క మగ నలుసు' అని నొక్కి చెప్పాలిక్కడ. వెంకటరత్నం తల్లిదండ్రులకి ఒక్కడే మొగపిల్లడవడం ఎన్నో అనర్థాలకు దారితీసిందని నమ్ముతాన్నేను.

వెంకటరత్నం పిరికివాడు.

"ఛ్ఛ. చీకటంటే చంటాడికంత భయమేమివిటే!" అంటూ వాళ్ళ నాన్న మీసాల మూతితో అయిదారేళ్ళ వెంకటరత్నాన్ని ముద్దుపెట్టుకునేవాడు. వాళ్ళమ్మ నరసమ్మ, కొడుకు ఘనకార్యం చేసినట్టు ముసిముసిగా నవ్వేది.

వెంకటరత్నం మొగమాటస్తుడు.

"వాడికి అమ్మా నాన్నల దగ్గర కూడా బిడయమే నాయే" అంటూ బుగ్గలు పుణికి, వెంకటరత్నం మామ్మ, ఉహూఁ మురిసిపోయేది.

వెంకటరత్నం తనకు తానై ఏదీ చేసుకోవడం కాదు గదా, అడగలేడు కూడా.

"వాడికి తలనూనె దగ్గర నుంచీ నేనే రాయాలి. నేను కలపందే ముద్దయినా నోట్లో పెట్టుకోలేడు. మా నాన్నకేక్షణానేది కావాలో నాకు తెలుసు" కాంతమ్మ మెటికలు విరుస్తుండడం విననట్టే, నరసమ్మ రెండిళ్ళ మధ్య గోడ దగర నిల్చుని చెప్పుకుపోయేది.

ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఇస్తూ పైన చెప్పిన నా మాటల్ని సమర్థించుకోగలను.

వెంకటరత్నం మధ్య తరగతిక్కూడా చెందుతాడు.

ఒక్కడే కొడుకవడం కన్నా కూడా వెంకటరత్నం జీవితానికి దాపురించిన శాపమేమిటయ్యా అంటే, ఇదొకటేనని నిమిషం సందేహించకుండా చెప్పగలను.

చెట్టుమీద పండుండేది. దొరగారిది మామిడితోట. కిందనున్న రాయుచ్చు కొడితే నేల రాలుతుంది. కాని వెంకటరత్నానికి పండువంక చూపుపోకుండానే రాయిమీద కన్నుపడినా, చెయ్యిసాగేది కాదు. రోడ్డువారగా నిల్చునేవాడు.

''పండురాలితే బావును. ఏ గాలి రివటైనా తనకు సాయం చేస్తే బావున్ను' అని లొట్టలు వేస్తూ కాసేపు నిల్చుని 'అందని ద్రాక్షపళ్ళు పుల్లన' అనుకుని కాళ్ళీడ్చుకుంటూ పోయేవాడు.

వెంకటరత్నం చిన్నప్పుడు వాళ్ళింట్లో పండుగ జరిగింది. పండుగంటే మామూలు పండుగనుకుంటున్నారేమో. దసరా, దీపావళీ, సంక్రాంతి, ఉగాదిల్లాంటిది కాదు. జండా పండుగా కాదు. మరి, వెంకటరత్నం పుట్టినరోజు పండుగసలే కాదు.

ఊర్లో బస్సెక్కిస్తే పాతిక మైళ్ళ దూరంలో ఉన్న వాళ్ళ అక్క అత్తవారింటికి, ఫిఫ్త్‌ఫారం చదువుతున్న వెంకటరత్నం ఒక్కడూ వెళ్ళి, వాళ్ళక్కను తీసుకుని తిరిగి రావడం ఆ పండుగ. ఆ రోజు వెంకటరత్నం బామ్మ ఈ విషయం చెప్పని ఇల్లు ఆ వీధిలో లేదు.

అయితే వెంకటరత్నం, జీవితంలో పూర్తిగా సంతోషించి, తలెత్తుకు నడచిన సంఘటనలు రెండు మాత్రం ఉన్నాయని అతని మనసు పుస్తకంలా చదవగలను కాబట్టి నేను చెప్పగలను.

ఒకటి చిన్నప్పటిది.

వెంకటరత్నం తరగతిలో శ్రీనివాసరావని ఓ రాలుగాయి ఉండేవాడు. ఒక సాయంకాలం ధైర్యం చేసి ఇద్దరూ అబ్బాయిగారి తోటలో జీడిచెట్టెక్కి జీడిపళ్ళు దొంగిలించుకొచ్చారు.

తను అంతటితో మనిషైనట్టుగా వెంకటరత్నానికి ఆ రోజు, చిన్నప్పుడు అనిపించింది. పూర్తిగా ఆ భావానికి కారణం నాటికతనికి తెలియకపోయినా, ఆనందం రెక్కలు విప్పింది.

అంతకు కొన్నాళ్ళ క్రితం బడితోటలో అతను బ్యాడ్ మింటన్ బ్యాట్‌తో ఆటాడుతూ ఒకటికి నెపంతో తోటలో దూరిన పిల్లలందరి మల్లే, మామిడికాయ ఒకటి రాల్చబోయాడు. ఎత్తిన బ్యాటునెవరో చేత్తో గట్టిగా పట్టుకున్నారు. వెనక్కి తిరిగి చూస్తే బలమైన కండలు, మెడలోని కాశీతాడు మాత్రమే కనబడ్డాయి. ఇంక ఒకటే పరుగు.

తోటకాపలావాడిని ఆ బ్యాటు గురించి అడిగే ధైర్యం ఆ తర్వాత ఎన్నాళ్ళకీ లేకపోయింది. ఎప్పుడు కనబడినా వాడు నవ్వేవాడు. వెంకటరత్నం తలదించుకునేవాడు. వెంకటరత్నం ''ఇక మీదట వాడికళ్ళలోకి సూటిగా చూస్తూ నవ్వగలను'' అనుకున్నాడానాడు జీడిపళ్ళు దొంగిలించి.

ఇంకోసారి కాలేజీలో చదువుతుండగా వెంకటరత్నం పూర్ణాహాల్లో సినిమాకెళ్ళాడు బాల్కనీకి. ఇంటర్వెల్‌లో, రాబోవు చిత్రాల పోస్టర్లు చూద్దామని వచ్చిన ఇద్దరు స్నేహితులు కనపడ్డారు. కిందకి దిగి పచార్లు చేస్తుంటే. ఛటుక్కున వెంకటరత్నం బుఱ్ఱలో ఒక ఆలోచన మెరిసింది.

''ఒరే శేఖరం! ప్రసాద్! నాతో వచ్చెయ్యండిరా, సినిమాకి. హాలు వాడు ప్యాసులియడం లేదు'' అన్నాడు. అనగానే గుండెదడ పట్టుకుంది.

శేఖరం ''ఎందుకురా నేనెప్పుడో చూశాను. డబ్బింగ్ సినిమా కూడా'' అని నసిగాడు.

ఆ నసుగుడులో అసలర్థం వెంకటరత్నానికి తెలుసు. ప్రసాద్ మాత్రం పట్టువదల్లేదు. వెంకటరత్నానికి మనసు పీకింది. గుండె మాత్రం దడదడలాడుతూనే ఉంది.

ఏవో స్టెడ్స్ చూపుతుంటే, ఒకరి తర్వాత ఒకరుగా ముగ్గురూ హాల్లో దూరారు. గేటు దగ్గర ఎవరూ ఆటకాయించలేదు. గుండె బెదురుగానే ఉన్నా, సినిమా సాంతం చూశాడు స్నేహితులతో అల్లరి చేస్తూ.

వెంకటరత్నం 'రెడ్డికీ విషయం తెలిస్తేనా' అనుకున్నాడు సినిమా చూస్తూ.

రెడ్డికీ విషయం తెలియదు. రెడ్డి చదువు పూర్తిచేసి రెండేళ్ళయ్యింది. ఇప్పుడెక్కడున్నాడో వెంకటరత్నానికి తెలియదు. రెడ్డి ఫైనలియర్ డిగ్రీ కోర్సు చదువుతున్నప్పుడు వెంకటరత్నం ఫస్టియర్ చదివేవాడు. రెడ్డి కూడా హాస్టల్‌లోనే ఉండేవాడు.

ఒకరోజు సాయంకాలం టీ బెల్లు మోగగానే బిలబిల్లాడుతూ అంతా గ్లాసులు పుచ్చుకుని మెస్ వేపు పరిగెతారు. తాపీగా గ్లాసు పుచ్చుకుని వెంకటరత్నం వెళ్ళేసరికి, ఇద్దరు ముగ్గురు కుర్రాళ్ళు మాత్రం అండాలో టీని గ్లాసులో పోసుకుని, టీ తాగుతూ రేడియో రూం వేపు పోతున్నారు. పంతులు అక్కడ లేడు. వాళ్ళలాగే వెంకటరత్నం అండాలోంచి టీ తీసుకుంటుంటే రెడ్డి వచ్చాడు.

హాస్టల్ కమిటీ మెంబర్ హోదాలో "ఏమిటండీ ఇది? ఎవరి మానాన వాళ్ళు టీ ముంచి పోసేసుకుంటుంటే కిచెన్ స్టాఫ్ దేనికి? ఇదేనండి సివిలై...' రెడ్డిమాటలు పూర్తికాకుండానే వెంకటరత్నం కళ్ళలో నీళ్ళు తిరిగాయి. గ్లాసులోని టీ అండాలో వంపేసి, రూముకొచ్చి వాలుకుర్చీలో పడుకున్నాడు.

అక్కడ ఉండాలిసిన పంతులు లేడని కాని, అందరూ చేసిన పనే తనూ చేసాడని కాని, ఇందులో కొంప మునిగిపోయేదేముందని కానీ, వెంకటరత్నం అనలేకపోయాడు. అప్పుడే కాదు. ఆ తర్వాత రెడ్డి రూముకొచ్చి "సారీ" అంటూ ఏమో చెప్పినప్పుడు కూడా వెంకటరత్నం గొంతు పెగల్లేదు.

వెంకటరత్నం, ఆవేళ, సినిమా వదలిన తర్వాత, ఆనందంగా రోడ్డుమీద నడుస్తూ "రెడ్డికి విషయం తెలిస్తేనా?" అనుకున్నాడు మరోసారి.

చిన్నప్పటిలా కాక, ఇప్పటి తన ఆనందానికి కూడా కారణం తెలిసింది వెంకటరత్నానికి స్పష్టాస్పష్టంగా.

ఇంకోసారి కాలేజీలో నాటకమైంది. వెంకట రత్నం డ్యూటీ ప్రాంప్టింగ్. నాటకంలో హీరోయినుంది. అసలే అందమైంది. మేకప్‌లో అందానికి మారుపేరులా ఉంది.

నాట్య సంఘం కార్యదర్శి, నాటకాలంటే చాలా ఇష్టమని చెప్పుకునే ఇంగ్లీష్ లెక్చరర్, స్టేజి మీద హీరోయిన్‌తో మాట్లాడుతూనో, ఆవిడ నోటిలో మాట నోటిలో ఉండగానే కావల్సినవన్నీ అందిస్తూనో కాలం గడుపుతున్నారు.

తప్పనిసరిగా రంగాలంకరణ చేస్తున్న వాళ్ళు కూడా, వీలైనపుడల్లా హీరోయిన్ వంక చూస్తూనో, నవ్వించాలని యత్నిస్తోనో తాపత్రయపడుతున్నారు.

అంతా చూస్తున్న వెంకటరత్నానికి నిప్పుల మీద నిల్చున్నట్టైంది. "పాపం ఆడది. మరో ఆధారం లేనిది. నలుగురిలో తిరిగి నాటకాలు వేస్తున్నంతలో ఎంత చులకైనపోయింది. ఆడదాన్ని భోగ్యవస్తువుగా తప్ప మరోలా చూడ్డం మగవాళ్ళకి చేతకాదులా ఉంది.

ఇంతకీ అంత అందమైనది కోరి పెళ్ళాడమనోస్తే, ఒక్క రోమియో కూడా ముందుకు రాడు." ఇలాంటి ఆలోచనలు మనసులో నిండి, ఎంత వేగంగా తీస్తారా తెర, ఈ తెర వెనక నాటకం ఎప్పుడంతమవుతుందా అని ఎదురు చూడసాగాడు.

నాటకం మొదలైంది. రెండో రంగంలో స్టేజిపైన నటులంతా ఉన్నారు. హీరోయిన్ తప్ప. ఆవిడ వెంకటరత్నానికి తగుల్తూ, నాటకాన్ని, ప్రేక్షకులు కనబడకుండా చూడాలని ప్రయత్నిస్తోంది.

ఒక్కసారిగా సీనిక్ ఎఫెక్ట్ కోసం రంగం మీద లైట్లు ఆరిపోయాయి. దీపాలు వెలిగి హీరోయిన్ చిలిపిగా చూసి, చేత్తో పెదాల మీద తడి తుడుచుకున్నప్పుడు, వెంకటరత్నానికి తాను చేసిన పని తెలిసింది.

ఇంగ్లీషు లెక్చరర్, నాట్యసంఘం కార్యదర్శి తన కన్నా మంచివారని తేలింది.

"నే నే గుంట దగ్గరికి పోను నీలా" అన్నాడు ముఖం తుడూచుకుంటూ బసవరాజు.

"పోయేముందుకు దమ్మేదిరా వెధవ! జబ్బులంటుకు చస్తానని, పోలీసులు పట్టుకుంటారని, భయం నీకు" అన్నాడు సీతారామారావు నీళ్ళు పోసుకుంటూ నొప్పితో 'ఇస్' అనుకుంటూనే.

బ్రష్‌తో పళ్ళు తోముకుంటున్న వెంకటరత్నానికి నిజమనిపించాయి సీతారామారావు మాటలు.

మనిషి తప్పుచేయకపోవడం దేనికో దానికి భయపడడం వలననే కాని, నీతితో బ్రతకాలన్న దీక్షతో కాదని, వెంకటరత్నం కొక అనుమానం ఆరంభమై ధృఢపడసాగింది.

చెడు చేయగల ధైర్యం లేకపోవడం వలన మంచిగా బ్రతకడంలోని గొప్ప వెంకటరత్నానికి అర్థమవదు. అతని కర్థమయినదల్లా అతన్ని కూడా ఆ మాదిరి పిరికితనం ఆవరించి ఉందని. అందుకే ఎప్పుడైనా చిన్న చిన్న అఘాయిత్యాలు చేస్తే తనకి ఆనందంగా ఉంటుందని వెంకటరత్నానికి తెలిసిందిప్పుడు.

ఇంకా అసలు కథలోకి రాలేకపోతున్నాను. వెంకటరత్నానికి మంచిగా బ్రతకాలనే ఉన్నది కాని, ఆ మంచి బలహీనత నుంచి కాక, సత్వాన్నుంచి జన్మించాలన్న ఇచ్ఛ అంతకన్నా బలంగా ఉంది.

గాయత్రి వల్లించే ఇష్టమూ, ఓపికా లేక, కంచం చుట్టూ ఇన్ని నీళ్ళు చల్లి, ఇంత నీరు ఔపోసన పట్టే కన్నా, జంధ్యం పోగు తెంపి పారెయ్యడం మంచిది. ***ఎదిరించే శక్తిలేకపోవడం మరణంతో సమానం.*** ఇలాంటివన్నీ వెంకటరత్నం మనసులో సదా మెదిలేవే.

ఇక్కడింకొక్క మాట చెప్పేస్తాను. లోకాన్ని చూస్తుంటాడు. లోకంలోని వైరుధ్యాన్ని చూస్తుంటాడు. కోరిందాన్ని దక్కించుకోలేక మనుష్యులు వల్లించే నీతిపాఠాల్ని వింటుంటాడు. ***మనసుకు నచ్చిన పని, మంచిదని తోచిన పని చెయ్యడమొక్కటే జీవితంలో ఆనందానికి మూలం. ఇది లేకపోవడమే బ్రతుకులో థ్రిల్ లోపించడానికి కారణం.*** హిప్పీ, హిప్పీ తరాలకు బీజం. ఈ లేకపోవడం తనలో ఉండడాన్ని వెంకటరత్నం కనిపెట్టిన దగ్గర నుంచే, అతనికి అసలైన అశాంతి ఏర్పడింది.

ఆ రోజుల్లోనే ఒకమ్మాయిని చూశాడు. మెయిన్ రోడ్డుమీద పుస్తకాలు పట్టుకు వెళుతోంది స్నేహితురాళ్ళతో బాటు. తెల్లగా ఉంది. సన్నగా ఉంది. ముఖం కోలగా ఉంది. నుదిటి మీద దోసగింజ తిలకం ఉంది. చెవులకి రింగులు, రెండు జడలు, పువ్వుల పరికిణీ మీద నీలం వోణీ వేసుకుంది.

వెంకటరత్నానికి గుండె లయ తప్పినట్టయింది. ఆ అమ్మాయి కనుమరుగవుతుంటే హృదయం బాధతో కీచుమంది.

మర్నాడూ అదే వేళకు, మెయిన్ రోడ్డు మీద అక్కడే బీటు కాసాడు. ఆ అమ్మాయి కనబడింది. వాళ్ళ వెనకాతలే నడచి వెళ్ళాడు. ఒక సాహసకార్యం చేస్తున్న వాడిమల్లే భావించుకుంటూ.

అమ్మాయిలంతా కొంచె దూరం వెళ్ళి, మెయిన్ రోడ్డు మీద నుంచి సందులోకి మళ్ళి, ఓ మేడలో దూరారు. పైన బోర్డు ఉంది. 'హిందీ విద్యాలయము' అని. ఆ వేళలలో హిందీ రాష్ట్ర పరీక్షకు ట్యూషన్ చెబుతారని, వెంకటరత్నం ఎలాగైతేనేం కూపీ లాగాడు.

అప్పటికి వెంకటరత్నం పరీక్షలు నెల్లాళ్ళున్నాయి. చదవవలసినవి ఆర్నెల్లకి సరిపడా ఉన్నాయి. అయినా హిందీ నేర్చుకోవాలనిపించింది. రెండు, మూడు రోజులు తిరిగి, ఎలాగైతేనేం ఒకరోజు ధైర్యం తెచ్చుకుని, మేడమీదకు వెళ్ళి హిందీ నేర్చుకుంటానని, రాష్ట్ర పరీక్షకి వెళతానని జీతం కట్టివచ్చాడు.

మర్నాడు క్లాసులో అతనికెదురుగా చాపమీద ఆ అమ్మాయి వచ్చి కూర్చున్నప్పుడు వెంకటరత్నం ఆనందానికి మేరలేదు. కలల హార్మ్యాలు స్కై స్క్రేపర్స్‌ని మించిపోతున్నా తలమాత్రం పైకి లేవలేదు.

పారాణి పూసినట్టుగా, పావడా ఎట్ట అంచుపడి, అందంగా మెరుస్తున్న తెల్లని పాదాన్ని చూస్తూ కూర్చున్నాడు. క్లాసులో అతని ఈడు అబ్బాయి లెవరూ లేరు. పది పన్నెండేళ్ళ కుర్రాళ్ళిద్దరిని తప్పించి, అందరూ అమ్మాయిలే.

మొదట పలకరించుకుందామనుకున్నాడు. తరువాత నోట్స్ అడుగుదామనుకున్నాడు. ఆ అమ్మాయి పేరు లక్ష్మి. చిలిపిగా ఉండేది. అల్లరి చేసి టీచరు చేత మొట్టికాయలు తినేది.

"మేడమ్! బుద్ధుడు కత్తితో స్వయంగా తలబోడి చేసుకున్నాడని బుక్‌లో ఉంటే అంత చక్కటి హెయిర్ స్టయిల్‌తో బొమ్మలు వేస్తారేమిటండీ!" అనేది. అలాంటి సమయాలలో చెమట పోసిన శరీరానికి చల్లగా గాలితగిల్తే కలిగే ఆనందంతో వెంకటరత్నం మనసు నిండేది.

అయినా ఏం లాభం? వెంకటరత్నం ట్యూషన్ చదివిన నెల్లాళ్ళలోనూ, ఒక్కసారి నోరు మెదపలేదు. లక్ష్మి, వెంకటరత్నం, ఆకాశం, భూమి అంత దూరంగానే ఉండిపోయాడు.

క్షితిజ రేఖ వద్ద భూమీ ఆకాశం కలిసినట్లుంటాయి.

వెంకటరత్నం ఇలా ఆలోచించేవాడు.

ఒకానొక రోజున లక్ష్మి అంటుంది, కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా "ఏమండీ చూపులతో నన్నెంత కలవరపెడుతున్నారు. మీ చూపుల పుష్పాలతో నా పాదార్చన చేస్తున్నారు. మాట్లాడరేం? నా హృదయమంతా ఎన్నడో నిండి ఉండీ, మౌనంగా ఉంటారేం? నేను మీదాన్నండి యుగయుగాల నుండి మీకోసం..."

వెంకటరత్నం కళ్ళంట నిజంగా నీళ్ళొచ్చేవి. "లక్ష్మి! నాకు తెలుసు నాకు నువ్వు..." మాటలు పూర్తికాకుండానే లక్ష్మి అతని హృదయంలో ఒదిగిపోయేది. లేదా. వాళ్ళ నాన్న పిలిచి, మీసాలను చేత్తో సవరించుకుంటూ "నాయనా వెంకటరత్నం! రాత్రి కలొచ్చిందిరా. కలలో సింహాచలం నరసింహస్వామి కనిపించి, మీ వెంకటరత్నం ఒక అమ్మాయిని ప్రేమించాడు. వాళ్ళిద్దరికీ పెళ్ళి చేసి నా గుడికి తీసుకురా అన్నాడురా. నిజమైతే చెప్పరా బాబూ కళ్యాణం కానిచ్చేద్దాం" అనేవాడు.

వెంకటరత్నం ఆలోచనల క్షితిజ రేఖ వద్ద తనూ లక్ష్మి ఐక్యమైనట్టు కలగనడమే తప్ప, వెంకటరత్నం ఎప్పుడూ ఆమెతో మాట్లాడే ధైర్యం చెయ్యలేదు.

పరీక్షలై వాళ్ళు ఊరు వెళ్ళిపోయినప్పుడు, నిద్రపట్టక బాధపడే కొన్ని రాత్రులు తర్వాత, ఒక ఉదయం కొత్త సంవత్సరం గ్రీటింగ్స్ మాత్రం లక్ష్మి పేరపంపాడు.

అందులో ఫ్రమ్ అడ్రస్ అయినా రాసే ధైర్యం చెయ్యలేకపోయినా, తర్వాత కొన్నాళ్ళకి నాతో అన్నాడు కదా,

" ప్రేమ సంపాదించానే అనుకో. వాళ్ళ కులం వేరు. పెండ్లికి మా వాళ్ళు, వాళ్ళ వాళ్ళు అంగీకరించకపోవచ్చు. ఇంట్లో ఎదిరించే ధైర్యం మాకు లేకపోవచ్చు. అపుడు లక్ష్మిని అన్యాయం చేసి ఇద్దరమూ బాధపడేకన్నా ఇదే మంచిది కదా" అని.

నా కొళ్ళు మండుకొచ్చింది. "ఇవన్నీ ఆలోచించే లక్ష్మితో మాట్లాడలేదా? లేక లక్ష్మితో మాట్లాడేందుకు కలిగిన భయాన్ని ఇలా కప్పి పుచ్చుకుంటున్నావా? " అని అడగాలనిపించినా, అసహ్యం వేసి ఊరుకున్నాను.

ఇదంతా రాయకపోదును. వెంకటరత్నం కథానాయకుడూ కాదు. అతని జీవితంలోంచి కథను పిండాలనీ నాకు లేదు. వెంకటరత్నం మీద నాకు ద్వేషం కూడా లేదు. కాని అతనే నన్ను ప్రొవోక్ చేశాడు.

అదెలాగంటే, ఇవాళ సాయంకాలం అతను బీచ్‌లో పచార్లు చేస్తూ నాతో ఒక మాటన్నాడు. ఆ మాట చెప్పే ముందు మరో చిన్న సంఘటన చెప్పితీరాలి.

వెంకటరత్నం ప్రస్తుతం సెప్టెంబరు పరీక్షలకి చదువుతూ, కృష్ణానగర్‌లో గది అద్దెకు తీసుకు వుంటున్నాడు. వెంకటరత్నం గదిలో కిటికీలోంచి చూస్తే, సరిగా ఎదురుగా ఉన్న ఎదురింటి కిటికీ కనబడుతుంది.

ఆ కిటికీలోంచి చక్రాల్లాంటి రెండూ కళ్ళు, నడుం వరకు శరీరం వెంకటరత్నానికి కనబడుతాయి. ఆ కళ్ళు, వెంకటరత్నం గదిలో ఉండి, ఆ కళ్ళ హక్కుదారుడు ఇంట్లో లేనపుడు కిటికీ దగ్గర తారట్లాడేవి.

పెద్ద పెద్ద పాయలుగా జుత్తును వేరు చేసి దువ్వుకుంటూనో అద్దంలో చూసుకుంటూ తెల్లని, గుండ్రని ముఖం మీద బొట్టు దిద్దుకుంటూనో లేదా ఊరికే అలా చూస్తూనో.

వెంకట రత్నం నవ్వేవాడు. అటు చూసి, కన్ను గీటేవాడు. పెదాలతో గాలిని ముద్దుపెట్టుకునేవాడు. ఆ శబ్దానికి, ఎటో చూస్తున్నట్టూ నటించే ఆ ముఖం, వెంకటరత్నం వేపు తిరిగి, పళ్ళ వరస మెరిసేలా నవ్వేది.

తొలగించిన పైటను ఎంత సేపటి వరకో సర్దుకోవడం మరచిపోయేది. వెంకటరత్నం చేతిలో పుస్తకం ఉండేది, అంతా కుఱ్ఱాడు చదువుకుంటున్నాడనుకునేందుకు.

నిన్న ఉదయం కూరలు బేరమాడుతూ ఆవిడ, వెంకటరత్నం వైపు చూస్తూ "ఎందుకే కేజీ బంగాళా దుంపలు. మా ఆయన ఊర్లో లేరు. రెండురోజుల దాకా రారు కూడా" అని కూరల మనిషితో అనడం వినిపించింది.

కూరలది "అయితే అమ్మగోరూ! పిల్లలనెట్టుక్కి ఒక్కరే తొంగుంటారా రాత్రుల్లు" అని ఆశ్చర్యపోయింది.

"భయమెందుకే ఆ మాత్రం తోడుండరా ఇరుగూ, పొరుగూ, అందులోనూ రాత్రుళ్ళు" అంటూ ఆవిడ బారెడు జడ, నల్లత్రాచులాటిది, గుండెల మీద నుంచీ విలాసంగా, వెనక్కు వీపు మీద పడేలా, మెడ విదిలించింది.

వెంకటరత్నం పట్టుకున్న కిటికీ ఊచలు కూడా వేడెక్కాయి.

రాత్రి ముందు గది తలుపులు మూస్తూ, చీడీ మీద నిల్చున్న వెంకటరత్నంతో 'తరువాత' అని పైకని, చేతివేళ్ళు పదీ చూపించి, రమ్మన్నట్టు తలూపుతూ మూసిన తలుపుల వెనక మెరుపు తీగలా అదృశ్యమైంది.

వెంకటరత్నానికా రాత్రి నిద్దురలేదు.

"హఠాత్తుగా, మధ్యరాత్రి ఆమె మొగుడొచ్చి తలుపు తడితే", పక్కింటివాళ్ళు తలుపు తెరిచిన శబ్దాలకి లేచి 'ఎవరండి వస్తా' అని అడిగితే, 'తలపులు తెరిచి ఉంచిందో, లేదో 'అవన్నీ అటుంచు తీరా తలుపులు తడితే, ఆవిడ కేకలేసి అల్లరి చేస్తే' అలాగే మంచం మీద కూర్చుని, వాలుకుర్చీలో చేరబడి, మెలుకువగానే తెల్లవార్లూ గడిపాడు నిన్నటి రాత్రి వెంకటరత్నం.

వెంకట రత్నం కాని పనులు చెయ్యాలని నాకు లేదు. కాని చేతకానితనాన్ని మంచితనంగా నమ్మమంటేనే నాకు మండుకొస్తుంది.

ఇందాక బీచ్‌లో పచార్లు చేస్తూ నాతో అంటాడు కదా. "చూడు మంచిపనే చేసాను. రంకు, బొంకు దాగవన్నారు. ఇదంతా ఆవిడ భర్తకు తెలిస్తే, ఒక సంసారాన్ని నాశనం చేసిన పాపం నాకొద్దు" నేను మరి వినిపించుకోలేదు.

వెంకటరత్నం పట్ల సానుభూతి చూపించడమంటే తమలోని దౌర్భల్యాన్ని చూసి నిట్టూర్చడమేనని నమ్ముతాను. అందుకే అలాంటి వారి పట్ల నాకసహ్యం మాత్రమే ఉంది. వెంకటరత్నం పట్ల అసహ్యం చూపేవాళ్ళు - నూటికి తొంభైమంది - తమ జీవితంలో అంతకంటే ముందుకు పోలేరన్న అపనమ్మకం ఉండడం వల్ల వారంటే నాకు సానుభూతి మాత్రమే ఉంది.

పోతే ముందే చెపినట్లు వెంకటరత్నం పట్ల నాకు సానుభూతి లేదు ఎందుకంటే మరి..... నా పేరే వెంకటరత్నం.

శ్రీ రామారావు గారు 1970 దశకంలో అద్భుతమైన కథలు అన్ని ప్రముఖ పత్రికలలోనూ వ్రాసారు. పూణే లోని కార్మిక రాజ్య భీమా సంస్థ డైరెక్టర్‌గా 2006 లో పదవీ విరమణ చేశారు. తన పాత కథలన్నింటినీ కలిపి 'గోరంతదీపం' పేరుతో ఇటీవలే ఒక కథాసంపుటిని విడుదల చేశారు.

✡✡✡

శ్రీకాకుళే మహాక్షేత్రే
- వేటూరి సుందర రామమూర్తి

(‘రచన‘ జనవరి 2003 సంచిక నుంచీ)

ఆ.. ఈ శ్రీకాకుళంలో మహాక్షేతంలో నాటి మాట ఇది. తెలుగు నాటి మాట. విశేషించి వెలనాటి మాట. వెలదీ కోవెలది అయిన ఆటవెలది మాట ఇది. దైవరాయడా దేవవేశ్యాభుజంగుడు. పోనీ.. ఆ దైవం రాయడా అంటే.. రాసే రాత నుదుట. ఎదుట పడి అడగాలంటే కొబ్బరి కొట్టిన రాయి. ఉలుకా పలుకా రాయడికి? కులుకు కూడబెట్టుకుని కూనసానులతో కూచిపూడి ఆడమంటే మాత్రం విటరాయడూ.. నటరాయడూ తెలుగు భర్త!

అనాడెప్పుడో రాయలవారికి నాలుగో జామున కల్లోకి కదిలి వచ్చాడట. ఆముక్తమాల్యద రాసి తనకిమ్మన్నాడట. ‘కులపతి వెంకన్నగారికిద్దామనుకున్నానే.. ఇప్పుడెట్లా స్వామీ!‘ అంటే ‘నాకన్న వెంకన్న ఎవరయ్యా రాయా - ఇంకా కన్ను తెరవలేదా?‘ అన్నాడట. ఆ రాయడి గుడి నీడలో వెలసిందో వాడ. ఆ వాడ సానివాడ. దానికి కొంత వారగా తేరగా దక్కిన మాన్యాల వారు, ధాన్యాల వారు, జారులు - పూజారులు అరుగులరిగేట్లు తిష్టించేవారు. లేని కథలు సృష్టించే వారు. నేతిగిలకలవారు, నెత్తి పిలకలవారు, కలవారు - లేనివారు, వారూ - వీరు కలిసి వెలసిన మున్నూరు గడప. రమారమిగా (అంటే... విష్ణువు అనుకునేరు! రమను రమించువాడు గనక విష్ణువు. ఇత్యాది కాకుళీయ సమాసాలు చేసి కర్మధారయకు నీళ్ళు వదిలేసి). తొన్నూరు నెగళ్ళవారు ఈ మట్టి దేవుళ్ళు సామాన్యులా! అటు మహాభోగి ఆంధ్ర విష్ణువుని, ఇటు ఏ భోగం లేని ఏక రాత్ర మల్లికార్జు స్వామివారిని కూడా ఆశ్రయిస్తూ ఉంటారు. ఇటు శుద్ధ వైదీకమూ ఉంది. అటు వీర వైఖానసమూ ఉంది. ఉన్నదేదో ఉంది. ఊరు పచ్చగా ఉంది. ఊహలకు వెచ్చగా ఉంది. అపోహలకూ, నచ్చుబాటుగా ఉండనే ఉంది.

అమరవాది అవధానులుగారంటే.. చుట్టుపక్కాల్లోనే కాదు - చుటు పక్కల దివిసీమంతా పేరు. పేరుగన్న వైదికం, పేరుకున్న ఛాందసం ఉండాల్సినంత ఉంది. ఒక్కగానొక్క కొడుకు. కాశీ వెళ్ళి వచ్చిన తల్లిని గన్న తాతగారితో, కాశీ దాకా వెళ్ళినవారు ఆ పక్కనే ఉన్న రామేశ్వరం కూడా చూసివస్తే పోయేది కదా! అన్నంతటి లోకజ్ఞాని. ఈ మనుమడు. ఇంతకీ పేరు కాశి. కాశీపతి శాస్త్రికి పౌరోహిత్యం పట్టుబడ్డది, దానికి తోడు స్కూలు చదువుతో నాలుగు ఇంగ్లీషు ముక్కలు కూడా పట్టుబడ్డాయి. దరఖాస్తులు, దస్తావేజులు, కోర్టుకాగితాలు చదివేపాటి, చదివి అర్థం చేప్పే పాటి సులువూ పట్టుబడటంతో పట్టపగలంతా వాడి గిరాకీ పట్టపగ్గాల్లేకుండా పోయింది. వీటన్నిటికీ తోడు అతని రూపం సుందరం. గాత్రం సుమధురం. కాసుల పురుషోత్తమ కవిగారి ‘ఆంధ్ర నాయక శతకం‘ కంఠస్తం. ఆ పైన దైత గోపాలంగారి శిష్యరికంతో వచ్చిన సక్కుబాయి పాటలు, తుంగల వారికీ మేలుబంతిగా అతని వన్నెకువాసి తెచ్చి పాలేళ్ళూ,

పంటకాపులూ, వర్తకులూ - వస్తాదులూ కూడా అతన్ని మెచ్చేవరకూ - వెంబడించే వరకూ వచ్చింది. ఇప్పుడు కాశీ ప్రభ వెలిగిపోతూ ఉంది. తాత తండ్రుల మాన్యాలు - మన్ననలు, ధనాలు - కనకాలు సరేసరి. రెండు చేతులకి రాళ్ళ ఉంగరాలు అధవా నాలుగైనా ఉండేవి. ఏనాడో శ్రీనాధులవారు వారున్న నాటికే సూటిగా భవిష్యత్తును కూడా పరకాయించి చూసి అననే అన్నారు కదా!

"ధరియింప నేర్చిరి ధర్భ పట్టెడు వేళ
లీలమాణిక్యాంగుళీయకములు" అని -

అందులోనూ దబ్బపండుకన్న నిమ్మపండల్లే, హరి చందనపు ఉండల్లే, బంగారు కొండల్లే నిగనిగలాడుతూ.. వయస్సులో ఇప్పుడున్న వాళ్ళకీ - వెనకెప్పుడో ఉన్నవాళ్ళకీ కళ్ళకద్దుకునేటట్టు ముద్దుగా ఉండేవాడు కాశి. అందరి కళ్ళూ తన మీద వాలుతుంటే.. తన చూపులు కొంచెం పైగానో, కిందుగానో, గాలిలోనో, నీటిలోనో, తేలుతూనో - మునుగుతూనో ఉండేవి.

ఒకనాటి వేసంగి మధ్యాహ్నవేళ కృష్ణలో జలకమాడి, సంధ్యా వందనం పూర్తి చేసుకుని, అంగాస్త్రం ఝాడించుకుని వెనుదిరిగే వేళకు గట్టుదరి బుడగలు బుడగలై ఉడుకుతున్న కృష్ణవేణమ్మ నట్టు వాంగం చూసి అట్టే నిలిచిపోయాడు కాశి. నాచు పాపలై - నీటి నీడలై - ఏటి పాపలై కదులుతున్న చేపలూ. ముక్కుముట్టని, గొంతు దాటని, పొట్ట నిండని ఈ ఏటి కూళ్ళకోసం అలిసి అవిసె పువ్వుల్లా పడివున్న కొంగలు. ముక్కు మూరెడున్నా నీళ్ళు నోరెడైనా దొరకని వడగాడ్పులో ఏటి చేప నేసుకోబోయి ఏటిచాప నోట పరుచుకున్న కొంగల నోరంతా ఇసకసకాగా.. ఈ విడ్డూరాలు చూస్తూ మరచిన ఒడ్డు ఎక్కబోయాడు కాశి.

ఈనాటి శ్రీకాకుళాంధ్ర మహా విష్ణువు దేవాలయం

ఇప్పుడా ఒడ్డు ఒయ్యారంగా ఉంది, దానికి నడుమొచ్చి ఉయ్యాలలూగింది. బెంగచూపుల కళ్ళలో బేడిస కిలుక్కుమంది. ఆ పడుచు ఉతకబోయిన ఓణీ ఏరెత్తికెళ్ళింది. ఏరు మొల దాటేసరికి వెతకబోయిన మొహినీ ఎదనెట్టే ఏటికెదురీదసాగింది. ఈత ఆగదు - పాత అందదు. ఈ తపతపలకి కొంగ రెక్కల రెపరెపలు. కృష్ణవేణమ్మ నవ్విందా అన్నట్టుగా ఉంది. మధ్యాహ్న దరిద్రంతో అలమటిస్తున్న ఆ ఇసక మేటలో.. ఈ సౌందర్యలహరీ ప్రవాహం. చూడడానికి రెండు కళ్ళూ చాలకపోయె. పైటందని, నీటి పాటందని చిన్నది చిక్కులో పడింది. ఆ పాత కోసం పోగా పోగా పాతాళమే గతి అయ్యేటట్టు వుంది. అది లేకుండా ఊరు చేరాలంటే ఎట్టా? నీటి చీర కట్టు జారిందా నీతి కట్టు జారినంతపనాయె. ఏటి కోకతో ఎన్నాళ్ళుండేను? పాటిరేవు పడితే పరువేమయ్యేను? వరదొస్తే వరదంటి వయసు ఏ గట్టు చేరేను? తన గుట్టు తన లంకకే చేటు కదా? వణుకు పట్టిన మైతీగ ఏటి వాగల మీటు కెన్నాళ్ళు తాళేను - తాళం వేసేను?

ఇదంతా చూస్తున్న కాశీ ఒడ్డెక్కలేక, ఎక్కకుండా ఉండలేక, బిక్కుమంటున్న చక్కంది చూసిన జాలి చూపు మింగలేక, అంగాంగ సౌందర్య గంగకు సారెగా తన అంగవస్త్రం అందించాడు. అంగనామణి ఆ అంగవస్త్రాన్ని చెంగుగా వక్షోజాల మీద ఆచ్ఛాదన చేసుకుని ఆలింగనం చేసుకున్నంతగా ఏటి నీటి నిలువుటద్దాన కనపడేసరికి గంగవెర్రులెత్తినంత... కామ కటాక్షం కలిగినంత.. కౌగిలింత కల దాటి కట్టెదుటికి వచ్చినంత.. ఆ కాంత తనకిచ్చినంత.. ఎంతెంతో ఆ వెచ్చనంతా... వేడుకగా తోచి, వేడెక్కి పగటి కల కన్నాడు కాశీ. చూపు చుట్టరికం కలిపింది. అంగవస్త్రం కట్టుకుని నిలబడ్డ కన్నె గాలి నడుము పేదరికం తెలిపింది. మడుగుకు అడుగులొత్తుతూ మెత్తగా తూలుతూ, తుళ్ళుతూ ఆమె ఒడ్డుకు రాబోయి ఆగింది. ఆమె చూపు పైట దారిని పడి మూగగా కళ్ళకు చేరి ముత్యమంత కన్నీటి బొట్టు రాల్చింది. ఆ మూగచూపు కాశీ అయిదు ప్రాణాలనూ ఆచమ్యా అంటూ పీల్చింది. అంతే తనకు వచ్చీరాని ఈతతో నదికి అడ్డం

పడ్డాడు కాశీ. నడిచాడో.. పరుగు తీశాడో.. పాకాడో... దేకాడో పడుచమ్మ పైట పట్టుకున్నాడు. అనామిక బొడ్డులోంచి ఓ నవ్వు పుట్టి పెదాల మీద కొచ్చి పూసింది. ముంగురుల తడి ముత్యాల తెర నుంచి ఆమె వెన్నెల నవ్వులు కాలే ఏండకు గొడుగేసి కాశీ గుండెకు వల వేశాయి.

పైటనిచ్చిన పడుచువాడికి సిగ్గులు కృతజ్ఞత చెప్పాయి. చూపులు ఎరుపులై, పిలవని పిలుపులై, కాశీని కాములవారి గుడి తలుపులు తీసి రమ్మన్నాయి. ఇదంతా కాశీ మానసికం.

కాదంటే స్వప్న జగత్తు. లేదా మదన మహత్తు.

పైటనందుకుని, తడిసి మోపెడైనదాన్ని పిండుకొనబోయి, కాశీపతులవారి అంగవస్త్రాన్ని జారకుండా మునిపంట పాదిపి, చివళ్ళ చంకనెట్టుకుని వంగింది ఆ పడుచు దోరగా.. అదో రకంగా కాశీ వంక చూస్తూ... అద్దరినెందరున్నా - ఏటికిద్దరిని వీరిద్దరే. పైట చేతబట్టి తెచ్చిన కాశీ పునఃస్నానం చేయలేదు. అంగవస్త్రం ఎంగిలించిన అంగన దాన్ని నీట తడపనూ లేదు. అంటు అంటూ లేదు. అనుకున్నవారూ లేరు. వారిద్దరి మధ్య ఇంత జరిగినా మాట - మంచీ సుంతైనా లేదు.

చేపల కోసం కొంగ జపం సాగుతూనే ఉంది. చేపట్టే వాడి కోసం కన్నెతనం కాగుతూనే ఉంది. చేతికొచ్చిన అవకాశం అందంగా ఉంది, అందుబాటులో ఉంది. చదివిన ఛప్పన్న శాస్త్రాలూ, చెప్పుచ్చుక్కొట్టినా చెప్పిన మాట వినేటట్టు లేడు, అమరవాది వారి అబ్బాయి.

అవునుమరి కొమ్మన్నగారి మనుమడేగా!

ఈ కొమ్మన్నగారు గుంటూరి వారు కాదు. ఆ కొమ్మన్నగారి గుణాలన్నీ పుణికిపుచ్చుకున్న వేదం వారి అంతే వాసులు. అమరవాది కొమ్మన్న శాస్త్రిగారికి సాక్షాత్తూ పౌత్రుడు మన కాశీపతి శాస్త్రి. మహాయాజ్ఞికులు, అపర యాజ్ఞవల్క్యులు తిక్కశర్మగారు.. అదే మన గుంటూరి కొమ్మన్నగారి పుత్రులు. దరిమిలా యజ్ఞం చేసి సోమయాజులై తండ్రిగారిని తృతీయం తర్వాత చతుర్థ పురుషార్థానికి నడిపించి పుత్రుడుగా చేయవలసింది చేశారు. 'భారతాఖ్యమగు లేఖ్యంబైన యామ్నాయమున్ తెనిగించి భారతామృతము కర్ణపుటంబుల గ్రోలి ఆంధ్రావళి మోదముం బొరయనట్లుగ' చేసిన పాత్రః స్మరణీయులు - పునరపి అన్నట్లు గురు మానస పుత్రుల జాతకమూ.. అదే మన కాశీపతి పితామహుల జాతకమూ. కామకోటికి వచ్చి ముక్తి కాంతానుగ్రహం కోసం, వాకిట నిలిచి వాటారి పోయింది. ఆ వంశాంకురమే కదా కాశీ. తాతపేరు నిలపవలసిన వాడాయెను. ఆ పేరు నిలపడానికి ఉన్న పేరు.. అదే తన తండ్రిగారికిన్న మంచిపేరు కృష్ణలో కలపడానికి ఇప్పుడీ అవకాశం, అనుకోకండా, అందంగా, అందే విధంగా ఆడదై వచ్చింది.

నడి వేసంగి. మిట్ట మధ్యాహ్నం. అయితేనేం కాకుళీయ కామ పరిషత్తులో వేళపాళ, ఎక్కువ తక్కువ, కులం గోత్రం - వేదం శాస్త్రం, మంచి చెడ్డలు, మట్టిగడ్డలు శృంగారానికి పాటించవలసిన పనిలేదని ఏనాడో తేల్చి వేశారు. అసలే దివిసీమ. అందులోనూ క్రీడాభిరామంగా వెలిసింది శ్రీకాకుళం.

సురలే నరులట అచ్చట
సురుచిర నిమేష నేత్రులు
నరులే సురులట నిచ్చలు
జరాభావ రసగాత్రులు
అంతా దివ్యమే...భవ్యమే!

'ఇంతకీ ఎవరయ్యా ఆ ఇంతి? పులకలు పుట్టించే పూబంతి? ఈ నలరాజును వరించడానికి వలరాజు నదీతీరానికి పంపిన దమయంతి? '

వచ్చే కాకుళపు తిరునాళ్ళకు - కట్ట కింద తిరునాళ్ళని కూడా పేరు - రైకల పండగ రేనాళ్ళకు ముందుగానే దిగుతారు వక్కలగడ్డ నుంచీ, మురమండ మేళం నుంచీ, వేల్పూరు వాడల నుంచీ, తణుకు నుంచీ, తాడేపల్లి నుంచీ, నంగిగడ్డనుంచీ, కడప శివారు కోడూరు నుంచీ - విశేషించి వికట కవిత్వాల రామలింగయ్య గారి తెనాల్యగ్రహారం నుంచీ, ఆనంద గజపతుల సీమలో కటకం నుంచీ, విజయనగరం నుంచీ, మల్లెమొగ్గల వారు మంచి గంధం వారు, మంగళం పాడు వారు, చుట్టాల సురభివారు, పువ్వుల వారు, పూజల వారు - వారి వారి విద్యలతో వీరంగాలతో శ్రీకాకుళానికి తరలి వస్తారు.

అట్లా వచ్చి, వన్నెల పందారాలు చేసి, వారి వారి తావులకు మళ్ళే ఈ జనాభాలో ఒకరో ఇద్దరో, మేళాల వారో మేజువాణీల వారో కొన్నాళ్ళపాటు శ్రీకాకుళంలోనే ఉండిపోవడం కద్దు. అందులో ఏటా ఒక్క కుటుంబం వారైనా నట్టువాంగం నేర్పులతోనో, భామాకలాపాల ఆట ఒడుపులతోనో, సానివాడ కూనలకు విద్య నేర్పే పని మీద ఉండడమూ కద్దు. వారిలో కొందరు కృష్ణలీలా విశేషాలను ఆకళింపు చేసుకుని అభినయంలో దిట్టలనిపించుకోవాలని పురాణేతిహాసాలు తెలిసిన పండితులను, తలపండితులను సగౌరవ లాంఛనాలతో వాడలో వారి ఇళ్ళకు పిలిచి సత్కరించడమూ కద్దు. సాధన చేయడమూ కద్దు.

కద్దు కద్దు అంటూ కళ్ళ కద్దుకున్న కళలకు కాణాచి విజయనగరవాసిని భోగిని, కాశీ పితామహులను ఆ విధంగా ఆశ్రయించినదై మనసు నిండుగా కృష్ణ మాయలూ, మర్మాలూ మనసు తీరగా గీతలూ - వేదాంతాలూ మనసు తీరని గారాలూ, శృంగారాలూ అన్నీ నేర్చినదే నేర్చుకుంటున్నట్టు నేర్పుగా కొమ్మన్నగారి నీడను.. తలను రసికతలను దాచుకున్నది. ప్రత్యక్ష గురుత్వమేమో శాస్త్రిగారిది.. పైగా పడుచుదనం దోరగా పలకమారే వయసేమో... ఆ కాంతను అయస్కాంతను, ప్రియస్వాంతను ఆసాంతం సొంతం చేసుకున్న వారై, కృష్ణ కృష్ణ అనుకున్నంతలో నెల పొడిచి తొమ్మిదింట నెలవంక నవ్వులది ఓ వెలది పాప పుట్టింది. పుట్టింది పెరగడానికే అన్నట్టు పెరిగి పెద్దమనిషి అయింది. అటు తర్వాత కాశీరాజుగారి కొలువు పేరంటానికి భోగినిని రమ్మని గజపతుల నుంచి పిలుపు మేనాతో వచ్చింది. ఇటువంటి సందర్భాల్లో గుడ్డు తల్లిని వెక్కిరిస్తుంది, అందుకనే ఆ కన్నపాపను, కన్నెపిల్లను తిరిగొస్తే సరే... లేదంటే దాని ముద్దూ, ముచ్చటా మీరే. చూసుకోండి అంటూ కళ్ళంట నీళ్ళెట్టుకుని భోగిని వెళ్ళిపోయింది.

అందాల భరిణలో ముద్దమందారమూ అన్నట్టుగా పైటకెదిగిన దీక్షితదుహిత 'నాన్నగారూ' అంటూ కొమ్మన్నగారి ఇంట్లోను, ఇంటి పనుల్లోనూ తిరుగుతుంటే.. ఓనాడు నట్టువాంగాల ఉయ్యూరుగాడు వచ్చి మాగూటి చిలకను, మా గువ్వకే ముడిపెట్టమన్నాడు. కాకపోతే నెమలి పాడితే వినాలని - కోకిల ఆడితే చూడాలని అనుకున్నట్టే అవుతుందని అన్నాడు.

'పెళ్ళి!' కొమ్మన్నగారి ఎర నెత్తురు తెల్లమొగం వేసింది. తండ్రి బిడ్డగా ఇది బ్రాహ్మణి -తల్లి వరుసగా సాని. మమకారానికి - వావీ వరసా లేవు. అప్పటికే ప్రాయపు సూర్యుడు పడమటికి చేరిన కొమ్మన్నగారికి వల్లమాలిన దుఃఖం వెల్లువై వచ్చింది. శాస్త్రిగారు జీవన్మృతులై భాష్పగంగలో వారికి సశరీర నిమజ్జనం జరిగింది. కాకుళేశుడి గుడి ధర్మకర్త రాజబంధువు అంకినీడు నాయుడు కొడుకుతో పెళ్ళీ పేరంటం అన్నీ జరిగిపోయాయి. ఆ తర్వాత రాజ బంధుత్వం రాబందుగా మారి, కులం వారిలో రాజ బంధువుల్లో పిల్లలుండగా ఇదేమిటని, కథేమిటని కాకులై పొడిచి చిన్న అంకినీడుకు మళ్ళీ పెళ్ళిచేశారు.

బొమ్మల పెళ్ళిగా జరిగినా అమ్మను చేసి వెళ్ళాడు అంకినీడు కొడుకు. భోగిని కూతురు యామిని ఇప్పుడు తల్లి, తాళి పడ్డ చోట తల్లి కాలేదు యామిని. తను పుట్టినపుడు తల్లికి పురుడు పోసిన వాడ వదిన సామ్రాజ్యం తనకూ పురుడు పోసింది. యామిని కడుపున మళ్ళీ భోగిని పుట్టింది. ఎదిగిన పదారేళ్ళ కాలం ఇంటిపనులకే సరిపోయె. వంటలకూ వార్పులకూ చేతులు కాలిపోయె. చాకిరేవులకీ కొలువాయె. ముద్దులూ లేవు, మురిపాలూ లేవు. మువ్వలూ లేవు - మువ్వ గోపాల పదాలూ లేవు. ఇంటికొచ్చే పూట కాపరాల వారికి సపర్యలూ - సల్లాపాలు, సన్నజాజులూ - చాటు ముద్దులు - ఇలా గడిచిపోతూ ఉంది.

సామ్రాజ్యం ఇంట్లో సందె పేరంటాలు సన్నగిల్లాయి. కొత్త నీరు వచ్చి పాత నీరు పల్చబడ్డట్టు అయింది. యామిని బతుకు ఎడారిలో ఎండమావి. ఒక వీసం వైరాగ్యం.... ఆమె చూపు లోను, పలకరింపులోను. ఇపుడు ఈ బిడ్డ పుట్టిన తర్వాత ఉన్మాదంగా మారింది, పిచ్చిపాటలు! అంకినీడు బతకనీడు. చావనీడు. వాడు మోడు. నేను బీడు. బతుకు పాడు అనటం వెర్రిగా నవ్వడం. కంట్లో ఈతముల్లు గుచ్చుకుని పువ్వు పూసిందని కొందరు - కంటి నలకను ఈత ముల్లుతో తీసుకుంటే ఏమవుతుందని కొందరు, దెప్పడంతో ఉన్న మతి కూడా పోయింది యామినికి. నంగిగడ్డలో నగరాజ కుమారి మంత్రం పెడితే యామినీ పూర్ణచంద్రికలు, పున్నములవుతాయని, వాడవారు, వరసవారు చెప్పగా బండి కట్టించారు. కాకుళం దాటగానే గుండేరు - అదొక వాగు. ఆ వాగులో అన్నీ గుండ్రాళ్ళే ఇసకపాలు తక్కువ. దాని రాకడ, పోకడ అంతు బట్టదు, బండి కదిలే వేళకు దుక్కివాన కురిసింది. బండి కదిలి గుండేరు చేరేసరికి - అది నిండేరై కూర్చుంది. ఈ బండి నడివాగులో చిక్కుకుంది. వరదలో కొట్టుకుపోయిన యామిని, జీవితపు ఆవలిగట్టుకు చేరింది. అంతా కథలాగా జరిగిపోయింది. ముదిసాని సామ్రాజ్యం కొంపలో చిన్న భోగిని చిరుదీపమై మిగిలింది. అందంతో అభిసారిక కావలసింది - పరువంతో పరిచారికగా మారింది. ఎవరు మెచ్చేను ఎత్తుబడ్డ సామ్రాజ్యం తప్ప! ఇంట్లో ముసలిదాని వేధింపు పడలేక కాస్త గాలి పీల్చుకుందాం అనే వేళకు గుళ్ళో నైవేద్యం గంట మోగింది. అప్పుడు కృష్ణకు బయలుదేరింది చిన్న భోగిని. కాశీతో చూపుల సంభోగం అప్పుడే జరిగింది. ఆమె వరకు ఎండ వెన్నెలగావుంది. ఆ వెన్నెల్లో గొడుగు పట్టేందుకు తగ్గవాడే ఒకడు, కడుచక్కనివాడు, మనసెక్కినవాడు - కాశీ దొరకనే దొరికాడు.

పరువాన్ని పరువంతో పుఠం పెడితే, అందాన్ని అందంతో రంగరిస్తే - వయస్సుని, వాంఛని వడబోత పెట్టుకుంటే, సిగ్గుని చిగురించే కోరికని చిత్రిక పట్టుకుంటే, వడదెబ్బని వడపప్పుగా నమిలి మింగితే ... పులకింతల పూనకంలో వలవంతల పూనకం ముద్దుగా తాగితే ఈ దప్పి తీరేనా? ఎద నొప్పి జారేనా! అనుకున్నంతలో పైకి అనలేనంతలో అంగవస్త్రం అందుకుంటూ ఆమె చేతులు స్పృశించాడు కాశి. ఆమె నవ్వింది. నవ్వుతే నాదనిపించింది. మౌనంతో మనది అనిపించింది. ఈ చెయ్యి, ఆచెయ్యి కలపడంతో, దులుపుకోడంతో, ఈ బంధం ఇప్పటిది కాదు అనిపించింది. ఈ రాసలీలకు ఆకాశంలో అగ్నిసాక్షి. భూలోకంలో కృష్ణవేణమ్మ సాక్షి. రతి స్పర్శ, రాగ స్పర్శ జ్ఞాతంగా అజ్ఞాతంగా జరిగిపోయాయి. "అవసర పఠితావాణి అలంకార రహితాస్తు శోభతే, పఠితాం, అవసర గామీ నారీ భూషాహీనస్తు శోభతే, పఠితాం, అవసరగామీ నారీ భూషాహీనస్తు శోభతే, పఠితాం, అవసరగామీ నారీ భూషాహీనస్తు శోభతే, పఠితాం, అవసర గామీ నారీ భూషాహీనస్తు శోభతే పుంసాం" - ఇదే కదా ఆ కాకుళేశుడి వైష్ణవ మాయ!

అట్టట్టా ముదిరిన చనువు మళ్ళీ నట్టేట ముంచింది. ఇద్దరినీ జలక్రీడలకు తార్చింది. లక్ష్మణ కవి గారన్నట్టు జలముల నగ్ని! పైటా అంగాస్త్రం కూడాబలుక్కున్నాయి, అంగాంగాలు ఆదమరిచి పోయాయి, ఆడా, మగతనాలు అర్ధనారీశ్వరపురంలో గుడి కట్టుకున్నాయి. అప్పుడే స్వామివారికి నివేదన పూర్తయినట్టు సుదూరాన గుళ్ళో మళ్ళీ గంట మోగింది, మూడు తరాల అజ్ఞాత కథకు కృష్ణవేణిలో నిమజ్జం జరిగింది.

ఇంతకీ సానివాడలో ఒక సామెత ఇప్పటికీ మిగిలిపోయింది.

శ్రీకాకుళే మహాక్షేత్రే
గుండేరే మహానది
ఈతముల్లే ప్రాణ హాని
అంకినీడే అధోగతి.

✡✡✡

కాలువ

- బెజ్జారపు వినోద్ కుమార్

(పల్లకి సచిత్ర వారపత్రిక నవంబర్ 26, 1987 సంచికలో ప్రచురించబడింది)

సాయంత్రమయింది.

సాయంత్రమయ్యిందంటే చాలు నా ఎడద అచ్చు నేలతల్లిలాగే పులకరిస్తుంది. పొద్దున్నుంచీ వేగిపోయి శీతల పవనాలతో కొత్త ఊపిరి పోసుకుంటున్నట్టు.

అప్రయత్నంగానే నా కాళ్ళు ఊరవతలి దారిపట్టాయి.

'గుడీవినింగ్ ఫ్రెండ్' గమ్మత్తయిన పలకరింపు

తలతిప్పి చూశాను.

ఉమ్మెత్త మొక్కలు అటూ ఇటూ ఊగుతూ విష్ చేస్తున్నాయి. వాటిని దాటిన శీతల సమీరమొకటి అలవోకగా నన్ను కావలించుకుంది. ఆ కౌగిలింతతో ఏర్పడిన గగుర్పాటుకి నా కాళ్ళు తడబడ్డాయి.

ఆ సమీరం నన్ను దాటుకుని అలా అలా వెళ్ళి కోయిలకు నా రాకను తెలిపిందేమో దూరం నుండే కూయని కుహూగీతం చేసింది కోయిల.

"నేస్తం! క్షేమమా!" అని అడిగినట్టు.

"కూ" నేనూ సమాధానమిచ్చాను క్షేమమే అన్నట్టుగా

"కూ" ఈసారి రెట్టింపు తీయదనంతో పలికింది కోయిల.

పాలాల గట్లు జాగ్రత్తగా దాటాను. దాటుతున్నంతసేపు పచ్చని వరి పైరు సంతోషంగా తలూపసాగింది.

దూరంగా ఏదో పాట లయగా నా హృదయతంత్రులను కుదిపింది. ఆ పాట వినిపిస్తున్న దిక్కుగా కాస్తంత దూరం వెళ్ళగానే ఎదురయ్యారు పల్లె పడుచులు నెత్తిన గడ్డిమోపులతో పరవశంతో కదిలి వస్తున్న హంసల బారులా...

కుడిచేతిని పైకెత్తి గడ్డిమోపును పట్టుకోవడంతో బిరుసెక్కిన రొమ్ములు ఇంకా పైకి పొడుచుకు వచ్చాయి. ఎప్పుడెప్పుడు జతగాని చేతిలో పిండిలా మారిపోదామా అన్నట్లుగా .... ఇంకా తడియారని బాహుమూలలు చల్లగాలికి సేదదీరడానికా అన్నట్లు విచ్చుకుని ఉన్నాయి.

ఆత్మీయతా సౌరభాలు నిండిన చిరునవ్వులతో పలకరిస్తూ వెళ్ళిపోయారు. వాళ్ళ హృదయాల నిండుగా నిష్కల్మం. వారి పలకరింపు నిండుగా స్వచ్ఛత.

ఊరు దాటి వచ్చాను.

ఊరవతల నిండుగా ప్రవహిస్తున్న కాలువ ఆప్యాయంగా పలకరించింది. అస్తమిస్తున్న ఆదిత్యుని తాకిడితో అరుణిమ దాల్చిన కాలువ నా రాకతో తన ప్రవాహ వేగాన్ని ఇంకా పెంచింది.

బ్రిడ్జిపై నిలబడి నీళ్ళలోకి తొంగి చూశాను.

ప్రతిరోజూ గంటల తరబడి అలా చూస్తూనే గడుపుతాను. చప్పుడు చేయకుండా ప్రవహించే కాలువ మౌనం నా హృదయం నిండుగా నిండిపోయి ఎన్నో ఊసులు చెబుతుంది. అలాగే ఉండిపోతాను ఎన్నో కబుర్లు చెప్పుకుంటూ....

దూరంగా నీళ్ళలో ఏదో వస్తున్నట్టుగా కనిపించింది.

కళ్ళు చిట్లించుకుని చూశాను.

బంతి పూల బారు.

"ఓహో! ఇవ్వాళ బంతిపూలు తురుముకున్నట్లున్నావ్" అడిగాను కాలువని.

మౌనం వహించింది కాలువ.

మళ్ళీ దూరంగా ఏదో తేలుతూ కనిపించింది దగ్గరికొచ్చి చూశాను. ముందు చేమంతుల గుత్తి కనిపించింది.

ఇంకాస్త దగ్గరకు వచ్చాక చూసి అదిరిపడ్డాను.

చేమంతుల చెండుతోపాటే దాన్ని తురుముకున్న తల.

చంద్రబింబంలాంటి మొహం పసుపు పచ్చని వర్ణంలో ఇంకా ఏదో వింతకాంతిని వెదజల్లుతూనే ఉంది.

ఒక్క జడ.. మెడలో తళతళలాడుతున్న పుస్తెలతాడు... పట్టు అంచుతో వింత శోభను తెస్తున్న జాకెట్.. పసివాడక ముందే తుంచి వేయబడ్డ ముద్ద బంతిలా అగుపించింది.

ఒడ్డుకు లాగి ఆ చిన్నారి చెల్లిని నా ఒడిలో పడుకోపెట్టుకుని "ఏంటమ్మా! నీకేం కష్టం?" అని అడిగి ఆమె కష్టాల్ని తీర్చి గుండెల్లో దాచుకోవాలనిపించింది.

నా ఆలోచనల ప్రమేయం లేకుండానే కొట్టుకుపోయిందా నిర్జీవ శరీరం.

కనిపించినంత వరకూ ఆమెనే చూస్తుండిపోయాను.

కాలువ ప్రవాహంతో పోటీపడుతూ నా కంటి నుండి కారిన అశ్రుధారలు కాలువలో పడిపోయాయి. ఆ అశ్రువులు ఎప్పటికయినా ఆ శరీరాన్ని తాకి ఓదార్చకపోతాయా అనుకుంటూ నీరసంగా ఇంటివైపు అడుగు వేశాను.

మూడు రోజుల వరకూ కోలుకోలేకపోయాను. ఆ మూడు రోజులూ కాలువవైపు వెళ్ళడానికి మనస్కరించలేదు.

కాని వెళ్ళకుంటే గుండెలోతుల్లో ఏదో కోల్పోయిన బాధ.

మూడో రోజు సాయంత్రం యాంత్రికంగానే నా కాళ్ళు ఊరవతలి బాట పట్టాయి. మూడు రోజులుగా నా పలకరింపు లేక వాడిపోతూ ఉన్న ప్రతి మొక్కా నా అడుగుల సవ్వడికే నిటారుగా నిలబడి చేతులూపసాగింది.

అలా నడుచుకుంటూ పోయాను.

అప్రయత్నంగానే కాలువ చేరుకున్నాను. బ్రిడ్జిపైన నిలబడి రెయిలింగ్స్ పైన చేతులానించి కాలువలోకి చూడసాగాను.

అన్ని రోజులుగా నా రాక కానరాక నిశ్శబ్దంగ రోదిస్తున్నట్టుగా ఉండిపోయింది.

"ఏయ్! ఎలా ఉన్నావ్" పలకరించాను.

గలగలా నవ్వింది. నూతనోత్తేజంతో మెలికలు తిరుగుతూ పరిగెత్తింది.

చల్లని ఆ సాయంత్రం ఇంటి ముఖం పట్టిన గోవుల మంద హుషారుగా పరుగెత్తింది. వాటి పద ఘట్టనతో పరవశించిన భూదేవి ఇంతెత్తున ధూళిని రేపింది. ఆ ధూళిలో నిండుగా మునిగిపోయాను. ఆ ధూళి తాకిడితో నా శరీరంలోని అణువణువూ ఏదో వింత జలదరింతను చవిచూసాయి.

కాలువలోకి చూశాను.

గోధూళి పాదల మాటున దూరంగా మసక మసగ్గా ఏదో తేలుతూ కనిపించింది.

ఎందుకో గాని నా గుండె దడ దడలాడింది.

అయినా ధైర్యం తెచ్చుకుని చూసి కట్టెలా బిగుసుకుపోయాను.

నీటితోపాటుగా.. ఇంకో శవం.

ఆ నిర్జీవ శరీరంలో ఎంత నిర్మలత్వం?

ముడిచిన సిగ ఇంకా విడివడలేదు. నుదిటిపైన గుండ్రని తిలకం ఇంకా చెరిగిపోలేదు.

ప్రియునిపై అలకతో పడకెక్కి అలవోకగా కన్నుమూసిన ముగ్ధలా ఉంది.

ఏం చేయాలో పాలుపోలేదు. చేతులు మాత్రం రెయిలింగ్స్‌ని గట్టిగా పట్టుకున్నాయి.

"పిచ్చి తమ్ముడూ! ఎందుకురా ఆ ఏడుపు?" అంటూ ఆ శరీరం వేదాంత ధోరణిలో మాట్లాడుతున్నట్టుగా అనిపించింది.

చెక్కిలి తడుముకున్నాను. కన్నీటి ప్రవాహం వెచ్చగా తగిలింది చేతికి.

ఒక్క పెట్టున ఆవేశం ముంచుకొచ్చింది.

శరీరమంతా వణుకుతుండగా కోపంగ కాలువతో అన్నాను.

"ఇంత మందిని పొట్టన పెట్టుకుని ఏం బావుకున్నావ్? భయంతో వాళ్ళు కాళ్ళూ చేతులూ గిల గిలా కొట్టుకుంటే కేరింతలు కొట్టావ్ కదూ!?... ఊపిరాడక వాళ్ళు గిలగిలా తన్నుకుంటుంటే, గలగలా నవ్వుకున్నావ్ కదూ!? అతి దారుణమైన శాడిస్టువి నువ్వు. కాగడా పెట్టి వెతికినా వాళ్ళ మొహాల్లో కపటం కనిపించడం లేదే. నీకేం అపకారం చేశారని వారిని పొట్టన పెట్టుకున్నావ్? ఇంత సెన్సిటివ్‌ని నీలాంటి శాడిస్టుతో ఇన్ని రోజులుగా ఎలా కలిసి ఉన్నానో... ఐ హేట్ యూ.. రియల్లీ ఐ హేట్ యూ" గట్టిగా గొంతు నాళాలు పగిలి పోయేలా అరిచాను ఏడుస్తూ

ఇంకా ఏదో కసి.

"బ్రతికుండగా నీ మొహం చూడను" అనేసి వెనక్కి తిరిగాను.

చిన్నగా నవ్వు వినిపించింది.

కాలువ నవ్వుతోంది.

"ఎందుకు నవ్వుతున్నావ్?" మండిపడుతూ అడిగాను.

"పిచ్చివాడా! ఒక్కసారి నాలోకి ప్రవేశిస్తావా? వింత వింత సత్యాలు చూపెడతాను" అంది.

"నో ఐ హేట్ యూ" గా.....ట్టిగా అరిచాను.

"అందుకే దోస్త్! ఒక్కసారి నాలోకి ప్రవేశించు. నువ్వూహించని విషయాలు చెబుతాను" మళ్ళీ అంది. ఆ పిలుపులో హృదయపూర్వక స్వాగతం.

మెట్ల పైనుండి కాలువలోనికి ప్రవేశించాను.

"అంత తొందరెందుకు.. పద" అంటూ కాస్త దూరం లాక్కెళ్ళింది. ఒక చోట ఆపింది.

"ఇటు వేపు చూడు" అది ఒక వైపు చూపెడుతూ.

అక్కడ నిశ్చలంగా పడివుందో అమ్మాయి పరికిణీలో.. అప్పుడే విచ్చుకోవడానికి సిద్ధమౌతున్న నందివర్ధనం మొగ్గలా.

"ఈ అమ్మాయిని చూస్తే నీకేమనిపిస్తుంది?" అడిగింది కాలువ.

"జడగంటలు అల్లాడిస్తూ నది ఒడ్డున గవ్వలు ఏరుకుంటున్న చిన్నారి చెల్లి గుర్తుకొస్తూంది" అన్నాను.

"కాని వారికలా అనిపించలేదే"

"ఎవరికి?"

"ఆ ఐదుగురికి"

"ఏం చేశారు?"

"అతిదారుణంగా మానభంగం చేశారు"

"మైగాడ్"

"అప్పుడే ఏమయింది ఇంకా ముందుంది..."

"ఏమిటి"

"ఈ సంఘటనలో ఈ అమ్మాయి ప్రమేయం ఎంతుంది అంటావు?"

"ఏమీ లేదే"

"ఈ అమ్మాయిని రాళ్ళతో కొట్టి హింసించింది... ఊరవతలి వరకు కుక్కలా తరిమింది.... బాధ్యతలు తెలీకుండా తిరిగిన అమాయక వయసులోనే కులటను చేసి ప్రతిక్షణమూ నరకాన్ని రుచి చూపించింది"

"....."

"దారుణమైన విషయం ఏమిటంటే ఆమె పై రాళ్ళు విసిరిన వాళ్ళలో ఆ ఐదుగురూ ఉండడం... ఆ బాధలకు తట్టుకోలేక దయనీయంగా విలపిస్తూ తన గోడునంతా నాకు చెప్పుకుంది... ఆమె కష్టాలన్నీ కడతేరేలా నాలో చేర్చుకున్నాను. హాయిగా సేదదీర్చాను."

"....."

"అంతగా కన్నీరు కార్చకు" ఉన్నట్టుండి చెప్పింది కాలువ.

"నీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాను.

"అమాయక నేస్తం! కన్నీటిలో ఉండే ఆవేదనా సెగలకు నాలోని నీటినంతా కూడా ఇగిరింపజేసే శక్తి ఉందని నీకు తెలీదు పాపం... ఇంకాస్త ముందుకు వెళదామా?" అంది కాలువ.

అడిగిందే గాని నా ప్రమేయం లేకుండానే నన్ను లాక్కెళ్ళింది.

"ఇదిగో ఇక్కడ చూడు" అంది ఒక చోట ఆపి.

పక్కకి తిరిగి చూశాను.

ఇంకో యువతి శవం.

పరీక్షగా చూశాను.

"ఈ అమ్మాయి నీ ఒడిలో చేరి ఎన్ని రోజులయ్యిందేం?" ప్రశ్నించాను.

"గంటన్నరయింది"

"ఇంతలోనే చేపలు ఎంతగా కొరికాయో!" అన్నాను.

"కొరికింది చేపలు కాదు"

"మరి"

"ఆమె భర్త"

"వ్వాట్?" అదిరిపడ్డాను.

"నిజం... ఇప్పుడు చూడు" అంది చీరను జరిపి.

"బాప్‌రే శరీరం నిండుగా రంధ్రాలు..."

"ప్రతిరోజూ కాలుతున్న సిగరెట్‌తో, రేజర్ బ్లేడుతో, పళ్ళతో, ఫోర్క్‌తో ఆమె భర్త చేసిన రంధ్రాలివి"

ఆ సమయంలో ఆమె ఎంత బాధ అనుభవించిందో ఊహించుకున్నాను. గుండె వణికింది. అంత ప్రవాహమూ నా చెమట తాకిడికి వేడెక్కింది.

అరవిరిసిన చేమంతిలా నిర్మలంగా నిద్రిస్తున్న ఆమె మొహాన్ని రెండు చేతుల్తోను పట్టుకున్నాను. అప్రయత్నంగా నా కుడి చెయ్యి ఆమె కళ్ళను తుడిచింది.

"అంత దారుణ బాధ నుండి ఆమెను విముక్తి చేయడం తప్పే అంటావా!?" అడిగింది.

"మౌనంగా ముందుకు సాగాను."

"ఇక్కడ చూస్తున్నావా?" ప్రశ్నించింది కాలువ.

చూశాను.

ఇంకో అమ్మాయి శవం.

కాలువ చెప్పబోయే దారుణమైన కథ వినడానికి నా చెవులు ఇంకా జీవించే ఉన్నాయి.

"గుండెలనిండా కోరికలు జుమ్మని ఝంకారం చేస్తూంటే కొత్త కాపురంలోకిఅడుగుపెట్టింది. కాని భర్త క్షమించ వీలుకాని లుచ్చాగాడు. డబ్బుకోసం ప్రతిష్ట కోసం మరో మగాడికి తార్చాలని చూశాడు."

"ఈజిట్?"

"పిచ్చి తల్లి... తండ్రిలాంటివాడైన మామయ్యతో తనగోడు చెప్పుకుంది వలవలా ఏడుస్తూ.. అంతా విని ఆ మామయ్య ఏం చేశాడో తెలుసా?"

"ఏం చేశాడు?"

"ఒక వెకిలి నవ్వు నవ్వి 'పరాయివాడి కన్నా ముందుగా నా కోరికను తీర్చు తట్టుకోలేకపోతున్నాను' అన్నాడు"

"దొంగ గాడిద కొడుకు"

"పాపం ఏడుస్తూ పుట్టింటికి పారిపోయి హృదయవిదారకంగా పుట్టింటి వారికి తన గోడు చెప్పుకుంది."

"హమ్మయ్య"

"కాని పుట్టింటివారు మాత్రం ఆమెను బ్రతిమాలారు. కాళ్ళావేళ్ళాపడ్డారు. భర్త తోడిదే లోకం అన్నారు. చివరికి ఆమెను ఎలాగో ఒప్పించి ఇంటి నుండి సాగనంపారు. కాదు... కాదు ఒప్పుకోకున్నా ఇంటి నుండి వెళ్ళగొట్టారు"

"ఛ్‌ఛ్"

"వెళుతూ వెళుతూ దారిలో నా దగ్గిరకొచ్చింది. తన కథనంతా వినిపించింది. ఓదార్పునాశించింది. ఆశ్రయమిచ్చాను."

"..." నా గుండెల్లో శూన్యం... కాని శూన్యానికి కూడా ఎంత బరువో... నా గుండెను అప్పడంలా ఒత్తేస్తున్నట్టు .

"ఇంకాస్త ముందుకెళదామా?"

"ఇదేంటి ఇక్కడ అమ్మాయి శవం... అరెరె శరీరం నిండుగా కాలిన గాయాలు.. బాప్‌రే విరిగిపోయిన కాలు... విరిగిపోయిన చెయ్యి.. అణువణువులోనూ అమాయకత కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న ఈమెని ఇలా చేయడానికి ఎవరికి మనసొప్పింది?" ఆందోళనగా అడిగాను.

"ఆమె భర్తకు, అత్తకు" తాపీగా చెప్పింది కాలువ.

"ఎందుకు?"

"కట్నం కోసం"

"..."

"పెళ్ళి చేసుకున్నప్పుడు సాధ్యమైనంత కట్నం గుంజారు. పెళ్ళయ్యాక తక్కువ కట్నమొచ్చిందే అని తెగ బాధపడిపోయారు. కట్నం తెమ్మని వేధించారు. కాని ఉన్నదంతా అమ్మాయి పెళ్ళికే ఊడ్చి పెట్టి బిచ్చగాళ్ళలా బ్రతుకీడుస్తున్న పుట్టింటివారి నుంచి దమ్మిడీ కూడా రాలలేదు."

"....."

"ఒకరోజు విపరీతంగా కొడుతూ ఉండగా ప్రమాదవశాత్తు ఆమె చేయి విరిగిపోయింది. విరిగిన ఆ చేయిని చూసి తట్టుకోలేక పుట్టింటివారు కొంత డబ్బును పంపారు. దాంతో మొగుడు, అత్తల మెదళ్ళలో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది. దాన్ని అమల్లో పెట్టారు. ఇంకో రోజు కాలు విరిచేశారు. ఇంకొన్ని డబ్బులు రాలాయి. ఆసిడ్ పోసి ఒళ్ళంతా కాల్చేశారింకొక రోజు. మరికొన్ని డబ్బులు వచ్చాయి. వారికి తెలుసు 'ఇది బ్రతికుంటేనే తమకు డబ్బులు వస్తాయ'ని... పాపం ఆ అమాయకురాలికి కూడా తెలిసిందా విషయం... తనను చంపరని ప్రతిక్షణం నరకాన్ని చూపిస్తారని.. తన బాధలు కడతేర్చమని కోరుతూ హాయిగా నాలోకి ప్రవేశించింది" ఊపిరి తీసుకోడానికా అన్నట్టుగా ఆగింది కాలువ.

భయంతో ఆవేశంతో ఊపిరందక అవస్థపడ్డాను.

ఇంకాస్త ముందుకు వెళ్ళాం మౌనంగా...

ఒక యువకుని శవం.

"ఈ ఈయనకి ఏం కష్టమొచ్చిందో"? అడిగాను

"పాపం పిచ్చివాడు.. చిన్నప్పుడే చనిపోవటంతో చిన్నప్పటి నుంచి బాధ్యతల సుడిగుండంలో గిరగిరా తిరగసాడు. అయినా ఎన్నడూ అధైర్యపడలేదు. తన తల్లిని పోషించసాగాడు. అతని కోరికల్లా ఒక్కటే తమ కుటుంబం కూడా అందరిలా ఏ లోటు లేకుండా బ్రతకాలని... తన తల్లిని కాలు క్రింద పెట్టనీకుండా ఒక మహారాణిలా చూడాలని అదిగో అదే అతని కొంప ముంచింది"

"అదెలా" ఆశ్చర్యంగా అడిగాను.

"ఎక్కువ జీతం డబ్బులు ఇతారనే ఆశతో గల్ఫ్ దేశాల్లో ఉద్యోగం చేద్దామనుకున్నాడు. కూలిపోతున్న ఇంటిని తాకట్టు పెట్టి, అప్పులు చేసి 35 వేల రూపాయలు ఒక బ్రోకర్ కిచ్చాడు. ఆ రాత్రే అతను ఎన్నో అందమైన కలలు కన్నాడు. తనూ ఒక సామ్రాజ్యం నిర్మించుకున్నట్టు ఆ సామ్రాజ్యానికి తన తల్లి మహారాణీ అయినట్టు.... కాని కొద్ది రోజుల్లోనే తెలిసింది తాను దారుణంగా మోసపోయినట్టు"

"పాపం" అప్రయత్నంగానే నా నుండి వెలువడిందా మాట.

"అప్పుడే ఏమయింది.. ఇంకా ఉంది"

"ఏమిటది?"

"ఆత్మ విశ్వాసం ఎక్కువ పాళ్ళలో ఉన్న వాడని చెప్పానా.. ఏ మాత్రం అధైర్యపడలేదు. ఎప్పటికయినా భవిష్యత్తును బంగారు మయం చేసుకోకపోతానా అన్న ఆశ అతని పట్టుదలని ఇంకా పెంచింది. కాని చుట్టు పరిసరాలు మాత్రం అతన్ని వెక్కిరించాయి... చేతకాని వాడిగా ముద్రిస్తూ హేళన చేశాయి... చివరకు... చివరకు...." దుఃఖంతో గొంతు పెగల్లేదు... కాలువకు.

కాలువకు కూడా దుఃఖం తెప్పించేంతగా ఏమి జరిగిందా అని ఆశ్చర్యపోయాను.

"చివరకు కన్న తల్లి కూడా అతన్ని పిరికివాడుగా జమకట్టి హేళన చేయడంతో తట్టుకోలేక పోయాడు... పుట్టినప్పటి నుండి గుండెల్లోనే దాచుకున్న కన్నీరు కాల్వలైపారగా నాలోకి ప్రవేశించాడు"

తల తిరిగిపోయింది.. అలా ముందుకెళ్ళాము.

దారిపొడుగునా ఎన్నో శవాలు... వాటిన్నింటి వెనుకా ఏవో దయనీయగాధలు నా గుండెల్ని మెలి పెడుతున్నట్లుగా....

"చూశావుగా దోస్త్! ఇంకా నన్ను ద్వేషిస్తున్నావా?" అడిగింది కాలువ,

"పొరపాటున కూడా.." గొంతు పెగల్లేదు.

"నన్ను అర్థం చేసుకున్నందుకు చాలా థాంక్స్" అంది.

నేను మారు మాట్లాడలేదు.

"నీకు నా వీడ్కోలు" జీరగా అందా కాళువ.

"నేను వెళ్ళను" స్థిరంగా పలికింది నా గొంతు.

"వ్వాట్?" ఈ సారి అదిరిపోవడం కాలువవంతయింది.

"అవును.. నేను వెళ్ళదలుచుకోలేదు" ఇంకా స్థిరంగా పలికాను.

"పిచ్చి గాని పట్టలేదు కదా?" ఆశ్చర్యంగా అడిగింది కాలువ.

"లేదు. గుండెల నిండుగా ఇంత ఘోషను నింపుకుని ఇంక పైకి వెళ్ళలేను. ఇన్ని దారుణాలు చూస్తూ నరకయాతన అనుభవించలేను"

ఈడ్చికొట్టింది కాలువ..

సుడి గుండంలోలా గింగిరాలు తిరిగిపోయాను.

బాధగా చూసాను.

"నిన్నంతగా పిలిచి ఇంత మంది దగాపడ్డ తమ్ముళ్ళ, చెల్లెళ్ళ శవాలను చూపించి, వారి వెనకాల ఉన్న కథలు వినిపించింది ఇందుకేనా?"

రోదించసాగింది కాలువ.

ఆమె రోదనతో నీళ్ళన్నీ వేడెక్కి సెగలు చిమ్మసాగాయి.

"అర్థమైంది... నాకర్థమైంది దోస్త్... నా కర్తవ్యమేంటో నాకు గుర్తొచ్చింది. నే చెయ్యాల్సిన పనులెన్నో ఉన్నాయి... వెళుతున్నాను. థాంక్యూ దోస్త్" అన్నాను.

అనిర్వచనీయ ఆనందంతో పరవళ్ళు తొక్కింది కాలువ.

"సెహబాష్" అంటూ నా వీపు చరిచింది గట్టిగా

ఒడ్డువైపుకు నెట్టింది బలంగా.

✡✡✡

తీరని కోరిక

- ద్వివేదుల విశాలాక్షి

(స్వాతిమాస పత్రిక జనవరి 1971, సంచికలో ప్రచురించబడింది)

రచయిత్రి

జాము ప్రొద్దు ఎక్కేసరికి ఊరంతా ప్రాకిపోయింది. రావ్ బహద్దూర్ రంగరాజు గారి మరణ వార్త. ఊళ్ళో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అంతా తీర్థ ప్రజల్లా దేవిడీ వైపు నడక సాగించారు.

"వయసు పైబండిందన్నమాటేగానీ ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు! చేయెత్తు మనిషి చేతి కర్ర ఊపుకుంటూ మెలి తిరిగిన మీసాలు సవరించుకుంటూ హుందాగా దారంట నడుస్తుంటే ఎంతటి మొనగాడికైనా, చేతులు జోడించి నమస్కారం పెట్టాలనీ, పక్కకి తప్పుకుని దారి విడవాలనీ అనిపించేది కదండీ.. ఆ రీవీ, ఆ రాజసం పుట్టుకతో రావాలి కాని డబ్బు ఉంటే మాత్రం వస్తుందా? మన ఊళ్ళో సుబ్బి సెట్టి లేడూ.. వాణ్ణి తగలేయడానికి సరిపోయినంత సామ్ము.. వాడు దారంట పోతుంటే గడపలో వాలిన కాకి కూడా ఒక గంతు వెయ్యదు కదండీ.. పెట్టి పుట్టాలండీ ఇటువంటి గౌరవాలు అందుకోడానికి".

దేవిడీ తలుపులు బారుగా తీసి ఉన్నాయి. రోజూలా వచ్చేపోయే వాళ్ళని ఆటకాయించి పేరేమిటి.. ఊరేమిటి అని ప్రశ్నించి మరీ వదిలే అరకయ్య ఎక్కడా కనిపించలేదు. జన ప్రవాహం ఇనుప కమ్మల గేటు దాటి ఇంటి ముందు అంతా పరచుకుని ఉంది. ఊరిలో పేరు గాంచిన పెద్దలు, ఇంకా రంగరాజుగారి బంధుకోటికి చెందినవారు. ఇంటి ముందు వరండా దాటి హాలులో అడుగుపెట్టారు. రావ్ బహద్దూర్ రంగరాజు గారి భౌతిక కాయాన్ని నలుగురు మనుష్యులు సాయంపట్టి తెచ్చి, హాలులో మధ్యగా అమర్చిన దివానాపై ఉంచారు.

రీవిగా చేతికర్ర ఆడించుకుంటూ రోజూ ఆవేళకి మేడ దిగి వచ్చి, తన కోసం వేచివున్న మిత్రుల్ని, బంధువుల్ని ఆదరంగా పలకరిస్తూ వారితో కాస్త సేపు కబుర్లు చెప్పడం, ఆ వెనుక కాఫీ పలహారాలు సేవించి నమ్మిన బంటు వీరాయి వెనక రాగా అలా పురవీధుల్లో ఓసారి కాలు జాడించి రావడం, ఆ సమయంలో ఎదురైనవారి యోగ క్షేమాలు కనుక్కుంటూ, చేతనైన మాట సాయం, డబ్బు సాయం చేస్తూ, భోజనాల వేళకి తిరిగి ఇల్లు చేరుకోవడం రంగరాజు గారి దినచర్యలో ఒక భాగం.

ఒక రోజు అలవాటుగా అలా చాంద్రాయణం పూర్తి చేసుకుని తిరిగి వస్తుంటే వీధి మొగలో పెంకులు ఊడి, వాసాలు దిగజారి శిధిలావస్థలో ఉన్న ఆ ఇంటి గుమ్మంలో ఒక కొత్త ముఖం కనిపించింది. ఎవరా - అని క్షణకాలం ఆగి పరీక్షగా చూసారు రంగరాజు గారు. అంతకు పూర్వం అయిదారు నెలల క్రిందటి వరకు ఆ ఇంట్లో బ్రతక నేర్చిన బడిపంతులు ఒకడు ఉంటుండేవాడు. అతడు అప్పుడప్పుడు దేవిడీకి వచ్చి రాజుగారి దర్శనం చేసుకుని వారి పెద్దల గొప్పతనాన్ని, వారి వంశ వైభవాన్ని పొగిడి అంతో ఇంతో డబ్బు

లంకించుకుని మరీ వెళుతుండేవాడు. ఇప్పుడు అక్కడ నిలిచి ఉన్న ఈ కొత్త వ్యక్తి ఎవరు? ఎక్కడినుంచి వచ్చాడు? నాలుగు అడుగులు నడిచి మరొకసారి వెనుదిరిగి చూసారు రంగరాజుగారు.

యజమాని కను సౌంజ్ఞల్ని కోటి మాటలకన్నా మిన్నగా అర్థం చేసుకోగల వీరాయి ఒక్క అడుగు వెనకగా నిలిచి, రాజుగారు ఇంట్లో కాలుపెట్టే లోపునే సంగతి సందర్భాలు వివరంగా తెలుసుకొచ్చి వివరించాడు. భృత్యుడు తెచ్చిన సమాచారాం విని "ఓహో" అన్నారు రంగరాజుగారు - చిన్నగా నవ్వుతూ. "ఓహో" అన్నమాటని తిరగేసి, మరగేసి ఎటునుంచి ఎలా చూసినా విశదమయే భావం ఒకటే.. అదేమిటంటే రేపో... మాపో మన ముందుకి రావలసిన మనిషేనన్నమాట - అని.

అక్కడ పాడింటి పాట్టి పంతులు కూడా దర్పానికి, దాతృత్వానికి ప్రతినిధిలా అలా దారంట నడిచిపోతున్న రంగరాజుగారిని చూడగానే ఎవరితడు - అనే కుతూహలాన్ని చూపకుండా ఉండలేకపోయాడు. "ఆ వెళుతున్నది ఎవ్రా రామిగా" అంటూ పక్కనే ఉన్న చాకలి రామిగాడ్ని ప్రశ్నించాడు.

రంగరాజుగారి పేరు ప్రఖ్యాతులు ఆ చుట్టు ప్రక్కల పాతిక గ్రామాల వరకు వ్యాపించి ఉండగా, ఆ ఊళ్ళో స్వంత ఇల్లు పెట్టుకున్న ఆసామి పాట్టిపంతులికి అతడెవరో తెలియకపోవడం చాకలి రామిగాడికి ఆశ్చర్యం కలిగింది. ముసలాయన, ఎదురెండవల్ల దృష్టి తిన్నగా ఆనక అలా అడిగాడేమోనని "రాజుగారు బాబూ" అన్నాడు వాడు.

"ఏ రాజుగారు?"

పాట్టి పంతులు అలా అడగడంలో తప్పులేదు. ఆ గ్రామ జనాభాలో సగానికి పైగా రాజులే. అయితే రాజుగారు అనిపిలిపించుకునే అర్హత జమిందారీలు పోయినా ఒక్క రంగరాజు గారికే మిగిలి ఉందని మాత్రం అతడికి తెలియదు.

ఈసారి రామిగాడు పాట్టి పంతులి అవజ్ఞతను క్షమించలేకపోయాడు.

"ఏటీ... ఏ రాజుగోరా?" అన్నాడు ఆకు మీద పురుగుని చూసినట్లు పాట్టి పంతుల్ని చూస్తూ.

ఆ గ్రామంలో మనుష్యులకే కాదు చెట్టుకి, పుట్టకి కూడా తెలుసు 'రాజుగారు' అంటే ఎవరో. వారి వంశం ఎటువంటిది, వారి వంగడం అటువంటిది, వారి వితరణ బుద్ధి అటువంటిది; వారి ఇంటి ఆచారాలు అటువంటివి. రాజుగారి దేవిడీలో కాలం ఇంతగా మారినా ఈనాటికీ అడిగి, లేదనిపించుకున్న అర్థి లేడు. వారి దర్శనం చేసుకొని వట్టి చేతులతో తిరిగి వచ్చిన యాచకుడు లేడు.

రంగరాజుగారి ముత్తాత వెంకటపతిరాజుగారు వట్టి చేతులతో, కట్టుబట్టలతో భార్యా, బిడ్డల్ని వెంటపెట్టుకుని ఆ గ్రామం వచ్చారట, సాటి కులస్తుల మధ్య ఏదో విధంగా బ్రతకలేక పోతామా అనే నమ్మికతో, యలమండ్ర గ్రామం చుట్టుపట్ల అంటు మామిడి తోటలకి ప్రసిద్ధి. మామిడిపళ్ళు కొని, తాండ్ర పోసి చుట్టుపక్కల గ్రామాల్లో, పట్టణాల్లో అమ్ముకుంటూ కూటికి, గుడ్డకి లోటు లేకుండా కాలక్షేపం చెయ్యడం మొదలుపెట్టారట వెంకటపతిరాజుగారు.

నూరు దాకా నన్ను పెంచు, ఆ వెనక నిన్ను పెంచుతానంటుందిట డబ్బు. మొదట్లో జీవనం గడవడమే కష్టంగా ఉండే రాజుగారికి అనుకోని విధంగా సిరి తోసుకు వచ్చిందిట. రాజుగారు వాసం కోసం నిట్రాట పాక వేసుకోవాలని నేల తవ్వుతూంటే అక్కడ భూమిలో లంకె బిందెలు దొరికాయనీ, అతడు విజయదశమి నాడు పూజ చేస్తుంటే దేవి ప్రత్యక్షమై అక్షయ సంపద ఇచ్చిందనీ, అతడు తెల్ల దొరల సహాయంతో విదేశాలకి తాండ్ర ఎగుమతి చేసి ఆ వ్యాపారంలో లక్షలకి లక్షలు లాభం గడించాడనీ... వెంకటపతిరాజుగారి లక్ష్మీ ప్రసన్నం గురించి ఇటువంటి రకరకాల కథలు ప్రచారంలో ఉండేవి. ఆ లక్ష్మీకటాక్షానికి కారణం ఏమైనా రావ్ బహద్దూర్ రంగరాజుగారి తాతగారి తరం నాటికి వారిల్లు దేవిడీగా మారిపోవడం, వారిని మకుటం లేని మహారాజుగా గ్రామస్తులంతా గౌరవించడం, వారి తీర్పుల్ని, తీర్మానాల్ని ఆ గ్రామంలో కాని, చుట్టుప్రక్కల గ్రామాల్లో కాని రాచకులం వారు ఎంతమంది ఉన్నా వారెంత ఐశ్వర్యవంతులైనా, పేరు లేకుండా 'రాజుగారు' అని పిలిపించుకునే గౌరవం వెంకటపతిరాజుగారి వంశీయులకే దక్కింది.

మొదటినుంచీ వారి కుటుంబం ఆంగ్ల పరిపాలకులకి అండగా ఉండి, వారివల్ల బిరుదులు, సనదులు అందుకుంటూ ఉండేది. రంగరాజుగారు కూడా తాత, తండ్రుల నాటి ఆనవాయితీలనే పాటిస్తూ, బ్రిటిష్ వారికి రంగరాజు ఆప్తమిత్రుడు అనే భావం కలిగేలా మసలుకుంటూ దానివల్ల 'రావ్ బహద్దూర్' బిరుదం అందుకున్నారు.

కాని, దేశాన్ని ఓ ఊపు ఊపుతూ, ప్రజల్ని పరవళ్ళు తొక్కిస్తున్న స్వాతంత్ర్య సమరం జోలికి పోకుండా, ఆ బిరుదం అతన్ని అట్టేకాలం ఆపి ఉంచలేకపోయింది. ఒక్కగానొక్క కొడుకుని విడిచి ఉండలేక తల్లి భద్రావతీదేవి ఎంతగా వారించినా లక్ష్యపెట్టక తన మనసుకు న్యాయం అని తోచిన దారిలో ధైర్యంగా ప్రయాణం సాగించారు రంగరాజుగారు. ఆనాటి అందరి దేశభక్తుల్లాగే జీవితంలో అతి ముఖ్యమైన చాలా భాగం ఆయన జైలు నాలుగు గోడల మధ్య గడిపి వచ్చారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. తమ కష్టం ఫలించింది అన్న తృప్తితో జైలు నుండి బైటికి వచ్చిన రాజుగారికి, బైట కథ, కంచే చేను మేసింది, అన్నట్లు కనిపించింది. జమిందారీలు పోవాలనీ, ఈనాములు రద్దు చెయ్యాలనీ, దున్నేవాడికే భుమి మీద హక్కు ఉండాలనీ ఇటువంటివే ఇంకెన్నో నినాదాలు, చట్టాలు ముందు ముందుకి తోసుకు రాసాగాయి. అయినా వారు చలించలేదు. ఏదో విధాన తన జీవితకాలం తమ వంశం పరువు ప్రతిష్ఠలకి, ఆచారాలకి లోటు రాకుండా నడుపుకు రావాలనుకున్నారు. ఈనాటి వరకు నడుపుకొస్తున్నారు కూడా. అటువంటి రంగరాజుగారి విషయమో ఆ పాతింటి పొట్టి పంతులు ఎవరో దారిన పోతున్న దానయ అనట్లు మాట్లాడ్డం చాకలి రామిగాడు సహించలేక పోయాడంటే అందులో ఆశ్చర్యపడడానికేముంది? పొట్టి పంతులు కూడా తన తప్పుని, రాజుగారి గొప్పతనాన్ని ఆ రోజు గడవకుండానే తెలుసుకుని లెంపలు వేసుకున్నాడు.

ఈ రోజు అందరితోపాటు అతడూ వచ్చాడు రంగరాజుగారి అంతిమ దర్శనం చేసుకోడానికి. వరండా మెట్లు దగ్గర నిలబడి హాలులోకి చూసాడు. హాలు మధ్యగా ఉన్న దివానా మీద మల్లెపువ్వులాంటి తెల్లటి దుప్పటి పరిచారు. తలవైపు ఎత్తుగా రెండు తలగడలు పెట్టి, రాజుగారి ముఖం ఎంత దూరానికైనా అగుపించేలా ఎత్తిపెట్టారు. ముఖంలో ఇంకా కళ తగ్గలేదు. నిర్మలంగా నిద్రపోతున్న వ్యక్తిలా కనిపిస్తున్నారు రాజుగారు. ఎవరో కాళ్ళ దగ్గర దోసెడు గులాబులుపోసి దండం పెట్టారు.

రంగరాజుగారికి గులాబీలంటే ప్రాణం. ఏటి ఒడ్డున ఎంతో పెద్ద గులాబీ తోట వేయించారు. ఎక్కడ ఏ కొత్తరకం గులాబి పువ్వు చూసినా దాని అంటు తెప్పించి తమ తోటలో వేయించేవరకు ఆయనకి నిద్రపట్టేది కాదు. హరి మీద గిరి పడ్డా, మిన్ను విరిగి మీదపడ్డా రోజూ సాయంకాలం ఒకసారి ఆ తోటలోకి వెళ్ళి పేరు పేరునా గులాబీల్ని పలకరించి రావడం అతని రోజువారీ కార్యక్రమంలో తప్పడానికి వీలు లేని ఒక భాగం. "పువ్వులంటే మీకు పానం బాబూ, ఆ పువ్వులాగే ఎగిరిపోనారు బాబూ" పాతికేళ్ళు నిండని పార్వతి రాజుగారి తల దగ్గర నిలిచి వెక్కి వెక్కి ఏడుస్తున్నది. దాని మొగుడు అప్పన్న దాన్ని ఊరడిస్తునాడు. "ఊరుకోయే..... ఎంతేడిత్తే మాత్తరం బాబు తిరిగి వత్తారా!" అంటూ.

వారిద్దరికీ రంగరాజుగారే వివాహం చేయించారు. పార్వతి తండ్రి రాత్రి పూట పొలంలో పాము కరిచి చచ్చిపోయాడు. పెళ్ళీడుకొచ్చిన పిల్ల పార్వతి. తల్లీ తండ్రీలేని పార్వతిని చూసి ఊళ్ళో అంతా జాలిపడ్డారు. "మా ఇంట ఉండు" అంటే... "మాతో ఉండు" అంటూ వెంట పడ్డారు. తమ అవసరానికి దాని అందాన్ని, వయసునీ వాడుకోవాలనుకున్నారే కానీ, దాన్ని ఒక ఇంటిదాన్ని చెయ్యాలన్న బుద్ధి వారిలో ఒకరికీ కలగలేదు. ఈ వార్త విన్న రంగరాజుగారు తాము పూనుకుని పార్వతి పెళ్ళి జరిపించారు. అప్పన్నకి దేవిడీలో నౌకరీ ఇప్పించారు వారి బ్రతుక్కో దారి చూపించారు.

అందుకే ఏడుస్తున్నది పార్వతి. తన జీవితాన్ని నిలిపిన వ్యక్తికోసం... తండ్రిని కోల్పోయిన నాటికన్న మిన్నగా, ఆమె ఏడుపుకి ఆ గోడలకి తాపడం చేసిన రాళ్ళు కరుగుతున్నాయి కాని పార్వతిని ఇంతగా అభిమానించిన రంగరాజుగారిలో మాత్రం చలనం లేదు.

ఒక్క పార్వతి పెళ్ళి అన్నమాటే కాదు. ఊళ్ళో ఏ కార్యం జరిగినా రంగరాజుగారి చెయ్యి ఆనకుండా అయ్యేది కాదు. మంచికైనా, చెడ్డకైనా తమవల్ల ఈ సహాయం కావాలంటే వారి ముందుకి వచ్చినవారు ఎవరూ నిరాశతో వెనుతిరిగి వెళ్ళవలసిన అవసరం కలిగేది కాదు.

అంత ఉదారుడు, దయార్ద్ర హృదయుడు కాబట్టే అతడు దారిన పోతుంటే అంతా చెయ్యెత్తి దండం పెట్టేవారు. అందరిలాగే ఓ రోజు పొట్టి పంతులు కూడా తలవంచి నమస్కరించాడు - స్వరాజ్యం వచ్చి జమీలు, జమిందారులు పోయినా ఒకనాడు ఆ ఊరికి మకుటం లేని మహారాజులాంటి రంగరాజుగారికి. రాజుగారు ఆ నమస్కారాన్ని చిరునవ్వుతో స్వీకరించి కుశల ప్రశ్నలు వేశారు.

"పిల్లలా?" అంటూ ప్రశ్నించారు.

"ఐదుగురు. పెద్దవాడు భిలాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రెండోవాడు విజయనగరంలో బియ్యే చదువుతున్నాడు. ఇద్దరు ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు అయాయి. మూడోది పెళ్ళికి ఉంది. రైల్వే సర్వీసులో ఎక్కడెక్కడో తిరిగి ఈనాటికి ఉద్యోగ విరమణ చేసి, తాతలనాటి ఈ పాత ఇంటిని వెతుక్కుంటూ ఈ ఊరు వచ్చాను. మిగిలిన కాలం ఈ గడ్డ మీద గడుపుదామని" ఎంతో నమ్రతగా జవాబు చెప్పాడు పొట్టి పంతులు.

ఇవన్నీ రంగరాజుగారికి తెలియని విషయాలు కావు. కొత్త ముఖాన్ని ఆ గడపలో చూసిన మొదటి రోజునే వీరాయివల్ల తెలుసుకున్నారు. అందువల్లనే ఏదో ఓ రోజు అతడు తమ దర్శనానికి వస్తాడని ఎదురు చూశారు. అతడు ఆ గ్రామంలో వాసం ఏర్పరచుకుని నెలలకి నెలలు గడుస్తున్నా రాజుగారి దర్శనానికి రాలేదు. మీవల్ల ఈ సహాయం కావాలంటూ చేయిజాచి అడగలేదు. అతడి తత్వం రాజుగారికి అంతుపట్టకుండా పోయింది. ఇల్లు చూస్తే ఓ మూలనుంచి విరిగిపడుతున్నది. పెళ్ళికి, గుమ్మటంలా ఆడపిల్ల ఇంట్లో తిరుగుతున్నది. బియ్యే పాసై ఇంట్లో కూర్చున్న కొడుక్కి ఉద్యోగం కావాలి. ఇవన్నీ తాము తలుచుకుంటే అవలీలగా అయిపోయే పనులు. కాని కావలసిన వ్యక్తి ఎన్నిసార్లు ఎదురుపడినా ఆ ప్రసక్తే తేకపోతే... కనీసం దేవిడీకి వచ్చి ఒక్కసారి దర్శనం అయినా చేసుకుని వెళ్ళకపోతే - రాజుగారితో పాటు వీరాయికి కూడా అర్థం కాకుండా పోయింది. ఈ పొట్టి పంతులు వాటం, "పిచ్చి బామ్మడు రాజుగారంతోటి వారి ఎదుటపడి సెప్పుకోడానికి బయపడుతున్నాడేమో" - అనుకున్నాడు.

"రాజుగారు పోయారుట... నిజంగానా... స్టేషన్‌లో ఎవరో చెపితే నమ్మలేకపోయాను. అంత ఆరోగ్యంగా తిరుగులాడే మనిషి.. ఇంత అకస్మాత్తుగా.. నేనైతే నెల రోజులుగా ఆయన్ని కలుసుకోలేదనుకోండి.." ఆత్రంగా మూకని తోసుకుని ముందుకి వస్తున్నాడు అప్పుడే హైదరాబాదు నుంచి తిరిగి వచ్చిన ఎమ్మెల్యే. ప్రయాణపు బడలికైనా తీర్చుకోకుండా ఆ స్వాతంత్ర్య సమరవీరుడి అంతిమ దర్శనం కోసం ఉరుకలు, పరుగులుగా ఇక్కడికి వచ్చిపడ్డాడు.

నిజానికి అతడికే అన్నమాట కాదు. ఇటీవలి కాలంలో ఎవరికి కూడా రాజుగారి దర్శనం అంత సులువుగా దొరకడం లేదు. ఆ విషయం ఆశ్రితుల మధ్య, స్నేహితుల మధ్య చర్చకి రావడం జరిగింది. వారి దర్శనార్థం వచ్చినవారి నుంచి వర్తమానం తీసుకుని రాజుగారి దగ్గరికి వెళ్ళే వీరాయి అంతలోనే తిరిగి వచ్చి "ఇప్పుడు ఈలు కాదని సెప్పమన్నారండి" అనేవాడు. రంగరాజుగారిలో వచ్చిన ఈ మార్పు ఎవరికీ అంతుపట్టని విషయంగా తయారయింది. అత్యంత సన్నిహితంగా తిరిగే వీరాయికి కూడా రాజుగారి ఈ విధమైన ప్రవర్తనకి కారణం తెలిసి రాలేదు. వాడూ గ్రహించిందల్లా ఒక్కటే! రాజుగారు దేనికోసమో రాత్రీ పగలూ ఎదురు చూస్తున్నారు. అనుకున్నట్లు అది జరుగలేదు. ఆ ఆరాటంతో, ఆ విసురుతో మిగిలిన ఆచారాలన్నీ మానుకుంటున్నారు - అని.

గ్రామాల్లో మనుషులతో పాటు తోటల్లో పువ్వులు కూడా రాజుగారిని కడసారి చూడ్డం కోసం తరలి వచ్చినట్లు ఉన్నాయి. ముఖం ఒక్కటి తప్పితే మిగిలిన శరీరం అంతా రకరకాల పువ్వులతో నిండిపోయి ఉంది. తల వైపు బల్ల మీద వెలుగుతున్న ఊదొత్తుల సువాసన. పువ్వుల పరిమళం హాలు దాటి వరండాలోకి కూడా గుబాళిస్తున్నాయి.

గొప్పవారి చావు బీదవారింట పెళ్ళికన్నా ఘనంగా ఉంటుందని ఇందుకే అంటారు కామోసు - అనుకున్నాడు పొట్టిపంతులు. పరదా కట్టిన భాగంలోంచి ఉండుండి వినిపిస్తున్న ఆ ఏడుపులే లేకుంటే అది చావు కొంపలాగే లేదు.

సూర్యాస్తమయానికి ఇంక అట్టే సమయం లేదు. రావ్ బహద్దూర్ రంగరాజు గారి అంతిమ యాత్రకి ఏర్పాట్లు అతి ఘనంగా జరుగుతున్నాయి. రాజులు, రాజరికాలు గతకాలపు కథలుగా మారిపోయినా, జమీలు, జమీందారులు ప్రజాస్వామ్యంలో కరిగిపోయినా ఒకనాటి వారి వంశ ప్రతిష్టకి, గౌరవానికి ఏకైక ప్రతినిధిగా నిలిచిన రంగరాజుగారి మరణం ఒక వ్యక్తి మరణంగా పరిగణించడానికి వీలులేదు. అది తరతరాలుగా దేశంలో పరిఢిల్లిన ఒకానొక సంస్కృతి మరణం; ప్రజాస్వామ్యంలో కరిగిపోయిన రాజరికపు మర్యాదల మరణం.

మరునాటినుంచి ఆ దేవిడీ మామూలు గృహంలా మారిపోతుంది. అర్చకులకు, ఆర్తులకు ఇకముందు అక్కడ ప్రవేశం ఉండదు. తండ్రి జీవితం అతడు అలవాటు పడిన గాడిలో గడిచిపోవాలని అంతవరకు ఊపిరి బిగపట్టి, అతడి దానధర్మాలకి, రాచరికపు మర్యాదలకి తలవంచి ఊరుకున్న తనయులు, ఆ కాయం అటు కదలగానే ఆ ఇంట కొత్త అలవాట్లని, కొత్త జీవన విధానాన్ని ప్రవేశపెడతారు. ఈ కాలానికి పనికి రాని పాత విలువల్ని పునాదుల్లోంచి పెకలించి పడదోసి, తాము మంచిపని ఎంచుకున్న కొత్తవాటికి కోట కడతారు.

ఈ విషయం గ్రామంలో అందరికీ తెలిసిందే! అంత వయసు వచ్చిన తండ్రిని, అతడికి పరిచితమైన జీవితం నుంచి తప్పుకోమనీ, అలవాట్లని మార్చుకోమని నిర్భంధించడం న్యాయం కాదనీ ఊరుకున్నా, పట్టు తప్పిపోయి చెట్టు నుంచి విడిపడనున్న ఈ ఊడని పట్టుకుని తాము ఎంతోకాలం ఊగులాడలేమని ఆ కొడుకులు ఏనాడో గ్రహించుకున్నారు. అందుకే వారు వాస్తవాన్ని గుర్తించి దానికి అనువుగా తమ జీవితాలను మలచుకున్నారు.

పెద్దకొడుకు కలప వ్యాపారం పెట్టి అణా పైసల లెక్కల్లో తన జీవిత సాఫల్యం చూరగొంటున్నాడు. చిన్నకొడుకు కాలేజీ చదువులు చదువుకుని సుఖంగా బ్రతకడానికి జీవనోపాధిగా ఒక మంచి ఉద్యోగం సంపాదించుకున్నాడు. మిగిలినవారు కూడా అన్నల అడుగుజాడల్లో నడుస్తూ పాతకథల్లో పాత్రలాంటి తండ్రిని చూసి తమలో తామే నవ్వుకుంటారు.

తిండికి, బట్టకి లోటులేకుండా రంగరాజుగారి ఆశయంలో కాలం గడిపేస్తున్న ఆశ్రితులంతా చచ్చిపోయిన రంగరాజుగారి కోసం కన్నా, తమబ్రతుకులు తలచుకుని గోడు గోడున ఏడుస్తున్నారు. బ్రతికున్న రోజుల్లో ఎదుటివారి కంటతడి చూడలేక, ఏదో విధంగా వారిని ఆదుకునే రంగరాజుగారు ఈనాడు ఇంతమంది తన ఎదుట ఏడుస్తున్నా తనకేం పట్టనట్లు పెద్దగా నిద్రపోతున్నారు.

శవ వాహనం ఊరిలోని ముఖ్యమైన వీధులగుండా ప్రయాణం మొదలు పెట్టింది. దేవిడీకి వచ్చి రాజుగారి దర్శనం చేసుకోలేని ఆడంగులు, పిల్లలు, వృద్ధులు వెళ్ళి వీధి అరుగుల మీద చేతులు జోడించి నిలబడ్డారు. బాజాల ధ్వని విని అరుగు మీదకి వచ్చింది పొట్టి పంతులు పెళ్ళాం.

"ఈ రోజు ఉదయం వరండాలో పచార్లు చెయ్యడం మా అబ్బాయి చూసాడట. ఇంతలో ఎంత ఘోరం జరిగిపోయింది? అందుకే అంటారు వాన రాకట - ప్రాణం పోకట చెప్పటం కష్టం" అని పొరుగింటావిడతో అంది పొట్టి పంతులు పెళ్ళాం.

ఆ రోజు ఉదయం రాజుగారు అలా వరండాలో పచార్లు చేస్తుండగనే వచ్చాడు వీరాయి ఎంతో ఉత్సాహంతో. వాడి ముఖం చూడగానే ఎంతోకాలంగా కళ తప్పిన రాజుగారి కళ్ళల్లో కాంతి కనిపించింది. "ఏమిటి వీరాయి?" అన్నాడు.

"మరే.. మరేనండీ.... పొట్టిపంతులు లేడూ... ఏరు ఆ పాడింటి పొట్టిపంతులు..."

"హమ్మయ.. ఇంతకాలాని వచ్చాడన్న మాట" తనలో తనే మెల్లగ అనుకున్నాడు రాజుగారు.

పరీక్షగా వింటే ఆ మాట వీరాయికి కూడా వినిపించి ఉండేది. కాని వాడు తన ధోరణిలో తాను ఉన్నాడు. రాజుగారి స్వగతాలు వినపడే పరిస్థితి కాదు అది.

రంగరాజుగారు పొట్టిపంతులు గురించి ఇంతగా పట్టించుకోవడానికి ప్రత్యేక కారణం అంటూ ఏమీ లేదు. అతడు పుట్టిన ఊరని తమ గ్రామంలో నివాసం ఏర్పరచుకోడానికి వచ్చాడు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నాడు. అంతో ఇంతో తమ వల్ల లబ్ధిపొందితే, అది వారికొక విధమైన తృప్తి. అంతగా ఇయ్యాలనుకుంటే తనంతట తానుగా అందియ్యకూడదా?

అంటే... ప్రతి పనికి ఒక పద్ధతి, ఒక మర్యాదా ఉంటుంది.

అర్థి అన్నవాడు చెయ్యి జాపి అడగడం దాత అయినవాడు ఔదార్యం చూపుతూ ఇయ్యడం లోకంలో రివాజు.

"కింద హాలులో కూర్చోబెట్టు.... ఇప్పుడే వస్తున్నామని చెప్పు" ఉత్సాహంతో అన్నారు రంగరాజుగారు.

"అదికాదు బాబూ... ఆరికి నాటరీలో రెండు నచ్చల రూపాయలు వచ్చాయట. ఆరి కుర్రోడు... ఆ పట్టణంలో ఉద్యోగం సేత్తున్నవోడు ఉత్తరం రాసేట్ట... ఊరంతా ఈ కబురే గనంగా సెప్పుకుంటుంటే.."

"ఏమిటి వీరాయి... ఈ మాట నిజమేనంటావా?" నమ్మలేనట్లు తడబడుతూ అడిగారు రాజుగారు.

"నిజం బాబూ! ఆ పాట్టాయనే పక్కింటోరితో సెపుతుంటే.."

నేడు బహుళ ప్రచారంలో ఉన్న లాటరీ టిక్కెట్ల గురించి, అవి చెప్పా చెయ్యకుండా మనుషుల జీవితాల్ని తారుమారు చెయ్యడం గురించి రంగరాజుగారు విని ఉండకపోలేదు. కాని కాని.. అటువంటి అదృష్టం పొట్టి పంతుల్నే వెతుక్కుంటూ రావడం....

"అతడు రాడు... ఇంక అతడు రాడు" మెల్లగా తనలో తనే గొణుక్కున్నాడు రాజుగారు.

"ఎవరు బాబూ... పొట్టిపంతులా?"

"అవును... అతడు... రావలసిన అవసరం లేదు. అతడు ఇంక రాడు."

"ఎందుకు రాడు బాబూ! తమరు పిలిస్తున్నారంటే రెక్కలు కట్టుకొచ్చి వాల్తాడు -"

రంగరాజుగారు వీరాయి మాటలు వినలేదు. అవి అతడికి వినిపించలేదు. నెమ్మదిగా సోఫాలో జేరబడి కళ్ళుమూసుకున్నారు.

"ఇంక రాడు - ఇంక రాడు - ఇంక అతడు రాడు" రాజుగారి నోటిలోంచి నిరాశతో అతి నెమ్మదిగా వచ్చాయి ఆ మాటలు.

ఆ మాట, ఆ స్వరం అదోలా వినిపించింది వీరాయికి. సోఫాలో ఒక పక్కకి వాలిన రాజుగారి తల ఏదో అనర్థాన్ని సూచించింది.

"బాబుగారూ - బాబుగారూ" దగ్గరగా వంగి గట్టిగా పిలిచాడు వీరాయి. ఒక్క అదుటున మెట్లు దిగి "సిన్నమ్మగోరో" అంటూ ఇంట్లోకి పరుగుపెట్టాడు.

రంగరాజుగారి అంత్య సమయంలో ఆయన దగ్గర ఉన్నది వీరాయి ఒక్కడే! అందుకే అంతా అతన్ని అడగడం మొదలుపెట్టారు. "రాజుగారు పోయేముందు ఏమన్నారు? ఎలా ప్రాణం పోయింది?" అంటూ

వీరాయి జరిగింది జరిగినట్లు చెప్పలేదు. పొట్టిపంతులుకి లాటరీలో రెండు లక్షలు వచ్చాయని వినగానే రంగరాజుగారు గుండాగి చచ్చిపోయారంటే అది వారి జీవితానికి గౌరవప్రదమైన ముగింపు కాదనిపించింది వాడికి. అందుకే ఆ విషయాన్ని మరుగుపరచి రాజుగారి వంటి గొప్పవారి చావు ఎలా ఉండాలో ఊహించి, అలాగే జరిగినట్లు వర్ణించి చెప్పాడు.

"ఏటి నేదు బాబూ, సోఫాలో కూచుని 'ఈరాయి' అని పిల్సేరండి. 'ఏటి బాబూ' అన్నానండి"

"దేవుని పిలుపొచ్చిందిరా. నాను ఎల్లిపోతున్నానన్నారండి."

"ఒద్దు బాబుగోరూ... మీరు నేందే నే బతకలేనన్నానండి."

"పిచ్చోడా నువ్వు మాత్రం ఉండిపోతావట్రా.. నీకు పిలుపు వత్తే నువ్వూ ఎల్లిపోతావు" అన్నారండి. 'రాము... రామ' అంటూ గమ్మున కల్లు మూసేసుకున్నానండి."

అని చెప్పాడు ఈరాయి.

శవవాహనం ఊరంతా తిరిగి రాజుగారి ప్రీతికరమైన గులాబీ తోట చేరుకుంది. తోట మధ్యగా వారు తమ అంతిమ విశ్రాంతి మందిరంగా నిర్మించుకున్న హాలులో మధ్యగా ఉన్న తిన్నె మీద అగ్నిహోత్రుడు వారి భౌతిక కాయాన్ని అతి ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నాడు.

నాలుకలు చాచి నాలుగు దిక్కులకు సాగుతున్న ఆ అగ్ని గుండంలో వారి భౌతిక కాయంతోపాటు, వారి జీవితంలో తీరని ఒకే ఒక కోరిక కూడా బూడిద అయిపోయింది. మచ్చలేని వారి జీవిత కథ - చిలువలు, పలవలు కల్పించి చెప్పుకోవడానికి ఆ ఊరివారికి మిగిలిపోయింది.

✡✡✡

దగ్ధగీతం

పెద్దిభొట్ల సుబ్బరామయ్య

'**అనవసరంగా చాలా** కాలం బ్రతికాను నేను' అనుకున్నాడు సేతురామన్.

ఆ చిన్న వరండాలో స్థంభానికి ఆనుకుని కూర్చుని ఉన్నాడు. తల అక్కడక్కడ నెరిసింది. కళ్ళు లోతుకుపోయి, ముఖం ముడతలు బడి అకాల వార్ధక్యం పైబడినవాడిలా ఉన్నాడు. నిన్న రాత్రి ఆ సన్నటి వరండాలో చాపమీద నిద్రపోదామని విశ్వప్రయత్నం చేశాడు. కానీ ఫలించలేదు. పైగా కన్ను మూస్తే అన్నీ పీడకలలూ, వికృతమైన దృశ్యాలూ.. నిన్ననేకాదు నాలుగురోజులనుంచీ అంతే.

ఎవరో వస్తున్న అలికిడి వినిపించింది. తల తిప్పి చూస్తే డాక్టరు... సేతురామన్ లేచి నిలబడ్డాడు. డాక్టరు యువకుడు. సేతురామన్ వంక పలకరింపుగా చూసి నవ్వాడు. సేతురామన్ కళ్ళలో అకస్మాత్తుగా నీటిపొర కమ్మింది. స్థంభానికి ఆనుకుని అలాగే నిలబడ్డాడు. డాక్టరు గుమ్మంలోనే నిలబడి కొద్ది క్షణాలు చూశాడు. లోపలికి పోలేదు. లోపలికి పోనవసరంలేదని సేతురామన్‌కి తెలుసు. డాక్టరు చివాలున వెనుతిరిగి సేతురామన్ ప్రక్కగానే నడిచి అవతలివైపుకి వెళ్ళిపోయాడు. డాక్టరు బూట్ల శబ్దం అతని నోటివెంట వెలువడిన మాటలను పూర్తిగా అణచలేక పోయింది. సేతురామన్‌కు, ఆ మాటలు స్పష్టంగానే వినబడ్డాయి. 'పూర్ సోల్', 'షి ఈజ్ వెయిటింగ్ ఫర్ డెత్...' సేతురామన్ మళ్ళీ స్థంభానికి ఆనుకుని కూలబడ్డాడు. వెనక రెండు గదులు.. మరీ పెద్దవేమీ కాదు. ఎడమవైపు గది ఖాళీ.. కుడివైపు గదిలో... సేతురామన్ కళ్ళు తుడుచుకున్నాడు.

కుడివైపు గదిలో అతని సంగీత సామ్రాజ్యం శిధిలమై, దగ్ధమై బూడిదయి పోతున్నది. ఇవాళ్టికి సరిగా నాలుగురోజుల నుంచీ .. నాలుగు పగుళ్ళూ, నాలుగు రాత్రులు.

ముందు పెద్ద ఆస్పత్రి భవనం.. అందులో మామూలు మనుషులకు మామూలు సౌకర్యాలున్న గదులు.. ప్రత్యేక వ్యక్తులకు ప్రత్యేక సౌకర్యాలున్న గదులున్నాయి. అక్కడ ఎక్కడా ఖాళీ లేదు. వెనక ఈ రెండు గదుల కట్టడం ఎందుకు ఉందో తెలీదు.. ఇక్కడే ఖాళీ దొరికింది. సేతురామన్ చేతివేళ్ళు విరుచుకున్నాడు. పొద్దున ఆసుపత్రి బయట తాగిన టీ తాలూకు ఆ రుచి నాలుకని ఇంకా అంటిపెట్టుకునే ఉంది. నీరసంగా ఉంది. మనసంతా వికారంగా ఉంది.

అకస్మాత్తుగా ఆస్పత్రి వెనక రైలు ఒకటి కూత వేసుకుంటూ రణగొణ ధ్వని చేస్తూ వెళ్ళింది. అది చాలా దూరం పోయిన తరువాత కూడా ఆ వికృత శబ్దం అతని చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది.

ఎప్పటెప్పటివో దృశ్యాలు...

ఎండాకాలం.. మధ్యాహ్నం.. విశాలమైన పెరటిలో పెద్ద సీమ చింతచెట్టు (లేక బాదం చెట్టా?) కింద వెలుగును ముక్కులు ముక్కలుగా కత్తిరించి పోసినట్టున్న ఎండ.. చెట్టు మొదట్లో కూర్చున్న పంకజవల్లి. సన్న సన్నగా కబుర్లు.. చిరుతిళ్ళు.. చిరు చిరు తగవులు చిరునగవులు.

సేతురామన్ ఉలిక్కిపడి చూశాడు. ప్రహరీ గోడమీద రంగు రంగుల పక్షి ఏదో కూర్చుని పెద్ద గొంతుతో అరుస్తున్నది. ఒకప్పుడెపుడో.. ఎండాకాలం మధ్యాహ్నం వేళ చెట్టు కొమ్మల్లో ఎక్కడో కోయిల కూస్తుంటే తామిద్దరూ రెట్టించేవారు. తాము రెట్టించే కొద్ది కోయిల మరీ రెచ్చిపోయి కూస్తూ ఉండేది. చివరకు తామో, కోయిలే, ఎవరో ఒకరు అలిసిపోయి మానేసే వరకూ కొనసాగేది ఆ సంబరం. కోయిలను చూద్దామని ఎన్నోసార్లు ఎంతో ప్రయత్నం చేశారు. కానీ ఎప్పుడూ వారికి కనబడలేదు. అవును.. కోయిల అలిసిపోయింది.. అలిగిపోయింది.. క్రుంగిపోయింది. ఆ చిన్ని మేనులో వీసమెత్తుకూడా శక్తిమిగల్లేదు.

సేతురామన్ లేచాడు. నెమ్మదిగా అడుగులు వేస్తూ గుమ్మంలోకి వెళ్ళి నిలబడ్డాడు. కిటికీ పక్కన ఇనుప మంచం..కిటికీలో నుంచి ఉమ్మెత్త చెట్టు ఒకటి మాత్రం గోడ ప్రక్కన కనిపిస్తున్నది. గదిగోడలు తెల్లగా ఉన్నాయి. మంచం పక్కన పాత చెక్క బీరువా.. సేతురామన్ గుండెలు చేత్తో రుద్దుకున్నాడు. అంతలో దగ్గు వచ్చింది. ప్రయత్న పూర్వకంగా దగ్గు ఆపుకుంటూ మళ్ళీ కళ్ళెత్తి చూశాడు.

తెల్లని దుప్పటిలో శుష్కించిన శరీరంపైన ముంజేతులు, తల మాత్రం కనిపిస్తున్నాయి. ఒక చేతికి ఒకే ఒక ఎర్ర రంగు గాజున్నది. గుండెలమీద ఉన్న రెండో చేతికి ఏమీ లేదు.. పైన సన్నని కంఠం, నల్లని కంఠం... దేశం అంతటా సంగీత మాధుర్యాన్ని పంచిన కంఠం.. ఆ పైన చామనఛాయ ముఖం.. సన్నని ముక్కు.. తెల్లని పెద్ద పెద్ద కళ్ళు.. (అవి ఇప్పుడు మూతపడి ఉన్నాయి. మళ్ళీ తెరుచుకుంటాయో లేదో తెలీదు.) ముంగరులు సన్నని గాలి విసురుకు బలహీనంగా కదులుతున్నాయి. శుష్కించిన చెక్కిలి మీద ఒక వైపు సన్నగా చెమట..

సేతురామన్ ఇవతలకి వచ్చాడు. ఆస్పత్రి ప్రక్కగా ఎవరో పెళ్ళికి తరలి వెడుతున్నారులా ఉంది. సన్నాయి మృదువుగా గాలిలో తేలి తేలి వస్తున్నది.

అతనికి అంతలో బీడీ కాల్చాలనిపించింది. చొక్కా జేబులో ఒక్కటే బీడీ మిగిలి ఉంది. కానీ అగ్గిపెట్టె లేదు. అందువల్ల ఆ కోరికను అణుచుకున్నాడు. బీడీని అవతల పారేద్దామనుకున్నాడు. కానీ మళ్ళీ మనసు మార్చుకుని జేబులోనే ఉంచుకున్నాడు. తన ఆస్తి గొప్పదేమీ కాదుగానీ అంతా వీటికే హరించుకుపోయింది. పెళ్ళి చేసుకుని ఒక ఇంటివాడివి కమ్మనీ, కుదురుగా ఉండమనీ ఎంతగానో నచ్చ చెప్పిన తల్లీ తండ్రీ పోయారు. ఇంకెవరూ మిగల్లేదు. ఆస్తి హారతి కర్పూరంలాగా కాకపోయినా నెమ్మది నెమ్మదిగా హరించుకుపోయింది. సన్నాయి వాద్యం పూర్తిగా దూరమైపోయింది. ఇప్పుడేమీ శబ్దంలేదు.

సేతురామన్‌కు పంకజవల్లి పెళ్ళి గుర్తుకు వచ్చింది. అప్పటికే ఆమె సంగీత సామ్రాజ్యాన్ని పరిపాలించే సూచనలు స్పష్టంగా ఉన్నాయి. ఆమె రవిని ప్రేమించింది. మూర్తీభవించిన పురుష సౌందర్యానికి అబ్బురపడి అతన్ని ఆరాధించింది. వారి పెళ్ళి అట్టహాసంగా జరిగింది. పలువురు ఆ వివాహాన్ని ఆదర్శ వివాహమని కొనియాడారు. ఎక్కువమంది పెళ్ళికుమారుణ్ణే మెచ్చుకున్నారు. ఎంత సంగీత సరస్వతి అయితే మాత్రం, అంత అందగాడు చేసుకోదగిన పిల్లకాదని కొందరు అనుకున్నారు. మరి కొందరు అతని కళాప్రియత్వాన్ని కొనియాడారు. ఎందరెన్ని అన్నా, ఎందరెన్ని అనుకున్నా రవి చిరునవ్వుతోనే ఉన్నాడు తప్ప ఎవరికీ ఏమీ తెలియనీయలేదు. సేతురామన్ మాత్రం అంత హడావిడిలోనూ ఒంటరిగా కూర్చుని తన ఆలోచనల్లో తానుండిపోయాడు. తాను చిన్నప్పటి నుంచీ ఎవరిని కోరుకున్నాడో, ఎవరిని ప్రేమించాడో ఆమె తనకు దక్కకుండా పోయినందుకు అతడేమీ బాధపడలేదు. ఆమె ప్రేమించిన వాణ్ణి చేసుకుంటున్నందుకు ఆనందించాడు కూడా. ఇదంతా జరిగి దాదాపు పదేళ్ళు.. రవి చాలా జాగ్రత్తపరుడు. తనకు ఏమేమి కావాలో వాటిని సాధించి సమకూర్చుకోగల తెలివితేటలు పుష్కలంగా ఉన్నవాడు. భార్య చేయవలసిన కచేరీలూ, అక్కడ వసూలు చేయవలసిన మొత్తాలూ.. చెక్కులు, అకౌంట్లు అన్నీ అతడే చూసుకునేవాడు ఆ విషయాల్లో బహు జాగ్రత్తగా, ఖచ్చితంగా ఉండేవాడు.

ఎప్పుడన్నా పంకజవల్లి "నాకు ఒంట్లో బాగోలేదు జ్వరం.. కచేరీకి వెళ్ళలేను ఓపిక లేదు" అంటే

"అమ్మమ్మా! అంతమాట? అలా అనకు. వాళ్ళ దగ్గర ముందే డబ్బు కూడా తీసుకున్నాను. వెళ్ళకపోతే వీల్లేదు. మామూలు జ్వరానికే కచేరీ ఎగ్గొట్టేస్తే తప్పు డియర్.." అనేవాడు.

మరొకప్పుడెప్పుడైనా "ఏమండి ఎవరో అనాధ శరణాలయం సహాయం కోసం కచేరీ ఇవ్వమంటున్నారు పాపం! వందమంది అనాధలైన పిల్లలు తిండి తిప్పలూ లేక మాడిపోతున్నారట" అంటే

అందంగా నవ్వి, "భలేదానివే. ఇలా ఇవ్వలేని వాళ్ళకోసం కచేరి చేస్తే నీ ఆరోగ్యం ఏం కాను? వీటనన్నీ పెట్టుకోవద్దు. అనాధలకు ఎవరో డబ్బున్నవాళ్ళు దానం చెయ్యాలి గాని మనం ఎంతని చేస్తాం? అలాటి విషయాలు నాకొదిలెయ్ డియర్!" అనేవాడు.

సేతురామన్ జేబులు వెతుక్కున్నాడు. బాగా నలిగిపోయిన రూపాయి నోట్లు రెండు, కొంత చిల్లరా మిగిలి ఉంది. అంత ఆస్తికి ఈ నాటికి మిగిలిందిది పెద్ద ఇల్లూ.. పల్లెటూర్లో మూడెకరాల మాగాణీ.. పాగాకు పండే నాలుగెకరాలు మెట్ట. ఇంతకు మిగిలింది ఇదే!

ఆమె పెళ్ళయినప్పటి నుంచీ సేతురామన్ వారి ఇంటి ఎదురుగానే ఒక రెండు గదుల వాటా అద్దెకు తీసుకుని అందులో ఉండేవాడు. పంకజవల్లి గురించి చాలా మాటలు మాటలు విన్నాడు. ఎవరూ రవిని ఏమీ అనలేదు. ఆమెను గురించే అందరూ అన్నారు. ఆమె డబ్బు మనిషయిపోయిందనీ, సంగీతాన్ని అమ్ముకుంటున్నదనీ.. ఇలా చాలా విన్నాడు. జనానికి ఆ డబ్బంతా ఏ ఖాతాలోకి వెడుతున్నదో, ఎవరి చేతుల్లోకి వెడుతున్నదో తెలిస్తేగా? చాలా తక్కువసార్లు ఆమె సేతురామన్‌తో మాట్లాడింది. మాట్లాడినప్పుడు చాలా తక్కువగా మాట్లాడింది. రవి పట్ల ఉన్న ఆకర్షణ, రవి అంటే తన్మయత్వం ఆమెలో తగ్గడం సేతురామన్ గమనించాడు. ఆమె ఉదాసీనంగా అప్పుడప్పుడూ దీనంగా ఒంటరిగా ఇంట్లో ఉండటం అతడు గమనించాడు. డబ్బు వేలకు వేలు డబ్బు చేసి పెట్టే ఆమె కంఠం రవికి కావాలి.. అందవిహీనమైన ఆమె, ఆమె శరీరం ఆ శరీరంలోని మనసు ఇవేవీ అతనికి అక్కర్లేదు. అతనికి కావలసిన అందమైన శరీరం అతడు వేరే ఏర్పాటు చేసుకున్నాడు. క్రమ క్రమంగా కచేరీ ఏర్పాట్లు, తారీఖులు, వగైరాలు తప్ప ఆమెతో అతనికేమీ సంబంధం లేకపోయింది. ఇల్లు మాత్రం గడుపుతూ ఉండేవాడు. ఇల్లంటే ఉన్నది ఎంతమంది కనక. భార్య, ఆమెను కనిపెట్టుకుని ఉండే మరొక మనిషి. అంతే కచేరీకి వెళ్ళవలసివచ్చినపుడు కారులో వచ్చి తీసుకుపోయేవాడు. అది పూర్తికాగానే తీసుకొచ్చి దించి వెళ్ళిపోయేవాడు. ఇటీవల ఒకసారి "గొంతు మంటగా ఉంది నేను కచేరీ చేయలేను" అంటే, పెద్దగా మాట్లాడి కోపగించి భయపెట్టి తీసుకు వెళ్ళాడు. ఆమె దగ్గిదగ్గి బాధతో మెలికలు తిరిగిపోతుంటే సేతురామన్ గబగబా వెళ్ళాడు.. ఆమె దగ్గి దగ్గి చివరకు చారెడు రక్తం కక్కింది. అతనికి అప్పుడు గుండెలు దడదడలాడాయి.

సేతురామన్ కాళ్ళు బారజాపుకుని కూర్చున్నాడు. పదిగంటలవుతుందేమో. ఈ చుట్టుపక్కల మంచి హోటల్ ఏదీ లేదు రాత్రి ఆస్పత్రిముందు చిన్న హోటల్లో తిన్నా ఇంకా కడుపులో అలాగే ఉన్నట్లుంది.

అయిదారు నెలల క్రిందట ఒకనాడు రవి కారులో వచ్చి భార్యను తీసుకుపోవడం చూశాడతడు. తనవాటా వరండాలో నిలబడి ఉండి, తానలాగే నిలబడి ఉన్నాడు. అరగంటలో వాళ్ళు తిరిగి వచ్చేశారు. తర్వాత రవి ఒంటరిగా బయలుదేరి వెళ్ళిపోయాడు. "ఏం జరిగిందో తెలుసుకుందామ"ని ఎంతగానో ఆశించినా ఆ సాయంకాలం వరకూ వీలుపడలేదు. సాయంకాలం పంకజవల్లితో ఉండే నలభై ఏళ్ళ వనజమ్మ బైటకి వచ్చింది. సేతురామన్ ఆమెను పిలిచి కబుర్లలో పెట్టి నెమ్మదిగా విషయం తెలుసుకున్నాడు. వనజమ్మ గది బయట ఉండి అంతా విన్నది. అందువల్ల ఆగలేక సేతురామన్‌కు చెప్పేసింది. సేతురామన్ అది విని ఎండుటాకులా నిలువునా గడ్డకట్టుకుపోయాడు. క్యాన్సర్.. ఆ చిన్ని గొంతులో క్యాన్సర్. అతనికి ఏడుపొచ్చింది.

ఇక ఆ తర్వాత కథంతా చాలా త్వరగా జరిగిపోయింది. రవి పదిరోజులు గడిచాక ఒకసారి మాత్రం వచ్చి ముక్తసరిగా ఒక అరగంట ఉండివెళ్ళిపోయాడు. తర్వాత పదిరోజులు పత్తాలేడు. మళ్ళీ వచ్చి వనజమ్మ చేతికి కొంచెం డబ్బిచ్చి వెళ్ళిపోయాడు. అదే చివరిసారి అతడు ఊళ్ళోనే మళ్ళా కనిపించలేదు.

సేతురామన్ అప్పుడప్పుడూ ఎదురింటికి వెళ్ళి మాట్లాడి వచ్చేవాడు. మామూలు మాటలు మధ్య మధ్యలో చిన్నప్పటి కబుర్లు ... ఆమె ఎక్కువసేపు నిశ్శబ్ధంగా ఉండేది. మాట్లేడేందుకు బాధపడేది.. మాట్లాడబోతే దగ్గు తెరలు తెరలుగా వచ్చేది. దగ్గి దగ్గి నెత్తురు కక్కి నిశ్శబ్ధంగా పడుకుండిపోయేది. ఒకటి రెండు మాటలు మాట్లాడినా స్వరం తెగిపోతూ వికృతంగా వినిపించేది. "నువ్వెందుకు పెళ్ళిచేసుకోలేదు!", "ఏమీ ఉద్యోగం లేకుండా.. ఎందుకిలా ఉన్నావు? " ఇలాటి తెగిన ప్రశ్నలు.

అతడు ఒకనాడామెతో అన్నాడు "వల్లీ! ఇలా చూడు. రవిని గురించి కనుక్కున్నాను. అతను ఇల్లు ఖాళీ చేసి బెంగుళూరులో ఎక్కడికో వెళ్ళిపోయాట్ట.. బ్యాంకులో డబ్బంతా విత్ డ్రా చేసుకుపోయాడు. అసలు నీకు తెలీదేమో, మీ పెళ్ళయిన ఆర్నెల్లకే అతనింకొక పెళ్ళి చేసుకున్నాడు. అది ఎటువంటి పెళ్ళో తెలియదుగాని మొత్తం మీద మరో అమ్మాయితో ఉన్నాడిన్నాళ్ళూ.. ఇప్పుడిక వెళ్ళిపోయాడు" ఆమె వింటూ నవ్వుతూ తలవూపింది.

సేతురామన్ కాసేపు ఏమీ మాట్లాడలేదు. సేతురామన్ ఆశ్చర్యపోయి "అయితే ఇన్నాళ్ళనుంచీ అంతా నీకు తెలుసా? అని అడిగాడు. ఆమె మళ్ళీ తల ఊపింది. సేతురామన్ కాసేపు ఏమీ మాట్లాడలేదు. కొన్ని క్షణాల తర్వాత లేచి "డాక్టరు దగ్గరికి తీసుకు వెడతాను రా.. నేనంతా కనుక్కున్నాను. ఇప్పుడేమీ ముంచుకుపోలేదు ఇప్పుడైనా ఆపరేషన్ చెయ్యచ్చు.... ఆపరేషన్ చేస్తే ప్రాణం దక్కుతుందన్నాడు డాక్టరు.." అన్నాడు.

ఆమె చివాలున తలయెత్తి "ప్రాణం దక్కుతుంది కానీ గొంతు పోతుంది. జీవితాంతం మూగగా గొంతులేకుండా బతకాలి.." అన్నది.

"అవును.. గొంతు లేకపోతేనేమి? నువ్వు బతుకుతావు.. బతకాలి" అన్నాడతను.

ఆమె లేచి నిశ్చయంగా అన్నది. "గొంతు ఉండదు. కూనిరాగం తీయడానికి కూడా వీల్లేదు. మాట్లాడేందుకు వీల్లేదు.. కానీ, తినొచ్చు.. తిరగొచ్చు. అంతేగా?" ఆమె కళ్ళలో చిత్రమైన వెలుగు... ఆ వెంటనే పెద్ద పెద్ద కళ్ళలో నీళ్ళు.

కొద్ది క్షణాలాగి "చిన్నప్పటినుంచీ స్నేహితుడివి. నీకు తెలియాలి. గొంతు పోయిన తరువాత నేను బ్రతకనక్కరలేదు. బ్రతకడం అనవసరం. గొంతు ఉండగా త్వరగా పోతేనే మంచిది.." ఈ మాటలని ఆమె లోపలికి వెళిపోయింది.. ఇక చెప్పేదేమీ లేదన్నట్టు.

సేతురామన్ లేచాడు. అతని ఎదురుగా పెద్ద డాక్టరు వచ్చాడు. ఈయనకు నలభై అయిదేళ్ళుంటాయి. అంత ప్రసిద్ధ గాయని పంకజవల్లి ఆస్పత్రిలో ఉన్నట్టు ఎవరికీ తెలియదు. ఆయన అనుకోకుండా రిజిష్టరు చూసి మూడురోజులు క్రిందటే వచ్చాడు. ఫలానా అని

తెలుసుకుని ఆశ్చర్యంతో ఉక్కిరి బిక్కిరై అన్ని వివరాలు సేకరించి, ఇతర డాక్టర్లతో మాట్లాడి కేసు పూర్వపరాలు విచారించాడు. తరువాత మళ్ళీ వచ్చి కోపంతో "అంతా అయిపోయిన తరువాత తీసుకొచ్చారా భార్యని ఇక్కడికి?" అని అడిగాడు. సేతురామన్ అంతా వివరంగా చెప్పగా విని నిట్టూర్చి వెళ్ళిపోయాడు. నిన్నా మొన్నా కూడా వచ్చాడు.

ఇప్పుడు రాగానే "మీరిక్కడే ఉన్నారా?" అని అడుగుతూ గుమ్మందాటి లోపలికి వెళ్ళాడు.

"మరెక్కడుంటాను?" అని గొణుక్కున్నాడు సేతురామన్. "కథ ముగిసేవరకూ ఇక్కడుండవలసినవాణ్ణే.. తరువాత ఏమో!?" అనుకున్నాడు.

చేతి వ్రేళ్ళు విరుచుకుంటూ "ఆమె కొక్కసారి తెలివి వచ్చి కళ్ళు తెరిస్తే.. తాను ఒక్కమాట చెప్పగలిగితే తన గుండె చప్పుడు వినిపించగలిగితే ఎంత బాగుండు...." అనుకున్నాడు. "వల్లీ! మై హార్ట్!! నేను మొదటి నుంచీ నిన్ను ప్రేమిస్తున్నాను నిన్నే ప్రేమిస్తున్నాను."

అంతలో అకస్మాత్తుగా వెచ్చని గాలి కెరటం ఒకటి వింతగా వెర్రిగా వీచింది. చెట్ల ఆకులు జలజల రాలాయి.

మరుక్షణంలో డాక్టరు బయటికి వచ్చి చప్పట్లు చరుస్తూ పెద్దగా " అక్కడ? రంగయ్యగారిని రమ్మను.. అర్జెంట్.." అని లేచాడు.

సేతురామన్ ఒణికే కాళ్ళతో నాలుగు అంగల్లో లోపలికి వెళ్ళాడు. గాలి విసురుకు పంకజవల్లి ముఖం మీది దుప్పటి కొద్దిగా తొలగించి ఒణుకుతున్న వ్రేళ్ళతో శుష్కించిన ఆ చెక్కిళ్ళు నిమిరాడు. 'ఇదే నిన్ను నేను తాకడం' అనుకున్నాడు. కళ్ళవెంట నీళ్ళు ధారాపాతంగా వచ్చేవే కానీ.. అంతలో దుప్పటి కప్పి, దుఃఖం మింగుకుని ఇవతలికి వచ్చాడు.

డాక్టరు నిన్న, ఎవరో తెలిసిన పత్రికా విలేఖరికి ఈ విషయం మాటల సందర్భంలో చెప్పాడు. అతడిప్పుడు వచ్చాడు. డాక్టరు అతన్ని చూసి "నేన్నిన్న చెప్పలేదూ? ఆమె... ఇప్పుడే పోయింది!" అన్నాడు.

'అరె' అన్నాడు పత్రికా విలేఖరి ఆశ్చర్యంతో.

పది పదిహేను నిమిషాలు గడిచాయి.

సేతురామన్ అలాగే స్థంభానికి ఆనుకుని నిలబడి చూస్తున్నాడు. లోపలి నుంచి శవాన్ని తీసుకురావడం, స్ట్రెచర్ మీద పడుకోబెట్టడం అయిదారుగురు చేరారు. సన్న సన్నగా గొంతులు వినిపిస్తున్నాయి.. ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

"ఎవరు? ఎవరుట పోయింది?"

"పాటలు పాడుతుందా?"

"ఏవైనా సినిమాల్లో పాడిందా?"

స్ట్రెచర్ తోసుకుంటూ వెళ్ళిపోయాడొక వ్యక్తి. డాక్టరు అలాగే వరండాలో నిలబడి ఉన్నాడు.

సేతురామన్ కళ్ళు అప్పుడు నీళ్ళతో నిండాయి. చొక్కా చివరతో కళ్ళు తుడుచుకుని, ఒణికే వ్రేళ్ళతో బీడీ నోట్లో పెట్టుకుని, గబగబా ఆస్పత్రి గేటుదాటి, వీధిలోకి వచ్చి అటూ ఇటూ చూశాడు.. కొట్టు ప్రక్కనే వేలాడుతున్న తాడుతో బీడీ ముట్టించుకున్నాడు. ఒక్కసారి గుండెల నిండుగా పొగపీల్చి వదిలాడు. అంతలో బీడీ విసిరి - స్టేషన్ పక్క పేవ్‌మెంట్ మీద కొంతమేర చేత్తో తుడిచి అక్కడే - పరుచుకు పడుకున్నాడు. నీళ్ళూరుతున్న కళ్ళను మూసుకున్నాడు. అంతలోనే అతనికి నిద్రపట్టింది.

నిద్రలో.. గుంపులు గుంపులుగా పచ్చ పచ్చగా కళకళలాడుతున్న గంధపు చెట్లు తగలబడిపోతున్నట్టు కల..!!

✡✡✡

మరపురాని ఆ వూరు

జమదగ్ని

(ఏప్రిల్ । ౨౪౫ భారతి మాసపత్రికలో ప్రచురితమైనకథ)

"కొండ లెక్కడమంటే జ్ఞాపకం వచ్చింది" అదొక విచిత్ర సన్నివేశం.

ఆ సంగతి తలుచుకుంటే చాలు, నాకిప్పటికీ ఒళ్ళు గగుర్పొడుస్తుంది. తక్కిన జీవితంలో సంబంధం లేకపోయినా, ఒక్కొక్క సన్నివేశం. అలా హృదయానికి హత్తుకుపోయి, చివరిదాకా అనుభవస్మృతినిస్తూనే ఉంటుంది సుమా!

ఇప్పటిమాటా? ఎన్నేళ్ళయిందో అది జరిగి! అయితే ఏం, ఆ అనుభవం అలాంటిది!

నువ్వు మదనపల్లి ఎరుగుదువా? ఎరగవూ? అదేమిటోయ్! పోనీ, దగ్గులాసుపత్రని విన్నావా? అదావూళ్ళోనే ఉంది.

అక్కడికి పదిమైళ్ళదూరంలో తెట్టని చిన్నపల్లెటూరుందోయ్. ఆ ఊళ్ళో మా స్నేహితుడొకడుండేవాడు. వాడూ, నేనూ చిన్నప్పుడు ఏలూరులో చదువుకునేవాళ్ళం.

అక్కడెక్కడో ఊరివాడు ఇందాకా ఎందుకు వచ్చాడనుకుంటావేమో! వాడికి పసితనంలోనే తల్లిపోయింది. అంచేత చిన్నప్పటినుంచీ అమ్మమ్మ దగ్గరే మేనమామల ఇంట్లో పెరిగేవాడు. ఆ మేనమామకి ఏలూరులో ఉద్యోగమయింది. అందుకోసం ఇందాకా రావలసివచ్చింది.

సరేనా? వాడిపేరు రామచంద్రమూర్తి. వాడికీ నాకూ ఎంత స్నేహం ఉండేదో చెప్పడానికే వీల్లేదు. చూచిన వాళ్ళంతా మేమిద్దరమూ అన్నదమ్ములమనే అనుకునేవాళ్ళు. అంత ఆప్యాయంగా ఉండేవాళ్ళమారోజులలో!

నిజంగా ఆ రోజులే వేరోయ్! అప్పుడో రోజయిపోతే అయ్యో, ఎందుకయిపోయిందా అనిపించేది. ఇప్పుడలాక్కాదుగా! సంవత్సరాలు సంవత్సరాలు ఎలా దొర్లిపోతాయో అనుకుంటూవుంటే రోజులమాట లెక్కేమిటి? ఒక్క వ్యక్తులేకాదు, దేశం దేశమంతా ఇలాగే అనుకోవలసిన స్థితి వచ్చినట్టుంది. అవును కదా!

సరే, దానికేం? అసలు సంగతి చెపుతావిను.

నన్ను మా రామం వాళ్ళ ఊరు రమ్మంటూ ఉండడం, నేనేదో వీలుకాక ప్రతిసారీ వెళ్ళకపోవడం, అలా మేమిద్దరమూ స్నేహితులమయ్యాక మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. చివరికి మా రామానికి కోపం వచ్చే పర్యంతమయ్యింది. "పోనీ రావడానికి ఇష్టంలేకపోతే రానని చెప్పెసెయ్యరాదూ?" అనికూడా అనేశాడు.

వాడికి నేనంటే అంత అభిమానం.

నను వాళ్ళ ఊరు తీసుకువెళ్ళాలని వాడికెంత ఉబలాటంగా ఉందో, వాళ్ళ ఊరు వెళ్ళాలని నాకూ అంత ఉబలాటంగానే ఉంది. అయినా అక్కడికి వెళ్ళడం అంత తేలికగా పడిందికాదు.

దానికనేకకారణాలున్నాయి, అప్పుడు నాకు పదహారేళ్ళు. అన్నేళ్ళు వచ్చినా అంతవరకూ మనవూరు విడిచి మరో ఊరు వెళ్ళిన పాపాన పోలేదు. ఇల్లా అన్నానని నాకు భయం వేసి మా రామం ఊరు వెళ్ళలేదనుకోకు.

అప్పుడు మా నాన్న అదోరకంగా ఉండేవారు. సెలవుల్లో నేనింటి దగ్గర లేకపోతే ఆయన కేమీ తోచేదికాదు. అందుకనే నేనెప్పుడు వెళతానని అడిగినా, చెల్లెలి పెళ్ళో తమ్ముడి వడుగో ఏదో ఒక వంక పెట్టి వెళ్ళొద్దనేవాడు. నిజానికా సంవత్సరాల్లో అవీ జరిగాయనుకో! అయినా ఆయనకిష్టం ఉంటే నేనొకవారం రోజుల పాటు స్నేహితుని ఊరు వెళ్ళిరావడం వీటికి ఏమి అడ్డమయ్యేది?

ఆయన తత్వమే అంత! అడిగినప్పుడు ఇష్టమయితే కొండమీద కోతినైనా దింపేవారు. లేకపోతే ఇవతల వాళ్ళు ఏమనుకున్నా ఆయన పంతమే ఆయనది.

అదీకాక మా నాన్న ఒపుకోకపోవటానికి మరోకారణం కూడా ఉంది. అది నా ప్రవర్తనలో ఆయనకు విశ్వాసం లేకపోవడం.

ఇప్పుడంటే ఇల్లా ఉన్నాగానీ ఆ రోజుల్లో నన్ను పట్టపగ్గాలుండేవా! చిలిపితనమూ, సాహసమూ కలిపి చేసిన చిచ్చుబుడ్డిలా ఉండేవాణ్ణి. ఈ ఊళ్ళో కాలువ నేనులేకుండా ఒక్క క్షణం ప్రవహించేది కాదుగదా! అంతటితో సరేనా? ఊళ్ళో కుర్రకారంతా నేను చెపినట్లు వినేవాళ్ళు. రమ్మంటే రావలసిందే, పొమ్మంటే పోవలిసిందే! ఇంతెందుకు? ఆంజనేయుడటూ నేనిటూ అనుకో లంకాదహనాలేమిటి? సముద్రలఘనాలేమిటి, ఓ - మా చిత్తం వచ్చినట్లు చేసేవాళ్ళం. అందుకనే నేనెక్కడికైనా వెళ్ళితే ఏ అఘాయిత్యం చేస్తానో అని మా నాన్న ఊరికే భయపడిపోయేవాడు.

అయితే ఏమాటకామాట చెప్పాలి. అంత అల్లరి చేసినా నాలో ఒక సుగుణం ఉండేది. మా నాన్న కనపడితే చాలు, ఆయన ఏమీ అనకుండానే కుక్కినపేనయిపోయేవాణ్ణి.

అదీ పరిస్థితి! అల్లాంటి నేను, మా నాన్నలాంటివాణ్ణి ఒప్పించి రామం ఊరు వెళ్ళాలి. ఇదేం ఊరికే మాటలతో అయేపనా?

అప్పుడేం చేశామో విను. ఇద్దరమూ కలిసి ఒక పెద్దపన్నాగం పన్నాం. మా రామం ఊరువాడే సుబ్బారావనీ ఇంకోకుర్రాడు మాతో చదువుకుంటూ ఉండేవాడు. వాడికి మేమంటే బాగా చదివేవాళ్ళమని గౌరవం ఉండేదిగాని మాతో అంత చనువుగా తిరిగేవాడు కాదు. వాడి సరదాలన్నీ మరోరకంగా ఉండేవి. ఒక్కొక్క మాస్టార్ని అనుకరించి వాడు కబుర్లు చెబుతూ ఉంటే పొట్టచెక్కలయ్యే నవ్వొచ్చేది. మేం వాడి దగ్గరికి వెళ్ళి ఉన్న విషయం చెప్పాము. వాడికి నిజంగానే మా మీద జాలివేసింది

అప్పుడు సుబ్బారావు 'ఒరేయ్, నువ్వు రామాన్ని తీసుకుని మీ ఊరు వెళ్ళిపో! తర్వాత ఒకటి రెండు రోజుల్లో నేనక్కడికి వస్తాను. మనపని ఎందుకు కాదో చూద్దాం' అని నాతో అన్నాడు.

సరే అంటే సరే అనుకున్నాం. నేనూ, రామం మన ఊరు వచ్చేశాము.

ప్రతి ఏడాదీ అంటున్నట్లు స్నేహితుడి ఊరు వెళ్తాననక వాణ్ణే ఊరు తీసుకు వచ్చినందుకు మా నాన్న చాలా సంతోషించారు.

రామం నాతో ఇదివరకే రెండు మూడు సార్లు రావడం వల్ల వాణ్ణి ఇంట్లో అంతా ఎరుగుదురు. అంచేత మేమిద్దరమూ మా వాళ్ళందరితో కలిసి కులాసాగా కాలక్షేపం చెయ్యడంలో తెలియకుండానే నాలుగురోజులు గడిచిపోయాయి.

అనుకున్నట్టు సుబ్బారావింకా రాలేదు. ఇదేమిటిరా వీడు మోసం చేశాడా అని మాకనుమానం కలిగింది.

కానీ ఆ రోజు పోస్టులోనే రామం మేనమామ వ్రాసిన ఉత్తరం ఒకటి వచ్చింది. వాళ్ళింట్లో ఉండే రామం చదువుకుంటున్నాడు కనుక వీడిక్కడికి రావడం ఆయనకు తెలుసునుకనకా, అల్లా ఉత్తరం వ్రాయడంలో తప్పులేదు కాని వస్తుందని మేమనుకోలేదు కాబట్టి మొదట్లో మాకు భయమే వేసింది.

మా నాన్న ఆ ఉత్తరం చదువుకుని సంగతి సందర్భాలు తెలుసుకున్నారు. రామానికి కూడా చూపించమని నా చేతికిచ్చారు. తీరా దాన్ని చూసాక మేమిద్దరమూ మా గదిలో కూర్చుని ఎంత సంతోషించామో చెప్పతరం కాదు. నా మటుకునాకు ఈ సారి నేను రామం ఊరు వెళ్ళటం అటు సూర్యుడిటు పొడిచినా తప్పదనిపించింది.

రామం మేనమామ వ్రాసినట్లు మూడోరోజు సాయంత్రానికల్లా రామం తండ్రి విశ్వనాధపాక యాజిగారు మా ఊరు వేంచేశారు.

ఆ బిళ్ళగోచీ, ఆ కుండలాలూ, ఆ జారీచెంబూ వీటితో పరమ శ్రోతీయంగా ఉన్న ఆయన్ని చూసేసరికి మా నాన్న పరవశులయ్యారు. ప్రధమవీక్షణంలోనే వాళ్ళిద్దరికీ అపరిమితమైన స్నేహం ఏర్పడింది. ఇక ఆయన మాటలు మానాన్నకమృతమే అయ్యాయి. పదిమాటలెందుకు? ఆయన ఇక్కడ ఉన్న ఒక్కరోజూ కావలసినవన్నీ మా నాన్నే స్వయంగా కనుక్కుంటూ ఒక్కక్షణం కూడా విడిచి పెట్టకుండా అంటిపెట్టుకుని ఉన్నారంటే నమ్ము..

మా రామం మాత్రం తండ్రి అంటే పరమ భయమన్నట్లు మొదట్లో ఏం పలకరించాడో ఏమో మళ్ళీ ఆ పూటకాయన్ని చూడలేదు.

ఆ రాత్రి ఎట్లాగో గడిచిపోయింది.

మర్నాడు పొద్దున్న స్నానాలూ సంధ్యలూ అయింతర్వాత మేమిద్దరమూ సావిట్లో చాపమీద కూర్చుని కబుర్లాడుకుంటున్నాము, మా నాన్నా, ఆయనా అప్పుడే వచ్చి కుర్చీల్లో కూర్చున్నారు. ఏమవుతుందో ఏమో అని మా ఇద్దరికీ మహా భయంగా ఉంది. లేచిపోదామని కూడా అనిపించింది కానీ అదేం ప్రమాదానికి దారితీస్తుందో అని మళ్ళీ అలాగే ప్రయత్నపూర్వకంగా చతికిలబడ్డాము.

"ఏరా రామం!" అన్నారు విశ్వనాధంగారు.

రామం ఆయనవంక మొహం బిగబట్టుకు చూచాడు.

అంతలో ఆయనే "అల్లా బెంబేలు పడతావేం? ఇలాంటి స్నేహితులతో సావాసం చేస్తే ఎవరు మాత్రం ఏమంటారు? స్నేహం కొద్దీ వచ్చావు, నాలుగురోజులున్నావు, బాగానే ఉంది. మరయితే ఎప్పుడూ నువ్వు వాళ్ళింటికి వెళ్ళడమే గానీ అతన్నికూడా ఒకసారి మనింటికి తీసుకురావటం అక్కర్లేదా ఏమిటి? " అన్నారు.

నేనయినా, రామమయినా ఆయనలా అంటుంటే ఏమనగలం! ఇంత ప్రయత్నమూ ఏదో వెకిలి మాటని పాడుచేసుకోవడం ఇష్టంలేక గుండెలు గుబుక్కు గుబుక్కుమంటుంటే అట్లాగే కూర్చున్నాము.

మళ్ళీ ఆయనే మా నాన్న వంక తిరిగి "ఏవండీ శాస్త్రిగారూ! ఏదో పసితనం కొద్దీ మా వాడికి తోచలేదు. నేను స్వయంగా అడుగుతున్నాగా, మీవాణ్ణి మాతో పంపించండి. ఒక వారం రోజులపాటు ఉండివస్తాడు. అబ్బాయి క్షేమం విషయంలో నేను జాగ్రత్తపడతాను. అందునిమిత్తమై ఈషణ్మాత్రమైనా మీరు సంకోచించవద్దు. నా మాట నమ్మి మీరు ఊc అనండి, మీవాణ్ణి మళ్ళీ పువ్వుల్లో పెట్టి అప్పగించేస్తాను" అన్నారు.

మా నాన్న ఏమీ మాట్లాడలేదు. కానీ ఆయన ముఖంలో సౌమనస్యం గోచరించింది.

"నాన్నగారు ఒప్పుకున్నట్టేనోయ్, నువ్వింక భయపడక్కరలేదు. లేచి కావలసినవన్నీ సర్దుకో. భోజనమవుతూనే బయలుదేరాలి" అంటూ విశ్వనాధం గారు తొందరపెట్టేశారు.

అంతకు ముందు నుంచీ అవకాశం కోసం చూస్తున్న మేమిద్దరమూ వెంటనే లేచి వెళ్ళిపోయాము.

పదింటికల్లా భోజనాలయ్యాయి.

మా నాన్న నన్ను ఏకాంతంగా పిలిచి, చెప్పవలసినవన్నీ చెప్పి, ఒక పాతిక రూపాయలిచ్చారు.

అప్పుడు నాకు కలిగిన సంతోషమూ, నేను పొందిన కృతజ్ఞతాభావమూ ఇంతా అంతా కాదు. అయినా ఆ సందర్భంలో అవి బయటికి రాలేక లోపల్లోపలే అణిగిపోయాయి.

విశ్వనాధంగారు బయలుదేరుతూ ఉంటే "పోనీ రేపు వెళ్ళరాదా!" అని మా నాన్న అన్నారు గాని "బాబ్బాబూ! ఆ మాట మాత్రమనకండి. సంసారంలో దిగాక ఒక్కరోజు ఇల్లు విడిచిపెట్టడమంటే ఎంత ఇబ్బందో మీకు తెలియందికాదు. అందులో నాకు లక్షా తొంభై పనులు. ఇప్పటికే నాలుగురోజులయింది. ఈసారికిలా కానివ్వండి. పరిచయాలు కావాలేగాని రాకపోతామా, ఉండకపోతామా? మరయితే నావంతు ఇంతమాత్రమయినా అయింది. ఇక మీ అనుగ్రహం ఎప్పుడు కలుగుతుందో ఏమో! నాకు సెలవిప్పించండి" అని అంటూనే మా వంక చూసి "ఇంకా చూస్తారేమ్రా, పదండి, రైలు వేళవుతోంది" అని విశ్వనాధంగారు మమ్మల్ని హెచ్చరించారు.

నేనూ, రామం మావాళ్ళందరితో వెళ్ళొస్తామని చెప్పి వీధిలో అడుగు పెట్టాము. మా నాన్న అదీ ఇదీ జ్ఞాపకం చేసుకుని హెచ్చరిస్తుంటే కొంచెం మెల్లగా నడుస్తున్నాము. అంతలోనే విశ్వనాధంగారు చాలా దూరం వెళ్ళిపోయారు.

తర్వాత స్టేషను చేరుకున్నా ఆయన్ను అందుకోవడం మాకు చాలా కష్టమయింది. కాని మా సుబ్బారావు మాత్రం అక్కడ మాకోసం కాచుకు కూర్చుని ఉన్నాడు.

✡ ✡ ✡

అలా వెళ్ళామా ఊరు.

అందుకే ఆ ఊరంటే నాకంత అభిమానం.

నువ్వే ఇల్లాంటి పరిస్థితుల్లో ఏదయినా ఊరు వెళ్ళావనుకో ఆ ఊరు మరచిపోగలవా?

నీకే కాదు ఎవ్వడికీ సాధ్యం కాదు.

అవునా మరి, అల్లాంటప్పుడు ఆ ఊళ్ళో నేనున్నట్టే నాలుగురోజులుండి నాకు కలిగిన అనుభవాల లాంటివే నీకూ కలిగితే ఇంకెల్లా ఉంటుందో చూడు.

అయినా అభిమానం కొద్దీ అనుకోవడమేగాని, నిజానికి మన ఊళ్ళల్లో అందమేముందోయ్. ఎంతదూరం చూసినా కన్ను నొప్పిపుట్టేట్టు మాగానీ చేలేగా! పంట ఉన్న నాలుగురోజులూ పైరుతో మిసమిసలాడుతూ పచ్చగా ఉన్నా ఆ తర్వాత పెద్ద బట్టతలలాగా వట్టి బయలు ప్రదేశమేనాయె. పుట్టింది మొదలు చచ్చేవరకూ తినడమూ కనడమూ తప్ప మరో అనుభూతే లేని మనిషి జీవితంలాగా అంతా సమతల ప్రదేశమే. అయితే అందులో ఆకర్షించేందుకేముంటుంది? ఎత్తులూ, పల్లాలూ ఉండాలి. ఆగాధాల్లో పడిలేచి ఆకాశాన్నందుకోవాలి. దేశం గాని, జీవితం గాని అప్పుడే హృదయంగమనువతాయి.. ఏమంటావ్? అవునంటావా, కాదంటావా?

నిజంగా మనకావూళ్ళు దగ్గరైతే ఎంత బాగుంటుంది? మన నదీజలాలతో ఆ కొండలు కలిసి సౌందర్యం పరమావధి అందుకోరూ?

అనుభవించే యోగ్యత లేక, రాకపోకలు మానేసి, ఆత్మవంచన చేసుకుంటూ సౌందర్యాన్ని చూడలేకపోతున్నాంగాని, నిజానికివిమాత్రం ఏమంత దూరం?

స్నేహితుని మీది అభిమానం చేతనేమో అప్పుడు నాకా ఊరు దూరమే అనిపించలేదు.

వెళ్ళాను, ఆ ఊళ్ళో అడుగుపెట్టాను. మళ్ళీ ఇంటికి రాబుద్ధివెయ్యలేదంటేనమ్ము.

రకరకాల కొండలు, అడుగడుక్కీ ఊటవాగులు మండువేసవిలో కూడా మిసమిసలాడే పంటలు. ఎర్రని నేలా, పచ్చని చెట్లూ! చూపు సారించి చూస్తే అనంతమైన వైవిధ్యంలో ఆత్మకింపైన సామరస్యం.

ఆ ప్రాంతాలే అంత! అందులో ఆ ఊరు మరీనీ!

వెళ్ళినదగ్గర నుంచీ ఒక క్షణం కూడా వృధా చెయ్యకూడదనిపించింది నాకు. రెండురోజులబట్టీ నిద్రలేదు. ఇవాల్టికి వద్దని మా వాళ్ళిద్దరూ మానేసినా నే మాత్రం ఊరుకోలేదు.

ఒంటరిగానే బయలుదేరి ఊళ్ళోకి వచ్చిన దారే అనుసరించాను.

ఆ ఊరు నానుకునే చుట్టూ తిరిగి ఒక పూటవాగు పారుతోంది. అందులో అన్నికాలాల్లోనూ నీళ్ళుంటాయి. అల్లాంటివే ఆ ప్రాంతాలవాళ్ళకు కామధేనువుల్లా ఉపకరిస్తుంటాయి.

దానివెంబడి వెళదామంటే పాదలూ గట్రా ఉండి వీల్లేక నీళ్ళల్లో నడుస్తూనే కొంతదూరం వెళ్ళాను. అక్కడ అది రెండు పాయలుగా చీలిపోయి మధ్యన ఇసకమేటవేసి ఒక లంకగా ఏర్పడింది. చుట్టూరా బిలబిలమంటూ నీళ్ళు పారుతూ ఉంటే ఆనందమయి అక్కడ కాసేపు కూర్చున్నాను.

అంతలో మావాళ్ళు ఏమనుకున్నారో ఏమో, నాకోసం వెతుక్కుంటూ అందాకా వచ్చారు.

అక్కడ కూర్చున్నంతసేపూ ఆ వాగు పుట్టినచోటు దగ్గరికి ఎలావెళ్ళడమా అని ఆలోచిస్తూనే ఉన్నాను. ఇదివరలో మా రామం చెప్పినదాన్ని బట్టి ఆ చోటు ఊరికి మూడు మైళ్ళదూరంలో ఉంది. అందాకాగా వాగుతోనే నడవాలంటే చాలా కష్టం. వాగు వెంబడే పోదామన్నా బొత్తిగా దారిలేదు. కొండల మీదుగా వెళ్ళేదారేదో ఉందన్నాడుగాని అది నాకు తెలియదు.

వీళ్ళు రావడంతోటే నా ఉత్సాహం అధికమై, " పోదాం, రండర్రా" అన్నాను.

"మూడుమైళ్ళు వెళ్ళి, మూడు మైళ్ళు రావాలి. రేపు పోదాం లేవోయ్" అన్నాడు సుబ్బారావు.

"ఇప్పుడు మూడయింది. వెళితే ఒకగంట సేపన్నా అక్కడ కూర్చోవాలి కదా! వచ్చేటప్పుడు చీకటి పడిపోతుందేమో" అన్నాడు రామం.

అలావాళ్ళు ఎంత వెనక్కి తీసినా నేను ఊరుకోక చివరికి "మీరు రాకపోతే పోనీలెండి. నాకు దారి చూపించండి. నేను వెళ్ళివస్తాను" అన్నాను.

దాంతో తప్పనిసరై వాళ్ళూ బయలుదేరారు.

అదంతా వట్టికొండలదారి. అల్లాంటిచోట నడిచే అలవాటు నాకు లేదోయ్. అంచేత కొంతదూరంవరకూ, రావడానికి ఉత్సాహంలేని మా వాళ్ళే ముందు నడిచారు. కాని తర్వాత నాకూ అలవాటయి మా వాళ్ళే నాతో నడవలేకపోయారు.

అల్లా ఒక్క అరగంట నడిచాము. అంతసేపూ నేనుమాత్రం నాలుగు పక్కలా చూస్తూ తన్మయణ్ణవుతున్నాను.

అకస్మాత్తుగా "అదిగో బుగ్గ! " అన్నాడు మా రామం. బుగ్గ అంటే భూగర్భం నుంచీ జలం వచ్చే చోటు.

వాడామాట అనేవరకూ నేనటు చూడనేలేదు.

ఎదురుగా పల్లంలో ఒక పెద్దరావిచెట్టు ఆకులాడిస్తూ ఆహ్వానిస్తోంది.

దానికి పదిగజాల దూరంలో సన్నని ఏరు బిలబిలమంటూ ప్రవహిస్తోంది.

మేం దిగుతున్న కొండ ఇటు దక్షిణానికుంటే ఆ ఏరుకటువైపు ఉత్తరంగా మరొక చిన్న కొండ ఉంది. ఈ రెంటి మధ్య ఆకాశాన్నీ ఆ రావిచెట్టు కొమ్మలే ఆక్రమిస్తున్నాయి.

ఆనందం పట్టలేక ఎన్నాళ్ళ బట్టో చూడాలనుకుంటున్న తల్లికోసమన్నట్టు పరుగెత్తుకుపోయి ఆ చెట్టుమొదట చేరాను.

అక్కడ చూద్దునుకదా, కొండమీదికి కనిపించిన పాయకు కొంచెం పైగా విశాలమైన సమప్రదేశంలో వందలకొలది నీటిపాయలున్నాయి. అక్కడికి తూర్పుగా మళ్ళీ అన్నీ గుట్టలే! ఆ గుట్టల్లో ఉన్నది బుగ్గ! అక్కడినుంచీ నీళ్ళు బయలుదేరి ఇలా పాయలు పాయలుగా వస్తున్నాయి.

ఆ రావి చెట్టు క్రింద ఒక బండ ఉంటే ఆ బండమీద కూర్చున్నాను.

అప్పటికి పాద్దువాలి చెట్టుకొమ్మలకిందుగా నీటిపాయల మీద వెలుగుపడుతోంది.

కొన్ని పాడుతున్నాయి. కొన్ని నృత్యం చేస్తున్నాయి. కొన్ని పాము నడకలు నడుస్తున్నాయి. కొన్ని కొంటెపోకడలు పోతున్నాయి. ఉన్నట్టుండి బుసబుసా పొంగేది పొంగుతుంటే ఇదివరకు నుంచీ సందడి చేస్తున్నవి ఉడిగిపోతున్నాయి. ఇవన్నీ వచ్చి వచ్చి నేకూర్చున్న బండదగ్గరే ఏకమయి అసలు బాగుగా ముందుకు పోతున్నాయి.

సింహాసనంలాంటి ఆ బండమీద కూర్చుని ఎదురుగా చూస్తూ ఉంటే వరుణదేవుని సభలో కూర్చున్నట్లే ఉన్నది.

సూర్యకాంతి పడి ఆ పాయలన్నీ జలకన్యలలా కనిపించాయి. తళ తళ మెరుస్తూ బిలబిలమంటూ అవి పారుతూ ఉంటే నా గుండెల్లో ఆనందం జలపాడిచింది.

జలాధిదేవత ముగ్ధమోహన సౌందర్య వికాసం అంతా అక్కడే ఉంది.

సౌందర్యం, సంగీతం, కలకల వివాదం, వింత వింత సువాసనలు - ఏం లేదక్కడ? సృష్టిలో లోచనీయమైన వస్తుసముదాయమంతా అక్కడే ఉంది.

అంతలో వేళయింది కాబోలు, మేతకు తిరుగుతున్న మందనంతటినీ చేరదీయడానికి గొడ్లకాపరి కుర్రాడొకడు పిల్లనగ్రోవి ఊదసాగాడు.

ఆ సందర్భానికి ఈ మధురధ్వని తోడయి నా హృదయాన్ని తన్మయం చేసేసింది. జీవితంలో ఒక్క మాటైనా అట్లాంటి దృశ్యాన్ని చూచి ప్రకృతి రమణీయకంలో తన్మయంకాకపోతే ఇంకా బ్రతుకెందుకనిపించింది.

అల్లా అక్కడ ఎంతసేపు కూర్చున్నానో ఏమో మా వాళ్ళు ఏం చేస్తున్నదీ కూడా నాకు తెలియదు.

ప్రాపంచిక విషయాల్లో మునిగి తేలుతూవుంటే మనబోటి వాళ్ళకే ఇంత సంతృప్తి నిచ్చాయంటే మహర్షులిల్లాంటి చోట్లను తమ నివాస స్థలాలుగా చేసుకోవడంలో ఆశ్చర్యం ఏముంది?

సముద్రం ఉందనుకో - అదొక పెద్ద ప్రపంచ చరిత్ర. మహానదులున్నాయనుకో - అవి సుదీర్ఘ కావ్యాలు. మరి ఈ సెలయేళ్ళో - ఇవి ఆ పాత మధురాలైన గేయకావ్యాలు.

వీటి సాగసే వేరు - వీటి ఆనందమే వేరు.

మనిషయి ఉండి మనసప్పగిస్తే చాలు, ఎల్లాంటి వాణ్ణయినా స్వర్గలోక విహారం చేయిస్తాయి.

"ఇక లేవయ్యా పోదాం" అని మా రామం వేసిన కేక ఎంతో ఎత్తున తిరుగుతున్నవాణ్ణి అమాంతంగా కిందకి లాగినట్లు నా మనఃప్రశాంతికి భంగం కలిగింది.

"చీకటి పడుతోంది. ఇంటికి వెళ్ళాలి" అన్న విషయం అప్పటికి గానీ నాకు తోచింది కాదు.

✡✡✡

ఇక ఆ ఊళ్ళో ఉన్నన్నాళ్ళూ అలాంటి దృశ్యాలెన్ని చూశానో లెక్కలేదు. ఏ కొండమీదికే సమయంలో వెళ్ళినా సరే ఏదో అద్భుతం కనిపిస్తూనే ఉంటుంది.

మనం వెళ్ళాలేగాని చూడదగినవి ఎన్నున్నాయోయ్ అక్కడ!

నువ్వెప్పుడైనా ఎత్తిపోతలని విన్నావా? మనవైపున అల్లాంటి మాటే వినపడదు. ఎంతకమ్మని తెలుగో చూడది!

మనం జాగ్రఫీ పుస్తకాల్లో చదువుతూ ఉంటామే జలపాతాలన్నమాట, ఎత్తిపోతలంటే.

సూర్యోదయ సూర్యాస్తమయాల్లో అక్కడికి పోయి ఎదురుగ్గా కూర్చో - ఆ నీళ్ళలా కింద పడుతూ ఉంటే నీ మనస్సులా ఊర్ధ్వలోకాలనందుకుంటుంది. ఒక వెయ్యి సూర్యబింబాలు వెచ్చదనం విడిచిపెట్టి కనుల కింపైన కాంతి ప్రవాహంగా మారి నీ ముందు నృత్యం చేస్తాయి.

ఆ సంగతి తలుచుకుంటేనే నాకింత తన్మయత్వం కలుగుతోంది. ఇక వెళ్ళినప్పుడెల్లా ఉన్నదో నువ్వే ఊహించుకో!

ఇంతకూ అసలు సంగతి చెప్పనేలేదు.

అది నేనావూరు వెళ్ళిన అయిదోరోజున జరిగింది.

ఆ వేళ మధ్యాహ్నం నేనూ, రామం కూడా సుబ్బారావింటికే భోజనానికి వెళ్ళాం. భోజనాలయ్యాక కబుర్లు చెప్పుకోవడంలో సినిమా ప్రసక్తి వచ్చింది. నాకయితే దానిమీద ధ్యాస పోలేదు గాని మా వాళ్ళ సరదా చూచి నేనొక్కణ్ణే కాదనటం ఎందుకని సరే అన్నాను ముభావంగా.

సరిగ్గా ఆటముందు బయలుదేరడానికి సినీమా ఆ ఊళ్ళో ఉంటేగా! అక్కడినుంచి మదనపల్లికి పదిమైళ్ళు నడిచిపోవాలి. మళ్ళీ రాత్రికి తిరిగిరావడానికి వీల్లేదు. అక్కడే పడుకుని పొద్దున్నే రావాలి.

"రోజూ ఇన్ని కొండలెక్కుతున్నాము. ఈ మాత్రం వెళ్ళిరాలేమా ఏమిటి? అందులో ఎన్నడూ లేంది మంచి సినిమా వచ్చింది. శాంతారాం తీసిన రామరాజ్యంట. పోదామంటే పోదా"మన్నాడు మా వాళ్ళిద్దరూనూ.

నేను సరే అని పూర్తిగా ఒప్పుకున్నాక మేమిలా మదనపల్లి వెళుతున్నట్టూ రాత్రికి రానున్నట్టూ రామం వాళ్ళింటికి కబురంపించాడు.

ఇక మా సుబ్బారావు పొద్దున్నే స్నానాలు చేసేందుకని మూడు తుండుగుడ్డలూ, ఒక సబ్బుబిళ్ళా వగైరాలు సంచిలో పెట్టీ దారిలో ఫలహారానికని మసిబారకుండా కుండలో వేయించిన వేరుశెనక్కాయలూ, పటికబెల్లంలాంటి గట్టి బెల్లపచ్చు కొంతా జాగ్రత్త చేసి బయలుదేరదీశాడు.

మేం ముగ్గురమూ ఇల్లూ వాకిట్లో అడుగుపెట్టాము - ఎదురుగా పెద్ద కుంకుమ బొట్టుతో లక్ష్మీదేవిలాంటి సుబ్బారావు తల్లివచ్చి "ఇంత ఎండలో బయలుదేరారేమ్రా ముగ్గురూనూ? ఇంకా ఎక్కవలసిన కొండలున్నాయా ఏమిటి? " అన్నదివేళాకోళంగా.

"కాదమ్మా! మదనపల్లికి పోతున్నాను. సినిమాచూసి పొద్దున్నే వస్తాము" అని ఆవిడకు సమాధానం చెప్పి "మీరు ముందు వెళుతూ ఉండండి. ఎందుకైనా మంచిది. నేను వెనకాలే వచ్చి కలుసుకుంటాను" అంటూ సుబ్బారావాగిపోయాడు.

వాడి అనుమానానికి నాకు నవ్వు వచ్చింది. ముగ్గురం బయలుదేరడం దోషమయితే ఆవిడ ఎదురురావడం శుభమేగా, అదీగాక దోషమేమన్నా వచ్చేటట్టయితే బయలుదేరాం కాబట్టి ఎలాగూ వస్తుంది. ఇప్పుడు ఒక్కడు కాసేపాగడం పట్ల ముగ్గురం బయలుదేరినట్లు కాకపోయి ఆ దోషమెలా పోతుందో నాకర్థం కాలేదు.

మేమిద్దరమూ పుంత వెంబడి ఒక ఫర్లాంగు నడిచేవరకూ మా సుబ్బారావు మమ్మల్ని కలుసుకోలేదు. వాడు కూడా మాతో కలిశాక కబుర్లాడుతూ కాళ్ళకు చురుకెక్కించాడు.

ఆ పుంత పొలాలలోంచీ, పల్లెలోంచీ పోయి పోయి మూడు మైళ్ళదూరంలో ఉన్న రోడ్డుతో కలుస్తుంది. అక్కడికి మేం వెళ్ళేటప్పటికి రెండున్నరకూడా అయిఉండదు. ఎండ, వేడి లేకపోయినా, మచి వెలుగ్గా ఉంది ఇంకా నీడలు కూడా పొడుగు సాగడంలేదు.

అక్కడ రోడ్డునానుకునే ఒక చిన్న చెరువుంది. దానికి రెండువైపులా ఒక చక్కని రాతిగట్టూ, ఒకవైపున ఒక పెద్ద కొండా, నాలుగోవేపు వరవలు వచ్చే ఎత్తయిన ప్రదేశం, రోడ్డు కివతల ఉన్న చిన్న చిన్న గుట్టలూ, అటుపక్క కొండా, కొంచెం దూరంలో ఎత్తుమీద ఉన్న తోటలో చెట్లు, రకరకాల పిందె మబ్బులతో ఆకాశం అన్నీ ఆ నీళ్ళలో ప్రతిఫలిస్తున్నాయి.

"ఇక్కడ కాసేపు కూర్చుని వేరుశెనక్కాయలు తిందామ"న్నాడు మా సుబ్బారావు. ఆ సూచన నాకు చాలా సంతోషం కలిగించింది. వీళ్ళు వెళ్ళిపోదామంటారేమో, ఇక్కడ కాస్సేపు కూర్చోడం ఎల్లాగా అని నేననుకుంటూ ఉంటే వాడే ఆ సూచన చేశాడు.

సరే అని అక్కడ కూర్చుని నోళ్ళకు పని చెప్పాము.

నాలుగైదు కాయలు తిన్నానేమో, ఆ తర్వాత నేను మాత్రం ఆ దృశ్యం వంక పారవశ్యంతో చూస్తూ ఉండిపోయాను. వాళ్ళు చూస్తున్నా వేరుశెనక్కాయలు కూడా తింటున్నారు.

అంత అందమైన చోట్లో ఉంటూ కూడా ఆ అందం వాళ్ళకేమీ తెలియలేదు. అవును మరి, పండిత రాయలన్నట్టు అతి పరిచయం అవజ్ఞకు హేతువవుతుంది.

మనప్రాంతాల్లో బెజవాడా, రాజమండ్రి చూడు. అక్కడి కృష్ణలో, గోదావరిలో స్నానాలు చేసి పవిత్రులు కావాలని యావద్భారత దేశం నుండీ ఎంతో మంది వస్తూవుంటారు. ఆ ఊళ్ళో వాళ్ళుమాత్రం వాటిని మంచినీళ్ళగానైనా చూడరు. ఈ నిర్లక్ష్యం ఎందుకంటావ్? అతి పరిచయం వల్లనేగా?

అయితే మనప్రాంతాల్లో వాళ్ళకంటే ఆ ప్రాంతాల్లో వాళ్ళే అనేక విషయాల్లో చాలా మెరుగనిపిస్తారు. వాళ్ళకు సౌందర్యం చూసే తీరిక లేకపోయినా ఉన్న సంపద నుపయోగించుకునే నైపుణ్యం ఎంతైనా ఉంది. మనవాళ్ళకదీ లేదు.

నిజంగా అక్కడా చెరువు కట్టడం ఎంత తెలివితేటలో చూడు, ఎంత ఉపయోగమో ఆలోచించు. అంతగా ప్రకృతిని నమ్మి, తాము కష్టపడి, దాని చేత దాస్యం చేయించుకున్నారు. కాబట్టే వాళ్ళ పూర్వులు సామ్రాజ్యాలు స్థాపించారు, దేశదేశాలూ ఆకర్షించారు. నీవాళ్ళూ, నా వాళ్ళూ ఏంచేశారయ్యా, ఒళ్ళో పడ్డ ఐశ్వర్యాన్ని కూడా రక్షించుకోలేక వదులుకోవడం తప్పవిడిచి?

ఎందాకా చెప్పానో జ్ఞాపకం లేదు. ఆ ప్రాంతం అంటే అభిమానంకొద్దీ ఇల్లాగే ఆవేశం వచ్చేస్తూ ఉంటుంది.

చెరువా? - సరిసరి తెలిసింది!

అక్కడలా కూర్చుని ఉండగా ఆ కొండ ఎక్కి కింద చెరువులో నీడ చూచుకోవాలనిపించింది.

బాగుందా? ఎలాంటి ఊహో చూడు.

ఆ ఊహ తోచడం తడువుగా మావాళ్ళతో అన్నాను. మా రామం ఏ మనసుతో ఉన్నాడో ఏమో "అంతకంటేనా?" అని ఉత్సాహం ప్రకటించాడు. సుబ్బారావు మాత్రం "మరి సినిమా ఎలాగ" అని నసిగాడు. రామానికి కోపం వచ్చి "నీ మొహం నీ మోరాను. వెధవ వేషాలెయ్యక ముందునడు. ఇవ్వాల్టితో ఎగిరిపోవడంలేదుగా, రేపు చూడచ్చులే" అని వాణ్ణి నానా మాటలూ అన్నాడు. వాడూ చేసేదిలేక మాతో కలిశాడు. నేను ముందూ, నా వెంబడే మా రామం, వాడివెనక మా సుబ్బారావు. ఆ వరసలో పర్వతారోహణం చేస్తున్నాము.

ఇదివరకెక్కినవాటికంటే ఈ కొండ చాలా ఎత్తైంది. పైగా మార్గమధ్యంలో ఉన్నది కాకపోబట్టి మనుష్యులు తిరిగినదారేమీ ఏర్పడినట్టు లేదు. పశువులూ, అందులో ముఖ్యంగా మేకలు, మేతకోసం పైదాకా తిరుగుతూ ఉంటే వాటివల్ల సన్నని దార్లు ఏర్పడుతూ ఉంటాయి. అల్లాంటిదార్లు ఈ కొండమీదా ఉన్నాయి. కాని వీటిలో ఒక చిక్కు ఉంది. ఇవేవీ కాకుండా కొండపైదాకా తీసుకుపోవు. మేత ఎక్కడ ఉంటే అక్కడికల్లా పోవడం వల్ల ఏర్పడ్డవి కాబట్టి ఒక దానిలో ఒకటి కలిసిపోయి వైకుంఠపాళీలో పాములాగాకిందికి, నిచ్చెనలాగ పైకి దింపి ఎక్కించి ఆడిస్తూ ఉంటాయి.

అట్లాగే శ్రమపడి అరగంటలో కొండ ఎక్కేశాము.

అక్కడికి పోయాక మార్గం మునుపటికంటే సులువైంది. మధ్య మధ్య కదిలిపోయిన పెద్ద పెద్ద బండలు పడివున్నా వాటి సందుగుండా చక్కని దారికనబడుతూ ఉంది.

ఎదురుగుండా సూర్యుడు జాజ్వల్యమానంగా వెలుగుతున్నాడు.

ఆదర్శం ముందుకు పిలుస్తోంది. వెనకబడ్డ సుబ్బారావుకూడా మాతో కలిసిరాగలుగుతున్నాడు. ఇంకా మాకా ఆలోచన ఎందుకు? నిస్సంకోచంగా ముందడుగు వేస్తున్నాము.

మరో ఇరవైగజాలు వెళ్ళామో లేదో అక్కడ ఒక పెద్ద దిక్కు వచ్చింది. ఇంతవరకూ మేం అనుసరించిన దారి అందాకా వచ్చి, అక్కడనుంచి రెండు వైపులా కొండ దిగిపోవడానికి వీలుగా ఉన్న అడ్డదారిలో కలిసిపోయింది. ఎక్కవలసినవైపున ఎటుచూచినా దారిలేదు. తలెత్తి చూస్తే శిఖరం కనిపిస్తుంది. అక్కడికి మహోవుంటే ఒక వందగజాలు ఉంటుంది. ఆ కాస్తా ఎక్కగలిగితే ఆదర్శం అందుకోవచ్చు. ఎక్కాలంటే మార్గం కనబడటం లేదు. ఏమిటి చెయ్యడం?

వెనక్కి తిరిగి చూశాం. దక్షాధ్వరంలో వీరభద్రుడికి కాలితన్నుతిని పళ్ళూడగొట్టుకున్న సూర్యుడు కూడా మా వంక చూచి పకపకా నవ్వుతున్నాడు.

నాకూ రామానికి మంచి పట్టుదల కలిగింది. సుబ్బారావుకి దిగిపోదామనిపించినా రామం కోప్పడతాడేమో అని బయట కనకుండా ఊరుకున్నాడు.

మేమిద్దరమూ ఎక్కవలసిన వైపు చూశాము.

ఎదురుగా ఏడెనిమిదడుగుల ఎత్తున విశాలమైన రాతిపలక కనిపిస్తోంది. మొదట్లో దారి కనిపించని ఆందోళనలో అదే చాలా ఎత్తున్నట్లు తోచింది గాని ఇప్పుడు మాత్రం అంతకంటే ఎత్తుండడానికి ఎంత మాత్రమూ వీల్లేదని మా లెక్కల పరిజ్ఞానం మమ్మల్ని హెచ్చరించింది. అదిదాటితే ఇంకేముంది, ఆ పైకి చివరిదాకా చక్కనిదారి, స్పష్టంగా కనిపిస్తోంది.

అంతలో "ఒరేయ్! నువ్వు దీనికి జేర్లబడినుంచో, నేను పైకి వెళ్ళిపోతాను" అన్నాడు మా రామం.

వాడికా ఉపాయం తోచినందుకు నాకు మనసులో పరమానందం అయింది.

నేను నుంచున్నాను, వాడు ఎక్కేశాడు.

శిఖరం అందుకోవాలన్న ఆదుర్దాతో "ఒరేయ్ సుబ్బారావ్ నువ్విక్కడ నుంచో, నేకూడా పైకి వెళ్ళిపోతాను" అన్నాను నేను.

వాడు వెంటనే ఒప్పుకునేవాడులాగా ముందుకు వచ్చి, ఆ రాతి పలకకు జేర్లబడి, "నువ్వు పైకివెళతావు బాగానే ఉంది. నన్నేం చెయ్యమంటావో చెప్పి మరీ వెళ్ళు" అన్నాడు.

అప్పటికి గాని ఆ ఉపాయంలో ఆ చిక్కు ఉన్నట్లు నాకు తెలియలేదు.

రామం కూడా నా మాదిరిగా అనుకున్నాడో ఏమో మాకోసం ఉండకుండానే చకచకా పైకెళ్ళిపోతున్నాడు.

"ఒరేయ్ రామం!" అంటూ బిగ్గరగా కేకేశాము మేమిద్దరమూ.

వాడు వినిపించుకునికూడా "రండోయ్! రండి" అంటూ ముందుకుపోబోయాడు.

"ఎలాగోయ్ రావడం? నువ్వు వెనక్కి రా" అంటూ గట్టిగా అరిచాం.

మేం ఊరికే కేకేస్తున్నామని అనుకుని ఉంటాడేగాని నిజంగా అవసరమయిందని రామానికి తోచివుండదు. అల్లా తోచినా తను పబ్బం గడుపుకుని తప్పించుకుపోయేవాళ్ళు లోకంలో చాలామందే ఉండొచ్చు. కానీ మా రామం మాత్రం అలాంటివాడెన్నడూ కాదు. వచ్చిన చిక్కేమిటో స్పష్టంగా తెలియకపోయినా తాను వెనక్కి తిరక్క తప్పదని మా రెండో కేక వాడికి తెలియజేసింది.

వాడు వెనక్కి తిరిగాడు. అందాకా వచ్చాక వాడు మాత్రం ఏం చేస్తాడు అన్న ఆలోచన పోనేలేదు.

ఈ ఆలోచనతో వాడలా వస్తూవుంటే నేనిలా చూస్తూ నిల్చున్నాను. మా సుబ్బారావు నిశ్చింతగా వేరుశెనక్కాయలు తింటూ అడుగునున్నవాటికోసం సంచీ అంతా వెతుకుతున్నాడు.

రామం వచ్చి "ఎందుకూ పిల్చింది? ఇంకా రారేం?"అంటూ చిందులు తొక్కసాగాడు.

"నీకేం నువ్వు గట్టెక్కావు. ఎక్కాంగదా అని వెళ్ళిపోయావు. అంతేకానీ ఇవతలివాళ్ళ సంగతి పట్టించుకున్నావా? నీ ఉపాయంతో మేమిద్దరమూ పైకి రావడం ఎలాగో చెప్పవోయ్ తర్వాత ఎగురుదురుగాని" అంటూ మా సుబ్బారావు వాణ్ణి దబాయించాడు.

ఆ సమయంలో నాకొక ఉపాయం తోచింది.

అప్పుడే రామానికి అసలు సంగతి తెలిసింది.

వాడాదుర్దా కొద్దీ "నా చెయ్యి చాపుతాను అందుతుందేమో చూడండ"ంటూ మా వంక చూశాడు.

"నువ్వు జారిపడితే మేం చావాలి, అదిమాత్రం వద్దుబాబోయ్" అన్నాడు సుబ్బారావ్.

ఈలోగా నేను సంచీలో ఉన్న మూడు తుండుగుడ్డలూ ముడేశాను. సుబ్బారావు పుణ్యమా అంటూ అవి కొంచెం పొడుగువికాబట్టి కలిపితే, ముళ్ళపోను, నాలుగు గజాల తాడు తేలింది. దాన్ని పైకి గిరాటేసి రామాన్ని పట్టుకోమన్నాను. ఏదన్నా చెట్టూ గిట్టూ ఉన్నదేమో అని అటూ ఇటూ చూశాడు కానీ ఏమీ కనబడక, చిట్టచివరికి తానే కూర్చుని అంచున వీలు చూసి కాళ్ళు తన్నిపట్టి తాడు వదిలి సరే అన్నాడు.

నేను కొంచెం లఘువు మనిషిని కాబట్టి దాన్ని పట్టుకుని అలాగ్గా పాకిపోయాడు. మొదట్లో భయమని మొండితనం చేసి "మేమిద్దరమూ పట్టుకుంటాం రా, రాబాబూ" అని మా చేత ధైర్యం చెప్పించుకుని బతిమిలాడించుకుని ఎలాగైతేనేం చిట్టచివరకి సుబ్బారావూ పైకెక్కాడు.

దాంతో ఒక పెద్ద గండం గడిచినట్టేకాదు, స్వశక్తితో ఒక మహా సమస్యను పరిష్కరించుకున్నామన్నంత సంతోషం పొంది, పదినిముషాల్లో శిఖరం చేరుకున్నాము.

అక్కడ పెద్ద బండ ఉంది. మేం చేరిన చోటు దగ్గరినుంచి చూస్తే మామూలు డాబా ఇల్లంత ఎత్తు ఉంది ఆ బండ. ఆ కాస్త మాత్రం ఎక్కకుండా ఎందుకుండాలని దారికోసం దానిచుట్టూ తిరిగాం.

చిత్రం చూడు అచ్చంగా మనుష్యులు పేర్చినట్లే ఒకదానికంటే మరొకటి కొంచెం కొంచెంగా ఎత్తైన బండలు దాని ప్రక్కనే మెట్లలాగా అవతలివైపున ఉన్నాయి.

ఇంకేముంది? గబగబా ఎక్కేసి పైన కూర్చున్నాము.

ఇందాకా మమ్మల్ని ఉద్దేశించి నవ్వినట్లు ప్రకాశించిన సూర్యుణ్ణి చూసి మేమే పగలబడి నవ్వి కసిదీర్చుకున్నాము.

అవునుమరి! ఉత్సాహంకొద్దీ అంతకంతకు పైపైకి వెళ్ళిపోతున్న మాతో రాలేక కాలవశాన దిగజారిపోతున్న ఆ నిలంబ పథికుణ్ణి చూస్తే మా వయస్సులో నవ్వురాక జాలికలుగుతుందా?

నవ్వి నవ్వి శ్రమ తీర్చుకున్నాక మొదట్లో అనుకున్న విషయం జ్ఞాపకం వచ్చింది నాకు, అప్పుడంచు దాకా వెళ్ళి కింద చెరువువంక చూచాను. నా దగ్గరకు మావాళ్ళూ వచ్చి చూచారు.

ఏటవాలుగా ఉన్న కొండకదా, అందుకని మనం ఎంత వెనక్కి వాలితే అంత ఎత్తు కొండ నీళ్ళల్లో కనిపిస్తుంది.

అలావాలి ఎంత వీలయితే అంతా చూశాము.

సూక్ష్మంగానే అనుకో, ఎక్కినకొండా, కూర్చున్న బండా అన్నీ కనిపించాయి. కాని దూరమైపోయి మేం మాత్రం కనిపించలేదు.

ఆ కాస్తలోపమూ జరక్కపోతే నాకాక్షణం జగజ్జేత సంతృప్తి నిచ్చేది. అంశతో హీనమైన ఆ తృప్తి అలాగే ఉన్నది, కానీ ఆ లోపం అప్పటి నా పసి మనస్సును ఒక్క క్షణం సేపు ఎంతెంతో కల్లోలపరిచింది.

ఇప్పుడాలోచిస్తే ఆ కల్లోలానికి హేతువు తెలుస్తోంది. ఎంత కష్టపడి ఏం సాధించినా కర్త యైన 'నేను' మిగల్లేదే అని ఆ క్షోభ. 'నేను' కర్తకానేకాదు. అసలు కర్త జీవుడంటుంది మన వేదాంతం. ఆ వేదాంతం అర్థమయిన వాళ్ళు 'తాము' మిగలకపోవడమే ఆదర్శంగా భావించి ఆత్మోద్ధరణ చేసుకుంటూ లోకాన్ని ఉద్ధరిస్తారు. తెలిసీ తెలియనివాళ్ళు 'తాము' మిగలడమే అసంభవమైనప్పుడు జగమంతా మిథ్యేకదా అని నేటి మన హైందవుల్లాగా ఏమీ చెయ్యకుండా ఊరుకుంటారు.

ఆ క్షణంలో నా మనసులోకి ఇల్లాంటి ఊహలేమీ రానేలేదు. అనుకున్నట్టు కాలేదన్న నిరుత్సాహంతో అవ్యక్తమైన ఆందోళన మాత్రంకలిగింది. అదైనా ఒక్క క్షణం మాత్రమే!

ఆ తర్వాత మళ్ళీ ముగ్గురమూ సరదాల్లో పడిపోయాను.

"మేమిదివరకెప్పుడూ ఈ కొండ ఎక్కలేదురా! నువ్వు రాకపోతే మేం ఎక్కేవాళ్ళమే కాదు. ఎంత బాగుంది? ఎంత బాగుంది!" అంటూ మా వాళ్ళు తెగమురిసిపోయారు.

ఇకప్పుడు మేమాడిన కబుర్లు అన్నీ ఇన్నీ కావు. మా ఊళ్ళో నాటకం, బళ్ళో మేష్టర్లు, ఊళ్ళో పిల్లలూ, మొన్న చూచిన బుగ్గా నీటితో ఉత్సాహం అందుకుని మాకు తెలిసిన ప్రపంచాన్నంతటినీ కబుర్లలో దింపేశాము.

ఆ ఉత్సాహంలో ఆ విశాలమైన బండమీద పడి దొర్లుతూ మేమే రాజుల మనుకున్నామంటే నమ్ము!

అయిందా! అప్పటికీ సూర్యుడింకా వెలుగుతూనే ఉన్నాడు. మా ఉన్నతస్థితిని చూడలేక కాబోలు, ఈర్ష్యాకషాయితరోచిస్సులు కక్కుతూ వెనక్కి వెనక్కి పోతున్నాడు.

అయితే ఏం? కొండమీద వెలుగు బాగానే ఉంది. అప్పుడు మహా అయితే నాలుగయి ఉంటుందని మా ఉద్దేశం. వేసవి పొద్దాయె! ఇంకా గంటసేపు కూర్చున్నా కూర్చోవచ్చు. నా మటుకు నాకు కదులుదామనే అనిపించలేదు.

చూపు సారినంతమేరా చూస్తూనే కూర్చున్నాను.

వేరు వేరు ప్రదేశాలకు వేరువేరు రంగులు వేసి తయారుచేసిన దేశపటంలా చుట్టూ ఉన్న ప్రదేశమంతా కనిపిస్తోంది. కాలిదార్లూ, వాగులూ, రోడ్లూ అంతకంతకూ వేడల్పయిన గీతల్లా కనిపిస్తున్నాయి. దేన్ని చూచినా చక్కగా దిద్దితీర్చినట్లున్నది. దూరాన ఊళ్ళల్లో ఉన్న మట్టిమిద్దెలు, కొండపల్లివాళ్ళ బొమ్మల్లా ఉన్నాయ్. ఉత్తమ సంస్కారవంతుణ్ణి ఇతరుల్లో ఉన్న లోపాలకంటే గుణాలే ఆకర్షించినట్లు ఆ ఎత్తుమీద ఉన్న నా కళ్ళకు ఎటుచూసినా సౌందర్యమే కనిపిస్తోంది.

ఈ నేలకు ఇంత అందమా అంటే ఆ ఆకాశం మరీ అందంగా ఉంది. అదిగో అదిగో అనిపిస్తూనే ఇంకా ఇంకా దూరమైపోయిన ఆకాశం ఆ ఎత్తుమీదికి అత్యద్భుతంగా ఉంది. ఒకమూల ఏ మార్పూ లేకుండా వట్టి నీలంగా ఉంటుంది. అటుచూస్తే ఎంత ఉదాత్తమైన గాంభీర్యం స్ఫురిస్తుంది. మరో మూల పింజె మబ్బులు ఒకదాని మీద ఒకటి పడిదొర్లుతూ రకరకాల సంచారాలు చేస్తూ ఉంటాయి. వాటి వంక చూస్తే మాటలు రాని పసిపిల్లలతో ఆడుకున్నట్టే ఉంటుంది. తూర్పుకు తిరిగితే నల్లమేఘాలు ఒత్తుగా సంచరిస్తూ ఉంటాయి.

కాసేపు ఓ లక్ష ఏనుగులు బారులు తీసి క్రమంగా నడుస్తున్నట్టూ, మరికొంచెం సేపు ఆజానేయహయాలు కదం తొక్కుతున్నట్టు అనిపిస్తాయి. ఇటు పశ్చిమానికి తిరిగితే నభోవలయం దగ్గర భూనభాల మిథ్యాసామరస్యం మంటతో గలసిన పొగలు గ్రక్కుతూ ఉన్నట్టంటుంది.

నువ్వు చూడలేగాని ఆకాశం చూపలేని అద్భుతమంటూ లేదు. అలాదాని వంక చూస్తూ తన్మయులమై ఎంతసేపైనా ఉండవచ్చు. వట్టినేలమీద నుంచి చూసిన దానికంటే ఆ ఎత్తుమీదినుంచి చూడడంలో మరింత ఆనందముంది. ఎందుకంటే, నువ్వక్కడనుంచి నేలనూ,

ఆకాశాన్నీ రెంటినీ చూడగలవు. అప్పుడు నీకళ్ళకు పరస్పర భేదసాదృశ్యాలు స్పష్టంగా గోచరిస్తాయి. అందులో ఉన్న ఆనందం మనచుట్టూ ఉన్నదేమిటో చూడలేక అందని ఆకాశంలోకి మాత్రమే చూడడంలో ఏముంటుంది?

అల్లా చూస్తూ ఉండగానే మరో అరగంట గడిచింది.

మా రామం ఈలపాట పాడుతున్నాడు. సుబ్బారావు దానికి తాళం వేస్తున్నాడు.

నేను వాళ్ళవంక చూసేసరికి ఇద్దరూ ఒక్కసారే "ఇకదిగుదామా?" అన్నారు.

సరే అంటే సరే అని ముగ్గురమూ ఆ బండదిగి "ఇదెంతబాగుందిరా" అంటే, "ఇదెంత బాగుందిరా" అనుకుంటూ కొంత దూరము ఉత్సాహంగానే నడిచాను.

కాని మేము ఎత్తుమీద ఉన్నంతసేపూ బాగానే కనిపించిన సూర్యుడు దిగినకొద్దీ దిగినకొద్దీ కనిపించడం మానేశాడు.

దాంతో ముగ్గురం ముగ్గురమే - గుండెల్లో అధైర్యపడిపోయాము.

మేమున్న చోట అప్పటికే మసక చీకటిగా ఉన్నది. దిగలేక పోతామేమో అన్న భయంతో స్పష్టంగా కనిపించకపోయినా వచ్చినదారి వెంబడే తడుముకుంటూ చకచకా దిగుతున్నాము.

అట్లాగే వెళ్ళి వెళ్ళి ఇందాకా ఎక్కేటప్పుడు కష్టం వేసిన చోటు దగ్గరికి వచ్చేటప్పటికి ఒకరి కొకరం కనిపించడమే కష్టమైంది.

వెనక్కి తిరిగి చూద్దుంకదా మేం కూర్చున్న బండమీద మాత్రం ఇంకా వెలుతురుగానే ఉంది.

కడచింది జ్యోతిష్మంతం - ముందున్నది అగమ్యమైన అంధకారం! ఏమిటి చెయ్యడం?

మా ముగ్గురికీ భయంగానే ఉంది. ఎట్లాగైనా దిగిపోవాలని ఆదుర్దాగానే ఉన్నది.

ముచ్చెమటలు పోస్తున్న శరీరాలతో ముగ్గురమూ మూడువైపులా చూచాము.

ఎటు చూచినా ఏం ప్రయోజనం? నిమిషం గడిచినకొద్దీ పెరిగే అంధకారంగానీ తగ్గేది కాదాయె. కొంతదూరం సాగనిచ్చినట్లే సాగి అక్కడితో ఆగిపోయి అగాధంగా కనిపించడం, దాంతో వెనక్కి రావడం.. తక్కినవాళ్ళు కనబడరేమో అని ప్రతివాడికీ భయమే! చుట్టూరా నీళ్ళు పోస్తే మధ్యనున్న చీమలు అంచుదాకా పోయి, దాటలేక వెనక్కి తిరిగి, దారికోసం తహ తహలాడేటట్టు ధైర్యం కోసం ఒకరినొకరం పిల్చుకుంటూ మేం ముగ్గురమూ కూడా ఆందోళనతో ఆ పరిమితిలోనే తిరిగి తిరిగి వేసారిపోయాను

అప్పుడు నాకు మరో భయం కలిగింది. దిగివెళ్ళేదారి కనుక్కోవడం మాలో ఎవ్వరితరమూ కాదు. ఇది ముమ్మాటికీ నిశ్చయం. ఆ సంగతితెలిసి కూడా ఇంకా కాసేపు అలాగే వృధాచేశామా పైకి వెళ్ళేదారికూడా కనపడకుండాపోతుంది. ఏమూల ఏం ఉంటుందో తెలియక రాళ్ళతో రప్పలతో ఎగుడు దిగుడుగా ఉన్న అక్కడ ఉండిపోవడం కంటె పైకివెళ్ళి ఆ బండ చేరుకోవడం మంచిది కాదూ!

ఈ సంగతే మా వాళ్ళతో అన్నాను.

రాత్రంతా ఇక్కడే ఉండాల్సి వచ్చిందన్న జ్ఞానం కలగక వాళ్ళింకా దిగగలమన్న మాయలోనే ఉన్నారు.

"మీ ఇష్టం. చేతనైతే ప్రయత్నించం"డని నేను మాత్రం వాళ్ళకి త్వరగా జ్ఞానోదయం కలగాలని భగవత్ప్రార్థన చేస్తూ అక్కడే ఒక బండ నానుకుని నుంచున్నాను.

అయిదు నిమిషాలైంది. పది నిమిషాలైంది.

ఇద్దరూ దిగులుపడ్డ ముఖాలతో నా దగ్గరకు వచ్చారు.

ఇంకా ఆలస్యం చేస్తే లాభం లేదని నేను ముందు దారితీశాను. వాళ్ళూ నా వెంబడే వచ్చారు. అప్పటికి పైనకూడా చీకటి కమ్మేస్తోంది.

ఆ చీకట్లో దారి కనుక్కోవడం కష్టమే అయింది. అయినా ఆదర్శం ఎదురుగా కనిపిస్తూ ఉండబట్టి ఇదికాదని అదీ అదికాదని ఇదీ ప్రతి వైఫల్యంతోనూ మార్చేసుకుంటూ వేరు వేరు మార్గాల ననుసరించి చివరికెల్లాగో పైదాకా వెళ్ళగలిగాము.

ఆ మెట్లెక్కి పై బండ చేరుకున్నాకగాని నా గుండె కుదుటపడలేదు.

దానిమీద చతికిలబడి "అమ్మయ్యా" అనుకున్నాను.

భగవంతుడి దయవల్ల ఆ బండ ఒక చిన్న గదంత విశాలంగావుంది అదే అక్కడ లేకపోతే ఏమై పోయేవాళ్ళమో అని ఇప్పటికీ అనిపిస్తుంది.

మావాళ్ళుకూడా పైకివచ్చారుగానీ వాళ్ళకి ఆందోళన తగ్గలేదు. నా మాదిరి చతికిలబడక ఆ బండ మీదే భయం భయంగా అటూ ఇటూ తిరుగుతూ ఎటైనా దిగడానికి వీలుందేమో అని మహాజాగ్రత్తగా చూడటం మొదలు పెట్టారు.

ఆదుర్దా అట్లా చేయిస్తుంది గాని నిజానికక్కడనుంచీ దారెక్కడుంటుంది?

"ఎందుకురా వృధా ప్రయాస? నా మాట విని కూర్చోండి" అన్నాను నేను.

మా సుబ్బారావుకేడుపు వచ్చేసింది.

రామానికి నన్ను మింగెయ్యాలన్నంత కోపం వచ్చేసింది.

నా మూలాన్నే ఇంతపనీ అయిందని వాడి ఉద్దేశం. ఆ స్థితిలో వాడికట్టా అనిపించిందేగానీ, నిజానికి నేనేం చేశాను? నా ధోరణిలో నేనుండిపోయి వాళ్ళు పోదామనేదాకా బయలుదేరలేదు. ఇంకా పెందరాడే వెళదామని వాళ్ళు అని వుండి నేను రానన్నట్టయితేగా - నా మీద నేరం మోపాలిసింది? కాకపోతే నా అంతట నేనే బయలుదేరదామని అనాలిసింది. అలా నేననలేదు. అదీ నా తప్పు.

రామం ఎన్ని అన్నా నేను ఊఁ ఆఁ అనకుండా ఊరుకున్నాను. కాసేపటికి విసుగుపుట్టి వాడిమటుకు వాడూ ఊరుకున్నాడు.

"ఉత్సాహంకొద్దీ వచ్చాము. ముందే జాగ్రత్తపడక ఇబ్బందిలో పడ్డాము. నిజమే! నాకేమీ తోచడంలేదురా!" అంటూ వాడు గుమ్మటిల్లిపోయాడు.

ఆ ముక్క వినేటప్పటికి నాకూ వణుకు పుట్టింది. పైకి నిబ్బరంగా ఉన్నానన్నమాటేగాని అంతకుముందు మాత్రం లోపల భయంలేదనా? అది దీంతో మరీ ఎక్కువైంది.

ప్రవరాఖ్యుడన్నట్టు మిన్నులు పడ్డచోట పడితిమాయె ఆయనకు మాదిరి ఏ అప్సరసో కనిపించి ఊరుకోక మాకు మేమే తోడయితిమాయె! ఎంత భయం వేస్తే మాత్రం ఏమిటి చేసేది?

అప్రయత్నంగా నా కళ్ళు తమంతట తామే మూసుకున్నాయి. మనసు తోచిన ధ్యాన శ్లోకాల నన్నింటినీ చదవడం మొదలుపెట్టింది.

ఆ శ్లోకాల మాటలయితే కదులుతున్నాయిగాని లోపల మెదులుతున్న రూపాలన్నీ భయంకర వన్యమృగాలవే!

మేం కొండలెక్కుతున్నామని తెలియడంతోటే ఊళ్ళో ప్రతివాడూ మమ్మల్ని హెచ్చరించాడు. అడవిలో తిరిగేవాళ్ళు కూడా వెలుగుండగానే వచ్చేస్తారట. చీకటి పడిందంటే ఎలుగ్గొడ్లూ, ఏగోలాలూ కొండలమీద చిత్తం వచ్చినట్లు తిరుగుతాయట! అప్పుడప్పుడవి ఊళ్ళోకికూడా వచ్చి మేకల్నీ, దూడల్నీ గుంజుకుపోతూ ఉంటాయట!

ఇవన్నీ అప్పుడు జ్ఞాపకం వచ్చి కన్నుమూసుకునే ఉన్నా అవితప్ప మ్రొకటి కనిపించలేదు.

నేనలా అణువణువునా వణికిపోతూ కళ్ళుమూసుకునే ఉన్నాను. ఆ స్థితిలో నా పాట్టమీదికి జుట్టులాంటిదేదో వచ్చితగిలింది.

'అమంబాబోయ్ ఎలుగ్గొడ్డు' అంటూ అరిచేశాను. 'ఆఁ ఆఁ' అంటూ మావాళ్ళుకూడా ఉలిక్కిపడి లేచి, నాలుగడుగులు వేసి, అంత భయంలోనూ తామున్నది కొండచివరి బండమీదని జ్ఞాపకం వచ్చి, చటుక్కున కూలబడి, కళ్ళుమూసుకుని ఘొల్లుమన్నారు.

కాసేపున్నాక ఇందాకటి స్పర్శలేనట్లయి నెమ్మదిగా కళ్ళుతెరిచాను. భయం భయంగానే నాలుగుపక్కలా చూచాను. ఎక్కడా ఏమీ లేదు. మోకాళ్ళ మధ్య తలలు పెట్టుకుని మావాళ్ళిద్దరు మాత్రం రెండు పేడముద్దల్లా కూర్చున్నారు.

"ఏమిటో అల్లా అనిపించింది గాని ఏమీలేదురా" అన్నాను బిగ్గరగా!

"సరిగ్గా చూడరా బాబూ, ఏమూలదాక్కుందో" అంటూ మా సుబ్బారావు భయంలోనే గోలపెట్టాడు. "ఏదీ? ఎక్కడాలేందే! " అని నేనంటూ ఉండగా రామం కళ్ళుమూసుకునే నెమ్మదిగా జరిగివచ్చి నా ఒళ్ళో తల పెట్టి పడుకున్నాడు.. సుబ్బారావూ జరిగి వచ్చాడు. ముగ్గురమూ అలాగే ఒకరిమీద ఒకరం వాలి కొంచెం సేపు కూర్చున్నాము. మా రామం తల నా పొట్టకు తగులుతోంది. సుబ్బారావు నా మెడమీద తన ముఖం పెట్టి చేతుల్తో మమ్మల్నిద్దర్నీ చుట్టేస్తున్నాడు.

రామం శిరస్పర్శ ననుభవించాక ఇందాకాభయం ఎలుగ్గొడ్డనుకోవడం వట్టి భ్రాంతనిపించింది. నేను కళ్ళుమూసుకుని ఉండగా వాడు భయంకొద్దీ వంచిన తలతో నా దగ్గరకు జరిగాడు కాబోలు. ఆ జుట్టు తగిలి ఎలుగ్గొడ్డే అనుకుని భయపడి ఉంటాను. అంతేగాని ఆ బండ మీద కవేం వస్తాయి?

అల్లా తోచడంతోటే ఆ ముక్క నిజమనిపించుకోవాలని "ఏరా రామం" అంటూ ఏమో అనబోయాను. దానికేవాడు ఉలిక్కిపడిపోయాడు. భయం లేదురా అని వీపున తట్టుతూనే సందేహం బయటపెట్టాను. "బాబోయ్! ఆ మాట ఎత్తబోకు" అంటూ మొదట్లో ముడుచుకుపోయాడుగాని తర్వాత నెమ్మదిగా జ్ఞాపకం చేసుకుని "నిజమేరా" అంటూ నా ఒళ్ళోనుంచి కదిలాడు.

అప్పటికి ఆ లుంగజుట్టుకోవడం అందరికీ కష్టమయింది. ఇందాకటి భయహేతువు వట్టి భ్రాంతని నిర్ధారణ కావడం కొంత ధైర్యం ఇచ్చింది. దాంతో ఒక్కక్కళ్ళమే కొంచెం కొంచెంగా వడలి, విడిపోయి, ఒక్క ముద్దలాగా ఉన్నవాళ్ళమల్లా మూడు మూర్తులమయ్యాము.

అయ్యామేకాని భయం తగ్గిందా? అంతా గాఢాంధకారం! మా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కూడా వినిపించేటంత నిశ్శబ్ధం.

ఆ చీకట్లో దూరంగా ఉన్న చిన్న చిన్న బండలన్నీ మాకోసమే పొంచి చూస్తున్న వన్యమృగాలలాగా కనిపించాయి. కదిలిన ప్రతి నీడా ఏ జంతువో వస్తోందన్న భ్రాంతినే కలిగించింది.

నిశ్శబ్ధంగా ఉండి ఉండి ఏగాలికో ఎండాకులు గలగలలాడటం, దాంతో మా గుండెలు దడదడలాడడం, దూరాన ఏ బండనో అంటుకుని రెండు మిణుగురు పురుగులు మిలమిలలాడడం, అవి మాకళ్ళకు ఏ చిరుతపులు కళ్ళలాగానో కనిపించడం!

అలా ఉన్న కొద్దీ ఎకువైందేగానీ ఎంతమాత్రమూ తగ్గలేదు.

అకస్మాత్తుగా నాకెందుకో రామభజన చెయ్యాలనిపించింది. వెంటనే చప్పట్లు కొడుతూ మొదలుపెట్టాను. మావాళ్ళూ నాతో కలిశారు. అల్లా కాసేపు కాలక్షేపం చేసేటప్పటికి దైవమహిమవల్ల కాకపోయినా అన్యకార్య నిమగ్నత వల్ల మా మనస్సులు ఉన్న పరిస్థితిని విస్మరించి తాత్కాలికంగా భయాన్ని కోల్పోయాయి

అందాకా ఎక్కడ దాక్కుందో ఏమో అప్పుడు మాకెక్కడలేని ఆకలి వేసింది. నాలుగైదురోజులన్నం మానేసినా అల్లాంటి ఆకలి వేసి ఉండదు.

ఆదుర్దాకొద్దీ సుబ్బారావు తెచ్చిన సంచీ వెతికాము. అందులో వేరుశెనక్కాయలు దారిలోనే అయిపోయాయి. బెల్లపచ్చు సంగతి "నాకు తెలియ"దంటే "నాకు తెలియ"దని వాళ్ళిద్దరూ అన్నారు. ఎక్కడపడిపోయిందో ఏమో! సంచిలో కనపడలేదు.

ఆకలి మాత్రం ఏమీ తినని నాకెలా ఉన్నదో అంతో ఇంతో తిన్నవాళ్ళకూ అలాగే ఉంది.

ఆకలిదారిన ఆకలిలా ఏడుస్తూనే ఉంది. అంతలో ఆయన చెల్లెలు దాహం కూడా వచ్చి గోలపెట్టసాగింది.

ఎవరెంత ఏడిస్తే మాత్రం ఆ స్థితిలో ఉన్న మేమేం చెయ్యగలం? ఉన్నది ఊరుకాదాయ్! అందరికీ మౌనమే సమాధానంగా అలా కూర్చుండిపోయాం.

ఆకలినణచడానికి మడత రొట్టెలూ, దాహం తీర్చడానికి చప్పరింపులూ అవే మాకు గతి అయ్యాయి.

పోనీ అలా ఉండిపోయినా త్వరగా తెల్లారుతుందా అంటే అది లేదు.

గంట ఎంతయిందో తెలియదు!

మౌనంగా కూర్చుంటే భయం!

మాట్లాడితే ఆకలి!

ఇంట్లో ఉన్నప్పుడు ఊరికే వచ్చేనిద్ర ఆ సమయంలో ఎంత బతిమాలినా రానేలేదు. శరీరాలు వాల్చడమే కాని దొర్లి ఎక్కడ పడిపోతామో అని భయమేనాయె!

అప్పటికీ కొంత అదృష్టవంతులం కాబట్టి ఆ చిక్కు వేసవికాలంలో వచ్చింది. అదే ఏ శీతాకాలంలోనే అయితే మా బతుకులు నిజంగా బండలపాలయ్యేవి.

త్వరగా తెల్లవార్చమని తెలిసిన దేవతల కందరికీ మొక్కులు మొక్కుకుంటూ అలాగే నడుములు వాల్చాము.

ఆకాశంలో నక్షత్రాలకాంతీ, నల్లని ఆ బండ మీద మా వంటినున్న దుస్తుల తెలుపూ, అక్కడక్కడా మినుక్కు మినుక్కుమనే మిణుగురు పురుగుల మెరుగూ తప్ప, అంతా అంధకారమే! పాదల్లో ఎక్కడెక్కడో ఒకటొకటిగా ఉన్న కీచురాళ్ళధ్వనీ ఆ ఎత్తుమీదకి వేగంగా దూసుకు వస్తున్న గాలి మా చెవులదగ్గర వినిపించిన బుసబుసా తప్ప అంతా నిశ్శబ్దమే!

ఆ అంధకారాన్నే చూస్తూ, ఆ నిశ్శబ్దాన్నే వింటూ క్రమ క్రమంగా కొంతసేపటికి వాటికి అలవాటు పడిపోయాం.

మధ్యాహ్నం నుంచీ ఒకేవిధంగా తిరగడంలో అలిసిపోయిన మా శరీరాలు మాకు తెలియకుండానే నిద్రలో మునిగిపోయాము.

ఆ వేసవికాలంలో కొంపల్లో ఉంటే ఎన్నడూ ఎరుగని చల్లనిగాలి అక్కడికి వచ్చి మమ్మల్ని హాయిగా పోకొట్టింది.

భయమూ, ఆకలీ, దప్పికా - ఏమయ్యాయో, వాటిదారినవి మాయమయ్యాయి.

తెల్లవారేవరకూ ఒళ్ళుతెలియకుండా నిద్రపోయాము. మేలుకున్నంత సేపూ ఏవేవో ఊహించుకుని భయపడ్డామేకాని ఆ రాత్రి, ఎన్నడూ మనిషిని చూడని ఆ ప్రదేశంలో, నిజానికొక్క చీమైనా మాకపకారం చేసిన పాపానపోలేదు.

మెలుకువ వచ్చింది. నిజంగా ఉన్నామో లేమో అని ఒకరి నొకరం చూచుకున్నాము. మా సంగతి మాకే ఆశ్చర్యం కలిగించింది!

ఎదురుగా ఉదయభానుడు మావంక చూస్తూ అనురాగంతో చిరునవ్వు నవ్వుతున్నాడు. ఎన్నెన్నో పక్షులు కిలికిలమంటూ ఆయన్ని ప్రశంసిస్తునాయి!

ఆ ఎత్తుమీద కూర్చుని క్రమంగా పైకి వస్తున్న సూర్యుణ్ణి చూస్తుంటే కడచిన రాత్రి సంక్షోభమంతా అదృశ్యమయి మా మనస్సులు నూత్న చైతన్యాన్ని పొందాయి.

ఉదయ సంధ్యారాగం అట్లాగే ఉన్నది. కానీ సూర్యుడు సంపూర్ణబింబాకృతి ధరించాడు. అంతపెద్ద బింబాన్ని ఇంకెప్పుడూ చూడలేదు మేము. అందులో ఎంత తేజస్సు, ఎంత సౌమ్యత! నేలమీదినుంచి చూస్తే ఇట్టే అయిపోయే ఆ పుణ్య సమయం అక్కడ ఒక అరగంటసేపున్నట్టుంది.

అప్రయత్నంగానే 'నమస్తే కర్మసాక్షి' అనుకున్నాయి మా మనస్సులు.

✡✡✡

ఆ రాత్రి, ఆ కొండమీద, అలాగడిపినవాళ్ళం ప్రభాత సూర్యుడికి ప్రత్యుద్గానం చేసి, నిన్న సాయంత్రం మాయమయి అంతచిక్కూ పెట్టిన దారి స్పష్టంగా కనిపిస్తూ ఉంటే, రాత్రి పొందిన అనుభవాన్ని గూర్చీ, మా సంగతంతా విని ఎవరెవరేమనుకుంటారో వాటిని గూర్చి కబుర్లాడుకుంటూ చకచకా కొండదిగిపోయాము.

దారిలో మొహాలు కడుక్కుని, తుండుగుడ్డలున్నాయికదా అని వాగులో స్నానాలు చేసి, ఎంత ఆలస్యం చేసినా ఊరుచేరుకోవడానికి మాకప్పుడు ఒక్క గంట సేపు కూడా పట్టలేదు.

ఊళ్ళో అడుగు పెట్టాము.

మొదట్లో మా రామం తండ్రి కనిపించాడు.

"అర్ధరాత్రే బయలుదేరారా ఏమిట్రా? పెందరాడే వస్తున్నారు" అన్నాడాయన.

మేమేమీ సమాధానం చెప్పక ఔనన్నట్టు తలలూపి ఇళ్ళకు వెళ్ళిపోయాము.

తర్వాత రాత్రి జరిగిన సంగతంతా చెప్పాము. ఎంత చెప్పిన ఆయన నమ్మనేలేదు. సినిమాకి వెళ్ళివచ్చి, తమాషాకీ కబుర్లన్నీ చెబుతున్నామని ఆయన ఉద్దేశం.

ఆయనేకాదు ఊళ్ళో విన్నవాళ్ళంతా అట్లాగే అనుకున్నారు.

"కొండమీద రాత్రి ఉండిపోవడమేమిటి? బతికి రావడమేమిటి?" అని కూడా కొందరు డబాయించారు.

వాళ్ళ కర్మ వాళ్ళదని మేమేమీ సమాధానం చెప్పకుండా ఊరుకున్నాం. ఊళ్ళోవాళ్ళంతా ఆ మధ్యాహ్నం దాకా వస్తూనే ఉన్నారు. ఆనాడు మా రామం ఇల్లు నిజంగానే ఒక తీర్థమయిపోయింది.

మధ్యాహ్నం రెండుగంటలవేళ అల్లా వచ్చినవాళ్ళల్లో మా నాన్నే ప్రత్యక్షమయ్యారు.

దాంతో నా పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి.

మా ఊళ్ళో నుంచి బయలుదేరాక రైల్లో ప్రయాణం చేస్తూ ఈ ఊళ్ళో ఒక్క విషయంలో తప్పకుండా జాగ్రత్తపడాలనుకున్నాను. కానీ ఇక్కడి సరదాల్లో ఆ సంగతే మరిచిపోయాను.

ఈ ఊరు రావడంతోటే విశ్వనాధంగారు వ్రాసినట్టు మా సుబ్బారావు చేత ఉత్తరం వ్రాయించాల్సింది. ఆ పని నేను చెయ్యలేదు. మా నాన్న నన్ను వెతుక్కుంటూ వచ్చేశారు.

ఇంకేముంది? అక్కడ నాటక మాడామని తెలియడం, ఇక్కడ రాత్రి జరిగిన సంగతి వినడం - ఆయన్ని మహోగ్రుణ్ణి చేసేశాయి.

నలుగురిలోనూ ఎంత నగుబాటు చెయ్యాలో అంతా చేసి, నానామాటలూ అని, ఘోరాతిఘోరాలు చేసిన దుష్టుణ్ణి పట్టుకున్నట్టు మా నాన్న నన్ను ఆ పూటే వెంటపెట్టుకుని తీసుకుపోయారు.

చిరు చేదు కలిస్తేనేం? తేనె ఎప్పుడైనా మధురం కాకపోతుందా? అందుకనే మరింత అస్వాద్యమవుతుందేమో!

✡✡✡

నల్లజర్లరోడ్డు

దేవరకొండ బాలగంగాధర తిలక్

(ఆంధ్రపత్రిక 1964లో ప్రచురించబడింది)

నల్లజర్ల అడవి మీద చంద్రుడు భయంకరంగా ఉదయించాడు. అవధానిగారు ఇలాగ అనేటప్పటికి మేమందరం ఫక్కున నవ్వాం. కొవ్వొత్తి దీపపు వెలుతురులో ఆయన గడ్డంలోని తెల్ల వెంట్రుకలు వెండి దారాల్లా మెరిశాయి.

"చంద్రుడూ వెన్నెలా ఎప్పుడూ మనోల్లాసంగా హాయిగా ఉంటాయని మీ అభిప్రాయం. కాని ఒకొక్క పరిస్థితిలో ఎంత భయపెడతాయో మీకు తెలియదు" అన్నారు మళ్ళీ.

"చెప్పండి. మీరేదో కథ చెబుతారని తెలుస్తూనే ఉంది. వినటానికి సిద్ధంగా ఉన్నాం" అన్నాను నేను.

"ఈ రాత్రికింక లైట్లు రావు. ఎక్కడో తీగ తెగిపోయివుంటుంది." అన్నాడు నారాయణ.

"తోట అంతా చీకటైపోయింది" అన్నాడు నెర్వస్‌గా ఆచారి. అస్థిమితంగా చేతివేళ్ళతో బల్లమీద ఆదితాళం వేస్తున్నాడు.

"ఇంకా కొవ్వొత్తులున్నాయండీ?" అని అడిగాడు.

అవధానిగారు తల ఊపారు - ఉన్నాయన్నట్టు.

"ఈ తోటా, తోటలో మీ బంగళా, మీరు చేసిన విందూ - ఓహ్! మరచిపోలేం." అన్నాడు నారాయణ.

"ఊరికి ఇంత దూరంగా ఈ తోట ఉండడమే అంత బాగాలేదు" అన్నాడాచారి.

"చెప్పండి కథ" అన్నాను నేను.

"కథా?" నిరసనగా చూశారు అవధానిగారు.

"అదే! అదే! మీ చిన్నప్పుడు జరిగిన సంఘటన -" అని సర్దుకున్నాను. అవధానిగారు కవీకాదు, కథకుడూ కాదు. జీవితాన్ని నిండుగా సూటిగా జీవించిన మనిషి. హృదయమూ, చమత్కారమూ, ఆలోచనా ఉన్నవాడు. వీటికి తోడు విచిత్రంగా విరుద్ధంగా బాగా డబ్బున్నవాడు.

ఆయన చెప్పడం మొదలు పెట్టారు.

"ఏలూరులో చూసుకోవాల్సిన పనంతా అయిపోయింది. ప్లీడరుగారు పక్కలు ఏర్పాటు చేయిస్తానన్నా వినక, కారు స్టార్టు చేశాడు రామచంద్రం. పది గంటలు దాటింది రాత్రి. నాగభూషణం మామయ్యా, నేనూ వెనకాల సీటులో కూర్చున్నాం.

ప్లీడరుగారు కారు దగ్గరికి వచ్చి "నా మాట విన్నారు కాదు" అన్నారు.

"అబ్బే ఎంత సేపండీ, సరిగ్గా తొక్కితే ఒక గంటన్నరలో తణుకులో పడతాం మీరేం ఇదవకండి" అన్నాడు రామచంద్రం.

"కలక్టరుగారి ఇంట్లో పెళ్ళి సరిగ్గా ఉదయం ఏడుగంటలకి. నా మీదా రామచంద్రం మీద భరోసా వేసుకుని కూర్చున్నారు కలక్టరుగారు" అన్నాడు నాగభూషణం మామయ్య.

"అమ్మమ్మ! ఎంతమాట! కలక్టరుగారింట్లో శుభకార్యమంటే వేరే చెప్పాలా? " అన్నారు ప్లీడరుగారు, యావద్విషయాన్నీ గ్రహించినవారై.

కారు సాగింది. "అప్పటికి నాకు పద్దెనిమిదేళ్ళు. అప్పటికి మీరెవరూ పుట్టిఉండరు" అన్నారు అవధానిగారు మా అందరికేసి చూసి.

"అటువంటి ప్రమాదం సంభవించే సూచనలు కూడా వాతావరణంలో ఉండి ఉండవండి" అన్నాడు నారాయణ.

తోటలో గలగల చప్పుడైంది. ఆచారి ఉలిక్కిపడి "దొంగలేమో" అన్నాడు.

"పక్షులు చెట్లలో కదులుతున్నాయి. అంతే" అన్నారు అవధానిగారు.

"కథలోకి రండి" అన్నాను నేను.

"అంటే -?" కోపంగా చూశారు అవధానిగారు.

"అదేనండీ, మీ చిన్నప్పటి - "

అవధానిగారు చిన్నగా నవ్వి గడ్డం చేత్తో ఒకసారి సవరించుకున్నారు. కొంచెం ముందుకు వంగి ఇలా చెప్పసాగారు.

ఆరుమైళ్ళు వచ్చేటప్పటికి కారు ఆగిపోయింది. రామచంద్రం దిగి బానెట్ చూశాడు.

"వెధవ కారులా ఉంది. నడిచి వెనక్కిపోదాం పద. ఎందుకేనా మంచిది" అన్నాడు నాగభూషణం మామయ్య.

"అర్జునుడు గాండీవాన్ని తిట్టినా సహిస్తాడేమోగాని ఈ కారుని తిడితే మాత్రం నేనూరుకోను. అసలీ ఇంజను లాంటిది ఇండియాలో ఉండదు" అన్నాడు రామచంద్రం.

"అందుకే ఆరుమైళ్ళకే ఆగిపోయింది" మామయ్య విసుగ్గా అన్నాడు. "డొక్కు కార్లు కొనకురా అంటే విన్నావ్? సెకండ్ హాండ్‌వి కొనవల్సిన ఖర్మ నీకేమొచ్చింది? మనమాట ఎలాగున్నా వీణ్ణి కూడా మనతో తీసుకువచ్చాం. వీడి ఖర్మ! ఎనిమిది గంటలకి పడుకోకపోతే మా అక్కయ్య ఎనిమిదిమంది డాక్టర్లని ఒకేసారి పిలిచి చూపెడుతుంది" అన్నాడు నన్నుద్దేశించి.

"ఏం భయంలేదు మామయ్యా. రాత్రిళ్ళు కార్లలో ప్రయాణం చెయ్యడం నాకు సరదా" అన్నాను.

రామచంద్రం మా ఊళ్ళో పెద్ద టెన్నీస్ ఛాంపియన్. పొడుగ్గా, బలంగా, హుషారుగా ఉంటాడు. మా ఊరి క్లబ్‌కి సహాయ కార్యదర్శి, సేవాసదనానికి గౌరవాధ్యక్షుడు. ఆ సదనం ఏమిటో, ఏం చేసేదో ఇప్పటికీ నాకు తెలియదు. ఇటువంటి సంస్థల ప్రత్యేకత ఇదే కాబోలు. రామచంద్రానికి కాలువ ఒడ్డున పెద్ద మేడ ఉంది. మేడలో అతనికొక భార్యా, కుమార రత్నమూ కూడా ఉన్నారు. అతను భార్య నెక్కువ ప్రేమిస్తాడో భార్య పేర ఆమె తండ్రి రాసి ఇచ్చిన ముప్పైనాలుగెకరాల్నీ ఎక్కువ ప్రేమిస్తాడో తెలియక తేలక జిజ్ఞాసువులు చాలామంది బాధపడేవారు పాపం. మా నాగభూషణం మామయ్యకి వరుసకి బావ అవుతాడో బావమరిది అవుతాడో - ఇటువంటి భోగట్టా నాకూ సరిగా తెలియదు, మా ఆవిడకి తప్ప. అసలు నాగభూషణం నాకు వేలు విడిచిన మేనమామ. అందరమూ ఒకే ఊళ్ళో ఉండడమూ, రాకపోకలూ, శుభకార్యాలూ, మంచిచెడ్డల్లో ఒకరినొకరు ఆదుకోవడమూ - ఇలాంటి వాటివలన ఈ కుటుంబాలన్నిటికీ చనువూ, గాఢస్నేహమూ ఏర్పడ్డాయి. నాగభూషణం కూడా ఊళ్ళో చెప్పుకోతగినవాడు. ఎం.ఏ చదివాడు. పెద్ద కలప వ్యాపారం నడుపుతున్నాడు. ప్రతీ ఏడాదీ భగవద్గీతమీదా, ఉపనిషత్తుల మీదా పెద్దవాళ్ళని పిలిపించి ఉపన్యాసాలు ఇప్పిస్తుంటాడు. కట్టటం ఎప్పుడూ ఖద్దరే గానీ జిల్లా బోర్డు ప్రెసిడెంటు ఏ పార్టీ అయితే ఆ పార్టీనే బలపరుస్తాడు. దివ్యజ్ఞాన సమాజానికి ఉపాధ్యక్షుడు. ఊళ్ళోకి కలక్టరు వచ్చినా, మంత్రి వచ్చినా ఇతని ఇంట్లోనే మకాం.

"కారు బాగుపడిందాండీ?" అన్నాడు నారాయణ మధ్యలో అడ్డువచ్చి.

"ఆ రామచంద్రం కారుచుట్టూ రెండుసార్లు ప్రదక్షిణం చేశాడు. కొంతసేపు గొణుక్కున్నాడు. కారుకిందా మీదా ఏవో పరీక్ష చేశాడు. చివరికి "ఆల్‌రైట్" అంటూ కారులో కూర్చున్నాడు. కారు సాగింది. ఎరని పాడుగాటి రోడ్డుమీద కారు వెళుతుంటే చల్లని గాలిమొహానికి కొడుతోంది. ఇటూ అటూ పంటచేలు. కారు లైట్లకాంతిలో నెంబర్లు వేసిన మైలురాళ్ళు ఒకటొక్కటే జరిగిపోతున్నాయి. నల్లని ఆకాశం మీద జ్వాలా పుష్పాలులాగా నక్షత్రాలు మెరుస్తున్నాయి. మండుతున్నాయి. చీకటిలో ప్రకృతి గాంభీర్యం వహిస్తుంది. దేవుడులాంటి అనిర్వచనీయమైన శక్తి సన్నిహితంగా ఉన్నట్టు ఉంటుంది. మామయ్య నన్ను బి.ఏ. ఎక్కడ చదువుతావని అడుగుతున్నాడు. మద్రాసులో అని చెప్పాను. లజ్ కార్నర్‌కి దగ్గరలో అతనికో థియాసఫిస్ట్ మిత్రుడన్నాట్ట. అతని దగ్గరవుండి చదువుకోమనీ, హాస్టల్స్‌లో ఉంటే పాడైపోతావనీ చెపుతున్నాడు. రామచంద్రం మధ్య మధ్య రాజమండ్రి శంకరం టెన్నీస్ ఆటలో ఉండే లోపాన్ని గురించి చెపుతున్నాడు.

"మిక్సెడ్ డబుల్స్ ఆడుతుందట! ఆవిడెవరూ?" మామయ్య అడిగాడు.

"మిస్ శర్మిష్ఠ."

"బాగుంటుందా?"

"ఆవిడా, ఆవిడ ఆటా?"

"రెండూను" అంటూ మామయ్య నవ్వాడు.

"దోబిచెర్ల వస్తున్నాం" అన్నాడు రామచంద్రం.

అక్కడక్కడ రెండు మూడు పాకలూ, గుడిసెలూ, చీకట్లో ముడుచుకుపోయి ఉన్నాయి. ఒక బండిదగ్గర ఇద్దరు మనుష్యులు తలలకు పాగాలు చుట్టుకుని జమిలి దుప్పట్లు కప్పుకుని చుట్టలు కాల్చుకుంటూ కూర్చున్నారు. ఊరు ఎక్కడో లోపలకు ఉంది. ఇప్పటిలాగా అప్పటికి పల్లెటూళ్ళలోకి నాగరికత ప్రవేశించలేదు. ఈ పాతికేళ్ళలో ఎంత అద్భుతమైన మార్పు వచ్చిందో మీకు తెలియదు. మీకు ఆ రోజులు తెలియవు విద్యుచ్ఛక్తి అంటే గ్రామీణులకు ఏమిటో తెలియదు. ఏలూరు నుంచి తణుకు వెళ్ళే రోడ్డుని గ్రాండ్ ట్రంక్ రోడ్డు అంటారు. రాత్రి ఎనిమిది దాటాక ఈ రోడ్డు సంరక్షితం కాదు. నిర్జనంగా చీకట్లో నిశ్శబ్దంగా నిద్రపోతుండేది. ఇప్పుడు చూడండి నిమిష నిమిషానికి ఒక లారీ వస్తూ వెళుతూ ఉంటుంది. ప్రతీ గ్రామం నుండీ కూరలూ పసుపూ, మిర్చీ మొదలైనవి ఎగుమతి అవుతున్నాయి. ఈ దోబిచెర్లలో ఇప్పుడొక డేరా సినిమా కూడా ఉంది. గ్రామీణులీనాడు చుట్టలకన్న సిగిరెట్లు ఎక్కువ కాలుస్తున్నారు. మొన్న కార్లో వస్తూ చూశాను. వెంకట్రామన్న గూడెంలో బాడ్మింటన్ పోటీలు జరుగుతున్నట్లు పెద బోర్డు రాసి ఉంది. పాడుగునా కాగితపు జెండాలు కట్టివేశారు. అక్కడ రెండు న్యూమోడల్ కార్లుకూడా ఉన్నాయి.

పాతికేళ్ళ క్రితం ఉన్నస్థితికీ ఇప్పటికీ ఉన్న వ్యత్యాసం చాలా తీవ్రమైనది. సాధారణంగా రెండు దశాబ్దాలలో ఇంత మార్పు ఎక్కడా చరిత్రలో జరగదు. కాని ఒక్కుమ్మడిగా భూస్వామ్య వ్యవస్థ మీదకు పారిశ్రామిక విప్లవమూ, సైన్సు పరిణామ ప్రయోజనమూ దాడి చేసేటప్పటికి పాతవి విచ్ఛిన్నం చేస్తూ నవీనలోకం కఠినంగా స్థిరపడుతోంది. ఈ తీవ్రవేగానికి తట్టుకోలేక మనుష్యులూ, సమాజమూ తమ చుట్టూ గోడలనికట్టుకుని లోపల దాక్కుంటారు. దేశానికేదో కీడు మూడిందని గోలపెడతారు... "

"మీరు కథని ఆపుచేశారు" అని జ్ఞాపకం చేశాడు నారాయణ అవధానిగారి ఉపన్యాస ధోరణికి కొంచెం భయపడి.

"అవును. కథ ఆగిపోయింది. ఎందుకంటే కారు కూడా సడెన్‌గా అక్కడ ఆగిపోయింది" అన్నాడు అవధానిగారు చిన్నగా నవ్వుతూ.

"కొవ్వొత్తి అయిపోతోందండోయ్" అన్నాడు ఆచారి. వాడి చూపు దానిమీదే ఉంది మొదటినుంచీ.

అవధానిగారు సారుగులోంచి ఒక కొవ్వొత్తి తీసి వెలిగించారు.

"ఇంక ఒక్క కొవ్వొత్తి మాత్రం ఉంది - ఇదికాక" అన్నారు.

"చచ్చాం!" అన్నాడాచారి.

"ఎందుకురా అంత భయం" - ప్రశ్నించాడు నారాయణ.

"నాకు చీకంటంటే పడదు" అన్నాడాచారి దిగులుగా తోటలో పేరుకుని ముద్దకట్టిన చీకటిని చూచి.

ఇంతలో ఏదో వికృతంగా సన్నగా కూత వినపడింది. ఆచారి భయంతో చటుక్కున లేచి "ఏమిటది అవధానులుగారు?" అని అడిగాడు.

"నక్కలు."

"మీ తోటలో నక్కలుకూడా ఉన్నాయాండీ?"

"తోటలో కాదు, శ్మశానంలో ఉంటాయి."

"శ్మశానమా?" ఆచారి గొంతు తడబడింది, వణికింది.

"అవును, తోటకి అవతల కాస్త దూరంలో ఉంది" - అవధానిగారు తాపీగా, జాగ్రఫీ మాష్టారు తూర్పున బంగాళాఖాతం, దక్షినాన హిందూ మహాసముద్రం ఉన్నవి అని చెపుతునంత నిర్లిప్తతతో అన్నారు.

"నోర్ముయ్యి ఆచారీ. ఇంత వయసొచ్చి కూడా, ఇంతమంది ఉండగా ఈ భయం ఏమిటి... నవ్వుతారెవరైనా వింటే..." అన్నాడు నారాయణ కోపంగా.

"నాకు దెయ్యాలంటే తెగ భయం.. అయితే... హిహిహిహి" - నెర్వస్‌గా నవ్వాడు ఆచారి. ఈసారి బల్లమీద ఆదితాళం తొందరగా వేస్తున్నాడు. నక్కల కూతలు అప్పుడప్పుడు ఘోరంగా వినపడుతూనే ఉన్నాయి.

"చెప్పండి" అన్నాను నేను అవధానిగారితో.

రామచంద్రం విసుగ్గా కార్లోంచి దిగాడు. "మొదటినుండీ నువ్వు అపశకునం మాటలే మాట్లాడుతున్నావు. అందుకే అభిమానవతి అయిన నా ఫోర్టు మారాం చేస్తోంది" అన్నాడు నాగభూషణంతో. బానెట్ తీసి పరీక్షించాడు. "సరిగ్గా కనపడటం లేదు. ఈ గుడ్డి వెన్నెలలో" అన్నాడు. అంతవరకూ వెన్నెల ఉన్నట్టు మాకు అనిపించలేదు. ఆకాశం మీదకి చూశాను. జేగురు రంగుగా ఉన్న చంద్రుడు మీద పల్చని మబ్బులు తారాడుతున్నాయి. రామచంద్రం చుట్టలు కాల్చుకుంటూ కూర్చున్న ఆసామీలను పిలిచాడు. "కొంచెం అగ్గిపుల్ల గీస్తారా! కారు ఆగిపోయింది" అని అడిగాడు. వాళ్ళు కుతూహలంగా ఒక్కొక్కటే, అగ్గిపుల్ల గీస్తోంటే ఆ వెలుగులో ఏదో మరమ్మత్తు చేశాడు రామచంద్రం. "థాంక్స్" అంటూ కారు ఎక్కి కూర్చున్నాడు స్టీరింగ్ దగ్గర.

"ఏ ఊరు వెడుతున్నారు బాబూ" అన్నాడొక ఆసామి.

"తణుకు" అన్నాడు నాగభూషణం.

"శానాదూరం. జాగ్రత్తబాబూ, అడవిలో ఏదో చిరుతపులి కనపడిందని చెప్పుకుంటున్నారు."

"అలాగే, అలాగే" అని కారు స్టార్టు చేశాడు రామచంద్రం. కారు సాగింది. నాకు ఏదో భయంగా ఉంది.

"అడవి అంటే ఏ అడివి మామయ్యా?" అని అడిగాను.

"అదేరా నల్లజెర్ల అడవి. ఉదయం వస్తుంటే నీకు చూపించలేదూ!" అన్నాడు మామయ్య.

అవును, గూడెం దాటాక మైళ్ళకొద్దీ రోడ్డుకి రెండు వైపులా అడవి పరచుకుని ఉంది. వందలకొలదీ కొండముచ్చులు రోడ్డుకడ్డంగా సభలు తీర్చి మా కారు సమీపించగానే కిచకిచలు చేస్తూ పరుగెత్తేవి. పగటివేళ సూర్యరశ్మిలో ఆ ఆకుపచ్చని అరణ్యం ఎంతో మనోహరంగా ఉంది. నోరులేని, తెలివిలేని వృక్షకోటి మౌన సౌహార్ధంతో హాయిగా గుబురుగా స్వేచ్ఛ ఉన్నట్టున్నది.

"అయితే చిరుతపులి ఉందంటావా మామయ్యా" అన్నాను నేను.

"ఆ చిరుత పులీ లేదు గిలీ లేదు. ఈ పల్లెటూరి వాళ్ళు ఊరికే ఇలాగ పుకార్లు వేస్తుంటారు. అబ్బాయ్! ఇది ఇంగ్లీషువాడి రాజ్యంరా. వాడి తుపాకి ముందు సింహాలూ, పులులూ నిలుస్తాయ్రా..." అంటూ రామచంద్రం ఏదో చెపుతున్నాడు. కానీ కారు ఇంజనులోంచి ఏదో పెద్ద స్వరం బయలుదేరి గొంతును వినపడకుండా చేసింది.

"ఇదేం జబ్బురా వెధవ కారుకి. మళ్ళీ ఆగిపోతుందేమో!" అన్నాడు నాగభూషణం భయంగా.

"ఇది మీ కాలంలోలాగే రెండెడ్ల బండికాదురా భూషణం. ఫోర్డు ఇంజను. ఇలాగ చప్పుడైతే ఇంజన్ మాంచి బలంతో ఉందన్నమాట" అంటూ రామచంద్రం ఏక్సిలేటర్ మీద కాలునొక్కాడు. కారు రయ్యిమని చీకట్లో దూసుకుపోతోంది. నాకు ఏదో సరదాగా థ్రిల్లింగా ఉంది. ఆ చిరుతపులి గొడవ మాత్రం మధ్య భయపెడుతోంది తప్ప.

"చూశావా ఒక్క పిట్టకూడా మైళ్ళకొద్దీ వెళ్ళినా కనబడదు. ఈ చెట్లచాటుని దొంగలు గుంపులుగా దాక్కుని పల్లెటూరి ప్రయాణికుల్ని దోచుకునేవారు ఇదివరలో..." అన్నాడు మావయ్య.

గత చరిత్ర నా కళ్ళముందు లీలగా ఆడింది. ఇలాగ రోడ్లూ అవీ ఉండేవి కావు. అక్కడక్కడా ఓ పల్లెటూరు ఉండేది. ఏ కాకతీయులో, చాళుక్యులో పరిపాలిస్తూ ఉండేవారు. అపుడు దేశంలో వీరులూ, వీరవనితలూ, బందిపోటు దొంగలూ, మట్టిరోడ్లూ, పులులూ, ఎలుగుబంట్లూ, స్థిరమైన నమ్మకాలూ, సంప్రదాయాలూ అన్నీ ఉండేవి. ఇప్పుడు రోడ్లూ, టెలిగ్రాఫ్ తీగలూ, పోలీసులు అన్నీ వచ్చి దొంగల్నీ, క్రూరమృగాల్నీ నాశనం చేశాయి. వాటితోపాటు వీరవరులూ, స్వధర్మనిరతులూ కూడా మాయమైపోయారు.

"అడవి వచ్చేసింది. ఇది దాటితే ఇంకా పదిహేను మైళ్ళు తణుకు" అన్నాడు రామచంద్రం.

నాగభూషణం జవాబివ్వలేదు. వెనక్కి జేర్లబడి నిద్దరోతున్నాడు.

"నువ్వూ నిద్రపోతున్నావా ఏవిటిరా?" అన్నాడు రామచంద్రం నన్ను ఉద్దేశించి

"లేదు" అన్నాను నేను దట్టంగా అలుముకుపోయిన అడవిని చూస్తూ. అడవి మధ్యనుండి రోడ్డు ఒక రాక్షస సీమంతలాగా ఉంది. అడవిలో అంతా కటిక చీకటిగా ఉన్నట్టుంది.

ఇంజన్‌లో ఏదో ఠప్‌మని పేలినట్టయింది. నాగభూషణం ఉలిక్కిపడ్డాడు. కారు ఒక గంతువేసి ఆగిపోయింది.

"ఏమయింది?" అన్నాడు నాగభూషణం.

రామచంద్రం మాట్లాడకుండా దిగి ఇంజన్‌ని పరీక్ష చేశాడు. "సరిగా కనపడటంలేదు." అంటూనే పరిక్ష చేస్తున్నాడు. కీచురాళ్ళ కూతలు ఉచ్చస్వరంతో వినపడుతున్నాయి. నాగభూషణం కూడా దిగాడు. కంగారుగా అన్నాడు. "ఏం బాగుపడుతుందా?" అని అడిగాడు. రామచంద్రం మాట్లాడకుండా వెనకసీటు కిందనుంచి కొంత సామ్రగి తీసుకుని పనిలో పడ్డాడు.

"చిరుతపులి ఈ అడవిలోనేనా ఉందీ?" అన్నాను నేను.

మామయ్య ఉలిక్కిపడి "ఎక్కడ?" అని ఒక గంతు వేశాడు. "వెధవాయ్ సడెన్‌గా అలా అన్నావేమీటిరా?" అన్నాడు కోపంగా. రామచంద్రం పనిముట్లు టిక్ టిక్ మని చప్పుడు చేస్తున్నాడు. శ్రమ వలన అతని బరువైన ఊపిరి చప్పుడు కూడా వినపడుతోంది. మధ్య మధ్య ఎండుటాకులలో గలగలమని చప్పుడు! పక్షి కూతలు.. కిచకిచలు... ఇన్నిటినీ మించిన భయంకరమైన నిశ్శబ్దం.

"తెల్లవారితే కలక్టరుగారింట్లో పెళ్ళి...." స్వగతం చెప్పుకున్నాడు మామయ్య.

"నువ్వేం చదివిస్తున్నావ్" అన్నాడు రామచంద్రం.

"నేను వెళ్ళలేకపోతే ఎంత అభాసు అవుతుంది?" అన్నాడు భూషణం.

"చిరుతపులి మనుషుల్ని తింటుందా మామయ్యా" చిన్నవాడినైన నాకు ఒక పక్క భయం, మరొపక్క కుతూహలం.

"ప్లీడరుగారు పక్కలు వేయిస్తానన్నారు. వినలేదు. ఖర్మం" మళ్ళీ భూషణం మామయ్య స్వగతం. ఏదో చెప్పలేని భయం అందరిలో.

వెన్నెల మరి కాస్త వచ్చింది. ఆకాశం మీద చంద్రుడు ఎర్రగా ఉన్నాడు. అసహ్యంగా మానని పెద్ద వ్రణంలా ఉన్నాడు. నోరు, చెక్కిళ్ళు పెరికి వేసిన శిరస్సులా ఉన్నాడు. వలయంలోంచి కొంత భాగం ఊడిపోయి ఉన్నాడు. నాకు చంద్రుణ్ణి చూడగానే మొదటిసారిగా భయం వేసింది. అనంతమైన శూన్యంలో నీరసంగా, నిగూఢంగా ఉన్న అడవి మీద చంద్రుడు ఏదో విపత్తుకు సూచనగా దుశ్శకునంలాగా అనిపించాడు. వెలవెలబోతున్న వెన్నెల కూడా కాష్ట భస్మంలాగా భయపెడుతోంది,

అరగంట జరిగింది. రామచంద్రం పట్టుదలగా, ఇంజన్‌తో తిప్పలు పడుతున్నాడు. "కారు బాగుపడదు. ఈ రాత్రి అంతా ఇక్కడ బిక్కు బిక్కుమంటూ ఉండాల్సిందే" అన్నాడు నాగభూషణం.

కాస్సేపాగి మళ్ళీ అన్నాడు. "వద్దురా ఈ కార్లో ప్రయాణం అంటే విన్నావు కాదు. మా ప్రాణాలు తియ్యటానికి వచ్చింది ఖర్మం."

రామచంద్రం సహనం కోల్పోయి "అబ్బ చంపకు. వెధవ గోలా నువ్వూ. బాగుపడకపోతే నువ్వుకార్లో ఎక్కి స్టీరింగ్ దగ్గర కూర్చో, నేను తాడేపల్లిగూడెం వచ్చేవరకూ తోస్తాను. నీ ప్రాణానికి నా హామీ సరేనా.." అని అరిచాడు.

మనుష్యుల గొంతులకి రోడ్డు వారనున్న చెట్లలో కలకలం రేగింది. ఒక్క క్షణం సద్దు అణిగింది. రామచంద్రం లేచి రేగిన జుట్టుని వెనక్కి తోసుకుని "ఆఖరి ప్రయత్నం చేస్తాను. ఒక లావుపాటి కర్ర ఉంటే చూడాలి. కారుని పైకి ఎత్తిపట్టుకోవాలి." అంటూ రోడ్డు వారకు పోయి కర్రలకోసం వెదుకుతున్నాడు. నేను భయంతో ఆకాశం కేసి చూశాను. తెలుపూ నలుపూ కలిపిన చిరుమబ్బులు చంద్రుణ్ణి కప్పివేస్తున్నాయి. చలిగాలి వీస్తోంది. నాగభూషణం దిగులుగా కారు పక్కనే నుంచున్నాడు. రామచంద్రం కర్రకోసం వెదుకుతూ పదిగజాల దూరం ముందుకు నడిచాడు.

రోడ్డువారనే చింతచెట్లూ, రావిచెట్లూ ఉన్నాయి. ఎప్పటివో ముసలి చెట్లు శాఖోపశాఖలుగా అంతటా ఆక్రమించి వేశాయి. ఒక పెద్ద మర్రిచెట్టు ఊడలతో చీకట్లో అసహ్యంగా, భయంకరంగా ఉంది. ఊడలు చీకటి పేగులలాగా వేలాడుతున్నాయి. చెట్టు చెట్టుకీ మధ్య ఈత ముళ్ళపొదలు, బ్రహ్మచెముడు డొంకలు, రకరకాల తీగలూ అల్లిబిల్లిగా చుట్టుకున్నాయి. ఒక గుడ్లగూబ అరుస్తూ ఒక చెట్టుమీద నుండి ఇంకో చెట్టుమీదికి ఎగిరింది. ఆ చప్పుడుకి ఉడతలు కాబోలు కిచకిచమంటూ పరుగులెత్తాయి. మనుష్యులకి నివాసంకాని ఈ కీకారణ్యం జంతువులకి సహజమైన ఆవాసంగా ఉంది. ప్రకృతి శాసనం తప్ప వాటికి వేరే జీవన విధానమూ, నియమమూ, నీతి లేవు. ప్రతీప్రాణి ఇక్కడ తనని తాను రక్షించుకుంటూ, తనకన్న అల్పమైనదానిని భక్షిస్తూ బతుకుతుంటుంది. ఈ అడవి ఇలాగ ఎన్నిమైళ్ళు లోపలికి చొచ్చుకుపోయిందో! లోపల చిరుతపులులే కాదు, పెద్ద పులులూ, సింహాలూ ఉన్నా మాత్రం ఏం తెలుస్తుంది? అమాంతం మనిషి మీదపడి నోట కరచుకుపోయి ఏ పాదలోనో దాగి ఒక్కొక్క అవయవాన్నే సావకాశంగా చీల్చి రుచిగా భక్షిస్తాయి కాబోలు. ఈ అడవి మీద వెన్నెల అనవసరంగా, అసందర్భంగా ఉంది. అందుకే అడవి కాచిన వెన్నెల అంటారు. అదేకాదు, వెన్నెల సహజమైన సౌకుమార్యాన్నీ, ఆహ్లాదత్వాన్నీ కోల్పోయి దుర్మార్గంగా, దుస్సహంగా కూడా ఉంది. గుబురుగా ఉన్న ఆకుల మధ్య నుండి కొంచెం కొంచెం వెన్నెల నేలమీదకు జారి వందల కొలదీ కట్లపాములూ, కొండపాములూ పాకుతున్నట్టుగా ఉంది.

"మరీ లోపలకు వెళ్ళకు, జాగర్తరోయ్!" అంటూ భూషణం కేక వేశాడు.

"కారు బాగుపడకపోతే రాత్రి అంతా ఇక్కడుండిపోవడమే!" అన్నాను నేను. నాకు భయంగా ఉంది. గొంతుక ఎండిపోతున్నట్టు ఉంది.

"మంచినీళ్ళు కావాలి" అన్నాను.

"మంచినీళ్ళు! ఎక్కడ దొరుకుతాయి. ఇదేం మీ ఇల్లనుకున్నావా?" విసుక్కున్నాడు నాగభూషణం.

నిస్సహాయతవలన నాగభూషణానికి అసహనం ఎక్కువైపోతోంది. నాకు ఎందుకో అమ్మా, మా ఇల్లూ అన్నీ జ్ఞాపకం వచ్చాయి. లోపల్లోపల చిరుతపులి వచ్చి కరుచుకుపోతుందన్న భయం అవ్యక్తంగా పెరుగుతోంది కాబోలు. నాకు ఏడుపు రాబోయింది. నాగభూషణం నా వళ్ళు నిమురుతూ అన్నాడు. "భయపడకురా అబ్బాయి. ధైర్యం తెచ్చుకోవాలి. పన్నెండు గంటలైంది. ఇంకో నాలుగైదు గంటలు ఓపిక పడితే తెల్లవారిపోతుంది. కారు బాగుపడిందా సమస్యే లేదు."

నేను మౌనంగా తలూపాను.

హఠాత్తుగా "భూషణం! పాము! పాము!" అన్న భయ విహ్వలమైన కేక నిశ్శబ్దాన్ని కత్తిలా చీలుస్తూ వినపడింది. నాగభూషణం రామచంద్రం వెళ్ళిన వైపు నాలుగడుగులు ముందుకు వేశాడు. దూరంగా రోడ్డుమీద ఒకవైపు నుండి మరోవైపుకి పెద్ద పాము మెలికలు తిరుగుతూ గుడ్డి వెన్నెలలో మెరుస్తూ వెళ్ళిపోయింది. "రామచంద్రం, రామచంద్రం" అంటూ కేకలు వేస్తూ పరుగెత్తాడు నాగభూషణం. రామచంద్రం అక్కడ పొదలదగ్గరే కూలబడ్డాడు. నా ప్రాణాలు బిగుసుకుపోయాయి. నెత్తురు జిలజిలమంది.

రెండు చేతులతోనూ పొదివి పట్టుకుని తనమీద అనుకున్న రామచంద్రాన్ని తీసుకువస్తున్నాడు భూషణం రామచంద్రం వణికిపోతున్నాడు. "తలుపు తియ్యి" అన్నాడు భూషణం. కారు తలుపు తీశాను.

"పడుకో రామచంద్రం, ఇలాగ పడుకో" అంటూ మెల్లగా రామచంద్రాన్ని వెనుక సీటులో పడుకోబెట్టాడు. పై మీద కండువా తీసి కాలిమీద గట్టిగా బిగించి కట్టాడు. "భయపడకు.. భయపడకు" అని హెచ్చరిస్తున్నాడు. భూషణం గొంతులో ప్రాణం లేదు, ఎండిపోయి చచ్చిపోయి ఉంది.

రామచంద్రం కళ్ళల్లో విపరీతమైన భయం సుళ్ళు తిరిగింది. వెర్రిగా పరవళ్ళు తొక్కింది. చావుకన్నా, దాన్ని గురించిన భయం భరింపలేనిది. మనిషి యొక్క ప్రాణం సంరక్షణార్థం వెర్రిగా అరుస్తూ నరాలలో కళ్ళల్లో గుండెల్లో పరుగులెత్తుతుంది. ఆ ప్రాణం యొక్క ప్రథమ వివేకం "నేను" అన్న అహమిక. నేను అనుకునే ఆ ప్రాణం ఏడుస్తుంది. మొరపెట్టుకుంటుంది. మోదుకుంటుంది. గిజగిజలాడుతుంది. రామచంద్రం వణికిపోతున్నాడు. రామచంద్రంలోని "నేను" లుప్తమైపోతున్నాడు. కరిగిపోతున్నాడు. కోట్లకొలదీ రక్తకణాల సైన్యాన్ని తన్ని తాను రక్షించుకుంటానికి యుద్ధానికి పంపిస్తున్నాడు. కాని పాము విషం ముందు ఇంత సైన్యమూ ఓడిపోతోంది. కాలకూట జ్వాల రక్తాన్నీ, మాంసాన్నీ, ధాతువునీ, అంతటా రూపహీనంగా పరచుకున్న ప్రాణాన్ని కాల్చివేస్తోంది,

"భూషణం నేను చచ్చిపోతాను, చచ్చిపోతున్నాను" అంటూ అరిచాడు రామచంద్రం, బొంగురుగా, గాద్గదికంగా.

భూషణం ఇటూ, అటూ చూశాడు. ఎవరూ లేరు. చుట్టూ భయంకరమైన అడవి. ప్రతి నిముషమూ అమూల్యమైనది. ఒక నిముషం గడచిందీ అంటే రామచంద్రం నివారింపలేని విపత్తులోకి జారిపోతున్నాడు. భూషణం కర్తవ్యతా విమూఢుడైపోయాడు. ఏమీ చెయ్యలేని, ఏమి చెయ్యాలో తెలియని తన అవివేకం, తన ఆశక్తతలో తనే బంధింపబడి కొట్టుకుంటూ నీరసంగా "ఏం భయం లేదు భయంలేదు" అంటూ గుండెలు రాస్తున్నాడు.

"నా భార్యా - నా పిల్లలు.. రక్షించు భూషణం రక్షించు -" రామచంద్రం దీనంగా ఏడుస్తున్నాడు.

నాకు కాళ్ళూ చేతులూ ఆడడం లేదు. ఇంత భయంకరమైన అనుభవం నన్ను సందులలో కూడా సళ్ళించి వేసింది. బావురుమని ఏడవాలని అక్కడనుంచి పారిపోవాలనీ ఉంది. కానీ ఎక్కడికి పోను. ఎలా పోను ఆ అడవిలో!

"గుండె బరువెక్కిపోతోంది, భూషణం" రామచంద్రం గొంతు క్షీణిస్తోంది. అతని నుదుటి మీద చెమట బిందువులు - అంత చలిగాలిలో కూడా.

"ఆపద్బాందవా! జగద్రక్షకా! నా రామచంద్రాన్ని రక్షించు" తడబడుతూ భూషణం రెండు చేతులూ పైకెత్తి జోడించాడు.

రామచంద్రం వగరుస్తున్నాడు. అతని కళ్ళు పిచ్చిగా ఉన్నాయి. పెదవుల చివరినుండి నురగ కక్కుతున్నాడు. అది చూసిన నాగభూషణం "బాబోయ్" అని వెర్రికేక పెట్టాడు. నిలువునా వణికిపోతున్నాడు. "వీడిశవాన్ని ఇంటికి తీసుకువెళ్ళి చెల్లెలికి ఎలా చూపించనురా" అంటున్నాడు.

రామచంద్రం కళ్ళు తెరచి "నా పెళ్ళాం..." అని అస్పష్టంగా అని నిస్పృహలోకి జారిపోయాడు.

అవధానిగారు ఆగారు. గతస్మృతుల పునశ్చరణవలన ఆయన గొంతు ఉద్రేకంతో బాధతోనిండింది. మేమందరం ఊపిరాపి వింటున్నాం. ఆచారి బల్లని రెండుచేతులతోనూ గట్టిగా పట్టుకుని పళ్ళు బిగించి వింటున్నాడు. కొవ్వొత్తి జాలిగా రామచంద్రం ప్రాణంలాగా వెలుగుతోంది. తోటలో ఏమీ ఎరగనట్టు ఈ మాటలేవి విననట్టు చెట్లు చీకటిలో నిశ్శబ్దంగా నుంచున్నాయి. ఒక నిముషం ఆగి అవధానిగారు చెప్పడం సాగించారు.

భయంకరమైన మృత్యువు ఎదురుగా రామచంద్రం గుండెలమీద కూర్చుంది. ఎవ్వరూ లేరు. అడవిలో మృత్యువులాంటి చీకటి. మృత్యుదేవత నవ్వులాంటి బూడిదరంగు వెన్నెల. నాగభూషణం రెండు చేతులతోనూ నమస్కరించి కళ్ళుమూసుకుని ప్రార్థిస్తున్నాడు. నేను కొయ్యబారిపోతున్నాను. కాలం కదలడంలేదు. తన ఇనుప పిడికిలితో మా తలలమీద నొక్కుతోంది. కారులో మూడు ప్రాణాలూ ఒక ప్రాణం కథావశిష్టంగా అయిపోతోంది. తక్కిన రెండు ప్రాణాలు నీరసించి అచేతన స్థితిలోకి జారిపోతున్నాయి. అసలే అడవి.... అందులో కాళ్ళముందు శవం, శవప్రాయమైన రామచంద్రం. పట్టణంలో సుఖ జీవితానికీ, నౌకర్లకీ, దర్జాలకీ, భేషజాలకీ అలవాటైన కృత్రిమ సుకుమారమైన జీవులకి ఇంతకన్న ఆపద ఏముంది? ఇంతలోకి అడవిలో కాస్త దూరంలో ఒక చోట గప్పున మంట రేగింది. బలహీనమైన నా మనస్సు ఇంక తట్టుకోలేకపోయింది. "బాబోయ్ దెయ్యం" అని అరిచి వెనక్కి పడిపోయాను.

బహుశా అయిదారు నిముషాలలోనే తెలివి వచ్చివుంటుంది. కళ్ళు తెరిచి చూశాను. స్టీరింగుకీ సీటుకీ మధ్యగా ఉంది నా తల. మెల్లగా లేచి భయంగా వెనక సీటులోకి చూశాను. నాగభూషణం సీటునానుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

"మామయ్యా" అన్నాను నేను.

భూషణంకి దుఃఖం పొరలు పొరలుగా వస్తోంది. ఆడడానిలా ఏడ్చేస్తున్నాడు. నాకేం తోచలేదు. ఏదో చెప్పాలనుకున్నానుగాని నాకు మాట పెకిలి రావడం లేదు. రామచంద్రం నోటి చివరలనుంచి నురగ వెన్నెలలో పొంగుతున్న సోడాలాగ ఉంది. అతని గుండెలు కిందకీ పైకీ లేస్తున్నాయి. మృత్యువుతో ముఖాముఖి, ముష్టామిష్టి యుద్ధం చేస్తున్నాడు రామచంద్రం... అవతలి ఒడ్డున ఈ బ్రతుక్కి ఈ మధ్యకి ఈ రహస్యానికి అవతలితీరాన.

"మనం కూడా చచ్చిపోతాంరా. ఈ అడవిలో దిక్కుమాలిన చావు చస్తాంరా. మనకెంత గతి పట్టిందిరా" ఏడుస్తూనే అన్నాడు నాగభూషణం.

"పారిపోదాం మామయ్యా" అంతకంటే ఏడుస్తూ అన్నాను నేను.

"ఎక్కడికి?"

"పరుగెత్తుకుపోదాం, గూడెంవరకూ పరుగెత్తుకుపోదాం."

"రామచంద్రం?"

"వదిలేద్దాం. ఎలాగూ చచ్చిపోతాడుగా."

నాగభూషణం ఆలోచనలో పడ్డాడు. అవును. చచ్చే రామచంద్రం కోసం ఇద్దరుకూడా ఎందుకు చావాలి. అయితే పరిగెత్తగలమా, మాట రావడంలేదే. ఇంక కండలలోకి ఓపిక ఎలా వస్తుంది? కొంతదూరం వెళ్ళి ఆగిపోతే అక్కడ గతి ఏమిటి? ఈ కారు కూడా ఉండదే పడుకుని చావడానికి!

ఆ నిముషంలో స్వార్థం కన్నా గొప్పశక్తి ప్రపంచంలో లేదని తెలిసిపోయింది నాకు. ఈ ఆదర్శాలూ, ఆశయాలూ అన్నీ ఆ ప్రాథమిక స్వార్థానికి అంతరాయాన్ని కలిగించనంతవరకే. ప్రతీ మనిషి లోపల్లోపల ఒక పాము!

"అయితే రోడ్డమ్మట పాములుంటాయి ఎలాగ?" అన్నాడు నాగభూషణం.

అవును అక్కడ ఉండలేం, అలాగని ఎక్కడికీ వెళ్ళలేం. అరణ్యం మా చుట్టూ కనబడని ఉచ్చులు పన్ని ఉంచింది. ఎన్నో మైళ్ళు పరుగెత్తితే కానీ గూడెం రాదు. భగవాన్! ఎందుకిలాగ బాధిస్తున్నావు? ఆశలేదు, ధైర్యం లేదు. అక్కడ చెట్ల ఆకుల్ని తిని బతికే కీటకం కన్నా మానవుడు నికృష్టంగా అయిపోతున్నాడు. నీచంగా దిక్కులేకుండా చచ్చిపోతున్నాడు.

రామచంద్రం కదలినట్లయింది. "రామచంద్రం" అని పిలిచాడు నాగభూషణం. రామచంద్రం మెలికలు తిరుగుతున్నాడు. గుప్పిట మూస్తున్నాడు. మళ్ళీ పిలిచాడు భూషణం చూడలేక కళ్ళు మూసుకున్నాడు. "దేవుడా?" అంటూ ఆర్తనాదం చేశాడు. అడవి అంతా ప్రతిధ్వనించినట్టయింది. నాకు నాలిక పిడచకట్టుకుపోతోంది. నాకు తెలుసు. ఏ పామూ కరవకుండానే మేం ఇద్దరమూ కూడా ఉదయానికల్లా ఈ కార్లో చచ్చిపడి ఉంటామని.

ఇంతలో ఏదో మువ్వల చప్పుడు వినిపించింది. మా ప్రాణాలు మరీ పైకి పోయాయి. కర్ర నేలని తాటించిన చప్పుడుతో కలిసిన మువ్వల చప్పుడు.. క్రమంగా దగ్గరవుతున్న చప్పుడు. నేను భూషణాన్ని గట్టిగా కౌగిలించుకున్నాను. ఇది తప్పకుండా ఏదో దెయ్యమే అయి ఉంటుంది. గజ్జెలు కట్టుకుని అడవుల్లో అర్ధరాత్రి పిశాచాలు నృత్యం చేస్తాయి కాబోలు. మమ్మల్ని చూసివుంటుంది. ఏదో దెయ్యం - తింటానికి ఇటువైపే వస్తోంది.

"ఎవరది బాబూ! -" మనిషి గొంతు, మనిషి భాష!

చటుక్కున భూషణం, నేనూ ఎగిరిపడ్డాం. నా చెయ్యి రామచంద్రం పాదం మీద పడింది. చల్లగా తగిలింది. వెరికేక వేశాను. పాపం రామచంద్రం భయపడే స్థితిలో లేడు.

"ఎవరు బాబూ కేకవేసింది?" మళ్ళీ మనిషి ప్రశ్న.

భూషణం కళ్ళు గట్టిగా మూసుకునే తడబడుతూ అన్నాడు "ఎ... ఎ ఎవరది?"

"నేను మనిషేనయ్యా, భయపడకు" - ఆ మనిషి సమాధానం

కళ్ళు తెరచి చూశాం. ఒక ముసలివాడు రోడ్డుమీదనున్న పాదల్ని తప్పించుకుని వస్తున్నాడు, నల్లని వంగిపోయిన వళ్ళు, తెల్లని నెరిసిన గుబురులాంటి జుట్టు, మాకు నమ్మకం చిక్కలేదు. పైగా అనుమానం ఇంకా దృఢమైంది.

"ఎవరు నువ్వు? ఈ అడవిలో ఎందుకున్నావు?" భూషణం ఎంత ధైర్యాన్ని కూడదీసుకుని ప్రశ్నించినా, కంఠస్వరంలో వణుకూ, భయమూ తెలిసిపోతున్నాయి.

"సిద్దయ్యని బాబూ.. పాములవాణ్ణి" అన్నాడు ముసలివాడు.

"పాములవాడివా?"

"అవును బాబు."

"ఇక్కడ ఎందుకున్నావు?" భూషణం గొంతులో కొంచెం ధైర్యం కనిపించింది.

"నల్లతాచు గరళం తియ్యాలి బాబూ - జమిందారుగారు పురమాయించారు బాబయ్యా. నేనూ నా కూతురూ ఈ అడవికి కూసింత లోపల్నే పాక వేసుకున్నాం. ఈ రేతిరేల ఇక్కడుండిపోయారేం బాబూ?" అన్నాడు సిద్దయ్య.

మాకు కొంత ధైర్యం కలిగింది. అంతవరకూ ఉన్న బ్రహ్మాండమైన ఒంటరితనమూ నిస్సహాయతా పోయినట్టనిపించింది. భూషణంలో ఒక్కసారిగా వివేకమూ, ఓపికా కలిగాయి. దైవసంకల్పం ఉంటే కానీ ఈ అడవిలో ఇటువంటివేళ ఒక మనిషి, అందులో పాములవాడు కనిపించడు. ఒక్క గంతులో కారులోంచి దూకాడు. సిద్దయ్య రెండు చేతులూ పట్టుకున్నాడు. "చూడు సిద్దయ్యా, నీకు మంత్రం వచ్చునా? మా వాడికి పాము కరిచింది. చచ్చిపోవడానికి సిద్ధంగా ఉన్నాడు" అన్నాడు మినుకు మినుకుమనే ఆశ కలసిన భయంతో దుఃఖంతో పూడిపోయిన గొంతుకతో.

సిద్ధయ్య రామచంద్రాన్ని పరీక్షగా చూశాడు. "ఇంకా బతికే ఉన్నారు బాబయ్యా" అన్నాడు, బాధతో తోక తెగిన బల్లిలా గిజగిజలాడుతున్న ప్రాణిని చూసి.

"రక్షించాలి సిద్దయ్యా, దేవుడిలాగా వచ్చావు పెద్ద కుటుంబీకుడు పాపం భార్యా పిల్లలూ ఉన్నారు. మంత్రం వేసి బతికించావా సగం ఆస్తి నీకు రాయిస్తాను."

సిద్దయ్య ఓ సెకను ఆలోచించాడు. ఆకాశం కేసి చూశాడు. నల్లని మేఘం చంద్రుణ్ణి కప్పేస్తుంది.! "అదృష్టం ఉంటే బతకొచ్చును బాబయ్యా. అక్కడ పాకలోకి తీసుకురండి బాబూ! వేరుముక్కతో మంత్రం వెయ్యాలి" అన్నాడు.

"ఎలాగ తీసుకురావడం?" భూషణం ప్రశ్నించాడు, అయోమయంగా చూస్తూ.

"ఇప్పటికే ఆలస్యం అయిపోయింది బాబయ్యా. ఆలోచిస్తుంటే అపాయం. మీరిద్దరూ మోసుకురావాలి బాబూ."

"అడవి లోపలికే! పాములుంటాయేమో" - అంత ఆదుర్దాలోనూ జాగ్రత్త వహించడం భూషణానికి తెలుసును.

"నేను ముందుండి దారి చేస్తుంటాను. మువ్వల చప్పుడికి పురుగూ పుట్రా దూరంగా పోతయ్ బాబూ. రండీ" అంటూ ముందుకు వెళ్ళి రోడ్డువారనున్న పొదల్ని పక్కకి వంచి పట్టుకున్నాడు.

భూషణం రామచంద్రం భుజాలకింద నుంచి చేతులు పోనిచ్చి పైకెత్తి పట్టుకున్నాడు. నేను కాళ్ళుపట్టుకున్నాను. అడవిలోపల చీకటి. శవప్రాయమైన ఒక మనిషిని అంత చిన్న వయస్సులో మోయవలసి వచ్చిన భయంకరమైన అనుభవం నన్నిప్పటికీ తలచుకున్నప్పుడల్లా విచలితుణ్ణి చేస్తుంది. చంద్రుడు మబ్బుల చాటుకి పోవడం మూలాన ఉన్న వెన్నెలకూడా లేకుండా పోయింది. కాళ్ళకి తగిలే ఎండుటాకులూ విరిగిన రెమ్మలూ కూడా మమ్మల్ని పాముల్లాగా భయపెడుతున్నాయి. గుండె దిటవుచేసుకుని సిద్దయ్య అడుగులో అడుగు వేసుకుని నడుస్తున్నాం. చేతులు లాగుతున్నాయి. భూషణం నేనూ వగరుస్తున్నాం. ఏదేనా చిరుతపులి పక్కనున్న పొదలోంచి దూకుతున్నట్టే అనిపించింది. సిద్దయ్యతో చెప్పాలనుకున్నాను. రాత్రి నిద్రలో పీడకలలో గొంతు నొక్కుకుపోయినట్లుగా మాట విడివడడం లేదు. రెండు ఫర్లాంగులు నడిచి వెళ్ళేటప్పటికి చెట్టూ, చేమా లేని శూన్యప్రదేశం కనిపించింది. ఎత్తయిన రాతి ప్రదేశంలాగా ఉంది. అక్కడ నుంచి మినుకు మినుకుమని దీపపు వెలుతురు వస్తోంది.

"కొవ్వొత్తి ఆఖరయిపోతోంది అవధానిగారూ" అని హఠాత్తుగా అన్నాడు ఆచారి - అవధానిగారి కథనానికి అంతరాయం కలిగిస్తూ.

అవధానిగారు ఆచారికేసి నిరసనగా చూసి సొరుగులోంచి ఆఖరు కొవ్వొత్తి తీసి వెలిగించారు, ఒకమాట కూడా మాట్లాడకుండా. ఆచారి పెదవులు వణుకుతునాయి. ఎప్పుడు నారాయణ దగ్గరికి చేరాడో కాని ఒక చేత్తో నారాయణ నడుమును గట్టిగా కౌగిలించుకున్నాడు. తోటలోంచి కీచురాళ్ళమోత వినపడుతోంది. అవధానిగారు మళ్ళీ ప్రారంభించారు.

"ఇదే బాబయ్య గుడిసె" అన్నాడు సిద్దయ్య.

"ఇక్కడ అపాయం కదా నీకు! పురుగు పుట్రా..." భూషణం ఆయాసపడుతున్నాడు.

"మంత్రించిన ఇసుక చుట్టూ జల్లుతాం బాబయ్యా. పురుగు రానే రాదు."

సిద్దయ్య తలుపు తోసుకుని లోపలికి వెళాడు. మేమూ వెళ్ళాం. గుడిసెలో ఒక ప్రక్కన కుండలూ, ఇటుకలతో అమర్చిన పాయ్యి ఉన్నాయి. మరొక ప్రక్కన దండెం మీద బట్టలూ, అక్కడే ఒక నులక మంచమూ ఉన్నాయి. మంచం మీద సిద్దయ్య కూతురు కాబోలు పడుకుంది.

"సూరీడూ లేలే" అంటూ తట్టి లేపాడు సిద్దయ్య. ఆ యువతి కళ్ళు తెరచి మమ్మల్ని చూసి గబుక్కున లేచింది. ఆ ఊపుకి ఆమె కొప్పు విడివడి వినీల జలపాతంలాగా ఆమె జుట్టూ జుత్తున జారి పిరుదుల్ని తాకింది.

సిద్దయ్య చెప్పిన ప్రకారం రామచంద్రాన్ని మంచం మీద పడుకోబెట్టాం. యువతి ఆశ్చర్యంగా, భయంగా చూస్తూ నిలుచుంది. సిద్దయ్య తొందరగా రెండు మూడు సంచీలలో చెయ్యి పెట్టి వెతుకుతున్నాడు. చివరికి కింద బోర్లించాడు. పూసలు, పెంకులు, వేరుముక్కలూ, రాళ్ళూ ఏవేవో ఉన్నాయి. కోడిగుడ్డు దీపం వెలుగులో దేనికోసమో చూస్తున్నాడు సిద్దయ్య.

యువతి చటుక్కున ఆతృతతో "ఈ అయ్యకి పెదవులు నల్లపడిపోతున్నాయి బాబూ" అంది.

భూషణం అదిరిపడ్డాడు. "సిద్దయ్యా! త్వరగా మంత్రం వెయ్యి. ఆలస్యం చెయ్యకు" అని కేకలేశాడు. సిద్దయ్య నిరుత్సాహంగా, విషాదంగా లేచినుంచున్నాడు. "కావలసిన వేరుముక్క లేదు బాబూ. ఉందనుకున్నాను" అన్నాడు.

"అయితే ఇప్పుడెలాగా?" భూషణం భయంతో ప్రశ్నించాడు.

"ఏం చెయ్యను బాబూ, లేదని తెలిస్తే ముందే తెచ్చి ఉంచుకుందును. దూరంగా వెలగచెట్టు అవతల పొదలకాడ ఈ వేరుగల మొక్కలునాయి. రాత్రి చీకటిలో అక్కడికి వెళ్ళలేం. పాము పుట్టలూ ముళ్ళపొదలూ జాస్తిగా ఉంటయ్. "

"ఎక్కడుంది వెలగచెట్టు?"

"శానా దూరం బాబయ్య రెండూ మూడొందల గజాలు పోవాలి. "

"ఎలాగో వెళ్ళు సిద్దయ్యా నీ మేలు మరచిపోను. నీ కాళ్ళు పట్టుకుంటాను."

"చెప్పాలా బాబయ్యా. నిష్కారణంగా బాబు సచ్చిపోతుంటే ఊరుకుంటానా! అందులో నాకు చీకటిపడితే చూపు ఆనదు సరిగా. ఏది ఏమిటో తెలియదుగదా - ఈ చీకట్లో మొక్క ఆనవాలు ఎట్లా తెలుస్తుంది బాబయ్య."

భూషణం జేబులోంచి పర్సు తీశాడు. అందులోంచి రెండూవందల రూపాయలనోట్లూ, కొన్ని పదులూ పైకి తీసి "ఇవిగో సిద్దయ్యా ఇంకా ఇస్తాను, ఎంతయినా ఇస్తాను. నా రామచంద్రాన్ని రక్షించు. నువే ప్రాణభిక్ష పెట్టాలి" అంటూ సిద్దయ్య ఒళ్ళో పడేశాడు.

సిద్దయ్య కంగారుగా పక్కకి తప్పుకున్నాడు. నోట్లు చిందర వందరగా పడిపోయాయి.

"ముందా డబ్బుతీసి లోపల పెట్టుకోబాబూ. మీ డబ్బుకి ఆశపడ్డానా నా మంత్రం పనిచెయ్యదు" సిద్దయ్య కఠినంగా అన్నాడు. "తియ్యండి బాబూ తియ్యండి."

భూషణం విధిలేక నోట్లని ఏరి పర్సులో కుక్కి "ఇక లాభం లేదా?" అన్నాడు దిగులుగా.

సిద్దయ్య లేదన్నట్టు తలఊపాడు. భూషణం గుండెలు బాదుకుని "రామచంద్రం!" అంటూ ఏడుస్తూ కూలబడ్డాడు. అతనిలో ఇంతకు ముందు రేగిన ఆశ ఒక్కసారి గప్పున ఆగిపోవడంతో దుఃఖంతో విలవిలలాడిపోయాడు.

"పోనీ నేను వెళ్ళి తీసుకురానా బాబూ" సూరీడు సన్నని గొంతు. అదిరిపడి చూశాడు భూషణం.

"నువ్వా?" కంగారుగా అన్నాడు సిద్దయ్య. "వద్దు ప్రమాదం సూరీడు.. అక్కడ పాము...అమ్మో."

"ఈ అయ్య చచ్చిపోతుంటే... పాపం."

"వద్దు వద్దు" అంటున్నాడు సిద్దయ్య.

"వెళ్ళొస్తాను" సూరీడు గొంతులో నిశ్చయం. జుట్టుముడి వేసుకుని క్షణంలో గుడిసె అవతలికిదూసిన బాణంలా వెళ్ళిపోయింది.

"వద్దు సూరీడు! నా మాట విను వెళ్ళొద్దు" అంటూ సిద్దయ్య గట్టిగా కోపంగా అరుస్తూ వెనకాలే వెళ్ళాడు. అప్పటికే సూరీడు దూరంగా వెళ్ళి అడవిలో చీకటిలో కలిసిపోయింది. వెనక్కి తిరిగి వచ్చాడు. కోపంతో భయంతో వణికిపోతున్నాడు.గోడకి చేరగిలబడిపోయి నీరసంగా; "ఓపలేని మనిషి బాబూ, విన్నది కాదు"అంటూ వణికే చేతులలో మొహం కప్పుకున్నాడు.

భూషణానికి ఏమనాలో తోచలేదు. సిద్దయ్య ప్రాణం బిగపట్టుకున్నట్టుగా కూచున్నాడు ఏ చప్పుడైనా అదిరిపడి చూస్తున్నాడు. అతడి కడుపుతీపి అతనిది. మంచమ్మీద రామచంద్రం చివరి ఘడియలో ఉన్నాడు. ఒక పక్క కటిక చీకట్లో అడవిలో విపత్తుని కోరి తెచ్చుకుంటోంది వయస్సులో ఉన్న యువతి. ఇదంతా ఏమీటో ఏ ప్రళయానికి దారితీస్తుందో - సరదాకి వీళ్ళతో ప్రయాణం చేస్తున్న ఒ గతి ఏమవుతుందో తెలియక ఒక్క క్షణం ముందుకు ఆలోచించే శక్తికూడా లేక నిశ్చేష్టుడనై ఉన్నాను నేను. మేకలు గుడిసె అవతల సిద్ధయ్యవి కాబోలు అరుస్తున్నాయి. మృత్యుఛాయలు వికటంగా గుడిసెలో కూడా పరచుకున్నాయి. ఇదంతా నిజం కాదన్నంత అనుమానం కలిగింది.

ఒక్కొక్క నిముషమే బలవంతంగా గడుస్తోంది. ఎవరో పిస్తోలుని గుండెకి సూటిగా పెట్టి ట్రిగ్గర్ మీద వేలు నొక్కుతున్నట్టుంది. సిద్దయ్య మెల్లగా లేచాడు. దీపం వెలుగులో అతని కళ్ళు నిశ్చయంతో వెలిగాయి. "వట్టి మంత్రమైనా ఈలోగా వేస్తాను బాబూ" అన్నాడు. రామచంద్రాన్ని పరీక్షించాడు. చిటికెలు వేస్తూ పెదవులు కదుపుతూ మంచం చుట్టూ తిరుగుతున్నాడు. మంత్రావేశంతో సిద్దయ్య చూపుకి శూలం వంటి నైశిత్యం కలిగినట్టనిపించింది. ఆ సమయంలో అతను ముదుసలివాడులాలేడు. శక్తివంతమైన ఒక విద్యుత్తలంలా ఉన్నాడు. భూషణం ఏదో అనబోయి నివేశాడు. సిద్దయ్య తదేకమైన తత్పరతలో గదిలోని నిశ్శబ్దం కూడా గంభీరమైన ఉద్రేకంలో ఉంది. భౌతికమైన ప్రపంచాన్నే శాసించే మనస్సు యొక్క శక్తిని నాకు చూస్తున్నట్లు అనిపించింది.

సూరీడు తలుపు తోసుకుని లోపలకు వచ్చింది. మొహం మీద చేతులమీద గీరుకుపోయిన ఎరుపు చారలు - ఆయాసపడుతూ ఉంది. "బాబూ తెచ్చాను" అంది. ఆమె చేతిలో అయిదారు మొక్కలున్నాయి. సిద్దయ్య అదే చలించని చూపుతో సంజ్ఞ చేశాడు. సూరీడు గబగబా వేరు అరగదీసి రామచంద్రం కంట్లోనూ నోట్లోనూ పెట్టింది. అతని అరిపాదాల్ని ఒళ్ళో పెట్టుకుని చేతులతో రాస్తుంది.

అరగంట గడిచింది. సిద్దయ్య వేసిన మంత్రమే వేస్తూ మంచం చుట్టూ తిరుగుతున్నాడు. భూషణం తలపైకి రెండు చేతులూ ఎత్తి పట్టుకుని మౌనంగా దేవుళ్ళని ప్రార్థిస్తున్నాడు. నేను రామచంద్రం కేసి ఆదుర్దాగా చూస్తున్నాను. క్రమంగా అతని మొహంలోని చావు నీడలు తప్పుకున్నాయి. జీవకళ కొంచెంగా తిరిగి వస్తోంది. శ్వాస తేలికగా యధాస్థితికి వస్తోంది. సూరీడు నొసటని చిరు చెమట కమ్మింది. పరిశ్రమ వలన రామచంద్రం మొహం తేటపడింది.

సూరీడు ఆనందంతో "బాబూ బతికాడు ఈ అయ్య" అని కేక వేసింది.

భూషణం "ఆ!" అంటూ లేచి రామచంద్రాన్ని చూసి వెర్రిగా అరచి నవ్వాడు. "ఇదంతా నీ చలవ సూరీడూ" అంటూ ఆమె కాళ్ళమీద పడ్డాడు.

సూరీడు సిగ్గుపడుతూ, "అదేవిటి, తప్పండి బాబూ" అంటూ లేచి దూరంగా వెళ్ళింది. సిద్దయ్య మంత్రోచ్చారణ ఆపి ఒకసారి రామచంద్రాన్ని చూసి నిట్టూర్చి వెదురుగోడనానుకునుంచున్నాడు. అతను చాలా అలసిపోయినట్టున్నాడు.

సూరీడు దగ్గరగా వెళ్ళి తండ్రిని కౌగలించుకుని "నా మీద కోపం వచ్చిందా బాబూ" అంది.

సిద్దయ్య ప్రేమగా జాలిగా కూతురు తల నిమిరాడు. "వెర్రిపిల్లా!" అన్నాడు ఆప్యాయంగా గాద్గదికంగా.

దిక్కులేకుండా అడవిలో చచ్చిపోతాననుకున్న ఈ రాత్రి పాములవాడి గుడిసెలో అదృష్టవశాత్తు సుఖాంతం అయింది. బిగుసుకుపోయిన నరాలు ఒక్కసారిగా సళ్ళి ఒక్కసారిగా ఒళ్ళంతా తేలికైపోయినట్టనిపించింది. రామచంద్రం కళ్ళు తెరచి సన్నగా మూలిగి పక్కకి చూశాడు. భూషణం దగ్గరగా వెళ్ళి వెర్రి ఆనందంతో జరిగినదంతా చెప్పేస్తున్నాడు. "బతికావురా రామచంద్రం. ఇంక భయంలేదురా. దేవుడు మనపాలిట ఉన్నాడు. తెల్లారకుండా బస్సు వస్తుంది. దానిలో వెళితే కలెక్టరుగారింట్లో పెళ్ళిముహూర్తానికి తప్పకుండా వెళ్ళొచ్చును. అసలు నువు లేకపోతే అక్కడ కథ లేదు" అంటూ వాగేస్తున్నాడు. బరువుగా నీరసంగా ఉన్న రామచంద్రం కళ్ళల్లో చిన్ననవ్వు తాలూకు వెలుగు అలలాగా మెదిలింది. అంతలోనే భూషణం మెడకి చేతులు తగిలించి గబుక్కున ఏడ్చాడు.

"ఛ ఛ ఇపుడేడుస్తావేమిటి.. ప్రమాదం తప్పిపోయింది. పడుకో పడుకో.. మళ్ళీ ఉదయం పెళ్ళికి రెడీగా ఉండాలి" అన్నాడు భూషణం. అతను బతకడంలోని పరమార్థం కలెక్టరుగారింట్లో పెళ్ళికి హాజరవటం కాబోలు అని కురవాణ్ణి నా మనస్సుకి అనిపించకపోలేదు. అసలు పెద్ద ఉద్యోగస్తుల ఇళ్ళల్లో జరిగే శుభకార్యాలకి ఇంతగా అవసరమైన పెద్ద మనుషులకి హఠాత్తుగా చచ్చిపోయే హక్కు 'లా' ప్రకారం ఉండి ఉండదు కూడా. సూరీడు నవ్వుతూ ఒక చేత్తో పాత్రని పట్టుకు వచ్చి "తప్పుకో బాబూ, ఆయన్ని కొంచెం పడుకోనివ్వండి" అంటూ రామచంద్రం తలని ఒళ్ళోకి తీసుకుని, నోట్లో పాత్రలో ఉన్న పాలుపోసింది.

"ఏమిటిది?" అన్నాడు భూషణం.

"మిరప్పాడి పాలూ - ధారకంగా ఉంటది" అంది సూరీడు.

"ఈ అడవిలో మీకు పాలు సప్లయ్ అవుతాయా ఏమిటీ?" భయంగానే నాగభూషణం సహజమైన వివేకాన్ని విచక్షణనీ తిరిగి పొందాడు.

సూరీడు ఫక్కున నవింది. "మేకపాలు బాబూ" అంది.

"రామ రామ. మేకపాలు తాగడమే? సరే సరే అపద్ధర్మం" అన్నాడు భూషణం.

సిద్ధయ్య రెండు చిరిగిన సంచుల్ని ఒక పక్కగా పరచి "కొంతసేపు పరుండండి బాబూ" అన్నాడు. రామచంద్రం పాలు తాగి నిద్రపోయాడు.

"అలసిపోయారు బాబుగారు. రెండు జాంపళ్ళు ఇవ్వనాండీ?" అంది సూరీడు.

"నిజమే, ఏదేనా తినాలనిపిస్తోంది" అంటూ గోనెపట్టామీద చతికిలబడి "ఏం సిద్ధయ్యా నీ అల్లుడేం చేస్తున్నాడు?" అన్నాడు భూషణం.

"మొగుణ్ణి ఒగ్గేసింది బాబూ మా సూరీడు."

"ఏం?" అన్నాడు ఉలిక్కిపడి భూషణం

"వాడంటే మొదటినుంచీ దీని కిష్టంలేదు బాబూ. వద్దు వద్దంటుంటే నేనే బలవంతాన పెళ్ళిచేశాను" అన్నాడు సిద్ధయ్య.

"కట్టుకున మొగుణ్ణి వదిలెయ్యడమే!" ఆశ్చర్యంగా అన్నాడుభూషణం, "పాపం సుమీ సిద్ధయ్యా."

"ఇష్టం లేకపోతే కాపురమెట్టా చెయ్యడం బాబూ నా కర్థంకాదు" అంది సూరీడు. కోడిగుడ్డుదీపం ముందు కూర్చుని చాకుతో జాంపళ్ళు ముక్కలకింద కోస్తోంది. మధ్య మధ్య మొహం మీద పడే జుట్టుని చేత్తో వెనకి తోసుకుంటోంది. ఛామనఛాయ రంగైనా, నవలావణ్యంతో అంగసౌష్టవంతో ఆమె ఆకర్షణీయంగా ఉంది. నుదుటి మీద గీరుకుపోయిన చార లేత ఎరుపుతో మెరుస్తోంది.

"నాతోనే చాలాకాలం తిప్పుకున్నాను బాబూ మా సూరీడుని. సికాకుళం, సాలూరు, బొబ్బిలి - ఇవన్నీ తిరిగొచ్చాం. తాచును పట్టి గరళం తీయడంలో నాదే పేరండి ఆ రోజుల్లో. ఇప్పుడు శరీరంలో జవ పోయింది. ముసలి వాణ్ణయిపోయాను. నా సూరీణ్ణి చూచుకునే బతుకుతున్నాను. దానికైనా నేను తప్ప ఎవరూ లేరు సామీ. చంద్రంబాబు ఎప్పుడొస్తాడో ఏమో..." అన్నాడు సిద్ధయ్య.

"అతనెవరు?" భూషణం ప్రశ్నించాడు.

"నూజివీడులో సూరీడుకా బాబుతో సావాసం అయింది. ఒకరి కొకరు పడిచచ్చేవారు. ఈ చంద్రంబాబు పెద్దింటి అబ్బాయి బాబూ. సూరీడునే పెళ్ళాడతానన్నాడు. తండ్రి కోపం వచ్చి ఇంట్లోంచి తగలేశాడు. ఆ పోక పోక ఎక్కడికి పోయినాడో సామీ, ఉద్యోగం సంపాదించుకుని వస్తానని చెప్పిపోయాడు సూరీడుతో. నాలుగునెలలాయె. అతీగతీలేదు. సూరీడు కడుపులో బిడ్డ చంద్రం బాబు బిడ్డే బాబూ" అన్నాడు సిద్దయ్య. "చంద్రంబాబు రాకపోతే దీని గతేంకానా అని బెంగ బాబూ. అతనిమీదే ధ్యాస...."

"తప్పకుండా వస్తాడు బాబూ. ఎప్పటికైనా వస్తాడు. ఎందుకు రాడు? నన్నిడిసి ఉండగలడా?" సూరీడు కళ్ళల్లో విశ్వాసం మెరుస్తోంది.

"ఎన్నోనెల నీ కూతురుకి" అని అడిగాడు భూషణం.

"నాల్గోనెల బాబూ."

సూరీడు జాంపండు ముక్కల్ని తీసుకు వచ్చి ఎదురుగా పెట్టింది. నన్ను కూడా తీసుకోమన్నాడు భూషణం. నాకు నిద్రవచ్చేస్తోంది. సిద్దయ్య లేచి "మేం కూడా కొంచెం నడ్డి వాలుస్తాము బాబూ. కాసేపు పరుండండి" అన్నాడు!

"నీ మేలు మరిచిపోను సిద్దయ్యా. నీ రుణం ఎలా తీర్చుకుంటామో తెలియడం లేదు. డబ్బు తీసుకోనన్నావు."

"డబ్బు ఎంత చేస్తుంది బాబూ, మీ దయవుంటే చాలు. బాబూ నేను గుడిసె అవతల పడుకుంటాను. లోపల చోటులేదు. అవసరమైతే పిలవండి" అన్నాడు సిద్దయ్య.

"వద్దు బాబూ, చలివేస్తది" అంది సూరీడు.

"చూరు కింద కంబళి కప్పుకుని పడుకుంటాను, నువ్వు పడుకో."

"సిద్దయ్యా ఆరుగంటలకి బస్సులో వెళ్ళిపోతాం. కలక్టరుగారింట్లో పెళ్ళి సమయానికి వెళ్ళాలి. ఇప్పుడు దాదాపు మూడుగంటలయింది. ఒకవేళ మెలుకువరాకపోతే లేపు సుమీ" అన్నాడు నాగభూషణం ఆవలిస్తూ.

"చిత్తం" అని సిద్దయ్య అంబలి తీసుకు వెళ్ళాడు. రామచంద్రం ప్రక్కగా నేలమీద గుడ్డ పరచి సూరీడు పడుకుంది.

భూషణం నా వైపు తిరిగి "వీళ్ళకి నీతి లేదు. ధర్మం లేదు చూశావా?" అని మెల్లగా అన్నాడు.

నాకు నిద్రముంచుకు వచేస్తుంది. అడవిలోంచి అస్పష్టరవాలు ఏవో వినపడుతూనే ఉన్నాయి. నాకు నిద్ర పట్టేసింది.

సుమారు ఓ గంటకు నా పక్కనెవరో కదిలినట్టనిపించింది. కళ్ళు తెరిచి చూశాను.

భూషణం లేచి సూరీడు వంటిమీద చెయ్యివేసి లేపుతున్నాడు.

సూరీడు లేచి "ఏమిటి బాబూ?" అంది.

భూషణం జేబులోంచి డబ్బుతీశాడు. మెల్లగా అంటున్నాడు "నా మనసు తీర్చు - ఇదుగో డబ్బు."

సూరీడు అటూ ఇటూ చూసింది. చిన్నగా నవ్వింది. "అందుకు డబ్బెందుకు బాబూ!?" అంది.

"అయితే?" - ఆశగా అడిగాడు భూషణం.

"నేనలాంటిదాన్ని కాను. పోయి పడుకో అయ్యా. నవ్వుతారు కూడా" అంటూ మరోవైపు తిరిగి పడుకుంది.

భూషణం అనుమానంగా చూస్తూ నా పక్కకి వచ్చి పడుకున్నాడు. రామచంద్రం గుర్రు బరుకు బరుకుమంటూ వినిపిస్తోంది. నేను నవ్వాపుకుని పడుకున్నాను. గుడిసె బయట మేకపిల్ల అరుస్తోంది.

భూషణం నన్ను లేపుతున్నాడు. "లేరా లే - బస్సు వచ్చే వేళయింది" అంటున్నాడు. ఉలిక్కిపడి లేచాను. తెల్లారిపోతోంది. గుడిసె చూరులోంచి చీకటి పలచబడిపోవడం కనిపిస్తుంది. రామచంద్రం అంటున్నాడు. "ఇంత మొద్దునిద్ర పోయేవాడు పరీక్షలో ఏం

చదువుతాడు?" మంచి గంభీరంగా ఉత్సాహంగా ఉంది రామచంద్రం గొంతు. రాత్రి మేం పడిన బాధ భయమూ అంతా పీడకల ఏమో అనిపించినట్టుంది రామచంద్రం తీరుచూస్తే. రామచంద్రం మామూలు పెద్దమనిషీ, శ్రీమంతుడు, టెన్నీస్ ఛాంపియనూ అయిపోయాడు.

"నువ్వేం తీసుకోనన్నావట సిద్దయ్యా. నాకు తృప్తిగా లేదు" అన్నాడు రామచంద్రం.

"మంత్రం పట్టివ్వదు బాబూ. పైగా బెడిసికొడుతుంది బాబూ. బస్సు వచ్చేస్తుంది" అన్నాడు సిద్దయ్య.

సిద్దయ్యా, కూతురూ ముందు నడుస్తుంటే వెనకాల మేం వెళ్ళాం. అడవి అంతా మేల్కొంది. పక్షుల కిలకిలలతో కోలాహలంగా ఉంది. కాళ్ళకి చల్లని గడ్డీ, ఆకులూ తగిలి జివ్వుమంటోంది. అర్ధరాత్రి భయకరంగా ఉన్న అడవి ప్రాతఃకాంతిలో పచ్చ పచ్చగా లీవిగా ఉంది. సూరీడు దారిలో తీగలు మా కాళ్ళకి తగలకుండా పక్కకు వంచుతోంది. ఒడ్డూ పొడుగూ నల్లటి పెద్ద జుట్టు ఉన్న ఆమె ఆ అడవిలాగ స్వచ్ఛంగా, ప్రాకృతికంగా కనిపించింది.

రోడ్డు మీదకి వచ్చి నిలుచున్నాం. సిద్దయ్యా, కూతురూ "ఇంక మేం వెళ్ళివస్తాం బాబయ్యా సెలవు తీసుకుంటాం" అన్నారు.

"ఎప్పుడైనా మా ఊరు వస్తే కనిపించు సిద్దయ్యా. నీ కూతుర్ని కూడా తీసుకురా. బహుమతి తీసుకుందువుగాని" అన్నాడు రామచంద్రం కృతజ్ఞతాభావం ఉట్టిపడేలాగ.

"చిత్తం" అని వాళ్ళు వెళ్ళిపోయారు. ఇటూ అటూ చెట్లు బారులు తీరిన రోడ్డు లేత వెలుగులో ఎంతో అందంగాఉంది. చల్లని గాలి ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. "చిరుతపులు ఈ అడవిలో కనిపించవేం మామయ్యా?" అన్నాను నేను, రాత్రి సంఘటనని తలుచుకుంటూ.

"ఆగరా వెధవ పులులూ నువ్వూ. కలక్టరుగారింటికి పెళ్ళివేళకి చేరుకోకపోతే" భూషణం ఎంతో ఆతృతగా ఉన్నాడు. ఎన్నో బాధ్యతలూ, గౌరవాలూ వహించవల్సిన మామయ్య విద్యుక్తధర్మం మరచిపోడు.

"పాపం వాళ్ళేం తీసుకోలేదు" అన్నాడు రామచంద్రం తన ప్రాణదాతల్ని గురించి. "అన్నట్టు భూషణం - మన కారు!" అన్నాడు.

కారు దగ్గరికి వెళ్ళాం. తడిసిపోయి ఉంది మంచులో. తణుకు వెళ్ళగానే దీన్ని తీసుకువచ్చే ఏర్పాటు చేయాలని నిశ్చయించారు.

"ఒరేయ్ రామచంద్రం ఈ వెధవ కారు అమ్మేసెయ్. ఇప్పటికైనా నా మాట విను" అన్నాడు భూషణం.

"ఇలా అమ్మితే అంతా నష్టమే. రిపెయిర్ చేయించి రంగు వేయించి కండిషన్‌లో పెట్టి అమ్ముతాను. భూషణం! ఇని సెకండ్ హాండ్ కార్లు కొన్నాను. ఒక్కదానిలో అంటే ఒక్కదానిలోనైనా నష్టం వచ్చిందా?" అన్నాడు రామచంద్రం గర్వంగా.

"బాబయ్యా" అని అడవిలోంచి కీచుగా కేక వినపడింది. అందరం అటు చూశాం. సూరీడు పరుగెత్తుకు వస్తోంది.

"బాబూ మా అయ్యని పాము కరచింది. ఒక్కసారి రండి బాబూ. రండి" వగరుస్తోంది సూరీడు. ఆమె కళ్ళల్లో భయం సుళ్ళు తిరుగుతోంది.

"అరెరెరె!" - అన్నాడు భూషణం. అందరం ఈ దుర్వార్తకి స్తంభించిపోయా.

"రండి బాబూ సగం దూరం వెళ్ళగానే వేరుముక్క కోసం పాదలో చెయ్యి పెట్టి మొక్క పీకబోయాడు బాబు. బుస్సున లేచి కాటువేసింది. తాచు బాబూ తాచుపాము" సూరీడు దీనంగా అడుగుతోంది.

"ఎలాగ! ఈ బస్సు దాటిపోతే కలెక్టరుగారింట్లో పెళ్ళికి ఎలాగ వెళ్ళడం. రిసెప్షన్ అంతా నేనే చూసుకుంటానని మాట ఇచ్చాను" - అన్నాడు రామచంద్రం. పెద్ద సమస్య వచ్చిపడింది రామచంద్రానికి.

"అయినా మనం ఏమి చేయగలం?" భూషణం జాలిగా అన్నాడు.

నేను వెర్రిగా సూరీడు కేసి చూస్తున్నాను. "నేనొక్కతెను చూడలేను బాబూ. మీరుంటే ధైర్యం బాబూ.. రక్షించండి బాబూ!" ఏడుస్తోంది సూరీడు.

"అదిగో బస్సు వస్తోంది" అన్నాడు భూషణం. రామచంద్రం చెయ్యి ఎత్తి ఆపమని సంజ్ఞ చేశాడు.

బస్సు ఆగింది. "త్వరగా ఎక్కండి బాబూ" అంటున్నాడు కండక్టరు. రామచంద్రం గబుక్కున రెండు పదిరూపాయల నోట్లు జేబులోంచి తీసి సూరీడు చేతిలో పెట్టి "మేం ఉండి మాత్రం ఏం చెయ్యగలం సూరీడు, మంత్రం వచ్చునా తంత్రం వచ్చునా? అవతల కలక్టరు గారింట్లో పెళ్ళి. ఈ డబ్బుతో ఎక్కడికైనా తీసుకెళ్ళి చూపించు మీ బాబుని" అని కారు ఎక్కాడు. భూషణం నిశ్చేష్టుడై చూస్తూ ఉన్న నన్ను జబ్బ పట్టుకుని కార్లోకి తోసి, తనూ ఎక్కాడు.

సూరీడు విచిత్రంగా నోరావలించి గుడ్లప్పగించి చూస్తూ నిలబడింది. పదిరూపాయల నోట్లు రెండూ ఉదయపు చల్లని గాలిలో పావురాలులా పల్టీలు కొట్టుతున్నాయి.

కారు వేగంగా వెళ్ళిపోతోంది. "పాపం మనం చెయ్యగలిగిందేముంది?" అన్నాడు భూషణం ఇంకా జాలితో.

"అందులో కలెక్టరుగారికి మాట ఇచ్చామాయె!" అన్నాడు రామచంద్రం - మాట ఇచ్చి తప్పడంలోని అమానుషత్వాన్ని ఊహించుకుని భయపడుతూ.

"ఇదీ నల్లజర్ల అడవిలోని ఆనాటి రాత్రి సంఘటన" అని అవధానిగారు ఆగి మాకేసి చూశారు.

"కొంపొత్తి అయిపోతోంది. ఎలాగ?" అన్నాడాచారి భయంగా.

"డ్రైవరు, వంటవాడూ సినిమానుంచి ఈపాటికి వస్తుంటారు" అన్నాడు నారాయణ.

"ఈ తోటలో పాములున్నాయండీ?" అన్నాడాచారి.

అవధానిగారు మాట్లాడలేదు. పాతిక సంవత్సరాల క్రితం జరిగిన ఈ సంఘటన దగ్గరే ఉంది ఇంకా ఆయన మనస్సు.

"సిద్ధయ్య చచ్చిపోయాడేమో!?" అన్నాను నేను.

"మనకేం తెలుస్తుంది?" అన్నారు అవధానిగారు."సూరీడు ఏమయిందో కూడా తెలియదు" అన్నారు బరువుగా.

గబుక్కున లైట్లు వెలిగాయి. బంగళా అంతా వెలుగుతో నిండిపోయింది. ఆచారి ఆనందంతో నవ్వుతున్నాడు. అవధానిగారు ఇంకా ఆలోచిస్తూనే ఉన్నారు. "డ్రైవరు రాగానే వెళ్ళిపోదాం" అంటున్నాడు నారాయణ. తోట అవతల నుంచి ఇంకా నక్కల కూతలు వినపడుతున్నాయి. కాని ఆచారి అంత భయపడలేదు.

✡✡✡

ముక్తికోసం -తల్లావఝుల పతంజలి శాస్త్రి

కళ్ళు మూసుకు పడుకున్నాడు నారాయణ. మామూలుగా అయితే ముద్ద దిగగానే మంచం మీద నడుం వాల్చడం తరువాయి కునుకు తీసేవాడు. పెంకుటింటి అరుగు చల్లగానే ఉంది. గోడ కిటికీ రెక్కలు మూసి ఉన్నాయి.గోడ అక్కడక్కడ బెల్లులూడి ఉన్నాయి. కిటికీ పక్కనే వెంకటేశ్వరస్వామిగా ఎన్టీరామారావు వెలిసిపోయి గుర్తుపట్టడం కష్టంగా ఉంది. కిటికీ రెక్కల సన్నటి సందులోంచి సిగరెట్టు వాసన వస్తోంది. కొడుకు భోజనం కూడా అయిందన్నమాట. నారాయణ ఒత్తిగిలి చెయ్యి తలకింద పెట్టుకున్నాడు. అటూ ఇటూ ఎత్తైన అరుగులు, లోపల వంట గది కాకుండా రెండు పెద్ద గదులు వేయించుకున్నాడు నారాయణ. కట్టినప్పుడు ఆ వీధిలో అతని ఇల్లే మొదటిది. పక్కనే కోమటి కృష్ణమూర్తి తరువాత కట్టుకున్నాడు. నారాయణకి కళ్ళు మూసుకున్నా నిద్రరావడం లేదు. కాయబారు మనిషతను. పొట్టకాయిలా సన్నగా పొడుగ్గా ఉంటాడతను. కనుబొమల మధ్యనుంచీ ఎర్రటి నామం ఎల్లవేళలా నారాయణ చిరునామాలా కనిపిస్తుంది. గుమ్మం దగ్గర చెప్పులు చప్పుడయింది. కోటేశ్వర్రావు చొక్కా బొత్తాలు పెట్టుకుంటూ బయటకి వెళ్ళిపోయాడు. ఇవాళ ఎవరిచేత చెప్పిస్తాడో, కొడుకు మీద కోపం వచ్చిందతనికి.

నిన్న సాయంత్రం పనిగట్టుకుని మేష్టారు టీ ఇచ్చి మరీ సలహా ఇచ్చాడు. ("వాడి మాట వినడంలో తప్పులేదు నారాయణ") మేష్టారు లోకం గురించీ, అందులో ఉండే కొడుకుల గురించీ మాట్లాడాడు. అంతా విని అన్నాడు నారాయణ.

"ఇప్పుడు నా కొడుకు నన్ను చూడ్డంలేదంటం లేదు గదండీ. ఆడి బతుకదీ. నా బతుకూ బావూ ఇదీ."

రెండు బీడీలు కొనుక్కుని తిన్నగా గోదావరి గట్టుకెళ్ళి కూచున్నాడు నారాయణ. రావిచెట్టు కింద కూచుంటే అవతలినుంచి పడవరావడం కనిపిస్తోంది. ఒడ్డుకు రాగానే నాగేశు ఎలాగూ వస్తాడు. వాళ్ళ నాన్న పడవేసేవాడు. అర్ధాంతరంగా పాము కరిచి చచ్చిపోయాడు. పడవ మెత్తగా ఊగుతూ సిల్కు గోదావరిని కత్తిరించుకుంటూ వస్తోంది. ఈ ఊరికోసం గోదావరి ఒంపు తిరిగి వీపు మీద రెండు రేవుల మెట్లు వేయించుకుని పాపికొండల్లోకి వెళ్ళిపోయింది. దరిదాపు డెబ్భై ఏళ్ళుంటాయి నారాయుడికి. మొదటి పదేళ్ళూ మధ్యలో నాలుగురోజులూ తీసేసినా అరవై ఏళ్ళు గోదావరి స్నానం చెయ్యని రోజు లేదు. పడవలాగి నారాయణ దగ్గరికి రానే వచ్చాడు నాగేశు.

"కోట్సర్రావున్నాడా? నన్నోపాలి అయ్రాబాదు తీసుకెళ్ళమని చెప్పు."

"హాయిదరాబా? ఏం పన్లేదట్రా? ఎదవ హాయిదరాబాదు."

"నువ్వూ ఎలతన్నావంటగా?"

"ఆడు రమ్మన్నాడు. నేనెందుకెళతాను పోయెహ"

నాగేశు నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు. నారాయణకి ఒళ్ళుమండిపోయింది. తువాలు భుజం మీద వేసుకుని గట్టు దిగి తులశమ్మ టీ స్టాలు కెళ్ళాడు ("టీ ఎండు కాఫీ స్టాలు. ప్రొ.తులశమ్మ") కొమ్ముగిన్నె పొయ్యి మీద వెచ్చబడుతోంది. బిందె నీళ్ళు బయట గోలెంలో పోసి మొహం తుడుచుకుంటూ వచ్చింది తులశమ్మ.

"నువ్వా నారాయణా? టీగానిమ్మంటావేటి?"

టీ గిన్నెకింద మంట ఊది నారయణకిష్టమైన 'మంచి లైటు టీ' చేసే ప్రయత్నాలు చేస్తూ అడిగిందామె.

"అవునూ కొడుకుతో హాయిదరాబాదు వెళ్ళిపోతన్నావంట నిజవేనా?"

మాట్లాడలేదు నారాయణ. టీ ఇస్తూ ఆమే మళ్ళీ అంది.

"నీ కొడుకు మంచోడు గనక దగ్గిరెట్టుకుని చూసుకుందావని రమ్మంటున్నాడు. అమ్మాబాబూ ఎప్పుడు చస్తారా అని చూసేవోళ్ళే ఎక్కువగా ఉన్నారు. అమ్మెళ్ళిపోయిందనుకో. మన కోటేశరావు మంచోడు గనక ఇంకా అమ్మా బాబూ అనుకుంటున్నాడు ఈ రోజుల్లో."

"అదుండి నే పోయినా బావుండేది."

"అయన్నీ రాసిపెట్టినట్టు జరుగుతాయి. నీకు తెల్దేటీ?"

టీగ్లాసు పక్కన పెట్టి బీడీ వెలిగించాడు నారాయణ. ఎదురుగుండా స్టూలు మీద కూచుని గుండ్రటి మెడకి పట్టిన చెవట కొంగుతో తుడుచుకుంటూ తులశమ్మ అంది.

"ఎక్కడ ప్రేప్తం ఉంటదో అక్కడికే బోతాంగానీ, నువ్వెళిపోతే ఊరు చిన్నబోద్దనుకో."

నారాయణకి ఒళ్ళు జలదరించింది. మనసులో నవ్వుపట్టి అడిగాడు.

"ఏం. అదే? పొమ్మంటున్నారందరూను."

"అన్నయా పెద్ద పండక్కి నువ్వు లేకపోతే కళే ఉంది? నా చిన్నప్పటినుంచీ చూస్తూనే ఉన్నా. ఆ? చలవపంచీ, చేతిలో చిడతలు, తంబూరా తీసుకుని పాడతా ఊరంతా తిరిగేటోడివి. చిన్నప్పుడు నువ్వు పాడే పాట్లన్నీ సరదాగా పాడేదాన్ని నువ్వు లేకపోతే పండెగేటింక? ఇల్లలగ్గానే పండగవుద్దా చెప్పు?"

నారాయణకి కడుపులోంచి కన్నీళ్ళొచ్చాయి. తువాల్తో కళ్ళొత్తుకున్నాడతను. తులశమ్మ కరిగిపోయింది.

"ఊరుకో అన్నయ్యా. పుట్టి పెరిగిన ఊరు వదలాలంటే ఎవరికేనా బాడే" మళ్ళీ కళ్ళొత్తుకున్నాడు నారాయణ.

"ఉండు. ఉంకోపాలి టీ తాగు." అంటూ గబగబా అరగ్లాసు టీ మళ్ళీ చేసిచ్చింది తులశమ్మ. లోపల అప్పటికే చీకటిగా ఉంది. రాటకి దరిదాపు వెలగడం మర్చిపోయిన బల్బు వేలాడుతోంది. లేచి లైటు వేసి మెళ్ళో సూత్రాలు కళ్ళకద్దుకుందామె. నారాయణ కూడా దణ్ణం పెట్టుకుని అన్నాడు.

"నా బాధ అదే. ధనుర్మాసంలో హరినామం చేస్తా.. బిక్షతీసుకుని ఒండుకుని తింటా. మా పెద్దలందరూ అంతే గదే. నేను తలొంచితే గిన్నెలో ఇంతవరకూ పిడికెడు బియ్యం వెయ్యని గడపలేదు. ఏడాదంతా ధనుర్మాసం కోసం బతుకుతానే చివరికి నాకీగతి బట్టింది."

మళ్ళీ కళ్ళనీళ్ళు తిరిగాయతనికి. కాసేపు కూచుని ఇంటికివెళ్ళిపోయాడు నారాయణ. అతనికి ఇంటికెళ్ళాలనీ ఎవరితోనైనా మాట్లాడాలనీ లేదు. ఊరొదిలి కొడుకుతో హైదరాబాదు వెళ్ళిపోతున్నాడని అందరికీ తెలిసిపోయింది. అందరూ అడగడమే. చెప్పులు గుమ్మం దగ్గిర వదిలి లోపలికెళ్ళాడు నారాయణ. "ఎవరూ?" అంటూ కోడలు గరిటెతో ఎదురొచ్చి అతన్ని చూసి లోపలికి వెళ్ళిపోయింది. చొక్కా విప్పి గోడమేకుకి తగిలించాడు. ఒకసారి కావాలని గొంతు సవరించుకుని లోపలి గుమ్మం ఇవతలి గోడకి నెట్టిన చెక్కపెట్టె ముందు కూచున్నాడు. పాడవాటి పాత చెక్క పెట్టె ఇది. దాని మీద వెలిసిపోయిన నామాలు ఇంకా కనిపిస్తున్నాయి. పెట్టె తలుపు తెరిచి రెండుసార్లు దగ్గేడతను. నారాయణ దగ్గు ఫలించి కోడలు వంటింట్లోంచి వచ్చి గుమ్మం వెనక నిశ్శబ్దంగా నుంచుంది. కళ్ళు మూసుకుని ఒకసారి దణ్ణం పెట్టి, శ్రీమన్నారాయణ మూర్తి పాదాలు స్పృశిస్తున్నట్టుగా జాగ్రత్తగా భక్తిగా లోపల్నించి తంబురా, చిడతలు కంచు బిక్షాపాత్రా బైటికి తీశాడు. కోడలు ఉందని తెలుసు. అన్నీ జాగ్రత్తగా అనవసరంగా శుభ్రం చేశాడు నారాయణ. ఆమె కేవీ అర్థంకాక వంటింట్లోకి వెళ్ళిపోయింది. కోపం వచ్చిందతనికి. భళ్ళున పెట్టె మూసేశాడు. తన నిరసన చర్యని ఆమె గుర్తించలేదు. కొడుకూ కోడలూ వచ్చిన ఈ మూడురోజులూ తప్ప రోజూ రాత్రి పొద్దుపోయేదాకా అరుగుమీద చాపవేసుకుని తంబుర పెట్టుకుని పాడుతూనే ఉంటాడతను. కోమటి కృష్ణమూర్తి కూడా ఇంత బువ్వతిని ఇవతలి అరుగు మీద కూచుని శ్రోతగా రాణిస్తుంటాడు. ("పుణ్యం అంతా నీదే. వచ్చే జన్మలో ఇష్ణమూర్తి వాహనవై పుడుతా.")

ఈ జ్ఞాపకాలతో నిద్రపట్టేసింది నారాయణకి. తను చచ్చిపోయినట్టు గోనె సంచిలో తంబురా చిడతలతో సహా కట్టి ఊరవతల పారేసినట్టు కలొచ్చింది. నారాయణ గోదావరి అవతల ఎమ్మార్వో ఆఫీసులో అటెండరుగా పనిచేసి రిటైరయ్యాడు. ఉదయం గోదావరిలో స్నానం చేసి, నాలుగుబారలు ఈది సూర్యనారాయణమూర్తికి నమస్కరించి భార్య సద్దిన సీమవెండి కారియరూ, గొడుగూ తీసుకుని రేవు దగ్గరికి వెళ్ళేవాడతను. పొడుగ్గా, నిశ్శబ్దంగా నిటారుగా అతని నామంలా బతికేడు నారాయణ. ముందుగా ఆఫీసుకొచ్చి అనేక సంవత్సరాల నుంచీ అగరుబత్తీల సిగరెట్ల పొగల్లో ఉక్కిరిబిక్కిరైపోతున్న వెంకట రమణమూర్తి ఫోటో చారికల మీద మరో అగరొత్తి వెలిగించి దణ్ణం పెట్టుకుని చెప్పులేసుకుని ఆ రోజుకి తన కర్మఫలాన్ని అనుభవించడానికి తాజాగా సిద్ధమయ్యేవాడు. మళ్ళీ సాయంకాలం ఇంటికెళ్ళి గోదావరిలో స్నానం చేసి ఇంటికెడుతూ తులశమ్మ దగ్గిర టీ కోసం ఆగేవాడతను. సాయంకాలం సూర్యుడు శ్రీమన్నారాయణుడి చక్రంలాగ, మెరుస్తోన్న గోదావరి నారాయణమూర్తి కండువాలాగ భావించేవాడతను. గోదావరి అతని నరం. నాలుగు వీధులున్న ఆ గ్రామానికతను శ్రీమన్నారాయుణుడి ప్రత్యేక ప్రతినిధిలా ఉండేవాడు. నారాయణ ఒక రుతువులా ఊరికి పరిచితుడు.

పట్టణాల్లో నగరాల్లో ధనుర్మాసం బతికి చెడ్డ ఆడదాన్లా ఉంటుంది. మిగతా ఊళ్ళలాకాదిక్కడ. ధనుర్మాసం ఎక్కడో అడువుల్లోంచి పచ్చగా ఊరి పాపికొండల మధ్య నుంచి చటుక్కున మీద పడ్డ హేమంతంలా గోదారి మీంచి ఊళ్ళోకొస్తుంది. తెలవారకుండా ఓ వారగా గోదాట్లో స్నానం చేసే తులశమ్మకి కూడా తెలిసేది కాదు. గోదారి కొమ్మకి పూసిన బంగారు బంతి పువ్వులా ధనుర్మాసం సూర్యుడు మెరిసిపోతాడు. ఆయన్నే నెత్తిమీద పెట్టుకున్నట్టు తళతళలాడే అక్షయపాత్రలో బంతిపూలతో తంబురలో ధనుర్మాసం ఉదయాన్ని కాలికి కట్టుకున్న వెండి తీగలా అన్ని వీధులకీ తీసికెళ్ళేవాడు నారాయణ. ఒంటిపూట తిని ఉద్యోగిస్తూ భోగివరకూ అతను శ్రీమన్నారాయుణినిలో బతికేవాడు. భిక్ష బియ్యాన్నే ప్రసాదంలా ఒండుకు తినడం ఆచారం అతనికి.

కోటేశ్వరరావు ఒక్కడే కొడుకు నారాయణకి. రాజమండ్రి హాస్టల్లో ఉండి ఫిట్టరు ట్రైనింగ్ చేసాడతను. వాడి చిన్నప్పుడే నారాయణ హరినామాలు చెప్పడానికి ప్రయత్నించి ఊరుకున్నాడు. చిడతలు పట్టుకోడం కూడా రాలేదనికి ("భక్తిగా ఉండాలి. అంటే చెడుపనులు చెయ్యకపోవడం. ఇయన్నీ, చిడతలూ దేవుడు ఇంటాడని కాదు మనకోసం నేర్చుకోవాల మరి") కానీ ఇదంతా ఈ ఒక్క విషయం నారాయణ భార్యకి నచ్చేది కాదు.

మొత్తానికి కొడుక్కి ఒక్క పాటా పదం రాలేదు. శ్రీమన్నారాయుణుడి పట్ల అతని వైముఖ్యం అర్థంకాలేదు నారాయణకి - తండ్రి దగ్గిర ఈత మాత్రం నేర్చుకున్నాడు. ఇప్పుడు అవలీలగా అవతలి ఒడ్డుకి చేరిపోయాడు. నారాయణ భార్య పోయి నాలుగేళ్ళయింది. కొడుకు పెళ్ళి, తండ్రితో గొడవపడ్డాడు కోటి.

"అయితే ఒక్కడివే ఎన్నాళ్ళుంటావు?"

"ఎన్నాళ్ళయితే అన్నాళ్ళు. నేనేం మూలబడ్డానంటావా?"

"నీ కెవడూ చెప్పలేడు నానా. నా దగ్గరుంటే నీకు బాదేంటి? పెదపండక్కి అడుక్కు తిని కూడా తింటేగానీ నీకు తోచదు. నీ బాధ అదీ."

ఆ క్షణంలో నారాయణకి కొడుకు మీద వ్యామోహం దరిదాపు చచ్చిపోయింది. తండ్రి తాతల దగ్గర్నించీ సంక్రమించిన దైవకార్యాన్ని అడుక్కుతినడం అంటే సహించలేక చివాల్న లేచాడు మంచం మీంచి. ధనుర్మాసంలో ప్రాణంతో మిగతా రోజుల్లో శరీరంతో బతుకుతాడు నారాయణ.

"అడుక్కోడం గాదు. అది దేవుడి ప్రాసాదం."

"గాడిద గుడ్డు. నువ్వు ఏడిసిపోతావని నాలుగ్గింజలేస్తారు."

మర్నాట్నించీ అతను వెళ్ళేవరకూ కొడుకుతో మాట్లాడలేదు. రేవు దగ్గర కూడా ఏవీ మాట్లాడలేదు. తరువాత కొడుకు రాసే ఉత్తరాలకి ముక్తసరిగా కార్డురాసి ఊరుకునేవాడు. రోజూ సాయంత్రం తంబూరా తీసుకుని పాడుకోవడం అప్పట్నుంచీ కొత్త అలవాటైంది నారాయణకి. ప్రాణం పోసి తంబూరతో కళ్ళు మూసుకుని తత్వాలు పాడుకుంటే ఒక్కోసారి కృష్ణమూర్తికి భయం వేసేది. పాటతో పాటు నారాయణ కూడా అయిపోతాడనుకునేవాడు. రాత్రి కూడా కృష్ణమూర్తి శ్రోతగా తత్వాలు పాడుకుంటాడు. లావుపాటి కృష్ణమూర్తి కూడా తేలికై ఇంటికి వెళ్ళేవాడు. ("ఆడు గొప్ప భక్తుడే బాబూ") ఈసారి మళ్ళీ కొడుకు రాకముందే ధనుర్మాసంలోనే చచ్చిపోవాలని రోజూ కోరుకునేవాడు నారాయణ. రామాలయానికి వెళ్ళి ఈసారయినా దయుంచు నాయనా అని రాముడికి కూడా అర్జీ పెట్టుకున్నాడు. హయిదరాబాదులో చావడానికి వీల్లేదు. హయిదరాబాదుకీ విష్ణుమూర్తికీ ఏ కోశానా సంబంధం లేదని నారాయణ నమ్మకం.

ఈసారి కోడల్ని కూడా వెంటపెట్టుకు రావడంతో గుండెల్లో బండపడింది నారాయణకి. 'నిన్ను తీసుకెళ్ళడానికే వచ్చాం' అన్నాడు కొడుకు. అలిగి గోదావరి గట్టుకి వెళ్ళిపోయాడు నారాయణ. నారాయణుడు చక్రం పంపించి తన తలకాయ పట్టుకుపోతే బాగుండు ననుకున్నాడు. చీకటి పడుతోంది. తను ఇంక బతికుండడం దండగ. నల్లదారపుండలో తెల్లదారంలా ఆఖరి సంజవెలుగులో స్పష్టాస్పష్టంగా ఉంది. గట్టుదిగి రామాలయానికి వెళ్ళాడు. స్వామికి దణ్ణం పెట్టుకుని ప్రసాదం తీసుకుని వెళ్ళబోతుంటే 'మెట్లమీద కూచో వస్తున్నా' నన్నాడు పూజారి. పూజారిగారు నారాయణవేపు దీర్ఘంగా చూశాడు.

"నారాయణా నువ్వు భక్తికోసం నేను భుక్తికోసం నమ్ముకున్న దేవుడు అంతటా ఉన్నాడు, విష్ణువు అంటే సర్వవ్యాపి అని అర్థం."

"అంటే మీరు కూడా ఊరొదిలి పొమ్మని చెప్పటానికి ఉండమన్నారు."

"అదిగాదు. నీ అంతర్యం తెలీని వాణ్ణికాదు. నీ భక్తి శ్రద్ధల ముందు నా మంత్రపుష్పం ఎంత? కానీ తండ్రి పెద్దాడైపోయాడు, దిక్కులేని చావు చస్తాడని బాధపడే కొడుకులు తక్కువగా ఉన్న రోజులివి. కోటిగాడు మాట్లాడాడు నాతో."

"అడుక్కుతింటున్నానంటండి. అదీ. నా ప్రాణానికి ధనుర్మాసానికీ లింకె."

"నీ భక్తీ, పాటలూ, అవన్నీ వాడికెలా తెలుస్తాయి. రేపొద్దున్న జరక్కూడనిదేదైనా జరిగితే ఎలా? వెళ్ళి వాడి దగ్గర ఉండు. ఎప్పుడేనా గాలి తిరిగితే ఓసారి వచ్చి వెడుదుగాని."

"పోతే ఒకటేపోటం లెండి. సచ్చింతరువాత ఎవడు పూడ్చి పెడతాడో తెలుస్తదా? ధనుర్మాసంలో బిక్ష, హరినామాలు పాట్టం పెద్దల దగ్గిర్నించీ వస్తా ఉంది. ఈ ఊరికి మేం చేసిందదీ."

"నిజవే. కానీ ఏం చేస్తాం? ఆలోచించు."

గుడివేపు తిరిగా దణ్ణం పెట్టుకుంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు నారాయణ.

"నారాయణా నువ్వు ఆంజనేయుడిలాంటి వాడివి పో."

ఆ రాత్రి చాలాసేపు తత్వాలు పాడుకుంటూనే ఉన్నాడు నారాయణ. ఏది పాటో ఏది ఏడుపో తెలీలేదు కోటికి. అంత పెద్ద గొంతుతో పాడటం అతను ఎప్పుడూ వినలేదు.

రెండురోజుల తరువాత రేవు దగ్గరికి చాలామంది వచ్చారు. తులశమ్మ చిన్నపిల్లలా ఏడుస్తూనే ఉంది. ఇల్లు తాళం పెట్టి కృష్ణమూర్తికి ఇచ్చాడు. అవతలి ఒడ్డు చేరేవరకూ ఊరికి దణ్ణం పెడుతూ కూచున్నాడు నారాయణ. ఉదయం గోదావర్లో తనివి తీరా స్నానం చేసి ఈదుకుంటూ మధ్యకి వెళ్ళి ఆగిపోదామనుకున్నాడు నారాయణ.

రైలులాగ మూడు గదుల ఇల్లు. నారాయణకి చెక్క పడక కుర్చీ కొన్నాడు కొడుకు. ఆ కుర్చీలో పగలంతా గుమ్మం దగ్గిర కూచోడం అలవాటైంది. మొదట కొన్ని నెలలు పిచ్చెత్తినట్టయింది నారాయణకి అనుకోకుండా పక్కింటి ఆర్టీసి డ్రైవరు చిన్న కూతురితో రెండురోజులు గోదావరి గురించి కబుర్లు చెప్పి ("అన్ని నీళ్ళు ఏం జేస్తారు తాతా?") మూడో రోజునుంచీ పాటలు నేర్పడం

మొదలుపెట్టాడు. రోజంతా పాపకోసం చూడ్డం అలవాటైంది. సాయంత్రం వచ్చి నేర్చుకోడం కంటే వినేది పాప. ఇంతలో అతనికి ట్రాన్స్‌ఫరై పాప వెళ్ళిపోయింది. కొడుకులాగే మనవడికి కూడా పాటిష్టంలేదు. వర్షాలొచ్చాయి. రోడ్డుమీద నీటి ప్రవాహాలు చూస్తూ కూచునేవాడు. గోదావరికి వరదొచ్చి ఉంటుందా! మనవడికి గోదావరి వరదల గురించి చెప్పాడు. కృష్ణమూర్తి రెండు కార్డులు రాశాడు. ఆ రెండుమూడు నెలలపాటు నారాయణ జేబులోనే ఉన్నాయి. నవంబర్లోనే బాగా చలి తిరిగింది. దరిదాపు పదిరోజుల పాటు జ్వరం తగిలింది. జ్వరం తగ్గి రెండు మెతుకులు తిన్న తరువాత ఓపిక రాగానే తెలుగు కేలెండరు చూసుకోవడం మొదలు పెట్టాడు. ఒకరోజు మధ్యాహ్నం పక్కింటికి బయలుదేరుతూ కోడలు మావగార్ని చూసి ఆగిపోయింది. బాగా సన్నబడిపోయాడు. తలమీద జుట్టు సగం పైగా రాలిపోయింది. డిశంబరు నెలవేపు తీక్షణంగా చూస్తున్నాడతను. నోరు సగం తెరిచి ఉంది.

"అదీ ఈసారి పన్నెండో తేదీన పడిందన్నమాట."

"ఏటండీ?"

ఆమె వేపు అలాగే చూస్తూ ఉండిపోయాడు నారాయణ. నాలుగురోజులైన తరువాత పన్నెండో తారీకు ఉదయమే లేచి తలమీంచి స్నానం చేసి వెంకటేశ్వరుడి పటానికి దణ్ణం పెట్టుకుని చెక్క అటక మీద లుంగీలో చుట్టి తంబుర బయటికి తీశాడు నారాయణ. పడక కుర్చీలో కూచుని గొంతు తగ్గించి హరినామాలు మొదలు పెట్టాడతను. తరువాతెప్పుడో భోజనానికి పిలవడానికొచ్చిన కోడలు అతన్ని చూసి గతుక్కుమంది. పడుకుని వీధి గుమ్మం వేపు చూస్తున్నాడు నారాయణ. బుగ్గలమీంచి కన్నీళ్ళు కారుతున్నాయి.

ఓ రోజు రాత్రి తన కుర్చీ పక్కన చాపమీద కూచుని రాసుకుంటున్న మనవణ్ణి పిలిచాడు నారాయణ.

"నారాయణా."

"మంచి నీళ్ళు గావాల్నా"

"ఒద్దుగానీ నీకి ఊళ్ళో రైల్ స్టేషను తెలుసా?"

"తెలుసు బస్సు నంబర్లు కూడా తెలుసు."

"రైల్లో మనూరు తీసికెళ్ళగలవా?"

మనవడు నారాయణ సమాధానంగా పెద్దగా నవ్వాడు. తాత చెయ్యిమీద చెయ్యివేశాడు. వేడిగా ఉంది తాత చెయ్యి.

తెలతెల వారుతుండగా స్నానం ముగించి యధాలాపంగా అవతలి గట్టువేపు చూసింది తులశమ్మ. ఎవరో స్నానం చేసి ఒళ్ళు తుడుచుకుంటున్నారు. ధనుర్మాసం వచ్చి ఇన్నాళ్ళయినా నిశ్శబ్దంగా ఊళ్ళో సూర్యోదయం అవుతోంది.

"మంచిలైటు టీ జెయ్యి తులశమ్మా?" అప్పటికే లేత ఎండొచ్చింది. పొయ్యి మీద కొమ్ముగిన్నె ఆవిరి కక్కుతోంది. తులశమ్మకి ముందు నోటమాటరాలేదు. బెంచీమీద తువాలు కప్పుకుని ఒణుకుతున్న నారాయణని చూసి వాటంతట అవే పెగిలాయి మాటలు.

"ఏటీ నువ్వే ఇదేటి, ఎపుడొచ్చావు?"

"ఇప్పుడే స్నానం చేసి కృష్ణమూర్తిగారింటికి వెళ్ళి వస్తన్నా. టీ ఇయ్యి ముందు."

"ఏటిలా పాడైపోయావు అన్నయ్యా?"

టీ తాగి బయటికి రాగానే కళ్ళు తిరిగినట్టయింది. పదడుగులు వెయ్యగానే రోడ్డు వెనక్కి తిరిగి అతని మీద పడ్డట్టయింది. ఒళ్ళు తూలిపోతోంది. అలికిడికి తలుపు తియ్యగానే నారాయణని చూసి దెయ్యాన్ని చూసినట్టు విస్తుబోయింది కృష్ణమూర్తి భార్య. ఒక్క గంతులో బయటికి వచ్చేడు కృష్ణమూర్తి. అప్పటికే నామం దిద్దుకుని చిడతలు పట్టుకుని తయారుగా ఉన్నాడు నారాయణ.

"ఒంటోగానీ బాగోలేదా? ఎక్కడికి?"

నారాయణ ఏమీ మాట్లాడలేదు. వీధిలోకొచ్చి అరక్షణం నిలబడి పాట అందుకుని బయలుదేరాడు. అతని నడకలాగే పాట కూడా ఒంకర్లు తిరుగుతోంది. ఒంటి మీద తువాలేసుకుని వెంట పరిగెట్టాడు కృష్ణమూర్తి.

✡✡✡

ధర్మవడ్డీ — గోపిచంద్

నేనా ఊరు ఎందుకు వెళ్ళానో, నాకిప్పుడు జ్ఞాపకం లేదు.

కాని, వెళ్ళటం చిన్నప్పటి స్నేహితుడు కనపడ్డం, తన ఇంటికి నన్ను తీసుకువెళ్ళటం జరిగింది. కలవక కలుసుకోవడం వల్ల, చిన్నప్పటి విషయాలు తలుచుకుని నవ్వుకుంటూ ఉన్న సమయంలో అతడొచ్చాడు. రావటం రావటం ఎలా వచ్చాడని?

ముందు వాకిలి నెమ్మదిగాతెరిచాడు. కుడికాలు గడపలో పెట్టి అటూ ఇటూ దొంగ చూపులు చూశాడు. చంకలో ఉన్న మూటని పదిలంగా రెండో చేత్తో పటుకుని, తల ఓరగా పెట్టి అడుగులో అడుగు వేసుకుంటూ, నా స్నేహితుని దగ్గరకు వచ్చి చంకలో మూట అందిస్తూ, "ఇదిగోనోయ్, డబ్బూ" అన్నాడు.

అసలు అతన్ని చూడగానే నా స్నేహితునికి ముఖ కవళికలు పోయినై. అంతకు ముందున్న సంతోషం మాయమైపోయింది. నెమ్మదిగా మూటందుకుంటూ "మనిషంటే మనిషివి నువ్వే సూరయ్యా! నిఖార్సయిన మనిషిని" అన్నాడు.

ఈ మాటకు సూరయ్య సంతోషం పైకి కనపడనివ్వకుండా "మాటలకేంలే! డబ్బు తీసుకోగానే కాదు. నెలరోజులలో అసలు ఫాయిదాలు ఇచ్చి వేయాలి. వడ్డీ నీకు తెలిసిందేగా - ధర్మవడ్డీ - నెలకు నూటికి రూపాయిన్నర. అదైనా నువ్వని ఇస్తున్నాను" అన్నాడు.

"అలాగే సూరయ్యా, నెలదాటకముందే ఇస్తాను" అన్నాడు నా స్నేహితుడు.

"ఇస్తానంటే కాదు. మాట చెల్లించుకోవాలి. శుభకార్యం ఒకటి తలపెట్టావా? మంచికీ చెడుకీ డబ్బు కావాల్సి వస్తుంది. తర్వాత కోర్టూ గీర్టూ అంటే... "

"అదేమిటి సూరయ్యా! నీ దగ్గర ఎన్ని సార్లు డబ్బు తీసుకోలేదు. ఎన్ని సార్లు ఇవ్వలేదు. ఎపుడైనా మాట తప్పేలు వచ్చిందా?"

"సరేలే, డబ్బు లెక్కపెట్టుకో, అన్నీ రూపాయలే. కొద్దిగా మాత్రం చిల్లర వుంది. మళ్ళీ నాకు రూపాయలే ఇవ్వాలి సుమా! నోట్లూ గీట్లూ అంటే కుదరదు."

"నువ్వు చెప్పాలా, సూరయ్యా" అంటూ నా స్నేహితుడు మూట విప్పాడు. చూసేటప్పటికి నా తల తిరిగి పోయింది అయోమయం అయిపోయింది. ఆ మూటలో ఉన్నవన్నీ రాళ్ళే చిన్న చిన్న రాళ్ళూ, పెద్ద పెద్ద రాళ్ళూ - పెద్దవన్నీ కంకరరాళ్ళూ చిన్నవన్నీ గులకరాళ్ళూ! నమ్మలేక నా స్నేహితుని మొహం పరీక్షగా చూశాను. అతడు మాత్రం ఇదంతా లెక్కచెయ్యకుండా అతి జాగ్రత్తగా ఆ రాళ్ళని తీసి ఒకొక్కటే లెక్కపెడుతూ కూర్చున్నాడు.

నాకేమీ తోచక సూరయ్యవంక చూశాను. అతనింకా తల ఓరగానే పెట్టి లెక్కపెట్టబడుతూ ఉన్నరాళ్ళను రెప్పవెయ్యకుండా పరీక్షిస్తున్నాడు. ఇంతలో నా స్నేహితుడూ లెక్క పూర్తిచేసి, "సరిపోయినయి, సూరయ్యా" అన్నాడు.

"ఇవాళ సరిపోయినై అంటే కాదోయ్. ఇవ్వాళ ఇరవై, మళ్ళీ ఇరవై సోమవారం నాటికి నా డబ్బంతా దమ్మిడీలో ఇచ్చెయ్యాలి" అని జ్ఞాపకం చేసి నా స్నేహితుడితో మూడుసార్లు 'ఇస్తాను' అనిపించుకుని వెళ్ళిపోయాడు సూరయ్య.

అతను ఎప్పుడు వెళతాడా, ఈ తంతేమిటో ఎప్పుడు తెలుసుకుందామా అని కూర్చున్న నేను, అడుగుదామని నా స్నేహితుని వైపుకి తిరిగేటప్పటికి అతడు చేత్తో నన్ను వారించి వాకిలివైపుకి చూపాడు. నేను అటు చూట్టం, సూరయ్య గభాలున తలుపు నెట్టుకుని లోపలకు రావటం ఒకేసారి జరిగింది. మనిషి ఇదివరకుమల్లే లేడు. ఆపాదమస్తకం ఒణికిపోతున్నాడు. కళ్ళు ఎర్రగా జ్యోతులా ఉన్నై. గాలి తెగ పీలుస్తున్నాడు. తల మాత్రం ఓరగానే ఉంది.

ఒక్కక్షణం వాకిటిలో ఆగి రయ్యిన నా స్నేహితుడి మీదకు వచ్చి ఇలా కేకలు వేశాడు "ఏదీ నా డబ్బు? ఎన్నాళ్ళయింది? ఇదిగో అదిగో అంటూ కుక్కని తిప్పుకున్నట్టు నీ ఇంటిచుట్టూ తిప్పుకుంటావా? పరువూ మర్యాదా ఉండక్కర్లా ? కడుపుకి అన్నం తింటున్నావా, గడ్డి తింటున్నావా?"

నిజం చెప్పాద్దూ ఈ మాటలు వినేటపటికి నాకు కంపరం ఎత్తింది, కోపం వచ్చింది. కాని ఏమి చెయ్యటం? గుడ్లు వప్పచెప్పి చూస్తూ కూర్చున్నాను.

నా స్నేహితుడు భయంగా, అతివినయంగా, "ఇదిగో సూరయ్యా, నీ డబ్బు! నాలుగురోజులు ఆలశ్యమైనంత మాత్రాన నీ బోటి పెద్ద మనిషి ఇట్లా నోరుపారేసుకోవటం ఏం మర్యాద?" అని తన దగ్గరే ఉన్న ఆ రాళ్ళమూటని ఇచ్చాడు.

"మరి వడ్డీయో? డబ్బు నాకు చేదై ఇచ్చాననుకున్నావా? నీ తాతకి అచ్చుండి ఇచ్చాననుకున్నావా? పూర్తి పరిష్కారం చేసి కదులు" అని బొడ్లో చెయ్యేసి నిలవేశాడు సూరయ్య.

"ఇస్తాను సూరయ్యా. మరి ఒదులు" అన్నాడు నా స్నేహితుడు

"తీసుకురా" అని ఒక్కతోపు తోశాడు సూరయ్య.

నా స్నేహితుడు పడబోయి నిభాయించుకుని గోడపక్కకు వెళ్ళి, పదిరాళ్ళు ఏరితెచ్చి సూరయ్య చేతులో పెట్టాడు. సూరయ్య వాటిని లెక్కపెట్టుకుని, నా స్నేహితునితో ఒక్కమాటైనా అనకుండా గిరుక్కున వాకిలివైపుకు తిరిగి తల ఓరగానే ఉంచుకుని గబగబా నడిచి వెళ్ళిపోయాడు.

నా స్నేహితుడు ఒక్క నిట్టూర్పు విడిచి నేను అడగవలసిన అవసరం లేకుండా తనే ఇలా చెప్పాడు - "పాపం ఏం చెప్పను? ఒకప్పుడు ఈ ఊళ్ళోకల్లా షావుగారు ఈ సూరయ్య. ఇప్పుడు పిచ్చెక్కి ఈ విధంగా తయారయ్యాడు" అన్నాడు.

"ఇతనికి పిచ్చా! ఎందుకెత్తింది! పిచ్చిలో ఇదేమిటి?" అని అడిగాను.

నా స్నేహితుడు సూరయ్యకథ ఈ విధంగా చెప్పాడు:

"సూరయ్య ఈ గతికి రావటానికి అతని తండ్రే కారణం అతని తండ్రి చాలా మంచివాడు. మెత్తని హృదయం కలవాడు. అటువంటి అతడే, కొడుకు పతనానికి కారకుడయ్యాడు."

"అంత మంచివాడు..?"

"చెపుతాను విను. అంతమంచివాడు అవటం వల్ల దానాలు చేసి, అడ్డాలు ఉండీ తన ఆస్తంతా పాడుచేశాడు. ఆస్తిపోయిన తర్వాత పలరించే దిక్కులేకుండా చచ్చిపోయాడు. ఇది కన్నులారా చూచిన సూరయ్యకు సంఘం మీద కసి ఏర్పడటంలో ఆశ్చర్యంలేదు. అందుకని పూర్తిగా తన స్వభావాన్నే మార్చుకుని, పెత్తనానికి వచ్చినప్పటినుంచీ ఘోరంగా సంపాదించటం మొదలు పెట్టాడు. ఉన్న

నాలుగెకరాలు అమ్మేసి వడ్డీ వ్యాపారం మొదలుపెట్టాడు. మనుషులతో ఉన్న ఇతరత్రా సంబంధాలన్నీ క్రూరంగా తెగ్గొట్టుకున్నాడు. తనకీ మిగిలిన మనుషులకీ ఒక్కటే సంబంధం - వడ్డీవ్యాపారం. తాను వడ్డీకి డబ్బు ఇవ్వటానికి పుట్టాడు, మిగిలిన జనం డబ్బు పుచ్చుకుని వడ్డీ ఇచ్చుకోటానికి పుట్టింది.

"ఇట్లా తయారై, మిగిలిన రైతుల్ని పీల్చి పిప్పిచేసి, కొద్ది సంవత్సరాలలోనే ఊళ్ళోకల్లా షావుకారై కూర్చున్నాడు. ఎంత షాహుకారైనా డబ్బు సంపాదించటం అలవాటైన పద్ధతులు ఎలా మారతాయి - కనక డబ్బు అవసరం లేనప్పటికీ కూడా పాత పద్ధతుల మీదే నడిచాడు. పిల్లికి బిచ్చం పెట్టేవాడు కాదు. అడిలి గీ పెట్టినా దమ్మిడీ జారనిచ్చేవాడుకాదు. బాకీదార్లని ఎన్ని కష్టాలు పెట్టాలో అన్నీ పెట్టి, ఇన్ని నీళ్ళు కూడా పుట్టకుండా చేసి తన డబ్బు పిండుకునేవాడు. ఆ పిండుకోవటంలో కూడా దయాదాక్షిణ్యాల్లేవు. కొంపలు కూలినా, కుటుంబాలు నాశనమైనా అతని హృదయం కరిగేదికాదు.

"అందుకని అతని డబ్బుతోపాటు, అతని మీద ఊళ్ళో అసూయా, అసహ్యం కూడా పెరుగుతూ వచ్చాయి. అతన్ని చూస్తే భయమే తప్ప ఇష్టం ఒక్క వ్యక్తిక్కూడా లేకుండా పోయింది. సూరయ్య ఇదికూడా మంచిదే అనుకున్నాడు. 'నాక్కావలసింది డబ్బు, వీళ్ళ ఇష్టం ఎవరిక్కావాలి?' అంటూ ఉండేవాడు. పరిస్థితులు ఇట్లా ఉండగా ఒక సంఘటన జరిగింది.

ఈ ఊళ్ళోనే అవతలి వీధిలో చంద్రయ్య అనే రైతు ఉన్నాడు. చంద్రయ్య ఈ సూరయ్యకి రెండువందల రూపాయల బాకీ ఇవ్వతేలాడు. చంద్రయ్య అవటం చిన్న రైతే ఐనా టౌన్తో సంబంధం ఉన్న వాడవటం వల్ల, డబ్బన్నా, కోర్టన్నా లెక్కచేయకుండా ఉండే డబ్బున్నవాళ్ళంటే అసహ్యం ఉంది. భయంలేదు. తనకు అవసరానికి డబ్బిచ్చాడనే విశ్వాసం లేకపోగా తన దగ్గర సూరయ్య అన్యాయంగా డబ్బు దోచుకుంటున్నాడనే భావం, కోపం కలిగినవాడు. సూరయ్య హెచ్చువడ్డీ వస్తుందని అతనికి అప్పుపెట్టాడేగాని, పెట్టిందగ్గరనుంచీ డబ్బు రాదేమో అనే భయంతో అతని ఇంటిచుట్టూ తిరగటం మొదలుపెట్టాడు. ఒకరోజు చంద్రయ్యని నా డబ్బిచ్చి కదలమని నిలవేశాడు. నానా దుర్భాషలూ ఆడాడు; దాంతో లోలోపల రగులుకుంటున్న అగ్ని చంద్రయ్యలో నుంచి గుప్పున బయటపడింది - 'నేను దమ్మిడీ ఇవ్వను. నీ వాళ్ళతో చెప్పుకో! ముందు నువ్వు అవతలకు వెళ్ళు' అని కేకలు వేశాడు.

"పాపం సూరయ్యకు ఇట్లాంటి అనుభవం ఇదివరకెప్పుడూ కలగలేదేమో, చంద్రయ్య మాటలకు నిరుత్తరుడై ఒక్క నిమిషం మాట్లాడలేకపోయాడు.

'వెళ్ళవ్!' అని గద్దించాడు చంద్రయ్య. 'చంద్రయ్యా! ఇది నీకు మంచిది కాదు; కోర్టులాగి పప్పు తీయిస్తాను' అన్నాడు సూరయ్య.

'పప్పు తీయిస్తావట్రా మాదచ్చోద్' అని నానా బూతులూ కూసి మెడమీద కర్రవేసి బయటకు గెంటాడు చంద్రయ్య.

"ఇక చూడు సూరయ్య సంగతి. సూరయ్యకు శివం ఎత్తింది. పిచ్చి గంగిర్లెత్తినై. కనపడ్డవాడికల్లా చెప్పాడు. 'ధర్మవడ్డీకూడా ఇవ్వడట! అసలే ఇవ్వడట! ఇదెక్కడన్నా ఉందా? రాములవారి కాలం నుంచీ ఈ వడ్డీ ఉందికదా!' అని మొత్తుకున్నాడు.

"తిరిగి తిరిగి ఇంటికి వెళ్ళి గబగబా నాలుగు మెతుకులు నోటిలో వేసుకుని, అంగోస్తరం నడుంకి కట్టి తెల్లగుడ్డ గొడుగు చంకన పెట్టి టౌన్కి బయలుదేరాడు. అప్పటికీ ఆశ చావక, చంద్రయ్య వాకిలి ముందు సకిలిస్తూ నాలుగైదుసార్లు అటూ ఇటూ పచార్లు చేశాడు. బజార్న పోతున్నవార్ని, నిర్నిమిత్తంగా పిలిచి, 'కొంచెం కోర్టులో పనివుండి టౌనుకి వెళుతున్నాను' అని ఇంటిలో ఉన్న చంద్రయ్యకు వినబడేట్టు చెప్పాడు. 'కోర్టుక్కాదు, నిన్ను పుట్టించిన బ్రహ్మదేవుడి దగ్గరకు వెళ్ళు. ఈ ఊరు నీళ్ళు నీకు ప్రాప్తం లేదు" అని ఇంటిలో నుంచే కేకేశాడు.

"ఇంకేం చేస్తాడు? ఇక తప్పేదేముంది? చంద్రయ్య మాటలకు మనస్సులో కొంచెం జంకినా డబ్బెలా వదులుకోవటం? మనస్సుని తిట్టి లోబరుచుకుని టౌన్కి వెళ్ళి ప్లీడరుతో మాట్టాడి చంద్రయ్యకి రిజిష్టరు నోటీసు ఇప్పించాడు. నోటీసైతే ఇప్పించాడేగానీ మనస్సులో

ఆరాటం హెచ్చింది దిగులు దిగులుగా ఉండి ఏమీ తోచక టౌనులో అటూ ఇటూ తిరిగి ఇంటికి బయలుదేరేటప్పటికి సాయంకాలమైంది. టౌన్ నుంచి మా ఊరు రావాలంటే రోడ్డు దిగి డొంకలో మైలు నడవాలని నీకు తెలుసు. సూరయ్య డొంక దగ్గరకు వచ్చేటప్పటికి బాగా చీకటిపడ్డది. రోడ్డు దిగేటప్పటికి అతనికి భయంవేసింది. ఆ డొంక మా ఒక్క ఊరికి వచ్చేదే అవటం వల్ల మనుష్య సంచారం తక్కువగా ఉంటుంది. పైగా రెండు పక్కలా కొరివిదయ్యాలు తలలు విరబోసుకునట్లు కనబడే గుబురుగా పెరిగిన చెట్లు. సూరయ్య ధైర్యం చేసి ఆంజనేయ దండకం పఠిస్తూ డొంకలో పదిగజాలు నడిచాడు. ఆ పెద్ద మర్రిచెట్టు చూశావుగా, అక్కడకు వచ్చాడు. అకస్మాత్తుగా పక్క పొదల్లో అలికిడి వినిపించి ఆగిపోయాడు. గొంతులో పాట గొంతులోనే ఆగిపోయింది. వెంటనే అతని కోసం పొదలలో కనిపెట్టుక్కూచున్న, చంద్రయ్య ముఠా పదిమంది అతన్ని కమ్ముకున్నారు. మీదకు దూకారు. చావచితక కొట్టారు. పాపం కిందపడేసి సున్నం మీద ఎముక లేకుండా కొట్టారు. చంద్రయ్య మీదపడి అతని జేబులో ఉన్న ఇరవై రూపాయలూ లాక్కొని, 'దావా వేసి వచ్చావు కదా. దాని ఖర్చెవరు పెట్టుకుంటారు? నీ తాత..?' అని కాలికి వచ్చినట్టు తన్ని, మిగిలిన వాళ్ళని తీసుకుని, సూరయ్యని అక్కడే వదిలి వెళ్ళిపోయారు.

క్షణాలమీద ఈ వార్త ఊరంతా పొక్కింది. 'సూరయ్యని కొట్టారంటే సూరయ్యని కొట్టా'రని ఊరంతా ఆ గుబ్బగా చెప్పుకుంది. కాని ఒక్కడు కూడా జాలి తలిచిన వాడేలేడు. 'పాపం' అన్న పాపాన పోయినవాడే లేరు.

"సూరయ్య భార్య దొడ్డ ఇల్లాలు. కూతురు కూడా చాలా మంచిది, కాని బయట జరిగే దురంతాలను వాళ్ళెలా ఆపగలరు? సూరయ్యని మనస్సుని ఎలా తిప్పగలరు?

"తెల్లగా తెల్లవారింతర్వాత ఊళ్ళో షావుకార్లు సూరయ్యని పరామర్శించటానికి వచ్చారు. సూరయ్యకు ఆ రాత్రంతా నిద్రలేదు. ఏదో ఆలోచించుకుంటూ కూర్చున్నాడు. భార్యా కూతురు నోటికి మూతలేకుండా ఏడుస్తున్నా, వాళ్ళ వంకే చూట్టంలేదు. అన్ని దెబ్బలుతిన్నా ఒక్క మూలుగన్నా మూలగటం లేదు.

"షావుకార్లు వొచ్చి, 'సూరయ్య! ఇక చూస్తూ ఊరుకుంటే లాభం లేదు. క్రిమినల్ కేసు బనాయించి వాళ్ళ అంతు కనుక్కోవలసిందే!' అన్నారు.

"సూరయ్య కొంచెం కదిలి, వాళ్ళని నింపాదిగా చూసి, "ఇంకేం? అందరం చందాలు వేసుకుని వ్యాజ్యమాడదాం" అన్నాడు.

"చందాలు" అనేటప్పటికి షావుకార్లు మొహామొహాలు చూచుకున్నారు. "అదేమిటి సూరయ్యా నిన్ను కొట్టటమేమిటి? మేం చందాలు వేసుకోవటమేమిటి?" అన్నాడు.

"ఈ మాటలకు సూరయ్యకు కోపం వచ్చింది. అంత బాధలోనూ లేచి కూర్చుని, "వాళ్ళు నన్ను కొట్టారా? నా దగ్గరవున్న డబ్బుని కొట్టారు. అంటే ఈ ఊళ్ళో వున్న షావుకార్లందర్నీ కొట్టారు. వడ్డీకోసం అప్పుపెట్టే ప్రతివాడినీ కొట్టారు. వడ్డీకోసం అప్పు పెట్టే ప్రతివాడినీ కొట్టారు. నన్ను కొట్టటమైతే ఒక్క చంద్రయ్యే కొట్టేవాడు, మిగిలిన వాళ్ళంతా ఎందుకు కుమ్ముక్కుచేస్తారు? వాళ్ళ కొట్టగలరు కనక అంతా కలిసి కొట్టారు. మనం చందాలు వేసుకోగలం గనక అంతా కలసి చందాలు వేసుకుందాం" అన్నాడు.

"షావుకార్లకు ఇదేమీ అర్థంకాలేదు. దెబ్బలతో సూరయ్య మతిచెడ్డది అనుకున్నారు. నెమ్మదిగా ఒకరి తర్వాత ఒకరు జారుకున్నారు.

"ఎంతమంది చెప్పినా, ఎంత చెప్పినా సూరయ్య వినలేదు కేసు పెట్టనంటే పెట్టనన్నాడు "నా సొంత డబ్బు తగలేసుకుని, ఈ డబ్బున్న వాళ్ళకోసం వ్యాజ్యం ఆడిపెట్టనా? నే చెయ్యను" అనేవాడు.

కానీ చంద్రయ్య ఏ ముహూర్తాన చెయ్యి చేసుకున్నాడోగాని, అప్పటినుంచీ సూరయ్య దశ తిరిగిపోయింది. దెబ్బలు తిని కేసు పెట్టక పోయేటప్పటికి ఊళ్ళోవాళ్ళకి లొల్లి అయిపోయాడు. తాము ఏ డబ్బుని చూచి భయపడుతున్నారో ఆ డబ్బు సమయానికి

సూరయ్యను ఆదుకోలేక పోయేటప్పటికి ఇంకేముంది? పెద్దలు మొదలు కుర్రవాళ్ళవరకూ సూరయ్యని ఆటలు పట్టించటం మొదలుపెట్టాను. ఇల్లు కదిలితే చాలు "సూరయ్య వడ్డీ చంద్రయ్య లాఠీ" అని పిల్లలు చప్పట్లు కొట్టుకుంటూ వెంటపడేవారు. రావలసిన డబ్బు అడిగితే బాకీదార్లు "ఏం తన్నులు కావాలా?" అనేవారు. కొందరు "ఇదిగో అసలు - ఇదిగో వడ్డీ" అని మెట్టికాయలు వేసేవారు కూడాను.

చివరకు సూరయ్యకు చిల్లిగవ్వకూడా వసూలు కాకుండా పోయింది. ఎట్లా వచ్చిన డబ్బు అట్లాగేపోయింది. ఎక్కడ పెట్టిన డబ్బు అక్కడే ఇంకిపోయింది. తనకు తదనంతమయినా వస్తుందనుకున్న ఆస్తిరాకుండా పోయిందని అల్లుడు కూతురుని ఇంట్లోనుంచి వెళ్ళగొట్టాడు.

సూరయ్య భార్యా మొహం చూడలేక వీలైనంత వరకు ఇంట్లో ఉండకుండా తిరుగుతూ కాలం గడిపేవాడు. నాలుగు మెతుకులు నోటిలో వేసుకొచ్చి చెరువుగట్టుమీద రావిచెట్టుకింద ఒంటరిగా కూర్చునేవాడు. ఇన్ని రాళ్ళు ఏరుకుని ఒక్కొక్కటీ చెర్లో వేస్తూ, అవి నీళ్ళలో పుట్టించే కదలికను పరీక్షిస్తూ కూర్చునేవాడు.

కాని ఊళ్ళో జనం అక్కడ అతన్ని సుఖంగా ఉండనివ్వలేదు. అతడు నిస్సహాయుడౌతున్న కొద్దీ జనం తన బలాన్ని ఎక్కువగా ఉపయోగించటం మొదలు పెట్టింది. జనానికి అతనిమీద కలిగిన కసీ, అలుసూ అతనితోనే ఆగక అతని కుటుంబం మీదకు తిరిగింది.

ఒకరోజు సూరయ్య కూతురు వాములదొడ్లో గేదకు మేత వేస్తుంటే నలుగురు పట్టుకుని గాతంలో పడేసి బలత్కారంగా చెరిచారు. వాళ్ళు విడిచిపెట్టి వెళ్ళిన తర్వాత ఆ పిల్లలేచి, నడవలేక కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి, బావిలోపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంగతి తెలిసి సూరయ్య భార్య అవమానాలు సహించలేక కిరసనాయిలు పోసుకుని కాల్చుకుని మరణించింది. అదే సమయంలో విరోధులు సూరయ్య ఇవ్వవలసిన బాకీలు తన పేర ట్రాన్స్‌ఫర్ చేయించుకుని ఇల్లు వేలం వేయించారు.."

ఇంతవరకూ ఓపికతో విని, ఇక ఆపుకోలేక నేను ఈ ప్రశ్న వేశాను "ఈ ఘోరకృత్యాన్ని జరక్కుండా ఎవ్వరూ ఆపలేదూ?"

"తనన్నవాళ్ళేలేరు. చేసుకునది. అనుభవిస్తున్నాడని కొందరూ, ఈ ఉద్రేకంలో అడ్డు చెపితే తమ కుటుంబాలు సరిగ్గా ఉండవేమో అనే బయంతో కొందరూ మొత్తానికి మెదలకుండా ఊరుకున్నారు."

"ఊఁ! తరువాత ఏం జరిగింది?" అని అడిగాను.

"ఇంకేముంది! డబ్బుదారిన డబ్బు నడిచింది. కూతురు అలా అయిపోయింది. భార్య ఇలా అయిపోయింది. సూరయ్య గుండెలు పగిలిపోయినాయి. ఆవులాగా అడలుతూ, ఊరుపట్టుకు తిరిగేవాడు. కొన్నాళ్ళకు పిచ్చెత్తింది. ఇప్పుడెవరన్నా జాలితలచి ఇన్ని మెతుకులు పెడితే తింటాడు. ఆ చెరువు గట్టుమీద రావి చెట్టుకిందే ఉంటాడు. ఎండలో, వానలో అక్కడే ఉంటాడు. ఎప్పుడూ కూతురు సంగతిగానీ, భార్య సంగతిగానీ ఎత్తడు. ఎవర్నీ పలకరించడు. రోజుకొక్కసారి వెళ్ళి తన పాత ఇంటిని దూరాన్నించి చూచుకుని కన్నీరు పెట్టుకుంటూ ఉంటాడనీ, రాత్రిళ్ళు తనకూతురు పడి ఆత్మహత్య చేసుకున్న బావి దగ్గరకు వెళ్ళి ప్రదక్షిణం చేసి వస్తుంటాడని ఊళ్ళో చెప్పుకుంటూ ఉంటారు... ఇదీ సమాచారం..."

నేను కథంతా ప్రాణాలు బిగపట్టుకుని విన్నాను. సూరయ్య కథ చెప్పమన్నప్పుడు ఇటువంటి విషాదగాథ వింటానికి సిద్ధపడలేదు.

"అలవాటు" అన్నాడు నా స్నేహితుడు "పాత అలవాటుని పట్టి ఇలా చేస్తూ ఉంటాడు. మేం కూడా జాలిపడి అతని మనస్సుని ఈ అవస్థలో కష్టపెట్టడం ఎందుకని తగు విధంగా ప్రవర్తిస్తూ ఉంటాం. ఈ సూరయ్య.."

నా స్నేహితుడు చెబుతూ ఉండగానే వీధిలో పెద్దగోల బయలుదేరింది - "సూరయ్య వడ్డీ, చంద్రయ్య లాఠీ," అని కేకలు. బయటినుంచీ సూరయ్య "బే" అని అరిచాడు. ఆ ధ్వని విని మేమిద్దరం బయటకు పరిగెత్తాం.

బయట వీధిలో సూరయ్య రోజుకుంటూ, రొప్పుకుంటూ గబగబా నడుస్తూ వెళుతున్నాడు. చేతిలో నా స్నేహితుడిచ్చిన మూట భద్రంగా ఉంది. వెనక పదిమంది పిల్లలు పోగై గోల చేసుకుంటూ సూరయ్య మీదకు రాళ్ళు విసురుతున్నారు.

నడుస్తూ నడుస్తూ ఉన్న సూరయ్య అకస్మాత్తుగా పరుగెత్తడం మొదలుపెట్టాడు. రయ్యిన పరుగెత్తి ఒక ఇంటిముందు ఆగి, ఒక నిమిషం ఆ ఇంటిని చూచి, అక్కడ నుంచి కదిలి పక్కనే ఉన్న గట్టుమీద నిలబడ్డాడు. పిల్లలంతా ఎక్కడివాళ్ళు అక్కడే ఆగిపోయారు. చేతుల్లో రాళ్ళ చేతుల్లోనే ఉన్నాయి. నేనూ నా స్నేహితుడు ఊపిరి బిగపట్టి చూస్తూ నుంచున్నాం. సూరయ్య వంగి బావిలోకి చూచి లేచి, ఇంటివైపు చూశాడు. ఉండి ఉండి "బే" అని సైరన్ లాగా విన్నవాళ్ళకి సలపరం పుట్టేటట్టు అడిలి రాళ్ళ మూటతో సహా బావిలోకి దూకాడు.

వాళ్ళూ వీళ్ళూ పోగయ్యారు కాని ఏమీ లాభం లేకపోయింది. నా స్నేహితుడికిచ్చిన రాళ్ళమూట తేలినివ్వక పోయింది. శవం బయటకి వచ్చింది. తర్వాత - మేం ఇంటికి వచ్చిన తర్వాత నా స్నేహితుడు చెప్పాడు "ఆ ఎదురుగా ఉన్న ఇల్లే అతని ఇల్లు. అతడు దూకిన బావే అతని కూతురు ఆత్మహత్య చేసుకున్న బావి." !!

✡✡✡

ఎక్స్‌ప్రెస్ ఆగదు

మానస

(1982 యువ - చకపాణి స్మారక కథల పోటీలో అవార్డు పొందిన కథ)

ఒక్కసారిగా పెద్ద గాలి వీచింది. దాంతోపాటే వానజల్లు లోపలికి కొట్టింది. బయట కుండపోతగా వర్షం. అప్పుడప్పుడు ఉరుములూ. మెరుపులూ...!

అంతసేపూ ఆఫీస్ రూములో కూర్చున్న లక్ష్మీపతి మెల్లగా లేచాడు. అతనా స్టేషన్‌కి అసిస్టెంట్ స్టేషన్ మేష్టరు. ఇప్పుడిప్పుడే పాసింజర్ ట్రైన్లేమీ లేవు. బుకింగ్ కౌంటర్ తియ్యాల్సిన అవసరం లేదు. కౌంటర్ మూసేసి గది బయట గొళ్ళెం పెట్టేసి మెల్లిగా ప్లాట్‌ఫారం మీదకి వచ్చాడు.

గోడకి చేరబడి చుట్ట కాల్చుకుంటున్న పాయింట్ మేన్ చంద్రయ్య చుట్ట ఆర్పేసి లేచి నిలుచున్నాడు. వీస్తున్న చలిగాలికి ఒణుకుతూ చేతులు కట్టుకుని లక్ష్మీపతి వెనకాలే నడక సాగించాడు.

"ఏంటి బాబూ చెప్పాపెట్టకుండా పట్టుకుందీ వర్షం."

లక్ష్మీపతి వెనక్కి తిరగలేదు. వర్షంలోనే తన్మయంగా చూస్తూ అన్నాడు -

"ఏం చంద్రయ్యా, వర్షం అంటే నీ కిష్టంలేదా?"

"ఇష్టమే ననుకోండి... కానీ, ఇంత వర్షమా..?" ఆపేసాడు.

లక్ష్మీపతి చంద్రయ్య మాటలు వినట్టు లేదు. అతనికి వర్షం అంటే చాలా ఇష్టం. అందులోనూ తుఫానంటే మరీనూ..! అందుకే దూరంగా వర్షంలోకి చూస్తున్నాడు తన్మయంగా! రోజూ తను చూసే కొండలు ఇప్పుడు కనిపించడంలేదు. ఆ ఊరికి బస్ కోసం వేసిన మట్టిరోడ్డు కూడా కనిపించడంలేదు. అంతా నీరే! ట్రాక్‌కి అవతల గుడిసెలవాళ్ళ పిల్లలు రోజూ ఈ పాటికి అక్కడ ఆడుతూ ఉండేవాళ్ళు. వాళ్ళ పందులు అక్కడ బురదగుంటల్లోనూ.. పోరంబోకు పొలాల్లోనూ తిరుగుతుండేవి. కానీ, ఈ వర్షానికి వాళ్ళుగానీ. అవి గానీ బయట కనిపించడంలేదు. గుడిసెలవాళ్ళని తలుచుకుంటే అలావాళ్ళెలా ఉంటారో...? వర్షం వల్ల వాళ్ళకెంత ఇబ్బందీ? కానీ, తనకి వర్షం అంటే ఎంత ఇష్టం..!? తనది రాక్షసానందమా? కాదు, కాదు; నిజానికి వర్షం తనకి మంచే కాదు; చెడు కూడా చేసింది. అందుకే వర్షానికీ తనకీ ఒక రకమైన అనుబంధం. ఆ మాటే అన్నాడు చంద్రయ్యతో -

"వర్షానికీ నాకూ చాలా పెద్ద అనుబంధం ఉంది చంద్రయ్యా! నా జీవితంలో జరిగిన చాలా సంఘటనలు వర్షంతో సంబంధం ఉంది. నేను కడుపులో ఉన్నప్పుడు అమ్మ నొప్పులతో బాధపడుతోందని తెలిసి నాన్న అమ్మను చేరుకుందామని పెను తుఫానులో తెరచాప పడవమీద లంకరేవు దాటుదామని ప్రయత్నించాడు. ఆయన మొండి ధైర్యమో, ఆనాటి వర్షమోతెలీదు.. ఆయన ప్రాణాల్ని తీసేసింది. ఆ రోజు నేను పుట్టాను -

తర్వాత...

నా మొదటి పుట్టిన రోజున వర్షం. అక్షరాభ్యాసమై స్కూలు కెళ్ళిన రోజు వర్షం... మొదటిసారి మావఁయ్యా వాళ్ళింటి కెళ్ళిన రోజున వర్షం - ఊహ తెలిసి పక్క ఊరు సినిమా కెళ్ళిన రోజు వర్షం.. హైస్కూలులో చేరిన రోజు వర్షం.

తర్వాత, నేను ఎసెల్సీ పాసయ్యానని తెలిసిన రోజు వర్షమే, కాలేజీ పాసయ్యానని తెలిసిన రోజున వర్షంలో పరుగెడుతూ అమ్మని చేరుకున్నప్పుడు అమ్మ కళ్ళల్లో నీళ్ళు! తను పేపర్లో నంబరు తప్పు చూసింది. నేను ఫెయిలయ్యాననుకుంది. కానీ పాసయ్యానని చెప్పినప్పుడు ఆవిడ కళ్ళల్లో ఆనందానికి లయగా బయట వర్షం - నిజానికి అమ్మ సంతోషం వల్లో.. దుఃఖం వల్లో, ఆ రోజున నన్ను పట్టుకుని ఎందుకు వెక్కి వెక్కి ఏడ్చిందో నాకు తెలీదు గానీ.. ఆ రోజు కుండపోతగా వర్షం!

తర్వాత, ఈ వర్షం వల్లే కదా చంద్రయ్యా, అమ్మని సమయానికి పట్నానికి తీసుకెళ్ళలేకపోయాను - ఇలాంటి వర్షంలోనే, ఈ నేలలోనే కదా అమ్మ కలిసిపోయింది."

అక్కడితో చెప్పడం ఆపాడు లక్ష్మీపతి. అతని కళ్ళలో లీలగా నీళ్ళు. అందుకే చంద్రయ్య వైపు తిరగకుండా అలా వర్షంలోనే నడుస్తూ నిలుచున్నాడు. నిజానికి లక్ష్మీపతి చెప్పిందంతవరకే - కానీ.

కాలేజీలో కృష్ణవేణి తనకి మొదటిసారి కనపడిన్నాడూ.. దూరమై కలకత్తా వెళ్ళిపోయిన్నాడూ కూడా ఉరుములతో కూడిన జల్లులే!

కృష్ణవేణి అతని ఆలోచనల్లోకి అడుగు పెట్టబోతోంది. అది అతనికి ఇష్టం లేదు. అందుకే అంతటితో ఆపుచేసాడు. కానీ, తను మరో గంటలో ఆ కృష్ణవేణినే కలుసుకోబోతున్నాడని అతనా క్షణంలో ఊహించలేదు.

అతన్ని అమ్మ తాలూకు ఆలోచనల్లోకి తీసికెళ్ళడం చంద్రయ్య కిష్టంలేదు. అప్పుడు అతను నిజంగానే పసిపాపగా మారిపోతాడు. అందుకే మాటమార్చాడు -

"ఏంటి బాబూ ఈ వర్షం ఇలా పట్టుకుంది?"

లక్ష్మీపతి వెనక్కి తిరిగాడు. చంద్రయ్య ఇంకా ఒణుకుతూనే ఉన్నాడు. అతని కంఠంలోనూ.. కళ్ళలోనూ ఒకరకమైన ఆదుర్దా కనబడింది లక్ష్మీపతికి. అదే అడిగాడు..

"ఏం లేదు బాబయ్యా! మా సంటోడు పట్నం ఎల్లాడు. ఆడింకా తిరిగి రాలేదు. ఈ వర్షంలో మనూరి డొక్కు బస్సు ఎక్కడో ఆగిపోయుంటుంది. ఆడెక్కడ చిక్కిడిపోయాడోనని బెంగగా ఉండాది - ఆగి మళ్ళీ అన్నాడు, "కొంపదీసి నాగావళి గాని పొంగితే.. ఇంటికెలా చేరుకుంటాడు బాబయ్యా?"

ఆ పెద్ద వయస్సులో చంద్రయ్య తాపత్రయాన్నీ.. ఆందోళన్నీ చూస్తుంటే లక్ష్మీపతికి బాధనిపించింది. కానీ అతని అంతరాత్మ చెబుతోంది... కుర్రాడు క్షేమంగా తిరిగొస్తాడని, చంద్రయ్యకి ధైర్యం చెప్పబోతున్న సమయంలో చంద్రయ్య కొడుకు సంటోడు దూరంగా పరిగెత్తుకుని వస్తూ కనిపించాడు. వాడు ఒగర్చుకుంటూ తండ్రి పక్కకి చేరాడు. ఒళ్ళంతా తడిసిపోయింది. చంద్రయ్య పైన తుండుగుడ్డ తీసుకుని సంటోడి తల తుడుస్తున్నప్పుడు.. వాడు ఒగరుస్తూనే చెప్పాడు.

"నయం. మన డొక్కు బస్సు పొలిమేర దాటి తాటితోపు దగ్గర ఆగిపోయింది. అప్పటికే ఏరు దాటేసాం - మేం దాటుతున్నప్పుడే టైర్లు మునిగేంత నీరు. ఈ పాటికి నాగావళి పూర్తిగా పొంగిపోయుంటాది" తన సంచిలో ఉన్న పాడిబట్టలు కట్టుకోమని సంటోడ్ని తరిమాడు చంద్రయ్య.

"అమ్మయ్యా! ఇప్పటికి గుండెబరువు దిగింది లక్ష్మీపతి బాబూ!" అన్నాడు. లక్ష్మీపతి ఆ మాటకి చిన్నగా.. నవ్వుతూ అన్నాడు.

"చూసావా! నన్ను పెళ్ళిచేసుకోమని పోరేస్తావు. ఈ పెళ్ళివల్ల.. ఈ భార్యా పిల్లలవల్లే కదా, ఈ వయసులో కూడా నీకీ ఆందోళన."

"అందులో ఆనందం లేదంటారా బాబయ్యా! కాసేపు గుండె బరువెక్కింది. కానీ వాడు తిరిగి వచ్చినప్పుడు నాకు కలిగిన సంతోషమో... కాదంటారా?"

ఈ విషయంలో అతనెప్పుడూ చంద్రయ్య దగ్గిర ఓడిపోతుంటాడు. అదే అదను చూసుకుని, చంద్రయ్య అతన్ని ఒక ఇంటివాడివు కమ్మని పోరబోతున్న సమయంలో రత్నంగారు ఆపద్భాంధవుడిలా వచ్చి లక్ష్మీపతిని రక్షించారు.

"వన్ ఫోర్టీ వన్ పాసవ్వాల్సిన టైమైంది కదూ.. బండింకా సైటవ్ లేదేం" అన్నాడాయన.

రత్నంగారు ఆ స్టేషనుకి స్టేషన్ మేష్టరు చాలా మంచివాడనీ.. స్టాఫ్‌కి ఏ ఇబ్బంది వచ్చినా ఆదుకుంటాడని వాళ్ళని తన ఆత్మీయుల్లా చూసుకుంటాడనీ వాళ్ళందరి నమ్మకం!

'ఇంత నికార్సయిన మడిసి కాబట్టి ఈయన్నిలా పల్లెటూళ్ళో తొక్కేసారు' చంద్రయ్య అభిప్రాయం.

"అవున్సార్... ముందు స్టేషను లైన్ క్లియర్ మెసేజ్ పంపించేశాను. ట్రాక్స్ చెడటం వల్ల ఎక్కడైనా డీటైన్ చేసేరేమో.." అన్నాడు లక్ష్మీపతి.

"మీరప్పుడే వచ్చేసారేంటి సార్.. ఇంకా గంటన్నర టైముందిగా మీకు."

రత్నంగారు ఒక నిట్టూర్పు విడిచి అతని దగ్గరో సిగరెట్టు పుచ్చుకుని అన్నారు.

"చూడు లక్ష్మీపతి! నువ్వు చాలా అదృష్టవంతుడివోయ్! ఒంటిగాడివి. సంసార బాధలున్నాయ్ చూసావా అబ్బబ్బా...?"

లక్ష్మీపతి నవ్వుతూ చంద్రయ్య వైపే చూసాడు.

"ఇంటికి చుట్టాలొచ్చారోయ్! అదే మా మేనకోడలూ.. వాళ్ళూ, నీకు తెలుసుగా."

"తెలియదండీ!"

"ఏమిటోయ్ ఇంత మతిమరుపు? నీకు చెప్పలా.. హైదరాబాద్‌లో ఎమ్మే చదువుతోందనీ.. పేరేంటబ్బా.. ఆఁ.. ఆఁ.. అనుపమ - దాన్ని చేసుకోవయ్యా మహానుభావా.. చిలకా గోరింకల్లా ఉంటారు అని ఆర్నెల్లు నేను రికార్డ్ పెడితే.. ససేమిరా 'నో' అనేశావు..! "

"ఓ.. ఆ అమ్మాయా?"

"ఆ...! అదే! అది అరకు వేలీ, అనంతగిరీ చూస్తానంటూ దాని స్నేహితురాళ్ళతో నిన్న వచ్చింది. ఈ రోజే వెధవ్వర్షం - లేకపోతే కొత్తవలస పంపించి అక్కడ్నుంచి ఎక్కించుండేవాడిని. వాళ్ళతో ఇల్లంతా గొడవ గొడవ. అఫ్‌కోర్స్, మా దుర్గమ్మ.. అదే మా ఆవిడ - ఆవిడ దృష్టిలో అదంతా సందడనుకో! అసలే మన రైల్వేవాళ్ళు కట్టిన ఈ కొంపలు అగ్గిపెట్లు. ఎడ్జష్టబుల్ గోడలుంటే బావుణ్ణోయ్! మరో గది ఏర్పాటు చేసుకుందును. ఆ గొడవ భరించలేకే గొడుగేసుకుని పరిగెత్తుకొచ్చేసాను. దీని తస్సదియా, ఈ గాలికి చూడవోయ్.. ఈ గొడుగెలా అయిపోయిందో!"

చల్లటి గాలి మెడకింద గిలిగింతలు పెడుతూంటే చాలా హాయిగా ఉంది లక్ష్మీపతికి. సంభాషణల్ని కంటిన్యూ చెయ్యాలి కాబట్టి అన్నాడతను.

"ఈ రోజు కింక ఒన్ ఫార్టీవన్ రాదేమోనండీ!"

వీళ్ళలా మాట్లాడుకుంటున్నప్పుడే మెసేజ్ వచ్చింది. మెసేజ్ పుచ్చుకోడానికి లక్ష్మీపతి పరిగెత్తాడు.

వన్ ఫార్టీవన్ మరో పావుగంటలో అక్కడికి చేరుకుంటుందిట -

వెంటనే త్రూ సిగ్నల్ ఇమ్మని కేబిన్‌కి ఫోను చేసి రంగు జండాలు పట్టుకుని మళ్ళా ప్లాట్‌ఫారం మీదకి వచ్చాడు.

రత్నంగారి గుండెల్లో రాయపడింది.

"ఎలారా భగవంతుడా?" అన్నాడాయన.

"ఏం సార్?"

"దాన్ని మనం ఎంతసేపుంచుకోవాలో.. అసలు వాల్తేర్ స్టేషన్నుంచి దాన్ని తీసుకుంటామని కబురువస్తుందో లేదో.. రాకపోతే ఈ పాసింజర్ల తిండీ.. తిప్పలూ.. నీళ్ళూ గీళ్ళూ.. అబ్బా, ఈ వర్షంలో ఎలాగయ్యా? ఈ దరిద్రపూళ్ళో ఒక హోటలైనా ఉండి చచ్చిందా?"

"వన్‌ఫార్టీవన్ కి కిచెన్ కారుంది కద సార్?"

"అవుననుకో. ఈ పాసింజర్లున్నారు చూసావూ.. వాళ్ళకి ఎక్కడలేని అవసరాలూ ఇలాంటి టైములోనే కలిగేస్తాయి. ఆ కిచెన్ కార్లో ఎంత స్టాకుండి ఏడుస్తుందీ! ఈ తుఫానిలాగే ఉండి.. ఈ బండి రోజుల తరబడీ ఆగిపోతే.. అప్పుడెలా?"

"నిజమే సార్!"

"అయినా ఏం చేస్తాం మన ఖర్మ - నిస్సందేహంగా" నవ్వారు రత్నంగారు మళ్ళీ!

పది నిమిషాల్లో ఒన్ ఫార్టీవన్ అనబడే కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రాజహంసలా ప్లాట్‌ఫారం మీద ఆగింది.

బండి ఆగీ ఆగగానే రాజారావ్ వాళ్ళవైపు పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"నేను చెప్పానా...! చూడు.. అప్పుడే మొదలు" అన్నారు రత్నంగారు.

అక్కడా.. అక్కడా దిగుతున్నారు జనం కంపార్ట్‌మెంట్సునుంచి. చాలా మంది కిటికీల్లోంచి.. తలుపుల్లోంచి ఆత్రంగా తొంగిచూస్తున్నారు.. రాజారావ్ ఆత్రంగా పరిగెత్తుకొచ్చి అన్నాడు.

"హమ్మయ్య బ్రతికించారు సార్!"

"ఎవర్నీ?" అన్నారు రత్నంగారు తాపీగా! రాజారావ్ దెబ్బతిన్నట్టయ్యేడు. లక్ష్మీపతి ఇబ్బందిగా ఫీలయ్యాడు.

"నా మిసెస్ కి ఎడ్వాన్స్‌డ్ స్టేజ్ ఆపి ప్రెగ్నెన్సీ సార్! సడన్ గా ఇప్పుడు నొప్పులు మొదలయ్యాయి. ఏ క్షణంలోనైనా డెలవరీ వచ్చేయొచ్చనిపిస్తోంది సార్. ట్రైనులో ఈ చివర్నించి ఆ చివరి వరకూ పరిగెత్తాను సార్, ఈ సమయంలో నా భార్యకి సహాయం చెయ్యగలవాళ్ళెవరైనా కనిపిస్తారేమోనని, దురదృష్టం సార్, డాక్టరన్నవాడు ఒక్కడు కూడా లేడు. తన బాధ చూడలేకపోతున్నాను - వచ్చే స్టేషను వరకూ ఆగుతుందని పించడంలేదు. ఈ ఊళ్ళో ఎవరైనా డాక్టరుంటే.." రత్నంగారు ఒక్కసారిగా తగ్గిపోయారు.

"ఈ ఊళ్ళో డాక్టర్ కూడానా.. ఇప్పుడెలా? అందులోనూ ఇంత వర్షంలో.." గుంపులు గుంపులుగా వచ్చేశారు పాసింజర్లు. రైలెందుకు ఆగిందీ..? ఎంతసేపు ఆగుతుందీ? క్యాంటిన్ లేదా ఇక్కడ? సిగరెట్లెక్కడ అమ్ముతారూ..? పాలు దొరకవా, ఈ అడవిలో మమ్ములొన్దిలేస్తే మా గతేం కావాలి? అసలేమైందీ? ట్రాక్ చెడిపోయిందా? తలొకరిదీ తలొక ఆర్తనాదం, సగం పైగా చంద్రయ్యే సమాధానాలు చెబుతున్నాడు. రత్నంగారైతే మాట్లాడ్డం మానేశారు. ఎవరేం అడిగినా.. 'తెలీదు.. తెలీదు.' ఒకటే జవాబు ఆయనది.

నిస్సహాయంగా చూస్తూ నిలుచున్నాడు లక్ష్మీపతి. అతనివైపే చూస్తున్నాడు రాజారావ్.

"సార్ ఇక్కడ డాక్టర్ లేడా?"

లక్ష్మీపతి ఆలోచనల్లో పడ్డాడు. ఒక్కసారి ట్రైను మీదుగా ఆకాశంలోకి చూసాడు. అదే వర్షం! ఎడతెరిపి లేని వర్షం! ఇప్పుడెలా..? ఏం చెయ్యాలి?

"మనం ఏం చెయ్యగలం లక్ష్మీపతీ? నీ కేమైనా తోచిందా?"

రాజారావ్ బిక్కమొహంతో చూస్తున్నాడు లక్ష్మీపతిని - "మంగమ్మ ఉంది కదా సార్?"

"ఎవరూ, మంత్రసాని మంగమ్మా? అదేం చెయ్యగలదూ?"

"మరి ఈ పల్లెటూళ్ళో ప్రజలకి ఏ డాక్టర్ పురుళ్ళుపోస్తున్నారు సార్..?"

"అవుననుకో - అయినా ఎక్కడ?"

అక్కడ ఒక్క క్షణం తటపటాయించారు రత్నంగారు. ఆయనింట్లో ప్రస్తుతం సూదిమొన మోపడానికి కూడా ఖాళీ లేదు.

"నా క్వార్టర్స్ అంతా ఖాళీయే కదా! ముందు ఆవిడ్ని నా క్వార్టర్స్‌కి చేరుద్దాం. ఈలోగా చంద్రయ్య మంగమ్మని పిలుచుకొస్తాడు"

"అవునవును. మా దుర్గకి కూడా ఈ రంగంలో కొంచెం అనుభవం ఉంది. తనని కూడా సాయం పంపిస్తాను?"

వాళ్ళలోని మంచితనానికి రాజారావు కళ్ళుచెమ్మగిల్లాయి...! అంతకాలం అతనికి రైల్వేవాళ్ళమీద అదొకరకమైన అభిప్రాయం! కానీ ఆపదల్లోనే, విపత్కర పరిస్థితుల్లోనే మనిషిలోని మంచితనంగానీ, రాక్షసత్వంగానీ.. బయటపడతాయని అతనికప్పుడు అనిపించింది. అతను రత్నంగారి రెండు చేతులూ పట్టుకుని ఆయనకి మాటల్లోనూ.. లక్ష్మీపతికి కళ్ళతోనూ కృతజ్ఞతలు తెలియజేసాడు.

"ఆవిడ లేచి నడవగలిగే పరిస్థితిలో ఉన్నారా?" అడిగాడు లక్ష్మీపతి రాజారావుతో పాటు కంపార్ట్‌మెంటుకి పరుగులాంటి నడకతో చేరుతూ.

"నా క్వార్టర్ ఇక్కడే! లేదంటే స్ట్రెచర్ మీద తీసుకెళదాం" అన్నాడు అతనే మళ్ళీ!

"ఫరవాలేదు సార్. కానీ ఈ వర్షంలో తడిస్తే.. తరవాతేమైనా కాంప్లికేషన్సు..?" అన్నాడతను సంశయిస్తూ.

నిజానికప్పుడా సంశయానికి తావులేదు. అంతకంటే చెయ్యగలిగేదేమీ లేదు కాబట్టి!

"మేగ్జిమమ్ కేర్ తీసుకుందాం. మా దగ్గర గొడుగులున్నాయి. టార్చాలిను ఉంది. వర్షంలో నడవాల్సింది మహా అయితే పది అడుగులు. చంద్రయ్యా! వెళ్ళు. వెళ్ళి సరంజామా అంతా పట్టుకురా. స్ట్రెచర్ కూడా సిద్ధం చెయ్యి. ఎలా వెళతావో నాకు తెలీదు గానీ... వెంటనే వెళ్ళి మంగమ్మని పిలుచుకురావాలి" - ఆర్డర్లు జారీ చేసాడు. కానీ చంద్రయ్యని చూసి మళ్ళీ జాలేసింది. నిజంగా ఇది అతని డ్యూటీ కాదు. అందులోనూ అతను డ్యూటీలో లేడు. కానీ సిన్సియర్ ఫెలో!

కంపార్ట్‌మెంట్లోకి గభాల్న దూరి తన భార్య దగ్గరకు చేరుకున్నాడు రాజారావ్. అంతసేపూ అక్కడ చేరిన ఆడవాళ్ళు పక్కకి తప్పుకున్నారు. బెర్తుమీద దుప్పటి కప్పుకుని సన్నగా మూలుగుతోంది కృష్ణవేణి -

"ఈవిడే సార్ నా భార్య కృష్ణవేణి! అన్నట్టు నా పేరు చెప్పలేదు కదా... ఐ యామ్ రాజారావ్ - ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్‌ని కలకత్తాలో!

కృష్ణవేణిని చూస్తూనే నిలదొక్కుకో లేకపోయాడు లక్ష్మీపతి. మళ్ళీ తన్ని చూస్తాడని అనుకోలేదు. చూడాలనీ అనుకోలేదు. ఏవిఁటీ కాకతాళీయమైన సంఘటన? కృష్ణవేణి మళ్ళీ మళ్ళీ తన ఆలోచనల్లోకి రావడమా...?

వర్షం.. వెధవ్వర్షం! తన్ని అశాంతికే గురిచెయ్యడానికే కాబోలు...

వెనక్కి తిరిగి పారిపోదామనిపించింది లక్ష్మీపతికి. పెట్టెలోంచి క్రిందకి దిగిపోయాడు కూడా. అప్పుడు రత్నంగారు అతన్ని చేరుకుని అన్నారు.

"చూడు పతీ, డ్యూటీ నాకు హేండోవర్ చేసేయ్! నువ్వా అమ్మాయిని నీ క్వార్టర్సుకి తీసుకెళ్ళి ఆ పనిమీదుండు! పిలవని పేరంటంలా వచ్చిన ఈ రైల్ని నేను చూస్తుంటాను! "

✡✡✡

"చూస్తుంటే ఈ మంగమ్మ ఏదో ఆయాలా ఉంది. మాట దక్కించలేదేమోననుకున్నాను - వర్రీ లేకుండా పురుడు పోసింది. థాంక్యూ వెరీమచ్ లక్ష్మీపతిగారూ! " రాజారావ్ కళ్ళనిండా కృతజ్ఞతలే.

"ఇట్సోకే - పాపం ఆవిడ కొంత రెస్ట్ తీసుకుంటే మంచిది. మీరిలా ఈజీ చైర్లో నడుం వాల్చండి. నే వెళ్ళి.. రైలు సంగతెంతదాకా వచ్చిందో చూసొస్తా ఈ లోపల! "

"అలాగే సార్!"

✡✡✡

"మొత్తానికి భలేగా ఉందయ్యా ఫార్స్. మన ఊళ్ళో దిక్కులేక కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఆగడం.. టిక్కెట్టు కొని ఎక్కిన పాసింజర్లంతా రైల్లోనూ.. మన ఫ్లాట్ ఫారం మీదా దేవుళ్ళాడ్డం పడుకోడం.. రియల్లీ ఫన్నీ అనుకో" అన్నారు రత్నంగారు సగం ఆరిపోయిన సిగరెట్టుని అతికష్టం మీద మళ్ళీ వెలిగించి.

"ఆవిడ ధైర్యంగానే ఉన్నట్టుంది సార్! అతగాడు నీరుకారిపోతున్నాడు, పైకి ఏదో ధైర్యంగా మాట్లాడుతున్నా! సరైన వైద్యసదుపాయం దొరకలేదనే అతని తాపత్రయం!"

"అది సహజం అనుకో - అయినా పిరికివాడంటున్నావు కదా! ఓ పని చెయ్!"

"చెప్పండి సార్!"

"చంద్రయ్యని పిలు!"

"చంద్రయ్యా... ఓ చంద్రయ్యా...! అయ్యగారు పిలుస్తున్నారు -"

చంద్రయ్య వచ్చాడు.

"చూడూ.. మనింటికెళ్ళి బీరువాలో ఓ నల్లసీసా ఉంటుంది - అది పట్టుకొచ్చి లక్ష్మీపతిగారింట్లో మంగమ్మకివ్వు"

"చిత్తం బాబయ్యా!"

"సీసా ఏవిఁటి సార్..?"

"బ్రాందీనయ్యా...! ఎప్పుడైనా సరదాకి పనికొస్తుందని ఉంచాను. కొంచెం అది అమ్మాయికిస్తే.. అదే మెడిసిను!"

లక్ష్మీపతి నవ్వాడు -

"మనిద్దరం రైలు కదలిక గురించి తీక్షణంగా మాట్లాడుకుంటున్నాం అనుకుని జనం లోపలికి జొరబడటం లేదు - ఆలస్యం అయితే దూసుకు వచ్చేస్తారు. పద పద... ఫ్లాట్ ఫారం మీదకి పోదాం." లక్ష్మీపతి అనుసరించాడు. మధ్యలో ఆగారు రత్నంగారు.

"ఈ దిక్కుమాలిన రైల్ని వాళ్లేరు వాళ్ళెప్పుడు పుచ్చుకుంటారో ఆ జనాల్లాగే నాకూ తెలీదుగానీ... మళ్ళీ మళ్ళీ మెసేజీలు రావడం మొదలెడితే... కదలడం కష్టం, నేనోసారి నీ క్వార్టర్స్‌కి వెళ్ళొస్తా! నువు డ్యూటీలో ఉండు."

"అలాగే సార్!"

రత్నంగారు హడావిడిగా వెళ్ళిపోయారు.

లక్ష్మీపతి మనసు నిండా ఆలోచన్లు - ఆలోచనలన్నీ కృష్ణవేణిమీద? కానీ భౌతికంగా చుట్టూ జనం.

'రైలెప్పుడుకదులుతుంది..? భోజనాల్లేవా ఇక్కడ..? ట్రాక్ కొట్టుకుపోయిందా? సిగిరెట్లు కూడా అమ్ముతారూ...? ' ఎవడి బాధ వాడిది.

✡✡✡

" మంగమ్మ చెప్పిందనే కాదు లక్ష్మీపతీ.. మా ఆవిడ శాసించేసింది - అమ్మాయి నాలుగు రోజులు కదలకూడదని! సారీవోయ్ నీ కిబ్బంది! "

"ఫరవాలేదులెండి!"

"ఫరవాలేదని నువ్వనేస్తే కుదర్దు! ఓ పని చెయ్యి! వంటాగింటా పెట్టుకోకు మా ఆవిడ క్యారేజీ పంపించేస్తుంది. అతనికీ? ఎల్లుండి కాబోలు పత్యం.. అవన్నీ నువ్వెక్కడ తాపత్రయం పడగలవూ..... అన్నీ మా ఆవిడ చూస్కుంటుందిలే."

"అలాగే సార్!"

"వెరీ గుడ్ - నీకో మాట చెప్పనా. కొన్ని కొన్ని అదృష్టాలెలా ఉంటాయో చూడు ఈ ఇరవై బోగీల కోరమాండల్‌లో మన నెత్తెక్కడానికి ఒక రైల్వే పెద్ద పక్షి లేదు. అవునయ్యా ఒక్కడూ.. ఒక్కడున్నా చాలు. మన్ని తినేసేవాడే ఈ పాటికి.."

రత్నంగారి సెన్సాఫ్ హ్యూమర్‌కి పగలబడి నవ్వాడు లక్ష్మీపతి.

✡✡✡

ఆ రోజు ఉదయాన్నుంచే వర్షం తగ్గుముఖం పట్టింది. గాలికూడా తగ్గింది కానీ... ఇంకా జల్లులు పడుతూ ఉన్నాయి. లక్ష్మీపతి డ్యూటీ ముగించుకుని ఇంటివైపు నడక సాగించాడు. అతను చాలా అన్యమస్కంగా ఉండడాన్ని చంద్రయ్య గమనించాడు. నిజానికి అతన్ని కనిపెట్టి ఉంచడం తన బాధ్యతగా చంద్రయ్య ఎప్పుడో స్వీకరించాడు. అందుకే అతని వెనక మెల్లగా నడవనారంభించాడు. చంద్రయ్య మనసులో ఎన్నో ఆలోచనలు! ఎన్నెన్నో ప్రశ్నలు....! అతన్నడగాలనే అనుకుంటున్నాడు. అందుకే నెమ్మదిగా...

"ఏంటి బాబూ, ఈ రెండు రోజుల్నుంచీ మిమ్మల్ని చూస్తున్నాను. మీరు ఇంతకు మునుపులా లేరు. కారణం చెప్పరా బాబయ్యా..?"

ఈ ప్రశ్నని లక్ష్మీపతి ఊహించలేదు. చంద్రయ్యలో అంతటి గమన శక్తి ఉంటుందని అతను అనుకోలేదు. సమాధానం చెప్పే లోపలే ఇంటిని చేరుకున్నాడు. గేటు తీస్తుండగా చూసాడు. గుమ్మంలో కూర్చుని ఉంది కృష్ణవేణి. ఆవిడ పరిస్థితి చూస్తే తన కోసమే ఎదురు చూస్తున్నట్టనిపించింది. తనతో మాట్లాడ్డానికి ప్రయత్నిస్తునట్టనిపించింది.

"రాజారావ్ లేరా?" అని అడిగాడు.

"సైకిలేసుకుని పక్కూరికెళ్ళారు. ఇంటికి వీలైతే ... టెలిగ్రామో.. ఫోను గానీ చేస్తానని. ఇప్పుడే వచ్చేయచ్చు..!"

ఆ టైములో లక్ష్మీపతి వెనకాల చంద్రయ్య ఉండడం ఆమెకి నిరాశ కలిగించింది. అతనితో ఒంటరిగా మాట్లాడ్డామన్న కోరికకి అతను ఆటంకంగా నిలిచాడు. కానీ ఆమెకా అవకాశం ఇవ్వడం లక్ష్మీపతికి ఇష్టంలేదు. తనకి ఆవిడ కృతజ్ఞతలూ.. సంజాయిషీలూ సానుభూతులూ అక్కర్లేదు. అవి అతన్ని మరింత అశాంతికి గురిచేస్తాయని అతని ఆందోళన - అందుకే -

"పద చంద్రయ్యా... కాస్సేపలా తిరిగివద్దాము" అంటూ వెనక్కి తిరిగాడు.

చంద్రయ్య మళ్ళీ మాటలు ప్రారంభించాడు...!

"నేనడిగిందానికి మీరు జవాబివ్వలేదు బాబూ!" అతనడిగిన ప్రశ్నని ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకుని అడిగాడు లక్ష్మీపతి...!

"నేను హుషారుగా లేనని ఎందుకనుకుంటున్నావు?"

"ఆ మాత్రం తెలుసుకోలేనా బాబయ్యా! మిమ్మల్ని మూడేళ్ళబట్టి చూస్తున్నాను. ఈ రెండురోజులూ ఆఫీసులో మతిమరుపు. ఉదయంపూట చూస్తే కళ్ళలో ఎరుపు. తిండి సరిగా తినకపోవడం... ఇవన్నీ తెలుసుకోలేకపోతే.. నేనెందుకు బాబూ ఇక్కడుండం?"

చంద్రయ్య ఆప్యాయతకి చలించిపోయాడు లక్ష్మీపతి. అతనికి ప్రేమంటే ఏవిటో చవిచూపింది అమ్మ... ఆ తర్వాత ఇతనేనేమో..

"నీ కెందుకు చంద్రయ్యా నా మీద ఇంత అభిమానం?"

ఆ ప్రశ్నకి అతని దగ్గర సమాధానం లేదు. మౌనంగా ఉండిపోయాడు. కాస్సేపాగి అన్నాడు.

"చూడండి బాబూ! తల్లి తర్వాత అంతటి ప్రేమ మళ్ళీ మీరు భార్యా పిల్లల దగ్గర పొందుతారు. ఇది నిజంగా అనుభవం మీద చెబుతున్నా. చూడండి బాబూ, ఆ కృష్ణవేణమ్మ అడుగుపెట్టాక ఇంటికి ఎంత నిండుతనం వచ్చిందో..! ఇంట్లో గాజుల చప్పుళ్ళు, చంటిబాబు కేకలు. అవన్ని మనసుకి ఇంటికీ కూడా ఎంతో నిండుతనం తెస్తాయి బాబూ! మీరు కావాలనుకుంటే మీకు ఆవిడలాంటి పిల్లే దొరకదంటారా బాబూ!"

లక్ష్మీపతి మనసుని అదుపులో పెట్టుకోలేకపోయాడు. మొట్టమొదటిసారిగా నోరు జారాడు.

"ఎందుకు చంద్రయ్యా! అస్తమానం ఆవిడ్ని గుర్తుచేస్తూ నన్ను బాధపెడతావు?"

"మీరు నాకు తెలియదనుకుంటున్నారు కానీ నేను ఒక విషయాన్ని పసిగట్టాను బాబూ, చెప్పమంటారా? కృష్ణవేణమ్మ గారితో మీకింతకు ముందే పరిచయం ఉంది కదండీ?"

"నీకు... నీకెలా తెలుసు?"

"క్షమించండి బాబయ్యా! ఈ విషయం తెలుసుకుందామనే నేనీ ఊసెత్తాను. చెప్పండి బాబూ, ఆవిడ మిమ్మల్ని మోసం చేసేసింది కదూ, మిమ్మల్ని ప్రేమించి ఆ రాజారావుని చేసుకుంది కదూ..!!"

లక్ష్మీపతికి గతం గుర్తొచ్చేస్తోంది. దుఃఖం బయటికి తన్నుకొచ్చేస్తోంది. దాన్ని ఆపడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు - తనకి కృష్ణవేణంటే ఎందుకా మమకారం..?

" ఈవిడ మూలాన్నే కదూ బాబూ మీరిలా పెళ్ళిచేసుకోకుండా ఉండిపోవడం..! ఆవిడ్ని చూడండి, మొగుడూ, పిల్లాడితో... ఎంత ఆనందంగా ఉందో! మీకేం బాబూ, ఏం తక్కువ మీకు, మీరే సన్యాసం ఎందుకు పుచ్చుకోవాలి? ఆవిడ్నే వెళ్ళి అడిగేస్తాను బాబూ" అన్నాడు చంద్రయ్య ఆవేశంగా -

ఇంక ఆ సంభాషణ పొడిగించడం అతనికిష్టంలేదు. సాయంత్రం ఐదుగంటలే అవుతున్నా మెల్లిగా చీకట్లు ముసురుకుంటున్నాయి. కీచురాళ్ళ రొద అప్పుడే మొదలయిపోయింది.

చంద్రయ్య భుజం మీద బలంగా చెయ్యి వేస్తూ అన్నాడు.. "పద చంద్రయ్యా! చీకటిపడుతూంది. తర్వాత దార్లో..." అన్నాడు అతనితో.

"నీకు తెలిసిన విషయం నీలోనే ఉంచుకో చంద్రయ్యా! ఇంకెలాగూ వాళ్ళు రేపో ఎల్లుండో వెళ్ళిపోతున్నారు. వాళ్ళ దగ్గర, ముఖ్యంగా ఆవిడ భర్త దగ్గర మాత్రం ఈ ప్రసక్తిగానీ.. అతనికి అనుమానం కలిగేలాగానీ మాట్లాడొద్దు.. నాకీ సహాయం చెయ్యి చంద్రయ్యా" అన్నాడు.

ఇంటి గేటు దగ్గరే చంద్రయ్య అతని దగ్గర శలవు తీసుకుని వెళ్ళిపోయాడు. అతను గేటు తీసుకుని లోపలికి ప్రవేశించినప్పుడు ఇందాకటి పరిస్థితే - రాజారావ్ ఇంకా తిరిగివచ్చినట్టు లేదు. ఆ విషయమే కృష్ణవేణి చెప్పింది.

"ఆయనింకా రాలేదు. చీకటిపడుతోంది కూడా?"

"వెళ్ళి చూసిరానా...?"

"వద్దు. అక్కర్లేదు. వచ్చేస్తారు?"

"సరే అయితే...!"

లక్ష్మీపతి ఈజీచైర్ తెచ్చుకుని బయట గార్డెన్‌లో వేసుకుని కూర్చున్నాడు. సన్నగా తుంపర. ఇలాంటి జల్లు అంటే అతనికి చిన్నప్పట్నించీ సరదా! అమ్మ చూడకుండా ఇలాంటి జల్లులో నుంచునేవాడు, గెంతేవాడు, ఆడుతుండేవాడు - అమ్మ మందలించేది!

లోపల్నుంచి చంటాడి ఏడుపు వినిపించడంతో కృష్ణవేణి లోపలికి వెళ్ళింది. అతను ఆనందించాడు. మళ్ళీ ఆలోచనల్ని భోంచేస్తూ అలా ఆకాశంలోకి చూస్తూ పడుకున్నాడు.

కృష్ణవేణి చంటాడ్ని నిద్రపుచ్చి బయటకు వచ్చినప్పుడు లక్ష్మీపతి అలాగే పడుకుని ఉన్నాడు. అలికిడికి కళ్ళు తెరిచాడు. అతనితో సంభాషణెట్లా ప్రారంభించాలని తటపటాయిస్తూ నిల్చుందామె. ఆమె కతను చాలా ఉన్నతంగా కనిపిస్తున్నాడు. అందుకే, అతనితో మాట్లాడ్డానికి ధైర్యం చాలడంలేదు. కానీ తన కృతజ్ఞతని అతనికి తెలియజేసుకోడానికి ఇంతకంటే సరైన అవకాశం దొరకడం కష్టం అని ఆమెకి తెలుసు. వరండా అంచున కూర్చుంటూ అంది.

"మీతో మాట్లాడ్డానికి కూడా నేను తగనని నాకు తెలుసు. నేను పాపిష్టిదాన్ని. మీకు చాలా అన్యాయం చేసాను. అయినా మీ ముందు నిల్చుని వేడుకుంటున్నాను - నన్ను క్షమించరూ...!"

"మీరు నన్ను క్షమించలేదనీ.. ఎప్పటికీ క్షమించలేరనీ తెలుసు. అందుకే, నేను మీకు తీరని అన్యాయం చేసినా, మీరు మమ్మల్ని ఆపదలో ఆదుకున్నారు. మీరాక్షణంలో మమ్మల్ని ఆదుకోకపోయినా నేను చాలా సంతోషించి ఉండేదాన్ని. కానీ మీరు నా ప్రాణాల్ని నిలబెట్టి, నన్ను మానసికంగా చిత్రహింసకి గురిచేసారు. నేను ఎంత క్రిందకి ఉన్నానో గుర్తుచేసారు. ట్రైనులో మిమ్మల్ని చూసినప్పుడు నేను కొంత భయపడ్డాను."

'ఎందుకు? తను అవకాశం తీసుకుంటాడనా..?'

"నిజం చెప్పండి, మీకు నా మీద కోపమే లేదా?"

'కోపం?' అతను నవ్వుకున్నాడు. 'నీ మీద ప్రేమ తప్ప మరే భావమూ నాకు ఉండేది కాదు. ఇప్పుడసలు ఏ భావమూలేదు కృష్ణా' అని చెబుదామనుకున్నాడు కానీ, అది ఆత్మవంచన అందుకే, మాటమార్చాడు...

"సుఖంగా ఉన్నావు కదా..!"

"మీ విషయం చెప్పండి. అర్థంచేసుకోగలిగాను మీ అమ్మగారు ఇక లేరని - నిజమే కదూ!"

"అమ్మ పోయి ఏణ్ణర్ధమైంది...!"

"ఇలా ఒంటరిగా ఎంతకాలం ఉండిపోతారు, ప్లీజ్ పెళ్ళిచేసుకోండి! నాకు ఎంతో ఆనందంగా ఉంటుంది. మీరు పెళ్ళి చేసుకుని ఉంటే నే చేసిన అన్యాయానికి నేను ఇంత కుంగిపోయి ఉండేదాన్ని కాదు. ఈ ప్రపంచంలో ఒక ఆడదాన్ని అదృష్టవంతురాల్ని చెయ్యండి. నేనా అదృష్టాన్ని చేతులారా పోగొట్టుకున్నాను. ప్లీజ్, మీరు పెళ్ళిచేసుకోండి" అని అర్థించిందామె.

"పెళ్ళి చేసుకోమంటావా.. సరే నేనో అమ్మాయి కోసం ఎదురు చూస్తున్నాను కృష్ణా! ఆ అమ్మాయి పేరు కృష్ణవేణి" అనేద్దామనుకున్నాడు కఠినంగా.. కసిగా, మళ్ళీ ఆమెని నోరెత్తనీయకుండా! "ప్లీజ్ నా మాట మన్నించరూ!" బొంగురుపోయింది ఆమె గొంతు.

"కృష్ణా!"

"నా పాపానికి నిష్కృతి అన్న స్వార్థం కాదు; నరనరాంతరాల్లో నా కోరికది. దయచేసి పెళ్ళిచేసుకోరూ..!"

లక్ష్మీపతి మాట్లాడలేదు. ఆకాశం వైపు చూస్తున్నాడు. మళ్ళీ మబ్బులు. ఏక్షణాన్నైనా వర్షం పడొచ్చు. గాలీ హోరూ కూడా మొదలైంది.

రెండు నిమిషాలు చూసి కృష్ణవేణి గభాల్న లోపలికి వెళ్ళి తలుపేసుకుంది. ఆమె వెక్కి వెక్కి ఏడ్వడం అంత ఈదురు గాల్లోనూ స్పష్టంగా వినపడింది లక్ష్మీపతికి..!

✡✡✡

"ఏమిటయ్యా.. ఇంత రాత్రిపూట వచ్చావు. ఎనీ ప్రాబ్లమ్?" రత్నంగారు కంగారుగా అడిగారు.

"నథింగ్ సార్... ఒక వేళ ప్రాబ్లమంటే మీకుండాలి - మీరింకా అవకాశం ఉందంటే మీ అనుపమని.. అదే మీ మేనకోడల్ని నే చేసుకుంటాను సార్!"

" దుర్గా.. దుర్గా, లే! మొద్దు నిద్రా నువ్వూనూ.. కొంచెం పంచదార పట్టుకురా లక్ష్మీపతి నోట్లో వెయ్యాలి - చాలా సంతోషం లక్ష్మీపతీ.. వచ్చే నెల్లో పెట్టించేస్తానయ్యా ముహూర్తం!"

"మీ ఇష్టం..! కానీ ముందుగా అనుపమతో కాస్త మాట్లాడాలి!"

"కాస్తేమిటీ బోలెడు మాట్లాడు - ఇప్పుడే పిలుస్తా!"

"ఇప్పుడొద్దు. రేపు సాయంత్రం వస్తా! అప్పటిదాకా దయచేసి ఎవరికీ చెప్పొద్దు... దుర్గమ్మగారికి కూడా!"

"సరే నీ ఇష్టమే"

"థాంక్యూ, మరి వెళ్ళిరానా..!"

'వెళుదువుగానిలేవయ్యా.. ఉండో నిమిషం! గుండెల మీద బరువు దింపుతున్నావు. ఆడపిల్ల లేకపోయినా.. కన్యాధార పోసే భాగ్యం కలిగిస్తున్నావు -" ఆప్యాయంగా కౌగిలించుకున్నారాయన.

"మరి నే వస్తానండీ..!"

"అరే.. మళ్ళీ అదే మాటా..?"

"సార్.. నేను వచ్చింది ఇంట్లోంచి కాదు.. డ్యూటీలోంచి.. మరి వస్తా!"

"వెరీ కైండాఫ్ యూ పతీ..."

ఆయన కళ్ళు చెమర్చాయి. వెళ్ళిపోతున్న లక్ష్మీపతిని చూస్తూ నిల్చున్నారు.

✡✡✡

డ్యూటీ అయిన తర్వాత వచ్చి పడుకున్నాడు లక్ష్మీపతి. సరిగ్గా నిద్రపట్టలేదు. అలా దొర్లుతూనే ఉన్నాడు పక్కమీద. తెల్లవారు ఝామున పట్టింది నిద్ర.

ఉదయం ఆరుగంటలకి పాలమనిషి కేకతో అతనికి మళ్ళీ మెలుకువ వచ్చింది. లేవాలనిపించలేదు. కళ్ళుమండుతున్నాయతనికి. రెప్పలు మూతలు పడిపోతున్నాయి. అయినా కష్టం మీద లేచాడు. ఇంట్లోంచి రాజారావ్ మాటలు వినిపిస్తున్నాయి. వాళ్ళప్పుడే తయారైపోయుంటారనుకున్నాడు.

ఇంకో రెండు గంటల్లో పాసింజర్ వస్తుంది. అంతే! రెండు గంటలే- అంతటితో ఆఖరు. ఇక మళ్ళీ ఈ జన్మకి కృష్ణవేణి కనపడదు. కాదు; తనామెకు కనపడకూడదు.

"బాబూ పాలు తీసుకోరా?"

పాలవాడు గట్టిగా అరిచాడు. లక్ష్మీపతి ఆలోచనల్లోంచి బైటపడ్డాడు. ఈలోగా రాజారావ్ గిన్నె పట్టుకుని బయటికి వచ్చాడు. లక్ష్మీపతిని చూసి పలకరింపుగా నవ్వాడు.

"మీరు ఆలస్యంగా లేవడం రియల్లీ ఎయిత్ వండర్.. అనుకుంటా!"

"మధ్యాహ్నం డ్యూటీ కదా... కాస్త బద్ధకంగానే పడుకున్నాను. మీరు రెడీ అయిపోయారా?

"ఈ ఆడవాళ్ళతో అప్పుడేనా! పొద్దున్న నాలుగు గంటలకి లేచాం. ఇంక ఎక్కడి సామాన్లు అక్కడే ఉన్నాయి."

"అరగంటలో తయారై నేనూ హెల్ప్ చేస్తా."

"ఇంకా ఆ ట్రబుల్ కూడా ఇవ్వాలి. మీకు - మీరు హాపీగా పడుకోండింకో గంట!"

"నో... నాట్ లైక్ దట్...!"

✡✡✡

"పచ్చ జండా చూపడం నా కిష్టం లేదు. కానీ అసలే మా కంట్రోలరు కర్కోటకుడు. ట్రైన్ ఎక్కువేసేపు డీటైన్ చేసేస్తే చంపేస్తాడు - గుడ్ లక్ రాజారావ్" అన్నారు రత్నంగారు.. జండా సిద్ధంగా పట్టుకుని. అతను రత్నంగారికి మనఃపూర్వకంగా నమస్కరించాడు. చంద్రయ్య దగ్గిర శలవు తీసుకుని లక్ష్మీపతి చేతిని ఆప్యాయంగా నొక్కి మళ్ళీ అన్నాడు.

"మీ ఋణం ఎప్పటికీ తీర్చుకోలేం సార్."

కృష్ణవేణి కిటికీ దగ్గర కూర్చుని ఇటువేపే చూస్తోంది. ఆమె ముఖంలో బాధ కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. నిర్లిప్తంగా లక్ష్మీపతివైపు చూసింది.

రాజారావు రైలెక్కి గుమ్మంలో నిలుచున్నాడు. మెల్లిగా కదిలింది ట్రైను. అలా నిలబడి చెయ్యి ఊపుతూనే ఉన్నాడు - మెల్లమెల్లగా దూరం అయింది ట్రైను.

లక్ష్మీపతి.. భారంగా నడుస్తూ.. ఆఫీసు గదిలోకి అడుగుపెట్టాడు. అతని మెదడంతా శూన్యంగా ఉంది.

"రా ! కూర్చో" అన్నారు రత్నంగారు.

"నిజంగా ఈ బంధాలు.. అనుబంధాలూ చాలా విచిత్రంగా ఉంటాయి కదూ..! నిజం చెప్పాద్దూ! వీళ్ళు వెళ్ళిపోతారన్న ఆలోచన నిన్నటినుంచే తెగ బాధపెట్టేసిందనుకో! ఇప్పుడు నీ మొహం చూస్తే తెలుస్తుంది ఆ బాధ నీక్కూడా ఉందని."

"వన్ ఫార్టీవన్ రెస్యూమ్ అయిందా సార్....?"

"లేదోయ్. ఎల్లుండి నుండీ మళ్ళీ మొదలౌతుంది. అన్నట్టు సాయంత్రం త్వరగా వచ్చేస్తావా... మా దుర్గమ్మ... కోతిమూకనీ ఎక్కడికో తీసుకెళ్ళాలట?"

"అలాగే సార్.." అని లేచాడతను. ఇంటికి పోయి శుభ్రంగా పడుకోవాలనిపించింది. కానీ,

అసలు ఇప్పుడు తను ఆ ఇంటిలో అడుగుపెట్టగలడా? నాలుగైదు రోజుల కిందటి వరకూ తను ఇంట్లోనే ఇటువంటి ఆలోచనేదీ లేకుండా ఉన్నాడన్న విషయం అతనికి స్ఫురించలేదు. ఇప్పుడు ఇంట్లో ఎక్కడ చూసినా .. కృష్ణవేణే కనిపించవచ్చు.

"కాఫీ తాగారా బాబూ..!" అని అడిగాడు చంద్రయ్య. అంతసేపూ అతను తన వెంట వస్తున్నట్లు అప్పుడే తెలుసుకుని ఉలిక్కిపడ్డాడు తన పరధ్యానానికి.

"సీత పట్టుకొచ్చింది చంద్రయ్యా... నువ్వింకా డ్యూటీ నుంచి ఇంటికెళ్ళలేదా...?"

"ఏది బాబూ.... ట్రౌనుకే వచ్చేసాను కదా!"

కొన్ని అడుగులు మౌనంగా పడ్డాయి.

చంద్రయ్య మనసు కొంచెం తేలిగ్గా ఉంది. లక్ష్మీపతి మామూలు మనిషవుతాడని అతని ఆశ. అప్రయత్నంగానే అన్నాడు.

"పీడా పోయె బాబూ!"

"చంద్రయ్యా!"

తనన్నమాట సమర్థించుకోక తప్పలేదతనికి.

"అవును బాబూ... ఈ నాలుగైదురోజుల్నించీ చూస్తున్నాను. ఒక్కసారి అద్దంలోకి చూసుకోండి; లేకపోతే ఎవర్నైనా అడగండి. మీ మొహం ఎలా మారిపోయిందో! ఈ నాలుగైదురోజుల్లో మీ రెప్పుడైనా కంటినిండా నిద్రపోయారా చెప్పండి బాబూ!"

"నా గురించి నీ కెందుకింత ఆదుర్దా! నీ అభిమానానికి తిరిగి నేనేమీ ఇవ్వలేను. అందుకే, ఎక్కడికైనా దూరంగా వెళ్ళిపోవాలనుంది చంద్రయ్యా!"

"బాబూ?"

"అవును చంద్రయ్యా! తెలిసిన వాళ్ళెవరూ కనిపించని దూరప్రదేశానికి ట్రాన్స్‌ఫర్ పెట్టుకుని పోదామనిపిస్తుంది."

"నింద నా మీదకి నెట్టేస్తున్నారు, అన్యాయం బాబూ! నిజం చెప్పండి, మీరిక్కడున్నట్టు వేణమ్మగారికి తెలిసిపోయిందనే కదా.. మీరిక్కడినుంచీ పారిపోదామనుకుంటున్నారు."

"....."

"ఇంకా మీ కెందుకు ఆవిడ మీద ఆలోచనా? అందులో ఒక్క వంతైనా ఆవిడకి మీమీదుందంటారా? చెప్పండి బాబూ. ప్రేమించి మిమ్మల్ని మోసం చేసిందావిడ. నిజంగా మిమ్మల్ని ప్రేమించిందే అయితే... మిమ్మల్ని చేసుకోకుండా ఇంకొకడితో పెళ్ళికి ఎందుకు ఒప్పుకుంటుందీ?"

"వద్దు చంద్రయ్యా, కృష్ణవేణినేమీ అనొద్దు! ఆవిడ నన్నెప్పుడూ ప్రేమించలేదు. నిజం చెప్పాలంటే కృష్ణవేణి నాకు దూరంకావడానికి నేనే కారకుడిని."

"నేన్నమ్మను బాబూ! మీరు కారణం అంటే చచ్చినా నమ్మను!"

"నిజం చంద్రయ్యా!"

"అలా అని దాటేస్తే కుదరదు బాబయ్యా.. కారణం చెప్పాలి! అంతగా ప్రేమించిన ఆవిడ్నెందుకు పెళ్ళిచేసుకోలేదు...?"

తప్పదు. చెప్పక తప్పింది కాదు. చంద్రయ్య నుండి తప్పించుకోవడం అసాధ్యం. అప్పుడు లక్ష్మీపతి అన్నాడు -

"కృష్ణవేణిని అంతగా ప్రేమించాను కాబట్టే.. ఆవిడ అడగ్గానే విడాకులిచ్చేసాను చంద్రయ్యా!"

ఒక్కసారిగా పెద్దగాలి వీచింది...!!

✡✡✡

కలం పట్టని కర్తల సంఘం

బుచ్చిబాబు

'చివరకు మిగిలేది' నవలతో తెలుగు సాహిత్య చరిత్రలో అజరామరంగా నిలిచిపోయిన బుచ్చి బాబు గారు వ్రాసిన ఒక హాస్య కథ ఇది. ఇప్పటి కాలానికీ సరిగ్గా సరిపోతుంది. 'కౌముది' పాఠకులకోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

కలం పట్టని గ్రంధ కర్తల సంఘం అని ఉండాలి, కాని కలం పట్టని వ్యక్తి ఎల్లా గ్రంధకర్తగా పరిగణింపబడతాడో అర్థంకాక అలా వదిలేశాం. ఈ సంఘం సహాయ కార్యదర్శిగా వార్షికోత్సవ సమావేశం కార్యకలాపాల నివేదిక సమర్పించే భారం నామీద పడినందుకు చింతిస్తున్నాను. శ్రద్దగా చూస్తే మా సంఘం సమర్పించే నివేదిక స్వరూపం ఈ క్రింది విధంగా ఉండాలి.

వార్షికోత్సవ నివేదిక

ఇట్లు

క.ప.గ్ర.క.సం.

సభ్యులు

కాసేపు మా ఆదర్శాలు అవతల ఉంచి, పాఠక లోకానికి మా సంఘం పుట్టుపూర్వోత్తరాలు, ఆశయాలు, ఈ ఏడాదిలో జరిగిన కృషి వివరించడం మా విధి కాబట్టి, ఈ రచనకి పూనుకుంటున్నందుకు సభ్యులు మన్నించాలని కోరుతూ ఉపక్రమిస్తున్నాను.

కలం పట్టని గ్రంధకర్తల సంఘం నిర్మాత అధ్యక్షయ్యగారు. వారు అరవై సంవత్సరాల క్రితం ఎడారి పురంలో ఖాళీపేటలో "మృగ్యం" అనే భవనంలో జన్మించారు. పదహారవ ఏట స్నేహితులకు సెలవుల్లో పెద పెద్ద లేఖలు వ్రాయడంతో గ్రంధకర్తగా ఆయన జీవితం ప్రారంభమైందనొచ్చు. వారి అరవై మూడో ఏట కళాశాల సంచికలో కొన్ని గేయాలు వెలువడ్డాయి. మొదటి ప్రపంచ సంగ్రామం గురించి, వివిధ పత్రికలలో వారి విమర్శలు "అనామకుడు" అను పేరిట ప్రచురితమై ఆంధ్రపాఠక లోకానికి రాజకీయాలపట్ల కళాభూయిష్టమైన అభిరుచి కలగజేసి పత్రికా సంపాదకీయం కళాఖండం కాగలదని ఋజువు చేశాయి "సాహితీ బాణం" అనే మాసపత్రికలో కవిత్రయం వారిని గూర్చిన వ్యాసాలతో విమర్శకుడుగా అగ్రస్థానం సంపాదించుకున్నాడు. మరో ఇరవైఏళ్ళ తర్వాత "ప్రళయం" "వితండవాదం" అనే వారి నాటకాలు ఊరూరా ఆడడంతో సారస్వత చక్రవర్తిగా వారి కీర్తి స్థిరపడిపోయింది. వారి రచనలను గూర్చి ఆయన చెబుతుండగా విని మతిపోయిన నా బోటి కుర్రకారు అందరం, నిరుడు వారి షష్టిపూర్తి సందర్భంలో వారి రచనలన్నీ

సేకరించి ప్రముఖుల వ్యాసాలతో, విమర్శలతో చేర్చి వో గ్రంధంగా వెలువరించి వారికి సమర్పించాలని సమకట్టి, తమ రచనలన్నిటినీ మా కివ్వవలసిందిగా వారిని కోరాం.

"నేను చెప్పినవన్నీ వ్రాయలేదు. నేనింతవరకూ ఏ రచనా చెయ్యలేదు. ఆ రచనలన్నీ చేసి ఉందును. చెయ్యగల ప్రతిభ నాలో ఉంది కాని దాన్ని చంపుకుని ఒక తాత్విక చింతన అలవరచుకుని, అహాన్ని త్యాగం చేసి, ఈ సారస్వత అవకాశాలను ఇతరులకి విడిచిపెట్టి, ఏకాంతంలో నిశ్చింతగా కాలం గడపదలచాను" అన్నారు అధ్యక్షయ్యగారు. వారింకా ఇల్లా అన్నారు:

"నేను చేసిన త్యాగం సామాన్యమైంది కాదు. దాని విలువ నా సమకాలికులు గ్రహించలేరు. ఈనాడు నేను ప్రారంభించిన పనికి ఎందరో పూనుకోవాలి. ఇదొక ఉద్యమంగా ప్రచారంలోకి రావాలి. ఎన్నెన్నో భావాలు నా బుర్రలో మెదిలాయి. ఎన్నెన్నో మధుర స్వప్నాలు నా హృదయంలో కరిగిపొయ్యాయి. కావ్యాలు, నాటకాలు, విమర్శలు, నవలలు, కథానికలు, వేలాదిగా వ్రాసి ఉందును, కాని వ్రాయలేదు. అట్లా వ్రాయకపోవడంలోనే నా త్యాగం ఉంది. ఇదొక సమాజసేవ. పూర్వీకుల గ్రంధాలు, సమకాలికుల రచనలు వేలాదిగా ఉన్నాయి. ఇతర భాషలలో లక్షలాది గ్రంధాలు బైలుదేరుతున్నాయి. వీటిలో ఏదని చదవడం? పాఠకుడికి మతిపోతుంది. ఈ సారస్వత జ్వాలలో నేనూ వో గ్రంధాన్ని సమిధగా పారేసి ప్రజ్వరిల్ల చెయ్యమంటారా? మన పూర్వులు బోధించిన దాన్ని ఆచరణలో పెట్టి జితేంద్రియుడనై స్వార్థాన్ని చంపుకుని ఆధ్యాత్మికానుభూతిని పొంది, సత్ చిత్ ఆనందాలను సాధించి పరమాత్మలో ఐక్యం కావడం గొప్ప కృషి, త్యాగం, సాధనకావంటారా? పరమాత్మను దర్శించిన వ్యక్తికి చెప్పేటందుకు అనువైన భాషలేదు. మౌనమే అతని శరణ్యం. ఈ తత్వాన్ని అంగీకరించి, ఎందరెందరో ఈ ఉద్యమానికి కూడా మీరు ప్రచురింపకూడదు. నేను వ్రాయకూడదు. ఎవరూ వ్రాయకుండానే ఈ మహాసత్యం ప్రచారం కావాలి. కలం పట్టని గ్రంధకర్తని నేను" అన్నారాయన.

ఆ క్షణాన్నే ఈ సంఘం జనించిందనొచ్చు. వారినే అధ్యక్షులుగా కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నాం. ఆ సందర్భంలో వారికి సమర్పించిన సన్మాన పత్రంలో ఇల్లా చెప్పుకున్నాము.

"మీరు రచించని "రెండు మహాసంగ్రామాలు" అనే నవల మీ కీర్తిని వేనోళ్ళ చాటుతుంది. ఆంధ్రుల మహోజ్వల జీవితం అందులో చక్కగా చిత్రితమై ఉండి ఉండును. ఈనాడు సమాజాన్ని కలచివేస్తున్న సమస్యలన్నింటికి పరిష్కార మార్గాలు సూచించి ఉందురు. వాటిని ఈ సమాజం అలవర్చుకుని ఉండును. అట్లయిన సంఘ సంస్కర్తలకీ, ప్రజా సేవకులకు వేసేటందుకు ఏమీలేక నిరుద్యోగులై, రచనకి పూనుకుని మరికొన్ని క్రొత్తసమస్యలు లేవదీసి ఉందురు. మీ నవల ఈ ప్రమాదం తప్పించింది. అంతేకాదు. ఆ నవలను చదివి ఎందరో యువకులు నవలా రచనకు పూనుకుని, ఈ నాటి సారస్వత కల్లోలాన్ని పెంచి ఉందురు. ఈ విపత్తు సంభవించకుండా మీరు తలపెట్టిన నవలను వ్రాయకుండా విడిచిపెట్టినందుకు దేశం మీకు ఋణపడింది." ఇది చదవగా విని అధ్యక్షయ్యగారు ఈ సన్మాన పత్రం వ్రాతలో ఉంది గావున, వెంటనే తగులబెట్టవలసిందని ఆజ్ఞాపించారు. అప్పుడు దాన్ని ఫ్రేమునుండి విడదీసి, అప్పుడే తగులబెట్టివేశాము. ఇది చూచి విస్తుపోయిన సభికులలో కొందరు మా సంఘంలో సభ్యులుగా చేరిపొయ్యారు.

వ్రాయకుండానే గ్రంధకర్తలుగా పేరు కొట్టెయ్యడానికి సంకల్పించిన వ్యక్తులకు కొదవేమిటి? కొన్ని కోట్లమంది ఇందులో సభ్యులుగా చేరిపోతారు అనుకుంటున్నారేమో మీరు. ఇది నిజమైతే మా సంఘంలో కొన్ని కోట్లమంది సభ్యులుగా చేరి ఉందురు. కాని అట్లా కాదు. సభ్యత్వానికి అర్హతలున్నాయి. వాటిని పాటించగలవారు చాలా కొద్దిమందే ఉంటారు. ఈ సన్మానసంఘం అవతరించినప్పుడూ, వో డజనుకి మించి సభ్యులు లేరు. ఈ డజను మందిలో కూడా సంపూర్ణమైన అర్హత సంపాదించుకున్నవారు ఒక్కరు కూడా లేరనడంలో అతిశయోక్తిలేదు. మా "మధురాంతకం" విషయం చూడండి. లోగడ ఒకటి రెండు గేయాలు వ్రాసివున్నాడు. మా "హంగుదార్" "తుషారం" అనే గేయ సంపుటి ప్రచురించి "ముంగిస"కు అంకితం చేశాడు - ఎందుకో ఎవ్వరికీ తెలీదు. "రణవీర్"

రెండో ప్రపంచ సంగ్రామ సమయంలో వాల్‌పోస్టర్లమీద యుద్ధంలో చేరవలసిందిగా కొన్ని పాటలు (''రణభేరి''గా తర్వాత ప్రచురించాలనుకున్నాడట) - వ్రాశాడు.

వే.ఘో.వి. శాస్త్రి (వేద ఘోష విచ్చిన్న శాస్త్రి) ఋగ్వేదకాలం నాటి సోమపానాసాదనా ఔచిత్యాన్ని గూర్చి వాఖ్య వ్రాశాడు. మా ''స.కు.బ''గారు ఉద్యోగం ఇవ్వనందుకు నలుగుర్నీ తిడుతూ వ్రాసిన ఉత్తరాలను ''ప్రేమలేఖలు''గా అచ్చాఫీసులో ఏడాదిగా పడున్న వ్రాతప్రతిని గబగబ వెళ్ళి తీసుకొచ్చి అధ్యక్షయ్యగారి పాదాలముందు పడేస్తేనే సభ్యత్వం లభించింది. దాన్ని తగులపెట్టడం గూర్చి గంటసేపు చర్చకూడా జరిగింది. అధ్యక్షయ్యగారు దాన్ని తగులపెట్టవద్దనీ, ప్రస్తుతం పూడ్చిపెట్టవలసివచ్చిదని ఆజ్ఞాపించారు - రాసెట్టి అనే ఆంగ్లకవి కొన్ని ప్రేమగీతాలను ఆ విధంగా ప్రేయసితోపాటు పూడ్చిపెట్టాడుట - ఎప్పుడైనా ఈ సంఘంతో అభిప్రాయబేధాలొచ్చి సభ్యుడుగా మానుకున్ననాడు, వారికి ఈ వ్రాత ప్రతి తిరిగి తీసుకుని ప్రచురించుకునే అధికారం ఉండాలన్న ప్రతిపాదన ఆమోదించారు.

ఏదో ఒక అపచారం చెయ్యనివారు మాలో లేరు. కృష్ణయ్యగారు ఏమీ వ్రాయలేరు గాని, ఒకరిద్దరు యువకవులు తమ గేయసంపుటాలను వీరికి అంకితం చేశారుట. మా ''మరమ్మత్'' ఓ చిన్ని కథల సంపుటానికి పరిచయ వాక్యాలు వ్రాశారు. ఆ గ్రంధం ఒక సినిమా నటికి అంకితం ఇవ్వడంతో వేసిన రెండువేల కాపీలు అట్టే అమ్ముడుపోయినాయి. వాటినన్నింటినీ మేం సేకరించి తగులబెట్టే సంకల్పం మా సంఘం వారికి ఉంది కానీ, కొనసాగుతుందని అనుకోడంలేదు. ఇంకెప్పుడూ ఉపోద్ఘాతాలు వ్రాయనని ఒట్టేసుకున్న మీదనే ''మరమ్మత్''కి సభ్యత్వం దొరిగింది.

''వైవాహిత్'' అనే మరో సభ్యుడున్నాడు. తనెప్పుడూ వ్రాసిన పాపాన పోలేదని ప్రయాణం చేసినా, గిట్టనివారు ఆయన రచనని ఒకదాన్ని బైటపెట్టారు. ఎవరిదో ధనిక కుటుంబంలో వివాహం జరిగిందట. ఆ సందర్భంలో వధూవరుల మంచిగుణాలన్నిటిని గుచ్చెత్తి గేయమాలగా పెండ్లి పందిట్లో చదివి, ఫ్రేమ్ కట్టించి పెండ్లి కుమారునికి సమర్పిస్తుండగా తీసిన ఫోటో బైటపెట్టడంతో ఆయన బండారం బైటపడింది. పాపపరిహారంగా ఆయనకలాన్ని అధ్యక్ష్యయ్యగారికి ఇచ్చివేశారు. అప్పుడు, ఫౌంటెన్ కలాలు ప్రవేశరుసంగా నిర్మీతమైంది.

ప్రతి సభ్యుడు ఓ కలం, దస్తా కాగితాలు సంవత్సరం చందాగా కట్టాలి. వారులోగడ చేసిన రచనలుంటే ఆ ప్రతులన్నింటినీ సేకరించి వార్షికోత్సవంలో వాటిని దగ్ధం చెయ్యాలని తీర్మానించారు. ఇదంత కష్టం కాదు. ఎందుకంటే అచ్చువేసిన ప్రతులన్నీ సాధారణంగా గ్రంధకర్తగారింటి బోషాణంలోనో, ప్రచురణకర్త చెత్తకాగితాల కొట్లోనో, సుళువుగా దొరుకుతాయి. వార్షికోత్సవంలో ప్రతి సభ్యుడూ ప్రసంగించి తీరాలి. ఆ ఏడాదిలో ఆయన ఊరిలో కాగిన భావాలు, తలపెట్టిన రచనలూ, వాటిని వ్రాయకుండా ఎల్లా తప్పించుకున్నదీ వివరించాలి. గొప్పరచన తలపెట్టి వ్రాయనందుకు అధ్యక్షులు కొన్ని బిరుదులు కూడా ఇవ్వాలని సూచించారు. ''మధురాంతకం'' 'కన్నీటి స్వర్గం' అనే ఖండకావ్యం వ్రాయలేదుట. వారికి 'నహికన్నీర్ కవి' అని బిరుదు ఇద్దామన్నారు. దానికి నేను తగను అని నమ్రతతో ఆయన నిరాకరించారు. 'ఏమో, ఆ కావ్యం నేను ముందెప్పుడూ వ్రాయనూ అనలేను. ఏ వేళ ఏ బుద్ధిపుడుతుందో'' అన్నాడు 'మధురాంతకం'. ఆయన నిజాయితీని అధ్యక్షులు ప్రశంసించారు. ఈ సంవత్సరం ఉపనిషత్తుల జోలికి పోలేదు అన్నాడు. వే.ఘో.ని. శాస్త్రి. భానుని ఏకాంకిల విషయమై పరిశోధన చేసి కూడా వ్యాసాలు వ్రాయడం మానుకున్న ఉదంతం విని సభ్యులు సంతోషించారు. ఒకటి రెండుమార్లు బౌద్ధతత్వం గురించి వ్రాయాలని ఉబలాటపడ్డారుట. మరోమారు శంకరాచార్యుల చరిత్ర సినిమాకు పనికొచ్చేటట్లు వ్రాయాలనుకున్నారు. 'నాగానందం' తనని విమర్శించవలసిందిగా చేసిన ఆహ్వానాన్ని పిలిచినా వినిపించుకోనందుకు ముందు ముందు అధ్యక్షపదవిని కొట్టెయ్యడానికి ఆయన కృషిచేస్తున్నట్లు స్పష్టమైంది.

హంగుదారు ''మిల్లు యజమాని'' అనే సాంఘిక నాటకం ఆరంభించి, ఒక రంగం పూర్తికూడా చేశాననీ, తరువాత అతనికి మిల్లులో పనిదొరికిందనీ, అంతటితో ఆ వ్రాత ప్రతిని మిల్లులో విద్యుత్ చక్రాల మధ్యపడేసి పిండిగా చేసిన ఘట్టం విని, మేమందరం చకితులమయ్యాం. మా రణవీర్ హిందీ, వంగభాషల నుండేగాక 'సరోయన్' ప్రీస్టీల రచనలు తెలుగులోనికి అనువదించడానికి

పూనుకుని, కీర్తికాంత పిలుపుని కాదని ఆమెను పంపించివేసి లోపల గొళ్ళెం పెట్టుకుని ముసుగుతన్ని పరున్న దృశ్యం ఊహించుకుని సభికులు కరతాళ ధ్వనులు చేశారు. ఇక "స.కు.బ." వయస్సులో పిన్నైనా, త్యాగంలో మా అందరికంటే పెద్ద - ఎందుకంటారా - నాలుగైదు అపరాధ పరిశోధక నవలలకి కావల్సిన వస్తువు సిద్ధంగా ఉండికూడా, వాటి రచనకు పూనుకోలేదు. ఒకరిద్దరు పంపిన నవలలపై అభిప్రాయం వెలిబుచ్చలేదు. ఆఖరికి ఆ రకం నవలల్ని చదవాలన్న తృష్ణని కూడా అణగద్రొక్కుకుని మానసిక ప్రశాంతతని పెంపొందించుకున్నాడట. 'నహిహంతక్' బిరుదుపొంది అధ్యక్షుల వారి మన్ననకు పాత్రుడయ్యాడు. మా కృష్ణయ్య పిల్లల సాహిత్యం జోలికి ఈ సంవత్సరం పోలేదు. 'వారు హాయిగా ఆడుకుంటూ పాడుకుంటూ ఉండకుండా నా బాలసాహిత్యంతో తత్పలితంగా జనించే పోటీ తత్వంతో వారి ఆనందమయ, అమాయకపు జీవితాలను భగ్నం చెయ్యడం నా మతం కాదు. నేనే కాకుండా పెడతోవకి పట్టించే తోటి రచయితల మాటలు విని, ఆ బాలబాలికలు రచనకి పూనుకోకుండా, వారి జేబుల్లో పెన్సిళ్ళు, బలపాలు, సుద్దముక్కలూ సంగ్రహించి, చోరత్వానికి దిగవలసి వచ్చింది' అన్నాడు కృష్ణయ్య తన సారస్వతానుభవాలను వివరిస్తూ.

మా సంఘంలో మహిళలు సభ్యులుగా చేరలేదు. అందుచేత మహిళా సాహిత్యలోకానికి మేము ఏ సహాయము చేయలేకపోయామని చెప్పేటందుకు విచారిస్తున్నాను.

ఈ ఏడాదిలో మా సంఘం సంఖ్య వందకి పెరిగింది. మొన్న జరిగిన వార్షికోత్సవానికి అధ్యక్షయ్యగారు అధ్యక్షులుగా ఉన్నారు. ఆ ఉత్సవం ప్రారంభించడానికి ఎవరిని పిలవాలా అన్న విషయంపై రెండు మూడు గంటలు వాదోపవాదాలు జరిగినవి. 'మనం ఎవరినో ఒక ప్రముఖ వ్యక్తిని పిలుస్తాం. మనమాట తీసెయ్యలేక వారు వస్తారు. దానివల్ల వారు చెయ్యవలసిన పనులు చెయ్యనీకుండా చేస్తున్నామన్న మాటేగా! దేశ క్షేమానికి, పురోగమనానికి వినియోగపర్చవలసిన వారి అమూల్యమైన కాలాన్ని మన ఉత్సవ ప్రారంభానికి ఖర్చు పెట్టించి, సమాజ శత్రువులుగా తయారవడం మన ఆదర్శాలకి విరుద్ధం. కాన మనం ఎవరినీ శ్రమపెట్టవద్దు' అన్నారు అధ్యక్షులుగారు.

✡✡✡

మౌనంగా నిలబడి పైకి పాడని ప్రార్థన గీతంతో ఆనాటి కార్యక్రమం ప్రారంభమైంది. తరువాత 'ఆయుధ విసర్జన' జరిగింది. సభ్యులు ఒక్కొక్కరే వేదిక పైకొచ్చి కలాలు, పెన్సిళ్ళు, తెల్లకాగితాలు అధ్యక్షుల ముందు విసర్జన చేశారు. ఆ పిమ్మట "సంతాప ప్రమాణ స్వీకారము" తంతు జరిగింది. ఆయా సభ్యులు వారు చేసిన అపచారాలు దాచకుండా చెప్పి వేసి, పశ్చాత్తాపం ప్రకటించి, చెంపలేసుకుని, "ఇంక చెయ్యను" అని ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ సందర్భమో మా "వైవాహిత్" కి "నహి గీతాచార్య" అను బిరుదు ప్రసాదించారు ఎందుకంటారా? అతను ఈ సంవత్సరం భగవద్గీత జోలికి పోలేదుట. లోగడ గీతని బుర్రకథగా, జముకుల కథగా, గొల్లసుద్దులుగా, వీధినాటకంగా, యుగళగీతంగా, అనేక స్వప్నాలతో వ్రాసివున్న దురంతాల ఉదంతాన్ని ఏకరువు పెట్టి ఈ పవిత్ర గ్రంధాన్ని ముందెప్పుడూ మలినం చేయనని ఒట్టేసుకున్నాడు.

మూడవ అంశము అధ్యక్షుల వారి ఉపన్యాసము. దీనిని ఏ పత్రికలూ ప్రచురించవు ప్రచురించేటందుకు నాకూ అనుమతిలేదు. అయినా, కొన్ని భాగాలు వ్రాయక తప్పదు.

"మన సంఘంపట్ల కొన్ని సంస్థలు అసమ్మతి ప్రకటించాయి. కొన్ని పత్రికలు ఇల్లాంటి సంఘమే ఉండరాదనీ, దీన్ని ప్రభుత్వం రద్దు చెయ్యాలనీ సూచించారు. సారస్వతాభివృద్ధిని మా సంఘం నిరోధిస్తుందని వీరివాదం. మా సంఘం తలపెట్టిన కార్యక్రమం దేశమంత వ్యాపిస్తే ముద్రణాలయాలలో పనిచేసే వేల జనానికి, ప్రచురణ కర్తలకి, పత్రికాలయాలకి పని లేకుండా పోయి నిరుద్యోగ సమస్య తలెత్తుతుందని కూడా వీరు అంటున్నారు. ఇది కాదనలేము. దీనికిగాను వీరందరికి యధావిధిగా పని కలిపించే సూత్రాన్ని అమలు జరుపుతున్నాము. మా సంఘంలో ఎవరెవరైందీ, సభ్యుల సంగ్రహ జీవితగాధ, వారి ఊహాజగత్తులో జరిగిన యుద్ధాలను, వారు ఏ

విధంగా స్థూల ప్రపంచంలో ప్రేరణ నెదుర్కొని ఆకర్షణలని జయించి చిత్తశుద్ధిని, ఆత్మశాంతిని అలవరచుకున్నారో తెలియజేసే వొక సంచిక ఏడాది చివరలో వెలువరిస్తాము. ఆ గ్రంధంలో రచయితలను గురించిన వివరాలు పొందుపరచబడతాయి. ఉదాహరణలిస్తాను.

"వైవాహిత్" - అసలు పేరు వైదూరం వామన హరి ప్రసాదరావు. చదువు - ఇంటర్ నాలుగుమార్లు ఫేలయ్యాడు. బి.ఏ. పరీక్షకు కూర్చోలేదు. వివాహం జరిగింది.

వీరి అముద్రిత గ్రంధాలు: "కొద్దో గొప్పో" "కలగని సంతానము", "ఖండకావ్యం", "భగీరథుని తపస్సు". అసలు వ్రాయని రచనలు: "ఏదేశమేగినా", "మెక్సికోలో విప్లవం" (వ్యాసాలు)

ఈ క్రింది వారి రచనలు వారు చదవలేదు: వాల్మీకి, నన్నెచోడుడు, వీరేశలింగం, థామస్ హార్డీ.

ఈ క్రింది వారిపేర్లు కూడా వినలేదు. జీన్ పాల్ సార్ త్రే, కీర్కిగార్డ్.

అల్లాగే "వృశ్చికం" - అనే పేరుతో సీరియల్ నవలా రచయితను గురించి ఇల్లా వెయ్యవొచ్చు.

వృశ్చికం - అసలు పేరు తేలుటూరు రంగయ్య. వారు పొందని అపూర్వ అనుభవం: తేలుకుట్టడం. వీరు వ్రాయని నవల: "ఎందుకీ తొందర సుందరాకార"

బుర్రలోకూడా లేని గ్రంధం: "బాణసంచా" (కథల సంపుటి)

వీరి అభిమాన రచయితలు: ఖలీల్ హిబ్రాస్, ఫిర్ దౌసీ, "శాఫో" "స్టీఫాన్ జ్వీగ్".

ఈ పై వారి రచనలు వీరు చదవలేదు - వీరికి ఈ పేర్లు బాగుంటాయి. అంతే.

కాలక్షేపం: పుస్తకాల కేటలాగులు పోగుచెయ్యడం. బొమ్మల పత్రికలలో బొమ్మలు చించకపోవటం

ఒక రచయిత్రిని గురించి

"వీణతంత్రి" - ఈ పారుతో పాఠకలోకానికి పరిచయం: కానీ ఈమె అసలు పేరు "వరకట్నం ధనలక్ష్మి"

వివాహం : చేసుకోలేదు.

చదువు : ఇంట్లోనే.

కళాసాధన : ఊహలో.

కాలక్షేపం : తెలుగు సినిమాలు చూడకపోవడం.

ఇష్టంలేని రచయిత్రిలు : మొల్ల, జేన్ ఆస్టిన్, ముద్దుపళని, షార్లోట్ బ్రాంట్.

అముద్రిత గ్రంధం : మరి మొగాళ్ళమాటేమిటి? (వ్యాసాలు). ఇందులో ఉన్న విషయాలను అన్ని పత్రికలు వారికి కావల్సినవాటిని ఏరుకుని ప్రచురించవచ్చు. "

అధ్యక్షయ్యగారి ఉపన్యాసంలో మరో ముఖ్యభాగం:

"ఏ రచనా చెయ్యకుండా, పాండిత్యంగని, సంస్కృతిగాని, భాషాపరిజ్ఞానంగాని ఈషణ్మాత్రమూ లేకుండా గొప్ప రచయితలుగా, సాహితీపరులుగా చలామణి అయి, ఉన్నత పదవులు సంపాదించుకోడానికి, ఈ సంఘం ఎత్తువేస్తున్నదని వొక అభియోగం చేశారు, కొందరు ప్రముఖులు. మా సంఘం చేస్తున్న కృషికి ఫలితం అది కావొచ్చు కాని ఉద్దేశం మట్టుకు అదికాదు. ఈనాడు సమాజంలో విభిన్నదృక్పథాలున్నాయి. సంప్రదాయాలు, సాహితీ విలువలు తారుమారవుతున్నవి. ఈ మహాగందరగోళంలోంచి, చెత్తలోంచి మరుగుపడిన మణులను ఏరిచూపే విమర్శకులున్నారు. మా సంఘం ఈ చెత్తని పెంచకుండా చేస్తుంది. చెత్త తగ్గినకొద్దీ, విమర్శకుడి పని సులువవుతుంది. గొప్ప గ్రంధాలేవో నిర్మితమవుతాయి. వాదాలు, సిద్ధాంతాలు, పోటీలు సమసిపోతాయి. ప్రపంచశాంతి ప్రబలుతుంది. ఇది సేవకాదంటారా?"

వ్రాయబడని రచనలను చెత్తగా పరిగణించడం సభ్యులకు నచ్చలేదు. వ్రాసి ఉంటే గొప్పరచనలవును - సభ్యులందరూ వ్రాయగల గొప్ప గ్రంధకర్తలు. అట్టివారి కృషిని చెత్తకింద కట్టెయ్యడంపట్ల అసమ్మతిని తెలియచేశారు. అధ్యక్షులువారిని తమ ఉపన్యాసాన్ని నిలపమన్నారు. క్షమాపణ చెప్పమన్నారు. వారు దాని కంగీకరించలేదు. క్షమాకాగితాలు పట్టుకుపోతామన్నారు. మా "మధురాంతకం" ఒక కొత్త సూత్రాన్ని ప్రతిపాదించాడు. "రచనలు చెయ్యకపోవడమే కాకుండా, ప్రతిభాశాలి అయిన ప్రతి సభ్యుడూ ఉపన్యసించకూడదు. గ్రామభాష ప్రబలి, ఉపన్యాసానికీ, రచనకీ తేడా లేకుండాపోతుంది గనక ఈ సంఘం ఇంకనుంచి ఉపన్యాసాలు మానుకోవాలి."

దీన్ని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించి, అధ్యక్షులవారిని ఉపన్యసించడం మానుకోమన్నారు

"మరి ప్రేక్షక జనం మాటేమిటి?" అన్నారాయన.

"వారూ మౌనం వహించి, ఏకాంతాన్ని ఆస్వాదించి, సమాధిలో పడి దాన్నుండి జనించే శూన్యరసాన్ని ఆస్వాదించాలి" అన్నాడు మధురాంతకం.

కార్యక్రమంలో ఈ భాగాన్ని "శూన్యరసాస్వాదనా కృత్యం" అన్నారు. ప్రేక్షక జనానికి ఇది నచ్చలేదు. అల్లరి సాగించారు - కేకలు, ఈలలు, అధ్యక్షయ్యగారిని గూర్చి అపవాదుతో కూడుకున్న నినాదాలు సాగించారు.

ఈ అధ్యక్ష్యయ్య ఏ రచనా చెయ్యలేదంటే మేం నమ్మం, "అ, ఆ" "ఇ, ఈ," అని మారుపేర్లెట్టుకుని, మూడు ఖండకావ్య సంపుటాలు ప్రచురించాడు. "రెండు రెళ్ళు మూడు" అన్న పేరుతో 'నలుగురు శత్రువులు' అన్న నవల ప్రచురించాడు.

"అబద్దాల అధ్యక్షయ్య" - అంటూ చేసిన ప్రేక్షక్ల నినాదాలు మిన్నుకెగిసినవి.

అప్పుడు అధ్యక్షయ్యగారు మరొక కర్మకాండ శాసించారు. మొదటిది 'కవచ విసర్జ' - అనగా మారు పేర్లతో, (సకుబ, హంగుదార్, రణవీర్ మొదలైనవి) రహస్యంగా రచనలు సాగిస్తున్న సభ్యులు కవచాలను (మారుపేర్లను) వదిలేసి, నిజస్వరూపం (నామధేయం) బహిరంగం చెయ్యాలి. రెండో దానిపేరు అపవాద ఉపసంహార కృత్యం - అనగా ప్రేక్షకులలో ఒకరు సభ్యుడు మారుపేరుతో రహస్యంగా చేసిన రచనని బైటపెట్టడం (అపవాదువెయ్యడం) - అవతల వ్యక్తిపశ్చాత్తాపం చెంది, గుంజీలు తీసి, లెంపలేసుకుని (ఉపసంహారం).

✡✡✡

"ఏమండోయ్ - లేవండి, పట్టపగలే కలలేమిటి? ఆ లెంపలేసుకోవడం ఏమీటి? లేవండి, కాసిని మంచినీళ్ళు త్రాగండి అంటూ ఆవిడ లేపింది.

'ఏదో వ్రాసి వ్రాసి ఇస్తామన్నారటగా - ఆయనెవరో వచ్చాడు చూడండి' అన్నదామె.

'జ్వరంగా ఉంది, రేపు రమ్మందూ' అన్నాను..

'ఇంక ఇవ్వనక్కర్లేదట. వారి పత్రిక నిలిచిపోయిందట అన్నదామె.

"అమ్మయ్య!" అనుకుని మళ్ళీ పడుకున్నాను.

✡✡✡

బాబాయి

గొల్లపూడి మారుతి రావు

బిలాస్‌పూర్ బదిలీ అనగానే ఒకే నిర్ణయానికి వచ్చాను - ఉద్యోగానికి రాజీనామా చేద్దామని. మిత్రులందరికి ఉత్తరాలు రాసేశాను. తెలుగుదేశంలో ఎక్కడయినా చిన్న నౌఖరీ కుదిర్చి పెట్టమని. నా ఉద్దేశం ముందునుంచీ మా ఆవిడకు తెలుసు. వెళ్ళితీరాలని పట్టుబట్టి కూర్చుంది. లేకపోతే తను పుట్టింటికి పోతానని బెదిరించింది. పెళ్ళానికి విడాకులివ్వడంకన్నా పాత ఉద్యోగం చేసుకోవడమే మంచిదనిపించి సిద్ధపడ్డాను - ఆఖరికి.

ఏదో కొత్త పదవి నాకు లభించినంత ఆనందంగా ప్రయాణానికి సిద్ధపడింది మా ఆవిడ. సామాన్లన్నీ తనే సర్దేసింది. రైల్లో ఆమె హడావిడి చూస్తే నేను కష్టపడినా మరొక ప్రాణిని సంతోషపెట్టానని ఆనందించాను. బిలాస్‌పూర్ రైలు చేరేసరికి కుండపోతగా వర్షం. రుబ్బురోలు దగ్గర్నుంచి, టేబులు ఫాను వరకు అన్నీ చేత్తో పట్టుకుని వర్షంలో దిగాం. ఒక్క మొహం తెలిసినది లేదు, భాషరాదు. ఊరుకొత్త. జీవితంలో తెలుగుదేశం వదిలిరావడం అదే మొదటిసారి. హోటల్ అని మాత్రం చెప్పి రిక్షా ఎక్కాం. ఆ వర్షంలో చీకటి రాత్రిలో ఊరులోంచి వెళుతుంటే జివ్వుమంటున్న కీచురాళ్ళ కప్పల బెకబెకల మధ్య మా ఆవిడ ఆనందం కాస్త సడలింది. హోటల్ గదిలో దోమలు మిగతా ఆనందాన్ని పీల్చేశాయి. అంతే - తెల్లవారు ఝామున మూడుగంటలకి హోటలు మంచం మీద లేచి కూర్చుని భోరుమంది. కొత్త దేశం వచ్చిన చికాకుని దిగమింగి ఓదార్చడం నా వంతయింది.

అలా మా ప్రవాసం ప్రారంభమయింది. మర్నాటి నుంచీ నేను ఇళ్ళవేటకి బయలుదేరాను. ఆఫీసులో ఒకటి రెండు తెలుగు ముఖాలు కనిపించాయి. వాకబు చెయ్యగా - ఓ చిన్న తెలుగు సంఘం ఉందనీ, తెలుగు మనుషులు చాలామందే ఉన్నారని తెలిసింది. మరి పదిరోజులకి ఓ చిన్న ఇల్లు అమిరింది.

మర్నాటినుంచీ బొగ్గుల దుకాణం దగ్గర్నుంచి, పాలఖాతా, పనిమనిషి వగైరాలన్నిటికీ వెదుకులాట ప్రారంభమయింది. తెల్లవారి లేస్తే ఆఫీసుకి పోవాలి. మా ఆఫీసులో తోటి గుమాస్తా తిరుమూర్తి పలకరించాడు. "ఏం బ్రదర్ పూర్తిగా సెటిలయినట్టేనా?" అని. కష్టాలన్నీ ఏకరువు పెట్టాను.

"అబ్బే! అవేం పెద్ద సమస్యలు కావు. మనవాళ్ళందరి కష్టాలు తీర్చే ఓ మనిషి ఇక్కడున్నాడు. రేపు పొద్దున బాబాయిని ఇంటికి పంపిస్తాను. నువ్వేం గాభరాపడకు" అన్నాడు.

"మీ బాబాయా?" అన్నాను.

"అదా! అతను బంధువూ కాదు సింగినాదం కాదు. ఈ ఊరంతటికీ అతనే బాబాయి. కరివేపాకులాంటివాడు" అన్నాడు.

ఏమయినా మా ఆవిడ కష్టాలు రేపటినుంచీ తీరుతున్నాయన్న శుభవార్త పట్టుకుని ఆనందంగా ఇల్లు చేరాను- నడవలో కొయ్య స్థంభానికి చేరబడి మా ఆవిడ ఎవరితోనో మాట్లాడుతోంది. ఎదురుగ్గా గంగాళం బోర్లించి దానిమీద తాపీగా కూర్చుని ఓ మనిషి కబుర్లు చెపుతూ నింపాదిగా కాఫీ చప్పరిస్తున్నాడు.

నన్ను చూడగానే ఆనందంగా ఆవిడే పలకరించింది. "రండి రండి - పొద్దున కిరసనాయిలు కోసం వీధి చివర దుకాణం దగ్గరికి వెళితే కమలమ్మగారు కనిపించారు. మన సంగతంతా చెపితే సహాయం చెయ్యడానికి బాబాయిగారిని పంపారు" అంది ఆయన్ని చూపిస్తూ.

బాబాయి మనస్ఫూర్తిగా చిరునవ్వు నవ్వుతూ - "నమస్కారం బాబాయి! మీ గురించి నాకేం చెప్పక్కరలేదు. మీ పేరు ముకుందరావు. డబ్లింగ్ లో డి2. కొత్తగా బదిలీ అయి వచ్చారు. అమ్మాయి సగం చెప్పింది. ఇంట్లో తమలపాకులున్నాయా?" అన్నాడు ఎంతో చొరవగా.

"అయ్యో లేవండీ" అంది మా ఆవిడ చిన్నబుచ్చుకుంటూ.

"మరేం ఫరవాలేదు. రేపు అపూర్‌చంద్‌గాడికి చెపుతాను. రెండురోజులకోసారి పావలా కట్ట ఇంట్లో పారేస్తాడు. ముందు డబ్బివ్వకండి. నెలకోసారి ఇచ్చేట్లు మాట్లాడి పెడతాను. బాబాయి నిలబడే ఉండిపోయారు. మొదట కాఫీ ఇయ్యి" అన్నాడు, నేనే ఆ ఇంటికి కొత్తగా వచ్చినట్టు.

బాబాయిని తేరిపార చూశాను. ముందు రెండు పళ్ళు ఊడిపోయాయి. కళ్ళద్దాలు, గారపట్టిన పళ్ళు, వయస్సు యాభై దాటదు. జుత్తు బాగా నెరిసింది. డొక్కలోనికి పోయి చిన్న గూనిలాగ నడుం వంచి కూర్చున్నాడు. పిర్రలు పట్టేసిన పాంటు, ఖద్దరు షర్ట్ పాంటులో దోపాడు. చేతిలో కోతిమార్కు పళ్ళపొడి అని వెలిసిపోయిన అక్షరాలున్న తెలుగు సంచి - దాంట్లోంచి బయటికి తొంగి చూస్తున్న ముసక్కాడలు- ఇదీ అవతారం.

నేను గుక్క తిప్పుకునే లోగానే - "ఇంటికి అద్దెంత?" అన్నాడు వాసాలు లెక్కబెడుతూ.

"నూట ఇరవైరూపాయలే - అయ్యోవీడి మొహం ఈడ్చ - ఈ బిహారీలాల్ గాడికి యావ పెరిగిపోతోంది. అడ్వాన్స్ ఇచ్చారా?"

"రేపివ్వాలి"

"అయితే నే చెప్పేదాకా ఇవ్వకండి. రెంటు కంట్రోలు వాడికి అప్పగిస్తానని బెదరగొడతాను గాడిద కొడుకుని" అన్నాడు.

నేనింకా గుమ్మంలోకి కుర్చీ లాక్కుని కూర్చునే లోపునే లేచి వంటిల్లంతా చుట్టబెట్టేశాడు. "ఏమిటమ్మా? సామాన్లన్నీ గదినిండా ఇలా పేర్చేసుకున్నావు? ఈ ఊరి వాళ్ళకి మనవేపులాగ ఇమ్ముగా గదులు కట్టుకోవడం తెలిసి చావదు! సబ్జీ బజారు దగ్గర సెకండుహాండు అలమారాలు అమ్ముతారు. సైకిలు మీద రేపు సాయంకాలం ఇటువచ్చినప్పుడు రెండు పడేసి పోతాను. ఇక్కడ పాలకే కాస్త ఇబ్బంది. కార్డు సంపాదించాలి - బాబాయిని ఆఫీసులో కలుసుకుని ఆ సంగతంతా చూస్తాలే" అన్నాడు.

మా ఆవిడలో మళ్ళీ విజయవాడలో ఉత్సాహం పుంజుకొచ్చింది. "దేవుడులాగ మీరు కనిపించారు బాబాయిగారూ! నాకిప్పుడు ధైర్యం వచ్చింది. ఇక్కడెలా బతకడమా అని పది రోజులయి గిలగిలలాడిపోతున్నాను."

"అయ్యో! నేనుండగా మీకే కొరతారాదు. కష్టం వస్తే, కాకిచేత కబురు పంపించండి. హిందీ కాకులకైనా బాబాయి పేరు అర్థమయిపోతుంది" అని అని పిడుగుపడినట్టు నవ్వాడు.

ఏదో సినిమా చూస్తున్నట్టు అతన్ని నివ్వెరపాటుతో చూస్తూ కూర్చున్నాను. మరో అయిదు నిమిషాలకి వాకిట్లోకి వచ్చి నా సైకిలు చూశాడు. "ఏమిటి బాబాయ్! హెర్క్యులస్ లాగుంది. సీటు చెడిపోయింది. మరి రెండు నెలలు లాగేస్తుందిలెండి. 48లో డ్రైవరుకి చెపితే ఝూర్సుగూడనుంచి మంచి సీటు లాక్కొచ్చేస్తాడు. రిపేర్లకి మాత్రం మిలాస్ హోటలుపక్కన హకీం సాయిబుకివ్వండి. నా పేరు చెపితే కొత్త సైకిలు ఇచ్చేయమన్నా ఇచ్చేస్తాడు" అన్నాడు.

"మరి వస్తాను" అని సంచి తీసుకులేచి "ఇక్కడ యూకో బ్యాంకులో త్రివిక్రమరావు అని - మనవాడే - తెనాలి. వాళ్ళ అమ్మకి ఉబ్బసం. మంచి యునాని మందుందని చెప్పారు. ఎదురు చూస్తూ ఉంటాడు - వస్తాను. రేపు ఆఫీసులో కలుస్తాను. మీ వివరాలన్నీ కాగితం మీద రాసి ఉంచండి. డైరీ ఫారంకి వెళ్ళి దాఖలు చేస్తాను" అన్నాడు.

అప్పుడు చూశాను గోడకు వాల్చి ఉన్న సైకిలుని, సీటు ఉండాల్సిన చోట న్యూస్ పేపర్లు చుట్టి దానికి గావంచ ఒకటి చుట్టాడు. నా సీటు ఝూర్సు గూడ నుంచి రావాలిగాని, అతని సీటు ఇంట్లోనే తయారయినట్టుంది. ఝూర్సు కూడా సైకిలెక్కేశాడు.

మా ఆవిడకి ప్రమోషన్ వచ్చినప్పటికంటే పరమానందంగా ఉంది. "ఈ ఊళ్ళో దేవుడిలాంటి మనిషి దొరికాడు. ఎంత కలుపుగోరు మనిషి. ఎంత మంచివాడు!" అని మురిసిపోయింది.

తిరుమూర్తిని అడిగాను - అసలు ఈ బాబాయి ఎవరని?

"ఏం? కలిశాడా, అయితే నీ కష్టాలన్నీ తీరినట్లే" అన్నాడు. "అతను అందరికీ బాబాయి. అసలు పేరు రంగనాయకులు. నేనీ ఊరొచ్చిన సంవత్సరానికి తెలిసింది. ఊరు ఏలూరు. ఇక్కడికొచ్చే వాళ్ళంతా బదిలీల మీద వచ్చి పోయేవాళ్ళే. కనుక రంగనాయకులు ఈ ఊరెప్పుడొచ్చాడో ఎవరికీ తెలీదు.. హిందీ, బెంగాలీ, ఒరియా అనర్గళంగా మాట్లాడుతాడు. అసలు నన్నడిగితే ఆంధ్రపదేశ్ గవర్నమెంటు ప్రవాసాంధ్రులు సంక్షేమానికి ఊరూరా ఇలాంటి పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్స్‌ని ఉంచాలంటాను" అన్నాడు.

నేను నవ్వుకున్నాను.

మర్నాడు అతను చెప్పినట్టే సరిగ్గా మూడుగంటలకు ఆఫీసుకి వచ్చేశాడు బాబాయి. అతణ్ణి చూడగానే తెలుగు ఉద్యోగులంతా అతన్ని చుట్టుముట్టేశారు. ఆఫీసు వరండాలో ఒక స్టూలు లాక్కుని కూర్చున్నాడు బాబాయి. దుకాణాల్లో ఇచ్చే రశీదులన్నీ ఒక పుస్తకంగా కుట్టాడు. దాన్ని సంచిలోంచి తీసి పెన్ను పట్టుకు కూర్చున్నాడు. అతన్ని చూడగానే అందరికీ తలో పనీ గుర్తుకొచ్చినట్టుందిగావును.

"బాబాయ్! అబ్బాయి స్కూలుకి తీసుకెళ్ళే కాన్వాసు సంచి కావాలంటున్నాడు"

"మా ఆవిడ నక్క దోసకాయలు తీసుకు రమ్మంటోంది బాబాయ్"

"మాదీఫలం రసాయనం చిన్న సీసా తీసుకురమ్మని చెప్పమన్నాడు మామయ్య" ఇలా వరసగా పనులు అప్పగించారు.

వరాలిచ్చే దేవుడిలాగ ఏమాత్రం అభ్యంతరం చెప్పకుండా చిరునవ్వుతో రాసుకుపోతున్నాడు.

తిరుమూర్తి ముఖం చేటంతయింది. "థాంక్స్ బాబాయి! నా కాపురాన్ని నిలబెట్టావు" అన్నాడు.

కేవలం వాళ్ళు కోరే పనులే కావు. వాళ్ళ అవసరాల్ని, ఇష్టాల్ని కనిపెట్టి పనులు తనమీద వేసుకుంటాడు బాబాయ్.

నా వివరాలన్నీ కాగితం మీద రాసిచ్చాను. "సాయంకాలం మన షాపు దగ్గరికి వచ్చేసెయ్ బాబాయ్. పాలకార్డు రెడీగా ఉంటుంది" అని లేచాడు బాబాయ్.

"షాపా! అదెక్కడ?" అన్నాను.

మా వాళ్ళంతా నవ్వేశారు. "బాబాయ్ షాపెక్కడని బాబాయిని కాదయ్యా, రోడ్డు మీద నిలబడి గట్టిగా అను. నీ పక్కనున్న మనిషే దారి చూపిస్తాడు" అన్నారు.

నా భుజం తట్టి "మరేం గాభరా పడకు బాబాయ్. మన పరపతి ఈ ఊరి శ్మశానందాకే. కూరల మార్కెట్టు దగ్గరికి వచ్చి సైకిళ్ళన్నీ ఎటువేపు పెట్టున్నాయో గమనించు. అవన్నీ నా దుకాణానికే వస్తాయి" అన్నాడు.

నేనాశ్చర్యపోయాను. సైకిలు దుకాణం నడిపే మనిషికి కాస్తయినా సంపాదన ఉండాలి. బాబాయి చూస్తే కనీసం సైకిలు షాపులో మెకానిక్ లాగయినా కనిపించడంలేదు.. సాయంకాలం సైకిలు షాపుకి వెళ్ళినపుడు అసలు విషయం అర్థమయింది. ఒక సందు మలుపులో మిగిలిపోయిన - ఎవరికీ పనికిరాని జాగాలో అతని సైకిలు షాపు వెలిసింది. అతనికింద పన్నెండేళ్ళ కుర్రాడు అసిస్టెంటు. చిన్న దుకాణం. ఆదాయం పెద్ద ఉన్నట్టు లేదుగానీ అందరికీ ఆ షాపుతో అవసరం ఉన్నట్టు కనిపించింది. ఆ బజారు కొచ్చే ప్రతీ సైకిలూ అక్కడే ఆగుతోంది. "ఏమయినా అద్దె వసూలు చేస్తారా?" అన్నాను - అక్కడ బల్లమీద కూర్చుని.

నవ్వి "అదా! వాళ్ళిక్కడికి వచ్చిపోవడమే అద్దె - ఇక్కడ నా పని నేను చూసుకుంటాను - వాళ్ళ సైకిళ్ళు ఇక్కడ పడేసి పోతారు. ఈ మాత్రం సాయానికి డబ్బు కట్టాలా?" అన్నాడు. అక్కడికొచ్చే వాళ్ళకి ఉపకారంకోసం బాబాయి ఆ సౌకర్యం చేశాడు. వాళ్ళు అది

అవకాశం చేసుకుంటున్నారు. అంతే. బాబాయి అంటే తెలియని వాళ్ళు కూడా ఆయన్ని పలకరించకుండానే అదేదో తమ హక్కులాగ అక్కడ సైకిళ్ళు ఆపుకుని వెళ్ళడం గమనించాను.

ఆమాటే అడిగాను. "తెలిసిన వాళ్ళకి సహాయం చేస్తే అర్ధముంది. తెలియని వాళ్ళకి ఎందుకు?" అన్నాను.

బాబాయి స్థితప్రజ్ఞుడిలాగ చిరునవ్వు నవ్వి "తెలుసుకోడానికి కాస్త టైం పడుతుంది" అన్నాడు. నా పాలకార్డు తీసి ఇస్తూ "ఇదిగో కార్డు. ఉదయం అరలీటరు, సాయంత్రం అరలీటరు - అమ్మాయికి ఎక్కువ ఇబ్బంది ఉండదు. మన ఇంటిపక్కనే బూత్. పాలు తెచ్చుకోవడం కష్టమయితే నాకు చెప్పు, ఈ భోలాగాడిని పంపిస్తాను. వెధవకి మాటలు రావు. కాని చాకు" అన్నాడు. అప్పుడు ఆ కుర్రాడిని చూశాను. వాడు మూగ అని అప్పటికి అర్ధమయింది. "మనకి ఈ షాపుకి రావడానికే వ్యవధి చాలదు! వీడే షాపు నడిపిస్తాడు. అప్పుడప్పుడు వచ్చి వీడిమీద కర్రపెత్తనం చేస్తుంటాను. మంచి 'మలాయ్ చాయ్' తాగుతావా బాబాయ్?" అన్నాడు. ప్రశ్నకు సమాధానం చెప్పేవరకు ఆగలేదు. భోలానిపిలిచి "చాయ్" పురమాయించాడు.

"మీరుండేదెక్కడ?" అన్నాను.

నవ్వాడు. "ఎక్కడేమిటి బాబాయ్? ఎవరెప్పుడు నన్ను తలుచుకుంటే అక్కడ. ఇరవైరోజుల్నుంచీ మైలేజ్ క్లర్క్ విఠల్‌రావుగారి బావమరిది ఆస్పత్రిలో ఉన్నాడు. కాన్సర్. అక్కడున్నాను - నాలుగురోజుల క్రిందటే ఆయన నన్ను రిలీజ్ చేశాడు".

"బాగుపడ్డాడా?"

"అబ్బే చచ్చిపోయాడు"

"అంతకు క్రితం?"

"గోపీనాథంగారని - ఇక్కడ మోటారు కంపెనీలో గుమస్తా. ఆయనకి అనుకోకుండా పాట్నా బదిలీ అయిపోయింది. పెళ్ళాం రోగిష్టి మనిషి - నలుగురు పిల్లలు. పనులన్నీ పూర్తి చేసుకుని అక్కడకి పోయి పడుకునేవాడిని. ఎక్కడా ఏ పని లేనప్పుడు ఇదిగో - ఈ బల్ల నా నివాసం."

అతని జీవితం వింతగా తోచింది నాకు.

"మరి మీ భార్యా పిల్లలూ?"

ఫక్కున నవ్వాడు.

"మనకి తీరుబాటు ఉండదని పిల్లల్నివ్వడం మానేశాడు దేవుడు. భార్యనా? తీసుకొస్తాను. కాస్త మనం ఇక్కడ బాగా నిలదొక్కుకుని నాలుగు పైసలు సంపాదించుకున్నాక - చాలా దూరంలో ఉంది" అన్నాడు.

నాకెందుకనో బాబాయ్ మంచితనం కేవలం స్వభావంలాగ కనిపించలేదు. అదొక ఉద్యమంలాగ కనిపించింది. ఏదో పెద్దపోరాటాన్ని నిష్టతో సాగిస్తున్న వీరుడిలాగ కనిపించాడాయన.

నేను బిలాస్‌పూర్‌లో ఉన్న నాలుగేళ్ళు నాకు తలలో నాలికలాగ ఉన్నాడు. మా ఆవిడకయితే అతను సొంత తల్లిదండ్రులకన్నా ఎక్కువయిపోయాడు. మళ్ళీ బదిలీ అయే రోజులు దగ్గరకొస్తున్నాయంటే బాబాయినెలా వదిలిపోవాలా అన్న బెంగ పట్టుకుంది. అతని మంచితనం ఆ ఊరి ప్రజాజీవితంలో "వైరస్" లాంటిది. దాన్నెవరూ తప్పించుకోలేరు. జీవితంలో ప్రతిచోటా అలాంటి వ్యక్తులు దొరకరు. బదిలీ ఆలోచన వస్తేనే గుండె గొంతులో కదిలేది.

కాని ఆ సమస్యని సులువుగానే పరిష్కారం చేశాడు బాబాయి. ఒక వేసవికాలం సాయంత్రం గోపీనాథంగారి పిల్లలకి గాలిపటాలు కొని తెచ్చి రెండో అంతస్తు మీదకి వెళ్ళి వాళ్ళతోపాటు ఎగరేస్తున్నాడు. రెండో అంతస్తు అప్పుడే కొత్తగా కడుతున్నారు. పిల్లలు గాలిపటాలు చూస్తూ గెంతుతున్నారు. ఎగరేస్తూ ఎగరేసూ పిట్టగోడ చివరికి నడిచి మేడమీంచి పడిపోయాడు. నడుం విరిగిపోయింది.

బాబాయిని ఆస్పత్రిలో చేర్చారని తెలిసి దిగ్భ్రాంతుడినయ్యాను. వెంటనే ఆస్పత్రికి పరిగెత్తాను. మా ఆవిడయితే ఆ విషయం వినగానే భోరుమంది. మంచం మీద నిశ్చలంగా తపస్సుకి సిద్ధపడుతున్న రుషిలాగ పడుకున్నాడు. మెడ కదలకూడదు. ఒంటిచుట్టూ పెద్ద ప్లాస్టరు. నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు. "రా బాబాయి. నీకోసమే ఎదురు చూస్తున్నా" అన్నాడు బలహీనంగా.

అతన్ని చూస్తే కళ్ళనీళ్ళు వచ్చాయి నాకు. "ఏమన్నారు డాక్టర్లు?" అన్నాను మంచం పక్కన కూర్చుంటూ.

"మరేం ఫరవాలేదన్నారు. ఇంకా ఎన్ని రోజులు బతుకుతానో చెప్పడానికి మొహమాటపడుతున్నారు" అన్నాడు నవ్వుతూ.

"ఛఛ! మీలాంటి మంచివాళ్ళు పదికాలాలపాటు బతకాలి, తప్పక నయమవుతుంది" అన్నాను.

"నా బాధ అదికాదు. ఇంకా ఎక్కువమందికి శ్రమ ఇవ్వకుండా త్వరగా పోవాలని" అన్నాడు ఎటో చూస్తూ.

హఠాత్తుగా - అతని భార్య గుర్తుకు వచ్చింది. "అన్నట్టు కనీసం ఈ సమయంలోనయినా మీ భార్య రావడం మంచిది కదా చేదోడుగా ఉంటుంది. అడ్రసు ఇవ్వండి. టెలిగ్రాం ఇస్తాను. రెండురోజుల్లో వచ్చేస్తారు" అన్నాను.

"వస్తుంది. కాని రావడానికి చాలాదూరం. టెలిగ్రాం అందుతుందో లేదో" అన్నాడు.

"అదేం?"

నా వేపు తిరిగి "నా రహస్యం ఎప్పుడో ఒకప్పుడు ఎవరికో ఒకరికి చెపాలి. మా ఆవిడ చచ్చిపోయింది. చచ్చిపోయి ఇరవై ఏళ్ళయింది" అన్నాడు.

నేను దిమ్మరపోయాను - "అయితే మరింతకాలం -"

"ఇంకొకరి జాలితో బతకకూడదనుకున్నాను. నా కష్టం నాకే ప్రత్యేకం. ధైర్యంగా, రహస్యంగా అనుభవించాను" అన్నాడు.

ఈలోగా ఇద్దరు లోపలికి వచ్చారు. వాళ్ళని నేనెప్పుడూ చూడలేదు. ఇద్దరూ ఉత్తర హిందూదేశం మనుషులే. ఒకాయనకి బాబాయిని చూడగానే కళ్ళనీళ్ళు తిరగడం గమనించాను. పక్కన కూర్చుని ఎంతోసేపు మాట్లాడారు. చిరునవ్వుతో వాళ్ళ ప్రశ్నలకి సమాధానాలిస్తూ వాళ్ళ పనులేవో ఎలా చెయ్యాలో చెపుతున్నాడు.

"ఈయన మోటారు సైకిలు టైరు మన షాపులో ఉండిపోయింది బాబాయ్ రేపు దయచేసి ఆయనకి అందచెయ్యి" అన్నాడు నా వేపు తిరిగి.

మంచం మీద పడుకుని కూడా తన బాధ గురించికాక అతని మోటారు సైకిలు టైరు గురించి ఆలోచించే అతన్ని చూసి గుండె ద్రవించిపోయింది.

వెళుతూ వాళ్ళిద్దరిలో ఒకాయన ఆపిలుపండు తీసి రెండు చేతుల్లో వినయంగా బాబాయి చేతిలో పెట్టాడు. ఇద్దరూ పేదవాళ్ళలాగే ఉన్నారు. పండు అక్కడక్కడా కుళ్ళు చూపింది. కాని ఆ పండు చూసుకుని పొంగిపోయాడు బాబాయి. వాళ్ళు వెళ్ళిన తర్వాత కూడా నేను చూస్తూ కూర్చున్నాను.

ఎంతోసేపటికి నా వేపు తిరిగి - "కృతజ్ఞత ఎంత విలువయినది బాబాయ్" అన్నాడు. "ఇందాక మా ఆవిడ గురించి అడిగావు కదూ? - మా లలిత, ఇరవై ఏళ్ళ కిందట ఈ ఊళ్ళోనే పోయింది. నేనీ ఊరొచ్చిన కొత్త. ఇక్కడెవరూ నాకు తెలీదు. భాష తెలీదు - తెలుగు వాళ్ళు ఉన్నా ఒకరికొకరికి పొందికలేదు. పలకరించే నాధుడు లేదు. మా ఆవిడకి నెలలు నిండి మశూచి పోసింది. ***పేదరికం భయంకరమనుకుంటాం కాని సానుభూతి, సహాయం దొరక్కపోవడమంత భయంకరమయిన బాధ మరొకటి లేదు. పేదవాడిని రోజూ ఓదార్చగలిగితే ఆకలిని కూడా మరిపించవచ్చునని నా నమ్మకం.*** ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ఊళ్ళో నా అనేవాళ్ళు లేక - మా ఆవిడ నా చేతుల్లో చచ్చిపోయింది. శవాన్ని తగలెట్టడానికి మనుషుల్ని బతిమాలుకున్నాను"

ఆగి మంచినీళ్ళుకావాలన్నాడు. ఇచ్చాను.

"నేను నష్టపోయిందేమిటో నాకు తెలుసు. సానుభూతి. పక్కవాడి గురించి ఆలోచించని సమాజం మీద తిరగబడాలనుకున్నాను ఇరవై ఏళ్ళు ఆ పనిచేశాను. సహాయం కావాలనుకున్నవాడికల్లా సహాయం చేశాను. ఫలితం ఇవాళ మంచమెక్కితే పక్కన కూర్చునే ఒక మిత్రుడిని, సానుభూతితో చేతికి అందిన ఈ ఆపిలు పండునీ సంపాదించుకున్నాను. ముగ్గురు వ్యక్తుల దృక్పథంలో మార్పుకి ఇరవై ఏళ్ళు శ్రమపడాల్సి వచ్చింది. ఓహ్! ఈ ఆపిల్ పండు ఎంత విలువయినదో తెలుసా బాబాయ్! నేను దీనికోసమే ఇన్నాళ్ళూ బతికాను"

మరి రెండు రోజుల తరవాత బాబాయి చచ్చిపోయాడు.

✡✡✡

వేడుక — పంతుల జోగారావు

(ఆంధ్ర సచిత్ర వార పత్రిక, మార్చి 11- 1988)

మట్టి ముద్దలు పిసుక్కుంటూ, ఆ వృద్ధుడు చాలా సేపటి నుంచీ అలా అక్కడ కూచుని ఉన్నాడు. ఎండ వేడెక్కుతోంది. నూతి చప్టా క్రింద కూచుని, చేతుల నిండా మట్టి ముద్దలతో అతను - మట్టితో ఆడుకునే అమాయాకపు పసిపిల్లాడిలా ఉన్నారు. ఏడు పదులు పైబడిన వయసులో, అతను పడే అవస్థ చూస్తే ఎవరికయినా ఆశ్చర్యం కలుగక మానదు.

పీక్కుపోయిన చప్పిదవడలు, బట్టతల, సన్నగా పొడుగ్గా ఉన్నారాయన. జీవితంలో ఎగుడు దిగుళ్ళకీ, అనుభవాలకీ ప్రతీకల్లాగ నుదుటి మీద ముడుతలు, చెమట బిందువులు చుక్కలు చుక్కలుగా తలమీదనుంచి నుదుటి మీదకీ, చెవుల పక్కలనుంచి మెడమీదకి కారుతున్నాయి. ఎండిపోయిన పెదవుల చెమట నీరు ఉప్పగా తగులుతోంది. మన్ను పిసుకుతూనే, వీధి తలుపుల వేపు బెంగగా చెవులు రిక్కించి ఉన్నారాయన. ఏక్షణంలోనయినా ఎవరైనా వచ్చి తలుపు తట్టవచ్చు. అందుకే తొందర తొందరగా తన పని ముగించాలని ఆత్రుత అతనిలో పెరిగిపోతోంది. అలసట వల్ల, భయం వల్ల అతని చేతి వ్రేళ్ళు సన్నగా వణుకుతున్నాయి. వ్రేళ్ళ సందులో తడి మన్ను తప తపమని శబ్దం చేస్తుంది.

ఆ మట్టితో గుర్రం బొమ్మ చేయాలని అతని తాపత్రయం. శరీరంలో అణువణువులోని శక్తినీ కూడదీసుకుని, చేస్తున పనిమీద ఏకాగ్ర చిత్తంతో దృష్టి నిలిపి ఉన్నారాయన.

క్రమ క్రమంగా అతని మనోభావాలు ఒక రూపు దాలుస్తున్నట్టుగా, - గుర్రం బొమ్మ తయారు కాసాగింది. అతని మనస్సు అనిర్వచనీయమైన ఆనందంతో నిండిపోతోంది. అది హృదయ సంబంధి!

అప్పుడతను - మహాకావ్య రచన చేస్తున్న అక్షర శిల్పిలా ఉన్నారు. రసానందంతో అతని హృదయం భారమైంది. అప్పుడే పుట్టిన బిడ్డని పొత్తిళ్ళలో గుండెకి చేరువగా, సుతారంగా అదుముకుని, దివ్యానుభూత్తో పరవశించి పోయే కన్న తల్లిలా అతని కళ్ళు ఆర్ద్రంగా చెమ్మగిల్లాయి.

అంతలో వీధి తలుపుల నెవరో దబదబ బాదసాగారు.

తపో భంగం చెందిన మునిలా కలత చెందిన హృదయంతో లేచి నిలబడ్డారాయన.

✡✡✡

అతని గుండె వేగంగా కొట్టుకుంది. కోడలూ, పిల్లలూ అప్పుడే సినిమా నుంచి వచ్చేసారా! భయంతో అతనికి ఒంటిమీద చెమటలు ధారాపాతంగా కారిపోతున్నాయి. ఒక్కక్షణం సేపు, అతనికేం చేయాలో తోచలేదు.

తలుపు కొడుతున్న చప్పుడు వినిపిస్తూనే ఉంది.

అతను చప్పున పూర్తి రూపం సంతరించుకోబోతున్న ఆ గుర్రం బొమ్మని నూతి వెనుక చెట్ల వెనుక దాచేసారు. చేతులు గబ గబా చెంబుడు నీళ్ళతో కడుక్కున్నారు. ఆ తొందరలో, చేతికంటిన మరకలు ఇంకా పూర్తిగా వదలనే లేదు. మట్టి పిసుకుతున్నప్పుడు పంచ మీద మరకలయ్యాయి. ఈ అవతారంతో తనని చూస్తే కోడలు శివాలెత్తి పోతుంది అడ్డూ ఆపూ లేకుండా నోటికి వచ్చినట్టు తిడుతుంది. పిల్లలు తన వేపొక జంతువుని చూసినట్లు చూస్తారు. అతనికి తనమీద తనకే అసహ్యంవేస్తోంది. దుఃఖం గొంతు దగ్గర గరగరలాడుతోంది.

చేతులు పంచెకు తుడుచుకుంటూ, భయం భయంగా వెళ్ళి తలుపు తీసాడు.

ఎదురుగా పక్కింటి కుర్రాడు. పేపరు కోసం వచ్చాడు. అతనికి గుండె భారం అంతా ఒక్కసారి దిగిపోయినట్లయింది. బాధనెవరో ఒక్కసారి చేత్తో తీసేసినట్లయింది. ఆ అబ్బాయికి పేపరు ఇచ్చి పంపేసాక, వీధి తలుపులు మళ్ళా వేసి, పెరట్లోకి దారి తీసారు. చెట్ల చాటున దాచిన బొమ్మని తీసి చూసారు. గాభరాగా దాచడం వల్ల బొమ్మ రూపం కొద్దిగా చెడింది. దాన్ని మళ్ళీ సరిచేసి, తుది మెరుగులు దిద్దసాగారు.

మరి కాసేపటికి గుర్రం బొమ్మ తయారైంది. ఆనందంతో అతని కళ్ళు అరమోడ్పులయాయి. దానివేపు తృప్తిగా చూసుకుని, ఎవరి కంటా పడని చోట దాన్ని భద్రపరిచారు. చేతికి, పంచెకే అంటిన మట్టి మరకల్ని శుభ్రంగా కడుక్కుని తన గదిలోకి దారితీసారు.

కుక్కి మంచం మీద నడుం వాల్చి, తను తయారు చేసిన గుర్రం బొమ్మగురించే ఆలోచిస్తూ కళ్ళు మూసుకుని పడుకున్నారతను. చింకి బొంతల మీద పరిచిన పల్చని దుప్పటి మాసిపోయి, అదోరకం వెగటు వాసన వేస్తూంది. తలగడకి గలీబు లేదు. జిడ్డుతో అట్టగట్టి ఉంది. కదిలినప్పుడల్లా మంచం కిర్రుమంటోంది. మంచం పక్కనే విరిగిపడిపోయేలా ఉండే బల్ల మీద అతను వాడాల్సిన మందులున్నాయి. ఎప్పుడో, పదిహేను రోజుల క్రిందట కొడుకు కొని తెచ్చిన మందులవి. వాటిని కూడా పొదుపుగా వాడుకోవలసిందే తను!

మందులయిపోయేయన్న సంగతి కొడుక్కి గుర్తుచేయబోతే, కోడలు కస్సున లేస్తుంది. "అప్పుడే అయిపోయాయా మందులూ? ఎంత డబ్బూ మందులకే చాలడంలేదు. ముసలాయన మందులకే డబ్బంతా పోస్తూ ఉంటే, ఇక సంసారం చేసినట్టే.." అని, రుసరుసలాడుతుంది.

ఆ మాటలు వింటూ ఉంటే ముసిలాయనకి ప్రాణం ఆర్చుకు పోతున్నట్టుంటుంది. మరింక మందుల ఊసెత్తడానికి ధైర్యం చాలదు. కోడలన్నదీ నిజమేననిపిస్తుంది. పోయే కాలమే కానీ, వచ్చేకాలం కాదు కదా, తనకి ఎన్నిమందులు వాడినా, తన పరిస్థితి అలాగే ఉంది, మరి!

తన రోగం మందుల వల్ల తగ్గేది కాదు. ఆ సంగతి తనకి తెలుసు. ఈ ఇంట్లో తనేమీకాడు - తన ఉనికి అందరికీ భారమే! ఆ సంగతి తెలిసి పోవడానికి అట్టే కాలం పట్టనవసరం లేకపోయింది.

భార్య పోయాక, కొడుకు కర్మ కాండ అంతా పూర్తి చేసి, అంతా ముగిసాక, ఆఖరి రోజున అడిగిన మొదటి ప్రశ్న...

"ఇకముందు ఏం చేయదల్చుకున్నారు నాన్నా!" అని.

ఏం చేస్తాడు తను!

ఏడుపు రాలేదు. జీవం లేని నవ్వు పెదాలమీద కదలాడింది.

"మీరొక్కరూ ఈ పల్లెటూళ్ళో ఎందుకు నాన్నా, మా దగ్గరే ఉందురుగాని, వచ్చెయండి -" అనలేక పోయాడు. అలా స్వతంత్రించి అనగలిగే ధైర్యం పెళ్ళయాక వాడికెప్పుడూ లేదు.

కోడలు కలగజేసుకుంటూ అంది: "ఉన్న ఫలాన ఈ ఇల్లూ అదీ వదిలేసి, ఆయన మట్టుకేం వస్తారు? వచ్చినా, ఆయన ఉండేందుకు మన కొంపలో మరో గదికూడా లేదాయె. అంచేత కాస్త పెద్ద కొంప దొరికాక, నింపాదిగా ఆయన రావచ్చులెండి."

ఆ క్షణాన అనిపించింది - తనకట్టె ఈ ఇంటి నుంచే కాటికి వెళ్ళాలి తప్ప - పుట్టి పెరిగిన గ్రామం ఒదలకూడదని.

ఈ ఊరితో తనకెన్నో మధురానుభూతులు పెనవేసుకుని ఉన్నాయి.

ఇక్కడే పుట్టాడు. ఇక్కడే పెరిగాడు. బడిపంతులుగా ఉద్యోగం చేసిందీ, రిటైరయిందీ ఇక్కడే పార్వతితో పెళ్ళయింది. మట్టెల చప్పుడుతో ఇల్లంతా కలియ తిరుగుతూ ఉండేది పార్వతి - ఈ ఇంట్లోనే, సుదీర్ఘకాలం తనతో కష్టం సుఖం పంచుకుని, పార్వతి తన చేతుల మీదగానే వెళ్ళిపోయింది, ఇక్కడే నుంచే...

గతం గుర్తొచ్చి, అతని మనసు భారమైంది. వెచ్చటి కన్నీరు అతని చెంపల మీదుగా దిగజారింది.

అతని ప్రమేయం లేకుండానే బాల్య స్మృతులు మళ్ళీ కళ్ళ ముందు కదలాడసాగాయి.

బాల్యం ఎంత సరదాగా గడిచి పోయింది!

భోగి మంటకి క్రొత్త కంపా సంపాదించడానికి, పడే పాట్లు ఎన్నో! దసరా వేడుకలో బాణాలు పట్టుకుని, పప్పు బెల్లాల కోసం ఇల్లిల్లూ తిరుగుతూ పాడే పాటలు తనకిప్పటికీ గుర్తే!

ఇప్పటి పిల్లల జీవితాల్లో వేగం హెచ్చయింది. వీళ్ళ సరదాలే వేరు. వీళ్ళ ఆటలూ పాటలూ వేరు. పిల్లల సరదాలని కూడా ఒక్కోసారి పెద్దలే నియంత్రించాల్సి రావటం చూస్తుంటే బాధ కూడా కలుగుతూ ఉంటుంది.

తనకెప్పుడూ మనవళ్ళతోనూ, మనవరాలితోనూ తన చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకోవాలని కోరిక బలంగా ఉంటుంది. అప్పటి ఆటలూ, తన సరదాలూ అల్లరి పనులూ, పండుగ ఆర్భాటాలూ వీటి గురించి ఉల్లాసంగా చెప్పాలని మనసు తొందర పెడుతూ ఉంటుంది. కాని, వాళ్ళకంత తీరికేదీ? అధవా, ఉన్నప్పటికి, కోడలు సాగనివ్వదు. ఆమె దృష్టిలో తన చిన్నప్పటి ముచ్చట్లు చాదస్తపు చేష్టల్లా కనిపిస్తాయి. విసుక్కుంటుంది.

"చాల్లెండి.. చదువులూ చట్టబండలూ లేకుండా గాలికీ, ధూళికీ తిరిగే వాళ్ళమని చెప్పుకోడానికి సిగ్గువెయడం లేదూ! వీళ్ళకి ఎంత టైమూ చదువుకోవడానికే సరిపోవడం లేదు. మీ పల్లెటూరి బైతు సరదాలు ఏకరువు పెట్టి పిల్లల్ని చెడగొట్టకండి..."

నిజమే.. ఈ పిల్లలు ఇప్పటి సమాజానికి దర్పణాలుగా పెరగడంలో తప్పులేదు. కాని.. తన అనుభూతులూ, అనుభవాలూ వాళ్ళతో పంచుకోవాలన్న తపన ఎలా నేరమవుతుందో అర్థంకాదు తనకి.

తనతో ఎవరూ మాట్లాడరు.

వేళకి కాఫీ గ్లాసు మనవడు తన గదిలో పెట్టి వెళ్ళిపోతాడు. మందు సీసాల మధ్య అదికూడా మందులాగే అనిపిస్తుంది. భోజనమూ అంతే!... అందరూ తిని వెళ్ళిపోయాక, ఎండిపోయిన మెతుకులు. సయించదు. ఏదో, తిన్నానని అనిపించి, చెయి కడుకోవడం -

అలాంటప్పుడు గుర్తొస్తుంది భార్య!

అలాంటప్పుడు గుర్తొస్తుంది పుట్టిపెరిగిన తన పల్లె!

అలాంటప్పుడు గుర్తొస్తుంది. హరివిల్లు లాంటి తన బాల్యం!

ఏడుపొస్తుంది. గుండె చిద్రుపలవుతుంది. మనిషి కోసం, మనిషి సావాసం కోసం తపించిపోతాడు తను. చప్పిదవడల మీద నుంచి కారిన కన్నీరు అట్ట గట్టిన తలగడను తడిపేస్తుంది

ఆ ఊరు వదిలి రాకుండా ఉండాల్సింది. కాని, రాక తప్పలేదు. దినం గడవక తను రాక తప్పలేదు.

పట్నం వచ్చే ముందు, సామాను సర్దుతూ ఉంటే మనసంతా ఏదో చెప్పలేని వెలితితో నిండిపోయింది. ప్రతీ వస్తువునీ ఆప్యాయంగా తడుముతూ కన్నీరు విడిచారు. కదల్చడానికి వీల్లేని సామాను వాళ్ళకీ, వీళ్ళకీ ఇచ్చేసాడు. కొడుక్కి పనికొస్తాయనుకున్న సామాను మాత్రం సిద్ధం చేసాడు.

అప్పుడు కనిపించిందది....

మాసిపోయిన సామ్రాజ్యాలకి చిహ్నంగా, వెలిసి పోయిన కోట గోడ నిలిచినట్టుగా -

వెలిసిపోయిన వర్షానికి గుర్తుగా, కొమ్మమీదా, రెమ్మ మీదా నీటిబొట్టు నిలిచినట్టు -

చిన్నప్పటి ఆట బొమ్మ పెద్దయ్యాక దొరికినట్టు -

అటక మీదనుంచి దించిన కర్ర సామాన్ల మధ్య కనిపించిందది!

గుడి బండి!

దాని మీద కుండీ గుర్రం!

బల్ల చెక్కకి నాలుగువేపులా కర్ర చక్రాలు. దానిమీద తాడుతో కట్టి నిల్చోబెట్టిన గుర్రం బొమ్మ!

దాన్ని చూస్తూనే అలా చాలా సేపు ఉండిపోయాడు తను.

తన రామం దానితో ఆడుకునేవాడు. తమ వేపు గ్రామ ప్రాంతాలలో ఆ పండుగ ఎంత వేడుకుగా జరిగేదని! కుండీ అమావాస్య అని దాని పేరు. మహాలయ అమావాస్యనాడు జరిగేదా పండుగ. పొద్దున్నే తట్టల్లో కుండీ గుర్రాలని పేర్చుకుని, వీధి వీధి తిరిగి అమ్మేవాళ్ళు.

అణాకొకటి - కుండీ గుర్రం!

పిల్లల సంబరం అంతా ఇంతా కాదు. కొత్త బట్టలు వేసుకుని అటకల మీద నుంచి ముందు రోజే దింపి, ధూళీ అదీ దులిపి, సిద్ధం చేసుకున్న గుడబళ్ళ మీద ఆ గుర్రం బొమ్మల్ని కట్టేవాడ్డు. గుడ బండి తాడుచేత బుచ్చుకుని, గుడ గుడ శబ్దం చేస్తూ నాలుగు వీధులూ చుట్టబెట్టేవాళ్ళు - రామం ఆనందానికి పట్టపగ్గాలు ఉండేవి కాదు!

ఈ బండీ, గుర్రం బొమ్మా తీసుకుని వెళ్ళి చూపిస్తే ఎంత ముచ్చట పడిపోతాడో! వీటిని చూపించి, ఆ ముచ్చట్లు చెపుతూ ఉంటే రామంతో పాటు పిల్లలు కూడా ఎంత సంబర పడతారో! చిన్నప్పటి సరదాలు నెమరు వేసుకోవడంతో ఎంత తృప్తి ఉంటుంది?

ఈ ఆలోచన రాగానే, తను తీసికెళ్ళబోయే సామాన్లతో పాటూ ఆ గుడ బండినీ, గుర్రం బొమ్మనీ కూడా భద్రంగా తీసికెళ్ళాలనే నిశ్చయానికొచ్చేరాయన. గుడ బండి దుమ్ము పేరుకుని పోయి ఉంది. గుర్రం బొమ్మని ప్రేమతో తాకబోతే, ఎక్కడి కక్కడ ముక్కలు చెక్కలుగా విచ్చిపోయింది. చేతిలో పొడి పొడిగా చివికి పోతూ, వ్రేళ్ళ సందులలోనుంచి మన్ను రాలిపోయింది. అతని మనసు విలవిలలాడిపోయింది. బాధగా నిట్టూర్చి, చేతులు దులుపుకున్నారు. గుడ బండిని మాత్రం సామాన్లతో సర్దారు.

పట్నంలో కొడుకు ఇంట్లోకి సామాన్లు చేరవేస్తుండగానే కోడలు ఆ గుడ బండిని చూసి, ముఖం చిట్లించుకుంది. ఒక అసహ్యకరమైన వస్తువుని దేన్నో చూసినట్లుగా ముఖం వికారంగా మార్చుకుంది.

పిల్లలంతా దానివేపు ఆసక్తిగా చూసారు. రామం కూడా దాన్ని చూస్తూనే, బాల్య స్మృతులు గుండె అరల్లో పొంగి కాబోలు, ఉత్సాహంగా ఒక అడుగు ముందుకు వేయబోయి, భార్య ముఖం చూసి, వెనకడుగు వేసాడు.

తనా బండిని చూపించి, ఏదో అనబోయేలోగానే -

"ఈ చెత్తంతా మోసుకు రాకపోతే, అక్కడే వదిలేసి రాలేకపోయారా! లంకంత కొంప ఎత్తిపెట్టుకొచ్చినా, ఇంట్లోకి పనికొచ్చే సామాను ఒక్కటీ లేకుండా పోయింది... అంతా మన్నూ మశానం -" అంటూ గొణిగింది.

తన ఉత్సాహమంతా నీరు కారిపోయింది. గుండెనెవరో పిండేసినట్లయింది.

కోడలి అగ్రహానికి ఆ గుడ బండి ఎప్పుడో నీళ్ళ పాయ్యి కిందకి ఇంధనంగా వెళ్ళిపోవలసిందే! కాని, తనే మమకారం చావక ఆమె కంట పడకుండా దాన్ని జాగ్రత్త చేసాడు.

ఆ తర్వాత మనవరాలు తల్లిలేని సమయం చూసి, ఆ బండి గురించి ఒకటి రెండుసార్లు ఆసక్తిగా అడిగింది.

"తాతయ్యా! అదేమిటో చెప్పవూ?" అని. చెప్పలేదు తను. చెప్పాలనీ అనిపించలేదు. చెపితే, ఆ పసి మనసు ఉండబట్టలేక, తల్లితో అంటుంది. కోడలు వీరాంగణం ఎత్తుతుంది. పసిపిల్ల మనసు ఉగ్గబట్టలేక దానితో ఆడుకుందామని మారాం చేస్తే, తల్లి చేత దెబ్బలు తినాల్సి వస్తుందేమో కూడా! ఆ భయం చేతనే మనవరాలికి జవాబు చెప్పక ఇన్నాళ్ళూ దాటవేసేవాడు తను. ఆ పిల్ల వదల్లేదు తనని.

రెండురోజుల క్రితం అనాసక్తంగా చూస్తున్న తన దృష్టి, కేలండరులో పండుగల జాబితా మీద పడింది. రెండురోజుల్లో వస్తోంది. అమావాస్య! మహాలయ అమావాస్య!అది చూస్తూనే తనలో ఏదో వింత శక్తి పుంజుకుంది. ఉత్సాహంగా లేచి కూచున్నాడు. మనవరాలిని దగ్గరకి తీసుకుని, గుడ బండీ గురించీ, కుండీ గుర్రం గురించీ, ఆ పండుగ గురించీ వివరంగా చెప్పసాగాడు.

"మా డాడీ చిన్నప్పుడు కుండీ గుర్రం లాగుతూ ఆడుకునే వారా తాతయ్యా?" అమాయకంగా ప్రశ్నించింది మనవరాలు. అవుననన్నట్లుగా తను తల ఊపితే, ఆ పిల్ల కళ్ళలో వింత మెరుపేదో మెరిసింది, క్షణం సేపు. ఇంతలో లోపలి నుండి తల్లి పిలుపు కర్కశంగా వినిపించడంతో ఆ పిల్ల ఇంట్లోకి జారుకోవడం జరిగింది.

అప్పుడు కలిగింది - తనకీ ఆలోచన!

రాబోయే కుండీ అమావాస్య నాటికి, ఎలాగయినా కుండీ గుర్రం బొమ్మ తయారు చేయాలి తను. ఎవరికీ తెలియనివ్వకుండా చెయ్యాలి గుర్రం బొమ్మని. గుడ బండిమీద దాన్ని కట్టి, రెండురోజులలో రాబోయే మహాలయ అమావాస్య నాడు దాన్ని హఠాత్తుగా అందరికీ చూపించి, ఆశ్చర్య చకితులని చేయాలి! దాన్ని చూస్తూనే పిల్లల సందడి చూడాలి. చిన్నప్పటి స్మృతులు మెదిలి, రామం ముఖంలో వెలిగే మందహాస రేఖ చూడాలి తను!

అప్పుడు రామంలో -

తన అదుపాజ్ఞలలో పెరిగే రామం కనిపిస్తాడు. ఆ అమాయకపు రామం కనిపిస్తాడు. అపేక్షగా తనకి సన్నిహితంగా ఉండే రామం కనిపిస్తాడు.

ఇప్పటి రామం తన కొడ్డు -

తన నుంచి మానసికంగా దూరంగా పారిపోయే ఈ రామం తనకొడ్డు -

గుడ బండి త్రిప్పుతూ ఇల్లంతా తిరిగే చిన్నప్పటి రామం కావాలి, తనకి! ఆ రామం మళ్ళీ దొరుకుతాడా తనకి?

కనీసం..

ఆ రామాన్ని వాడి పిల్లలలోనయినా చూసుకోగలడా తను?

ముసలాయన ఆలోచనలు అనంతంగా సాగిపోతున్నాయి. ఆ ఆలోచనలకి అడ్డ కట్ట వేస్తూ వీధి తలుపు చప్పుడయింది.

ఈసారి వచ్చింది కోడలే.. సినిమా వదిలేసారు కాబోలు...

"సినిమా ఎలా ఉందమ్మా?" ఆప్యాయంగా అడిగాడు.

అతనికి సమాధానం చెప్పాల్సిన అవసరమే లేనట్టుగా ఓ చూపు విసిరి, చర చరా ఇంట్లోకి దారి తీసిందామె. పిల్లలు ఆమెను అనుసరించారు.

అప్పుడతనికి ఎందుకో - పాత పడిపోయి, తన చేతిలో నుగ్గు నుగ్గుగా మన్ను, గుండ గుండగా రాలిపోయిన కుండీ గుర్రం బొమ్మ గుర్తొచ్చింది.

✡✡✡

ముసలాయనకి నిద్రపట్టడంలేదు. కిటికీలోనుంచి ఈదురు గాలి విసురుగా తగులుతోంది. వర్షం ముంచుకొచ్చేలా ఉంది. రాత్రి పదకొండు దాటుతోంది. లోపలి గదిలో లైటు తీసేసి ఉంది. అంతా నిద్రపోతున్నారు. తనకే నిద్రపట్టడంలేదు.

మంచం క్రిందకి దిగి, తొంగి చూసారు. గుడ బండి మీద తన స్వహస్తాలతో చేసిన గుర్రం బొమ్మ కనిపించింది.

అతని గుండెలో ఆ రోజు ఉదయం ఎదురయిన చేదు అనుభవం తుమ్మ ముల్లులా గుచ్చుకుంటోంది.

ఆ వేళ - మహాలయ అమావాస్య బండినీ, గుర్రం బొమ్మనీ అందరికీ చూపించి, ఆనందం పంచుకోవాలని ఎదురు చూసిన రోజు!!

ఆ ఉదయాన్నే కాఫీల వేళప్పుడు వంట గదిలోకి వెళ్ళారతను. ఎప్పుడూ రాని వ్యక్తి ఆవేళప్పుడు రావడంతో కొడుకూ, కోడలూ అదోలా చూసారు.

"కాఫీ ఇంకా కాచలేదు. -" పుల్ల విరిచినట్లుగా అంది కోడలు. ముసలాయన ముఖంలోకి రక్తం ఎగజిమ్మినట్టయింది.

ఉత్సాహంతో, అదేమంతగా పట్టించుకోదలచుకోలేదు.

"ఇవాళ మహాలయ అమావాస్యమ్మా - మన గ్రామంలో మీ అత్తగారుండే రోజులలో ఈ పండుగ ఎంత సరదాగానో చేసుకునే వాళ్ళం"

అతని మాటలకి అడ్డొస్తూ, మూతి తిప్పుతూ అంది కోడలు: "అహా! అలాగా! ఇప్పుడొచ్చే పండుగలే చెయ్యలేక నా నడుం పీక్కుపోతుంది. ఇంక - మీ కాలం నాటి పాత చింతకాయ పండుగలన్నీ జరుపుకోవాలంటే నా వల్ల కాదు. -" అంది కఠినంగా.

దెబ్బతిన్న పక్షిలా విలవిలలాడి పోయాడు తను!

"అది కాదమ్మా పిండి వంటలూ అవీ చెయ్యమని కాదు నా ఉద్దేశం - మా రామం చిన్నప్పుడు ఈ పండుగనాడు గుడ బండి వీధుల్లో త్రిప్పుతూ.." అంటూ ఏదో చెప్పబోయాడు.

లిప్త కాలం రామం కళ్ళు మెరిశాయి. భార్య కంటి ఎరుపులో ఆ మెరుపు మాసిపోయింది!

"మళ్ళీ ఆ ముదనష్టపు బండి ఊసు తెచ్చారూ? దాన్నప్పుడే విరిచి పోగులు పెట్టి పొయ్యిలో పెట్టేసాను కాను.. పీడా పోయేది. ఛీ..ఛీ.. వెధవలేకి ఆటలూ, పల్లెటూరి సరదాలునూ - ఇంత వయసొచ్చినా, 'మా కాలం నాడయితే..' అంటూ సన్నాయి నొక్కులు నొక్కడం మానరు - ఏం మనుషులో! " కోడలు దులపరిస్తూ అక్కడి నుండి వెళ్ళిపోయింది.. ఆమె వెనుకే రామం, పిల్లలూనూ..

ఉదయం జరిగిన సంఘటన గుర్తొచ్చి, అతని కళ్ళలో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి. మనసు బాధగా మూలుగుతోంది. అశాంతిగా అటూ ఇటూ ఒత్తిగిల్లారు.

కిర్రు మంచం అతన్ని ఓదార్చలేదు.

✡✡✡

"డాడీ, తాతగారు కనిపించడంలేదు!"

చదువుకోడానికి తెల్లవారు ఝామున లేచిన రామం పెద్దకొడుకు ముందు గదిలో క్షీరమంచం ఖాళీగా ఉండడం గమనించి, గాభరాగా తండ్రిని నిద్రలేపాడు.

త్రుళ్ళిపడి లేచాడు రామం. అతని భార్య, మిగతా పిల్లలు కూడా లేచి కూర్చున్నారు.

రామం తొట్రుపాటుతో ముందు గదిలోకి వెళ్ళాడు. మంచం ఖాళీగా ఉంది. ఇల్లూ, పెరడూ అంతా వెతికినా, ముసలాయన జాడలేదు. రామంలో ఆత్రుత పెరిగిపోతోంది. పిల్లలు ఏడుపు లంకించుకున్నారు.

"ఈయన ఏ అఘాయిత్యం తలపెట్టలేదుకదా? - వెళ్ళి వెతకండి.." అంది రామం భార్య గాభరాగా.

రామం టార్చి లైటు తీసుకుని, వీధిలోకి బయలుదేరాడు. మగపిల్లలిద్దరూ అతనిని అనుసరించారు.

రాత్రంతా విడవకుండా వర్షం పడిందేమో, నేలంతా చిత్తడిగా ఉంది. రొజ్జ గాలి ఒంటిని ఝుళ్ మనిపిస్తూంది. చీకటి తెరలు విడివడి, అప్పుడే కొద్దికొద్దిగా వెలుతురు వస్తోంది.

తండ్రిని వెతుకుతూ వస్తున్న రామం, ఆ వీధి మలుపు తిరుగుతూనే ఆగిపోయాడూ.

అక్కడ..

ప్రహరీ గోడనానుకుని, కుప్పకూలిపోయి ఉన్న ఆకారాన్ని చూసి, అతనికి రక్తప్రసరణం ఆగిపోయినట్లయింది.

టార్చి లైటు వెలుగులో తండ్రిని పోల్చుకుని, అతనిలో దుఃఖం పెల్లుబికి వచ్చింది. "నాన్నా!" అంటూ అరిచాడు ఆందోళనగా, పిల్లలు ఘొల్లుమన్నారు.

వర్షంలో, చీకట్లో తండ్రి అసలింత దూర ఎందుకు వచ్చారో అతనికర్థం కాలేదు. టార్చిలైటు పెద్ద కొడుకు చేతికిచ్చి, నీరు ఓడుతున్న తండ్రి శరీరాన్ని రెండు చేతుల్తో లేవనెత్తబోయాడు. చలనం లేకుండా బరువెక్కిన తండ్రి దేహం భుజం మీదకి భారంగా చేర్చి, పాదవి పట్టుకున్నాడు.

తండ్రిని లేవనెత్తబోతూ ఉంటే - తండ్రి కుడిచేతిలో మూసిన గుప్పెట్లో బిగించి పట్టుకున్న తాడు రామం చేతిని చుట్టుకుంది. పెను పామేదో చేతికి చుటుకున్నట్టుగా అదిరిపడి, విదిలించబోయాడు. తాడుతో పాటూ లేస్తూ చప్పుడు చేసింది గుడ బండి!

"నాన్నా! అటు చూడు!..." పిల్లలు ఆశ్చర్యంలో అరిచారు. టార్చి వెలుగులో అటువైపు ఉద్విగ్నంగా చూసాడు రామం.

యజమాని వెంట తోకాడిస్తూ విశ్వాసంగా తిరిగే కుక్కపిల్లలా ఉంది - తడిసిన గుడ బండి!

దానిమీద -

రాత్రంతా ముసిలాయనతో నాలుగు వీధులూ ఊరేగి, రాత్రంతా కురిసిన వర్షానికి తడిసి, నానిపోయిన గుర్రం బొమ్మ -

ఇప్పుడది - పిడికెడు మట్టి ముద్ద!

✡✡✡

దగాపడ్డ తమ్ముళ్ళు -దేవరకొండ మురళి

(ఆంధ్ర సచిత వార పత్రిక, 17 -1-1975)

"ఏం తీసుకుంటావు?"

"కాఫీ చాలు"

"బతికించావు", నవ్వి అన్నాడు రాజారావు, "నిరుద్యోగి అయిన గ్రాడ్యుయేట్ దగ్గర కాఫీకి సరిపడేకంటే ఎక్కువ డబ్బులుండవు."

వసుధ నవ్వలేదు.

సర్వరుకి రెండు కాఫీ చెప్పాడు సర్వరు వెళ్ళిపోయాడు.

రాజారావుకి ఎక్కడ మొదలు పెట్టాలో తెలియలేదు. చేతివేళ్ళు చూసుకుంటూ అన్నాడు "పరీక్షలనుకుంటాను. బాగా చదువుతున్నావా?"

"పాసవుతాను"

తిరిగి రాజారావే అన్నాడు నెమ్మదిగా "నా గురించి ఇంట్లో ఏమనుకుంటున్నారు?"

"ఏమీ అనుకోవటం లేదు" టక్కున వచ్చింది జవాబు. "మా నాన్నగారు నాకు వేరే సంబంధాలు చూస్తున్నారు."

"....."

"రెండు నెలల్లో ముహూర్తాలు అయిపోతాయిట. ఈ లోపలే చేసెయ్యాలని పట్టుదలగా ఉన్నారు."

రాజారావేం మాట్లాడలేదు.

"మీ దగ్గర్నుంచీ ఏ కబురూ లేకపోతే ఎవరు మాత్రం ఏం చేస్తారు?" ఈ మాటలని రాజారావుకేసి చూసింది. చిరునవ్వుతో చేతులు కట్టుకుని తనవంకే సూటిగా చూస్తున్నాడు.

కోపం వచ్చిం వసుధకి. 'తన మాటలకే కాబోలు అంత సంతోషం!'

"ఏం చెయ్యమంటావు వసుధా?" కుర్చీలో జారగిలబడి కూర్చున్న మనిషి నిటారుగా అవుతూ అన్నాడు.

"పెళ్ళిచేసుకోవటానికి ముఖ్యమైన అర్హత సంపాదించుకోవాలి నేను. తర్వాతే పెళ్ళి"

"ఆ మాటే చెప్పవచ్చు కదా, నాన్నగారికి?"

"నాకు మంచి ఉద్యోగం దొరికే దాకా నీ పెళ్ళి ఆపమని అడిగే అధికారం నాకు లేదనిపించింది."

"అధికారం?" వసుధ గొంతు వణికింది. "మరి ఏ అధికారంతో రమ్మని కబురు చేసి నాతో ఇప్పుడు మాట్లాడుతున్నారు?"

"అధికారంతో కాదు మనం ఇలా మాట్లాడుకోవడం కొత్తకాదు. కాబట్టి అధికారం కాక మరేదైనా, నువ్వు ఉందనుకుంటే ఉంది. లేదనుకుంటేలేదు."

విసురుగా లేచింది వసుధ "నేను వెడుతున్నాను."

"అరెరె! ఏమిటిది? కూర్చో! ప్లీజ్!" కంగారుగా ఆమె చెయ్యిపట్టుకున్నాడు.

"వదలండి" ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

"దయచేసి కూర్చో! ఎవరైనా చూస్తే బాగుండదు ప్లీజ్!" ఆమె చెయ్యి వదిలేశాడు.

అప్పటికే లోపల చెదురుగా కూర్చుని ఉన్నవాళ్ళు వీళ్ళ కేసి చూస్తున్నారు.

సర్వరు కాఫీ కప్పులు, మంచి నీళ్ళ గ్లాసులు, బల్లమీద ఉంచి వెళ్ళిపోయాడు.

"తీసుకో" అన్నాడు తనో కప్పు తీసుకుంటూ.

మౌనంగా కప్పు అందుకుంది.

"ముందు మంచి నీళ్ళు తాగు." అన్నాడు నవ్వుతూ

"అక్కర్లేదు. థాంక్స్!" అంది రోషంగా.

"ఐయాం సారీ వసుధా! నాకు ఎలా మాట్లాడాలో బొత్తిగా తెలీదు. ఆ సంగతి తెలిసి కూడా ఎందుకంత కోపం తెచ్చుకుంటావు?"

"నన్నేడిపించటం ఒక్కటే తెలుసు మీకు" అంది కళ్ళు తుడుచుకుని. అతను కుడి చెయ్యి టేబుల్ మీద ఆనించే ఉంటాడు. తను మళ్ళీ లేస్తే పట్టుకోవటానికా అన్నట్టు. అది చూసి సిగ్గుపడింది వసుధ.

"నేనసలు చెప్పాలనుకున్నది చెప్పనే లేదు. ఈ లోపల హడలెత్తించావు నన్ను" అన్నాడు.

"అలాగే చెబుదురుగాని ముందు చెయ్యి తియ్యండి బల్లమీద"

"ఓ అలాగే" అని చెయ్యి వెనక్కి తీసుకుని నవ్వాడు.

"ఇప్పుడు చెప్పండి."

జేబులోంచి కవరు తీసి ఇచ్చాడు.

కవరు తెరిచి లోపల కాగితాన్ని బయటికి తీసి చదువుకుంది. హైదరాబాద్‌లో ప్రభుత్వ యాజమాన్యంలో నడుస్తున్న పెద్ద పారిశ్రామిక సంస్థ నుంచి వచ్చిన లెటర్ అది. మేనేజ్ మెంట్ ట్రెయినీస్ ఖాళీలకి నలుగురిని సెలక్ట్ చేసినట్లుగా ఉంది. నలుగురి పేర్లు వరుసగా ఇవ్వబడ్డాయి. అందులో రాజారావు పేరు కూడా ఉంది. రాజారావు పేరు దగ్గర టిక్ పెట్టి ఉంది. లెటర్ చివరలో కాపీటు శ్రీ రాజారావు అని ఉంది.

లెటర్ వంక మెరుస్తున్న కళ్ళతో చూస్తున్న వసుధతో అన్నాడు రాజారావు. "ఏమిటి ఆలోచిస్తున్నావు? సమయం మించిపోయిందనా?"

రాజారావు కేసి చిలిపిగా చూస్తూ మాటకు మాట అప్ప చెప్పింది.

"మీరు మించి పోయిందనుకుంటే మించిపోయింది.. లేదనుకుంటే లేదు."

✡✡✡

కాలింగ్ బెల్ రెండోసారి మోగింది.

తలుపు తెరిచిన శంకరం గుమ్మం ముందు నిలబడివున్న శ్రీనివాస్‌ని చూసి తడబడుతూ "రండి రండి. ఇదేనా రావటం?" అన్నాడు.

"ఒంటరిగా రాలేదు బావగారూ?" అన్నాడు శ్రీనివాస్ లోపలికి వస్తూ. అప్పుడు చూశాడు శంకరం - శ్రీనివాస్ వెనక గోడప్రక్కగా నిలబడున్న సత్యవతిని.

"శంకరం! లోపలికి వెళ్ళి నీ పని చూసుకో" హాలులో కొచ్చి ఆజ్ఞాపిస్తున్నట్టుగా అన్నాడు తండ్రి విశ్వనాధం.

తండ్రి మాటవిని తలవంచుకుని లోపలికి వెళ్ళిపోయాడు శంకరం. శ్రీనివాస్ దగ్గరికొచ్చి "కూర్చోవోయ్ ఇంటి దగ్గర్నుంచే నా రావటం?" అన్నాడు విశ్వనాధం తనో కుర్చీలో కూర్చుంటూ!

"నువ్వు లోపలికి వెళ్ళు చెల్లాయ్!" అన్నాడూ శ్రీనివాస్, సూట్ కేసు చెల్లెలు చేతికిస్తూ.

లిప్తపాటు కాలంలో మామగారికేసి భయం భయంగా చూసి, సూట్‌కేస్ అందుకుని అడుగులో అడుగు వేస్తూ లోపలికి వెళ్ళిపోయింది సత్యవతి.

కుశలప్రశ్నలు తర్వాత సూటిగా వ్యవహారంలోకి దిగాడు విశ్వనాధం. "నగల డబ్బు తెచ్చారా?"

"ఒక నెలరోజుల్లో మొత్తం డబ్బు మీకు ముట్టచెపుతాము" అన్నాడు శ్రీనివాస్ సాధ్యమైనంత వినయంగా.

"మళ్ళీ ఇదొక నాటకమా?" కోపంగా లేచి నిల్చున్నాడు విశ్వనాధం.

"కోపం తెచ్చుకోకండి. ఇందులో నాటకం ఏమీలేదు. నాకు ఉద్యోగం దొరికింది. నేనే మీకు డబ్బు తెచ్చి ఇస్తాను."

చిన్నప్పటి నుంచి ఎందులోనూ రాజీపడని, ఎవరిచేతా, ఆఖరికి కన్నతండ్రి చేతకూడా చిన్నమెత్తు మాటపడటం సహించలేని అన్నయ్య, మామగారిని బతిమాలుతుంటే బెడ్ రూంలో నిలబడి వింటున్న సత్యవతికి కన్నీళ్ళు ఆగలేదు.

"ఉద్యోగం దొరికిందా! జీతం ఎంతేమిటి?" వెటకారంగా అడిగాడు, విశ్వనాధం.

బలవంతాన కోపం అణుచుకున్నాడు శ్రీనివాస్. తప్పదు. "హైదరాబాద్‌లో హెవీ ఎలక్ట్రికల్స్‌లో మేనేజర్‌గా సెలక్ట్ చేశారు. ట్రైనింగ్ లో వెయ్యి, తర్వాత ఐదువేలతో సాలరీ ఫిక్స్ అవుతుంది. నిన్నే వచ్చింది లెటర్."

అంటూ జేబులోంచి తీసి చూపించాడు.

ముక్కుమీదకి జారి వున్న కళ్ళజోడులోంచి శ్రీనివాస్ వైపొకసారి అనుమానంగా చూసి కళ్ళజోడు సర్దుకుని లెటర్ కేసి దృష్టి సారించాడు. నిజమే! సెలక్ట్ చేసిన నలుగురిలోను శ్రీనివాస్ పేరు ఉంది. పేరు దగ్గర టిక్ చేసి ఉంది. ఎందుకైనా మంచిదని ఆమూలాగ్రంగా చదవసాగాడు.

నుదుట పట్టిన చెమటలను కర్చీఫ్‌తో తుడుచుకుంటూ చెప్పాడు శ్రీనివాస్. "నేను ఉద్యోగంలో చేరగానే అప్పు ఇవ్వటానికి నాన్నగారి స్నేహితుడొకరు ఒప్పుకున్నారు. నెల నెలా తీర్చే పద్ధతి మీద."

"ఇదేమిటి?" అన్నాడు విశ్వనాధం. "ఇది చదువు" అన్నాడు వేలితో చూపిస్తూ.

"ప్లీజ్ నోట్ దిసీజ్ నాట్ ఎపాయింట్ మెంట్ ఆర్డర్" అని ఉంది.

"ఓ అదా!" తేలిగ్గా నవ్వేసి అన్నాడు. "లెటర్ చూడండి. ఒకే సర్క్యులర్‌ని సెలెక్ట్ అయిన నలుగురికి తెలియపరుస్తూ పంపారు. ఎపాయింట్ మెమెట్ ఆర్డరు పదిహేను రోజుల్లో ఇస్తారు. ఆ సంస్థలోనే పని చేస్తున్న నా ఫ్రెండ్ ఒకతనికి ఫోన్ చేస్తే చెప్పాడు."

"మొత్తానికి సాధించావోయ్, ఆలస్యమైనా" అన్నాడు విశ్వనాధం ప్రసన్నంగా. ఆయన బుర్ర ఇప్పుడు నగల డబ్బుగురించి ఆలోచించటం మానేసి, ఇప్పుడు కొత్త పధకాలు వేస్తోంది.

"ఇంతకీ నీ వయసెంతన్నావ్?"

"ఏమీ అనలేదండి. వెళ్ళొస్తాను."

✡✡✡

"ఇంత ఆలస్యం అయిందేరా ఇవాళ? డాక్టరు గారు ఊళ్ళో లేరా?" ఇంట్లోకి వచ్చిన పరశురాం నడిగింది తల్లి. ఆమె గొంతు నూతిలోంచి వస్తున్నట్టుగా ఉంది. "ఊళ్ళోనే ఉన్నాడు. ఇవాళ పేషెంట్లు ఎక్కువగా ఉన్నారు. అందుకని ఆలస్యం అయింది." అని జేబులోంచి మందు పొట్లాలు తీసి ఒకటి తల్లికిచ్చి మిగిలినవి తలగడ కిందపెట్టాడు. రోజు వెళ్ళే ఆయుర్వేదం డాక్టరింటికే కాకుండా, ఇంగ్లీషు డాక్టరు దగ్గరికెళ్ళిన సంగతి చెప్పదలచుకోలేదు.

"కాళ్ళు కడుక్కునిరా అన్నం తిందువుగాని" అంటూ మంచం మీదనుంచి లేవబోయింది.

"నేను పెట్టుకుతింటాన్లే నువ్వు లేవకు." అని కాళ్ళు కడుక్కుని వచ్చి వంటింట్లోకి పీటవాల్చుకుని కూర్చున్నాడు బయట ఎండలో తిరిగి రావటం చేత ఇంటిలోపల అంతా చీకటిగా కనిపిస్తోంది. ఎటుచూసినా చీకటి. కళ్ళు నులుముకున్నాడు. అలవాటు పడుతున్న కళ్ళు చీకటి పొరల్ని తొలగించుకుంటున్నాయి. కాని మస్తిష్కంలో పేరుకున్న చీకటి... వర్తమానాన్ని, భవిష్యత్తుని అంధకారమయం చేస్తోంది. అతనికి ఇంగ్లీషు డాక్టరు చెప్పి మాటలు గుర్తొచ్చాయి. "పనికిమాలిన వైద్యాలన్ని చేసి ఆమె జబ్బుని ముదగబెట్టారు మిష్టర్! వెంటనే హాస్పిటల్‌లో చేర్చులేకపోతే నీ తల్లి నీకు దక్కదు."

అతి కష్టం మీద ముద్దగొంతు దిగుతోంది.!

"నీకేదో ఉత్తరం వచ్చింది చూడు. గూట్లో పెట్టాను" అంది తల్లి హీనస్వరంతో.

"ఏముంది? మళ్ళీ ఏ రిగ్రెట్ లెటరో లేక ఏదో ఇంటర్వ్యూకి రమ్మనో అయివుంటుంది." అనుకున్నాడు. అన్నం తింటూనే ఎడం చెయ్యి జాపి గూట్లో ఉన్న కవరు అందుకుని తెరిచి చూసాడు.

అంతే! "అమ్మా!" అని గావుకేక పెట్టాడు. కంచం ముందు నుంచి లేచిపోతూ.

"ఏమిట్రా? ఏమిటి, ఏమైంది?" ఉలిక్కిపడి లేచి కూర్చుంది తల్లి - గుండెలు దడదడలాడుతుంటే? అప్పటికే చిన్నపిల్లవాడిలా తల్లి ఒళ్ళో చేరిపోయాడు. ఉద్వేగాన్ని అణుచుకుంటూ చెప్పాడు. "నాకు.. నాకు ఉద్యోగం వచ్చిందమ్మా!" అన్నాడు.

కళ్ళకింద ఉన్న నల్లని చారలమీదుగా జలజలా రాలాయి. కన్నీళ్ళు. కొడుకు తలనిమురుతూ కొంతసేపు ఉంచిపోయింది. తర్వాత నీరసంగా అంది.

కళ్ళకింద ఉన్న నల్లచారల మీదుగా జలజలా రాలాయి. కన్నీళ్ళు. కొడుకు తలనిమురుతూ కొంతసేపు ఉండిపోయింది. తర్వాత నీరసంగా అంది.

"పిచ్చివెధవా! ఎందుకంత కంగారు? ముందు వెళ్ళి అన్నం తిను."

✡✡✡

హుషారుగా ఈల వేస్తూ తన ముందునుంచే దూసుకుపోతున్న మురళిని రెక్కపుచ్చుకుని నిలవేశాడు నరహరి.

"కళ్ళు నెత్తికెక్కాయేంరా నీకు? నాలుగు రోజులనుంచి పత్తాలేవు. పైగా ఎదురుగా వస్తూ కూడా.."

"సారీ చెపుతునానుగా వదిలెయ్ రా? ఇంటి దగ్గర్నుంచేనా?"

"ఎంప్లాయిమెంట్ ఎక్స్‌చేంజికి రెన్యువల్స్‌కి ఓ గుడ్‌బై చెప్పేశాం" అన్నాడు మురళి గర్వంగా.

"అదేమిటిరోయ్ అప్పుడే సిల్వర్ జూబిలీ అయిపోయిందా నీకు?" సిల్వర్ జూబిలీ అంటే ఉద్యోగాలకి అప్లయి చేసే వయసు దాటిపోయిందని అర్థం. నిరుద్యోగుల్లో ఏజ్ బారైనా వాళ్ళు జీవచ్ఛవాలకిందే లెక్క.

"నోర్ముయ్యరా శకునపక్షి! ఇంకా అర్థమై చావలేదా?" విసుగ్గా అన్నాడు మురళి. "నాకు జాబ్ దొరికింది భాయ్! హైదరాబాద్‌లో పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్‌లో. నిన్ననే వచ్చింది లెటరు." అంటూ జేబులోంచి లెటరు తీసి ఉత్సాహంగా చూపించాడు.

లెటర్ చదివి "కంగ్రాట్స్ గురూ!" అన్నాడు నరహరి. కంఠంలో మార్పు వచ్చింది.

మురళి ఇదేం గమనించకుండా చెప్పుకుపోతున్నాడు.

"నిక్ ఆఫ్ ది మూమెంట్‌లో వచ్చిందిరా, హరీ! ఈ నెల చివర్లో మనకి ఏజ్ బారైపోతుంది. తర్వాత ఇంకేముంది? గోవిందార్పణం!" అన్నాడు ఆకాశానికి వేసి చేతులు జోడించి.

"ఎప్పుడు జాయిన్ అవ్వాలి?" అడిగాడు నరహరి. లోపల ఏదో అసంతృప్తి. దానికి మరోపేరు అసూయ.

"పదిహేను రోజుల్లో జాయినవ్వాలని తెలిసింది. డబ్బు చూసుకుని వారంలో హైదరాబాద్‌కి బెర్తు రిజర్వ్ చేయించి పెట్టుగురూ!" అన్నాడు దర్పంగా.

"ఈ మాత్రం దానికి రాత్రి ప్రయాణం ఎందుకు?" కొత్తగా ఇంటర్ సిటి వేశారు సికింద్రాబాద్‌కి. దాన్లో వెళ్ళు" లోపల ఏడుస్తూనే సలహా ఇచ్చాడు నరహరి. నరహరి తండ్రి రైల్వేలో పనిచేస్తున్నాడు.

"గుడ్ ఐడియా!" ఉత్సాహంగా అన్నాడు మురళి.

"కొత్త ట్రైను కదా! సూపర్ ఫాస్ట్ కూడా ఇంతవరకూ ఎక్కలేదు. ఈసారి తప్పకుండా ఇంటర్ సిటీలోనే వెళతాను."

✡✡✡

రాజధాని నగరంలో, పదవి అనే బాతు పెట్టిన బంగారు గుడ్డులా మెరిసిపోతున్న బంగళాలోని ఎయిర్ కండిషన్ ఆఫీసు గదిలో, తెల్లని పాలనురగ లాంటి ఖద్దరు లాల్చీ తొడుక్కుని, నాళగువేళ్ళకి వజ్రాలు రత్నాల ఉంగరాలతో, గర్వారే కంపెనీ చేపల వలలోని నైలాన్ దారాల్లా నరాలు పైకి తేలివున్న హస్తం ఒకటి ఫోన్ రిసీవర్‌ని విలాసంగా పైకెత్తింది. వేళ్ళు నంబర్ ని డయల్ చేశాయి.

"హలో! ఎవరు మాట్లాడేది!"

"....."

"సెక్రటరీయా!" (స్వగతం) వీడెవడో కొత్తవెధవలా ఉన్నాడు! "నేను పరిశ్రమల, ఉపాధికల్పన శాఖ మంత్రిని మాట్లాడుతున్నాను. మీ ఎం.డి. గార్ని పిలవ్వోయ్, భగవాన్లూ"

"....."

"ఆ నేనే... ఏమిటి విశేషాలు?"

"....."

మొన్ననే లండన్ నుంచి తిరిగొచ్చాను. మీకు తెలుసుకదా! ఆ మధ్య తరచు తలనొప్పి వస్తుండేది. ఇక లాభం లేదని వెళ్ళి ట్రీట్ మెంట్ తీసుకుని వచ్చాను. ఇప్పుడు బాగానే ఉంది.

"....."

"వాట్? పానెల్ రెడీయా! వాటీజ్ దిస్? నేను లండన్ నుండి తిరిగొచ్చేదాకా ముట్టుకోవద్దని చెప్పానుకదా! ఇంతలో ఏమైంది?"

"....."

"అయితే పానెల్లో ఇరికించండి. నేమ్స్ పంపిస్తున్నాను"

"....."

"డోంటాక్ రబ్బిష్! ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా? పోస్ట్‌లు లేకపోతే పానెల్ కాన్సిల్ చెయ్యండి. మళ్ళీ ఫ్రెష్‌గా పానెల్ నేను పంపిన పేర్లతో తయారు చెయ్యండి పానెల్. లేకపోతే మీ పేరు రోల్స్‌లో ఉండదు. తెలిసిందా?"

✡✡✡

వరుడి చెయ్యి పట్టుకుని అగ్నిహోత్రం చుట్టు తిరుగుతున్న వసుధని చూస్తూ నిస్తేజంగా నవ్వుకున్నాడు. దూరంగా నిలబడి చూస్తున్న రాజారావు. రాత్రంతా ఏడ్చి, ఉదయం ఎర్రని కళ్ళతో పీటలమీద కూర్చున్న వసుధని చూసి హోమంలోంచి వస్తున్న పొగని చెదరగొట్టి, వసుధ చేతికి కర్చీఫ్ ఇచ్చి ప్రేమగా చూసాడు పెళ్ళికొడుకు.

✡✡✡

రిక్షాదిగి ఇంట్లోకి వచ్చి, తండ్రిని అన్నని చూసి బావురుమని ఏడ్చింది సత్యవతి. చెల్లెలికి ముఖం చూపించలేక చెప్పులు వేసుకుని ఎవరు తరుముకొస్తున్నట్లు, వడివడిగా అడుగులు వేసుకుంటూ బైటకి వెళ్ళిపోయాడు శ్రీనివాస్.

✡✡✡

హాస్పిటల్లో చేర్పించే స్తోమతలేక..... నరకయాతన అనుభవిస్తూ, క్షణక్షణానికి మృత్యువుకు చేరుతున్న తల్లిని చూడలేక పిచ్చిగా రోడ్లమీద తిరుగుతున్నాడు పరుశురాం.

✡✡✡

ప్లాట్‌ఫారం వదిలి పరుగునందుకున్న ఇంటర్ సిటి ఎక్స్‌ప్రెస్ పదినిముషాలైనా కాకముందే ఆగిపోయి భయంకరంగా కూత వేసింది. దూరంగా ఉన్న జనం ట్రైన్ దగ్గరకి పరిగెత్తి వస్తున్నారు. అప్పటికే ప్రయాణీకుల్లో చాలామంది కిందకు దిగి ఇంజన్ వైపు వచ్చారు. ఎవరో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారని తెలిసింది. అందరి ముఖాల్లో భయం గగుర్పాటు.

పోలీసులు వచ్చి ట్రైయిన్ చక్రాల కింద తుత్తునియలైన మురళి శరీరభాగాల్ని ఒకచోట చేర్చి గుడ్డకప్పారు.

✡✡✡

మసిగుడ్డ – కుప్పిలి పద్మ

(జనవరి 1994 ఆదివారం ఆంధ్రజ్యోతి)

పది నిమిషాల్నుండి బీరువా అంతా గాలించినా ఓ పాత గుడ్డముక్క దొరకలేదు.

మసిగుడ్డ లేక వంటింట్లో పని చెయ్యాలంటే నానా అవస్థగా ఉంది. పాత మసిగుడ చినిగి పీలికలై పనికిరాకుండా పోయి నాలుగైదు రోజులవుతోంది. మరోటి వెతికి పెడదాం అనుకోవటమే కాని అశ్రద్ధతో కుదరక పాతదానితోనే ఉదయం అన్నం వారుస్తుంటే అది సరిపోక చెయ్యి చురుక్కుమంటే కాని కొత్త మసిగుడ్డ కోసం అన్వేషణ మొదలు కాలేదు.

చివరికి పాతబట్టల మూట విప్పాను. గట్టివి కొన్ని రంగులు వెలిసిపోయినవి, పొట్టి అయినవి, బిగుతైపోయినవి, స్టీలు సామానువాడికి వేద్దామని ఉంచినవి.

వెతగ్గా వెతగ్గా మసిగుడ్డకి పనికొచ్చే బట్ట కనిపించింది. రంగు తగ్గలేదు. కాని మెడ దగ్గర కాస్త పిలికిపోయిన జాకెట్టు కనిపించింది.

అమ్మ జాకెట్టు.

పోయినసారి అమ్మ వచ్చినప్పుడు మర్చిపోయిన జాకెట్టు.

జాకెట్టు తీసుకుని వంటింట్లోకి వెళ్ళి సౌకర్యవంతంగా పనులు చేసుకోవటం మొదలుపెట్టాను.

ఆ జాకెట్టు చూస్తుంటే అమ్మ గుర్తొస్తూంది. ఏ చీరమీద జాకెట్టో!

కాలింగ్ బెల్ సవ్వడి.

తలుపు తీశాను.

జానకి!

ఇదే కాలనీలో ఉంటారు. మచిలీపట్నం వాళ్ళు. ఆమె శ్రీవారు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి. ఇద్దరు పాపలు, ఒక బాబు.

ఇంటిపని, వంటపనితోనే జానకి ఎప్పుడు సతమతమౌతుంటుంది తప్ప ఎప్పుడో కాని ఇలా ఎవరింటికి రాదు - ఏదైనా పనుంటే తప్ప.

కుశల ప్రశ్నలు అయ్యాక "నాక్కాస్త రోజూ ఇంగ్లీష్ నేర్పిస్తారా?" అడిగింది జానకి.

వైర్ బ్యాగ్ అల్లటం నేర్పిస్తారా? స్వెట్టర్ ఎలా అల్లాలి? మ్యాంగో జ్యూస్ ఎలా చెయ్యాలి? అనేవాళ్ళనే ఇంతవరకు మా కాలనీలో చూడటం వలన జానకి కోరిక కొత్తగా తోచింది.

"నేర్పిస్తాను. కాని మీకు తీరికేది" అన్నాను.

"ఓ పూట వండటమైనా మానెయ్యాలి. కాని ఇంగ్లీషు నేర్చుకొనటం మానకూడదు" అంది జానకి.

"ఏం?" కుతూహలంగా అడిగాను.

"మా పిల్లలు నన్నసలు లక్ష్యపెట్టటం లేదండి. ఏం అడిగినా పట్టించుకోరు. తండ్రి ధ్యాసే. వాళ్ళు అడిగినవి చెప్పే ఓపిక, తీరిక ఆయనకి లేవు. నాకా వాళ్ళ సందేహాలు తీర్చేంత చదువులేదు. అందుకే బి.ఏ కడదాం అనుకుంటున్నా. కనీసం చిన్న పాప, బాబు చదువు విషయమైనా శ్రద్ధ తీసుకోవాలండి. ఏంటో నిన్నటివరకు మన కొంగు పట్టుకు తిరిగిన పిల్లలు ఈ రోజు మనకేం తెలియదని నిర్లక్ష్యం చేస్తుంటే బాధగా ఉందండి" అంది జానకి.

వారం రోజుల క్రితం మా పాప సమ్మర్ కంప్యూటర్ క్లాసుకి వెళ్ళొచ్చింది. "ఏం చెప్పారే?" అంటే 'నీకు కంప్యూటర్ రాదుగా' అంటూ తండ్రి కోసం ఆత్రంగా ఎదురు చూసింది. తండ్రింటికి రాగానే చిలకలా ఏంటేంటో చెప్పింది.

జానకి ఇంగ్లీషు నేర్చుకుంటానన్నట్టు నేనిప్పుడు కంప్యూటర్ గురించి తెలుసుకోవాలా? నేర్చుకోవాలా?

"అలాగే రండి. నేర్పుతాను" అన్నాను.

జానకి వెళ్ళిపోయాక వంటింట్లోకి వెళ్ళి పనులు చేస్తున్నా జానకి మాటలే గుర్తొస్తున్నాయి.

అమ్మ!

ప్రాణానికి ప్రాణమిచ్చి జన్మనిచ్చే అమ్మని లక్ష్యపెట్టటానికి అమ్మకీ అర్హతలు కావాలా? కావాలని కాదు కాని అమ్మని ఎదిగే పిల్లలు నిర్లక్ష్యం చేయటం సర్వసాధారణం కదా!

నాకు బాగా గుర్తు...

ఇప్పుడు అమ్మలు అవుతున్నవాళ్ళకి డిగ్రీలుండి, కొద్దో గొప్పో ఆర్థిక స్వాతంత్ర్యం ఉంది కాని మా అమ్మల కాలంలో డిగ్రీలు ఉన్నవాళ్ళు చాలా తక్కువ.

ఇప్పటి తల్లుల్లా అప్పట్లో అమ్మలకి పిల్లల్ని దగ్గర కూర్చోపెట్టుకుని హోమ్ వర్క్ చేయించటం తెలిసేది కాదు.

ఓపిక ఉన్న తండ్రులో, ప్రైవేటు మాస్టర్లో, ఇంట్లో చదువొచ్చిన చిన్నాన్నలో, మామయ్యలో హోమ్‌వర్క్ చేయించేవారు, సందేహాలు తీర్చేవారు.

ఓసారి స్కూల్ ఫస్ట్ వస్తే ఓ కప్ బహుమతిగా ఇచ్చారు.

ఫంక్షన్ నుండి ఇంటికి వచ్చేసరికి వాకిట్లో అమ్మ ఎదురై "ఏమిచ్చారని" కుతూహలంగా అడుగుతుంటే ఆమె మాట వినిపించుకోకుండా ఎక్కడో లోపల పడుకుని పేపర్ చదువుకుంటున్న నాన్నగారి దగ్గరికి పరిగెత్తుకెళ్ళి కప్ చూపించాను.

అలా చెయ్యటం అమ్మని నిర్లక్ష్యం చేయటమని కాని, అమ్మ బాధపడుతుందని కాని అప్పట్లో నాకు తెలియదు.

పక్కలు తడిసినా, అర్ధరాత్రి ఏడిస్తే మంచి నిద్రలో ఉన్నాసరే లేచి ఎత్తుకు తిప్పి నిద్రపుచ్చటం, ఊరంతా తిప్పి తిప్పి గోరుముద్దలు తినిపించటం, కారే ముక్కుని తుడవటం, ఒళ్ళు వెచ్చబడితే రేయింబగళ్ళు సేవ చేయటం అమ్మ పనులు.

సేవలు చేసి చేసి తమ శరీరాల రూపురేఖలే పోగొట్టుకునే అమ్మలు ఒక్కరా ఇద్దరా? అసలు లెక్కించగలనా?

పెద్దపాప పసితనంలోనే హాయినిచ్చే తలస్నానాన్ని మర్చిపోయాను. పిల్లని నిద్రపుచ్చి 'హమ్మయ్యా' అనుకుంటూ స్నానానికి ఇలావెళ్ళేదాన్నో లేదో, ఎవరో కొట్టి లేపినట్టు గుక్కపెట్టి ఏడుపు. ఇంకేం స్నానం? రెండు చెంబులు అటూ ఇటూ గుమ్మరించుకుని ఊరడించేసరికి జడ అల్లుకోవాలనే ధ్యాసే ఉండేది కాదు.

పక్కింటి టీచరమ్మ పిల్లలు పుట్టకముందు గంజిపెట్టిన నేత చీరలు, వెంకటగిరి చీరల్ని కుచ్చిళ్ళు వొద్దిగ్గా పెట్టి ఎంచక్కా బుట్టబొమ్మలా ముస్తాబయ్యేది.

ఇప్పుడో పిల్ల పనులు, వంటపని, మొగుడికి వడ్డించి తను తినీ తినకా, అతగాడికి టిఫిన్ బాక్స్ సర్ది, పిల్లకి తినిపించి, ఆ పిల్లకి కావాల్సినవై బుట్టలో సర్ది చీరకి జాకెట్టు సరిపోయిందో లేదోననే ఆలోచనే లేకుండా జారిపోయే నైలెక్స్ చీరని పిన్నులతో బంధిచేస్తూ ఆ పిల్లని క్రచ్ లో దింపి హడావుడిగా అటెండెన్స్ రిజిష్టర్ లో సంతకం చేయటంతోనే రోజూ తెల్లారిపోతుంది.

"ఎక్కడికైనా వెళ్ళినప్పుడో, పేరంటానికి వెళ్ళినప్పుడో కట్టుకుందామన్నా ఎక్కడ కుదురుతుంది? ఈ పిల్లలని ఎత్తుకోవాలిగా? నిమిషంలో నలిగిపోతాయి. నాకా నైలెక్స్ చీరలంటే చికాకు. అయినా అవే కట్టుకోవాలి" అంటూ ఎన్నోసార్లు వాపోయింది.

నాన్నలెందుకు ఎత్తుకోరో?

ఆ మధ్య 'స్త్రీల హక్కుల'పై సభ జరుగుతుంటే వెళ్ళాను. స్త్రీల హక్కుల గురించి ఎంతో ఆర్తిగా వ్యాసాలు రాసే ఆయన భార్య, ఉపన్యాసాలిచ్చే ఆయన భార్య, గుమస్తాగారి భార్య ఒకరనేంటి పిల్లల్ని తల్లులే మోస్తున్నారు.

కన్నతల్లి మాత్రమే అన్నిపనులు చెయ్యాలని మగవాడు అనుకుంటాడు.

పిల్లలూ అనుకుంటారు.

ఎందుకు చెయ్యాలని పాప మా అమాయకపు తల్లి మాత్రం అనుకోదు.

నే కావాలని నిన్ను నిర్లక్ష్యం చేయలేదని అమ్మకి ఇప్పుడు చెపితే?

ఏముంటుంది?

నవ్వుతుంది లాలనగా.

కాలింగ్ బెల్ మోగింది.

తలుపు తీశాను.

ఎదురింటి అరుణ.

"మూడవుతోంది. మీరింకా రాలేదేంటాని నేనే వచ్చాను" అంది. అప్పుడే మూడయిందా! రోజూ మేమిద్దరం స్కూల్ కి పోయి నా చిన్నకూతుర్ని, తన కొడుకుని తీసుకొస్తాం. ఈ రోజు ఆలోచనలతో అసలా సంగతే మర్చిపోయాను.

"వస్తున్నానొస్తున్నా" అంటూ చెప్పులేసుకుని తాళం పెట్టి ఉన్నపళంగా బయలుదేరాను.

ఇప్పుడైతే చీర బాగుందా - జుట్టు రేగిందా - ముఖానికి పౌడరుందా అనే పట్టింపు లేదు. కాని చదువుకునే రోజుల్లో ఇలా ఎప్పుడైనా బయటికి వెళ్ళేదాన్నా? ఒకటికి పదిసార్లైనా అద్దంలో ముఖం చూసుకుని కాని వెళ్ళేదాన్ని కాదు.

తన శరీరం గురించి పట్టించుకోకుండా నలిగిన చీరతో, రేగిన జుట్టుతో తిరిగే అమ్మని చూస్తుంటే బోల్డంత చికాకేసేది.

ఇప్పుడు నా అవతారాన్ని చూసి మా పెద్దమ్మాయి ఎన్నిసార్లు విసుక్కోలేదూ!

త్వరత్వరగా నడుస్తున్న నేను అరుణ వెనకబడటంతో ఆగి వెనక్కి తిరిగి "ఏంటంత మెల్లగా నడుస్తున్నారు?" అడిగాను.

"కాలు బెణికింది" అందామె.

"ఎప్పుడు? ఎలా? ఏమైనా రాశారా?" అడిగాను.

"సైకిల్ మీదనుంచి పడ్డాను, ఇదంతా చెక్కుకుపోయింది" అంటూ మోచేయి చూపించింది.

"సైకిలా?" అయోమయంగా అడిగాను.

"ఆఁ వచ్చే ఏడాది పిల్లల్ని సెంటాన్స్ లో చేర్పిద్దాం అనుకుంటున్నాం. చాలా దూరంగా. రెండుపూటలా రిక్షా అంటే చాలా ఖర్చు. అదీకాక పెద్దది సంగీతంలో చేరింది. రోజూ క్లాసుకి వెళ్ళిరావాలంటే కష్టంగా ఉంది. ఏదైనా చిన్నబండి కొనుక్కుంటే పిల్లల్ని స్కూల్లో దింపొచ్చు. పాపని సంగీతం క్లాసుకి తీసుకువెళ్ళొచ్చు. నాకా సైకిలే రాదు. సైకిలొస్తే బండిని తేలిగ్గా బ్యాలెన్స్ చేయొచ్చంట. అందుకే తెల్లారే గ్రౌండుకి వెళ్ళి సైకిల్ నేర్చుకుంటున్నాను. ఈ వేళ ఉదయం కిందపడ్డాను" అని అరుణ చెపుతుండగా స్కూలొచ్చింది. పిల్లల్ని తీసుకుని ఇంటికొచ్చాం.

సాయంత్రం ఇంటికొచ్చినప్పట్నుంచి పెద్దాడి ముఖంలో కళే లేదు. 'ఏమ్మా అలా ఉన్నావ్' అంటే 'బానే ఉన్నానని' పేలవంగా అంటాడు తప్ప విషయం చెప్పడు.

పెద్దమ్మాయి మాత్రం కాలింగ్ బెల్ మోగిన ప్రతిసారి ఒక్క గెంతు గెంతి మరీ తలుపు తీసి వచ్చినవాళ్ళని చూసి ఆరిపోయిన నవ్వు ముఖంతో వెనక్కొస్తుంది. వీధిలోకి ఇంట్లోకి కాలు కాలిన పిల్లిలా తిరుగుతోంది. "ఏంటమ్మా! హుషారుగున్నావ్" అంటే "ఏం లేనే" అంటుంది తప్పా తనూ ఏ సంగతీ చెప్పలేదు.

ఏడవుతుంటే కాలింగ్ బెల్ మోగగానే తలుపు తీసిన పెద్దమ్మాయి గుమ్మంలో తండ్రిని చూసీ చూడగానే ముఖమింత చేసుకుని తండ్రి ఇంట్లో కాలు పెట్టకముందే "ప్రోగ్రెస్ కార్డిచ్చారు" అంది ఆనందంగా.

తండ్రి జవాబు చెప్పకముందే "క్లాస్ ఫస్టొస్తే ఎక్స్‌కర్షన్ కి పంపిస్తానన్నారుగా?" అడుగుతోంది.

"ఓ తప్పకుండా. నీకో మంచి ఫ్రాక్ కూడా కొనిస్తాను" అంటుండగానే ఆయన చేతుల్లో కార్డు పెట్టేసింది.

ఎన్ని మార్కులొచ్చాయో కూడా సరిగ్గా చూడకుండా సంతకం చేసేసాడా తండ్రి. పరీక్షలు పిల్లలకా? పరీక్షలంటే తల్లులకేగా. నిద్రకి జోగే పిల్లలు జారిపోయి నేలమీదే నిద్రపోకుండా వాళ్ళ వీపుకి వీపు ఆన్చి కూర్చుని వాలిపోతున్న కనురెప్పలని టీ నీళ్ళతో ఎత్తి నిలబెట్టి మరీ పరిక్షలు రాయించేది తల్లులేగా. ప్రోగ్రెస్ కార్డుపై సంతకాలు మాత్రం తండ్రివి. ఆ ఆనందం, ఆ వైభవం, ఆ సంబరం తండ్రిదేనా?

"నీదేదిరా?" అడిగాను పెద్దాడిని.

ఇవ్వలేదన్నాడు. "ఇవ్వలేదా?" అని తండ్రి అనుమానంగా రెట్టించి అడగ్గానే మరింత బిగుసుకుపోయాడు. బుజ్జగించి, బ్రతిమాలగా మెల్లగా "ఇచ్చారంటూ" పుస్తకాల సంచి నుంచి కార్డు తీసిచ్చాడు. ఇంతకుముందు తొంభై, తొంభై ఐదులు వచ్చిన మార్కులు ఈసారి డైబ్బై, డెబ్బై ఐదున్నాయి.

అదీ సంగతి! మా వాడి కళాహీనమైన కన్నుల వెనకున్న కారణం.

"ఇంతున్నాడో లేదో అప్పుడే అబద్దాలు. కాస్త జాగ్రత్తగా చూడు. అసలు నువ్వేం చేస్తున్నావ్? పిల్లల్ని సరిగ్గా చూడొద్దా. ఈ అబద్దాలు అలవాటైతే ఎంత కష్టం. నీ పెంపకం అఘోరించినట్టే ఉంది" ఇంతెత్తున నాపై విరుచుకుపడ్డారాయన.

పెంపెకం!

నా పెద్దక్క అందం, నమ్రత చూసి కాస్త తక్కువ కట్నానికి పెళ్ళికొడుకు దొరగ్గానే 'నా కూతురే' అంటూ గుండెలు చరుచుకున్న నాన్న, చెల్లాయి ప్రేమించిన కుర్రాడిని పెళ్ళిచేసుకుంటానని కరాఖండిగా చెప్పినప్పుడు 'ఆడపిల్లల్ని ఇలాగేనా పెంచటం? ఎల్లవేళలా కనిపెట్టుకుని ఉండొద్దూ. నీ పెంపకం' అంటూ అమ్మపై చేయి చేసుకున్నంత పనిచేశాడు.

"ఏంటలా కూర్చున్నచోటే కూర్చుండిపోయావ్. ఈ పూట తిండేం లేదా?" ఆయన అరుస్తుంటే వంటింట్లోకి వెళ్ళాను.

వెచ్చపెట్టిన చారుగిన్నె పొయ్యి మీదనుంచి కిందకి దించుతుంటే నా చూపు మసిగుడ్డపై నిలిచిపోయింది.

అన్నం వార్చాలన్నా, పొయ్యి మీద గిన్నె దింపాలన్నా, కూరకలుపుతూ, గిన్నె కదలకుండా పట్టుకోడానికి, చేతులు తుడుచుకోడానికి - ఇలా ఎన్నో ఎన్నెన్నో వాటికి మసిగుడ్డ కావాలి.

కాని ఎవరైనా, ఎప్పుడైనా దాన్నో విలువైన వస్తువుగా పరిగణిస్తారా?

వారం రోజులుగా వంటింట్లో పనులు చేసి తన రంగుని, రూపాన్ని పూర్తిగా కోల్పోయిన ఈ మా అమ్మ జాకెట్టు అమ్మని గుర్తుచేస్తోంది.

అహర్నిశలు పిల్లల అవసరాలకి శ్రమించి, ఒంట్లో సత్తువని పిల్లలకి ధారపోసే అమ్మకి ఈ మసిగుడ్డకి తేడా ఉందా?

ఆనాడు నేను మా అమ్మని నిర్లక్ష్యం చేసినట్టు ఈ రోజు నా పిల్లలు నన్ను లక్ష్యపెట్టటం లేదు. ఇదే జానకికి జరిగింది. రేపు జానకి పిల్లలకి, నా పిల్లలకి ఇదే పరిస్థితి ఎదురవౌతుంది.

కాలం మారి ఎన్నో ఆధునిక గృహపరికరాలు ఇంటిని అలంకరించినా వంటింటిలోంచి మాయంకాని మసిగుడ్డలానే ఎంత నాగరీక ప్రపంచం మనచుట్టూ ఆవరిస్తున్నా అమ్మ కష్టాలు ఎప్పుడూ అమ్మవే!

☆☆☆

కుప్పిలి పద్మ

? – భువనచంద్ర

(ప్రముఖ సినీ గేయరచయిత భువనచంద్ర గారు సినీరంగంలోకి రాకముందు వ్రాసిన కథ ఇది. రచనా తేదీ: 1/1/1981 , ఇంతవరకూ అముద్రితం)

"ఈ రోజు ఆమెని మళ్ళీ చూశాను!"

"ఎవరామె?"

"పెద్ద పెద్ద కళ్ళతో చూస్తూ.. చూపులతోనే మాట్లడుతుందని చెప్పానే.. ఆమె!"

"మాట్లాడిందా?"

"ఆ!"

"ఏమని?"

"కళ్ళని ఒకసారి బాగా తెరిచి, రెప్పల్ని రెపరెపలాడించి చూసింది. మెల్లగా పైపైకి వచ్చే సూర్యకిరణాల్లాగా ఆ చూపులు నన్ను గుచ్చుకుని కొంత ఆనందాన్నీ ఆశ్చర్యానీ కలుగజేశాయి. పువ్వు సన్నగా విచ్చుకున్నట్టుగా ఆమె పెదాలు అతి నిశ్శబ్దంగా విచ్చుకుని ఓ బుల్లి చిరునవ్వు వెనెలలో నన్ను ముంచివేశాయి!"

"మాట్లాడావా?"

"ఎలా? ఆమెతో ఎవరో ఉన్నారు!"

"ఎవరు?"

"ఏమో! తండ్రి అయి ఉండొచ్చు.. మరో బంధువెవరైనా అయి ఉండొచ్చు!"

"పోనీ ఆమె అయినా నీతో మాట్లాడాలని ప్రయత్నించలేదా?"

"చెప్పాగా.. ఆమె చూపులతోనే మాట్లాడుతుందని!"

"నువ్వో వెర్రివాడివి."

"కానిదెవరూ?"

"అంటే?"

"ఎప్పుడో ఒకప్పుడు ఎవరిముందో ఒకరి ముందు. పిచ్చివాళ్ళు కానిదెవ్వరూ?"

"నీ కవిత్వం, నీ ఊహలూ, నీ పిచ్చిమాటలూ అంతా పిచ్చే!"

"కొంత మాత్రమే 'పిచ్చి' ఉంటే బాధపడాలి గానీ – పూర్తి పిచ్చివాడికి బాధెందుకూ? అయినా 'పిచ్చి' తనంలో ఉన్న ఆనందం పిచ్చోళ్ళకి తెలుస్తుంది గానీ మంచోళ్ళకి కాదుగదా!"

మూడునెలల తరువాత..

"ఏంటోయ్ ఆలోచిస్తున్నావ్?"

"ఆమె వస్తానని రాలేదు!"

"ఎవరూ?"

"అదే కళ్ళతో మాట్లాడుతుందని చెప్పానూ.."

"అర్థమైందిలే.. అయితే పరిచయం పెరిగిందన్నమాట!"

"వస్తానని రాలేదు!"

"ఎక్కడికి!"

"నిన్నవస్తానంది. శివుడి గుళ్ళో నంది విగ్రహం దగ్గరికి, కానీ రాలేదు."

"నువ్వెళ్ళకపోయావా?"

"తనెక్కడుంటుందో నాకు తెలిస్తేగా?"

"అడ్రస్ అడగలేదా?"

"అసలు మాట్లాడుకున్నదెప్పుడు?"

"మరి?"

"సినిమాల్లో కనిపించి, అక్కడికి వస్తానని కౌంటర్ ఫాయిల్ మీద రాసి నా వైపు విసిరింది!"

"ఇంకా?"

"ఇంకా మధురంగా, ఎడారిలోని నున్నని ఇసుక మీద చల్లని వెన్నెల పాములా పాకినంత సున్నితంగా నవ్వింది"

"ఎప్పుడూ నవ్వులేనా?"

"నీకేం తెలుసూ ఆ నవ్వుల్లోని బాసలూ ఆశలూ!.. నువ్వెలా ఊహించగలవూ ఆ నవ్వుల్లోని ఆత్మీయులూ, అనురాగం!

"తెలవకపోవటమే మంచిది..! లేకపోతే నీలాగా నేనూ వెర్రివాడ్నయి ఉండేవాడిని!"

"... వెర్రివాడికీ పిచ్చివాడికీ పెద్ద తేడా ఏమీలేదు..! అయినా అందరికీ వెర్రివాడో పిచ్చివాడో అయే అదృష్టం తేలిగ్గా దొరుకుతుందా? "

"Godbless mad idiot..!"

❀❀❀

ఇంకో నెల తరువాత

"ఏమిటీ అలాగడ్డం పెంచావు?"

"..... ..... "

"నిన్నే.. ఏమిటీ సంగతి?"

"ఏమీలేదు!"

"మరి ఎందుకా నిరాసక్తత?

"మామూలుగానే!"

"ప్రేయసికి పెళ్ళైపోయిందా?"

"..... ..... "

"అదేనోయ్.. నీ చిరునవ్వుతో చిన్నమ్మాయ్ కనిపించట్లేదా?"

"ఎందుక్కనిపించదూ?"

"మరి?"

"..... ..... "

"ఇదిగో చూడు.. ప్రపంచం 'నిశ్శబ్దమయం' అని నాకు చెప్పకు.. జరిగిందేదో చెప్పు!"

"నాకేమన్నా అర్ధమైతేగా?"

"అంటే?"

"మొన్నా మధ్య చూశాను.. తనలో చాలా మార్పు వచ్చింది!"

"ఎందుకో చెప్పిందా?"

"మాట్లాడుకుంటే కదా చెప్పడానికి!"

"పోనీ చూపులతోనే అనుకో!"

"ఆ కళ్ళల్లో మొన్నటి వరకూ కనిపించే కలల వెన్నెలా, ఆశల అల్లరీ కనిపించలా..."

"మరి?"

"ఓ క్షణం నా వంక చూసింది! అమావాస్యరాత్రిలో నడిసంద్రంలో చీకటి ముద్దలు ముద్దలుగా ఆకాశం నుంచి రాలిపడుతున్నట్లు అనిపించింది. పంజరంలోని పక్షి - తలుపులు తీశాక కూడా నిర్లిప్తంగా పంజరంలోనే ఉండిపోయినట్లనిపించింది. ఎండిపోయిన మరో వృక్షం భోరున కురిసే వర్షంతో, 'ఇక నీ అవసరం నాకు లేదు' అని ఉన్న పళంగా కూలిపోయినట్లు అనిపించింది!"

"ఆహా! అంతేనా?"

"ఉహూ! 'నేనింకా ఇట్లానే ఉంటాను.' అని అన్నట్లనిపించింది!"

"మాట్లాడటానికి నువు ప్రయత్నించలేదా?

"ఇవన్నీ మాటలుకావా?"

"నోరుందిగా.. కళ్ళతో ఎందుకూ మాట్లాడటం?"

"మాట్లాడేనోరు చూడలేదు.. చూసే కళ్ళు మాట్లాడగలవు.. అఫ్‌కోర్స్ అర్థం చేసుకోగలిగితే?"

"తను ఒక్కతే ఉందా?"

"ఏమో! తనని మాత్రమే నా కళ్ళు చూశాయి. ఆ క్షణం నుంచి ఇతరుల్ని చూడ్డం మానేశాయి!"

"అంత ఆరాధనా?"

"ఇది ఆరాధన ఎలా అవుతుందీ?"

"నాకు నవ్వొస్తోంది!"

"పోనీలే!. నన్ను చూసి నవ్వగలగడం కూడా నా 'పుణ్యం' వల్లనేగా!"

"నేననటం నవ్వే రాత నీ మొహాన లేదని!"

"రాత ఎక్కడుందో నాకు తెలీదు గానీ నవ్వేదీ, నవ్వించేదీ, ఏడ్చేదీ ఏడ్పించేదీ అన్నీ మనోనే!"

"ఇంతకీ తర్వాత ఏం చేయదలచుకున్నావు?"

"చేయటానికేముందీ?"

"అప్పుడెప్పుడో 'నంది' దగ్గరకి వస్తానందిగా? వచ్చిందా?"

"మూడో రోజున వచ్చింది.. తుమ్మెద వాలినంత సున్నితంగా నడుస్తూ వచ్చింది. రెక్కలు విచ్చుకుని అల్లరిగాలికి అటూ ఇటూ మళ్ళీ సీతాకోకచిలుకలాగా, ఆకుల సందుల నుంచి సూర్యుడ్ని అలరిగా చూసి మళ్ళీ గభాల్న సిగ్గుతో ఆకుచాటున దాగే మొగ్గలాగా, నువ్వు కదిలినప్పుడల్లా కదుల్తూ నిన్ను వెక్కిరించే నీడలాగా 'నిన్ను మింగేస్తానని' భయపెడుతూ ఇంతెత్తున లేచి, మళ్ళీ దయగా ప్రేమగా నీ పాదాల్ని ముద్దుపెట్టుకుని ఒద్దికగా వెనక్కి వెళ్ళిపోయే కడలి అలలాగా వచ్చింది!"

"ఉపమానాలెందుకూ?"

"లేకపోతే ఎలా వచ్చిందో ఎలా తెలుస్తుంది?"

"సరేనయ్యా..! వచ్చి ఏమన్నదీ?"

"ఓ నవ్వు నవ్వింది.. ఆ నవ్వులో, నీ ఆరాటమూ నీ ప్రేమా, నీ పిచ్చితనమూ నేను గమనిస్తూనే ఉన్నాను తెలుసా' అన్న చిలిపిదనం ఉంది!"

"నువ్వేమన్నావు?"

"మాటలురాలా! కొద్దిగా.. సన్నని విల్లులా వంగిన ఆమె పెదవి ఒంపుని చూస్తూ కూర్చున్నాను. ఆమె తన కనురెప్పలు కదిలిస్తుంటే, 'హృదయానికి తలుపులుంటాయా అనిపించింది!"

"ఏం చేశారు?"

"అక్కడి నుంచి ఓ కాఫీ స్టాల్ దగ్గర ఆగాము. ఆమె మెనూ కార్డుని చూసి 'కాఫీ' దగ్గర వేలు పెట్టింది. కాఫీ తాగాక 'ఇక వెళ్ళిరానా?' అన్నట్లు చూసి కుర్చీలోంచి లేచింది!"

"ఇంకాసేపు ఉండమనక పోయావా?"

"ఆమె అనునయంగా ఇచ్చిన 'ఆజ్ఞ' అది. కాదని ఎలా ఆపనూ?"

"ఆ తరువాత?"

"వెన్నెల మీద కదిలే వెన్నెల కిరణంలా అనుకుంటా?"

"ఏదైనా ఒకటే."

"కనీసం అప్పుడైనా ఆమెని వెంబడించాలనిపించలేదా?"

"ఎందుకూ వెంబడించటం?"

"నువ్వుత్తి మూర్ఖుడివి.?"

"మరో డిగ్రీ నా చేతికిచ్చావన్నమాట..!"

"హూ.. నీతో మాట్లాడటం శుద్ధ వేస్ట్!"

"ఇదీ అసలు సిసలు జ్ఞానమంటే!"

"నీ ఉద్దేశం?"

"పిచ్చివాడివికాకుండా పిచ్చివాడితోటీ, వెర్రివాడివి లేకుండా వెర్రివాడితోటీ, మూర్ఖుడివి కాకుండా మూర్ఖుడి తోటీ మాట్లాడటం వేస్టుగా!"

"ఛీ!" ఎవరో విసవిసా నడుస్తూ వెళ్ళడం చూస్తే విచిత్రంగా ఉండదూ?

❀❀❀

మరో రెండు నెలల తరువాత

"చాలా రోజుల తరవాత కనబడ్డావే..!ఎ ఏం చేస్తున్నావూ?"

"చెయ్యడానికే ముందీ?"

"తను కనిపించిందా?"

"ఆ! నిర్వికారంగా నా వంక చూసింది. ఆ చూపులో వెయ్యికోట్ల సూర్యుళ్ళు ఒకేసారి అస్తమించినంత నిర్లిప్తత ఉంది. కోటిమంది స్త్రీలు తమ భర్తల అనుమానపు చూపులకు గురైతే ఎంత ఆవేదన ఉంటుందో, అంత ఆవేదన ఉంది. హాయిగా ఎగిరిపోయే పక్షికి సడన్‌గా తుపాకి దెబ్బ తగిల్లే ఎంత బాధ కలుగుతుందో అంత బాధా ఆ చూపులో ఉంది. ఓ మనిషీ నేనూ మీలాంటి దాన్నే అని ఓ అబల దిక్కులు పిక్కటిల్లేలా రోదించిన రోదన ఆ చూపులో నాకు వినిపించింది!"

"ఓర్ని ఉపమానాలు తగలబడా!"

"అదీ ఉంది.! చల్లగా కురిసిన మంచు సూర్యుడి కాల్చే చూపుకి భస్మమైనంత భావం ఆ కళ్ళల్లో కదలాడింది!"

"నువ్వేమీ అడగలేదా?"

"మాటొస్తే గదా? ఆమెని చూసిన క్షణమే నాకు. చీకట్లో వెన్నెల విరిసినట్లూ, ఎడారిలో మల్లెపూలు విచ్చుకున్నట్లూ, మంచి ముత్యాలు గుట్టలుగా ఆకాశం నుంచి రాలి మంచుబిందువుల్లా పున్నమిలో ప్రతిఫలించినట్టూ అనిపిస్తుంది. ఇంకేం మాట్లాడగలనూ?"

"పోనీ తనైనా చూపుల్తో ఇంకేం చెప్పలేదా?"

" 'నీవున్నావుగా నేస్తం.. నాకోసం.. కేవలం నాకోసం..!' అన్నట్లు అనిపించింది."

"ఆ తర్వాత?"

"అంత దుఃఖంలోనూ ఓ చిన్న సంతృప్తి కళ్ళల్లో కదిలించి మెల్లగా సాగిపోయింది!"

"Damn you..!"

"Thank you..!"

"ఎందుకని అడగవేం?"

"ఎందుకడగాలీ? నేనేదో చెయ్యాలనీ, ఆమెతో ఏదేదో మాట్లాడితే బాగుంటుందనీ నువ్వు ఊహిస్తావు. నీ ఊహని నేను నిజం చెయ్యకపోతే నీకు కోపం రావటం సహజమేగా?"

మరో పదిహేనురోజుల తరువాత

"ఏమిటోయ్ అలాగున్నావూ?"

"ఎలా ఉన్నానూ?"

"జీవితాన్ని భరిస్తూ భరించలేనివాడిలాగే, వేదనా సముద్రంలోకి ఈడ్చుకుని పోబడుతూ ఆనంద తరంగాల్లో తేలిపోతున్నవాడిలాగా, చీకట్లో ముళ్ళమీద నడుస్తూ, అదే పట్టపగలయినట్టూ పువ్వుల మీద నడుస్తూ ఉన్నట్టు ఊహించుకునే వాడిలాగా, అసహజంగా ఉన్నావెందుకూ?"

"ఇందులో అసహజం ఏముంది? జీవమూ జీవితమూలాగానే నేనూ సహజంగానే ఉన్నాను."

"హూ"

"ఏంటి ఒక్క నిట్టూర్పుతో సరిపెట్టేశావూ? వర్ణనలు లేవా?"

"చిట్టచివరి శ్వాసకూడా నిట్టూర్పులాంటిదేగా!"

"అయితే నీ ప్రేమకూడా చివరి శ్వాసలో ఉందా?"

"ప్రేమ అనంతం.. దానికి ఆదీ అంతం లేవు. అలాగే ప్రేమకీ తొలిశ్వాసా తుదిశ్వాసా అనేవి ఉండవు!"

"పోనీ ఆమె కలిసిందా?"

"ఏమని చెప్పనూ?"

"మనసులో ఉన్నదే చెప్పు!"

"నాలోని ఆమె 'సజీవి'.. లోకం దృష్టిలో మాత్రం చలిస్తున్న నిర్జీవి!"

"అంటే?"

"ఓయి మూర్ఖుడా. ఈ లోకం ఆమెని ఐశ్వర్యపు శిఖరాల మీదికెత్తింది కానీ ఆమెకోరుకుంది శిఖరాలు కాదు.. అనురాగపు లోయలు.. ఈ లోకం ఆమెకి అంతులేని ఆభరణాలిచ్చింది. కానీ అవి ఆమెకి శృంఖలాలవుతాయని లోకానికేం తెలుసూ? ఆమెకోసం పూలబాటలు పరిచానంటూ లోకం ఉప్పొంగిపోయింది. కానీ నాకు తెలుసు.. ఆ పూల మాటున దాగిన ముళ్ళు ఆమె పాదాల్నించి వెచ్చని నెత్తుర్ని జుర్రుకున్నాయని!"

"అంటే?"

"ఆమె ప్రకృతి!"

"అంటే?"

"అంటే ఆమె స్త్రీ! స్త్రీత్వం లేని ప్రకృతి లేదు!.. అంతెందుకూ పుట్టుకా ప్రకృతే మృత్యువూ ప్రకృతే.. ప్రకృతి కానిది అసలేముందీ?"

"అంతేనా?"

"ఆ..! ఆ చిక్కిన శరీరాన్ని చూస్తే నా మనసులో చంద్రోదయమైంది. ఆ చిక్కిన బుగ్గల్ని కళ్ళకింద నలుపు చారల్నీ చూస్తే జాబిలి పక్కగా జాబిలిని కప్పివేస్తూ ఓ నల్లని మేఘం పయినిస్తున్నట్లు అనిపించింది. ఓ పూల చెట్టు పూవుల భారాన్ని భరించలేక మనసులోని ఊహల్లా పువ్వుల్ని నేల రాల్చినట్లనిపించింది. అంతెందుకూ.. నా రెండు కళ్ళలోంచీ కోటానుకోట్ల గ్రహాలూ నక్షత్రాలూ దూసుకుంటూ పోయి, ఆమె పచ్చని పాదాల చుట్టూ పరిభ్రమిస్తున్నట్లనిపించింది!"

"పిచ్చివదల్లేదన్నమాట!"

"వదిలితే అది పిచ్చి ఎందుకవుతుందీ?"

ఆ తరువాత .. కొన్ని రుతువులు గడిచాక

"నువ్వింకా బ్రతికే ఉన్నావా?"

"చూస్తూనే ఉన్నావుగా.!"

"అదే!"

"అంటే?"

"ఈ లోకంలో అని.!"

"ఈ లోకం నాకు నచ్చలా! నేనూ ఈ లోకానికి నచ్చలా.! అందుకే నా లోకం నేను సృష్టించుకున్నా..!"

"మరి ఆమె?"

"నాతోనే ఉంది.! నాలోనే ఉంది.! మొన్నటిదాకా నేను వేరూ ఆమె వేరూ అనిపించేది.. ఇప్పుడు ఇద్దరం లేమనీ ఉన్నది ఒక్కరమేననీ తెలిసింది!"

"తలకి రోకలి చుట్టుకున్నావన్నమాట!"

"నిజం నేస్తం..! శరీరపు హద్దులు దాటి చూడు.! ఉన్నది ఒక్కటే... అది 'నేను' అనే తాను!"

"మరి తనూ?"

"తాను అనబడేనేను!"

"అర్ధంకాలా..!"

"కాదు.!"

"పోనీ నువ్వు చెప్పు.. అర్ధం చేసుకుంటూ.!"

"భాష ఉంటేగా చెప్పడానికి!"

"మాట్లాడుతున్నావుగా?"

"ఈ భాష మనం సృష్టించుకున్నది.. నిజంగా చెబుతునా. మౌనాన్ని మించిన భాష లేదు!"

"మరి ప్రేమ?"

"అదొక్కటే సత్యం.. మిగతావన్నీ భ్రమలే!"

"ఓ 'నో' మాయని ఛేధించావన్నమాట!"

"మాయ అనేది ఉంటేగా ఛేధించడానికి?"

"నాకు పిచ్చెక్కుతోంది.!"

"ఇన్నాళ్ళకు అదృష్టం నీ తలుపు తట్టింది.. గుండె తలుపులు తెరుచుకో..ఆశల పక్షుల్ని ఆకాశంలోకి వదిలెయ్.. శరీరం ముక్కలయిపోయి ఓ మహా ప్రవాహంలాంటి ప్రవాహం పుట్టుకొస్తుంది.. దాన్లో కొట్టుకుపో.."

"చచ్చిపోతే?"

"అదే.. దాన్నే అంటారు! 'బ్రతకడం' అని!"

❀❀❀

చరమరాత్రి

శ్రీశ్రీ

(రచనా కాలం 1950 ప్రాంతాలు..)

(నరకం, భూమి, స్వర్గం అనే మూడు కాలాలలో ఆలాపన)

నరకం

రాత్రి పదకొండు గంటలయింది. ఇంకొక గంట. ఇంకొక్క అరవై నిమిషాలు. సరిగ్గా పన్నెండు కాగానే చచ్చిపోదలచుకున్నాను. అన్నీ ఆలోచించుకున్నాను. ఇప్పుడా? ఆరు నెలలనుంచీ సిద్ధమవుతున్నాను. ఇప్పటిదా ఈ నిశ్చయం, ఆరు నెలల కిందటే తెగించాను. అప్పటినుంచీ నాకిదే ఆలోచన. నిశ్చయాన్ని మార్చుకుందామని కాదు. ఆరునెలలు అహోరాత్రులు జాగ్రత్సుషుప్తులలో ఎడతెగని యోచనా తరంగాలలో నా నిశ్చయాన్ని స్నానం చేయించాను. ఆరునెలల అవభృధ స్నానంలో పవిత్రీకృతమైన నా అందమైన, నా ఆడుకునే, నా తిరుగులేని, భయంకరమైన సంకల్పాన్ని ఈ రాత్రి ఆచరణలో పెడుతున్నాను.

ఈ రాత్రి నా ఆత్మహత్యా మహోత్సవం. ఇది ఆహ్వాన పత్రిక కాదు. ఈ ప్రదర్శనకి ప్రేక్షకులు అనవసరం. ఇది నా సొంత వ్యవహారం. ఇతరులు లోనికి రాకూడదు.

మరణించాలని నిశ్చయించుకున్నాను. సరిగ్గా ఈ రాత్రి పన్నెండు గంటలకి చచ్చిపోవాలని సంకల్పించుకున్నాను. "ఈ రాత్రి పన్నెండు కాగానే, ఈ రాత్రే ఎంచేత? పన్నెండుకే ఎందువల్ల? అసలు చచ్చిపోవడం ఎందుకు? చచ్చిపోతూన్న ఓ వ్యక్తీ? నువ్వెవరు?"

నేనేవరు? అనవసరం. అయితే ఈ రాతకూడా అనవసరమే? పోనీ నేనెవరో చెప్పనా? ఎవరికి చెప్పను? ఎందుకీ రాత? అదే ఈ రచన ఎందుకో. ఎవరికో తేల్చుకుందామని చచ్చిపోతున్నాను. ఆరునెలలుగా చచ్చిపోతున్నాను. ప్రతీదినం ఆధ్యాత్మికంగా చచ్చిపోయాను. ఈ రాత్రి భౌతికంగా. త్వరలో నేను చెయ్యబోయే ఆఖరు అభినయం నా వ్యాక్యానికి పుల్ స్టాప్. నా కావ్యానికి పరిసమాప్తి.

జీవితాన్ని అర్థం చేసుకోవడానికి జీవించటమే అవసరం అనే సునాయాసపు సూత్రం నిరాకరించి మరణం ఇందుకు నా మార్గంగా ఎంచుకున్నాను. ఇది ఎవరికీ బోధపడదు. ఎవరికీ బోధపరచలేనని కూడా నేనెరుగుదును. అయినా నా ఈక్వేషన్ కిదే సాల్యూషన్.

అదే పొరపాటు. నేనొక రచయితననీ, రాతలో ప్రకాశించలేక చచ్చిపోతున్నాననీ, అనుకోవద్దు. ఈ చేతులతో నా ఎనిమిది వందల పేజీల నవలని దగ్ధం చేశాను. నాకు రాత చేతకాదని ఎవరూ అనరు. నేనసలే అనుకోలేదు. కీర్తి దాహం తీరకపోవడం నా ఆత్మహత్య కారణం కాదు. ప్రేమలో పరాజయం కారణం కాదు. ధనాభావం అంతకన్నా కారణం కాదు.

ఎంచేతనంటే! మా నాన్నకి బోలెడంత ఆస్తి ఉంది. పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు? రెండు చేతులా ఆర్జిస్తున్నాడు. (లంచాలంటావా? అనుకో) నేను ప్రేమించిన స్త్రీ నన్ను అంగీగరించింది. మా వివాహం విషయంలో మా తల్లితండ్రులు మాకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చారు. నన్ను ప్రేమిస్తున్న అమ్మాయికి అందమూ, చదువూ, డబ్బూ, తెలివీ ఉన్నాయి. జీవించాలనుకుంటే రేపే ఆమెను పెళ్ళి చేసుకోగలను. నా వయస్సు 24 ఏళ్ళు. నా బతుకంతా ముందే ఉందని నా కెవరూ చెప్పనక్కర్లేదు. నాకే కీర్తి కావలిస్తే నా నవల ప్రకటించి ఉందును. నేను రచయితనేకాదు, చిత్రకారుణ్ణి. చాలా చిత్రాలు ప్రదర్శించి ఉందును. (వాటిని కూడా నాశనం చేశాను. కాని అంతకన్నా మంచివి చిత్రించగలను) నేను చిత్రకారుణ్ణి మాత్రమే కాదు. నాకు సంగీతం కూడా వచ్చును. వయోలిన్ వాయిస్తాను. క్రికెట్, టెన్నిస్, ఫుట్‌బాల్ ఆడతాను. నాకు మానవ మాత్రుడు కోరుకో దగ్గవన్నీ ఉన్నాయి. నన్ను తెలిసిన వారంతా నాకేమీ లోపం లేదంటారు.

నేను మెడికల్ కాలేజీలో చదువుకుంటున్నాను. ఈ వివరాలన్నీ అనవసరం. సరదాగా చదువుకోవడానికి కథ రాయడం లేదు నేను. పన్నెండు గంటల కోసం కాచుక్కూచున్నాను. ఈ లోపున ఏం చేయడానికి తోచక ఇది రాస్తున్నాను. ఆరు నెలల నా ఆలోచనల సారాంశం. పదకొండు గంటల యాభై తొమ్మిది నిమిషాలకి ఈ రాసినదంతా ఈ వెలుగుతున్న కొవ్వొత్తికి అప్పగిస్తానేమో. ఈ రోజే మా నాన్న పంపించిన రెండు వందల రూపాయలు ఈ కొవ్వొత్తికే ఇచ్చివేసిన వాణ్ణి కానూ నేను!

విద్యుద్దీపాలున్న ఈ గదిలో ఒక కొవ్వొత్తిని మాత్రం వెలిగించి కూచున్నానంటే, నా టేబులు ముందు కాయితాలూ, కలం పెట్టుకొని కూచున్నానంటే, ఒక చేతి రుమాలూ, ఒక సిగిరెట్టు పెట్టె పెట్టుకుని కూచున్నానంటే, సీసా ఒకటి ఎదురుగుండా ఉంచి... బ్రాందీ? తప్పు. విషం? తప్పు. రైట్. అదే! క్లోరోఫాం! చూశావా మరి? నేనేమీ ఆలోచించకుండా చెయ్యను. నూతిలో పడి ఉక్కిరి బిక్కిరిగా, ఉరిపోసుకుని నాలుక వేలాడుతూ, విషం తాగి కడుపు దహించుకుని పోయి, రైలు బండికింద ముక్కలైపోయి... ఈ చావులేవీ మనస్కరించవు నాకు.

నిద్రపోతూ, కలలుకంటూ, అపస్మారంలో హాయిగా, అందంగా కరిగిపోయి సురిగిపోతాను. చావు బతుకుల సరిహద్దును తుడిచివేస్తాను. హఠాత్తుగా అనాయాసంగా చచ్చిపోవడానికి కూడా నీళ్ళున్నాయి. ఎలక్ట్రిక్ షాక్‌తో, ఎత్తునుంచి దుమికి కణత మీద రివాల్వర్‌తో కొట్టుకుని పన్నెండు ఔన్సుల గాజు గ్లాసులో పది ఔన్సుల నీళ్ళు పోసి రెండూ చిటికెల (అంత అనవసరం) సైనైడ్ కరిగించి చిటికెన వేలు మీద బ్లేడుతో గంటు పెట్టి. ఆ వేలు ద్రవంలో ఉంచితే చాలును. నా హైపొడెర్మిక్ సిరంజిని వాడినా చాలును. కాని ఇవేమీ నాకు తృప్తి కలిగించవు. నా సంగతే వేరు. నా సంగీతం వేరు. హాయిగా, అందంగా స్వప్నాలతో.. అదీ నా రకం.

చిత్రం కాదూ? ఇది వరకు. ఆరునెలల క్రితం. ఎప్పుడో ఆరునెలల క్రిందట క్రీస్తు పూర్వం ఆరు నెలల వెనక, భూమి పుట్టిన ఆరు నెలలకు ముందు, అప్పుడు ఆ రోజుల్లో జీవితమంటే ఆప్యాయంగా, ఊపిరి తియ్యడమే మహద్భాగ్యంగా, సుందర దృశ్యాలు చూస్తూ, సుందర గ్రంధాలు చదువుతూ, రాస్తూ, గానం చేస్తూ, బొమ్మలు చిత్రిస్తూ, నేను ప్రేమించిన నన్ను ప్రేమించిన ప్రేమను ప్రేమిస్తూ, జ్ఞానాన్ని మధిస్తూ, వెయ్యి చేతులతో, వెయ్యి ఇంద్రియాలతో జీవిత మాధుర్యమంతా తనివి తీరా పీల్చిన విసుగు లేకుండా అనుభవించిన .. లేదా పీల్చినట్లు, అనుభవించినట్లు భ్రమించిన నేను. నేడు, ఈనాడు, నేటికీ, ఈనాటికి, అన్ని ఆశయాలూ అడుగంటి, ఐహిక యాత్రలో ఆకర్షణ పోయి, ఒకానొక క్రూరమైన క్రోధావేశం పుట్టుకొచ్చి ఎంత వేగం ఈ వికార నటనానికి పరిసమాప్తి చెబుదామా, ఎంత శీఘ్రం ఈ నికృష్ట దృశ్యాన్ని చెరిపివేద్దామా అని తహ తహ ఆవేదనా. ఆందోళనా పొందడం అమ్మయ్యో నాకే ఆశ్చర్యం కలిగిస్తోంది.

కాని నేనేం చెయ్యగలను? ఇంకేం చెయ్యగలను? ఏం చెయ్యమంటావ్? ఏం చేద్దాం అనుకున్నా ఎదురుగుండా, ఏం లాభం! అనే ప్రశ్న అటకాయిస్తుంది. ఎన్నివిధాల యోచించినా మృత్యువు అవశ్యకమై, కౌగలించుకునే స్నేహితుడిలాగ, ఆదరంగా ఓదార్చే బంధువులాగ ఆహ్వానిస్తూ వివృత కవాటమై స్వాగత తోరణాలు ధరించిన దివ్యభవనంలాగ కనబడుతూ, జీవితం భయంకరమై, దుస్సహమై దుష్టమై, విహ్వలభావం సోకించి, శత్రువై, సర్పమై, శార్దూలమై, శాపమై రావద్దనే రాక్షసిలాగ, పోపో అనే పాగలాగ కనబడుతూ ఉంటే వినబడుతూ ఉంటే ఆహా! నా నిశ్చయం, ఔరా! నా నిర్ణయం ఇంకోలాగ ఎలా ఉంటుంది?

చనిపోవాలని నిశ్చయించుకున్నా చిత్రంకాదూ? ఏడాది కిందట నా స్నేహితుడు, డబ్బు లేక చదువుమాని పనిలో ప్రవేశించి, సంసారంలో ప్రవేశ పెట్టుబడి, బతుకు వల్ల లాభీ చార్జీ చెయ్యబడి కరువు వల్ల నిలువు దోపిడీ చెయబడిన నా స్నేహితుడు కింద కనబడి నన్నొక మహోపకారం. చిటికెడు పొటాసియం ఫెర్రోసైనెడ్, చిత్రం! స్పెల్లింగు తప్పుతో రాసినమాట సగం మూసిన కళ్ళతో ప్రార్థిస్తూ ఉన్న నా స్నేహితుడు, కాగితాన్ని నా చేతిలో పెట్టి (కోరిన వస్తువును నోటితో చెప్పలేక) ఒకే ఒక్క మహోపకారం చేయమని, ఆఖరి కోరిక చెల్లించమని ప్రాధేయపడితే, ససేమిరా అని నేను పట్టుబట్టి, ఇవ్వనుగాక ఇవ్వనని భీష్మించుకుని, ప్రాణపు పావిత్ర్యం గురించి,

జీవిత సౌభాగ్యం గురించి కవిత్వపు గమకాలతో ఉపన్యాసం ఇచ్చిన నేను, అతని కథంతా విని, ఎన్నో మార్గాంతరాలు చూపించి, ఎన్నో దృష్టాంతాలు బోధించి, బతకవాల్సిన అవసరం రుజువు చేసిన నేను, పరాజయం మెరుగని జీవితపు పతాకాన్ని అతని మనస్సులో ప్రతిష్టించిన నేను (నాకు జ్ఞాపకం, బ్రౌనింగ్ కవి Saul అనే గీతం నుంచి Oh,Our manhood's Prime Vigour!...Oh' The Wild joys of Living! ! ఇత్యాది పాదాలు. బైరన్ రాసిన "To sit on rocks" మొదలైనవి - అదంతా ఇక్కడ ఉటంకించడం అనవసరం - నా వాదానికి వాటిని స్థంభాలుగా చేసిన నేను) - నేను (ఈ వాక్యాన్ని ఇంతటితో పూర్తి చెయ్యాలంటే) అతణ్ణి బతికించాను. అతనికిప్పుడు మళ్ళీ కొడుకు! అతనికిప్పుడెంతో మర్యాద ఎంతో హాయిగా ఇప్పుడతడు జీవిస్తున్నాడు.

ఇక నేను! ఎప్పుడు ప్రవేశించిందో నా మనస్సులో ఈ కీటకం! (ఆరు నెలలు కిందట కాబోలు) ఎలా ప్రవేశించిందో ఈ క్రిమి! నాకు తెలియకుండా కాబోలు, ఎన్ని పద్మ వ్యూహాలు, ఎన్ని సాలీడు గూళ్ళు. ఎన్ని అంధకార గుహాంతరాలు చొరబడ్డానో, ఎన్ని ఇంద్రజాలాలు చేశానో, ఎన్నిమార్లు పునఃపునఃపునఃపరీక్షలు చేసుకున్నానో నా హృదయాంతరాంతరాళాలలో! ఎన్ని ప్రశ్నలు, ఎన్ని సంజాయిషీలు! ఎన్ని రాజీలు, చిరాకులు, కోపాలు, తాపాలు, సందేహాలు! ఓహో, ఆ సందిగ్ధాల సంధ్యా సమయంలో నన్ను నేను ఎన్నోమార్లు చిత్రవధ చేసుకున్నాను. ఎంత యమయాతన పడ్డానని!

అడుగడుగునా ఎవరో వెనకనుండి తరుముకు వస్తున్నట్లుండేది. ఏదో కొండ చిలువ నన్ను చుట్టుకున్నట్లుండేది. కారు కమ్మిన పొగలు తుఫాను పెట్టినట్లు ఉక్కిరి బిక్కిరి కలిగేది. ఇక నా మెదడులో హోరు చెప్పనక్కరలేదు. సంగీత విరుద్ధమైన వివిధ శబ్ద సమ్మేళనలతో, వాటిలోనే వివిధ విచిత్ర లయలతో, అవ్యక్త భీతావహంగా వినిపించే ధ్వనులు, కథలలో చెప్పుకునే మనస్సులో ఊహించుకునే, మానవుడి భయం నాటినుండీ నేటి వరకూ ధరించే రకరకాల రూపాలూ, వికారపు కోరలూ, కొమ్మల కొమ్ములూ, అనేక వక్త్రాలూ, ఇంటినిండా ముళ్ళూ, నాసారంధ్రాల నుండి అగ్నులు కక్కే జంతువులు నన్ను ముట్టడించేవి. అర్థం లేని పైశాచిక మంత్రాలు నా నిద్రకి భంగం కలిగించేవి. నల్లని వర్షమేఘాలతో నా మానసిక వ్యోమమంతా చాందినీ కప్పేవి.

ఎక్కడిదా అంధకారం? ఫ్లెమిష్ చిత్రకారుల వర్ణలేపనంలో, బోదిలేర్, రాన్‌బో కవుల సంక్షోభ కవిత్వంలో, డీక్వీన్సీ నల్లమందు పొగలలో, డీన్ స్విఫ్ట్ మానవ ద్వేషంలో, షోపెన్హార్తత్వ జిజ్ఞాసలో, బిథోవెన్ కళ్ళ వెనుక, డోస్టోవ్‌స్కీ గ్రంధపుటలలో, ఎడ్గార్‌పో ఆత్మలో, దండక ఆఫ్రికా అరణ్యాలలో, సైబీరియా ఎడారులలో, ఉత్తర ధ్రువ రాత్రుల మంచుకప్పిన మైదానాలలో ఎక్కడనుండి వచ్చిన అంధకారం అది?

నా చీకటిలో గిలగిల కొట్టుకుంటూ, సూదుల వంటి, బాణాల వంటి భావాలతో, తప్త తైల ప్రవాహాల నిరంతర స్నానంలో, పగిలిన అగ్ని పర్వతాల ప్రచండార్భాటంలో, ప్రకోపించిన పంచభూతాల నిరంకుశ పరిపాలనలో, గగన చుంబకములైన మహా తరంగాలు ఘూర్ణిల్లే ప్రళయ సముద్రాలతో నా మెదడంతా అల్లకల్లోలమయ్యేది.

చచ్చిపోతున్న ఓ వ్యక్తి! చాలించు ఇక నీ సరదా రాత! చస్తానని ఎవరిని జడిపిస్తావు? చాలా చూశాం ఇలాంటివి. ఈ కార్యం చేసేవారెవరూ తర్జన భర్జనలు చెయ్యరు. ఒక్క క్షణంలో ముగించుకుంటారు. నూతిలో ఉరికీ, సముద్రంలో పడి, విషం తాగీ, ఉరిపోసుకునీ, ఎత్తునుండి దుమికీ, ఎలెక్ట్రిక్ షాక్‌తో ఎట్‌సెట్రా! జాబితాలనవసరం. ఒక లక్షమార్గాలున్నాయి. ఏదైనా స్వీకరిస్తారు. నీలాగనుకున్నావా?

లేదు. చాల ఆలోచిస్తారు. నాలాగే! చాలా వితర్కిస్తారు. నాలాగ. నాకు తెలుసు. మరణించడం అంటే నిండు ప్రాణం హరించి పోవడమంటే మీద మీద లేదు. మరణశిక్ష విధించబడిన వాడు కూడా ఇష్టంగా ఉరికొయ్య ఎక్కడు. ఎంతో మంది ఉరి తీయబడేముందు తమ్ము తీసుకువెళ్ళుతూన్న వాళ్ళతో కాట్లాడి, వాళ్ళని రక్కి, కరిచి, విలవిలలాడుతారు. దీర్ఘరోగులు కూడా సులువుగా చచ్చిపోరు. సమీపించే మృత్యువును ప్రతి రక్తకణంతోనూ ఎదుర్కొంటారు. వైద్యులు కుదర్చలేక పెదవి విరిచిన అసహ్యమైన జబ్బులు మోసుకుంటూ

ఎలాగైనా బతికి ఉండటం కోరతాడు ప్రాణి. మురికి కాలువలోని కుక్క కుళ్ళి కుళ్ళి చచ్చిపోతుంది కాని, ఎంత తిండి లేకపోయినా, ఎంత వానలో తడిసి, ఎంత చలిలో కొంకరవారిపోయినా వెంటనే చచ్చిపోదు. ఎన్నో జననాలనీ, మరణాలనీ నేను దగ్గర ఉండి చూశాను. చూశావా మరి! నేను చచ్చిపోతున్నానంటే నిరాలోచితంగా పిరికితనంగా పెడసరం చేస్తున్నానని ఎంత మాత్రమూ అనుకోవద్దు. ఒక్కొక్క సంగతే జాగ్రత్తగా తూచి ఒక్కొక్క మార్గమే ఓపికగా అనుసరించి ఈ అమూల్యమైన నిరాశనందుకున్నాను.

గట్టిగా గాలి వేసి కొవ్వొత్తి ఆరిపోయింది. చీకట్లోనే ఆలోచిస్తూ అలా ఉండిపోయాను కొంతసేపు. మళ్ళీ దీపం వెలిగించి రాస్తున్నాను. ఇంకా పన్నెండు కాలేదు.

భూమి

అయితే ఏమంటున్నావ్, నేస్తం! నేను చచ్చిపోవడం ఏమీ సమంజసంగా లేదంటావు. నేను సజీవంగా ఉండడం సమాజ క్షేమానికి అవసరం అంటావు. నా బతుకు నాది కాదు. అది సంఘంలో ఒక భాగం. అదిపోతే సంఘ యంత్రం నడవదు. సమాజంలో నా స్థానాన్ని విసర్జించి పలాయనమవుతున్నానంటావు కదూ? ఉండు. ఉండు. ఆ స్థలం నిర్ణయమైందా? ఆ విలువలు నిర్దేశింపబడ్డాయా? నా స్థలాన్ని నేను వెదుక్కుంటూ ఉంటే ఎన్ని రకాల నిరోధాలు ఎదుర్కొంటున్నాయో ఎరుగుదువా? నా చుట్టూ ఎన్ని ముళ్ళకంచెలున్నాయో చూశావా? నువ్వు వెలివేసి, సందేహించి, నేనంటే భయపడి, నన్ను అసహ్యించుకుని నన్ను హతమార్చడానికి చూసే ఈ ఇనప పద్ధతి మీద నాకేం గౌరవం ఉంటుంది? ఈ కుళ్ళిపోతూన్న సంఘం మర్యాదలు నేననుసరించగలనా? ఈ కపట నాటకంలో నాకిష్టం లేని పాత్ర వహించి ఎలా ఒప్పించగలను?

నేస్తం! నేటి ప్రపంచానికి తెలిసింది. ఒక్కటే విలువ. ధనం! నా సంగీతాన్ని, కవిత్వాన్ని చిత్రలేఖనాన్నీ ఎవరూ హర్షించరు. డాక్టరునై, వృత్తిలో దిగినప్పుడు కూడా, నా ఇల్లూ, నా వేషమూ, నా మోటారు కారూ చూస్తారు కానీ డబ్బు తీసుకోకుండా వైద్యం చేస్తానంటే వెర్రివాడి కింద కట్టేస్తారు. ఎవరికి వారు, తమ తెలివితేటలనూ, జిత్తులనూ, సామర్థ్యాలనూ డబ్బు కింద మహదాశయమైపోయింది. ప్రపంచ సమస్య అంటే ఆర్థిక సమస్య. మనుష్యుల విలువలు కొలవడానికి స్పష్టంగా కనిపించే కొలత ధనం కాక మరేముంది ప్రస్తుత పరిస్థితులలో? ధనం వల్లనే ఆధిక్యం కాబటి ధనోపార్జకే ప్రతి వ్యక్తీ పెనుగులాడతాడు. ధనం మూలం మిదం జగత్. వీడు గుడ్డి గవ్వ చెయ్యడు. మన సామెతలు మన దృక్పథానికి సాక్ష్యం. చెడిపోవడానికి బాగుపడడానికీ బేధం ధనమే నిర్ణయిస్తుంది. ఏకాగ్రతతో తపస్సు చేసే యోగ్యులలాగ కొందరు కుబేరుని వేదిక ముందు సహస్రనామ జపం చేస్తూనే ఉంటారు. వడ్డీలు, లెక్కలు! వడ్డీలకు వడ్డీలు, జీవితమంతా డబ్బు పోగు చేసే యజ్ఞం. పెట్టుబడులెందుకు? వాణిజ్యం ఎందుకు, వణిజ నీతి అంటారు. పాలలో అట్టే నీళ్ళు చేర్చవద్దు. బియ్యంలో ఎక్కువ రాళ్ళు కలపవద్దు. నేతిలో ఎక్కువ కొవ్వు కలపవద్దు. అసలీ కల్తీ చెయడాలెందుకు? లాభం కోసం. వ్యాపారం సాగడానికి, బంగారం, కాకి బంగారం, తినే తిండి, కట్టే బట్ట, కట్టడాలూ, కావ్యాలూ, చదువూ, సౌందర్యం అన్నీ అమ్మకానికి సిద్ధం. అన్నిటికీ "సరసమైన" ధరలు. న్యాయమైన వ్యాపారం చెయాలట. ప్రకటనలు! బొమ్మలతో, కరపత్రాలతో, గోడలమీద, విద్యుచ్ఛక్తితో, విమానాల నుంచి ప్రకటనలు. దేశ దేశాలలో ప్రచారం. దేశాలకు దేశాలే బజార్లు. వర్తకపు న్యాయం వ్యాపార సూత్రాలు. సరుకు నమ్మకం. మా షాపులు చూడండి. ఒక్కమారు చూస్తే మరెక్కడికీ వెళ్ళరు. వేశ్య అలంకరించుకుని ఆహ్వానించినట్లే. ఒకడు చెబితే గాని మరొకడూ బాగు పడడట! తక్కువకి కొని ఎక్కువకి అమ్మాలట! ఒక్కొక్కప్పుడు బజారు నాడి పరీక్షించి సామాన్లను చీకట్లో దాచెయ్యాలట! అన్నిటికీ ఖరీదులు కట్టడం పరిపాటి అయిపోయింది. "ఏమండీ! బీరకాయలెంతకి కొన్నారు!".. "అబ్బే! దగా పడిపోయారండి" ఒకడు కుళ్ళు వంకాయలమ్మేస్తాడు. ఒకడు చెత్త పద్యాలమ్మేస్తాడు. వంద రూపాయలకి దమ్మిడీ లాభం హామీ ఇచ్చే వ్యాపరం చూపిస్తే ధనంజయుణ్ణయి పోతానంటాడొకడు. పెట్టుబడిదారీ విధానానికి అంత్యకాలం ఆసన్నమయిందని వీళ్ళెవరూ కనుక్కోలేకుండా ఉన్నారేం? ఇంకా ఆ పాత వ్యవస్థనే పట్టుకుని ఊగులాడుతారేం? ఉత్పత్తి ప్రాథమిక దశలో ఉన్నప్పుడు వ్యక్తి సామర్థ్యానికి ప్రాముఖ్యం ఉండేది. ఇప్పుడో ఇది

జూదంగా మారలేదూ! అంతా లాటరీ! అంతా గారడీ! ఎవడెప్పుడు గెలుస్తాడో తెలియదు. ఎవడెందుకు ఓడిపోతాడో తెలియదు. నేటి వ్యవస్థ కొక నీతి లేదు. నియమం లేదు.

అందువల్ల ఈ జూదంలో నేను పాల్గొనలేను. పడిన శ్రమకు రూపాయి అణా పైసల్తో లెక్కకడుతున్నప్పుడు పని ఎగగొట్టి ధనం సులువుగా ఆర్జించాలని ఉబలాటం కలుగుతుంది. పనిలో శ్రద్ధ పోతుంది. అడుగు, ఈ ఉద్యోగస్తులందరినీ మీరు చేస్తున్న పనిలో మీకెంత ఆసక్తి ఉందని. ''ఏమిటో, ఈ జీతపురాళ్ళ కోసం కాకపోతే ఎవడిక్కావాలి వెధవ ఉద్యోగం?''

ఏదో ఒక ఉద్యోగంలో తలదూర్చి, ఏదో ఒక వృత్తిలో బోర్డు కట్టి, అడుగు నుంచీ ఆరంభించి అభివృద్ధి కోసం పడిగాపులు పడుతూ జీవితాన్ని వెళ్ళబుచ్చడమేనా మానవుని పరమావధి? జీవితాన్ని ప్రచోదనం చేసే ఇతర శక్తులు, జీవితాన్ని ఆనందమయం చేసే ఇతరానుభూతులు మరేవీ లేవా? ఒకరి నొకరు ద్వేషిస్తూ, తమ్ముతామే అసహ్యించుకుంటూ ఇంతేనా బతుకంటే! తానే చెయగలపని తన మనస్సంతా పెట్టి చెయ్యడం, చేసినందువల్ల తాను ఆనందం పొందడం, దాని ఫలితం అందరినీ అనుభవించనివ్వడం ప్రస్తుత పరిస్థితులలో సాధ్యమవుతుందా? ఇది నాది అనుకోవడం, దాన్ని దాచుకోవడం, దానికోసం ఈర్ష్యపడడం, ఎంత వెర్రి మమకారం? ఉన్నత జీవితంలో ఈ విషాలు లేవు. ఒక కవి గీతాలు రాస్తే, ఒక వైజ్ఞానికుడు శాస్త్ర పరిశోధన చేస్తే, ఒక కళాకారుడు శిల్పం సృష్టిస్తే, ఆ ఫలం అంతా, సంఘం అనుభవిస్తుంది. సంఘం అంతా దాన్ని పంచుకుంటుంది. అందుకు అభ్యంతరం ఉండకూడదు. ఉంటే సమాజంలో ఇంకా కుళ్ళు నిలిచి ఉందన్నమాట. అందుకే మన దేశంలో వైజ్ఞానికుల కంటే బిచ్చగాళ్ళే ఎక్కువమంది.

సంఘంలో ఇంకా చాలా కల్మషం నిలిచి ఉంది. కాబట్టే సంఘ కార్యాలన్నీ బాధల మధ్యా, కన్నీళ్ళ మధ్యా జరుగుతున్నాయి. అయితే ప్రపంచానికి అవసరమైన అల్పకార్యాలన్నీ ఎవరు చేస్తారు? అందరూ అందలం ఎక్కితే మోసేవాళ్ళెవరు? సేవ్య సేవక ధర్మం. ఇదొక అభ్యంతరమే పూర్వం. అందుకే ఆ సామెత. ఇప్పుడు మనుష్యుల శ్రమ మానవుని బుద్ధిబలం వల్ల చాలామట్టుకు తగ్గిపోయింది. నేను సుఖంగా ఉండడానికి నా నౌఖరును కష్టపెడతాననడానికి వీలులేదు. విద్యుచ్ఛక్తి నిన్ను సుఖపెడుతుంది. ఆవిరి నిన్ను సుఖపెడుతుంది. నీ సుఖాలను నీ సోదరులందరికీ పంచిపెట్టు. అందులోనే అనల్ప సౌఖ్యం ఉంది.

ఔను. ఈ ప్రపంచం మిథ్య అనీ, జీవితం దుఃఖభూయిష్టమనీ అనేవాళ్ళను నేను లక్ష్యపెట్టను. ఈ విషాదాలన్నిటికీ నీ అజ్ఞానం కారణం. వీటన్నిటినీ తొలగించడానికి వీలుంది. మనుష్యులకు సుఖించడానికి జన్మతః హక్కుంది. ధనిక వర్గం ఈ సుఖాన్ని దాచుకుంది. అలా దాచుకోడానికి వీలుగా నేటి పద్ధతి సర్వమూ నిర్మించబడింది. ఈ వ్యవస్థను సమర్థించడానికి కూడా మన పండితులు కొందరు బయలుదేరుతున్నారు. ధనవంతులకే మరింత ధనం: వెనకబడినవాడూ వెనకనే. దరిద్రుడుగా పుట్టడమే తప్పు, అది వాడి కర్మం.. అది వాడి పాపం.

ఒక గాన సభ గాని, ఒక నాటకం గాని జరుగుతూ ఉంటే ఇవతల నేను నిలబడి హాలు మీద రౌడీలు రాళ్ళు విసరడం చూస్తాను. అంతా వాళ్ళని దుండగులని దూషించే వాళ్ళే కాని నేను మాత్రం వాళ్ళ పక్షం వహించి వాళ్ళను అర్థం చేసుకుంటాను. ఈ ధనికులంతా లోపల కూర్చుని కళా సామ్రాజ్యం పరిపాలిస్తున్నామనీ, వెలుపలి నుంచి జరిగే అల్లరి తమ రసాస్వాదనకు భంగం కలిగిస్తున్నదనీ భావిస్తారు. అంతేగాని శిల్పానికి వాయువువలె, జలం వలె సార్వజనీనమైన అనుభవయోగ్యత ఉన్నదని అంగీకరించరు. వీళ్ళ పోలీసులు రౌడీలను తరమడానికి సిద్ధంగా ఉంటారు. వెలుపలి వారి హక్కునే లోపలి వారు అపహరిస్తున్నారని ఎవరు గ్రహించగలరు! తాము అనుభవిస్తూనే ఇతరులను కూడా అనుభవించనియ్యగల విశిష్టత ఉన్నత జీవితానికి లక్షణమని ఎంతమంది అంగీకరించగలరు? ఇందుకా కవులు గ్రంథాలు రాసేది? గాయకులు గొంతుచించుకునేది? శిల్పులు చిత్రాలు సృష్టించేది? వైజ్ఞానికులు నూతన సత్యాలు కనిపెట్టేది?

కాని ఈ మహా శిల్పుల జీవితాలు కూడా ధనానికే అంకితం అయిపోవడం నాకు జాలి కలిగిస్తుంది. డబ్బు ఎంత క్షమించరాని నేరం చేస్తోంది! అమూల్యమైన రసాత్ములని కొనేస్తుంది. అందమైన భవనాన్ని చూస్తే దీన్ని కట్టిన వాడు ఎంతో కొంత డబ్బు తీసుకున్నాడన్న సంగతినే స్మరించడం మానలేదు. ముప్పగోపాల పదాన్ని అమోఘంగా అభినయిస్తున్న అమ్మాయి స్మరించడం మానలేదు. ముప్పగోపాల పదాన్ని అమోఘంగా అభినయిస్తున్న అమ్మాయి హస్తముద్రల వెనక ధనం చేసే కరాళ నాట్యాన్నే చూస్తాను. ఒక గొప్ప నాటక కర్త సృష్టించిన పాత్రను ఒక ప్రసిద్ధుడైన నటుడు ప్రతిభావంతంగా వ్యాఖ్యానిస్తూ ఉంటే "ఏయ్. నువ్వు డబ్బు తీసుకున్నా"వని అరవాలనిపించుతుంది. రాళ్ళని, రాతిగుండెలనీ కరిగించగల రాగాలాపన సాగిస్తున్న వైణికుణ్ణి చూసి అతని వేళ్ళు కూడా ధనస్పర్శ వల్ల మలినమైపోయినవే కదా అని బాధపడతాను. ఏ ప్రదర్శనానికి వెళ్ళినా నేను కొన్న టిక్కెట్టు నా గుండెల్లో బాకులాగ గుచ్చుకునే ఉంటుంది.

ఈ బెడదలేవీ లేక, ఈ ఆలోచనలేవీ లేక అందరూ ఎంత తృప్తిగా నిశ్చింతగా బతికేస్తున్నారో! అందుకే నా కనిపించుతుంది. నేను ఎందుకు చచ్చిపోవాలి? ఎందువల్ల ఆ మోటారు కారులో పోతూన్న మొద్దబ్బాయి గంగిరెద్దులాగ తయారయి సినిమాకో, షికారుకో వెడుతున్న వాడు చచ్చిపోకూడదు? ఎందువల్ల ఆ సిగరెట్టు కాల్చుతూ, చేతికర్ర ప్రత్యేకత వహించిన ఆ పెద్ద మనిషి చచ్చిపోకూడదు? ఎందువల్ల ఆ బనారసు చీర కట్టుకున్న, బంగారం పెట్టుకున్న, ఒళ్ళంతా అన్ని దిక్కులూ బలిసి, ఆడవాళ్ళ సభలో అరిగిపోయే ఇంగ్లీషులో ఉపన్యాసం చేయబోతూన్న యువతీ రత్నం మరణించకూడదు?

ఓహో! ఇవి వ్యర్థాలోచనలని భావించవద్దు నేస్తం! నేనూ నీలాగే లోకాన్ని చదువుకుంటున్నాను. నిర్ధనులంతా, నిమ్నజాతులంతా, వాళ్ళ బతుకుతో వాళ్ళు తృప్తి పడుతున్నారనీ, చేసిన పాపం అనుభవిస్తున్నారనీ, అసలు వాళ్ళకి ఆత్మలే లేవనీ, ఈ కొత్త రచయితలూ, కొత్త నాయకులూ బయలుదేరి వాళ్ళకి లేనిపోని ఆశలు కల్పించి, వాళ్ళలో అశాంతి రేగించి తిరుగుబాటు పురికొల్పుతున్నారనీ అంటూన్న చవక రకం విమర్శలు లక్ష్యపెట్టనక్కరలేదు. అసలు మన అభిప్రాయాలను వాళ్ళ మనస్సులలో ప్రవేశ పెట్టడం లేదుసరికదా ఇవన్నీ వాళ్ళ హృదయాలలో, నోరు లేని వాళ్ళ జీవితాలలో అంతర్గర్భితంగా అణిగి ఉన్న ఊహలే బైటికి రాలేక లోపల లోపలనే కుతకుతమని ఉడికిపోతూ ఉన్నవి. సమాజ గమనాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకున్న వాడు ఎవరి పక్షం వహించాలి ఈనాడు? నాకు తెలుసును. నా బాధ ఎవరి బాధో నాకు తెలుసును. ఒక ఫ్యాక్టరీలో కూలీ, ఆఫీసులో కుర్రాడు, వర్తకుడి దగ్గర గుమాస్తా, వడ్రంగి దగ్గర పని నేర్చుకుంటున్న అబ్బాయి, హోటెల్‌లో పనివాడు చాలీచాలని జీతం తెచ్చుకుంటూన్న బ్యాంకు గుమాస్తా, పల్లెటూళ్ళో బడిపంతులు, నాటకాల్లో చిల్లరవేషాలు వేసేవాడు, ముద్రాక్షరశాలలో అచ్చుకూర్చేవాడు - ఒహో ఇంకా ఉదాహరణలు గుణించడమెందుకు - బస్సు స్టాండులు, రైలు స్టేషన్ల వద్ద బరువులు మోసేవాడు, పాలాలలో పాలికాపు, పట్టణాలలో కాలువలు తుడిచేవాడు, దారి పక్క భిక్షువు. వైద్యశాలలో రోగి పురుషులదేం కష్టం? కష్టాలనీ, కష్టాల సహనాన్నీ చెప్పాలంటే స్త్రీలని స్మరించు) ఇప్పుడే చచ్చిపోయిన బిడ్డని చేతుల్లో పెట్టుకున్న పదహారేళ్ళ బాలెంతరాలు, మగడు చచ్చిపోయాడని టెలిగ్రాము వస్తే ఏడుస్తూ కూర్చున్న ఇల్లాలు, వృద్ధాప్యం మీద పడినా, చాకిరీ చెయ్యకపోతే దినం వెళ్ళని దీనురాలు, నీళ్ళు తోడుతూ అంట్లుతోముతూ బతికే దాసీది, గతిలేక శరీరాన్ని అమ్ముకునే వేశ్య. వద్దు వద్దు ఇక చాలును. ఎవరు నన్నర్థం చేసుకుంటారో ఎందుకు వేరే చెప్పడం?

ఓహో? అభినవ బుద్ధుడా! ఈ యాతనా ప్రాణాలకు నిర్వాణం సంపాదించడానికా నీ ప్రాణాలు తీసుకుంటున్నావు? ఏ లోకాలకి పోయి, ఏ దేవతల ముందు వాదిస్తావు వీళ్ళకి న్యాయం ఇమ్మని? జీవించు. బతికి ఉండి వీళ్ళకేదయినా తరుణోపాయం ఆలోచించు. ప్రాణాలు నిలుపుకుని వీళ్ళ పక్షాన్ని పోరాడు.

వ్యర్థంగా చచ్చిపోతున్నానా? వీళ్ళనంతా చూస్తూ మరణిస్తున్నానా? ఏమీ చెయ్యలేక నిష్క్రమిస్తున్నానా నేను? మరి ఏమి చేస్తున్నా నా చుట్టూ వెయ్యి రహస్యపు కళ్ళు! ఏం చెయ్యాలనుకున్నా ఇదిగో నా వెనకనే ఒక సి.ఐ.డి ఇదిగో వారంట్! ఇదిగో చెరసాల! ఇదిగో ఉరికొయ్య! మాటకి సంకెళ్ళు. చేతికి నిరోధం. గ్రంథాలకి నిషేధం. ఎన్ని లోపాలున్నా ఈ పద్ధతిని అనుసరించవలసిందే! కాదని ప్రతిఘటిస్తే

వజ్రముష్టితో ఆశనిపాతం! ఈ సంఘర్షణ హెచ్చిపోయి, కలవారికీ, లేనివారికీ తెగతెంపులు జరిగే సంగ్రామంలో, స్పెయిన్‌లో, చీనాలో, అదే యావత్ప్రపంచంలో విజృంభించినప్పుడు ఇవిగో మరఫిరంగులు! ఇవిగో బాంబర్ విమానాలు! ఇదిగో అగ్ని వర్షం! ఇదిగో మృత్యువు! ఇదిగో వినాశనం!

మానవుని మంచితనం గురించి పదే పదే నువ్వు చెబుతావు గాని మనుష్యుడిలో ఎంత కల్మషం అణిగి ఉందో చూడమంటావా? ఔను. ఈ మోసాలు, అబద్ధాలు, అనుమానాలు హత్యలు, ఏ పోలీస్ స్టేషన్‌కి, ఏ క్రిమినల్ కోర్టుకి వెళ్ళినా స్పష్టంగా కనపడతాయి! అమ్మయ్యో! మానవులలో ఎంత దుర్మార్గులున్నారో? వీళ్ళకి శిక్షించకపోతే మరి పట్టపగ్గాలుంటాయా?

ఔనౌను. దగాకోరులని సంఘం నిరసించిన వాళ్ళని నేనెరుగుదును. కాని వాళ్ళ పాపానికి నీకూ, నాకూ, సంఘం మొత్తానికీ ఎంత బాధ్యత ఉన్నదో గుర్తించావా? అధోగతిలో వాళ్ళు కొట్టుకుపోతూ ఉంటే అందరూ ఒక తన్ను తన్ని ఒక రాయి విసిరేవాళ్ళే కాని ఆ పతితులను ఉద్ధరించాలన్న ఆసక్తి చూపిస్తున్న వాళ్ళెందరు? వాళ్ళ పరిస్థితులనూ, మనఃస్థితులనూ జాగ్రత్తగా గమనించి, అర్థం చేసుకుని బాగు చెయ్యవద్దా! ఈ ప్రవర్తనలాన్నీ ఒక విధమైన సాంఘిక రోగాలే కావా? వీటిని మన బుద్ధి వల్ల చికిత్స చేసుకోలేమా?

అందుకే నేను బతకవలసిన అవసరం ఉందంటావు కాదూ? నాలాగే ఆలోచిస్తున్న వ్యక్తులున్నారు. వారికో సంఘం ఉంది. ఒక సిద్ధాంతం, ఒక శిక్షణా, ఒక కార్యక్రమం ఉంది. ప్రపంచం అంతటా ఇట్టి సంఘాలుండడమే కాక, నువ్వు కలలు కంటూన్న ఆశయాలను మానవులందరి కోసం సాధించడమే దీక్షగా గల మహత్తర దేశం ఒకటున్నది. కాబట్టి నాకు నిస్పృహ అనవసరం అంటావు? ఇది నిస్పృహ కాదు నేస్తం! నేను బోధపరచలేను. 'మృత్యు ప్రేమ' అని దీనికో ముద్దు పేరు పెట్టనా? ఔను. నేను జీవితాన్ని నిరాకరించగలిగినంత గాఢంగా మరణాన్ని ప్రేమిస్తున్నాను. నా నిష్క్రమణ ఒక నిష్ఫల కృత్యం కాదు. అదొక కొత్త ప్రవేశం మరో కొత్త ప్రారంభం. అదొక సవాలు. ఒక సాధనం ఒక తిరుగుబాటు. ఒక దృఢ నిశ్చయం.

అరే! పన్నెండుకావస్తోంది.

వీడ్కోలు తీసుకుంటున్నా, మళ్ళా వస్తాను. నాకు తెలుసును. రమణీయమైన ఈ భూలోకానికి నా ఆశీర్వాదం నదులవల్ల, పర్వతాల వల్ల, అరణ్యాల వల్ల, మహానగరాల వల్ల, పల్లెటూళ్ళ వల్ల సౌందర్యాన్ని ప్రదర్శిస్తూ భూలోక అభ్యున్నతి కాంచునుగాక! ఆనకట్టలతో వంతెనలతో, వేనవేల మైళ్ళ ఇనుప దారులతో, విమానాలతో, శాస్త్ర పరిశోధనశాలలతో, టెలిగ్రాఫ్, రేడియో శ్రవణాలతో, సినిమా, టెలివిజన్ నేత్రాలతో మానవత్వం విజృంభించునుగాక. లోకమంతా ఏక కుటుంబమై తన విధిని తానే నిర్ణయించుకోగల శక్తిని మానవుడు సాధించునుగాక!

సరిగ్గా పన్నెండయిందిప్పుడు.

స్వర్గం

కుడిచేతిలో కలం రాస్తూనే ఉంది. ఎడం చేత్తో క్లోరోఫాం సీసా మూస్తున్నాను. గడియారం రెండు ముళ్ళూ కలుసుకున్నాయి. వీటిని నేను విడిపోనివ్వను. ఈ క్షణాల్ని ఇక్కడే నిలబెట్టేస్తాను. ఈ క్షణం కోసం ఆరునెలల నుండి ఆరాటపడుతున్నాను. దీని విచిత్రప్రవర్తనని అర్థం చేసుకుందామని ప్రయత్నించాను. శాశ్వతంగా దీన్నిప్పుడు ఆక్రమిస్తాను. ఏం చేస్తున్నాను? క్లోరోఫారం వాసన చూస్తున్నాను. ఇక్కడే ఉండి కూడా ఎక్కడికో పోతున్నాను ఇదేమిటి? ఎటుపోతున్నాను? ఒక్కమారే అనేక దిక్కులుగా ప్రయాణం చేస్తున్నానేమిటి? ఈ కొవ్వొత్తి దీపం! ఆకాశమంత అయిపోయి గారడీ శాలువలాగ కప్పేస్తోంది నన్ను. గడియారం కనబడలేదు. మౌనం ప్రవహిస్తోంది. ఇదేం ఇలా కరిగిపోతున్నాను! సరిహద్దులు దాటిపోతున్నాను. ఎన్ని నిచ్చెనలో! అడ్డుగా, నిలువుగా, గళ్ళు గళ్ళుగా! పరుగెత్తుతున్న జామెట్రీ, కలుసుకొంటూన్న సమానాంతర రేఖలు, సముద్రాకాశాల సంగీతం జ్ఞాపకాలతో కలిసి స్వప్నాలు చేసే నాట్యం, నిరీశ్వర సాక్షాత్కారం.

నిరాధరంగా, నిరాకారంగా తేలిపోతున్నాను. నిరీశ్వరుడితో నిండిపోతున్నాను. ఈశ్వరుడి ఇంకోవైపుకి పోతున్నాను. పరాజయాల కాల్బలాలతో, పరాభవాల నౌకాదళాలతో, అనుమానాల విమానాలతో దండయాత్ర సాగిస్తున్నాను. "దేవుడు లేడు" అని నేనన్నప్పుడు నా ఉద్దేశం "దేవుడు ఉన్నాడు" అని. ఇది ఎవరి కర్థం అవుతుంది? నా "ఔను"కి "కా"దని. నా "ఉంది"కి "లే"దనే అర్థం ఉందనీ, లేదనీ, ఉండి లేదనీ, లేక ఉందనీ ఎలా నచ్చచెప్పగలను?

అర్ధరాత్రి ఇప్పుడు! అయితే ఈ సూర్యుడేమిటి? (కొవ్వొత్తి వెలుగంటారు నాకు తెలుసును.)

ఇది మరణం అంటారు. కాదంటాను నేను. ఎప్పుడూ నేను పెడసరంగానే వాదిస్తానేం? అందరూ వద్దంటున్న పనులు చేస్తానేం? ఎప్పుడూ ఇంకోవైపు చూస్తానేం? (అన్నింటికీ ఇంకోవేపు ఉన్నది కాబట్టి) అన్నిటికన్నా విశేషం: నిరీశ్వరుడే ప్రత్యక్షమై "నేనున్నాను" అంటే నమ్మకం లేకుండానే నమ్మకాన్ని ప్రకటిస్తాను.

ఒకచోట గురజాడ ఇలా అన్నాడు.

"దేవతలతో జోడు కూడితి
రక్కసులతో కూడి ఆడితి
కొత్త మిన్కుల తెలివి పటిమను
మంచి చెడ్డల మార్చితిన్!"

ప్రస్తుతం నేను చేస్తున్న పని కూడా అదే. అంచుల దగ్గిర అంతా యాదృచ్ఛికమే! అక్కడ పరమాణువుల ప్రవర్తనని గాని, జీవాణువుల స్వభావాన్ని గాని, ఇదమిత్థమని నిర్ణయించలేము. ఇదో కఠోరమైన గందరగోళమైన బీజగణిత సమస్య. ధన ఋణ సంజ్ఞలను బట్టి బ్రాకెట్లను విప్పుకుంటూ వెళ్ళాలి. ఎక్కడ ఒక్క సంజ్ఞ తప్పినా లెక్కంతా తప్పుతుంది.

-(a-a) +(b-b)-(c-c)+(d-d)...?

- (ఔను - కాదు) + (మంచి - చెడు) - (వెలుగు - చీకటి) + (చావు - బతుకు)... =?

ఈ లెక్కని ఎందరు ఎన్నిమార్లు చేస్తే అన్ని జవాబులు వస్తాయి. అందుకే ఎవరి ఆవరణల మధ్య వాళ్ళు ఇమిడిపోతారు. తమకు వెలుపల ఉన్న సంజ్ఞ ఏమిటో కూడా వాళ్ళకి తెలియదు. అన్ని ఆవరణలకీ వెలుపల ఏ సంజ్ఞ ఉందో అసలే తెలియదు. మొత్తం మీద ఈ లెక్కకి జవాబు సున్నా అని గాని, ఒకటి అనిగాని నిర్ధారణగా ఎవరూ చెప్పలేరు.

-(1+1)=-2

+(1+1)=+2, అని లెక్కచేసి, ద్వైతులు రెండంటారు.

+(1-1)=0

+(1-1)=0 అని లెక్కచేసి, మిధ్యావాదులు సున్నా అంటారు. నేనొక్కణ్ణే ఏ తర్కానికీ లొంగకుండా, వెలుపలి సంజ్ఞ ఏదయినా లక్ష్యపెట్టకుండా

1-1=1

1+1=1 అని అనడం మానలేదు.

అంటే దీని అర్థం; ఔను / కాదు, మంచి / చెడ్డ, వెలుగు / చీకటి, చావు / బ్రతుకు, మనిషి / దేవుడు, అంతా ఒకటే అని. ఇందు మూలంగా శూన్యం మీదనూ, అనేకం మీదను ఏకాకిని గల ఆధిక్యాన్ని ఉగ్గడిస్తున్నాను. ఈ ఏకం ఎవరో కాదు. మానవుడు. అతడే సత్యం. అతడే నిత్యం అతడే ఈశ్వరుడు.

జీవించినా, మరణించినా నేను నేనే కాబట్టి జీవితం సుఖమనీ, మరణం దుఃఖమనీ, జీవితం బానిసతనం, మరణం స్వాతంత్ర్యం అనిగాని వాదించడం మానేస్తున్నాను. పరస్పర ప్రేమ వల్ల మానవులంతా సమానులవుతారు. ప్రతి మనిషీ రెండో వాడిలో తన్నూ, దేవుడు చూస్తాడు కాబట్టి ప్రపంచంలో వైషమ్యాలకూ, వైకల్యాలకూ తావుండదు.

ఇదీ నా ఆలోచనల గమ్యస్థానం. భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలను ఒకే క్షణంగా ముద్ద చేసి నేను కల్పించుకున్న, నేను నివసిస్తున్న స్వర్గం, ఇక్కడ నాకు ఒంటరితనం లేదు నాతోబాటు ఆమె కూడా అనంతంగా తేలిపోతోంది. ఆమె ఎక్కడో, నేనెక్కడో అనుకోవద్దు. నన్ను కలుసుకోవడానికి ఆమె మరణించక్కర్లేదు. ఇద్దరం కలిసే ఇక్కడలో, ఇప్పుడులో ఈదుకుపోతున్నాం. రెండు స్వప్నాలు, రెండు మృతకళేబరాలు. రెండు కళేబరాల కార్తిక దీపాలు. (ప్రమిదా, కొవ్వొత్తీ) ఇంకా రెండేమిటి? ఒకే ఒక తనం. ఒకే రెండు తనం లేకపోవడం ఒకే నిండుతనం.

ఓహో! సత్యాసత్యాలకవతల సాఫల్యం! నిత్యానిత్యాలను మించిన సాంగత్యం! మానవ మనశ్శాఖల మీద పుష్పించిన సంగీతం! అనేక స్థలాలలో ఏకకాలమే జీవిస్తున్న అనుభవం! ఏకకాలంలో ఉండడాన్నీ, ఉండకపోవడాన్నీ సాధించే స్వాతంత్ర్యం. అది నా కామ్యం.. ఇది గమ్యం! ఇదీ నా స్వర్గం.

❀❀❀

గుండె తడి – పంతుల జోగారావు

(ఆంధ్రప్రభ 6-6-1990)

సుందరానికి ప్రస్తుతం తనున్న పరిస్థితి అయోమయంగా ఉంది. అసహనంగానూ ఉంది. అసలు తనిలాంటి పరిస్థితిలో ఇరుక్కోవాల్సి వస్తుందని ఎప్పుడూ ఊహించనయినా లేదు. తన మీద తనకే జాలి వేసింది. తన మీద తనకే కోపం వచ్చింది. తిక్కగా ఉంది. బహుశా ఎవరూ తన లాగా ఇలా తెలివి తక్కువగా ప్రవర్తించరు. ప్రవర్తించి ఇలాంటి లజ్జాకరమైన పరిస్థితులు కొని తెచ్చుకోరు.

అతను ఆ ఎరుపు రంగు గోడల మధ్యకి వచ్చి అప్పుడే దాదాపు నాలుగు గంటలవుతోంది. తనని తీసుకుని వచ్చి అక్కడ కుదేసిన కానిస్టేబులు మరింక అయిపులేడు. తనింకా ఈ పోలీస్ స్టేషనులో ఎంతసేపు ఉండాలో తెలీడంలేదు. చివరికి తన పరిస్థితి ఎలా పరిణమించబోతోందో ఊహకి అందడం లేదు. ఈ చిక్కుముడి విప్పుకోగలడా? ఈ సాలెగూడు లోంచి సురక్షితంగా బయట పడగలడా అనే సందేహం అతనిని వేధిస్తోంది.

దాహం వేధిస్తోంది. అవమానంతో, బెంగతో ఆకలి ఎప్పుడో చచ్చిపోయింది. ఎవరయినా కొంచెం మంచి నీళ్ళు ఇస్తే బాగుణ్ను. ఎవరి నడగాలో తెలీదు. అల్లంత దూరంలో రైటరు కాబోలు, దీక్షగా ఏదో రాసుకుంటూ తల అసలు పక్కలకి తిప్పడమే లేదు. ఒకరో ఇద్దరో పో లీసు జవాన్లు అటూ ఇటూ తచ్చాడుతున్నప్పటికీ, ఎవరూ తన ఉనికిని గుర్తించడంలేదు.

తను కూర్చున్న బెంచీ మీద అసహనంగా కదిలాడు సుందరం. సన్నగా పాడి దగ్గు దగ్గాడు. అటు వేపు వెళుతున్న ఓ పోలీసు ఆగి, సుందరం కళ్ళలోకి సూటిగా చూసాడు. 'ఏంకావాలి బే' అన్నట్టుగా పొగరుగా తలెగరేసాడు. సుందరం భయంతో కుచించుకుపోయాడు. దాహంతో పిడుచ కట్టిపోతున్న నోరు మరి పెగల్లేదు. సుందరం మాట్లాడకుండా జావ కారి పోవడం చూసి, విజయం వరించిన వీరుడిలా నవ్వుకుంటూ అక్కడి నుండి వెళ్ళిపోయాడు ఆ కానిస్టేబులు.

ఆ ఎర్ర గదిలో సుందరం మళ్ళీ ఒంటరివాడైపోయాడు. సుందరానికి దుఃఖం గొంతుకలోకొచ్చి గరగరలాడింది.

ఎన్నో వేగిరం వస్తే బాగుండును. తను చెప్పదలచుకున్నదేదో అతని తోనే చెప్పుకోవచ్చును. వింటే సరే సరి. అతను కూడా తన మాటలు పట్టించుకోకపోతేనో? మొదటిసారిగా ఆ ఆలోచన వచ్చి సుందరం సన్నగా జలదరించుకుపోయాడు. భయం ఒక చిన్న ప్రకంపనలా మొదలై ఉత్తుంగ తరంగమై, కల్లోలిత నీరధిగా మారి, అతని మస్తిష్కాన్ని కుదిపి కుదిపి వదిలింది. ఇంత వరకూ తన గోడు ఎన్నో అర్ధం అవుతుందనీ, అతను తనని సహృదయంతో అర్ధం చేసుకోగలడనే ఆశ చిరుదీపంలా అతనికి ఉండేది. ఆ ఆశ కూడా ఇప్పుడు సందేహాస్పదమయ్యే సరికి సుందరం పూర్తిగా కృంగిపోయాడు. తల భారంగా తయారయింది. నీరసం కమ్ముకొస్తోంది. నిస్త్రాణగా తల వెనక్కి వాల్చి, బరువుగా కళ్ళుమూసుకున్నాడు.

అసలు తనీ ఊరు ఎందుకొచ్చినట్టు, ఈ ఊళ్ళో తనకేం పనుంది? పనిమాలి ఇక్కడికొచ్చి కాలికి బలపం కట్టుకుని పిచ్చి పిచ్చిగా ఊరంతా తగుదునమ్మా అని చుట్టబెట్టాడు. చివరికేమయింది? ఆ బుర్ర మీసాల పోలీసు దృష్టిలో పడ్డాడు. 'నాకేం తెలియదు మొర్రో నన్ను వదిలెయ్యి' అని కాళ్ళూ గెడ్డం పట్టుకుని వేళ్ళాడినా కనికరించలేదు. చుట్టూ ఉన్న జనం కూడా తనని ఒక గొప్ప దోషిలా చూసారు. సంఘానికి కీడు చేసే తక్షణ శత్రువులాగా భావించారు. క్షమించరాని నేరస్థుడిగా నిర్ణయించారు. తనలాంటి నేరస్తుడ్ని వెంటనే బొక్కలోకి తోసి, శిక్షించకపోతే శాంతి భద్రతలకి తీవ్రమయిన అఘాతం ఏర్పడుతుందని తీర్మానించారు.

ఫలితంగా తనిక్కడికి వచ్చి పడ్డాడు. తిండీ తిప్పలూ లేవు. తనగోడు పట్టించుకునే నాధుడూ లేడు. గుడ్డిలో మెల్ల. తనని తీసుకొచ్చిన పోలీసు తనని నేరుగా కొట్లో తోసెయ్యలేదు. స్టేషనులోకి తీసుకొచ్చాక, వసారా ముందు గది దాటాక ఈ గదిలోకి నడిపించు కొచ్చి పాడవాటి బల్లమీద కూచోమని శాసించాడు. దేబిరిస్తున్నట్టుగా చివరి ప్రయత్నంగా తను ఏదో అనబోతే పురుగుని దులపరించినట్టు అదిలించాడు. తన మొర వినే కర్మ తనకేమీ పట్టనట్టుగా ప్రవర్తించాడు.

ఏం చేయాలో తోచక ఆ బల్లమీద చతికిల బడ్డాడు సుందరం. అలా తీసుకుని వచ్చిన తనని ఎప్పుడు వదిలేస్తారో, అసలు వదలరో, జైల్లో పడేస్తారో, లేదా ఏ నేరమో మోపి కోర్టుకి కట్టేస్తారో కూడా తెలీడం లేదు సుందరానికి.

సుందరానికి ఏడుపొస్తోంది. అవును. తనని ఏకారణమూ లేకుండానే ఆ బుర్ర మీసాల పోలీసు లాక్కొచ్చి ఇక్కడ పడేసాడు. కేవలం.. కేవలం.. అనుమానం మీదే తనని లాక్కొచ్చాడు.

ఈ దేశంలో పోలీసులు తమకి విస్తృతమైన అధికారాలు సంక్రమింపజేసుకున్నారు.

ఒక వ్యక్తిని ఏ అభియోగమూ లేకుండానే తెచ్చి, జైల్లో పడెయ్యవచ్చు. నెలల తరబడి వేధించవచ్చు. అనుమానుషంగా బాధింప వచ్చు. అసభ్య పదజాలంతో అవమానించ వచ్చు.

ఆలోచిస్తున్న కొద్దీ సుందరానికి మెదడు వేడెక్కిపోతోంది.

అసలు తనకీ ఊరు రావాలనే ఆలోచన కలగకపోతే, ఇప్పుడీ అనర్ధం జరిగేది కాదు. తనకీ అవస్థ ఏర్పడి ఉండేదీ కాదు. సుందరం ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో అలా అనుకున్నాడే కానీ, అతనీ ఊరురాకుండా ఎలా ఉండగలడు? ఈ ఊరి మీద అతనికున్న మమకారం రాకుండా ఊరుకోనిస్తుందా?

నిజానికి ఇంటి దగ్గర బయలుదేరేటప్పుడు సుందరానికీ ఊరు రావాలనే ఆలోచనే లేదు. కంపెనీ పనిమీద ప్రయాణమై వచ్చాడు - ఇక్కడికి ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉండే పట్నానికి. తీరా తన పని చేసుకుని ఇంటికి తిరిగి వెళ్ళిపోదామనుకుంటూండగా, యధాలాపంగా ఈ గ్రామం పేరు తన చెవిని పడింది. తనీ గ్రామానికి మరీ చేరువలోకి వచ్చాడని తెలిసి మనసు ఆనందంతో ఉప్పొంగిపోయింది.

ఇది తను పుట్టిన ఊరు.

తనకు జన్మనిచ్చిన స్థలం.

బాల్యంలో కొద్దికాలం ఇక్కడ గడిచిందంతే. తర్వాత ఈ ఊరి ముఖమే చూడలేదు. ఈ గ్రామం పేరు విని, అనిర్వచనీయమైన ఆనందానుభూతికి లోనయ్యాడు. ఎక్కడో కోస్తా జిల్లాలో ఆ మూల ఉంటున్న తనకి మళ్ళీ ఇంత దూరం వచ్చే అవకాశం చిక్కుతుందన్న ఆశలేదు. ఖర్చులు కంపెనీ భరిస్తోంది కనక గానీ, తనంత తానుగా డబ్బు ఖర్చు చేసి ఈ ప్రాంతాలకి జీవితకాలంలో మళ్ళీ వచ్చే అవకాశం శూన్యం.

మళ్ళీ మళ్ళీ ఇంత దూరం రాలేడని తనకి తెలుసు. రానూ పోనూ పాతిక రూపాయల ఖర్చుతో పుట్టిన ఊరిని చూడగలిగే భాగ్యం కలుగుతున్నందుకు ఆనందంతో ఊగిపోయాడు. పరవశించిపోయాడు.

ఈ ఊరు...

ఇక్కడే తన తల్లి తనకు జన్మ నిచ్చింది. మొదటిసారిగా తను కనులు విప్పి ఈ లోకాన్ని చూడగలిగింది ఈ నేల తల్లి ఒడిలోనే. ఈ ఊరు పేరు వింటేనే చాలు తన మనసు సంతోషంతో పులికించి పోతుంది. రెక్కలొచ్చిన పక్షిలా ఊహాలోకాల్లోకి ఎగిరిపోతుంది. ఆనందం అర్ణవమౌతుంది.

తాతగారిక్కడ ప్రైవేటు డాక్టరుగా ఓ క్లినిక్ నడుపుతూ ఉండేవారు. అప్పట్లో అతనికి 'డాక్టర్ బాబాయ్'గా ఎంతో ప్రసిద్ధి ఉండేది. రోగుల్ని ఎంతో ప్రేమగా, స్వంత మనుషులుగా చూసుకునేవారని చెప్పుకునేవారు. తన తండ్రి ఆ ఇంటికి పెద్దల్లుడు. అప్పట్లో ఆ ఇల్లు - కొడుకులూ, కోడళ్ళూ, మనుమలూ, మనవరాళ్ళతో కళకళలాడి పోతూ ఉండేది.

తనిప్పుడు యాభయ్యో పడిలో పడ్డాడు. ఇదంతా ఎప్పుడో తన చిన్నప్పటి ముచ్చట. అప్పటి సంఘటనలు ఒకటీ అరా తప్ప, తనకసలు గుర్తులేవు. గుర్తుండే అవకాశమూ లేదు. సెలవుల్లో మూడు రైళ్ళు మారి, అమ్మా నాన్నలతో అమ్మమ్మ గారింటికి, ఈ ఊరు రావడం! ఊరైతే గుర్తులేదు గాని, ఆ ఇంటిని తను మరిచిపోలేడు.

బాల్యంలో తన లేత మనసు మీద పడిన ఆ అనుభూతి ముద్రల చిన్నెలు ఎప్పటికీ చెరిగిపోయేవికావు.

గ్రామం, గ్రామంలో ఇతర పరిసరాలూ, వాటి గుర్తులూ తన స్మృతి పథంలో ఏమాత్రం నిలవలేదు.

కాని, ఆ ఇల్లు బాగా గుర్తు, ***అనుభూతి వైయక్తికం. అది కలిగించే ఆర్ద్రత కూడా వ్యక్తిగతమే.***

విశాలమయిన ఆవరణలో ఉండేదా ఇల్లు. ఇంటి ముందు వెదురు బద్దలతో అల్లిన ఫెన్సింగు. ఇంటి ముందు వేసిన పందిరి మీదకి ప్రాకి, గుబురుగా అల్లుకున్న సన్నజాజి. ఓ ప్రక్కగా తెల్లవారేసరికి గంపెడు పూలను విరబూసే తెల్ల గన్నేరు చెట్టు. నూతి ప్రక్కన క్రోటన్స్. రాత్రివేళ, వాటి వాసనలు మత్తుగా, గమ్మత్తుగా ఉండేవి. ముఖ్యంగా పెరటి వేపు కొద్దిపాటి దూరంలో ఎత్తయిన మెట్ట ఉండేది. దాని మీద కోతులు యధేచ్ఛగా తిరుగాడేవి. అప్పటి తన పసి మనసుకి వాటి సంఖ్య అసంఖ్యాకంగా తోచేది. అవి చేసే అల్లరి చెప్పనలవి కానిదిగా ఉండేది. విప్పారిన నేత్రాలతో విస్తుపోతూ వాటి ఆగడాలని చూసేవాడు తను. బాల్యంలో అప్పుడా ఇల్లూ, దాని పరిసరాలూ తనకొక వింత ప్రపంచం. ఒక డిస్నీలాండ్!

తను పుట్టిన ఆ గ్రామాన్ని ఒకసారి కళ్ళారా చూడాలని అనిపించి వచ్చాడు. దాదాపు అయిదు దశాబ్దాల తరువాత ఆ ఇంటిని చూడబోవడం - మాటలకీ, ఊహలకీ అందని ఒక అందమైన అనుభవం. మరచి పోలేని మధురమైన అనుభూతి. జీవిత చరమాంకంలో నెమరు వేసుకోడానికి మిగిలే తీయని జ్ఞాపకం.

అందుకే, శరీరం అంతగా సహకరించక పోయినా, డబ్బు చాలకపోయినా, డబ్బు చాలీ చాలనట్టుగా ఉన్నా.. ఒకవిధమైన పట్టుదలతో ఇక్కడి కొచ్చాడు.

తెల్లవారు ఝామునే రైలెక్కి పొద్దెక్కకుండానే ఈ ఊరు చేరాడు. అనుకోని విధంగా కేంప్ పాడిగించాల్సి వచ్చి బట్టలు బాగా నలిగి పోయినా ఖాతరు చెయ్యలేదు. గడ్డం మాసిందన్న స్పృహ కూడా లేదు. ఈ ఊరు చూడాలనే ఉబలాటంతో రాత్రంతా నిద్రపట్టక అటూ, ఇటూ దొర్లుతూ గడిపాడేమో - కళ్ళు చింత నిప్పుల్లా తయారయాయి.

తనా అవతారంతో ఎవరికయినా అనుమానాస్పద వ్యక్తిగా తోచవచ్చునని సుందరానికి ఎందుచేతనో తట్టనే లేదు.

రైలు దిగి, ఊళ్ళోకి అడుగు పెడుతూనే స్వర్గం లోకి అడుగు పెట్టిన వాడిలా అనుభూతి చెందాడు సుందరం. ఏ నిర్వచనానికీ లొంగని భావోద్రేకంతో కదిలిపోయాడు.

తను పుట్టిన గడ్డమీద ఎన్నో సంవత్సరాల తర్వాత అడుగు పెట్టడం అతనికి వింత అనుభవంలా తోచింది. తాతగారి మరణంతో తమకి ఈ ఊరితో అనుబంధం తెగిపోయి అప్పుడే దాదాపు నలభయ్ అయిదేళ్ళు కావస్తోంది. మామయ్యలూ, పిన్నీ అంతా తలో దిక్కుకీ చెదిరిపోయారు. అమ్మమ్మ చివరి ఊపిరి తన తండ్రి చేతుల్లోనే వదిలింది. తండ్రి ఉద్యోగం కోస్తా జిల్లాలో మారుమూల. తాతగారి ఊరుతో తనకే కాక అమ్మ వేపు బంధువులకి కూడా ఋణం తీరిపోయింది. అంతా ఈ గ్రామానికి కొన్ని వందల మైళ్ళ దూరం చెదిరిపోయారు. దాదాపు అందరూ మరచిపోయారు - తను మాత్రం మెదడు పొరల్లో నిక్షిప్తమైన ఆ జ్ఞాపకాలని మరచిపోలేకపోయాడు.

పెరిగిన బాధ్యతలూ, జీవిత పోరాటంలో అలిసిపోయి తను, మళ్ళీ ఆ గ్రామం చూడగలడని ఊహించనయినా లేదు. అనుకోకుండా అవకాశం చిక్కింది. ఉబ్బితబ్బయిపోయాడు. ఇక్కడికొచ్చి వాలాడు.

తీరా గ్రామంలోకి అడుగు పెట్టిన తను ఆ ఇంటిని ఎలా కనుక్కోగలడనే సందేహం మొదటిసారి మొలకెత్తింది సుందరానికి. తెలీని ఉద్వేగంతో వచ్చేసాడే కాని, ఆ చిన్నప్పటి ఇంటిని కనుక్కోవడం ఎలాగ?

అదంత సులభ సాధ్యమైన విషయం కాదనిపించింది సుందరానికి. ఆ ఇల్లు ఇంటి వాతావరణమైతే స్పష్టంగా గుర్తుంది. కానీ, అదెక్కడుందో ఊహకందడం లేదు. తన పసితనపు అనుభూతులన్నీ ఆ ఇంటితోనే పెనవేసుకుని పోయాయి తప్ప, ఊర్లో తక్కిన ప్రదేశాలేవీ తనకి పరిచిత పూర్వాలు కావు. మరెలా ఆ ఇంటిని గుర్తుపట్టడం? ఇంతకీ ఆ ఇల్లు పూర్వంలాగే ఉండి ఉంటుందని తనెలా అనుకున్నాడో సుందరానికి ఓ పట్టాన అర్థంకాలేదు. ఆ పాత పెంకుటింటి స్థానంలో ఏ భవనం వెలిసిందో? ఆ ఇల్లు మార్పులకి లోనయిందో? ఈ విషయం ఇంతవరకూ తనకి స్ఫురించనందుకు సుందరం చకితుడయ్యాడు. తన మనసులో ఈ ఇల్లు ఏ మార్పూ చెందకుండా పచ్చగా ఉండాలనే కోరిక స్ఫుటంగా నిబిడీకృతం కావడం వల్లనే కాబోలు, తనకా ఆలోచన రాలేదు. సుందరానికి నవ్వొచ్చింది. అయినా పట్టుదల సడల లేదు. ఆ ఇంటిని వెతుక్కుంటూ ఊరంతా తిరిగాడు. వీధి వీధీ గాలించి చూసాడు. మూల మూలలూ జల్లెడ వేసినట్టూ పరిశీలించాడు. అలుపూ సొలుపూ లేకుండా తిరిగాడు. పిచ్చి పిచ్చిగా తిరిగాడు. బరువెక్కిన గుండెతో, చెమ్మగిల్లిన కళ్ళతో, తన చిన్నప్పటి ఇంటికోసం వెతుక్కున్నాడు.

ఎంత తిరిగినా ఆ ఇల్లు కనబడలేదు.

సుందరం కనీసం - ఆ ఇల్లు ఉండే పరిసరాలని కూడా పోల్చుకోలేకపోయాడు. ఊరంతా కొత్త కొత్త బిల్డింగులు లేచాయి. ఊరు ఆ ఏభై యేళ్ళలో తెగ బలిసి పోయింది. అక్కడా అక్కడా కొన్ని పాత ఇళ్ళు కనిపించినా, వాటిలో తన ఇల్లు లేదు.

తన బాల్యం తన ఎదుటనే తునా తునకలై పోయినట్టయింది సుందరానికి.

తన గుండె పొరల్లోంచి, ఒక అందాన్ని - ఒక అద్భుతాన్ని ఎవరో బలవంతాన పెకిలించి వేసినట్టయింది. ఇంతకన్నా దారుణమైన ఓటమి జీవితంలో ఉండదేమో అనిపించింది.

ఎంతో పదిలంగా దాచుకున్న ఊహల విరజాజి వాడి వత్తలైంది.

బాల్యం బ్రద్దలైంది.

జన్మనిచ్చిన అమ్మ ఆ ఇంట్లోనే కన్ను మూసింది. ఆ సన్నజాజి పందిరి కిందే ఉగ్గు పట్టింది అమ్మ! ఆ గన్నేరు పూలు తన చేత ఏరిస్తూ ఎన్నో ఊసులు చెప్పేది అమ్మ. ఆ ఇంటిని చూడ గలిగితే అమ్మని మళ్ళీ చూసినంత తృప్తి తనకి దక్కేది.

సుందరం గుండె ఆవేదనతో బరువెక్కింది. ఆ సుందర స్వప్నాన్ని తనకి కనబడనీయకుండా ఎవరు చెరిపేసారు? అతని మనసు బాధగా మూలిగింది.

ఎండ రాను రాను తీక్షణమవుతోంది. ఎండ వేడిమినీ, ప్రయాసనీ లక్ష్యపెట్టే స్థితిలో లేడు సుందరం. రెట్టించిన పట్టుదలతో మరోసారి ఊరంతా చుట్టబెట్టాడు.

ఫలితం శూన్యం. నిస్త్రాణగా ఓ చోట స్థబ్దంగా నిలబడిపోయాడు. సరిగ్గా ఆ పరిస్థితిలో అతని దగ్గరికొచ్చాడు. బుగ్గమీసాల పోలీసు కానిస్టేబులు. అనుమానంగా సుందరం కళ్ళలోకి సూటిగా చూసాడు. ఉదయం నుంచీ తిరిగి తిరిగి అలిసిపోయాడేమో - సుందరం రూపం మరింత వికారంగా తయారయింది. కళ్ళలోకి సూటిగా చూసాడు. ఉదయం నుంచి తిరిగి తిరిగి అలసిపోయాడేమో - సుందరం రూపం మరింత వికారంగా తయారయింది. మాసిన బట్టలూ, చెమటతో జిడ్డుకారుతున్న ముఖం, భుజాన వేలాడుతూన్న సంచీ - అతనిలో ఏ సందేహాలని రేకెత్తించాయో... దగ్గరికొచ్చి ఆరాలు తీయడం ప్రారంభించాడు. సుందరం మాట్లాడే కోస్తా జిల్లాల యాస విని, వింతగా చూసాడు. అతికీ అతకని భావప్రకటనలతో అతను చెప్పే మాటలు ఆ పోలీసులో అనుమానాన్ని మరింతగా బలపరిచాయి.

తన వెంట స్టేషనుకి రమ్మని హుంకరించాడు. పరిస్థితి అర్థం కావడం మొదలయ్యేసరికి సుందరంలో కలవరపాటు మొదలయింది. ఏదో చెప్పడానికి ప్రయత్నించాడు. దీనంగా వేడుకున్నాడు. చేతులెత్తి దండం పెట్టాడు. అతను బలవంతంగా జబ్బ పట్టుకుంటే పెనుగులాడాడు. చుట్టూ జనం మూగి, పరిస్థితి మరింత గందరగోళంగా తయారయింది. తలొకరూ తలో వ్యాఖ్యానం చేసారు. మొత్తానికి అందరూ కలిసి, సుందరాన్ని దోషిగా నిలబెట్టేసారు.

ఇటీవల గ్రామంలో పెచ్చు పెరిగిపోతున్న జేబు దొంగతనాలకు బాధ్యత అతని మీదకు నెట్టారు. ఉన్నట్టుండి పేదలు ఉండే ప్రాంతాలలో గుడిసెలు భగ్గున అంటుకోడానికి కారణం సుందరమే అని తీర్మానించారు.

తీవ్రవాది కాబోలని సందేహించిన వాళ్ళూ లేకపోలేదు.

సుందరం నిలువునా క్రుంగిపోయాడు అతనికి జవసత్వాలు ఉడిగిపోయినట్లయింది. మనిషి అచేతనుడయ్యాడు. సుందరాన్ని నెట్టుకుంటూ పోలీసు స్టేషనుకి దారి తీసాడు - బుర్ర మీసాల పోలీసు.

అవమానంతో, ఆరాటంతో, సిగ్గుతో తల కుదించుకు పోగా అతని వెంట నడిచాడు సుందరం.

అలికిడి వినిపించి బరువుగా కళ్ళు తెరిచాడు సుందరం. స్టేషన్లో జవాన్లు ముందు గదిలోకి చేరారు. ఎస్సై వచ్చాడు. తనున్న చోటు నుంచి కొంచెం ముందుకి వంగి చూసే, అతని ముఖం కనిపిస్తోంది సుందరానికి. ఎస్సై వయసులో చిన్నవాడే ముఖంలో కాఠిన్యం అంతగా కనిపించడంలేదు. వృత్తిలోని కఠినత్వం అతన్నింకా కల్మష పరిచినట్టు లేదు. తన మొర వింటాడనే ఆశ చిగురించింది సుందరం మనసులో. ముఖాన పట్టిన చెమట జిడ్డు అరచేతులతో రుద్దుకున్నాడు. లేవబోయాడు. నీరసంతో శరీరం తూలినట్టయింది. మళ్ళీ బెంచీ మీద కూలబడ్డాడు.

ఎస్సై నుంచి తనకి కబురొస్తుందని క్షణాలు లెక్కపెట్టుకుంటూ కూచున్నాడు. నిముషాలు బరువుగా గడుస్తున్నాయి. చాలాసేపటికి - సుందరాన్ని స్టేషనుకి లాక్కుని వచ్చిన కానిస్టేబులు ఎస్సైతో ఏదో చెప్పాడు. మరో పది నిముషాలకి సుందరానికి ఎస్సై నుంచి రమ్మని కబురొచ్చింది. పడుతూ లేస్తూ వెళ్ళి ఎస్సై టేబులు ముందు కూర్చున్నాడు. నిముషాలు బరువుగా గడుస్తున్నాయి. చాలా సేపటికి - సుందరాన్ని స్టేషనుకి లాక్కుని వచ్చిన కానిస్టేబులు ఎస్సైతో ఏదో చెప్పాడు.

ఎస్సై లోతుగా సుందరం కళ్ళలోకి చూసాడు. సంగతేమిటన్నట్లు కళ్ళెగరేసాడు. తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే ఆఖరి అవకాశాన్ని చెయ్యి జారిపోనివ్వదల్చలేదు సుందరం. అతనిలో లేని తెగింపు పుట్టుకొచ్చింది.

ఒక్కొక్క మాటా పేర్చుకుంటూ అయినా సూటిగానే తన వైనం అంతా పూస గుచ్చినట్టు చెప్పుకొచ్చాడు. అంతా చెప్పి చివరికి.. "సార్!.. నన్ను నమ్మండి. చిన్న చిన్న అనుభూతుల కోసం వెంపర్లాడే సగటు ప్రాణం సార్ నాది! నా చిన్నప్పటి ఇంటినీ, అక్కడే చచ్చిపోయిన మా అమ్మ స్మృతుల్నీ, నా బాల్యాన్నీ చూసుకోవాలనే ఆరాటంతో ఊరంతా తిరిగాను సార్.. చేవ చచ్చిన జీవితంలో చేదు మిగిల్చే వర్తమానం నుండీ ఒక్కసారి ..ఒకే ఒక్కసారి.. పసితనపు మిసిమి ఛాయల్లోకి తొంగి చూదామన్న ఉబలాటం తప్ప - మరే నేర ప్రవృత్తీ నాకు లేదు సార్. నన్ను నమ్మండి.." అని వేడుకున్నాడు. డగ్గుత్తికతో సుందరం గొంతు జీరబోయింది.

ఎస్సై వదనంలో గాంభీర్యం చోటునే రవంత ప్రసన్నత చోటు చేసుకుంది. మంచి నీళ్ళు తెప్పించి సుందరం చేత తాగించాడు. ఓదార్పుగా చూస్తూ కూచోమని కుర్చీ చూపించాడు.

సుందరం కాస్త స్థిమిత పడ్డాక తక్కిన వివరాలడిగాడు.

"అన్నట్టు మీ తాతగారి పేరు ఏమిటన్నారు? ఈ ఊళ్ళో తనేంచేస్తుండేవారు?"అని.

"మా తాతగారి పేరు లక్ష్మణ మూర్తిగారు. ప్రయివేటు డాక్టరు. అంతా 'డాక్టరు బాబాయ్' అనేవారు." చెప్పాడు సుందరం.

ఆ మాట వింటూనే చప్పున లేచి నుంచున్నాడు ఎస్సై. "వాటె సర్ప్రైజ్! డాక్టరు బాబాయ్ గారు మీ తాతగారా! మా నాన్నగారు చెబుతూ ఉండేవారు. వారి తండ్రిగారు, అంటే మా తాతగారు తీవ్రంగా జబ్బుపడినప్పుడు వైద్యం చేసి, ప్రాణదానం చేసి రక్షించింది డాక్టరు బాబాయ్ గారేనట! వారి గురుంచీ, వారి మంచితనం గురించీ మా నాన్నగారు ఎన్నోసార్లు చెబుతూ ఉండేవారు. అయితే, ఉద్యోగరీత్యా నేనీ ఊరు రావడమే తప్ప, నేను లోగడ ఇక్కడకి రాలేదు. చాలా సంతోషం.. మీ మనసు మా వాళ్ళ వల్ల గాయపడితే మన్నించండి. మిమ్మల్ని అనుమానించి తీసుకొచ్చి మీ మనసెంత గాయపరిచాడో, మా కానిస్టేబులు. అందుకు నేను సిగ్గుపడుతున్నాను..." అంటూ ఏవేవో చెప్పాడు.

సుందరానికి ఆ మాటలు సంభ్రమంగానూ, తట్టుకోలేనంత సంతోషంగానూ అనిపించాయి. తరువాత ఆ మాటా ఈ మాటా మాట్లాడుకున్నాక, సుందరాన్ని సాదరంగా వీడ్కోలిచ్చి పంపించాడు ఎస్సై.

తను ఆశించింది సాంతం నెరవేరకపోయినా, అదో విధమైన తృప్తితో బస్సెక్కాడు సుందరం.

❀❀❀

సుందరాన్ని సాగనంపి, స్టేషను గదిలోకి తిరిగి వచ్చిన ఎస్సైని చూస్తూ వింతగా కళ్ళప్పగించి ఉండిపోయాడు బుర్రమీసాల పోలీసు కానిస్టేబులు. జరిగిన తప్పిదంలో తన భాగస్వామ్యం ఎంతో నిర్ధారించుకోలేక, నీళ్ళు నములుతూ 'సార్..' అంటూ ఏదో చెప్పబోయాడు.

అతన్ని కళ్ళతోనే వారించి, ఎస్సై ఇలా అన్నాడు "చూడు .. అనుమానించడం మన వృత్తి లక్షణమే అయినా, దానికీ కొన్ని హద్దులుంటాయి. నేరస్థుడ్ని వెతికి పట్టుకోవడం ఎంత ప్రధానమో - ఒక నిరపరాధి నిర్దోషిత్వాన్ని సకాలంలో సక్రమంగా గుర్తించడం కూడా అంతే ముఖ్యం... ఏమంటావు?"

ఆ మాటలలో సత్యాన్ని అంగీకరిస్తూ కానిస్టేబులు తలూపాడు. ఆ తరువాత ఏదో గుర్తొచ్చినవాడిలా "అయితే..సార్.. మీ తాతగారు..?" అంటూ ఏదో అడగబోయి, సందిగ్ధంలో ఉండిపోయాడు.

ఎస్సై అతని ముఖంలోకి చూసి, చిరునవ్వు నవ్వాడు. సమాధానం చెప్పలేదు. అతన్ని చూస్తే, అతను సుందరంతో చెప్పినదంతా అబద్ధమేనని స్పష్టమైపోతూనే ఉంది ఆ కానిస్టేబులుకి.

అయితే...

ఎస్సై గారతనితో ఏ ప్రయోజనాన్ని ఆశించి అతన్ని మభ్యపెట్టారో ఆ బుర్ర మీసాల కానిస్టేబులికి ఎంతగా తలచించుకున్నా అర్థంకాలేదు. కాదు కూడా!

❀❀❀

అవ్వ తిరునాళ్లలో తప్పిపోయింది
దేవులపల్లి కృష్ణశాస్త్రి

మా అవ్వ నెరగరూ మీరూ, అవ్వని హయ్యో! సుబ్బమ్మవ్వని మా ఊళ్ళో ఆవిణ్ణి ఎరగని వాళ్ళు లేరే! అసలు ఊరంతా అవ్వనే పిలుస్తారావిణ్ణి. కొద్ది మంది 'సుబ్బమ్మ గారూ' అను కూడా అంటారు. ఆవిడకి కోపం వచ్చినపుడు"ఆఆఆ, ఎవర్రా అవ్వ! నువ్వు నా కేవవుతావురా చస్తే దెయ్యవవుతావు గాని" అని గద్దిస్తుంది. అప్పుడు చటుక్కున సర్దుకుని 'సుబ్బమ్మగారూ' అంటారు. ఒక్కొక్కప్పుడు, 'సుబ్బమ్మగారూ' అని పిలిస్తే "హారి గాడిదా! వేలెడంత లేవు, బొడ్డుకోసి పేరెడతావురా నాకూ!" అని దులిపేస్తుంది. వెంటనే దిద్దుకుని 'అవ్వగారూ' అంటారు.

ఏవయితేనేం ఆవిడంటే అందరికీ ఇష్టవే, అవ్వంటే.

అవును. అందరికీ ఇష్టవే మరి! వాళ్ళకేం పోయింది ఇష్టం గాక, ఎప్పుడో కనిపిస్తుంది వాళ్ళకి. కనిపించినప్పుడు ఎంచక్కా కుశల ప్రశ్నలూ అవీ వేస్తుంది. సాతల్తో సాతాళించి కబుర్లూ కథలూ చెపుతుంది. మాంచి ఫారమ్‌లో ఉంటే - అంటే ఒడుపులో ఉంటే పాటలు పాడుతుంది. పావు పాటా అవీ. ఆ కాస్సేపూ వాళ్ళకి కులాసాగా ఉంటుంది. వింటారు పోతారు. వాళ్ళకేం! రాత్రీ పగలూ ఆవిడతో ఇంట్లో ఉండేవాళ్ళం. మేం వేగలేక చస్తున్నాం గాని!

అన్నట్టు - అవ్వంటే మీరెరగరన్నారు కదూ సుబ్బమ్మవ్వని - ఆవిడ మమ్మల్నెలా ఏడిపిస్తుందో చెప్పే ముందు, ఆవిడ రూపురేఖలూ ధోరణీ మీకు తెలియద్దూ! అసలు మా అవ్వంటే, మా నాన్నగారి మేనత్త. యన్తాలూకు అయిదెకరాల పొలవూ, అప్పారం లోగిలీ వగైరా ఆస్తితో అవ్వకూడా నాకు సంక్రమించింది. మా నాన్న మేనత్తంటే దాదాపు డెబ్భై మాట గదా. అయితేం నడుం నిటాగ్గా కదురులా నిలబెడుతుంది. ఇష్టం లేనప్పుడు మాత్రం తెలుగులో 'ఐ' అక్షరం లేదూ 'ఐ' దానిలాగా ఒంగిపోతుంది. తరుచు కంఠం రైలు గంటలాగా గణగణా మోగించేస్తుంది. ఇష్టం లేనప్పుడు పీలగా మూలుగుతుంది. ఈ మధ్య కొంచెం చెడ్డా, గెద్ద చూపులాంటిది అవ్వచూపు. అయితే పళ్ళు మాత్రం తీయించెయ్యడవో రాలిపోవడవో జరిగింది. ఒక్కటే ఒక్క పై పన్ను మాత్రం - ముందుంది - కింది పెదిమ మీదకి వొంగి, అక్కడ కాలూని, మాట్టాడుతున్నప్పుడు రవ్వంత తలాడిస్తూ ఉంటుంది. అది అందానిక్కాబోలు ఉంచేసిందవ్వ. మా ఇంటికొచ్చిన వో పెద్దమనిషి - అప్పన్న శాస్త్రుర్లని మాంచి కవి కూడా - ఆయనొకసారన్నాడు చెమత్కారంగా "ప్రపంచంలో ఏ ప్రభుత్వవూ చెయ్యలేని పని సుబ్బమ్మవ్వగారు చేసిందండి. ఒకే ఒక్కటి తప్ప ఏ పన్నూ లేకుండా చేసింది! " అని అయితే, అవ్వ మాట్టాడుతుంటే మాత్రం అతి స్పష్టంగా తెలుస్తుంది.

కొందరు పళ్ళు లేని వాళ్ళు నోరు లక్కపిడతలాగా డొల్లగా ఉంటుంది. మాట్టాడుతుంటే ఏవీ తెలియదు. రొచ్చులో నడుస్తున్నట్టు పుసుకూ పుసుకూ గాలి పోసుకుంటుంది. అంతే, పాత రబ్బరు బొమ్మ కడుపు నొక్కితే చప్పుడైనట్టు అవ్వలాగాదు.

అయినా ఓ లోపం ఉంది. అవ్వ మాటల్లో 'ప' 'ఫ' అని పలుకుతుంది. 'తప్పూ, వప్పూ, చెప్పూ' అంటుంది, ఈ వొంటిపన్నువల్ల.

అసలు అవ్వదీ - మా సుబ్బమ్మవ్వదీ - పెద్ద జాతీయ నాయకుడి ఉపన్యాస ధోరణి. అయితే అవ్వ తెలివిగా మాట్టాడుతుంది. వోసారీ, ఉపన్యాసాల్తో దేశాన్నంతనీ తలదిమ్మెక్కించే వో పెద్ద మనిషి మా ఇంటికొచ్చాడు. ఆయన సభలోనే గాక సభ ఇవతల కూడా సభలో అంతా మాట్లాడతాడు. మా ఇంటికొచ్చిన పదినిమిషాల్లో మొదలెట్టాడు ప్రసంగం. మరి పదినిమిషాల్లో అవ్వ కలుగజేసుకుని రంగస్థలంలో విరగబడింది. ఆయనగారు తోక జాడించి, నాటికీ నేటికీ అవ్వకి 'నమస్తే'. అంతే! ఆవిడ సన్నిధానంలో నోరు విప్పడు.

వెనకటికి వో కవిగాడు చెప్పినట్టు నిప్పుల, నీళ్ళను, చప్పిడుప్పిళ్ళను, తీర్థాల, తిరునాళ్ళ త్రిప్పటలను, గడిదేరి గడ్డకట్టిన ఘటం అవ్వ. పెళ్ళికి కాస్త ముందో వెనకో పోయాడు పెనివిటి. డెబ్భై ఏళ్ళ పైని ఏకధాటిగా అంటే ఏక టాకీని వైధవ్య రాజ్యాన్ని పరిపాలించి పారేసిన రాణీ బహద్దర్. గడ్డు బ్రహ్మచారిణి. యాక్సిడెంట్, అంటే ఏ కారో, రైలో కలగజేసుకుంటే తప్ప మార్కండేయాది చిరంజీవుల లిస్టులో మనిషి మా అవ్వ.

నాలుగ్గంటలకే లేచి తొలికోడిని లేపడం, తలుపులన్నీ తెరిచి పారేసి పాచిపనులు అవీ చెయ్యడం, చెంబులూ, గిన్నెలూ చప్పుళ్ళు చెయ్యడం, స్నానం చెయ్యడం, పత్తిరాట్టం లాంటి కంఠవెత్తి 'ప్రాతస్మరామి' వగైరా శ్లోకాలు చదవడం, మా నిద్దర తగలెయ్యడం - ఇలాగ రోజంతా జరిగే తంతుని గూర్చి అట్టే చెప్పడం నా కిష్టం లేదు. ఈ వివరాలు కూడా మీకు చెప్పకపోదును. కాని మీ కోసమే చెప్పా ఇదంతా. అవ్వ ధోరణిలో చెప్పవలసి వస్తే ఎప్పుడైనా అవ్వ ఎదురయితే చప్పున తప్పుకుని మీరు దాటిపోవచ్చని! అంతేగాక, ఇవన్నీ చెపితేగాని, మేవావిడతో ఎలా వేగిపోతున్నావో మీకు తెలీదని కూడా ఇన్ని వివరాలిచ్చా మీకు. ఇంట్లో మమ్మల్ని ప్రతిఘడియా ఏడిపించే పనుల్ని గూర్చి నేను చెప్పనే లేదు. హయ్యో బాబో! ఏ నవ్వండీ బాబూ, కోటయ్యగారు క్లీన్‌గా భోంచేసిన విస్తట్లోనే కొత్తదనుకున్నానని, మా శాషమ్మ దొడ్డమ్మకి మళ్ళీ వడ్డించడం, నీళ్ళనుకుని చెంబెడు సామర్లకోట పప్పు నూనితో చెయ్యి కడుక్కోవడం, ఎంగిలి విస్తళ్ళన్నీ

కట్టగట్టి గోడమీద నుంచి వీధంట వెడుతున్న మేస్త్రీటు వీర్రాజుగారి తలమీద పడేటట్టు విసిరివేయడం - ఈ గొడవలన్నీ ముందు ముందు మీకు తెలుస్తాయి. అలాగే సినిమాకు వెళ్ళడం, సర్కస్ వాళ్ళ బోనుల దగ్గర కదలకుండా నిలబడి అక్కడ జంతువులతో జత కట్టడం, శాసన సభ సీటు కోసం మా ఊళ్ళో చేసిన పెద్ద ఎన్నికల సభలో రభస చెయ్యడం - ఇలాంటివన్నీ కూడా ఇప్పుడు కాదు, తర్వాత చెపుతా.

అయితే, ఓ చిన్న సంగతి చెప్పి, అది చెప్పి తీరాలి - ఆవిడ తిర్నాళ్ళలో తప్పిపోవడం దగ్గరకొస్తా.

అప్పన్న శాస్తుర్లు గారని చెప్పానే ఇందాకా. కవిగారు, ఆయన ఓసారి అవ్వమీద పంచరత్నాలు చెప్పాడు బోజనాల దగ్గిర సరదాకి!

"సుగుణమణిగణ నికురుంబ సుబ్బమాంబ"

అనిన్నీ.

'సుజన సేవాలంబ గం, సుబ్బమాంబ"

అనిన్నీ,

"గం" అంటే గంగా భాగీరధీ సమానురాలట.

ఆయన పద్యాలు చెపుతుంటే, అవ్వ ముసి ముసి నవ్వుల్తో అటూ ఇటూ తిరుగుతూ, ఏదో తన గొడవ కాదన్నట్టూ నిర్లక్ష్యంగా పట్టించుకోనట్టూ విననట్టూ అంతా విని, "అవి ఓ కాయితం మీద రాసిపారెయ్యండి బాబూ, మా నాన్నిగాడికివ్వండి" అంది.

నాన్నిగాడంటే మా పెద్దబ్బాయి, వాడంటే మా అవ్వకిష్టం. మా నాన్న పేరని! వాడూ గడుసు రాస్కెల్, ఏం చేశాడూ! ఆ పద్యాలు తీసుకుని, వల్లించి, అడపా దడపా పెద్ద రాగవరస పెట్టి అవ్వ దగ్గిర చదవడవూ, ఆవిడ దగ్గిరేదేనా కొట్టేడవూ. ఈ పద్యాల వెర్రి అవ్వనెంతదాకా పట్టుకుందీ అంటే

ఓసారి నాతో అందీ - "వొరే అబ్బాయీ! నేను పోయాక పదకొండో రోజున ఈ కవుల్నందర్నీ పిలిపించి నా మీద పజ్యాలు చెప్పించరా" అని.

ప్రస్తుతమేవిటంటే, నాన్నిగాడు శివరాత్రి తీర్థాని కెళదామని అవ్వని రెచ్చగొట్టాడు. నా కిష్టం లేదు. "తీర్థములు మానసములు ముక్తి ప్రదములు" అంటూ "సత్యము తీర్థము" అంటూ కవి చెప్పిన మాటల్లో నమ్మకం ఉన్న వాణ్ణాయెను. అయితే ఏం జెయ్యను అవ్వా నాన్నిగాళ్ళల్లో ఏ ఒక్కళ్ళనీ లొంగదీయడవే కష్టం! ఇద్దరూ పట్టుకున్నారాయె!! పోనీ ఇల్లేనా ఆనాటికి విశ్రాంతిగా ఉంటుందనిన్నీ దారి పొడుగునా అస్తమానవూ అవ్వకోసం పంచరత్నాలు పద్యాలు చదివి నాన్నిగాడి తెగులు కుదురుతుందనిన్నీ సరేనన్నాను, చివరికి.

ఆ తీర్థానికే వెళుతున్న రావయ్య కాపుని బతిమాలుకుని, అతని రెండెడ్ల బండిలో మా వాళ్ళనీ కుక్కాను. తోవలో అవ్వ కునికిపాట్లు పడి కిందపడకుండా రావయ్య కాపు పెద్ద కొడుకుని బండి చివర బిరడాలాగా బిగించాను. ఈ బిరడా సంగతి తర్వాత చెపుతా.

వాళ్ళు తెల్లారగట్టే వెళ్ళారు. సాయంకాలవో, రాత్రి పడుతుంటేనో రావాలి. మూడు నాలుగ్గంటలకి ఏదో పనివుండి వీధిలోకి వచ్చా. వీధరుగు పక్కని బిక్కమొహం వేసుకుని, ఏడిచి ఏడిచి ఎర్రకళ్ళూ వాడూ, నాన్నిగాడు ఒదిగి నిలబడి ఉన్నాడు.

"ఏమిరా అవ్వేదిరా" అన్నాను.

"త-త-త" అన్నాడు.

"ఏమిట్రా తతత తప్పిపోయిందా ఛ ఛ ఛ కాదుగదా, అంటే చచ్చిపోలేదుగదా" అనడిగాను.

"తీర్థంలో అవ్వ కనబళ్ళేదు" అన్నాడు వాడు మెల్లిగా.

'ఆ' అన్నాను. నా గుండె గుభేలుమంది. గోదార్లో పడిందేవో! కారు కింద పడిందేవో! గుండె ఆగిపోయిందేవో, ముసల్ది నాకు మహా జాలీ, దుఃఖం వేసుకొచ్చాయి. అసలు అవ్వంటే మా అందరికీ ఎంత ఇష్టవో అప్పుడు తెలిసొచ్చింది నాకు. అవ్వని తీసేస్తే లోకం ఎలా ఉంటుందో మాకు తెలియదు. పాపం ఆవిడ కెవరున్నారు? నిజానికి నాకు ముసలాళ్ళను చూస్తే ఎంతో దిగులు. ముందుకు చూసుకుంటే నోరు తెరుచుకుని దగ్గరగా వచ్చే చీకటి భూతంగాక వాళ్ళకే ఉంది!

మా అవ్వ చూపులు ఒక్కొక్కప్పుడు, దూరాన ఆకాశాన పోయే పక్షుల్లాగా ఉంటాయి. ఎక్కడికో ఎక్కడికో పోతూన్నట్టు, అప్పుడు నాకు భయం వేస్తుంది. అవ్వ ఒక్కొక్కప్పుడు పాడుగ్గా నిట్టూర్చేది! ఆ నిట్టూర్పు చిన్నతనం నుంచీ ఎనభై ఏళ్ళ దార్లోబడి పాకివచ్చినట్టుండేది. ఇప్పుడు ఈ మాటలన్నీ స్థిమితంగా అంటున్నాను గానీ అప్పుడు..

"ఏవిటా, ఏం జరిగిందీ?" అని నాన్నిగాణ్ణి అడిగాను.

గోదావర్లో స్నానం చేసొచ్చారట. గుళ్ళో క్కూడా వెళ్ళొచ్చారట. స్వామి దర్శనమయ్యాక, గుళ్ళో మండపం మీద కూచుని వాడి చేత సరదాగా పంచరత్నాలు కూడా చదివించుకుందిట. తర్వాత ఇవతలికి వచ్చాక, రంగుల రాట్నం దగ్గరికొచ్చేటప్పటికి నాన్నిగాడు అదెక్కుతానన్నాట్ట. వాడు కాస్సేపు దాని మీద తిరిగొచ్చేసరికి అవ్వక్కడలేదు. వాడు మొదట ఇక్కడా అక్కడా చూసి, కనబడకపోతే కంగారు పడి, "అవ్వా, అవ్వా" అని పిలుస్తూ తీర్థవంతా తిరిగీ, బళ్ళు విప్పినచోట దగ్గిరికొచ్చి అక్కడ కూడా ఆవిడ కనబడకపోతే అయిదు మైళ్ళూ నడచి ఇంటికొచ్చేశాడు. ఇదీ కథ.

వెంటనే రావయ్య కాపాచ్చాడేమో వాళ్ళింటిక్కబురు చేశాను. కావిగాణ్ణీ గోవిందునీ తిర్నాళ్ళకి పరిగెత్తించాను. అవసరమైతే పోలీసుల్తో గూడా చెప్పమన్నా. ఇంట్లో మా ఆవిడా పిల్లలూ నిశ్శబ్దంగా కూచున్నారు. కుక్కిన పేనుల్లా. నేను శివస్మరణ చేస్తూ బయటికి వెళుతూ, లోపలికొస్తూ మతిపోయినట్లు తిరగడం మొదలుపెట్టాను.

రాత్రి పదయింది. అవ్వలేకుండా రావయ్య కాపు బండి వచ్చేసిందట. కావిగాడూ గోవిందు వళ్ళి చేతుల్తో, అంటే అవ్వలేకుండా వచ్చేశారు. ఇహ ఊరుకుంటే బావుండదని, మా ఆవిడ లోపల్నించి కొంచెం కూనిరాగం ఏడుపు ప్రారంభించింది. చంటిపిల్లాడు కూడా యధాశక్తి వాళ్ళమ్మకి తోడయ్యాడు. చూడ్డానికీ, ఉబుసుపోకా, సాహం గ్రామం మా ఇంటి దగ్గర చేరి, అవకాశం రాగానే సరదాగా పరామర్శలోనూ, అవ్వ దివ్య స్మృతుల్ని నెమరువేసుకోవడంలోనూ, అప్పుడే పడిపోయారు.

ఇదీ తిర్నాళ్ళ రోజున అర్ధరాత్రి మా స్థితి.

అంతలో "సన్యాసిరాజుగారిల్లిదేనా?" అని దూరాన్నుంచి గద్దిస్తున్న మాటలు వినబడ్డాయి. అందరూ అటు తిరిగి చూశారు.

"ఎవరు బాబూ, ఏవిటి?" అని గావుకేక పెట్టాన్నేను. చీకట్లోంచి వస్తూ పోలీసు జవాను కనబడ్డాడు. కూడా తీవిగా నడుస్తూ, చీకట్లో దీపస్థంభం లాగా, జవాను కంటే ధాటిగా అవ్వ సాక్షాత్కరించింది. "అవ్వొచ్చింది" అని కేకేశాను. లోపల్నుంచి అందరూ "ఘొల్లు"మని ఇవతలకి వచ్చారు.

కొందరు మాత్రం 'అరెరే! అవ్వ అప్పుడే దొరికేసిందే. నాల్రోజుల పాటు సరదా పోయిందే' అని దిగులు మొహం వేశారు.

పోలీసు జవాన్, 'ఇదుగోండీ ముసలావిడ. నా ప్రాణాలు తోడేసింది! ఈవిణ్ణి తిర్నాళ్ళకీ తీర్థాలకీ పంపి, దేశం మీద వదుల్తారేవిటయ్యా ఈవిడ కంటే మా సూపరెంటు నయం" అని చీదరించుకుంటూ అన్నాడు.

"పోరా! నే సూపరింటునే, నాకేంరా బహద్దర్ని! శెలవిచ్చాను ఫో" అంది అవ్వ. వాడు పళ్ళు బిగించి కొరకొర చూసి, చీకట్లోకి నడిచి, అక్కడ ఖాండ్రించి ఉమ్మేసి చక్కాపోయాడు.

ఇహ తీర్థంలో జరిగిన కథేమిటంటే...

నాన్నిగాడు రంగులరాట్టం తిరుగుతూంటే పిల్లలందరికీ జీళ్ళూ, జంగిడీ మిఠాయి, తొక్కుడుండలూ కొందామని, ఆ కొట్ల కెళ్ళి ఒక్కక్కళ్ళకి పేరు పేర్నా వొక్కొక్క పొట్లం కట్టించిందట అవ్వ. అక్కడ చిల్లర విషయంలో కొట్టువాడితో పేచీ వచ్చి, వాణ్ణి భూశేయనం చేసి పారేసి, దమ్మిడీలతో సహా వాడి దగ్గర్నుంచి మీద పడిందట. అక్కడ రాగిచెంబూ, గరిటా బేరం తేల్చడానికి రావరావణ యుద్ధం చేసి, రాచ్చిప్పల కొట్టువైపు దృష్టి తిప్పి, అటు దాడి చేసింది. దారిలో డక్కీ డమడమల బండి వాడు తారసిల్లితే, అన్నీ వాయించీ, నడిపీ చూసీ, అమ్మేవాడు బోరుమని ఏడ్చేదాకా వాణ్ణి ఆపి, అంతలో ఉప్మాకయ్యగారి కుటుంబం కనబడితే వాళ్ళతో ఊసులాడి, అట్టే నాలుగడుగులేసే సరికి నాన్నిగాడు గ్యాపకానికొచ్చాడు. అప్పటికప్పుడే పొద్దువాల్తోంచి.

"నాన్నిగా నాన్నిగా" అని తీర్థవంతా తిరగడం మొదలెట్టింది. బళ్ళ దగ్గిర కొచ్చి చూస్తే, రావయ్య కాపు బండీ వెళ్ళిపోయింది. మళ్ళీ తీర్థంలోకి వచ్చింది. "మా నాన్నిగాడు కనబడ్డాడా?" అనడుగుతూ. ఎవళ్ళ నడిగినా వాళ్ళు పట్టించుకోలేదు. అప్పటికి కంగారు పడ్డం మొదలెట్టిందవ్వ. ఇంతలో కనబడిన పోలీస్ జెవాన్‌ని కూడా అడిగింది. వాడు ఊరూ పేరు అన్నీ అడిగి పోలీస్ స్టేషన్ దగ్గిర కూచోబెట్టాడు.

"అమ్మా! బైపడకండి. ఇంటికి తీసికెడతాం" అని పోలీసు వాడంటే "ఎవరికిరా భయం?" అని ధీమాగా మొదట అన్నప్పటికీ, నాన్నిగాడి కోసం లోపల్లోపల కంగారు పడిపోయింది. అవ్వ పోలీస్ స్టేషన్‌లో కూర్చున్న సమయంలోనే కావిగాడూ గోవిందూ అవ్వకోసం గాలించిపోయారు. ఇదంతా చెప్పాక ఇలాగంది అవ్వ. "ఆ రాచ్చిప్పల దుకాణం దగ్గిరాలస్యవయిపోయిందర్రా! అక్కడే వళ్ళు మరచిపోతుంటాను. ఏవిరా నాన్నిగా! శివరాత్రి గూడాను. అప్పన్న శాస్త్రులుగారి పద్యాలు నా మీద రాసినవి చదవరా" అంది. అందరూ పకపకా నవ్వారు. నాకు మాత్రం ఒళ్ళు భగ్గుమంది. ఆవిడ గొంతుక పట్టుకుని ఆ రాత్రి ఆవెని శివసాయుజ్యం పొందిద్దావనుకున్నాను. దిక్కుమాలిన పాపభయవో, దండ భయవో వచ్చిపడి మళ్ళీ తమాయించుకున్నాను. అంతకంటే గూడా నా లోపల పిచ్చి ఇష్టం గూడా ఏడిసిందాయెను అవ్వమీద, మా సుబ్బమ్మవ్వ మీద!

బోన్‌సాయ్ బ్రతుకు – అబ్బూరి ఛాయాదేవి

(రచనాకాలం-1974)

_ **ఆఫీసునుంచి ఇంటికొచ్చేసరికి** గుమ్మంలో ఎదురుగా ఉత్తరాలు కనిపిస్తే ఏదో చెప్పలేనంత ఉత్సాహం పుట్టుకొస్తుంది. ఆత్మీయులు ఎదురై ఆప్యాయంగా పలకరించినట్లే అనిపించి ఆఫీసు పనివల్ల కలిగిన అలసట అంతా ఇట్టే మాయం చేసినట్లు హాయిగా ఉంటుంది మనసుకి. ఆఫీసునుంచి రాగానే ఈదురో దేముడా అంటూ వంటింట్లోకి అడుగుపెట్టేందుకు బదులు కూనిరాగం తీస్తూ కులాసాగా కాఫీ చేసుకుని తాగబుద్ది అవుతుంది. అందులోనూ పరిచితమయిన దస్తూరితో ఇన్‌లాండ్ లెటర్స్ గాని కవర్లు గాని వస్తే చకచకా పకోడీలో బజ్జీలో చేసుకుని తినేటంత ఓపిక, ఉత్సాహం పుట్టుకొస్తాయి. ఉత్తరాలు రాయటానికి బద్దకం అనిపించినా ఎక్కడి నుంచైనా రోజూ ఉత్తరాలు రావాలనే ఆశ మాత్రం ఉంటుంది!

అనుకోని ఉత్తరం అది. అక్కయ్య ఏనాడూ ఉత్తరం రాయనిది ప్రత్యేకంగా రాసిందంటే ఏదో విశేషం ఉండాలి. ఉత్తరం విప్పుతుంటే కొంచెం భయంలాంటిది వేసింది – ఏమైనా దుర్వార్త కాదు కదా అని. అవును మరి. అంతా సవ్యంగా ఉంటే ఒక్కళ్ళూ ఒక్క ఉత్తరం ముక్క రాయరు.

అమ్మలూ,

నా ఉత్తరం నీకు చాలా ఆశ్చర్యం కలిగించిందనుకుంటాను. నేనూ మీ బావగారూ అక్కడికి మీ ఊరికి రాబోతున్నామని చెబితే మరింత ఆశ్చర్యపోవచ్చు. కాశీ, హరిద్వారం వెళ్ళాలని ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నాము. ఈనాటికి వీలు చిక్కింది. మేము రావటం వల్ల మీకు ఏ విధమయిన ఇబ్బందీ కలగదనుకుంటాను....–

"ఏమండీ, మా అక్క, బావగారు వస్తున్నారుట ఇక్కడికి" అన్నాను ఉత్సాహంగా.

"నిజంగానా! ఎప్పుడు ఏదీ, ఉత్తరం ఇలాతే" అంటూ నా చేతిలోని ఉత్తరం లాక్కున్నారాయన. నేను వంటింట్లోకి వెళ్ళాను కాఫీ వగైరాలు రెడీ చెయ్యటానికి.

నా పెళ్ళయిన తరువాత మొట్టమొదటిసారిగా ఈ ఊరికి మా ఇంటికొస్తున్నారు మా అక్కా, బావగారూ. ఎన్ని సంవత్సరాల నుంచో ఎదురు చూసిన సంగతి. ఎప్పుడూ ఆ పల్లెటూరు వదిలి కదలరు వాళ్ళిద్దరూ. పిల్లా పీచూ గొడ్లు గోతం, పంటలూ, కోతలూ అంటూ ఏవో వంకలు పెట్టి వాళ్ళు ఊరు వదిలి ఎక్కడికీ వెళ్ళరు. అటువంటిది వాళ్ళు ఈ మహాపట్నానికి మా ఇంటికొస్తున్నారు ఈనాటికి.

అక్కయ్య నాకుమల్లే చదువుకోలేదు. చదువుకోలేదంటే – దాన్ని అయిదో క్లాసుతోటే చదువు మానిపించేశారు మా నాన్నగారు. ఆడపిల్లకి చదువేమిటి? చాకలి పద్దు రాయగలిగితే చాలదా అనుకునే రోజులవి. ఒక దశాబ్దం తరువాత పుట్టిన నా నాటికి ఆడపిల్లకి చదువు అవసరమా అనే మీమాంస తగ్గిపోయింది. కాలంతో పాటు నాన్నగారు కూడా మారటం నా అదృష్టం. నన్ను కాలేజీలో చేర్పించటానికి వెనుకాడలేదు. పెద్ద చదువు చదివిం తరువాత పెళ్ళి చేసుకుని ఇల్లూ వాకిలీ చూసుకుంటూ కేవలం గృహిణిగా ఉండిపోవటానికి ఏ ఆడపిల్లకీ మనస్కరించదు. చదివిన చదువు సద్వినియోగం చేసుకోవాలనీ, జీవితంలో స్వయంగా ఏదో సాధించాలనే తపన బయలుదేరుతుంది. అదే విధమయిన తపన నాలోనూ రేగింది. ఆయన మంచి ఉద్యోగంలో ఉన్నప్పటికీ నేనూ ఉద్యోగంలో చేరాను. అక్కకి చదువు లేకపోవటంతో పల్లెటూరి సంబంధం కుదిరింది. బావగారు చదువుకున్నవాడే అయినా ఆదర్శభావాలతో వ్యవసాయాన్నే

వృత్తిగా ఎన్నుకుని సొంత పొలాన్ని పండించుకుంటూ పల్లెటూరులోనే మకాం స్థిరపరుచుకున్నారు. అక్కయ్య ఆ పల్లెటూరికే అలవాటు పడిపోయింది.

అక్కయ్య వచ్చేటప్పుడు దోసకాయలూ, గోంగూర, ములక్కాడలూ, అప్పడాలూ, వడియాలూ, కొబ్బరి ఉండలూ లాంటివెన్నో తెచ్చింది. "ఏమిటోనే, కుచేలుడిలాగ పట్టుకొచ్చాను ఇవన్నీ. మీకు నచ్చుతాయో లేదో" అంది మొహమాటపడుతూ.

"అయ్యో, అదేం మాటే! సరిగ్గా మాక్కావల్సిన వస్తువులన్నీ తెచ్చిపెట్టావు. మాకు ఇక్కడ దొరకని వస్తువులివన్నీ. మీ మరిదికి గోంగూర పులుసూ, దోసకాయపప్పు, ములక్కాడ చారూ ఉంటే చాలు పంచభక్ష్య పరమాన్నాలు పెట్టినట్లు సంబరపడతారు. నాకు ఆఫీసు పని తోటి అప్పడాలు వడియాలు పెట్టడం అసలే పడదు. ఒకవేళ తీరిక దొరికినా అటువంటి పనులు చెయ్యాలంటే బద్దకం నాకు. నా సంగతి నీకు తెలుసుగా!" అన్నాను నవ్వుతూ.

"అవును మరి, ఆఫీసునుంచి వచ్చేసరికి ప్రాణం సోలిపోయి ఉంటుంది. ఇక అప్పడాలూ వడియాలూ పెట్టాలి, ఇడ్లీలూ దోసెలూ వెయ్యాలి అంటే మాటలేమిటి! అసలు ఎలా నెట్టుకొస్తున్నావో ఇంటిపనీ, ఆఫీసు పనీను" అంది అక్కయ్య ఓదార్పుగా.

"ఏమిటో, వెధవ ఉద్యోగం - ఒక్కొక్కప్పుడు మానెయ్యాలనిపిస్తుందే అక్కా. ఇంత గెలిచి రచ్చగెలవమన్నట్లు - ఇలా ఇల్లూ వాకిలీ సరిగ్గా చూసుకోకుండా ఆఫీసులో వ్యవహారాలు చూడబోవటం ఆడదానికి తలకి మించిన పనే" అన్నాను స్వానుభవం మీద.

"అలా అనుకునేవ్ అమ్మలూ, నువ్వెంత అదృష్టవంతురాలివి - అనకూడదు గాని, హాయిగా చదువుకుని మగవాడితో సమానంగా ఉద్యోగం చేసి చేతినిండా సంపాయిస్తున్నావు. 'దేహి' అని ఒకళ్ళని అడగాల్సిన పని లేదు దేనికీ. మాకు మల్లే కరివేపాకుకి కానీ డబ్బు దగ్గర్నుంచీ మొగుడి మీద ఆధారపడకుండా దర్జాగా బ్రతగ్గలవు" అంది అక్కయ్య.

"దూరపు కొండలు నునుపు" అనుకున్నాను" మనసులో. "మీ పాప ఏం చదువుతోందే ఇప్పుడు?" అన్నాను ధోరణి మార్చటానికి.

"స్కూలు ఫైనలు చదువుతోంది. దేవుడి దయవల్ల గట్టెక్కితే కాలేజీలో చేర్పించాలనే నా పట్టు. పారుగూరు పంపించి హాస్టల్లో ఉంచటం ఆయనకి అంత ఇష్టంలేదు. అయినా ఆడదాన్ని చదువులేకుండా ఇంట్లో కూర్చోబెట్టటం నాకిష్టం లేదే. నే పడుతున్న పాట్లు చాలవూ? ఆడదాని క్కూడా ఈ రోజుల్లో ఓ డిగ్రీ చేతిలో లేకపోతే ఎందుకూ కొరగాదు. లేకుంటే మగవాడి చెప్పుకింది తేలులాగా పడి ఉండాల్సిందే" అంది ఉద్రేకంతో.

అక్కయ్యకి మొదటినుంచీ చదువంటే ఇష్టం. కానీ నాన్నగారు దానికి చదువు చెప్పించలేదు. 'ఏదో నోటి లెక్కకి ఠక్కుమని సమాధానం చెప్పలేక పోయిందని 'ఆఁ, ఆడదానికి దీనికి చదువెలా వస్తుంది' అని నాన్నగారు అక్క చదువు ఆపించేసి అన్నయ్య మీదే అత్యంత శ్రద్ధ చూపించారు. అక్కయ్యకి చదువు లేకపోబట్టే ఆ పల్లెటూరు సంబంధం చేసుకోవాల్సి వచ్చిందనీ, ఇంట్లో పాడి చూసుకోవటం, పాయ్యి అలుక్కోవటం, నూతిలోంచి నీళ్ళు తోడుకోవటం - అలా గొడ్డుచాకిరీ చెయ్యాల్సి వస్తోందని అమ్మకూడా ఎప్పుడూ అక్కయ్య గురించి బాధపడుతూ ఉంటుంది. గతమంతా తలుచుకుని అక్కయ్య బాధపడుతోందని గ్రహించి, దాన్ని కాస్తమరిపించాలని "అలా అవతలకి పోయి కూచుందాం రావే అక్కా" అంటూ బాల్కనీకి తీసుకువెళ్ళాను.

అక్కడ పూలకుండీల్లో మొక్కలు చూడటం మొదలు పెట్టింది అక్కయ్య. తను తీసుకొచ్చిన దోసకాయలూ, ములక్కాడలూ, గోంగూర - అన్నీ వాళ్ళ పెరట్లోవేట, ఈసారి ఎవరైనా ఇటువైపు వస్తూంటే కాసిని గోంగూర విత్తనాలు పంపించమన్నాను.

"అవునుగాని అమ్మలూ, ఇదేమిటే, ఈ తురాయి చెట్టునీ, దానిమ్మ చెట్టునీ పూలకుండీల్లో వేశావు! ఎట్లా మరుగుజ్జుల్లా తయారయినాయో చూడు! నిక్షేపంలా క్రింద పెరట్లో పెరగనివ్వాల్సిన చెట్లని పూల మొక్కల్లా కుండీల్లో వేస్తే ఇక అవి ఎట్లా పెరుగుతాయే!" అంది ఆశ్చర్యపోతూ, ఆ చెట్ల కోసం బాధపడిపోతూ.

నేను పకపకా నవ్వాను, అదొక స్పెషల్ పద్ధతి. దాన్ని 'బోనసాయ్' అంటారు జపాను దేశంలో. మర్రిచెట్టులాంటి మహా వృక్షాన్ని కూడా పూలకుండీలో పెంచవచ్చు - ఊడలు కూడా దిగేట్టు పెంచవచ్చు. చిన్న పూలతొట్టెలో దానిమ్మ మొక్కని ఎప్పటికప్పుడు కొమ్మలు కత్తిరిస్తూ మధ్య మధ్య తొట్టె మారుస్తూ చిన్న సైజు చెట్టుని చేసి కాయలు కాయనిస్తే చూడటానికి ఎంత ముచ్చటగా ఉంటుందనుకున్నావ్! ఎంత జాగ్రత్తగా పెంచాలో తెలుసా ఈ చిన్న వృక్షాన్ని? 'బోనసాయ్' ఒక గొప్ప కళ!" అన్నాను.

అక్కయ్య నా మాటల్ని మెచ్చుకున్నట్లు కనిపించలేదు. "ఏమిటో ఈ మేడంత ఎత్తు పెరగాల్సిన తురాయి చెట్టుని ఈ కుండీలో బంధించావు" అంది నిట్టూర్చుతూ.

అక్కయ్యని నా 'బోన్‌సాయ్'తో మెప్పించలేకపోయినందుకు నిరుత్సాహపడుతూ నీరసంగా కుర్చీలో చతికిలపడ్డాను. నేను నేర్చుకున్న 'కళ' అంతా బూడిదలో పోసిన పన్నీరు అయిందని నీరు కారిపోయాను. అంతలోనే పెద్ద గాలిదుమారం రేగింది. విసురుగా ఇసుక వచ్చి మా మొహాల్ని కొట్టింది. అక్క రెక్క పుచ్చుకుని గదిలోకి లాక్కువెళ్ళాను. గబగబా కిటికీలూ తలుపులూ మూసేశాను.

క్షణాలమీద జరిగిందంతా చూసి నిర్ఘాంతపోయింది.

"అదేమిటి? ఇంతవరకూ మామూలుగానే ఉంది. అంతలోనే ఈ దుమ్మూ, గాలీ ఎక్కణ్ణించి వచ్చాయే? తారురోడ్లు కూడానూ?" అంది.

"ఈ మహాపట్నంలో ఇంతేనే తల్లీ. చూస్తూ చూస్తుందగానే రాజస్థాన్ ఎడారిలో ఉన్న ఇసుకంతా లేవదీసుకొచ్చి మా మొహాన కొట్టిపోతుంది గాలిదుమారం" ఇంకా నా మాటలు పూర్తికాలేదు. అవతల టపటపమని వానచినుకుల చప్పుడైంది. నేను తలుపు తెరిచి బాల్కనీలో ఉన్న బోన్‌సాయ్ చెట్లకుండీలని, పూలకుండీలని లోపలికి చూరుక్రిందకి లాగాను. గాలివాన మొదలయింది. అక్కయ్య ఒక కిటికీ రెక్క తెరిచి వీధిలోకి చూసింది - భారత రాజధాని వాతావరణాన్ని.

"చూడు అమ్మలూ, అటు చూడు" అంది. అక్కయ్య గొంతులో ఏదో నూతనోత్సాహం తొంగి చూసినట్లనిపించింది. నేను కుతూహలంగా కిటికీలోంచి వీధివైపు చూశాను. అర్థంకాలేదు. అక్కయ్య మొహంలోకి చూశాను. అంతుపట్టక "ఏమిటే" అన్నాను.

"ఆ చెట్టు చూడు - దారి పక్కన ఎంతమంది తలదాచుకున్నారో తడిసిపోకుండా" అంది అదేదో విన్నాత్న విషయమైనట్లు. నాకు మాత్రం అది అతి సామాన్యమైన సంగతిలా తోచింది. తన మనస్సులోని భావాన్ని నేను గ్రహించలేదని తెలుసుకుందిలా ఉంది. తనే మళ్ళీ అంది.

"ఆ తురాయి చెట్టు ఎంత పెద్ద చెట్టు అయిందో చూడు - బయట విశాలంగా ఉన్న చోట స్వేచ్ఛగా పెరిగింది కదూ - ఎంతటి గాలిదుమారం వచ్చినా అది కించిత్తు చలించలేదు. పైగా అంతమంది జనానికి ఆశ్రయం కల్పించి వాళ్ళకి ఆసరాగా నిలిచింది. ఎండవేళల ఎంత మంది దాని నీడలో సేద తీర్చుకుంటూ ఉంటారో!"

"అందులో వింత ఏముందే?" అన్నాను.

"వింత ఉందని కాదు అమ్మలూ. నువ్వు అపురూపంగా పెంచిన నీ బోన్‌సాయ్ చూడు! చూట్టానికి కుదురుగా ముచ్చటగానె ఉంది సంసారపక్షపు స్త్రీలాగా. కానీ ఎంత సుకుమారమో చూడు. నువ్వు వెయ్యికళ్ళతో కాపాడాలి దాన్ని - కాస్త తుఫానుకి కూడా తట్టుకోలేదు. తనే ఒకరిమీద ఆధారపడినప్పుడు మరొకరికి నీడ కూడా ఏమివ్వగలదు? మగవాడికీ ఆడదానికీ పెంపకంలో ఉన్న తేడా వల్లనే కదుటే ఆడదాని బ్రతుక్కూడా 'బోనసాయ్' మాదిరి అయింది!" అంది.

అక్కయ్య మాటలకి నా మనస్సు ఆర్ద్రమయింది. పంజరంలో బంధించిన చిలకని విడిచిపెట్టి స్వేచ్ఛావిహంగాన్ని చేసినట్లుగా నా 'బోన్‌సాయ్' చెట్లకి పూలకుండీల్లోంచి విముక్తి కలిగించాలన్నంత ఆవేశం కలిగింది నాలో. ***

ఇందుమూలంగా... – నగ్నముని

(రచనాకాలం- ౧౯౮౦)

ఇందుమూలంగా సమస్తమైనవారికీ మన ముఖాలూ కాళ్ళూ చేతులూ వగైరా సర్వాంగాలను గురించీ తెలియజేయడమేమనగా....

ఎందుకన్నా మంచిది చివర్న కాక ఈ కథలోని నీతి ముందే చెప్పేయడం మంచిది. ఎందుకంటే ఈ కథకి స్వంత కాళ్ళూ, స్వంత చేతులూ, స్వంత మెదడూ లేవు. అందుకని కంచికి కాదుకదా కంచె వరకు కూడా చేరలేదు. మన స్వంత భుజాలమీద మన స్వంత తలకాయ ఉండడం లేదని, మన చేతులూ, చేతలూ మనవి కావనీ, మనం మనం కాక మరొకళ్ళంగా జీవితాంతం బతికేస్తున్నామనీ నాకు ప్రతిక్షణం అనిపిస్తోంది. మన స్వంత అవయవాల స్థానంలో మరొకళ్ళ అవయవాలు చోటు చేసుకునే సమయంలో వచ్చే సంఘర్షణ మనల్ని అడ్డగాడిదల్ని చేస్తోంది. ఎవడి సొంత తలకాయతో, అవయవాల్తో వాడు బతికితే ఏ గోలా ఉండదు. అది మనిషి కావచ్చు, దేశం కావచ్చు, అదీ కథ. ఇంక మీ ఇష్టం. మిగతాది చదివినా సరే. మీ సొంత నిర్ణయం మీరు తీసుకోవచ్చు.

●●●●

మనలో చాలా మందికి బతకడానికి ఒకటే ఉద్యోగం. మా ఆఫీసర్ గారికి మాత్రం రెండుద్యోగాలు. ఒకటి ఇంట్లో పెళ్ళాంగానూ, రెండోది ఆఫీసులో మాకు మొగుడిగాను. ఆయనకి ఉద్యోగ విజయాల పద్యాలంటే ఇష్టమేగానీ, ఆఫీసులో యమధర్మరాజు ఏకపాత్రాభినయనమంటే మరీ ఇష్టం. ఆ ఉదయం నేను కనబడగానే ఆఫీసు ఇన్స్పెక్షన్ పని మీద అర్జెంటుగా బెజవాడ పొమ్మని తోలేశాడు. నే వెళ్ళి అక్కడివాళ్ళు గవర్నమెంటు డబ్బు ఎట్లా ఖర్చుపెడుతున్నారో తనిఖీ చెయ్యాలన్న మాట. మా వాడికి బుద్ధిలేదు. గవర్నమెంటు డబ్బు ఎట్లా ఖర్చుపెడతారు? స్వంత డబ్బులాగ స్వంతానికి ఖర్చుపెట్టుకుంటారు. దానికి తనిఖీ దేనికి? అదో దండగ.

సరే పెళ్ళిళ్ళ సీజను. రైల్లోనూ, బస్సుల్లోనూ టిక్కెట్లు లేవు. సంచీ పుచ్చుకుని, బిక్క మొగం వేసుకుని లారీలు ఆగేచోటు నుంచున్నాను - తారకమంత్రం సడెన్‌గా మర్చిపోయిన నారదుళ్ళా. అదేం మాయో ఆ వేళ లారీలు కూడా ఆ దార్లో కనబడలేదు. ఎక్కడ యాక్సిడెంట్లు చెయ్యడానికి పోయాయో! ఎట్లారానాయనా అని వంటికి చెమట్లు పడుతున్న సమయంలో అదృష్టవశాత్తూ బెజవాడ పోతున్న దున్నపోతొకటి కనబడింది. దానికాళ్ళూ, తోకా పట్టుకుని, బతిమాలి, ఎదురుగా ఉన్న హోటల్‌కి తీసుకెళ్ళి కాస్త ఎండుగడ్డీ, కుడితీ సమర్పించుకుని, కొమ్ముకి సంచీ తగిలించి దానిమీదెక్కాను. దున్నపోతు అంతకు ముందే ముందు మీదున్నట్టుంది. హుషారుగా ఈలవేస్తూ సాగించింది ప్రయాణం. మందు మీద దున్నపోతు, దానిమీద నేను బస్సు కంటే ముందరే చేరుకున్నాం బెజవాడ.

దున్నపోతుమీద పోవడం చేత కాబోలు ఆఫీసుపని, మిగతా సొంతపనులన్నీ చకచకా సజావుగా సాగిపోయినై. స్టేషన్ కొచ్చి టిక్కెట్టు తీసుకున్నాక తెలిసింది. రైలు ఒక పూట లేటుగా వస్తుందని. ఈలోగా బయట కొచ్చి పేవ్‌మెంట్ మీద తెలుగు సినిమా పాటల పుస్తకాలు కొనుక్కున్నాను. సరదాగా కాసిని రెండర్థాల బూతు పాటలు చదువుకుంటూ ప్లాట్‌ఫాం మీద గడిపేద్దామని, పాటల్తో బాటు ముంతమషాలా పొట్లాలు కాసిని కట్టించుకుని బెంచీమీద బైఠాయించాను. ఇంక నన్ను జయించేవాడు లేడు.

ఒకపూట ఆ విధంగా గడిచాక, లౌడ్ స్పీకర్లో ఎనౌన్సర్ "రైలొచ్చిందోయ్ మామ రైలొచ్చిందోయ్" అని పాడింది. కుమ్ముకుని కూచున్నాం గాని, రైలు మాత్రం వానపాములా ప్లాట్‌ఫాం మీద పడుకుండిపోయింది. ఎంతకీ కదలదు. నీళ్ళు పట్టాడు, కదల్లేదు రైలు. ఎవరో ప్రజాప్రతినిధి సలహా ఇస్తే మందు పట్టారు. తాగింది కాని కదల్లేదు రైలు. చల్లగా చెప్పారు ఇంజన్ చెడిపోయిందని. డ్రైవరు, గార్డు, స్టేషన్ మాష్టరు తెలివైన వాడవడం వల్ల బతికిపోయాం. రైలుకి అటూ ఇటూ ఇనుప గొలుసులు కట్టి రాదారి పడవలా రైల్వే కూలీలతో లాగించారు. ఒక బొజ్జాయన నా మీదా, నేను మరొకాయన మీదా, ఆయన ఇంకొకాయన మీదా పడి గుర్రుపెట్టి ఒక కునుకు తీసేప్పటికి మా ఇల్లొచ్చేసింది.

ఇనస్పెక్షన్ కెళ్ళొచ్చినా, ఖాళీ జేబులుతో తిరిగొచ్చిన మొగుణ్ణి చూసి మా ఇంటావిడ ఇంట్లో ఏమేం నిండుకున్నాయో, ఈలోగా ఎంతమంది బంధువర్గం ఇంటిమీద దండయాత్ర చేసిందో దండకం చదివి, నా శక్తి సామర్థ్యాలకి బహుమతిగా బాత్రూం తడిక పక్కన కాస్త పసుపు ముద్దపెట్టి బాల్చీలోకి వేణ్ణీళ్ళు తోడింది. కుంభమేళాకెళ్ళి కమండలం పారేసుకొచ్చిన సాధువులా ఫీలయి, ఆఫీసుకి పారిపోవడానికి అవసరమైన ప్రయత్నాల్లో పడ్డాను.

గబగబా లుంగీ లుంగ చుట్టుకుని, మంగలి పాది బయటికి తీసి, గడ్డానికి సబ్బెక్కించి రేజర్ పట్టుకుని అద్దంలోకి చూశాను. అంతే గజ్జల్లో తేలు కుట్టినట్టయింది. అద్దంలో నా ముఖం కనబడ్డం లేదు. నీళ్ళతోనూ, గుడ్డతోనూ అద్దాన్ని శుభ్రంగా తుడిచి మళ్ళీ చూశాను. ఉహూ - అద్దంలో మెడ వరకూ తప్ప నా ముఖం మాత్రం కనపడ్డంలేదు. ఇలా ఎంతకాలంగా జరుగుతోందో. అసలు ఎంతకాలంగా నాకు ముఖం లేకుండా పోయిందో ఇంతకాలం గమనించనందుకు తిట్టుకుని, ఇప్పుడే ముఖం పెట్టుకుని ఆఫీసుకెళ్ళాలిరా నాయనా అని అన్ని రాగాల్లోను ఏడ్చి, ఏం చేయాలో తోచక ఆ వేళ్టికి మాత్రం తన ముఖం అరువివ్వమని మా ఆవిడ్ని బతిమాలుకుని, ఆవిడ ముఖం తగిలించుకున్నాను. 'ఎవరన్నా నవ్వుతారేమోనండీ' అని ఆవిడ సణుగుతూనే ముఖం తీసిచ్చింది.

ఆవిడ ముఖం తగిలించుకుంటూ ఉంటే నుదుటి మీద మేకు జారి కిందపడింది. అదీ సంగతి. గవర్నమెంటు ఉద్యోగంలో చేరేటప్పుడే నుదిటిమీద మేకు కొట్టారన్నమాట. మేకు కాస్తా లూజై నా ముఖం కాస్తా ఎక్కడో జారిపడిపోయిందన్న మాట. ఆవిడ ముఖం పెట్టుకున్నాక అద్దంలోకి చూస్తే నాకే నవ్వొచ్చింది. నా మెడమీద ఆవిడ ముఖం తమాషాగా కనబడింది. బొట్టు, కాటుక, చెవులకి లోలకులు, ముక్కుకి బేసరి - సరే, అర్ధనారీశ్వరుడు లేడా అని సర్దిచెప్పుకుని బయల్దేరాను.

చిత్రం - బస్సులోగాని, దారిలోగాని ఎక్కడా కూడా ఎవరూ నన్ను చూసి నవ్వలేదు. ఎందుకని నవ్వలేదా అని అందరి ముఖాల్లోకి పరిశీలనగా చూశాను. షాక్ కొట్టినట్టయింది. చాలా మందివి వాళ్ళ ముఖాలు కావు. కొందరు మొగాళ్ళకి ఆడముఖాలు, కొందరు ఆడాళ్ళకి మగముఖాలు, కొందరివి గాడిద ముఖాలు, కొందరివి ఎలుగుబంటి ముఖాలు, కొందరివి కప్ప ముఖాలు - ఇట్లా చాలామంది మనుషులు జంతువుల ముఖాలు తగిలించుకుని తిరగేస్తున్నారు. వ్యాపారాలు, ఉద్యోగాలు, రాజకీయాలు చేసేస్తున్నారు. పదవుల్లోకి పాకేస్తున్నారు.

ఆఫీసుకి చేరి, రిజిష్టర్‌లో సంతకం చేయబోతే మరోసారి షాక్ కొట్టింది. ఏమి చెయ్యనా నాయనోయ్. ఈసారి నా కుడిచేయి, కనబడ్డంలేదు. చేయివుండే చోట చొక్కా ఖాళీగా ఉండి, గాలి దూరి ఊగుతోంది. నన్ను చూసి నవ్వుతోంది. ఎడం చెయ్యి మాత్రం మామూలుగానే ఉంది. కుడిచెయ్యి మాత్రం లేదు. ఎక్కడ పడిపోయుంటుందబ్బా అని ఆలోచిస్తూ మా ఆవిడ ముఖానికి పట్టిన చెమటని నా ఎడం చేత్తో తుడుచుకుంటూ సీట్లో కూలబడ్డాను.

ఎంత ఆలోచించినా నా కుడిచెయ్యి ఎక్కడ పడిపోయిందో తట్టలేదు. రైలు ప్రయాణంలో ఉన్నట్లుంది. బస్సు రష్షులో ఎక్కడన్నా జారిపోయుంటుందా? లేక ఎవడన్నా తస్కరించాడా? ఎంత మధనపడ్డా మా ఆవిడ ముఖంలోని ముక్కు చీదేస్తున్నదే తప్ప చెయ్యెక్కడ పోయిందో తట్టలేదు.

మా ఆఫీసరు ఇంకా రాలేదు. తోటి ఖైదీలు మాత్రం నెమ్మదిగా ఒకరొకరు వస్తున్నారు. ఈలోగా ఒక చల్లని వార్త మా ఆవిడ చెవికి సోకింది. ఆఫీసరు గారింట్లో పేరంటంట, వారు మధ్యానానికి గాని ఆఫీసుకి రారని ప్యూనుగారొచ్చి చెప్పారు. అమ్మయ్య, ఇనస్పెక్షన్ రిపోర్టు తయారు చెయ్యడానికి కాస్త టైము దొరికింది కదా అని మా ఆవిడ ముక్కుతో కాస్త ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నాను.

సరేనయ్యా, మరి ఇనస్పెక్షన్ రిపోర్టు దేంతో రాయాలి? కుడిచెయ్యి లేదే మా బావమరిది గుర్తొచ్చాడు. రిక్షాలో బామ్మరిదింటికెళ్ళాను. మావాడు ఒక ప్రముఖ దినపత్రికలో ఉపసంపాదకుడిగా పన్జేస్తున్నాడు. నా అదృష్టం బాగుంది. దేవుడి వల్ల, విధివల్ల, అదృష్టం వల్లనేకదా మనం ఈ మాత్రమన్నా బతగ్గలుగుతున్నది. వాడు ఇంట్లోనే ఉన్నాడు. ఆవాళ వాడికి సెలవు. ఇంట్లోనే ఉల్లిపాయలు తరుగుతూ ఉన్నాడు. తరిగేవరకూ ఆగి, వాణ్ణి కూడా యధాశక్తి బతిమాలి, రాత్రికి తప్పక ఇచ్చేస్తానని ఎడం చేత్తో ప్రమాణం చేసి, వాడి కుడి చెయి తీసుకుని నా భుజానికి తగిలించుకుని, అదే రిక్షాలో ఆఫీసుకి తగలబడి రిపోర్టు రాయడం మొదలెట్టాను కానీ అదేం ఖర్మమో పట్టుమని రెండు వాక్యాలు రాయలేకపోయాను. నేను రాద్దామనుకున్న వాక్యాలు కాకుండా మా బామ్మరిది కుడిచెయ్యి దానిష్టమొచ్చిన వాక్యాలు అది రాసేస్తూంది. వాటిని నా ఎడంచెయ్యి జోక్యం కల్పించుకుని కొట్టేస్తూంది. మా బామ్మరిది పత్రికలలోనే కాక మంత్రులకీ, ఇతర పెద్ద అధికార్లకీ, ప్రముఖులకి ఉపన్యాసాలూ గట్రా రాసిపెట్టే అలవాటుంది. అందుకని, నేను రాద్దామనుకునే వాక్యాలుకాక, నా ఇనస్పెక్షన్ గురించి అన్నీ అబద్దాలు రాసేస్తూంది. నా మెదడు ఎంత చెప్పినా కుడిచెయ్యి మాత్రం వినడం లేదు. సరిగ్గా రాయమని, నిజాలు రాయమని, రాసింది కొట్టెయ్యమని మెదడు ఆజ్ఞలు జారీ చేసినా కుడిచెయ్యి పట్టించుకోవడం లేదు.

ఇంక నా వల్లగాక, రాత ఆపి, కాఫీ తాగుదామని కాంటిన్‌కి వెళ్ళాను. అక్కడా ఇంతే. సర్వర్ కాఫీ తీసుకొచ్చి పెట్టాడు. మా బామ్మరిదికి టీ అలవాటులాగుంది - కాఫీ కప్పు ముట్టుకోవడంలేదు. సరేనని, పూర్తిగా రాజీపడిపోయి టీకి ఆర్డరిచ్చాను.

వెంటనే కుడిచెయ్యి టీకప్పు ఆప్యాయంగా ఎత్తి పట్టుకుంది. పెదాలవరకీ హుషారుగా తీసుకెళ్ళింది టీ కప్పుని. అంతే - నోరు తెరుచుకోవడం లేదు. పెదాలు విడివడడం లేదు. ఆవిడకి టీ తాగితే నిద్రపట్టదు. ఈ బాధ పడలేక తిరిగి కాఫీ తెప్పించుకుని ఎడంచేత్తో తాగేశాను.

ఇంకా నయం మా బామ్మరిది ఉద్యోగం పత్రికాఫీసుకాబట్టి సరిపోయింది. అబద్దాలన్నా రాస్తూంది. మావాడు ఏ పోలీసు ఆఫీసరో కాలేదు. ఈ చేత్తో పైవాళ్ళకి సలాం చేసి, కిందవాళ్ళని చావగొట్టి ఇవాళ్ళలా ఛండాలప్పన్లన్నీ చేసేవాణ్ణి, అని ఊరడించుకుని, ఇంక లాభం లేదని వాడి చెయ్యి వాడికిచ్చేసి వద్దామని నాకాళ్ళమీద లేచి నిలబడ్డాను. ఇవి నా కాళ్ళేనా? ఇంక అన్నీ అనుమానాలే. సరే ఆవేళ్టకి నాకు సిగరెట్టు తాగే యోగంలేదని ఈ పాటికి మీకు తెలిసిపోయుంటుంది. నా భుజాల మీద కూచున్నది మా ఆవిడ ముఖంకదా!

పాత సామాన్లు అవయవాలు అమ్మే మార్కెట్టుకి పోవాలి వచ్చే ఆదివారం. నాకు సరిపోయే ముఖం, చెయ్యి ఏమన్నా దొరుకుతాయేమో కొనుక్కోవచ్చు. అందాకా ఈ బాధ తప్పదు.

●●●●

అంత్యక్రియలు

తాళ్ళూరు నాగేశ్వరరావు

(1972 యువ సంచికనుండి)

డియర్ సూరీ,

... ఇక్కడకొచ్చి నెలరోజులైంది. రెండు వారాలనుంచీ హాస్పిటల్లో బెడ్ మీద చావుతో కుస్తీ పడుతున్నా, మరణం ఖాయమని డాక్టర్లు ఏకవాక్యతగా నిర్ణయించారు. ఎర్రదీపం ఆరడానికి అట్టేకాలం లేదు. ఆఖరు క్షణాలు. 'నా' అనేవాళ్ళు ఎవ్వరూ లేకపోయినా దిక్కుమాలిన కుక్క చావు చావడం నాకిష్టంలేదు సూరీ. నువ్వు అయినా ఒకసారి వచ్చి, చూపు అందుకోమని ప్రార్థిస్తున్నా. ఆఖరి కోరిక ఒకటుంది. అందరిలాగే పూట్టాను. కాని పిచ్చిమొక్కలా బ్రతికాను. అయితే, పిచ్చిమొక్కలా చావడానికి నా మనస్సు ఒప్పుకోవడం లేదు సూరీ! సామాన్య మానవుడు చనిపోయేటప్పుడు ఏర్పాటు చేసే అంత్యక్రియల తతంగం నాకు కూడా ఏర్పాటు చేయాలని ఆఖరు కోరికగా అర్థిస్తున్నాను. నీకు ఏ మాత్రం టైము ఉండదని నాకు తెలుసు. అయినా జీవయాత్ర ముగిస్తూన్న చిన్ననాటి మిత్రుని కోరిక తప్పకుండా మన్నించి వస్తావుకదూ! జారిపోతున్న ప్రాణాన్ని కళ్ళల్లో నిల్పుకుంటూ ఎదురుచూస్తుంటాను.

- నారాయణ మూర్తి.

ఆ ఉత్తరం ఆ రోజు సాయంకాలం టపాలో వచ్చింది. మధ్యాహ్నం ఫ్యాక్టరీ నుంచి ఒంటిగంటకు వచ్చాడు సూర్యప్రకాశం. బ్లాక్ లేబుల్ బీరు పుచ్చుకుని, భోజనం చేసి, ఎయిర్ కండిషన్డ్ గదిలో పడుకున్నాడు. గాఢంగా నిద్రపోయి, సాయంత్రం అయిదు గంటలకు లేచేసరికి టీపాయ్ మీద ఆ ఉత్తరం ప్రత్యక్షమైంది.

బద్ధకంగా ఒళ్ళువిరుచుకుంటూ, 'ఎక్కడనుంచి వచ్చిందబ్బా ఆ ఉత్తరం?' అనుకున్నాడు సూర్యప్రకాశం, అంతలోనే ఫోన్ మోగింది. ఫోన్ ఎత్తాడు. ఒక బిజినెస్ ఫ్రెండ్ పది నిముషాలసేపు ఫుల్‌స్టాప్ లేకుండా అవతల వ్యక్తి మాట్లాడాడు. అన్నింటికీ 'ఉఁ!' 'ఆఁ!' అంటూనే ఇంటరెస్టుగా విన్నాడు సూర్యప్రకాశం. రాత్రికి 'క్వాలిటీ'లో డిన్నరుకు రమ్మనమని ఆహ్వానించాడు ఆ ఫ్రెండ్; ఒక బిజినెస్ మ్యాగ్నెట్‌కు పెద్దెత్తున డిన్నరిస్తున్నాడట! కంపెనీ కోసం రమ్మనమని పట్టుబట్టాడు. 'సరే' అన్నాడు సూర్యప్రకాశం.

ఫోన్ కిందపెట్టి, ఆ ఉత్తరాన్ని అందుకొంటుండగానే, నాయర్ టీ పట్టుకొచ్చాడు. టీ త్రాగాక, సిగరెట్టు ముట్టించి తాపీగా ఉత్తరం చించాడు. అంతలో మళ్ళీ ఫోను మోగింది. అవతల ఫ్యాక్టరీ మేనేజరు. ఫ్యాక్టరీ గొడవలు ఏకరువు

పెట్టసాగాడు. సాయంత్రం మూడు గంటలకు కార్మికనాయకులు బేరానికి వచ్చారట. చట్ట ప్రకారం బోనస్ డిక్లేర్ చేయలేదనీ, మరో అయిదుశాతం కార్మికులకు రావలసి ఉంటుందనీ, అది ఇవ్వకపోతే ప్రత్యక్ష చర్యకు దిగవలసి వస్తుందనీ బెదిరించారట. ఈ సంవత్సరం లాభాలు ఆశించినట్టుగా రాలేదనీ, అయినా ఇంకో మూడుశాతం పెంచడానికి తాను ప్రయత్నిస్తాననీ నచ్చజెప్పి పంపించినట్టు మేనేజరు చెప్పుకు రాసాగాడు. ఫోన్‌లో ఆ సంభాషణ పావుగంటదాకా సాగింది.

ఫోన్ కిందబెట్టి, ఉత్తరం కేసి దృష్టి మళ్ళించేటప్పటికి, రెండో కొడుకు చంద్రం వచ్చి 'డాడీ? మీ కోసం ఎవరో వచ్చారు కింద కూర్చున్నారు.' అన్నాడు. సూర్యప్రకాశం వెంటనే లేచి, మేడ దిగి కిందకు వచ్చాడు. బంజారా హిల్స్‌లో ఒక పెద్ద బిల్డింగ్ అమ్మకంలో వ్యవహారాలు పరిష్కారం చేసుకోడానికి ముగ్గురు మనుష్యులు వచ్చారు. వాళ్ళతో ఓ గంట సేపు మాట్లాడాడు సూర్యప్రకాశం. వ్యవహారాన్ని మాటలతో పరిష్కారం వేసుకుని వాళ్ళు వెళ్ళిపోయారు. అప్పుడు మళ్ళీ ఉత్తరం సంగతి జ్ఞాపకం వచ్చి, మేడమీదకు వెళ్ళాడు సూర్యప్రకాశం.

మళ్ళీ ఫోను పిలిచింది. ప్రభుత్వ పరిశ్రమల శాఖలో ఉన్నతోద్యోగంలో ఉన్న ఒకాయన అర్జంటుగా వెయ్యి రూపాయలు కావాలని ఫోను చేశాడు. దానిదేముంది, అట్లాగే పంపిస్తానని చెప్పాడు సూర్యప్రకాశం.

ఆరున్నరైంది బాగా చీకటిపడింది. మూడు గంటలకు ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో మీటింగ్ ఉంది దానికి తప్పకుండా వెళ్ళాలి. కొన్ని వ్యాపార విధానాలపై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే సమావేశం. పట్టణంలోని వ్యాపార విధానాలపై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే సమావేశం. పట్టణంలోని వ్యాపార ప్రముఖులంతా వస్తారు. ఆ తర్వాత 'క్వాలిటీ'లో డిన్నర్. పది గంటలకు డిన్నర్ ముగించుకుని పెందలాడే పడుకోవాలి. తెల్లవారు ఝామున నాలుగింటికే లేచి ఎయిర్ పోర్టుకి వెళ్ళాలి. ఆరుగంటల ప్లేన్‌లో కలకత్తా వెళ్ళి పన్నెండు గంటలకు ఒక బిజినెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలి. అది చాలా ముఖ్యం. తనకు అందుబాటులో ఉన్న కాలానికీ, నిర్వహించవలసిన వ్యవహారాల ఒత్తిడికీ లంగరందుతుందా? అనుకుంటూ ఆ ఉత్తరం చదివాడు సూర్యప్రకాశం.

మనస్సు చివుక్కుమంది. ముల్లు గుచ్చుకున్నట్టుగా క్షణంలో సగం సేపు ఊపిరాడలేదు. జాలితో కూడుకున్న ఆవేశం ఉప్పొంగింది. 'అయ్యో!... పాపం! నారాయణమూర్తి!' అనుకున్నాడు సూర్యప్రకాశం.

...ఏడాది క్రితమే ఓసారి తన దగ్గరకు వచ్చాడు నారాయణ మూర్తి. బక్కచిక్కి, బిక్కమొహంతో, చింపిరి జుత్తుతో, చిరిగిన చొక్కాతో, పీక్కుపోయిన కళ్ళతో, వ్యాధిగ్రస్తునిలా వీధి గుమ్మంలో ప్రత్యక్షమయ్యాడు. తను మొదట్లో నిజంగా గుర్తుపట్టలేదు. అడుక్కోవడానికి వచ్చిన అభాగ్యుడేమో అనుకున్నాడు. నికృష్టదారిద్ర్యం నాట్యమాడుతున్న మొహంలోకి బలవంతాన నిట్టూర్పులాంటి నవ్వు తెప్పించి, 'నేను... నారాయణమూర్తిని.. నీ చిన్ననాటి మిత్రుణ్ణి' అన్నాడు. అప్పటికి గానీ గుర్తు రాలేదు. ఆర్థిక స్థితిగతుల హెచ్చు తగ్గులు మనుషుల రూపురేఖల్నే మార్చివేస్తుంటాయి. అమాంతంగా కావిలించుకుని, ఇంట్లోకి తీసుకొచ్చి, సోఫామీద కూర్చోబెట్టి, ఆప్యాయంగా తను పరామర్శించాడు. అంతకాలంగా ఓ ప్రైవేటు కంపెనీలో గుమాస్తాగా పనిచేస్తున్నాడట. వ్యాపారం దెబ్బతినడంతో, కంపెనీ మూసివేశారట ఉద్యోగం పోయిందట. మళ్ళీ ఉద్యోగం కోసం వీధి కొళాయిల్లో నీళ్ళు త్రాగుతూ, అరికాళ్ళు బొబ్బలెక్కేట్టు తిరుగుతూ, బోర్డు చూసి వచ్చాడట. ఏదైనా చిన్న ఉద్యోగం ఇప్పించవలసిందిగా ప్రాధేయపడ్డాడు. తనకు ముమ్మరంగా జాలివేసింది. తప్పకుండా చూస్తానని మాట ఇచ్చాడు తను. అప్పటి వరకూ తన ఇంట్లోనే ఉండమన్నాడు. కాని ఉండటానికి ఒప్పుకోలేదు. ఆత్మాభిమానం మెండుగా ఉన్న వ్యక్తి. కొంతమందికి ఆత్మాభిమానమే ఆస్తి. దాన్ని కాపాడుకోడానికి జీవితకాలాన్నంతా వెచ్చిస్తారు. మళ్ళీ కలుసుకుంటానన్నాడు నారాయణమూర్తి. కాని కలుసుకోలేదు. తను ఉద్యోగం చూడనూ లేదు. వ్యాపార వ్యవహారాల్లోబడి అతన్ని గురించి దాదాపు

పూర్తిగా తను మర్చిపోయాడు. పాపం.. ఏం జబ్బో! పెళ్ళి చేసుకోలేదు. తల్లితండ్రులు చిన్నతనంలోనే పోయారు. మొదటినుంచీ జీవిత శకటాన్ని స్వహస్తాలతో నెట్టుకోవాల్సిన దుర్గతిపట్టిన నష్టజాతకుడు. మేనమామ ఇంట్లో పెరిగాడు. స్కూలుఫైనలు దాకా చదువుకున్నాడు. స్వేచ్ఛగా బ్రతకాలనే ఆశయంగలవాడు. కాని దారిద్ర్యం నీడలా వెంటాడుతున్నప్పుడు స్వేచ్ఛను వాంఛించిమటుకు ప్రయోజన మేముంది? 'పెళ్ళి ఎందుకు చేసుకోలేదు?' అనే ప్రశ్నకు, జీవితంలో ఆర్థికంగా స్థిరపడితేనే గానీ, అట్లాంటి విశ్వాసం గట్టిగా కలిగితేగానీ చేసుకోనని చెప్పాడు. పూర్ ఫెలో!...***ఒక్కొక్కళ్ళ జీవితం ఆలోచనకు అందనంతగా మలుపులు తిరుగుతూ, చీకటి అనే గమ్యస్థానం వైపుకు ప్రయాణం చేస్తూ ఉంటుంది*** అనుకున్నాడు సూర్యప్రకాశం.

ఆరూ ముప్పావు అయింది.

వెంటనే లేచాడు సూర్యప్రకాశం ఆలోచనలకు సడన్ బ్రేకు వేసి నిమిషాల మీద డ్రస్సు చేసుకున్నాడు. మేడ దిగి వచ్చేసరికి డ్రైవరు కారు సిద్ధం చేశాడు. ముందు ఛాంబర్ ఆఫ్ కామర్స్ మీటింగుకు వెళ్ళి, ఆ తర్వాత హాస్పిటల్‌కు పోయి, నారాయణమూర్తిని చూద్దామనుకున్నాడు. అతని మనస్సులో నారాయణ మూర్తి మెదులుతూనే ఉన్నాడు. ఆ మీటింగ్ లేకపోతే, అది అంత ముఖ్యమైంది కాకపోతే, ముందుగానే హాస్పిటల్‌కు వెళ్ళి ఉండేవాడు. కానీ మీటింగుకు వెళ్ళక తప్పదు. ఒక్కొక్కప్పుడు పరిస్థితులు మనస్సును, పోకడలను కండిషన్‌లో పెడతాయి.

ఛాంబర్ ఆఫ్ కామర్స్ మీటింగ్ అయ్యేసరికి ఎనిమిది గంటలైంది. ఇంకా మినిట్స్ వ్రాయకముందే బయటి కొచ్చాడు సూర్యప్రకాశం. అతని మనస్సులో నారాయణమూర్తి మృత్యుముఖమే భయంకరంగా కదులాడుతోంది. మీటింగ్‌లో ప్రధానమైన విషయాల చర్చ జరుగుతూన్నప్పుడు కూడా నోరు విప్పలేక పోయాడు. అన్నింటికీ తలాడించి ఊరుకున్నాడు. ధ్యాసంతా నారాయణ మూర్తిమీదే ఉంది. తను అసలు నేరుగా హాస్పిటల్‌కు వెళ్ళి ఉంటే బావుండేదేమో! వ్యాపార వ్యవహారాల సాంద్రతలో తను మానవత్వాన్ని కోల్పోనున్నాడేమో! మానవజీవితపు విలువల్ని, మానవీయ సమస్యల్ని మర్చిపోతున్నాడేమో!

ఆదుర్దాగా కారులోకి వచ్చి కూర్చున్నాడు సూర్యప్రకాశం. మస్తిష్కమంతా మబ్బుపట్టి ఉంది. ఫలానా హాస్పిటల్‌కు జల్దీగా వెళ్ళమని డ్రైవర్ని ఆదేశించాడు. నారాయణ మూర్తి దైన్యావస్థను ఆలోచించుకుంటూ బెన్‌సన్ సిగిరెట్టు ముట్టించాడు.

అయిదు నిమిషాల్లో కారును హాస్పిటల్ ఆవరణలో ప్రవేశ పెట్టాడు డ్రైవరు. ఎంక్వయిరీ చేయగా నారాయణమూర్తి బెడ్ జనరల్ వార్డులో ఉన్నదని చెప్పారు. అంగలూ పంగలూ వేసుకుంటూ అక్కడికి వెళ్ళాడు సూర్యప్రకాశం.

నెత్తురు ఎండిపోయిన నల్లిలా బెడ్‌కు అంటుకుపోయి ఉన్నాడు నారాయణమూర్తి. మొహంలో చావుకళ పడింది. చైతన్యం ఏమాత్రం లేదు. కళ్ళు బాగా లోతుకు పీక్కుపోయాయి. కాళ్ళూ, చేతులూ చల్లబడిపోయి కట్టెల్లా బిర్రబిగుసుకున్నాయి. శరీరంలో ఏ కోశానా జీవమున్నట్టు లేదు. నిలువు గుడ్లు పడ్డాయి. తలకింద దీపం పెట్టడమే తరువాయి.

నారాయణ మూర్తిని చూడగానే సూర్యప్రకాశానికి హఠాత్తుగా బ్లడ్ ప్రెషర్ పెరిగినట్లయింది. ఉద్వేగపూరితమైన జాలితో గుండెదడ హెచ్చింది. కొన్నిక్షణాలపాటు పెదవి విప్పకుండా, రెప్పవాల్చకుండా, ఊపిరి పీల్చకుండా దిగాలుపడి చూస్తూ నిలబడ్డాడు.

అంతకుముందు ఇంజక్షన్ ఇచ్చిన నర్సుకూడా రోగి పరిస్థితికి జాలిపడుతూ పరిస్థితికి జాలిపడుతూ చూడసాగింది. జీవంలేని కట్టెకు నీరు పోసి మటుకు లాభమేముంది?

"మూర్తీ!.. మూర్తీ!.." అన్నాడు సూర్యప్రకాశం కట్టలు తెంచుకున్న ఆవేశంతో.

నారాయణమూర్తి చూపు రవ్వంత కదిలి, సూర్యప్రకాశం వైపుకు మళ్ళింది. కొవ్వొత్తి అంతిమ కాంతి ప్యూర్ వైట్ కాంతికేసి ఏ పాటి చూడగలదు? అంతే. ఆ పైన అతని పెదవులు విచ్చుకోలేదు.

"ఇంతకుముందే మాట పడిపోయింది సార్" అన్నది నర్సు.

అంతలో డాక్టరు వచ్చాడు.

"డాక్టర్ సాబ్ ఈ రోగి పరిస్థితేమిటి? బ్రతుకుతాడా?" అన్నాడు సూర్యప్రకాశం.

"ఆఖరి క్షణం వరకూ రోగి బ్రతకడని చెప్పడం మా ధర్మం కాదు. నా ఊహ ప్రకారం మరణం నిముషాల్లోనే ఉంది. ఆ పైన భగవంతుని అనుగ్రహం, ఆగ్రహం.." అంటూ నాడి పట్టుకు చూశాడు డాక్టరు. వాడిన పువ్వులా నిట్టూర్పు విడిచాడు.

"అంతేనంటారా?" అన్నాడు సూర్య ప్రకాశం.

"అవును. ఈశ్వరేచ్ఛను డాక్టర్లు పసిగట్టగలరా? ఈ స్థితిలో రోగి బ్రతకడమనేది నా ఇరవయ్యేళ్ళ సర్వీసులో చూడలేదు.. మీకు బంధువా?" అన్నాడు డాక్టరు.

"స్నేహితుడు.." అన్నాడు సూర్యప్రకాశం.

"మీ కోసమే కామోసు మాట పడిపోయేదాకా తెగకలవరించాడు సార్" అన్నది నర్సు.

సూర్యప్రకాశం కడుపులో తుప్పు కత్తులతో కెలికినట్లయింది. తప్పు చేసిన వాడిలా తలవంచుకున్నాడు. ఛీ, ఛీ తను మానవత్వాన్ని కోల్పోయి - వ్యాపార మృగంగా మారిపోయాడు అనుకుంటూ తిట్టుకున్నాడు.

"శవాన్ని నాకు అప్పగిస్తారా? అంత్యక్రియలు చేయిస్తాను" అన్నాడు సూర్యప్రకాశం మిత్రుని ఆఖరి కోరికను మన్నించడం ద్వారా అతని ఆత్మకు శాంతి చేకూర్చడానికి.

"ఓ, యస్, అట్లాగే" కాసేపు ఆగండి అన్నాడు డాక్టరు మరో వార్డుకు వెళుతూ.

పది నిమిషాలు అక్కడే నిలబడ్డాడు సూర్యప్రకాశం నిశ్శబ్దంగా మరణిస్తూన్న వ్యక్తి చుట్టూ ఆవరించే నిశ్శబ్దమే అక్కడకూడా నెలకొని ఉంది. ఇంకా రోగికి చూపు సాంతం పడిపోలేదు: గుండెలో ఎర్రదీపం పూర్తిగా ఆరిపోలేదు.

'క్వాలిటీ'లో డిన్నర్ సంగతి జ్ఞాపకం వచ్చింది సూర్యప్రకాశానికి. తనకోసం వాళ్ళంతా ఎదురు చూస్తూ ఉంటారు. అప్పటికి అరగంట ఆలస్యమైంది. ఏం చేయడమా అని తీవ్రంగా ఆలోచించాడు సూర్యప్రకాశం. డిన్నర్లకూ, పార్టీలకూ, తూ.చ. తప్పకుండా హాజరుకావడం వ్యాపారస్తుని జీవితంలో ఒక భాగం. వ్యాపారాభివృద్ధికి వ్యాపారపు హోదాకూ ఎంతైనా ముఖ్యం. ఒక ఆలోచన తట్టింది. వ్యాపారపు నిర్ణయాలు తీసుకోవడంలో, వాటిని సత్వరం అమలు పర్చడంలో సూర్యప్రకాశం ఆరితేరిన ఘటం, డెసిషన్ - మేకింగ్ టెక్నిక్ ద్వారానే ఆరు సంవత్సరాల వ్యాపరంలో అరవై లక్షల రూపాయల లాభాన్ని కళ్ళజూశాడు.

వెంటనే హాస్పిటల్లో ఫోన్ రూముకు వచ్చాడు. ఫ్యాక్టరీ హెడ్ గుమాస్తాను పిలిచాడు.

"కామేశం!... ఇక్కడ హాస్పిటల్లో నా ఓల్డు ఫ్రెండ్ ఒకాయన ఒక అరగంటలో చనిపోయేట్టు ఉన్నాడు. దిక్కూ దివాణం లేనివాడు. మనం అంత్యక్రియలు జరిపించి, ఆత్మశాంతిని చేకూర్చాలి. నాకు టైం లేదు. ఒక డిన్నర్‌కి వెళ్ళాలి. తెల్లవారు ఝామున ప్లేన్‌లో కలకత్తా వెళ్ళాలి. కాబట్టి ఈ వ్యవహారమంతా నా తరపున నువ్వే స్వయంగా చూడాలి. డెలిగేషన్ ఆఫ్ అథారిటీ. రెస్పాన్సిబిలిటీ అనుకో. అందుచేత, నువ్వు వెంటనే స్మశానానికి వెళ్ళి అక్కడ వెట్టివానితో మాట్లాడి,

శవాన్ని పూడ్చిపెట్టడానికి. ఇతర తతంగాలకూ ఏర్పాట్లన్నీ చేయి. అతనికి పదో, పదిహేనో ఇచ్చి, రాత్రి ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండమని చెప్పు. ఒక టాక్సీ తీసుకుని, ఇక్కడకు రా. నా ఫ్రెండ్ పేరు నారాయణమూర్తి. జనరల్ వార్డ్‌లో పంధొమ్మిదో నెంబరు బెడ్. చనిపోగానే శవాన్ని అప్పగిస్తారు. 'క్వాలిటీ'లోనే ఉంటాను. పదిన్నర లోపు ఫోన్ చేయి. ఆ తర్వాత ఇంటికి ఫోన్ చేయి. వీలుంటే ఈ లోపల ఒకసారి నేనే ఫోన్ చేస్తాను." అన్నాడు సూర్యప్రకాశం. చేయవలసిన పనంతా పూసగుచ్చినట్టు చెప్పాడు. అంతా తను దగ్గరుండి, స్వయంగా అంత్యక్రియలు జరిపిస్తానని, మీరు నిశ్చింతగా ఉండమని సవినయంగా చెప్పుకున్నాడు హెడ్ గుమాస్తా. అంత్యక్రియలు తతంగం ముగిసేవరకూ తను కనురెప్పవాల్చనని కూడా హామీ ఇచ్చాడు.

సూర్యప్రకాశానికి బరువూ, బాధ్యతా పూర్తిగా తీరినట్లయింది. కొండంత రిలీఫ్ వచ్చింది. వెంటనే కారులో 'క్వాలిటీ'కి వెళ్ళి డిన్నర్ పార్టీలో చేతులు కలిపాడు.

కొత్త ఫ్రెండ్, స్కాచ్ విస్కీ, జింజర్ ఫ్రాన్స్, గోవాషిప్, కాశ్మీర్ చికెన్, కాబరే డాన్స్, హాట్ హాట్ జోక్స్, వ్యాపార వ్యవహారాల చర్చలు. ఓ గంట సేపు ప్రపంచాన్నే మర్చిపోయాడు సూర్యప్రకాశం. చనిపోతున్న నారాయణ మూర్తి విషయం ఏం జ్ఞాపకముంటుంది? తొమ్మిదీ ముప్పావుకు హెడ్ గుమాస్తానుంచి సూర్యప్రకాశానికి ఫోన్ వచ్చింది.

"స్మశానంలో ఏర్పాటులన్నీ చేశాను సార్! ఎంత అర్ధరాత్రి వచ్చినా వెట్టివాడు అజీలుగా ఉంటానన్నాడు. గొయ్యి కూడా తీసి ఉంచాడు సార్! టాక్సీ రెడీగా ఉంచాను. కాని ఇంకా నారాయణ మూర్తిగారి ప్రాణమే సాంతం పోలేదు సార్! ఇక్కడ వెయిట్ చేస్తున్నాం. డాక్టర్లు అరగంటో, గంటో అంటున్నారు.." అన్నాడు హెడ్ గుమాస్తా.

సూర్యప్రకాశం ఆదుర్దా పడ్డాడు. స్నేహితుని అంత్యక్రియలకు తానూ వద్దామనుకున్నాడు. కాని ఇంకా చావలేదు. తనకి టైం అట్టేలేదు. పెందలకాడే నిద్రపోవాలి. తెల్లవారుఝామున లేవాలి. ఎయిర్ పోర్టుకు వెళ్ళాలి. ప్లేన్ తప్పిపోతే అపార నష్టం! కాన్ఫరెన్స్‌కు బిజినెస్ మాగ్నెట్లు ఎంతో మంది వస్తారు. వాళ్ళతో పరిచయం ముందు ముందు ఎంతో ఉపయోగపడుతుంది.

"సరే ప్రాణం పోయేవరకూ వెయిట్ చెయ్" అంటూ ఫోన్ పెట్టేశాడు సూర్యప్రకాశం.

పదకొండు గంటలకు ఇంటికి వచ్చాడు సూర్యప్రకాశం.

ఘూర్ఖా గేటు తెరిచాడు. పోర్టికోలో కారు వచ్చేచోటికి భార్య ఎదురుగ్గా నిలబడింది. కొంచెంగా తూలుతూ కారు దిగాడు. సూర్యప్రకాశం. భార్య చేయిపట్టుకుంది. ఆమెకిది ఏమాత్రం కొత్తకాదు. కొన్నియేళ్ళ అనుభవం.

సూర్యప్రకాశం శరీరమంతా గాలిలో తేలిపోతున్నది. మనిషంతా జానీవాకర్ స్వింగ్ విస్కీనిషాలో ఊగిపోతున్నాడు. మెల్లగా మేడ మెట్లెక్కాడు. తెల్లవారు ఝామున నాలుగు గంటలకు నిద్రలేపమని భార్యతో చెప్పాడు. ఎయిర్ కండీషన్ గదిలో పడుకున్నాడు. మూడు నిమిషాల్లోనే గాఢనిద్ర పోయాడు సూర్య ప్రకాశం.

అర్ధరాత్రి దాటింది.

హఠాత్తుగా గుండెలో పోటు! గావుకేకపెట్టాడు సూర్యప్రకాశం. అతని భార్య ఉలిక్కిపడిలేచింది. భర్తకు గుండెనొప్పి వచ్చిందని గ్రహించింది. గాబరాపడిపోయింది. వెంటనే ఫ్యామిలీ డాక్టరుకు ఫోను చేసింది.

సూర్యప్రకాశం కలవరిస్తున్నాడు. నారాయణమూర్తి వికటాట్టహాసం!... మూర్తీ! చావలేదా నువు?.... బ్రతికావా?.... మృత్యువును జయించావా?.. శ్మశానంలో నీ కోసం తీసి ఉంచిన గొయ్యి.. నా కోసం రెడీగా ఉందా?.. నా అంత్యక్రియలకు నేనే ముందుగా ఏర్పాట్లు చేసుకున్నానా?... విధివిలాసమా! అంటూ పిచ్చిగా మాట్లాడసాగాడు సూర్యప్రకాశం.

ఆయన భార్య బెంబేలు పడిపోయింది.

అయిదు నిమిషాల్లో డాక్టరు వచ్చాడు. అంతకు రెండు నిమిషాల క్రితమే సూర్యప్రకాశం మాట్లాడడం మానివేశాడు. ఓ నిమిషం సేపు గురకపెట్టాడు. ఆ తర్వాత అదికూడా లేదు.

డాక్టరు వచ్చి పరీక్ష చేసి, ప్రాణం పోయిందని పెదవి విరిచాడు....

సూర్యప్రకాశం భార్య కెవ్వున కేక వేసింది.

నారాయణమూర్తి పెద్దపెట్టున నవ్వాడు.

ఆ నవ్వుకు గదిలో ఎయిర్ కండిషన్డు యూనిట్ హఠాత్తుగా ఆగిపోయినట్లయింది.

సూర్యప్రకాశం మంచం మీద నుంచి ఉలిక్కిపడి లేచాడు పక్కనభార్య నిశ్చింతగా నిద్రపోతోంది.

"ఛీ. ఎంత చెడ్డకలవచ్చింది!" అనుకున్నాడు సూర్యప్రకాశం. ఒళ్ళంతా చెమటపట్టింది టేబుల్ మీద గడియారం మూడుముప్పావు చూపెడుతూ ఉంది.

ఏమైనాడో నారాయణ మూర్తి అనుకున్నాడు సూర్యప్రకాశం. అంతలో టెలిఫోను మోగింది. రిసీవరు ఎత్తాడు.

"హల్లో!.. ఎవరూ! హెడ్ గుమాస్తా!.. ఆఁ.. ఏమిటి చెప్పు నారాయణమూర్తి చనిపోయాడా? రెండున్నరగంటలకా?.. శ్మశానంలో పూడ్చిపెట్టారా?.... అంతా సక్రమంగా జరిగిందన్నమాట! ఆల్‌రైట్! మనవిధి మనం నెరవేర్చాం!" ఫోను కింద బెట్టాడు సూర్యప్రకాశం.

గుండెమీద చెయ్యి పెట్టుకుని తడిమి చూసుకుంటూ ఆ పీడకల తనకెందుకొచ్చిందబ్బా? అనుకున్నాడు సూర్యప్రకాశం.

●●●●

నల్ల సుశీల

– వంశీ

(1975 ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక)

భూషణం పెట్రోమాక్స్ లైటు పట్టుకుని నడుస్తున్నాడు అడవిలో. వెనకాలే వెళుతోంది నల్ల సుశీల.

చీకటి చిక్కగా అలుముకుపోయి ఉంది.

సుళ్ళు తిరుగుతూ వీస్తోంది కొండగాలి.

చుక్కలతో నిండిపోయి ఉంది ఆకాశం.

నడుస్తున్న సుశీల కాళ్ళ మధ్యలోంచి నాగుపాము ఒకటి జరజరా పాక్కుంటూ వెళ్ళేసరికి టక్కున ఆగిపోయింది. ముందెళుతున్న భూషణం వెనక్కి తిరిగి – "ఆగిపోయావేం. రా!" అన్నాడు.

"పద!!" నడవడం మొదలెట్టింది.

"ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది. ఆ దొరగారు మనకోసం చూస్తూ ఉంటాడు. ఆయనగారికి కోపం చాలా ఎక్కువట." గొణుక్కున్నాడు భూషణం.

నలభై రెండో నంబరు టన్నెల్ దగ్గర ఎర్రదీపం ఆరగానే పచ్చదీపం వెలిగింది. గూడ్సు శిమిలిగూడా స్టేషన్ వదిలేసినట్టుంది.

కొంతదూరం నడిచారు. రైలు పట్టాలు దాటుతున్నప్పుడు కుడికాలి బొటనవేలుకి కలకర్రాయి గట్టిగా తగిలేసరికి "అమ్మా!" అని ముందుకి వంగింది. సరిగ్గా అప్పుడే ఆమె మెళ్ళో ఉన్న పెద్ద పెద్ద మంగళసూత్రాలు కిందకి వేలాడి ఊగాయి.

ఆగిన భూషణం - "మళ్ళీ ఏమైంది?" అన్నాడు.

"గొప్పు తగిలింది!"

వెనక్కొచ్చి పెట్రోమాక్సు లైటు కిందపెట్టేసరికి దాని కాంతిలో కనిపించింది చిట్లికారుతున్న రక్తం.

"అయ్యయ్యో! చాలా పెద్ద దెబ్బ..! తొందరగాపద! ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌కి వెళ్ళాక ఏదన్నా మందు అడుగుదాం" అన్నాడు.

కుంటుతూ అతని కూడా నడుస్తున్న సుశీల ఇప్పుడూ బాగా పాడైపోయింది కానీ చాలా అందగత్తె. ఒకప్పుడు సన్నగా, పొడుగ్గా నీలం రంగులో ఉండేది. చూపుడు వేలంత సన్నటి ముక్కు. దాని చివర మెరిసే ఎర్రరంగు ముక్కుపుడక కాళ్ళకి మువ్వల పట్టాలు పెట్టుకుంది. నడుస్తుంటే లయనిబట్టి గాలికొండపురంలో ఎవరన్నా సరే - "ఆ వెళ్ళే మనిషి నల్ల సుశీల కదూ?" అనేవారు.

వాళ్ళమ్మ చినముత్యానికి సుశీలంటే ప్రాణం. తన కాలికిలా దెబ్బ తగిలిందని తెలిస్తే ఈ భూషణంగాడి ప్రాణాలు తీసేస్తది. చిన్నప్పట్నుంచీ ముద్దుగా పెంచుకుంది. అరికాళ్ళ కింద పావుకోళ్ళలాగ సుశీలని అంటిపెట్టుకునే ఉంది. నల్ల సుశీలకి సపోటా పళ్ళంటే మహా ఇష్టం. వాటిని ఒలిచి పాలల్లో వేసి పెడుతుంది. ఇమాం పసందు మామిడిపళ్ళు ఇష్టంగా తింటుందని సంతలో కెళ్ళి మేలైన పళ్ళని తనే ఏరి తెస్తుంది. జీడిపప్పులో పంచదార కలిపి పెడుతుంది. పొద్దున్నే గేదె పొదుగుల దగ్గర తనే కూర్చుని పితికిన పాలు పరగడుపునే ఇస్తుంది. సుశీల కట్టని, పట్టుబట్టగానీ, వాడని మేలురకం అత్తరుగానీ లేవు.

●●●●

శీతాకాలం.. శోభనం గది పువ్వులతో అలంకరించి ఉంది. కట్ట అగరొత్తులూ ఒకేసారి వెలిగించెయ్యడంతో ఎటు చూసినా పొగ, ఎవరో పరుపుమీద పితాపురం సెంటుబుడ్డి ఒలకబోసేశారు. దాని సువాసనతో గదంతా నిండిపోయింది. పందరి పట్టిమంచం అంచుమీద కూర్చున్న సుశీలకి ఆయన లోపలికొచ్చాకా ఎలా మసులుకోవాలో వాళ్ళమ్మ చెప్పినవన్నీ గుర్తుకు వస్తున్నాయి.

కాస్సేపయింది..

తలుపు తెరుచుకుని లోపలికి వచ్చిన వల్లూరి మోహనరావు కాళ్ళకి నమస్కారం చేసి లేచింది.

ఆమె అందాన్నే చూస్తూ నిలబడ్డ మోహనరావు - "నువ్వు అమృతం తాగావు" అన్నాడు. "అవును! మీరు పాలు తాగండి" అందించింది గ్లాసు.

"ఇందాకే విస్కీ తాగాను మరి!" అన్నాడు.

తల్లి చెప్పినట్టు అతనికి సర్వవిధాలా సహకరించింది.

ఆరోజు తర్వాతినుంచీ ప్రతిరాత్రీ ఇంటిముందాగే అతని బుల్లెట్ బండి శబ్దం కోసం ఎదురుచూసేది. కొన్నాళ్ళూ తనతో గడిపిన అతను ఈమధ్య ఇటుపక్కకి రావడం మానేశాడు. సుశీల మాత్రం అతని బండి శబ్దం కోసం ఎదురుచూస్తూనే ఉంది.

నల్ల సుశీలకి ఒక కొత్త కోరిక పుట్టిందిప్పుడు.

తనకో బిడ్డపుట్టాలి.

వాడు తెల్లగా, బొద్దుగా ముద్దొచ్చేలా గుండాలి. కాంతులు నిండిన కళ్ళతో కళకళలాడిపోతూ ఉండాలి.

అందమైన పేరు పెట్టాలి వాడికి.

అన్నప్రాసన రోజు చుట్టూ ఉన్న వస్తువుల్లో కైజారునే ముట్టుకోవాలి వాడు.

కొన్నాళ్ళు గడిచింది.

వల్లూరి మోహనరావు బుల్లెట్ బండి మసీదు సెంటర్‌కి అవతల వీధిలో ఉండే రుక్మిణి చెల్లెలి ఇంటిముందు ఆగడం మొదలెట్టిందిప్పుడు. అది తెలిసిన సుశీల ఒక రాత్రి లాంతరుతో బయల్దేరబోతుంటే ఆపేసిన చినముత్యం - "ఎక్కడికి?" అంది.

"ఆయన దగ్గరకి - అడగడానికి.."

"ఏమని అడుగుతావ్?"

"మన ఇంటికి రాకుండా ఈ ఇంట్లో ఏం చేస్తున్నారని?"

"దుర్గమ్మ గుడి వీధిలో రాజ్యం చెల్లెలు నాని తెలుసుకదా!"

"తెలిస్తే?"

"ముందు నాని దగ్గరుండే మనిషి నీ దగ్గరికి రావడం మొదలుపెట్టాడు. అప్పుడు ఆ నాని మనింటికి వచ్చి అడగలేదుకదా.. ఏ గొడవా పడ్లేదు కదా?"

"అంటే ఇప్పుడేమంటావమ్మా?"

"ఏం లేదు. పెళ్ళి చేసుకున్నవాడికీ, కన్నెరికం చేసుకున్నవాడికీ తేడా చెపుతున్నాను."

"అప్పుడు నాకు పెళ్ళి ఎందుకు చెయ్యలేదు?"

"నువ్వు పెళ్ళిచేసుకున్నా దానికంటే ఇదే నయం. డబ్బు, దస్కం రెండూ వస్తాయి, లోపలికి పద!"

తల్లి చినముత్యం ఆలోచనల్ని జీర్ణం చేసుకోడానికి కొన్నాళ్ళు పట్టింది తనకి. ఆ తరువాత పేర్నీడి ప్రభాకరం. మనసంటే ఏందో అతనికి తెలుసు. మనిషిని ప్రేమించడం తెలుసు.

పరిచయమమైన మూడోరోజే అన్నవరం వెళదాం అన్నాడు. 'మేం భార్యాభర్తలం' అని గుళ్ళో అర్చన చేయించాడు. సాయంత్రం ఇద్దరూ కొండదిగి గోపాలపట్నం వేపు నడుస్తున్నారు.

దేవుడి ప్రసాదం తినేసి విస్తరాకు దూరంగా విసిరేస్తూ "నిన్నెవరన్నా ఇంటర్వ్యూ చేస్తే ఒకటి చెప్పాలనుంది!" అంది సుశీల.

"సరే. ఈ ప్రపంచంలో నీ కిష్టమైన స్వీటేది? అని అడుగు."

అడిగింది.

"ఈ ప్రపంచంలో నాకిష్టమైన స్వీటు అన్నవరం సత్యన్నారాయణ మూర్తి ప్రసాదం!"

"నిజమే సుమా!" అని అతని నడుంచుట్టూ ఎడమచెయ్యి వేసి ముందుకు నడిచింది.

అదంతా మైదానం. ఉన్నట్టుండి ఆగిపోయిన ప్రభాకరం "నన్ను ముద్దు పెట్టుకో" అన్నాడు.

"ఎవరన్నా చూస్తే?" అంది.

వెంటనే "రక్షించండి! హెల్ప్! హెల్ప్!" అని అరవడం మొదలుపెట్టాడు. ఎవరూ రాలేదు ఇక అరుపులాపి, "ఎవరూ రావట్లేదు. కాబట్టి ఇప్పుడు నన్ను ముద్దు పెట్టుకోవచ్చు!" అన్నాడు.

నవ్వేసిన సుశీల "మొన్న చూపిన సినిమాలో సీనిది!" అని తన గులాబీరంగు పైట తీసి గుండెలమీద ముద్దు పెట్టించుకుని, అతని పెదాలమీద తనూ ముద్దు పెట్టింది. అలా అల్లిబిల్లిగా అతనితో అల్లుకుపోయింది సుశీల. రోజులు హాయిహాయిగా గడుస్తున్నాయి. మధురంగా ఉంది జీవితం. మొలకగా ఉన్నప్పుడే గిల్లి వేయబడ్డ ఆశ మళ్ళీ మొలకెత్తడం మొదలెట్టింది.

తనకో బిడ్డపుట్టాలి. వాడు ముద్దుగా, బొద్దుగా తన చంకలోంచి నలుగుతూ లాగేసుకునేంత అందంగా ఉండాలి.

కొన్నాళ్ళు గడిచాక ప్రభాకరం కూడా రావడం మానేశాడు.

ఏమయిందా అని వాకబు చేస్తే తెలిసింది. బావమరుదులు అతన్ని చంపేసి వాళ్ళ పొలాల మధ్య ఉండే చింతాలమ్మ గుడిలో పారేశారట.

మూడు నెలలపాటు గదిలోంచి బయటకి రాలేదు నల్లసుశీల.

తర్వాత

ఏమిటీ జీవితం? అన్న ప్రశ్న.

మళ్ళీ ఎదురుగా తల్లి చినముత్యం.

ఆ తర్వాత తన జీవితంలో చాలామంది...

కాలం తన ఆయుష్షుని మింగేసింది. రాత్రి జడలో నలిగిన మల్లెపువ్వులా వాడిపోయింది అందం. చాలామంది కన్నెపిల్లలు తయారయ్యారు. కొత్తనీరు వచ్చేసింది ఎంత అలంకరించుకున్నా వృధా! ఇలాంటి పరిస్థితులొచ్చాకా చాలామంది చిన్న చిన్న టౌన్లలో ఉండే లాడ్జీలకి, ఆ తర్వాత హైవేలమీదకీ మారిపోతుంటారు.

ఏం చేద్దామా అని ఆలోచిస్తుండగా ఎవరో చెప్పారు గాలికొండపురం వెళ్ళిపొమ్మని.

అక్కడెవరున్నారంటే. 'అదో చిన్న టూరిస్టు ప్లేసు. మీలాంటి వాళ్ళెవరూ ఉండరక్కడ. అక్కడికొచ్చి నాలుగు రోజులుండే టూరిస్ట్‌లకి మీ సుశీలే మహారాణి!' అని బోధించారు.

మెళ్ళో మంగళ సూత్రం వేస్తుంటే, "ఇదెందుకు?" అంది సుశీల

"పెళ్ళయింది, భర్త పొరుగూరు వెళ్ళాడు అని చెప్పాలి. పెళ్ళయిన ఆడదానితో సంభోగం అంటే అదో ఆనందం వాళ్ళకి. అయినా ఇప్పుడు ఒళ్ళు వడిలిపోయింది కాబట్టీ నీకిదే సరైన వేషం!"

అనుభవజ్ఞురాలైన తల్లి, వృత్తిలో లౌక్యాన్ని జీర్ణం చేసుకునేలా ప్రయత్నించింది సుశీల.

ఆ తర్వాత వాళ్ళు దండకారణ్యం మధ్యలో ఉన్న గాలికొండపురానికి మకాం మార్చారు.

●●●●

ఎండ తీవ్రంగా కాస్తున్నా మధ్యాహ్నం రెండుగంటలకే చలిగాలి తిరిగింది. గుహల దగ్గర తిరిగే సాధువు గోస్తనీ నదిలో స్నానం చేస్తున్నాడు. రాత్రి డ్యూటీకెళ్ళొచ్చిన స్టేషన్ సూపరింటెండ్ గారు తన పెంపుడు కుక్కని ఊళ్ళో తిప్పుతున్నాడు.

గెస్ట్ హౌసుల్లో దిగిన యాత్రికులు కెమెరాలతో లోయల్లో తిరుగుతున్నారు. స్టేషన్లో కాంటిన్ నడిపే ఒరియావాడు మేకపాలకోసం ఊళ్ళోకొచ్చాడు. గాలికొండకింద మిలటరీ హోటలు మీసాలరాజు నాటుకోళ్ళు కొనడానికి గిరిజనుల పాకలవైపు వెళుతున్నాడు.

రాత్రి పొగచూరిపోయిన పెట్రోమాక్స్ లైటుని చిట్టుతో తోముతూ చినముత్యంతో మాట్లాడుతున్నాడు భూషణం. "రాత్రి గెస్ట్ హౌసులో దిగినతను ఇక్కడ పండే రంగురాళ్ళు కొనడానికి వస్తూంటాడట, లప్పా! బరంపురం లాల్చీ వేసుకుని బలంగా ఉంటాడు... తాగితే మాత్రం రాక్షసుడి అవతారం ఎత్తుతాడట. నేనొచ్చినప్పుడల్లా నీకు కబురు చేస్తుంటాను అస్తమాను ఇవ్వడం కుదరదు. ఇదిగో!" అనేసి ఒకేసారి పదివేల కట్ట సుశీలకిచ్చేశాడు.

వాడలా మాట్లాడుకుంటూండగా లోపల వాంతి చేసుకుంటున్న సుశీల కనిపించింది.

నల్ల సుశీల నెల తప్పింది.

అదివిన్న చిన్నముత్యం ఇక ఈ వృత్తి మనకొద్దని నిర్ణయం చేసుకుని కూతుర్ని పువ్వుల్లో పువులా చూసుకోవడం మొదలెట్టింది.

పోయిన శక్తి, కాంతీ తిరిగొచ్చాయి సుశీలలో. ఇంతకు ముందెప్పుడో పారేసుకున్న చలాకీతనం మళ్ళీ ప్రవేశించిది. తల్లి వద్దంటున్నా ఎగిరి గంతులేసింది. రాకపోయినా సారమతిరాగం పాడే ప్రయత్నం చేసింది. ఇప్పుడు పనిలేని భూషణం ఇంటికొస్తుంటే ఆటలు పట్టించేస్తోంది.

ఇలా కాలం గడుస్తుండగానే తొమ్మిది నెలలూ నిండిపోయాయి నల్లసుశీలకి.

●●●●

ఆ రోజు..

పసుపు రంగు పిట్ట ఒకటి టిల్లచెట్ల గుబర్లలోకి దూరి చిగుళ్ళని మాత్రమే రుచిగా తింటోంది. నేలమీద పడున్న పచ్చి తాటాకు మీదకి చేరిన రెండు ఎర్ర తొండలు దెబ్బలాడుకుంటున్నాయి. కొండ దిగువన మేస్తున్న గేదె వీపు మీద వాలిన కాకి నిశ్శబ్దంగానే కూర్చుంది. గాలికి ఊగుతున్న సొలప చెట్టూ ఆకుమీదకి చేరిన రామచిలక కిందకి జారిపోకుండా కాళ్ళతో పట్టుకుంది. గంతులేస్తూ పరుగెత్తుకున్న చిన్న గొర్రెపిల్లని ఎలాగయినా పట్టుకోవాలని వెనకాలే పరిగెడుతున్నాడు కొండ ముసలాడు.

రోజూ చూస్తున్నదే అదంతా. అయినా ఆ రోజెందుకో చాలా అందంగా కనిపించింది. అలా చూస్తున్న సుశీల మెడ వెనకేదో లాగినట్టయి తలపైకెత్తేసరికి నల్లటి మబ్బులతో మూసుకుంటున్న ఆకాశం కనిపిస్తుంది. కాస్సేపటికి వీస్తున్న గాలిలో బాగా మార్పొచ్చింది.

ఇంకాస్సేపటికి నిలబడ్డ తను అమాంతంగా ఎగిరిపోయేంత ఉధ్రుతంగా వీయడం మొదలెట్టింది గాలి.

లోయల్లో పెరిగే పనసచెట్టూ, కుంకుడు చెట్లు వేళ్ళతో కూలిపోతాయేమో అన్నంత వికృతంగా ఊగిపోతున్నాయి. కొండలమీద పండే కమలాఫలాలు, మామిడిపళ్ళు టపటపా నేల రాలిపోతున్నాయి. గిరిజనుల రెల్లుపాకల కొప్పులు ఎగిరిపోతున్నాయి. వాతావరణం చూస్తూంటే రాత్రి కింకేమవుతుందా అన్నంత భయానకంగా ఉంది.

ఆ రోజు, మర్నాడు కూడా అలాగే ఉంది వాతావరణం.

పొద్దుట్నుంచీ కాస్త పులపరంగా ఉన్నట్టు అనిపించింది సుశీలకి. మధ్యాహ్నానికి జ్వరమొచ్చి, సాయంత్రమయేసరికి కాలిపోవడం మొదలెట్టింది ఒళ్ళు. ముట్టుకు చూసిన చినముత్యం రైల్వే డాక్టర్ కోసం పరుగెట్టింది. కానీ అతను మోటారు ట్రాలీమీద చిమిడిపల్లి వెళ్ళాడు.

గాలి దుమారానికి ఎగిరొచ్చిన ఆకులు కిటికీ ఊసల్లోంచి దూసుకొచ్చి సుశీల పరుపు మీద పుట్టబోయే తన బాబుకి స్వాగతం చెబుతోంది.

రాత్రయింది.

తుఫానట!

వాతావరణం చాలా బీభత్సంగా మారింది.

వీస్తున్న గాలికి వర్షం తోడయ్యింది. కరెంటు కూడా పోయింది గాలికొండపురం గ్రామం అంతా ఖాళీ చేసేసి వలస వెళిపోయినట్టయింది.

అంతలో...

మూసి ఉన్న ఇంటి తలుపు దబదబా బాదుతున్నారెవరో!

వెళ్ళి తీసింది చినముత్యం.

కాకిలా తడిసిపోయి బాటరీలైటు పట్టుకుని నిలబడ్డ భూషణం, వాడికి కాస్త దూరంగా బరంపురం లాల్చీలో బలంగా ఉన్న మనిషి నోట్లోంచి తాగిన వాసన వేస్తోంది.

వాళ్ళిద్దర్నీ గమనించిన చినముత్యం భూషణం కేసి చూసి "నీకిదేం దొబ్బిడాయిరా సచ్చినోడ! ఏంటిది?"

"మొన్న గెస్ట్ హౌస్ కెళితే పదివేలిచ్చారే.. ఆ దొరగారు"

"మా సుశీలకి నెలలు నిండినయ్యని చెప్పలేదా?"

"చెప్పడమేంటి ఏడ్చి మొత్తుకున్నాను. లప్పా! (ఎత్తయిన కడుపుతో) నెలలు నిండిన ఆడాళ్ళతో శృంగారం గొప్పగా ఉంటుందని ఆయనే లాక్కొచ్చేశారు!"

"ఛీ నోర్ముయ్ వెధవా! జ్వరంతో దాని ఒళ్ళు కాలిపోతుంటే..."

ఆ మాట విన్న ఆ మనిషి విసురుగా దగ్గరకొచ్చి "ఏంటీ, నెలలు నిండటంతో పాటు జ్వరం కూడా వచ్చిందా?" అన్నాడు.

"అవును, దొరగారూ! దాని ఒళ్ళు పెనంలాగ కాలిపోతుంది!"

ఆనందంతో పెద్దగా అరిచిన ఆ మనిషి "నెలలు నిండిన సుశీల ఒళ్ళు కాలిపోతున జ్వరంతో ఉందా?... నేను కలకత్తాలో ఉన్నప్పుడు మా ఫ్రెండ్ హిరెన్ బోస్ చెప్పాడు. అలాంటి పరిస్థితుల్లో ఉన్న స్త్రీలతో కలిసే అవకాశం వస్తే వదులుకోకు అని.. ఇదిగో చూడూ! ఇంతకు ముందు పదివేల గురించి మర్చిపో! ఇదిగో ఇంకో పదివేలు!" అని అందించి మరుక్షణం సుశీల గదిలోకి దూసుకెళ్ళిపోయి దబ్బున తలుపేసుకున్నాడు!

●●●●

తెల్లవారుతోంది. ఇంకా తగ్గని ఆ తుఫానులోనే బయల్దేరిన శృంగార పురుషుడు తడిసిపోతూ తను దిగిన ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌కి వెళ్ళిపోయాడు.

సుశీలకి నిప్పులు మొదలయ్యాయి. వాటిని భరించలేక మెలికలు తిరిగిపోతోంది. అంత తుఫానులోనూ రైలెక్కించి శృంగవరపు కోట తీసుకెళ్ళింది చినముత్యం.

రాత్రికి ఆపరేషను చేసి బిడ్డను బయటకు తీశారు.

స్పృహ వచ్చిన నల్ల సుశీల పక్కలో ఉన్న బిడ్డని చూసుకుంది.

వాడు.. తను కోరుకున్నట్టు మగపిల్లాడే!

తాబేలు పొట్ట, పుల్లలాంటి చేతులు, కాళ్ళు, పెద్ద తలతో చలనం లేకుండా ఉన్నాడు.

(ఫోన్ చేసి అడగ్గానే ఈ కథ పునర్ముద్రణకి అనుమతి నిచ్చిన ప్రముఖ చలనచిత్ర దర్శకులు వంశీ గారికి కౌముది కృతజ్ఞతలు తెలియచేస్తోంది)

●●●●

డూప్

అరిగే రామారావు

('స్వాతి' మాసపత్రిక జనవరి 1971)

కనకం మేకప్ రూం అనబడే పాత సామానుల కొట్టులాంటి ఆ చిన్న చీకటి ఇరుకు గదిలో ఒక పాత కుర్చీ మీద భయం భయంగా కూర్చున్నది. ఆ గది అంతా రకరకాల రంగుల వాసనలతో ఉక్కతో మాగుడు కంపు కొట్టుతుంది. ఆ వాసనకు కనకానికి కడుపులో ఊరికే దేవినట్లుగా ఉంది. తను ఆ గదిలో ఆ కంపులో అరగంటకు పైగా మగ్గిపోతున్నా తన అతీగతీ కనుక్కున్న వాళ్ళెవరూ కనిపించలేదు.

నల్లగా బొద్దుగా చిన్న చింతమొద్దులాగా ఉన్న ఒక పొట్టి యువకుడు మాత్రం గది గుమ్మంలో నిలబడి ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లు మాటమాటికీ బయటికి తొంగి చూస్తున్నాడు. మధ్య మధ్య తనవంక దొంగచూపులు చూస్తున్నాడు. ఆ గదిలో ఉన్న వాసన చాలదన్నట్లు వెధవ బీడీలు ఒకదాని వెంట ఒకటి ఊరికే తాగిపారేస్తున్నాడు.

అతను ఆ స్టూడియోలో 'సి' క్లాస్ మేకప్ మేన్. కనకం కూర్చున్నది 'సి' క్లాస్ మేకప్ రూం.

ఆలశ్యం అవుతున్నకొద్దీ కనకానికి భయం ఎక్కువవుతోంది. తనను అక్కడకు తీసుకొచ్చిన సూర్యం, "నీవాగదిలో కూర్చోమ్మా, నేనిప్పుడే వస్తాను" అని చెప్పి వెళ్ళినవాడు ఇంతవరకూ అంతులేడు. తను అక్కడ అలా ఎంతసేపు కూర్చోవాలో, అసలు చేయాల్సిన పనేమిటో కనకానికి అంతుపట్టటం లేదు. ఎవర్ని అడగాలో ఏమిటో. అంతా కొత్తగా భయం భయంగా ఉంది. ఎదురుగా కనిపిస్తున్న అవతారాన్ని అడిగితే ఏమంటాడో ఏమో.

కనకం ఎలాగో ధైర్యం చేసి మెల్లగా, "ఏవండి - నేనిక్కడ ఇంకా ఎంతసేపు ఉండాలి?" అని అడిగింది.

"ఉండవమ్మా. తొందరపడతావేం? అసిస్టెంట్ డైరక్టర్ గారు రావాలి. ఏ మేకప్ చేయమంటాడో ఏంటో?" అని కసురుకున్నాడు.

కనకం ఆ కసురుడుకు అదిరిపోయి ఎందుకడిగానురా భగవంతుడా అని అనుకుంది.

ఇంతలో బయట కారాగిన శబ్దం వినిపించింది ఎవరో చాలా మందిమనుషులు మాట్లాడుతున్నట్లు మాటలూ నవ్వులూ వినిపించాయి. ఎవరో పెద్దవాళ్ళు వచ్చినట్లుగా బయటమా హడావుడిగా ఉంది అతడు కాలుస్తున్న బీడీని మూలపారేసి కంగారుగా బయటికెళ్ళాడు.

మళ్ళీ అంతలోనే లోపలికి వచ్చాడు. ప్రక్కన బక్క పలచగా ఎత్తుగా ఉన్న ఇంకో యువకుడు ఉన్నాడు. అతనికి ఒక చంకలో ఫైలు, మరో చంకలో మడిచి పెట్టిన చీరా ఉంది.

చంకలోని చీరను టేబులు మీద పడేసి, "ఇదిగో ఈ చీరా ఇందులో ఉన్న బ్లౌజు కట్టుకో అమ్మాయి!" అని కనకం వంక పరీక్షగా చూశాడు. "అదేంటి జడ అలా బిగుతుగా వేసుకున్నావు? తల నున్నగా దువ్వుకున్నావు. నోనో - జుట్టంత చిందర వందరగా

ఉండాలి. శీనూ చూడవోయ్" అని ఎంత హడావుడిగా వచ్చాడో అంత హడావుడిగా వెళ్ళిపోయాడు. ఈ శీను చెప్పిన అసిస్టెంట్ డైరక్టర్ గారు ఈయనే కాబోలు అనుకుంది. అతగాడి కంగారు ఈ శీనుని పూనిందేమో, తెగ కంగారు పడిపోతూ, "కానివ్వమ్మా, అవతల బేబమ్మగారొచ్చేశారు. ముందా చీర కట్టుకో. ఆ జడవిప్పు లూజుగా వేస్కో -" అని అంటూ కనకాన్ని కూడా కంగారు పెట్టేశాడు.

మరో పదినిమిషాల్లో ఎక్స్‌ట్రాస్ సప్లయర్ సూర్యం కూడా వచ్చాడు. కనకాన్ని చూచి "ఏంవమ్మా రెడీయేనా? అయితే కాస్త అలా బయటికి రా, టిఫిన్ అదీ చేద్దువుగాని', అని అన్నాడు.

కనకం అతని వెనకాలే బయటికి వచ్చింది. అతనితో నడుస్తూ, "ఇంకా చాలా ఆలశ్యం ఉంటుందాండీ?" అంది.

"అబ్బే, ఎంతో ఆలశ్యం ఉండదమ్మా! అంతా ఒక్క గంటలో పూర్తయిపోతుంది" అన్నాడు.

"ఏం కాదూ, ఇంటికెళ్ళటానికి మళ్ళీ సిటీ బస్సులు ఉండవేమోనని -" కనకం నసిగింది.

"అబ్బే, అంతదాకానా? నిన్ను తొమ్మిది గంటలకల్లా పంపించేస్తాగా? అదిగో ఆ బెంచీ మీద కూర్చోమ్మా. నీకు టిఫిన్ పంపిస్తాను." అని స్టూడియో కాంటిన్ వయిపు వెళ్ళాడు.

కనకం, స్టూడియో ఆవరణలో ఉన్న మెర్క్యూరీ దీపాల కాంతిలో ఈ చివర్నుంచి ఆ చివర వరకూ మిలమిలా మెరిసిపోతున్న ఒక పెద్ద కారు ముందు నుంచి, ఎదురుగా పార్కులాగా ఉన్న చోటు కెళ్ళింది.

బహుశా ఈ కారు ఆ బేబమ్మగారిది అయివుంటుందనుకుంది. ఆ కారు ముందు నలుగురయిదుగురు మొగవాళ్ళు నిలబడి సిగరెట్లు త్రాగుతూ మాట్లాడుకుంటున్నారు. వాళ్ళు ముందు నుంచి మెల్లగా అణకువగా తలవంచుకుని వెళుతున్న కనకాన్ని చూచి బిగ్గరగా సాగుతున్న వారి మాటలు ఆగిపోయాయి. లేదూ స్థాయి తగ్గాయి - ఎందుకంటే వాళ్ళు మామూలుగా ఆ ఆవరణలో ఠీవి నడకలు, టెక్కు నడకలు, ఖరీదు నడకలు, చూస్తూ ఉంటారు. కనకానిది 'జంటిల్'గా ఉన్న కొత్త నడక అవటం వల్ల కావచ్చు.

కనకం బెరుగ్గా పమిటను భుజాల నిండుగా కప్పుకుంది.

కనకం వాళ్ళను దాటిపోతూండగా వాళ్ళలో ఒకతను 'బేబమ్మకు డూప్ -' అని అన్నాడు.

కనకం అక్కడున్న ఒక సిమెంటు బెంచీ మీద కూర్చుంది. అది షూటింగ్ ఫ్లోర్ ఉన్న సెంటర్లో ఉన్న ఒక చిన్న పార్కులాంటిది. మామూలుగా ఎక్స్‌స్టాలందరూ టిఫిన్లు చెయ్యడం, విశ్రాంతి తీసుకోవడం అందులోనే. అందులో ఒక పంపు కూడా ఉంది. చుట్టూ ఉన్న చెట్లమీదుగా వచ్చే చల్లని గాలి వంటికి తాకగానే అంతదాకా ఆ ఉక్కలో ఆ చీకటి కంపు గదిలో ఉన్న కనకంకు ప్రాణం హాయిగా అనిపించింది.

ఆ స్టూడియోను ఊరికి బయటగా ఉన్న ఒక పెద్ద తోట మధ్యలో కట్టారు. అక్కడ ఎంతో నిశ్శబ్దంగా ప్రశాంతంగా ఉంటుంది. చుట్టూ ఎటు చూచినా నిటారుగా నిలబడ్డ చెట్లు, ఆ చెట్టు కొమ్మల మీద వాలిన చీకటి, నల్లని ఆకాశంలో అక్కడక్కడ పొదిగిన నక్షత్రాలు - ఆ ప్రశాంత వాతావరణంలో ఉండి ఉండి వీచే చల్లని గాలి తెరల్లో కనకం తనువు, మనస్సూ మెల్లమెల్లగా సేదతీరుతున్నాయి.

ఆమె కూర్చున్న సిమెంటు బెంచీ ఎదురుగా ఒక ఫౌంటెన్ ఉంది. ఆ ఫౌంటెన్ మధ్యలో చంటిపిల్లాడ్ని చంకలో ఎత్తుకుని నిలబడి ఉన్న ఒక తల్లి పాలరాతి బొమ్మ ఉంది. ఆ చంటి పిల్లాడు ఒక చేయి పైకెత్తి బోసినవ్వుతో చూడముచ్చటగా ఉన్నాడు.

ఇంతలో ఒక కుర్రవాడు రెండు టిఫిన్ పొట్లాలు తీసుకుని వచ్చి ఇచ్చాడు. ఆ పొట్లంకట్టిన దారం విప్పుతుండగా కనకం అప్పటిదాకా మర్చిపోయిన ఆకలి, ప్రేగుల మడతల్లో ముడతల్లో ముడుచుకు పడుకున్న ఆకలి కదలటం మొదలయింది. కడుపు నిండా తిండి తిని వారం రోజులయింది. ఈ వారం రోజులుగా ప్రక్కింటి సీతమ్మత్త ఏదో ఒకపూట ఇంత తీసుకొచ్చి పెట్టింది. అదీ తన కోడలు చూస్తుందేమోనని భయంతో పమిట చెంగు కింద పెట్టుకుని దొంగచాటుగా తెచ్చేది. పాపం, ఆమె ఇలా ఎంతకాలమని పెడుతుంది. ఈ రోజు తనే ఇంత ఉడకేసుకుందామనుకున్నది. కాని, ఇంట్లో బియ్యపు గింజలు లేవు. డబ్బా అడుగున తుడిస్తే గుప్పెడు గింజలున్నాయి.

వాటితో ఇంత జావ కాచుకుని తాగి మునగతీసుకుని పడుకుంది - ఇక ముందు గడిచేది ఎలాగురా భగవంతుడా అని అనుకుంటూ. ఆ భగవంతుడు సీతమ్మత్త తమ్ముడు సూర్యం రూపంలో మధ్యాహ్నం తనకు సాక్షాత్కరించాడు. సూర్యం సినిమా స్టూడియోలకు ఎక్స్‌ట్రాలను సప్లయ్ చేస్తూ ఉంటాడు.

"ఒకరోజు సినిమాలో వేషం వేస్తే 30 రూపాయలు ఇస్తారంట. ఆ వేషమేదో నీవు వేయకూడదా కనకం?" అని అంది సీతమ్మత్త.

తనేమిటి.. సినిమాలో వేషం వెయ్యటమేమిటని సందేహిస్తూ ఉంటే "నీవేమీ సందేహించవలసింది, భయపడవలసిందీ ఏం లేదమ్మా? నేను దగ్గరే ఉంటాను. నీకు డైలాగ్స్ ఏమీ ఉండవు. ఒక పెద్ద హీరోయిన్ గారికి డూప్ పెడతారు. ఒడ్డూ పొడుగులో నీవు ఆమెకులాగే ఉన్నావు - అందుకని! అంతా ఒక్క గంటసేపట్లో అయిపోతుంది. రాత్రి తొమ్మిది గంటలకల్లా ఇంటికి తిరిగి వచ్చేయవచ్చు - " అని సూర్యం అన్నాడు.

"ఇంకా సందేహిస్తావేంటి, వప్పుకో అమ్మాయి! నీవు కాదంటే మరింకెవరికన్నా ఇచ్చేస్తారు. తేలిగ్గా వచ్చే ముప్పై రూపాయలు అనవసరంగా పోతాయి. ఎవరో అమ్మాయి కోసం పోతున్నాను అనివాడంటే, నీ సంగతి చెప్పి ఎవరోదాక ఎందుకు ఆ వేషమేదో నీకిప్పించమని చెప్పి వాడ్ని వప్పించాను" అని సీతమ్మత్త బలవంతం చేసిద్ది.

"ఆ అమ్మాయి వెనకాడతుంటే నీకేంటి మధ్యలో - నాకు మనుషులు దొరక్క కాదమ్మాయ్! అప్ప చెప్పిందని గాని " అని అతడు వెళ్ళిపోవడానికి తయారవుతుంటే, చేతిలో చిల్లిగవ్వ కూడా లేని పరిస్థితిలో తేలిగ్గా రాబోయే ముప్పై రూపాయలు పోతాయేమోనని, తను సరేనని వప్పుకుంది.

తనకిన్ని రకాలుగా సాయంచేస్తున్న సీతమ్మత్త తన పాలిట దేవతే అని అనుకుంది మనస్సులో.. కనకం మెల్లగా టిఫిన్ తింటుండగా సూర్యం ఇంకో టిఫిన్ పొట్లం, కాఫీ పట్టించుకొచ్చాడు.

"ఇది కూడా తినమ్మా! తిని కాఫీ త్రాగు - అంతా రెడీ అయిపోతుంది. షూటింగ్ మొదలు పెట్టేయబోతున్నారు" అని మళ్ళీ ఎటో వెళ్ళాడు ఇప్పుడే వస్తానని.

నిజంగా సూర్యం ఎంత మంచివాడు అనుకుంది.

కడుపులో నిండుగా ఫలహారం, కాఫీ నీళ్ళు పడేసరికి తేలిగ్గా హాయిగా ఉంది.

మరో అయిదు నిమిషాల్లో సూర్యం హడావుడిగా వచ్చి కనకాన్ని వెంటపెట్టుకుని ఒక పెద్ద ఫ్లోరులోకి తీసుకెళ్ళారు, లోపల ఎవరెవరో చాలామంది మనుషులున్నారు, కళ్ళు మిరుమిట్లు కొల్పే లైట్లు ఉన్నాయి. ఒక పెద్ద హాలు సెట్ వేసి ఉంది. ఆ హాలులో ఒక వైపు నుంచి మేడమెట్లున్నాయి. కింద సోఫాలు తివాచీలు ఉన్నాయి.

కనకంకు ఆ లైట్లను, మనుషులు చూచేసరికి భయం వేసింది. భయంతో ముడుచుకుపోయి ఒక పక్కగా నిలబడింది.

ఇంతలో 'బేబమ్మ' అనే ముద్దు పేరుతో పిలవబడే ఆ సినిమాలోని హీరోయిన్‌గా ఫుల్ మేకప్‌లో సెట్‌లోకి వచ్చింది. ఆమెతో పాటు ఆమె అంగరక్షకులు వచ్చారు. ఆమె లోపలికి అడుగు పెట్టగానే కొన్ని క్షణాలు ఒక విధమైన నిశ్శబ్దం అక్కడ ఆవరించింది.

ఆమెను చూసి కనకం ఆశ్చర్యపోయింది. ఆమె, తను కట్టుకున్నలాంటివే చీరా రెవికా కట్టుకుని ఉంది. అధాట్న చూస్తే అచ్చం తనలాగే ఉంది. మరి ఆమెగారుంటే తననెందుకు పిలిచినట్లో అని అనుకుంది.

బేబమ్మ పక్కన మఫ్టీలో ఉన్న (మేకప్ లేకుండా ఉన్న) ఒక యువతి కూర్చుని ఉంది. ఆ యువతి బేబమ్మ పర్సనల్ అటెండర్. ఆమె ఎప్పుడూ, ఎప్పటికీ పూర్తికాని ఒక ఊలు స్వెట్టర్ అల్లుతూ, బేబమ్మతో కబుర్లు చెపుతూ లేక బేబమ్మ కబుర్లు వింటూ ఉంటుంది. అందుకుగాను షూటింగ్‌కు వచ్చినప్పుడల్లా ప్రొడ్యూసర్ గారి దగ్గర్నుంచి ఇరవై అయిదు రూపాయలు రోజూవారీ బత్తా తీసికుంటూ ఉంటుంది.

మరో పదినిముషాల్లో లైటింగ్ మొదలైన ఏర్పాట్లన్నీ జరిగిపోయాయి! కనకాన్నీ మేడమీదికి రమ్మన్నారు. ఆమె మేడమెట్లు ఎక్కబోతూ సూర్యం వంక భయంగా చూసింది. ఫర్వాలేదన్నట్లుగా సూర్యం సైగచేశాడు.

పైన డైరక్టరుగారు, ఆయన అసిస్టెంట్‌లూ ఉన్నారు. క్రేన్‌లో కెమేరాను పెట్టుకుని కెమెరామెన్ సిద్ధంగా ఉన్నాడు.

"చూడమ్మాయి, నేను రెడీ అనగానే నీవు ఈ మెట్లమీద నుంచి క్రింది దొర్లుకుంటూపడాలి -" అని డైరక్టరుగారన్నారు.

కనకం, "కిందకు దొర్లాలా?" అని ఆశ్చర్యంగా అడిగింది.

అంతకంటే ఆశ్చర్యంగా, "అవును, ఏం?" అనే ప్రశ్న వచ్చింది.

"నాకు అలా దొర్లటమంటే భయమండి?" అని తలవంచుకుని మెల్లగా అన్నది.

"అయితే నీకిలా దొర్లాలని ముందుగా తెలియదా?"

"తెలియదండి -"

"ఏరా సూర్యంగా" అని ఒక పెద్ద కేకేసి, "నీవు ఏ పని చేసినా ఇలాగే చేస్తావురా వెధవ -" అని ఒక బూతు తిట్టుకూడ తిట్టారు డైరక్టరుగారు ఆపుకోజాలని కోపంతో.

సూర్యం కంగారుగా మెట్లెక్కి పైకి వచ్చాడు.

"నీవు ముందుగా ఇలా దొర్లాలని ఆ అమ్మాయికి చెప్పటంలేదంటగా ?"

సూర్యం, "ఏం ఫర్లేదమ్మా, కొద్ది మెట్లేగా ఉన్నాయి. ఆ కింద తివాచి కూడా ఉంది. ఊరికే ఇక్కడ్నుంచి కిందకల్లా దొర్లేసేయ్. ఇంత డబ్బు ఇస్తుంది మరి దీనికేనమ్మా - లేకపోతే మామూలుగా రోజుకయిదే ఇస్తారు" అన్నాడు.

కనకం ఇంకా సందేహిస్తూ ఉంటే, "ఇప్పుడు నీవు కాదంటే ఇప్పటికప్పుడు కొత్త వాళ్ళెవర్ని తీసుకొస్తాం చెప్పు? అంతా రెడీ అయింది. ఒక్కరోజు షూటింగ్ అంటే మాటలా? రెండువేల రూపాయల ఖర్చు, అంతా వృధా అవుతుంది." అని అన్నాడు. అంతకు ముందు రాజకీయాల్లో రాటుదేలి ఇప్పుడు సహకార దర్శకుడుగా పనిచేస్తున్న ఒకాయన.

"నీ మూలంగా మధ్యలో నాకు మాట వస్తుంది అమ్మాయి!" అని సూర్యం నిష్ఠూరంగా అన్నాడు. ఈ మాట కనకం మీద బాగా పనిచేసింది. సూర్యాన్ని బట్టి సీతమ్మత్త మాట ఖాళీ అవుతుంది. తనకోసం సీతమ్మత్త మాట పడకూడదు. పైగా ప్రస్తుత పరిస్థితుల్లో తనకా డబ్బు ఎంత అవసరం.

"సరే కానివ్వండి -" అంది కనకం ఆఖరికి తెగింపుగా.

డైరెక్టర్ గారు 'రెడీ' అనగానే కనకం లుంగచుట్టుకుని పై మెట్టుమీంచి నేర్పుగా, ఖాళీ డ్రమ్‌లా దొర్లుకుంటూ కింద పడింది.

ఆ షాట్ అయిపోయింది. కనకం లేచి నిలబడి, "అమ్మయ్య!" అని అనుకుంది, తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది. చిన్నప్పుడు తోటి పిల్లలతో కలిసి కరణంగారి వాముల దొడ్లో గడ్డివాముల మీదనుంచి కిందకు దొర్లుకుంటూ ఆడుకున్న రోజులు గుర్తుకు వచ్చాయి.

సేఫ్టీ షాటుకి మళ్ళీ ఇంకోసారి దొర్లాలి అన్నారు. దొర్లడమంటూ ఒకసారి జరిగిన తర్వాత మళ్ళి ఎన్నిసార్లు దొర్లుతేనేం అని తనలో అనుకుని "సరే కానివ్వండి" అంది.

ఇంతలో బేబమ్మ అటెండర్ వచ్చి - "బేబమ్మగారికి వంట్లో బాలేదు. తల తిరుగుతున్నట్లుగా ఉంది" అని అక్కడ అనౌన్స్ చేసింది.

ప్రొడ్యూసరూ, డైరక్టరూ, వాళ్ళూ వీళ్ళూ బిలబిలా వచ్చి బేబమ్మ చుట్టూ మూగారు.

"అమ్మా డాక్టరుకు ఫోన్ చేయించమంటారా?" కంగారుపడుతూ అడిగాడు ప్రొడ్యూసరు.

"అవసరం లేదండి బంగళాకెళ్ళి రెస్టు తీసుకుంటాను అదే తగ్గిపోతుంది. ఇవాళ షూటింగ్ కాన్సిల్ చేసుకోండి."

"అలాగేమ్మా! మీ ఆరోగ్యం కంటేనా? కారు రెడీ చేయించమంటారా?" ఆ వేళ షూటింగ్ ఖర్చు రెండువేల రూపాయలు వృధా అయిపోయాయని లోపల ఏడుస్తున్నా పైకి అలా అనక తప్పేదు ఆ మానవుడికి, పాపం.

ఆ సినిమా కథలో ఆమె విలన్ని చూచి షాక్ తిని మేడమెట్లు మీదనుంచి జారికిందపడుతుంది. ఆ రోజు ఆమె మెట్లమీద నిలబడి క్రిందకు పడబోయే ముందు భయభ్రాంతురాలవటం మెట్లమీదనుంచి దొర్లిపడటం, నేలమీద పడిన తర్వాత మూలగటం మొదలైన దృశ్యాలను చిత్రీకరించాలి.

ఆమెగారు మేడమెట్లమీదనుంచి కిందకు దొర్లిపడలేదుగా. ఎందుకంటే ఉన్నత కుటుంబంలో పుట్టి, చిన్నప్పట్నుంచి ఇంగ్లీషు కాన్వెంటులో చదివి, చిన్నతనంలోనే పేరుగాంచిన నృత్యకారుల వద్ద నృత్యకళను అభ్యసించి, కాలేజి నాటకాల్లో వేషాలు వేసి ఇంగ్లీషు, కన్నడం, తమిళం, హిందీ మున్నగు భాషల్లో ధారాళంగా మాట్లాడగలిగి, తీరిక వేళల్లో వంట చేయటం, ఇంగ్లీషు నవలలు చదువుట, ఇంగ్లీషు సినిమాలు చూచుట, హాబీగా కలిగిన తార, కళకి జీవితాన్ని అంకితం చేసిన తార సిన్మాల్లో నటించగలదు కానీ, మేడల మీదనుంచి కొండలమీద నుంచి దొర్లి పడగలదా? అందుకనే ఆమెకి 'డూప్'గా ఆమెకు బదులు కనకం కిరాయికి, మేడమెట్లమీద నుంచి దొర్లుపుచ్చకాయలాగా కిందకు దొర్లింది.

'సేఫ్టీషాట్'కు కనకం ఆ మెట్లమించి కిందకు దొర్లింది. టేక్ 'ఓకే' అయింది. రెండోసారి దొర్లుతుండగా కనకానికి నడుం కలుక్కుమంది. షాట్ అయిన తర్వాత మంచినీళ్ళు తాగుతుండగా పొత్తికడుపులో సన్నని పోటు ప్రారంభం అయింది. మేకప్ రూం కెళ్ళి చీర మార్చుకునే లోపల క్రమ క్రమంగా ఎక్కువయింది.

సూర్యం వచ్చి, "నా కమీషన్ పదిరూపాయలు పోను మిగిలిన ఇరవై రూపాయలు ఇదిగో" అని ఇచ్చాడు. నిజానికి ఇందులో సూర్యం మొత్తం ముప్పై రూపాయలు కొట్టేశాడు. పైనుండి కిందకు దొర్లినందుకు ఏభై రూపాయలు ఇస్తారు. మోటు పని కాబట్టి. కాని, కనకానికి ముప్పై రూపాయలే, అని చెప్పి అందులో ఇరవై, మళ్ళీ తన కమీషన్ క్రింద పది మొత్తం ముప్పై రూపాయలు జేబులో వేసుకున్నాడు. ఇంతకీ అన్ని మెట్లమీద నుండి రెండుసార్లు దొర్లినందుకు కనకంకు వచ్చింది ఇరవై రూపాయలే. అదే మామూలుగా చేసే వాళ్ళయితే సూర్యానికి ఐదు రూపాయలు మాత్రమే గిట్టేవి. కనకం ఆ డబ్బును బొడ్లో దోపుకుని మెల్లగా మేకప్ రూములోంచి బయటకు వచ్చింది. ఆమెకు నడుంలో నలగబొడుస్తున్నట్లుగా ఉంది. ఎలాగో ఓపిక చేసుకుని మెల్లగా బయలుదేరింది. ఆమె పొత్తికడుపులోని నరాలు ఊరికే లాగేస్తున్నాయి. అరికాళ్ళు తిమ్మిర్లెక్కుతున్నాయి.

ఇందాక తను టిఫిన్ తిన్న పార్కును దాటుతూ ఫౌంటెన్ మధ్య ఉన్న పాలరాతి బొమ్మ వంక చూసింది. తల్లి చంకలోని పిల్లవాడు ఎత్తిన గుప్పిలి ఆ తల్లి మధురస్వప్నాల ఫలాన్ని ఆమెకందిస్తున్నట్లుగా ఉంది.

కనకంకు పొత్తికడుపులో కత్తిపోటు పొడిచినట్లనిపించింది. బాధతో, 'అమ్మా!' అని కడుపుమీద చేయి చేసుకుంది.

అలా కొద్దిదూరం నడిచేసరికి కనకంకు విపరీతంగా ఆయాసం వచ్చింది. ఇంకో అడుగు కూడా ముందుకేయలేకపోయింది. నడుం మునుగుల్లోని బాధ మరీ ఎక్కువయింది. పొత్తికడుపు కిందకు జారుతున్నట్లుగా ఉంది. ఒక చెట్టుకు జారగిలబడి కూర్చుంది. తడిగుడ్డను పిండుతున్నట్లుగా కడుపంతా మెలివేస్తున్నది. ఆ బాధకు తట్టుకోలేక మెలికలు తిరుగుతుంది. కొద్దిసేపు బాధ తగ్గినట్లే తగ్గుతూ ఉండి ఉండి పొత్తికడుపులో పోట్లు వస్తున్నాయి. బిగ్గరగా అరవాలనిపిస్తుంది. కాని అది కాని చోటు అయిపోయింది. అలాగే బిగపట్టుకుంటుంది. సన్నసన్నగా మూలుగుతుంది. ఎవరూ ఆ దరిదాపుల్లో కనిపించటంలేదు. తను కూర్చున్న చెట్టుమీద ఉన్న గూట్లోని పక్షులు ఉండి ఉండి అరుస్తున్నాయి. దూరంగా ఏ చెట్టుమీదనుంచో కీచురాయి అరుస్తుంది.

కొన్ని క్షణాల తరువాత లోపల నొప్పి సర్దుకుంటున్నట్లు, బాధ తగ్గినట్లనిపించింది.

ఫౌంటెన్ లోని బొమ్మా, తల్లి చంకలోని పిల్లవాడు కళ్ళముందు మెదిలారు. ఆ పిల్లవాడు తన బుల్లి గుప్పిళ్ళను పైకెత్తి గాలిలో ఊపుతున్నాడు. కిలకిలమని బోసినవ్వుగా నవ్వుతున్నాడు. అప్రయత్నంగా పొత్తికడుపు మీదచేయి వేసుకుని ఆప్యాయంగా నిమురుకుంది.

కనకంకు ఏడుపు ముంచుకు వచ్చింది. ఆమెకు గుండె ఆగిపోయినంత పనయింది.. ఏంవిటి? ఏమవుతోంది? ఈ బాధ, కడుపులో ఈ కత్తిపోట్లు, మునుగుల్లో ఈ శూలాలు గుచ్చుకోవటం అందుకేనా? అయ్యో, భగవంతుడా, ఎంతపని చేశావు తండ్రి? నా బతుకులో నిప్పులు పోసావే? అయ్యో, అయ్యో, ఇప్పుడేంటి చెయ్యటం? అందుకేనా ఈ బాధ? అయ్యో, ఎవరూ చెప్పరేంటి? బాబూ, నీవయినా చెప్పరా బాబూ - నీవు వెళ్ళిపోతున్నావా? పలకరా తండ్రి! ఎంత పాపిష్టిదాన్ని? కోపం వచ్చిందా? ఈ అమ్మమీద నీకు కోపం వచ్చిందా బాబు? నాలోంచి బయటపడాలని చూస్తున్నావా? ఈ అమ్మ మంచిది కాదని ఇంకో అమ్మ దగ్గరకు పోవాలని చూస్తున్నావా? అందుకనేనా బాబు, లోపల అంతగా గింజుకుంటున్నావు? నిన్ను నాలో బంధించిన తల్లి ప్రేమను తెంచుకుని బయటపడాలనే కదూ బాబు! నీ అమ్మ కడుపులో ఇలా కత్తిపోట్లు పొడుస్తున్నావు? ఈ మూడు నెలలలో ఈ అమ్మ అంటే నీకు మొగం మొత్తిందా బాబు?

ఉండి ఉండి ఆ చెట్టుమీద తలదాచుకున్న పక్షులన్నీ కనకం దీనావస్థకు విలపిస్తున్నట్లుగా గోలగోలగా అరిచాయి. కబోది పక్షులు రెక్కల్ని భయంకరంగా టపటపలాడించాయి.

కనకంకు మళ్ళీ బొడ్డుకింద, పొత్తికడుపు మడతల్లో నొప్పి మొదలయింది. తెరలు తెరలుగా వస్తోంది. బాధతో గిలగిలలాడిపోతుంది. ఊరికే మెలికలు తిరిగిపోతుంది. రెండు చేతులు పొట్టమీదేసుకుని అదుముకుంటుంది. మూగగా తనలో తాను విలపిస్తోంది.. తన చుట్టూ ఉన్న చెట్లల్లోంచి జడల దెయ్యాలు వికటాట్టహాసం చేస్తూ తనమీద మీదకు వస్తున్నట్లనిపించింది. ఫౌంటెన్ లోని పిల్లాడ్ని ఎత్తుకున్న తల్లి తనను చూచి వెక్కిరిస్తోంది. ఎవరో పసిపిల్లాడి ఏడ్పు తన చెవుల్లో సన్నగా వినిపిస్తుంది. మూడు నెలల క్రితం తను తల్లికాబోతుందన్న విషయం మొదటిసారిగా విన్నప్పుడు తన భర్త మురిసిపోవటం, అతని గుండెల్లో సిగ్గుతో తను తలదాచుకోవటం, మనకు బాబే పుడతాడు కనకం అని అతను తన వీపు నిమురుతూ చెప్పడం సరిగ్గా పదిరోజుల క్రితం ఉదయం, టిఫిన్ కారియర్‌లో అన్నం పెట్టుకుని నవ్వుతూ ఫ్యాక్టరీ కెళ్ళిన భర్త సాయంత్రం ఇంటికి తిరిగి వస్తూ దారిలో లారీ కిందపడి రక్తం ముద్దగా ఇంటికి తిరిగి రావటం, ఇరుగు పొరుగు జనం పోగవటం, అతను తుది క్షణాల్లో, "కనకం నిన్ను దిక్కులేనిదాన్ని చేసిపోతున్నాను., నీవెన్ని కష్టాలు పడ్డా నీవు మన బాబును పెంచి పెద్దవాడిని చేయాలి. గొప్పవాడిని చేయాలి. ఈ వంశాన్ని నిలిపేవాడు వాడే" అని కళ్ళు మూయడం, తన ఇంటి దీపం ఆరిపోవడం, తన తల గోడకేసుకు బాదుకుని బాదుకుని ఏడవటం, సీతమ్మత్తవాళ్ళు ఓదార్చడం.. అన్నీ ఒకదాని తర్వాత ఒకటి కనకం కళ్ళముందు మెదిలాయి.

రెండు చేతులతో తలపట్టుకుని కనకం కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది. 'అయ్యో మీకిచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయానండి! పాపిష్టిదాన్ని, మీ ఆఖరి కోర్కె చెల్లించాలనేనండి నేనీ పనికి వప్పుకుంది. ఇలా సిన్మాలో వేసి రోజుకు ముప్పై రూపాయలు సంపాదించి పుట్టబోయే మన బాబు కోసం కూడబెట్టాలనుకున్నాను! మన బాబు బంగారు భవిష్యత్తుకు మూట కట్టాలనుకున్నాను గానీ, ఇంత ఘోరం జరుగుతుందనుకోలేదు. లేత నెలల్లోనే ఇలా ముంచుకొస్తుందని అనుకోలేదు. అయ్యో! ఇప్పుడేమిటి గతి? అయ్యో మన వంశం నిర్వంశమయిపోయినట్నేనా నన్ను మీరు క్షమిస్తారా? చెప్పండి - ఏమీ ఆధరువు లేకుండా నన్ను దిక్కులేని పరిస్థితుల్లో వదిలేసి మీదార్ని మీరు పోయారు - నా మీద జాలి తలచి సీతమ్మత్త ఈ దారి చూపిస్తే సరే అన్నాను కాని, ఈ దారే నన్నిలా అగాధంలోకి పడేస్తుందని అనుకోలేదు' - అయ్యో, అమ్మో, బాధ - బాధ.

కనకం "అమ్మా" అని మూలిగింది.

సరిగ్గా అదే సమయంలో బేబమ్మ తన బంగళాలో ఏ.సి వేసిన తన పెద్ద పడగ్గదిలో పెద్ద పడవలాంటి తన పడక మంచం మీద కూర్చుని ఉంది. ఆమె చేతిలో రెండు మాత్రలున్నాయి. మరో చేతిలో మంచినీళ్ళ గ్లాసుంది. గాజుగ్లాసులోని మంచినీళ్ళ వంక కొన్ని క్షణాలు తీక్షణంగా చూచి, ఎదురుగా నిలబడ్డ తల్లిని చూచి "ఏదీ ప్రమాదం లేదు కదా?" అంది దిగులుగా.

బేబమ్మ అమ్మ, "ఏమాదం? నాను ఒకటికి రెండుమాట్లు ఆ డాకటేరు బాబును గట్టిగా అడిగా. అట్టాంటి భయమేం లేదన్నాడు. తెల్లారే పాటికి అంతా సల్లంగా సక్కనయిపోతుందన్నాడు -" అని మహా గట్టిగా హామీ ఇచ్చింది.

సిన్మాతారకు పిల్లలు అవరోధం - అందులోనూ 'కుమారి'గా భరించలేని అవమానం!

--మాత్రలు నోట్లో వేసుకుని గడగడా నీళ్ళు తాగేసింది.

●●●●

కార్యసాధకుల మహాకావ్యం (వాక్ చిత్రం)

బుచ్చిబాబు

ప్రపంచ భారం ముగ్గురి మీద పడింది. పనిచేసేవారు; ఏం చెయ్యాలో చెప్పేవారు, వీరు సరిగ్గా చెప్పారో లేదో, వీరు చెప్పింది వారు చేస్తున్నారో లేదో గమనిస్తూ, అసలు ఏం చెప్పాలో నిర్ణయించేవారు. మొదటిరకం వారు కష్టజీవులు, రెండోరకం వారు మేధావులు, మూడోరకం వారు. కీర్తి, పలుకుబడి, పేరు ప్రతిష్టలు, అధికారం, డబ్బు, గౌరవం అన్నీ ఈ మూడోరకం వారికే దక్కుతున్నాయి. వీరుకాక నాలుగో రకం వారు కూడా ఉన్నారని ఈ మధ్యనే తెలుసుకున్నాను. ఈ మూడు రకాల వారి చర్యలని చూస్తూ, ముక్కు మీద వేలేసుకుని 'ఔరా!' అని లోపల అనుకుంటూ, కూర్చునేవారు. నే నీ రకంవాడిని. ఈ నాలుగోరకం వారి ప్రతినిధిగా వారి గుణగణాలను పొందుపరుస్తున్నాను. మేం అందరం చాలా మంచివాళ్ళం. ఎవరిజోలికి పోము - తుదకు మా జోలే మాకక్కర్లేదు. ఒక సంఘటన జరిగిపోయిన చాలాకాలం వరకూ, మాకు దాని విషయం తెలవదు. ఆ సంఘటన గురించి కొన్ని అభిప్రాయాలు ఏర్పరచుకుని, ఇతరులకి చెబుదామనుకున్నప్పుడు, వారందరూ ఆ సంఘటన మరచిపోయే ఉంటారు. మా కింక చెప్పే అవసరం లేదు. ఇతరులతో సంభాషించేటప్పుడు, ఎన్నెన్నో చమత్కారమైన భావాలు, సమాధానాలు మా బుర్రలలో చటుక్కున మెరిసి మాయమైపోతూంటాయి. వాటిల్లో ఒక్కదాన్ని చెప్పడానికి చక్కటి మాటలు వెదుకుతూండగా, ఆ సంభాషణ సమయం గడిచిపోయి, అవతల వ్యక్తులు నిష్క్రమించడం, మామూలుగా జరుగుతూ ఉంటుంది. ఒక జడ్జీగారు భార్యని పిలిచి 'ఆ మెట్ల మీద నుంచి వెళ్ళిందెవరు?' అని ప్రశ్నించారట. వారం గడిచిం తర్వాత 'అది పిల్లి' అని ఆమె సమాధానం ఇచ్చిందట. మేం అట్లాంటివాళ్ళం. మేం ఊహలో జీవిస్తాం. ఆ సామ్రాజ్యంలో మేం పాలకులం - కాని పాలితులు లేరు. స్థిత ప్రజ్ఞులకింద జమకట్టి గీతాకారుడు మమ్మల్ని తెగమెచ్చుకున్నాడు. మాకూ ఆకలి దప్పులూ, తృష్ణ, వాంఛ, అహం కావలిసినంత ఉన్నాయి. దప్పికై మంచినీరు తాగితే, దప్పిక తీరిపోయి ఆ అనుభవం దూరమై

పోయిందన్న భయంవల్ల మేం దప్పిక తీర్చుకోము, వాసన చూసిన పుష్పం త్వరితంగా వాడిపోతుందే అనుకుని, దాన్ని తుంచం. వాసన చూడం గొప్ప సౌందర్యం కేసి చూస్తే, కన్నీటితో మలినమైన మా దృష్టికి ఆ సౌందర్యం మలినమైపోతుందని భయపడి, దానికేసి చూడం - చూడకుండా, వినకుండా, స్పృశించకుండా, సౌందర్యం మాదవాలి - ఇదెట్లా సాధ్యం చెప్పండి! ఊహా జగత్తులో ఏవో పిచ్చి ఆటలాడుకుంటూ ఉంటాం. కాని మమ్మల్ని అల్లా విహరించనివ్వరు ఎవ్వరో చెయ్యిపట్టుకుని స్థూలజగత్తులోకి లాక్కుపోతుంటారు. ఏమిటో చదువులట, ఉద్యోగాలట, పెళ్ళి సంసారమంట. కూరగాయలు, రైళ్ళు, కోర్టులు, డాక్టర్లు, డబ్బుట! "మార్కెట్టుకెళ్ళి కూరలు పట్టుకురా" అని ఎవరో కసిరి, మా చేతిలో ఓ సంచీ ఇచ్చి జేబులో నోటు పెట్టి తరుముతూ ఉంటారు. ఎక్కడ మార్కెట్టు? పుచ్చొంకాయ ఎట్లా ఉంటుంది? చేదు దోసకాయని పసిగట్టగలవా? ముదిరిన బెండలో బండారం బైటపెట్టగలవా నా బెండరాజా? ఈ ప్రశ్న పరంపరకి సమాధానం ఎవ్వరూ చెప్పరు. అనుభవం వల్ల ముదిరిన బెండవైనం తెలుసుకున్నా, మళ్ళా మార్కెట్‌కి వెళ్ళినప్పుడు ఆ అనుభవం ఉపకరించదు. ఆ బెండ అక్కడ ఉండదు, ఎందరో దాన్ని పట్టుకుపోయి తినేస్తారు. ముదిరిన బెండ తినరు కాబోలు. మేకలికి పెడతారా? నాకు తెలీదు. మరో కొత్త బెండ అవతరిస్తుంది. దాని పుట్టుపూర్వోత్తరాలు, భవిష్యత్తు ఎవరికి తెలుసు? మాకు మాత్రం తెలవదు.. రోజు రోజు ఈ బెండలు, దోసలు, ఎర్ర పచ్చిమిరపకాయలు, బ్యాంకులు, ఇన్ కంటాక్స్ ఫారాలు, పనిమనిషి పగిలిన గాజు, కింద ఉద్యోగి ఊడిన పాగా, పెళ్ళిలో బాండ్ వాద్యం - ఈ లోకం మీకు కొత్తగా, వింతగా కనిపిస్తూనే ఉంటుంది.

ఎల్లా జరిగిపోతాయో చిత్రం, అందరిలాగే మేమూ తయారవుతాం. స్కూళ్ళ కెడతాం, చదువుకుంటా, పెరిగి పెద్ద వాళ్ళమవుతాం, మాకూ పెళ్ళిళ్ళు అవుతాయి. అత్త, మామ, మరదళ్ళు, తోడల్లుడు - వీళ్ళందరూ ఉంటారు. తమాషా.

"నన్నెరుగుదురా?"

"ఎరక్కేం?"

"చెప్పుకోండి"

"ఇంకా నయం - మీరు రాజారావుగారు"

"కాను, మీ తోడల్లుడు మేనమామగారబ్బాయిని. గుర్నాధం పెళ్ళిలో కలుసుకున్నాం" అంటాడాయన. మధ్యలో ఈ గుర్నాధం ఎవడు? ఏమో! ఎందుకొచ్చింది? - గమ్ముండు! అనుకుని, నోరు నొక్కుకుని - రాజారావు వెళ్ళిపోయిం తర్వాత లెండి - కూర్చుంటాం.

మేం ఎవరికేనా మనియార్డర్లు కడితే, అవి తిరిగి మాకే రావడం పోష్టు వాడి చేతిలో అణా పెట్టడం మామూలే. ఎవర్నేనా మందహాసం చేసి ఆహ్వానిస్తే, అవతలవాడు సిగ్గుపడి, మొహం తిప్పేసిపోతాడు. అప్పుడప్పుడు నౌకర్లు మొదలైనవారిని గదమాయించమంటారు మమ్మల్ని. కోపం తెచ్చుకుని, నానా తిట్లూ తిట్టి, అధికారం చెలాయిస్తాం. కాని అదేం ఖర్మమో అవతలవాడు నవ్వు ఆపుకుంటాడు. ఆ దృశ్యం చూసి, మేమూ వచ్చే నవ్వుని ఆపుకోలేక నవ్వేస్తాం. మమ్మల్ని గదమాయించమని పురిగొల్పిన వ్యక్తులు, మమ్మల్ని గదమాయించటంతో ఆ వినోద ఘట్టం సమాప్తమవుతుంది.

"తెలిసిందా, ఇంకెప్పుడూ అల్లా చెయ్యకు. చేశావంటే చెవడాలెక్కదీస్తాను. మొట్టికాయ వేస్తాను. మా చిన్నప్పటి మాష్టారులా తొడపాశం పెడతాను జాగ్రత్త!"

"అదేమిటండీ - ఆ అబ్బాయిని కసురుకుంటారు? అతను డాక్టరుగారబ్బాయి."

ఇట్లాంటి పొరబాట్లు చేసినవారికి పుట్టగతులుంటాయా? ఎవరింటికేనా వెడితే, పనవగానే, అందరిలాగా 'వెళ్ళొస్తాం' అని లేచిరావడం మా చేతకాదు. గొంతు సవరించటం, 'అహహ' అని సకిలించడం.. ఈలోగా ఇంటి యజమాని మమ్మల్ని బైట దిగవిడిచి,

తలుపు గది వేసుకుపోవడం జరుగుతుంది. మమ్మల్ని ఈడ్చుకుపోవడం యమధర్మరాజుకి కూడా అంత సుళువు కాదు. సావిత్రి మా పెద్దక్క!

మాకు పలుకుబడిలేదు. 'కానీ తక్కువైంది - రేపిస్తాలే' అంటే దుకాణదారుడు ఊరుకోడు. చొక్కా విప్పించి దగ్గరుంచుకుంటాడు. మా కెవ్వరూ దగ్గర స్నేహితులు లేరు. మా అభిప్రాయాలు ఎవ్వరికీ అక్కర్లేదు. మేం చెప్పింది ఎవ్వరూ వినరు - అసలు అడిగేవాళ్ళే లేరు. ఏ పనిమీదా మమ్మల్ని పంపరు. మాకు పేరు ప్రతిష్టలు లేవు - కీర్తి లేదు. అన్నింటికన్నా ముఖ్యం మాకు డబ్బు లేదు. ప్రపంచంలో ఇంత డబ్బు చలామణి అవుతోందంటే మా కాశ్చర్యం. ఇచ్చేవాడెవడు? పుచ్చుకునేవాడెవడు? మాకు అధికారం లేదు. మేం చెప్పింది ఆఖరికి దేవుడు కూడా చెయ్యడు.

ఇదంతా అతిశయోక్తి అంటారా? నాకో వెయ్యికావాలి. పంపించి ఆ మాట అనండి. మళ్ళా తిరిగి ఇస్తాలెండి. ఆ డబ్బు స్వరూపం చూడనివ్వండి. చూసి, కాదూ కూడదంటే అప్పుడే తిరిగి ఇచ్చివేస్తాలెండి. దీనికి కారణం ఏమిటంటారు? ముందే చెప్పాను. మేం చాలా మంచివాళ్ళం అని. మంచివాళ్ళని సంఘం క్షమించదు. "తన చుట్టూ ఉన్న సమాజంలో వ్యక్తులకంటే మంచిగా ఉండటానికి యత్నించినవారు, 'దుర్నీతి' అనే గుమ్మంలో కాలుపెట్టినట్లే" అన్నాడు ఒక పాశ్చాత్య తత్వజ్ఞుడు. ఎటొచ్చీ మంచిగా ఉండటానికి మేం యత్నించే అవసరంలేదు. అసలు "యత్నం" అనేది మాకు సాధ్యం కాదు. సహజంగా, పుట్టుకతోనే స్థిరపడిపోయిన మంచివాళ్ళం మేం.

మమ్మల్ని తృప్తి పరిచేటందుకు కొందరు మమ్మల్ని 'పాలకుల పాలకులు' అని వ్యవహరిస్తున్నారు. మా బుర్రలోంచి ఏవో భావాలొస్తాయి. మేం చనిపోయింతర్వాత, ఏ ఒకరిద్దర్నో అవి ఆకర్షిస్తాయి. వారు వాటిని ప్రచారం చేస్తారు. విప్లవాలు, యుద్ధాలు జరిగింతర్వాత వాటిని ప్రజలు ఆమోదిస్తారు, వాటిమీద ఒక సమాజం నెలకొల్పబడుతుంది. ఒక నాగరికత ప్రారంభమవుతుంది, ఇవన్నీ మేం చనిపోయిం తర్వాత, రాత్రికి మాకు తిండిలేదు.

మాకు తిండి కల్పించడానికీ, మా పలుకుబడి పెంచడానికీ మమ్మల్ని పైకి తీసుకురావడానికీ, ఆధునిక యుగంలో ఎందరో కృషి, చేస్తున్నారు. ఈ కృషివల్ల వారు కోటీశ్వరులైపోతున్నారనుకోండి అవుతేనేం! మాకు సమాజంలో ఒక స్థానం ఏర్పరచి మమ్మల్ని ఓ ఇంటివాడిగా చేయడానికి తోడ్పడే వీరి కృషికి మా కృతజ్ఞత.

ఇట్టివారిలో ఒకరు మాది 'మిడత మనస్తత్వం'గా వర్ణించారు. మా మనస్సు దేనిమీదా కేంద్రీకరించదు. అల్లా అల్లా ఎగురుతూ ఉంటుంది. మేం సిమ్లా వెడితే, 'అయ్యో కన్యాకుమారికి వెళ్ళలేదే!' అని వాపోతాం. వేమన్నను గురించి ఉపన్యాసం కొనసాగుతూంటే షేక్స్పియర్ని గురించి ఆలోచిస్తాం భార్య 'భోజనానికి లేస్తారా?'అన్నప్పుడు, పక్కింటారి ప్రభావతిని స్మరించి ఆమె కళ్ళలోకి చూసినట్లు భార్యకేసి పరధ్యానంతో చూస్తాం. సినిమాకెడితే, సినీనటుడు కావాలనిపిస్తుంది; నాటకం చూస్తే, రంగస్థలనటుడు కావాలని ఆశయం. కుస్తీపట్టు పోటీ చూస్తే 'పహెల్మాన్' అవాలని సంకల్పం; ఉపన్యాసం వింటుంటే 'డిమాస్థనీస్' 'సురేంద్రనాథ బెనర్జీ'లుగా ఐపోవాలని లోలోన తీర్మానాలు. మిడతల దండు దండెత్తితే పాలాలు నాశనం. మా మనస్తత్వం వల్ల అట్లాంటి ప్రమాదం ఎవరికీ జరగదు. ఈ మనస్తత్వం గలవాళ్ళ పైనుంచి ఆకలితో మాడిపోతున్న యుగయుగాల మనుషులు నడిచిపోతారు. వాళ్ళ కాళ్ళ క్రింద నలిగిపోతాం. ఈ మనస్తత్వం నిర్మూలం చేసి మమ్మల్ని పైకి తీసుకొచ్చే విధానం ఉంది. దానికి చాలా డబ్బుకావాలి. చాలాకాలం శిక్షణ పొందాలి. ఫోను ద్వారా పాఠాలు పంపుతారు నిజమే. మా సందేహాలు మళ్ళా పోస్టుద్వారా పంపే తెలివే లేదనిగా మా గొడవ!

ఇవన్నీ కనిపెట్టి, కొందరు పాశ్చాత్యులు, మా కోసం బోలెడు గ్రంధాలు వ్రాశారు. 'సుళువుగా విజయం' అనే నిచ్చెనెక్కడం'. 'స్నేహితుల్ని సంపాదించడం సుళువు' 'ఎంత కావలిస్తే అంత' 'లోకం నీ బానిస', 'పై ఉద్యోగం కావాలా?' 'ఇతరులపై అధికారం నీకుంది.' 'నీదే పైమాట', 'ప్రేమించిన స్త్రీపొందుని పొందు', 'నీ శక్తి నీకు తెలవదు', 'అందరూ వింటారు నీ మాట', 'నువ్వే నాయకుడవు', 'శిఖరానికి నిచ్చెన' ఇవనీ ఆ గ్రంధాల పేర్లు. వీటి వెల రూపాయి, రెండుకి మించదు. అన్ని రైల్వే బుక్ స్టాల్స్లోను

దొరుకుతాయి. రైళ్ళ కోసం కాచుకున్నప్పుడల్లా ఈ పుస్తకాలని కాస్త కాస్త చదువుతూ, వీటి భోగట్టా అంతా తెలుసుకున్నా. 'లోకం నీ బానిస' అన్న పుస్తకం నన్నెక్కువగా ఆకర్షించింది. అది చూస్తూ ఉంటేనే రైలెళ్ళిపోయింది. మా ఆవిణ్ణి తీసుకుని నేను దిగపడిపొయ్యాను. అప్పుడనుకున్నాను ఆ గ్రంధ రాజాన్ని. కొన్ని మిలియన్ల కాపీలు అమ్ముడుపోయినాయని ఆ గ్రంధకర్తగారు చెప్పుకున్నారు. ప్రపంచం అన్ని భాషలలోకీ - తుదకి నార్వీజియన్ భాషలోకి గూడా - అనువదింపబడింది. భాషలన్నిటిలోకి తెలుగు లెస్స గాన, తెలుగులోకి అనువదింపబడలేదు. పుస్తకం చివరలో ప్రముఖుల అభిప్రాయాలు, చదివి బాగుపడినవారి అనుభవాలు పొందుపర్చబడి ఉన్నాయి.

ఒకాయన ఇల్లా వ్రాశాడు:

"మీ పుస్తకంలో, పై అధికారి ప్రాపకం పొందటం ఎట్లా" అనే అధ్యాయం చదివి మీ సూత్రాలను ఆచరణలో పెట్టాను. దాని ఫలితంగా మొదట్లో నా మొహం కేసి చూడని మాపై అధికారి రోజూ మధ్యాహ్నం టీ కని మా ఇంటికే వచ్చేస్తున్నాడు. ఇప్పుడు ఆయన్ని వదిలించుకోడమే ఒక సమస్యగా తయారైంది. ఆయన్ని వదిలించుకునే మార్గం సూచించండి అని.

ఈ పుస్తకంలో ఆరు అధ్యాయాలున్నాయి. అందులో సూత్రాలను ఆచరణలో పెట్టాక కలిగిన ఫలితాలను, జరిగిన మేలును వ్రాసుకునేటందుకు పుస్తకం చివరలో ఖాళీకాగితాలున్నాయి. ఈ పుస్తకం మీలో చాలామంది చదివే ఉంటారు. మీ కందరికీ నాలాగ వృద్ధిలోకి రావాలని ఉబలాటటం ఉందని నాకు తెలుసు. లేకపోతే నే వ్రాసింది చదవరు. కాబట్టి ఆ పుస్తకంలో విషయాలన్నీ ఏకరువు పెట్టకుండా అందులోని కొన్ని ప్రధాన సూత్రాలను వివరిస్తాను.

'నీలో చాలా శక్తులున్నాయి. నీ శక్తులు నీకు తెలియవు. కాస్తంత పట్టుదలతో పనిచేస్తే నువ్వెంతవాడవు అవాలనుకొన్నావో అంతవాడవు అయ్యితీరుతావు నీకు డబ్బుకావాలా? స్నేహితులు కావాలా? పలుకుబడా? అధికారమా? ప్రేమా? బలమా? అవును, నీ కివన్నీ కావాలి. నీకు పట్టుదల కూడా ఉంది. దానికి తార్కాణం నీవీ పుస్తకం చదవడమే'.

అల్లా సాగుతుంది మొదటి అధ్యాయం. తర్వాత ఆ పుస్తకంలో విషయాలను ఆచరణలో పెట్టి గొప్పవారైన కొందరి వ్యక్తుల సంగ్రహ జీవితాలు కూర్చబడిఉన్నాయి. సంఘంలో పలుకుబడి సంపాదించి పైకి రావాలంటే - ఇప్పుడు నా గొడవ అది కనక - ఏం చెయ్యాలో గ్రంధకర్త కొన్ని నినాదాలు క్రింద క్లుప్తీకరించారు.

అ: అనవసరంగా మాట్లాడకు.

ఆ: మాట్లాడేముందు నిదానించి చటుక్కున తట్టిన దాన్ని విడిచేసి మరేమన్నా చేస్తే బాగుంటుందేమో ఆలోచించి అది చెప్పు.

ఇ: నిన్ను గురించి మాట్లాడకు.

ఈ: అవతల వ్యక్తిని గురించి మాట్లాడు. అతని భార్య, పిల్లలు, సంసారం, అభిప్రాయాలు, అభిరుచులు తెలుసుకో. వీలైతే పొగుడు. మెచ్చుకో - మరీ భట్రాజులాగ కాక, లౌక్యంగా స్తోత్రం చెయ్యి.

ఉ: ప్రతివాడు ఏవో కొని తప్పులు చేస్తాడు. ఏవో లోట్లు ఉంటాయి. అని తెలుసుకుని సానుభూతి ప్రకటించు. అట్లాంటివి నీలో కూడా ఉన్నట్లుగా ప్రకటించు.

ఊ: అవతల వ్యక్తి స్త్రీ అయినప్పుడు ఆమె వయస్సు అడగకు.

ఋ: పై అధికారి దండించినపుడు తప్పును ఒప్పేసుకో.. సమర్థించకు.

ౠ: ఇవన్నీ ఎప్పుడు ఆచరణలో పెడతావు? ఎప్పుడో అవకాశం వస్తుందని కూర్చోకు. వచ్చేనెల చూచుకుందాంలే అని జాప్యం చెయ్యకు. రేపు ఆలోచిద్దాంలే అని అనుకోకు. ఇప్పుడు, ఈ క్షణంలో ప్రారంభించు లేచి వెళ్ళు.

నిజంగా చూస్తే ఇందులోని ఏవీ కొత్త సూత్రాలు కావు. గీతాకారుడు, భర్తృహరి, వేమన్న ఏనాడో చెప్పినవే. కాని ఈ గ్రంధకర్త నా నిత్యజీవితంలోని విషయాలతో సమన్వయ పరచి నినాదాలుగ గద్యలో సూటిగా చెప్పడం వల్ల ఉద్రిక్తుడనై పుస్తకం మూసి అవతల

పారేసి రోడ్డు మీదకి పరిగెట్టాను. మొదట్లో ప్రత్యక్షమైంది రోజూ మా వీధిలో తిరిగే పిచ్చాడు. వాడు చక్రవర్తిట. వాడికి రాణీలు కావాలిట. వాడి సామ్రాజ్యంలో ప్రజలు లేరట. నన్ను రమ్మని ఆహ్వానించాడు. ఏమిటో, నిజంగా ఆలోచిస్తే నాకూ వాడికి తేడా ఏమిటి? వాడిభావాలే నాలోనూ ఉన్నాయి. ఎటొచ్చీ వాటిని పైకనే సాహసం నాలో లేదు. నా ఊహా సామ్రాజ్యానికి నేను చక్రవర్తిని. వాడు స్తూలజగత్తులో తిరుగాడుతున్నాడు. అతన్ని సంఘం చక్రవర్తిగా అంగీకరించలేదు. ఎందుకంటారా సంఘంలో ప్రతిఒక్కడు వారి వారి ఊహలలో చక్రవర్తులే. ఇట్లాంటి వారియందు ఈ గ్రంధకర్త సూత్రాలు ఎందుకు పనికి వస్తాయి? పిచ్చివాళ్ళు పైకి వస్తారా, పైకి వచ్చినవాళ్ళు అవుతారా? గబగబా ఇంట్లోకి వెళ్ళి సమాధానం కోసం మళ్ళా ఆ పుస్తకం తీశాను. దొరకలేదు. ఈ విషయం గ్రంధకర్తకి వ్రాద్దామని ఖాళీ కాగితం మీద గుర్తుపెట్టుకున్నాను. ఒక బ్యాగ్ తీసుకుని ఒక నలభై ఏండ్ల ఆమె వరండాలో ప్రత్యక్షమయింది.

"ఆమె ఉన్నారాండి?"

నేను మాట్లాడలేదు.

"మిమ్మల్నే, ఆమె ఉన్నారా అండి?"

నాకు నవ్వొచ్చింది. నవ్వు ఆపుకున్నాను. ఈవిడ కేం సమాధానం ఇవ్వను? ఆవిడ ఒక అడుగు ముందుకేసి "ఆమె ఇంట్లోలేరాండి" అని కంఠం పెద్దది చేసి ప్రశ్నించింది. నాకు తెలిసిపోయింది. నాకు చెముడు అని అనుకుంటోంది.

'నాకు చెముడు కాదండోయి' అని వెంటనే తట్టిన సమాధాన్ని దిగమింగేశాను.

'ఎవరికోసమండి'

'ఆమె లేరాండి?"

'మీ పేరు?'

'నన్నెరగరా?'

'లేడీస్ క్లబ్ సెక్రటరీని.'

'మీ భర్తగారి పేరు?'

ఆవిడ నవ్వింది.

'మీ వారి పేరు చెప్పండి' అంది.

"మా వాళ్ళ దేముందిలెండి, సంతోషంగా చెపుదును. మీ అంతటివారు అడగటం లేరు. ఎందుకో మీరు ఊహించుకోగలరు. మీ క్లబ్‌లో నన్ను చేర్చుకోరాండి?"

"మీకు వివాహం కాలేదన్నమాట."

"అన్నమాటేమిటండీ, బొత్తిగా కాలేదు."

"రాయలసీమ క్షామనిధికి విరాళాలు పోగుచేద్దామని బయలుదేరాం. అయితే ఇది గుర్నాధంగారి ఇల్లు కాదన్నమాట?"

"అన్నమాటేమిటండీ, బొత్తిగా కాదు. మూడిళ్ళు దాటాక నాలుగో ఇల్లు వారిది. మీ వారిని కలుసుకోవాలని ఉందండీ."

"తప్పకుండా కలుసుకోవచ్చు. కాని ఒక్క తిరకాసుందండీ"

"అయ్యో పాపం! అడిగినందుకు క్షమించండి."

"అదేమిటండోయ్, అసలు పెళ్ళేకాందే"

"అల్లాగా, క్షమించండి."

ఆవిడ వెళ్ళిపోతుంది.

"ఏమండోయ్, మీ వయస్సు మాత్రం చెప్పకండేం"

ఆవిడ నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

నాకు చెముడనే కాకుండా "పిచ్చి" అని కూడా అనుకుంటోందని నాకు తెలుసు. కాని ఏం చెయ్యడం? ప్రతి ప్రజానాయకుడు, కార్యసాధకుడు, ఉద్యమకర్త, కొన్ని కష్టాలు భరించాలి. కొన్ని త్యాగాలు చెయ్యాలి. ఈ అనుభవం ఖాళీ కాగితంలో వ్రాసుకున్నాను.

మరో వారంలోనే గ్రంధకర్తగారి సూత్రాలు పూర్తిగా ఆచరణలో పెట్టే అవకాశం దొరికింది. మా మామయ్యగారి ఊరికి గంట రైలు ప్రయాణం. పెట్టెలో జనం కిటకిటలాడుతున్నారు. కాని రైలు కదిలే సమయానికి చాలామంది దిగిపోయాను. పెట్టెలో మిగిలింది ఆరుగురం. ఒక ముసలామె, ఆమె మనుమడు, తలపాగా ఆసామీ, ఒక పోలీసు, నా ఎదురుగుండా సీటు మీద ఓ ఘరానా వ్యక్తి. పత్రిక తీసి చదువుతున్నట్లు అభినయిస్తూ ఆ పెట్టెలో ఉన్న వ్యక్తుల వాలకాలను బట్టి వారు ఏయే వృత్తులలో ఉండి ఉంటారో ఊహిస్తూ కాలక్షేపం చేశాను. తలపాగా ఆసామి వ్యాపారస్తుడు. ముసలామెను పోల్చుకోలేకపోయాను. పాలు, పిడకలూ అమ్ముతూ జీవితం గడుపుతుంది కాబోలు. మనవడు రబ్బరు త్రాడు తగిల్చిన బంతిని ఎగరేస్తూ తనవైపుకు లాక్కుంటున్నాడు. సరే, పోలీసు ఆయన పోలీసాయనే. నాకు చిన్నప్పటినుంచీ పోలీసులన్నా, కాకీచొక్కా, లాగు వేసుకున్న మిలటరీ వాళ్ళు అన్నా చచ్చేభయమే. ఎందుకో తెలియదు. చిన్నప్పటి నుంచీ పోలీసులంటే భయం నేర్పుతారు కాబోలు. అసలు శాంతికాముడుగా జన్మించానేమో లేక సహజమైన భయాన్ని అహింసాతత్వంగా మార్చుకున్నారేమో! ఈ భయమే అసహాయకుడుగా చేస్తుందనుకుంటాను. భయం దిగమింగుకుని సాహసం అలవర్చుకుంటే మానవుడు సాధించని కార్యం లేదనుకుంటాను ఇవన్నీ నాకు తెలుసు. కాని ఆదర్శానికి ఆచరణకి చాలా వ్యత్యాసముంది. పర్యవసానం ఏమిటంటే కాస్త దూరంగా ఉండి ఆ పోలీసాయన ముఖం కేసి మళ్ళా చూడలేదు. ఆ ప్రక్క స్టేషనులో రైలు ఆగడం తలపాగా ఆసామి దిగడం మళ్ళా రైలు కదిలేవరకూ నేను గమనించనే లేదు. ముసలామె పడుకుంది. రబ్బరు త్రాడు తెగిపోయి కుర్రాడు ఉత్తబంతితోనే ఆడుతున్నాడు. మళ్ళా పత్రిక చూశాను ఉద్యోగం ఖాళీల వివరాలు చదివాను. నాకు నచ్చినది ఒకటీ లేదు. "వరుడు కావలెను" జాబితా చూశాను. నాకు తగినవారు ఒక్కరూ లేరు. పరమపదించిన వారి చిట్టాచూశాను. నాకిది నచ్చింది. నా భావాలు చాలా చెడ్డవి. చనిపోయినవాళ్ళను గురించి చదవడం నాకిష్టం. ఆత్మహత్యలు, హత్యలు మరీ ఇష్టం. ఎవరేనా చనిపోతే వారిల్లు ఖాళీ అవుతుంది కదా! వారు చేసిన ఉద్యోగం ఖాళీ ఏర్పడుతుంది కదా? ఎక్కడో విమానం తగులడింది. మరెక్కడో యుద్ధం, రెండు లారీ ప్రమాదాలు, ఒక రాజకీయ హత్య. మరో ప్రాంతంలో కరువు. ఒక దేశంలో భూకంపం. మరోచోట అగ్నిపర్వతం ప్రేలుడు. ఫసిఫిక్ సముద్రంలో రెండు ఓడలు మునిగాయి. ఇవన్నీ ఆ పత్రికలో వార్తలు. ఒక్క రోజులో ఇంతమంది చనిపోయారే. ఇన్ని ఖాళీలు ఏర్పడ్డాయే. నాకు మాత్రం ఉద్యోగం దొరకదేం? ఎదురుగా కూర్చున్న ఘరానా వ్యక్తి నోట్లో సిగరెట్టు పెట్టుకుని అగ్గిపుల్ల కోసం సంజ్ఞ చేశాడు.. ఇచ్చాను. ఆయన సిగరెట్టు ముట్టించి పత్రిక చదువుతూ కూర్చున్నాడు. ఆయనకేసి పరకాయించి చూశాను. వయస్సు ముప్పైలోపు. దిట్టంగా మీసాలున్నాయి. ఖద్దరు లాల్చీ, పైన కండువా, కళ్ళజోడూ, మధ్య పాపిడ, రెండు అంగుళాలు నడిచే జుట్టు సుడులు తిరగటం మూలాన నిలిచిపోయింది. ఆయన విద్యార్థికాడు, ఉద్యోగి కాడు, రైతు కాడు, వ్యాపారస్తుడు కాడు, భూతవైద్యుడు కాడు. ఇల్లా ఆయన ఏంకాడో ఒక రోజల్లా చెప్పుకుపోగలను మరెవరు? శాసనసభా సభ్యుడేమో! ఆయన ప్రాపకం నా కవసరం. "అల్పుడా! మందభాగ్యుడా. ఇంకా ఎంత కాలం జాప్యం చేస్తావు? రైలు చక్రాలకింద నిమిషాలు నలిగి చస్తున్నాయి. ఆయన్ని మంచిచేసుకోవాలనిలేదా? ఆయన్ని పలకరించవేం? లే, వెళ్ళు; మాట్లాడు" అని అంతరాత్మ దండిస్తోంది.

"బాగా చెప్పావు. ఇంకా చివాట్లు పెట్టు. నాకు మీ భాషరాదు. వస్తే నేనూ నాలుగు తిడుదును" అని గ్రంధకర్తగారు అంతరాత్మని పురిగొల్పుతున్నాడు. ఇంక నేను ఆలసించడానికి వీల్లేదు. గొంతుక సవరించుకుని ఉపక్రమించాను.

'తమ నామధేయం..?'

ఆయనేమీ మాట్లాడలేదు.

'తమపేరు శెలవిచ్చారు కారు'

ఆయనకి చెముడా అన్న అనుమానం రాసాగింది.

'మిమ్మల్నే' అన్నా కొంచెం బిగ్గరగా.

పత్రిక ముడిచేసి, నాకేసి చూశాడు.

'తమ పేరడిగాను,'

"మిమ్మల్ని నేనూ అదే అడుగుదామనుకుంటున్నాను."

నా పేరు చెప్పాలనీ, మా తాతగారి పేరు చెప్పాలనీ - మా తాతగారి తండ్రిగారు కొన్నాళ్ళు దివాన్ గిరి చేశాడుట. ఇప్పుడవన్నీ ఎవరు వాకబు చెయ్యొచ్చారులెండి - నాలిక చివరిదాకా వచ్చేసింది. దానిని దిగమింగాను.

"తమరెవరో.."

ఏమిటి చెప్పాలో స్పష్టంగా లేకపోతే వాక్య నిర్మాణం ఇలాగే ఏడుస్తుంది.

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్లున్నాను" అన్నాడాయన.

"మిమ్మల్ని తప్పకుండా చూశాను.. కాకినాడా..? విశాఖపట్నమా..?"

" ఆ ఙ్ఞప్తికొచ్చింది. మిమ్మల్ని నెల్లూరులో చూశాను" అన్నాడాయన.

నేను నెల్లూరుకిగాని, ఆ చుట్టుపక్కలకిగాని, రైలు ప్రయాణములో తప్ప వెళ్ళలేదు. కాని ఖండించటం తప్పనీ వాదనలోకి దిగవద్దనీ, "లోకం బానిస" గ్రంధకర్త నినాదం చెవులో అద్దె ఎగేసి కాపురం ఉండి, ఇల్లు తన స్వంతదే అనే స్థితికొచ్చింది.

"నాదేముదిలెండి. మీరంటే దేశం నాలుగు మూలలూ తిరిగొచ్చినవారు పైదేశాలు కూడా పర్యటన.."

"ఎబ్బే - లేదండి - నా మొహం - మీ మాట చెప్పండి - మీరు ఉత్తర హిందూదేశం అంతా తిరిగొచ్చినట్లుగా ఉన్నారు" అన్నాడాయన.

"తాజమహల్ ను గురించి మీ అభిప్రాయం వినాలనుంది" అన్నాడు.

"ఏం లేదులెండి - కన్యాకుమారి నుండి సూర్యాస్తమయం గొప్పగా ఉంటుందిట. దాన్ని గురించి మీరేమన్నా చెబుతారేమో.."

సూర్యాస్తమయం వర్ణన పద్యం ఒకటి ఙ్ఞప్తికొచ్చింది. దాన్ని నాలుక కిందే నలిపేశాను.

"మీ కండువా చాలా బాగుందండి - ఆ ఖాదీ ఎక్కడిదండి!" అన్నాను. ఆయన నా జోళ్ళకేసి చూస్తున్నాడు.

"మీ జోళ్ళు బాగున్నాయి. ఎంతకి తీశారు?"

"మీ కండువా గురించి చెప్పారు కారు."

"ఆ - ఇదేముందిలెండి - ఇది నాది కానేకాదు ఓ స్నేహితుడిది" అన్నాడాయన.

"మీ స్నేహితుల్ని బట్టి, మీరెవరో చెప్పవచ్చునంటూ ఉంటారు పెద్దలు. మీ స్నేహితుడి అభిరుచులు మంచివండి. బాగుంది కనుకనే మీరు దాన్ని దరించారు. మీ స్నేహితుణ్ణి గురించి వినాలనుంది. చెప్పండి" అన్నాను.

రైలు నిలిచింది. కుర్రాడు ఎగరేస్తున్న బంతి తిన్నగా వచ్చి ఒకాయన మెడకింద కండువా డాగుచేసి పడింది.

"మీవాడా?"

నా ఒళ్ళు మండింది. ఈ దౌర్భాగ్యుడు ఆ మాత్రం ఊహించలేడు పెండ్లయి, అంత వయస్సు పిల్లడి తండ్రిలాగున్నానా - కళ్ళు లేవు? అందుకనే కళ్ళజోడు పెట్టుకున్నాడు!

ముసలమ్మ, మనవడు దిగిపొయ్యారు. రైలు కదిలింది. ఘరానా వ్యక్తిపై కోపం వచ్చేసింది. "లోకం బానిస" గ్రంధకర్తమీద కోపం వచ్చేసింది. అసలు మొత్తంగా పుస్తకాలంటేనే కోపం రేగింది. ఎవ్వళ్ళూ పుస్తకాలు చదువకూడదు.

పుస్తకాలకి అలవాటుపడినవాళ్ళు ఊహలో జీవిస్తూ, లోకజ్ఞానం లేక, అనామకులుగా, ఎందుకూ పనికిరాకుండా తయారవుతారు. పుస్తకాలని నిషేదించాలి ప్రభుత్వాలు. ప్రతి గ్రంధకర్త, ప్రభుత్వానికి పుస్తకానికి వెయ్యిరూపాయలు చొప్పున సుంకం చెల్లించి మరీ రచనకి పూనుకోవాలి. దాన్ని పుస్తక భాండాగారంలో భద్రంగా ఉంచాలి. దానిని చదవాలకున్నవారు ఐదు రూపాయలు రుసుం చెల్లించాలి. అప్పుడు కాని ఈ రాతలు, చదువులు తగ్గవు.

"లోకం బానిస" గ్రంధకర్త కేవలం ఆ పుస్తకం వ్రాసే బోలెడు డబ్బు సంపాదించాడు. ఇంకే పని వాడికిచేతకాదు. అతను పాశ్చాత్యుడు - వారి దేశం వారిని ఉద్ధరిద్దామని వ్రాసుకున్నాడు. నేనెందుకు చదవాలి? పాశ్చాత్యుల నాగరికత వేరు. సంస్కృతి వేరు. వారి ఆదర్శాలే వేరు. వారిది కృత్రిమ జీవితం; విద్యుత్ పరికరాలపై ఆధారపడ్డ సహజమైన జీవితం. వారి విజ్ఞానంలో జ్ఞానానికి స్థానంలేదు. వారి కళలు, వినోదాలు వేడుకలు, చవకబారు విలువలు గలవి. వేగం, పైపై నిగనిగలు అశాశ్వతమైన, బుద్బుదప్రాయాలైన వెకిలి, బాహ్య, శారీరక, ఇంద్రియాల తృప్తితో నడింపయ్యే రైలుపొగలాంటి జీవితానందాలు వారివి. ఈ యుద్ధాలన్నీ ఆ విధానంవల్ల సంక్రమించినవే అని వారే ఒప్పుకుంటున్నారు. ఇంకా పైకి రా; డబ్బు గడించు; అధికారం తెచ్చుకో. సుఖించు. నీ బాగు చూసుకో - ఇల్లా ప్రతివారూ కృషిచేస్తే వారందరి "అహం"లూ ప్రేలి, ఢీకొని, యుద్ధంగా గాక, మరెల్లా అంతమొందుతాయి?

ఇంక నేనా - మాది వ్యవసాయ నాగరికత. ప్రకృతిలో ముడిపడిన సహజ సంస్కృతి. ప్రపంచాన్ని తిలకించడం - ఆలోచన, తపస్సు - ఆధ్యాత్మిక చింతన, జన్మరాహిత్యం, "అహం"ని చంపడం - ఇవి జీవితవిధానం. కడుపులో చల్ల కదలకుండా, హాయిగా కొబ్బరి చెట్లకింద చాపేసుకుని పరుండి, పక్షుల ప్రేమగానం వింటాను. ఆవుపాలు స్వయంగా పితుక్కుని త్రాగుతాను. భాగవతం చదువుకుంటాను. పాలం దున్నుతాను. కూరగాయలు స్వయంగా పండించుకుంటాను. చదరంగం ఆడుకుంటాను. రాట్నం త్రిప్పుతాను. నదిలో స్నానం చేసి, పరమాత్ముని తెలుసుకోవాలని పూజచేస్తాను. నేనెక్కడికీ వెళ్ళను. నాకు డబ్బొద్దు - అధికారం వద్దు, గొప్ప వద్దు, బస్తీ వద్దు, విద్యుత్ నాగరికత వద్దు, యుద్ధాలొచ్చు; ఇంటికెళ్ళి ఆ పుస్తకాన్ని చించెయ్యాలన్నంతకోపం వచ్చింది.

"అవునులెండి - దేశంలో జనాభా పెరిగిపోతుంది. కుటుంబనియంత్రణ మంచిదని పెద్దలంటున్నారు. మీ బోటి వారు ఆచరణలో పెట్టడం బాగుంది. మీరే మార్గదర్శకులు" అన్నాడాయన. ఇదెక్కడి గొడవ, నాకసలు పెండ్లేకాందే! ఖండించడం తగదు.

"మీ అత్తవారేవూరండి?" అని ప్రశ్నించాడు. పెండ్లిని గురించి, ప్రేమతత్వం గురించి నా అభిప్రాయాలు చెప్పాలనిపించింది. ఎల్లా? అవతలవ్యక్తిని గురించే మాట్లాడాలి!

"మీ పిల్లల గురించి చెప్పండి - చదువుకుంటున్నారా? వారి వయస్సులు - అమ్మాయిలైతే వయస్సు చెప్పనక్కర్లేదు లెండి" అన్నాను.

"పిల్లల చదువు, ఉద్యోగవకాశాలు, జాతీయవిద్యా విధానం - వీటిని గురించి మీ అభిప్రాయం చెప్పండి."

"మీరు స్వచ్ఛమైన తెలుగు మంచి జాతీయాలతో మిళాయించి మాట్టాడుతున్నారు. సంస్కృతంలో పాండిత్యం సంపాదించినట్లున్నారు." అన్నాను.

"నేనడిగిన దానికి సమాధానం చెప్పకుండా తప్పించేస్తున్నారు. మీరు కవిత్వం వ్రాస్తారు. కాదనకండి"

ఇదేం కర్మ!

"మీ బోటి రసికుల ఆదరణ ఉన్ననాడే కవిత్వానికి దోహదం చేకూరుతుంది. ఏమంటారు?"

"మీరు చదువుకుంటున్నారా?"

"మీ ఉద్యోగం -"

"ముందు మీ విషయం చెప్పండి." అని కంఠం కాస్తంత పెద్దదిపెద్దది చేశాడు.

"అదేనయ్యా నేనూ అంటున్నది. ముందు మీ విషయం చెప్పమనే."

"ఏమిటయ్యా మహా ఇందాకటి నుంచి చూస్తున్నాను. ఒక్క ప్రశ్నకీ సమాధానం చెప్పవు -"

"నీ వ్యవహారం మరీ ఘోరంగా ఉంది. సమాధానం చెప్పవు సరికదా, ప్రశ్న పరంపరలు కురిపిస్తున్నావు" అన్నాను.

"నీ వ్యాకరణ బద్ధమైన భాష నా నెత్తిలాగ ఉంది కాని, నీ పెళ్ళి, పెళ్ళాం విషయం చెప్పు -"

"ఏమయ్యోయి, ఇంతవరకూ చెప్పలేదు. ఇప్పుడూ చెప్పేస్తున్నాను. నేను కవిని. బోలెడంత కవిత్వం వ్రాసాను. కాపీలు కావాలంటే నాకు వ్రాయాలి తెలుసా! నువ్వు చదవకపోతే సరా? నీలాంటి రసికులు ఎందరు తక్కువుంటే కవిత్వానికి అంత మంచిరోజులు పైగా నా పెళ్ళాం గొడవ నీకెందుకూ? అసలు నాకు పెళ్ళే కాలేదు. నీ పిల్లల విషయం అఘోరించు." అనేశాను ఒళ్ళుమండి.

"మాటలు తిన్నగా రానియ్. నా పిల్లల జోలి నీకెందుకు! నీ బోటి గాడి దిష్టి తగిలిందంటే అసలు పిల్లలే పుట్టరు. నీకొక్కడికే కాలేదనుకున్నావా పెళ్ళి. నాకూ కాలేదు. అసలు కాదుకూడా" అన్నాడు.

"ఏం ఏం వచ్చింది తెగులు నీకు. గుడ్డివాడివా, కుంటివాడివా?"

"ఛీ, నోర్మూయ్."

"ఛ, ఛా, నీ నోరు నీ చేత్తో మూసుకో. మూతికి తాళం వేసి తాళం నాకియ్యి."

ఆయన లేచి లాల్చీ చేతులు పైకి మడుస్తున్నాడు.

"ఏదీ, ఇప్పుడు వాగు."

నేనూ లేచాను.

"ఏం కొడతావా? ఏయ్ పోలీసాయనా!" అని పోలీసాయన కూర్చున్న వేపుకి చూశాను. ఏడీ, ఎక్కడా లేడే సీటు కింద దూరి ఓక్ దుడ్డు కర్ర, నల్ల కంబళీ పైకి తీసి చుట్టచుట్టి బయటకు పోయాడు.

జనం పెట్టలోకి ఎగబడుతున్నారు. "ఇది ఏ స్టేషన్?" అని అడిగాడు ఘరానా వ్యక్తి.

"ఫలానా" అన్నారు ఎవరో.

ఘరానా వ్యక్తి గబగబా సంచి తీసుకుని జనంలోంచి పెట్టె బయటపడ్డానికి పెనుగులాట సాగించాడు. అతగాడిని ఎదుర్కొన్న వస్తుపరంపర ఒకటా. కొబ్బరికాయల సంచీ, కుడి ఎడమల వైపుల వారిని దృతరాష్ట్ర ద్వయంగా చేయగల పాలకావిడి, మృదంగంలాగ మోగే కిరసనాయిలు డబ్బాలు. కట్టెలమోపు, మూతి ఊడిపోయిన మిరపకాయల సంచీ, ఈ సరుకు తాలూకు ఆసామీల సముదాయం. ఇందరిలోంచి బయటపడడంలో ఘరానా వ్యక్తి సంచిలోంచి ఒక గ్రంధరాజం కిందపడి నలిగి చిరిగి తుత్తునియలు కాబోతుండగా పురావస్తు పరిశోధనలాంటి సాహసకృత్యంతో దాన్ని బయటికి లాగి, దులిపి ఘరానా వ్యక్తికి ఇచ్చాను. రైలు కదులుతోంది. ఆయన చాలా థాంక్స్ చెప్పడం గ్రహించాను. ఆయన సంచిలోంచి పడిపోయిన పుస్తకం పేరు "లోకం బానిస" నా అభిమాన గ్రంధరాజం. చిన్న పొరపాటు జరిగిపోయింది. నేను దిగవలసిన స్టేషన్ దాటిపోయింది.

●●●●

ముంగిట్లో ముత్యాలు

జలంధర

(ఆంధ్రజ్యోతి ' దీపావళి ప్రత్యేక సంచిక, 1991-నుంచీ పునర్ముద్రణ)

ఈ కథ వెనుక కథ

ఎప్పుడో రెండు దశాబ్దాల క్రిందట నేను వ్రాసిన ఈ కథని ఎంతో శ్రద్ధతో బయటికి తీసి, ఈ తరం పాఠకులకి అందిస్తున్న 'కౌముది' కి ముందుగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను.

ఈ కథకి ముఖ్యమైన ఇన్స్పిరేషన్ ప్రముఖ గాయకులు ఎస్.పి.బాల సుబ్రహ్మణ్యంగారి అమ్మగారి స్వగ్రామం కొణెతం పేట. ఒకసారి ఏదో ఫేమిలీ ఫంక్షన్ కోసం నేను, బాలుగారి శ్రీమతి సావిత్రి, ఎస్.పి.శైలజ, పార్వతి ..అందరం కలిసి ఆ వూరు వెళ్ళాం. ఆ వూరి అమలిన సౌందర్యం, ఆ వూరి ప్రజల ఆప్యాయతానురాగాలు, వారు పాటించే శుచీ శుభ్రత, వారిలోని భక్తి భావన..ఇవన్నీ నన్నెంతో ప్రభావితం చేశాయి. ఆ వూరి వినాయకుడి గుడిలోనే బాలుగారి అమ్మగారి పెళ్ళి జరిగిందట. ఆ వూరి అభివృద్ధికోసం బాలుగారు చాలా సహాయం చేశారట. వాళ్ళ అమ్మగారి దేవుడి గదిలో చిన్నమామిడి పిందెల మొలత్రాడుతో ఉన్న చిన్నపిల్లాడి ఫోటో బాలుగారు చిన్నప్పటిదని చెప్పారు. అక్కడున్న చింతచెట్టు బాలుగారి అవ్వగారిది. ఆవిడ చనిపోయే వరకూ ఆ చెట్టు మీద వచ్చే అదాయాన్ని ఆవిడకి పంపిస్తూ ఉండేవారట. - ఇవన్నీ ఆ వూరి వాళ్ళు చెప్పిన మధుర స్మృతులు..! మిగతా కథంతా నా కల్పన..!

జలంధర

"అక్షరాలు చదివే ఆడదంటే ఆయనకు ఇష్టంలేదు. ఆయన పేరు రామచంద్రయ్య. ఊరు కోనేటం పేట. ఆయన నీ మామగారు. కనబడితే, నేను గుర్తుంటే నా నమస్కారాలని చెప్పు.." ఆవిడ గొంతుకలో సన్నటి జీర.

"అరె! వై దిస్ చోకింగ్ ఆంటీ" ఆశ్చర్యంగా అంది రంజన.. "ఐనా మీరు అంతగా అడిగితే తప్పకుండా చూసి వస్తాను.."

"ప్రామిస్?" టిష్యూతో కళ్ళు ఒత్తుకుంటూ చేయి చాచింది చిన్నపిల్లలా మిసెస్ మేరి అబ్రహాం

బాబ్డ్ హెయిర్, సోఫిస్టికేషన్ చక్కటి ఉచ్చారణ ఉన్న మేరి వరల్డ్ బాంక్‌లో పనిచేస్తోంది. ఆరోగ్యంగా, చురుకుగా గ్రేస్‌ఫుల్‌గా వృద్ధాప్యాన్ని అందిస్తున్న ఆమె కళ్ళు ఎదురుగా ఉన్న కోడలు రంజనను మీద దాటి, దూసుకుని ఏదో వెతుక్కుంటూ దిగంతాలను దాటిపోతున్నాయి.

ఎక్కడో కొన్ని వేల మైళ్ళ దూరంలో ఉన్న ముక్కుకొండను దాటుకుని, ఒక కుగ్రామంలోకి అడుగువేస్తున్న పరువాలు ఉన్న వ్యక్తి గురించిన జ్ఞాపకాలలో జారిపోతోంది ఆమె.

కారణం ఆయన ఆమెను అగ్నిసాక్షిగా పెళ్ళిచేసుకున్న భర్త.. ఒకప్పుడు..

అతణ్ణి, ఆ ఊరును, ఆ సాంఘిక నైతిక బంధాలను దాటి, స్కాలర్ షిప్ కోసరం మతం, పేరు మార్చుకుని తన ఉద్దేశ్యాలకు, అవసరాలకు అందుబాటులో ఉన్న వ్యక్తితో సెటిల్ అయిపోయింది. యాభయ్యవ పడిలో ఇప్పుడు నో రిగ్రెట్స్...

కానీ.. ఏదో బోర్. మొనాటనీ. స్వేచ్ఛ కోసరం "చదువంటే నా ప్రాణం" అన్న మేరీ ఇప్పుడు తప్పనిసరిగా ఉద్యోగం చేస్తే తప్ప తన ఐడెంటిటీని నిలబెట్టుకోలేని స్థితిలో ఉంది. తమాషా స్థితి అది. "స్వేచ్ఛ కోసరం కంపల్షన్.."

ఆవిడ సెల్ఫ్ మేడ్ పర్సన్. తన అత్తగారు పదహారేళ్ళకు కూడా పదో క్లాసుకు రాకుండా ఇంగ్లీషులో ఈజ్ ఎక్కడ పెట్టాలో, వజ్ ఎక్కడ పెట్టాలో తెలియకుండా చెరుకు గడలు, తంపట వేరు శెనక్కాయలు తినడం, క్రాబిళ్ళా ఆటలో గట్టివాడవటం తప్ప మరొక విద్య తెలియని రాఘవను తండ్రి దగ్గర నుంచి తప్పించి, గొప్ప ఎలక్ట్రానిక్ ఇంజనీర్‌ను చేసిన వ్యక్తి ఈవిడ.. ఆవిడంటే చాలా గౌరవం రంజనకు.

ఆవిడ గతం ఈ కాలంలో పెద్ద బాధపెట్టే విషయం కాదు.

భర్తలో అప్పుడప్పుడు చిన్నతనపు జ్ఞాపకాల పలవరింతలకు ఆశ్చర్యపోయేది రంజన. ఇన్నాళ్ళు స్టేట్స్‌లో ఉన్నా.. ఏదీ మర్చిపోలేడతను. అదే ఆశ్చర్యమనుకుంటే.. తాము ఇండియా వెళుతున్నామని తెలియగానే, ఈవిడ - ఈ "రాక్ ఆఫ్ జిబ్రాల్టర్" వంటి వ్యక్తి కదలిపోయి, కన్నీరు కార్చి కోరుతున్న కోరిక వినగానే అదిరిపోయింది రంజన. ఎటో దిగులుగా చూస్తున్న మేరీ కళ్ళవంక చూస్తుంటే, ఏదీ ఆశ్చర్యమనిపించడంలేదు హ్యూమన్ సైకాలజీ తెలిసిన రంజనకు.

కానీ, ఆ బాధలో తమకం, ఏదో పలవరింపు - "ఆయన మీకేం మిగిల్చారని ఈ జ్ఞాపకాలు?" చేతులు కట్టుకుని, ఆమెను చదువుతున్నట్లు చూస్తూ అడిగింది.

"ఊc.. - జ్ఞాపకాలు.. నిజం... జ్ఞాపకాలే.." ఉలిక్కిపడుతూ జవాబు చెప్పింది మేరీ..

"అవ్వంత మధుర స్మృతులు కావనుకుంటానే?!"

"ఊ! కావేమో?!" పరధ్యానంగా సోఫా మీద తల ఆనిస్తూ అన్నది మేరీ. ఒకప్పటి సీతారావమ్మ.

"ఏ జ్ఞాపకానికైనా మాధుర్యం ఆపాదించాలంటే, అసలు మధురిమ తెలియాలిగా? అది తెలుసుకునే లోపల - ప్చ్. చాలా జరిగిపోయాయి. నాకు చిన్నప్పటినుంచీ కట్టుబాట్లు గిట్టేవి కావు. నా ఇష్టం వచ్చినట్లు బ్రతకాలంటే, వీళ్ళందరికీ లేని చదువు నాకుండాలనుకునేదాన్ని. మా మేనమామలు అప్పట్లో తంబు చెట్టి వీధిలో, నగరంలో బియ్యం వ్యాపారం చేసేవాళ్ళు.."

"నగరం అంటే?"

"మద్రాసు".. నవ్వుతూ అన్నది మేరీ.

"అది మహానగరం మా పాలిట అప్పట్లో. అక్కడికి ఎక్కువగా వచ్చేదాన్ని. రిబ్బన్లు. చెంప పిన్నీసులు, హైహీల్స్ చెప్పులు కల్చరంతా మా ఊరికి నేనే తెచ్చాను. జుట్టు రింగులు తిప్పుకోడాలు, సెంట్లు వాడటాలు, నైలెక్స్ కల్చరు - ఇదంతా కూడా దాదాపు నా పుణ్యమే. ఈ పట్నవాసం వాసనతో నాకు మా ఊరు బ్రతుకు బ్రతుకు కాదనిపించేది."

పర్కొలేటర్ ఆన్ చేసి వింటోంది రంజన.

తెలుగుదేశంలో ఎక్కువ పెరగపోయినా, తెలుగుతనం తెలిసిన ఆడపిల్ల రంజన. హయ్యర్ స్టడీస్‌కు అమెరికా వచ్చిన ఆమెను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు రాఘవ. ఆ పెళ్ళికి విపరీతంగా సంతోషించి, ఆశీర్వదించిన మొదటి వ్యక్తి మేరీ...

బాల్యంలోని జ్ఞాపకాలు, యవ్వనంలోని అనుభవాలు మనిషి జీవితం మీద పడుగు పేకలాగా జీవన విభ్రాంతులు కలిగిస్తాయన్నది తెలిసిన పిల్ల రంజన.. భర్తలో ఆ పలవరింత అర్థం చేసుకోగలదు.

కమిట్‌మెంట్ కానప్పుడు బోలెడన్ని సెంటిమెంట్లు మాట్లాడే వ్యక్తి రాఘవ. కానీ, ఈవిడలో ఈ కలవరింత ఏమిటి?

ఇన్నేళ్ళ తరువాత, ఇంత నాగరికత ఇచ్చిన అనుభవం తరువాత, "ఏం చేశాను నేను?" అని ఆలోచిస్తోందా? ఉలిక్కిపడింది రంజన.

మేరీ తన జ్ఞాపకాలు, అనుభవాలు గుదిగుచ్చి చెపుతోంది. వింటూ రంజన ఆలోచిస్తోంది.

ఓగాడ్! ఆవిడ స్మృతుల మధ్య ఏదో ధ్వని..

"ఏం చేశాను నేను?" అని జీవితాన్ని సమీక్షించుకుంటే ఫరవాలేదు కానీ, "ఎందుకు ఇలా?" అని ఆలోచించే దురదృష్టం ఈవిడకు ఈ వయస్సులో అవసరం లేదు.

మంచో, చెడో "మన మనిషి" అన్న వ్యక్తిని రక్షించుకోవాలి అంటే, వాళ్ళను "గిల్టీఫీలింగ్" నుంచి దూరంగా తీసుకువెళితేనే ఆలన, లాలన, పాలనకు అర్థం ఉంటుంది..

అందుకే.

"బట్.. మీకు నో రిగ్రెట్స్.. కొన్ని విషయాలు ఆలోచించడానికి అందంగా ఉండచ్చు. కానీ అనాగరికంగా మిమ్మల్ని కొట్టి, బాధ పెట్టి బానిసలాగా చూసిన మనిషి మీరు ఎదుగుతానంటే మిమ్మల్ని శతవిధాల ఆపాలని ప్రయత్నం చేసిన వ్యక్తి - అలా ఆయనను తయారు చేసిన ఆ అనాగరికత అవి మీకు జ్ఞాపకాలైతే ఫరవాలేదు కానీ, మిస్ అయిపోతున్నానని మాత్రం ఫీలవకండి.."

"అలా చెప్పాడా రాఘవ నీకు?! లౌక్యుడు వాడు. ఊ! అదీ నేను నేర్పించిందేగా!" నిర్లిప్తంగా నవ్వుతూ అన్నది మేరీ.

సగటు మొగవాడిగా, తల్లి చేసిన సాహసాన్ని, తప్పును సమర్థించుకోవడం తప్పనిసరి అయినప్పుడు, తండ్రిని, ఆయన వాతావరణాన్ని చాలా బార్బారియన్స్‌గా చిత్రీకరించడం తప్ప దారి లేదు రాఘవకు.

"అమ్మా! ఎంత అమెరికాలో ఉన్నా, మనం ఇండియన్స్‌మి. మన ఐడెంటిటీ పోదు. రాత్రి పదిదాకా ఆ తిరుగుళ్ళేమిటి? ఆ డేటింగ్ లేమిటి నీ కూతురికి?" అని సవతి చెల్లెలు మీద జులుం చేసే రకం అతను. అందుకే తనకు నచ్చని విషయాల గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు వేరే కోణం నుంచి చూసి, సంతృప్తిపడగలడు. తల్లి లేచిపోయిన తరువాత ఊరు ఊరంతా తల్లిని దుమ్మెత్తి పోస్తున్నా -

"పిచ్చిది. దాన్నేమనకండి. తెలిస్తే నట్టింట్లో చిచ్చుపెట్టుకుంటుందా? ఎక్కడున్నా సుఖంగా బతికిపోనీండి.." అనే తండ్రి గురించి పారపాటున కూడా బైటకు చెప్పడు రాఘవ. రామచంద్రయ్య దొడ్డంతా తిరిగి కండువాలో మల్లెలు, పారిజాతాలు కోసుకువచ్చి,

"పారిజాతాలు దేముడికి పెట్టు. మల్లెపూవులు నువ్వు పెట్టుకో.." అని బంగారంలా తోమిన పూజా పాత్రలో పోస్తే.

"నాకేమక్కర్లేదు." అని హఠంగా ఎడం కాలితో తన్నినప్పుడు,

తన అహాన్ని, పసితనాన్ని ఈడ్చి చెంప దెబ్బకొట్టాడు. నిజమే. కానీ ఆ తరువాత బ్రతిమాలి చీర కొనిపెట్టాడు. సినిమాకు తీసుకెళ్ళాడు. పదకొండో ఏటే పెళ్ళైన తన పసితనపు ముద్దు ఎంత చెల్లించాడని?! ఏదో కావాలని, ఏడ్చి రాగాలు పెట్టిన తనను ఎవరూ చూడకుండా మల్లె పందిరి కింద గుండెల మీద పడుకోబెట్టుకుని జోకొట్టాడాయన. మరి ఇవన్నీ ఎవరికి అర్థమౌతాయి?

పాంజేబు పట్టాలు పెట్టి, ఆ పాదాల్ని పదే పదే తమకంగా చూస్తూ, ముద్దుపెట్టుకున్న అతణ్ణి, ఆ చూపులో ఊపును ఉప్పెనను ఎలా వర్ణించగలదు?!

ఈనాడు, కాఫీ విస్కీని, కట్ గ్లాసులో తన ఖరీదైన కార్పెట్ మీద విసిరేసి అబ్రహాం విసిగించి, అల్లరి పెడుతూంటే,

"ఆఫీసులో టెన్షన్ పాపం.." అని సరిపెట్టుకుని బ్రతుకుతోంది.

ఇవన్నీ ఈ రంజనకు, ఈ తన స్నేహితురాలు, కూతురు, కోడలు అయిన ఈ పిల్లకు ఎంతని చెప్పగలదు?!

మెల్లిగా పర్స్‌లో కవరు తీసి ఇచ్చింది రంజనకు.

"ఏమిటిది ఆంటీ?"

"నీ బర్త్‌డేకు గిఫ్ట్ కొనుక్కో - మనకు ఇక్కడ ఆమ్‌స్టర్ డామ్‌లో డైమెండ్స్ దొరికినా, మనదేశంలో లాగా రవ్వ కట్టడం చెయ్యలేరు. డైమెండ్ బాంగిల్స్ తెచ్చుకో.. నువ్వు పెట్టుకుంటే చూడాలని ఉంది."

భుజాల మీద రెండు చేతులు వేసి, తనివితీరా తనను చూసుకుంటున్న మహా గొప్పదాన్లా ఉండే ఆ పిచ్చితల్లిని చూడగానే కళ్ళనీళ్ళు తిరిగాయి రంజనకు.

మౌనంగా తలూపింది.

"రంజనా!" మైక్రోవేవ్ ఆన్ చేస్తూ అన్నది మేరీ. తేరుకుని తలెత్తి చూసింది రంజని.

"తప్పకుండా మనూరు వెళ్ళిరా. ఆయనకు ఏం కావాలో చూసిరా."

"తప్పకుండా !" మాట ఇచ్చింది రంజన.

●●●

కొడుకు, కోడలు అమెరికానుంచి వచ్చారని, కారు పంపించారని, తప్పనిసరిగా వచ్చాడు రామచంద్రయ్య. ఉన్న వాటిల్లో నుంచి మంచి చొక్కా వేసుకున్నా, ఆ పడవంత చల్లటి కారు హాయిగానే ఉన్నా, ఏదో ఉక్కిరిబిక్కిరిగా ఉంది...

"సీతమ్మలానే ఉంది.." కోడలు కాళ్ళకు దణ్ణం పెట్టగానే అనుకున్నాడు కానీ, "ఛీ! దాని పోలిక ఈ బంగారు తల్లికి వద్దు" అనుకున్నారు వెంటనే.

కొడుకు తన ముందు తలెత్తి మాట్లాడలేకపోవడానికి నవ్వొచ్చినా, రంజన చకచకా ఇంగ్లీషు మాట్లాడ్డం అంత రుచించకపోయినా, పెళ్ళై మూడేళ్ళైనా పిల్లలు లేరే వీళ్ళకు అని విచారించినా, ఆయనలో "మధన" మరేదో జరుగుతోంది.

రంజన ఆయనకు తెలియకుండా ఆయననే గమనిస్తోంది. ఈ మేటి మనిషి చాలా అందమైన వ్యక్తి. పలుకులో పెళుసుంది. కానీ, చేతిలో తీపి కూడా ఉంది. ఊరి నుంచి తెచ్చిన చెరుకు గడలు చెక్కి పెట్టాడు. "మంచి నెయ్యేసుకో అమ్మాయ్! మన గేదెది.." అని కొసరి కొసరి వేయించాడు.

కారు పంపితే అంత ఆత్మాభిమానం కల వ్యక్తి రాడనుకుంది.

కానీ, వచ్చాడు. ఎందుకని?!

బిడ్డ మీద మమకారమా? దాంట్లో, "వాడుట్టి ఎదవ. నిజాయితీ లేని ఎదవ!" అన్న చీత్కారం నిర్మొహమాటంగా ఉంది మరి!

బాపాలాల్ దగ్గర ఆపి డైమండు గాజులకు లక్షరూపాయలపైన లెక్కపెట్టి ఇస్తూ, చటుక్కున తలెత్తి చూసింది రంజన. పర్సులో నోట్ల వంక చూస్తున్నాయి మామగారి కళ్ళు. డబ్బు అవసరమా?!

ఉలిక్కిపడింది రంజన. ఆలోచనలు అంచనాలు తారుమారు చేస్తున్నాయి. ***ప్రతి మనిషికీ, ప్రతి వస్తువుకూ ఏదో ఒక "ఖరీదు" ఉంటుంది. డబ్బు, హోదా, పొగడ్త, పేరు, సెక్యూరిటీ దేనికో దానికి అమ్ముడుపోనివాడు సాధారణంగా ఉండడు. ఎక్కడో, "ఇవేవీ వద్దు, మనిషి కావాలి, నా మనిషి." అనుకునేవాళ్ళు నూటికో కోటికో ఒకరుంటారు.***

అటువంటివాడు రామచంద్రయ్య అవ్వాలని మానసికంగా ప్రార్థిస్తోంది రంజన.

ఆ సాయంత్రం..

"నాకు మీ ఊరు చూపించరూ?" సూటిగా మామగార్ని చూస్తూ అన్నది రంజన

కాలు మడతేసి కుర్చీలో కూర్చున్నవాడు, ఒక్కసారిగా పైన కండువా దులిపి లేస్తూ,

"మనూరను.. పోదాం పద... ఇప్పుడే పోదాం.." అన్నాడు.

ఆ గొంతులో సంతోషం. ఆ కళ్ళల్లో మెరుపు.

●●●

తిరపతికి వెళ్ళే దారిలో నగరికి దరిదాపుల్లో, కొండల మధ్య నిర్మలమైన కోనేరులా ఉంటుంది ఆ ఊరు 'కోనేటం పేట!'

"అరె. ఆ చింత చెట్లు మీ అవ్వవి కదూ! ఇప్పటికీ అదే చింతపండు వాడతారట ఆమె. నిజమా?" ఉత్సాహంగా అన్నది రంజన. దారిపొడుగునా ఆ పిల్ల ఎక్సైట్‌మెంటును ఆపలేకపోతోంది.

ఆశ్చర్యంగా ఆమె వంక చూశాడు రాఘవ. అతనిలో కూడా చిన్నప్పటి జ్ఞాపకాలు నిద్రలేస్తున్నాయి.

ఊరు చిన్నదే. ఒక రెండు వందల గడప ఉంటుందేమో. ఏ వృత్తివారికి ఆ వీధి ఉన్నది.

ఊరు ఊరంతా "రామచంద్రయ్యగారి కొడుకు, కోడలు వచ్చారంటగా.." అని విరగబడిపోయారు జనం.

కారు చుట్టూ చేరారు.

"పిల్లా! మీది అమెరికా అంటనా.. ఆ ముగ్గు మాసింది అక్కడే ఉందా? అదే మీ అత్త సీతారామమ్మ. నా మేనకోడలే అది. కులాసాగా ఉందా? పసిడి బొమ్మలా ఉండేది. పాయ్యేకాలం వచ్చింది. బారెడు జుట్టు గుళ్ళో అమ్మవారు లాగుండేది."

బిత్తరపోయి చూసింది రంజన ఆ పళ్ళు లేని అవ్వని. గభాల్న ఆవిడ కర్రజారిపోతూంటే అందించింది.

"కర్ర జారితే ఫరవాలేదులే - తట్టుకోగలను. కాలు జారితే కష్టం. పాయ్యేటప్పుడు ఇంటికి వచ్చిపో.. పసుపు కుంకుమ పెట్టి పంపిస్తా. ఓరి రాంచంద్రయ్యో. కోడల్ని పంపవోయ్. ఏమిటా జాతర? అమ్మోరి కొలువులా. జరగండెహూ.." కర్రతో అదిలించి, జనాన్ని చీల్చుకుని వెళ్ళిపోయింది అవ్వ.

కొబ్బరి నీళ్ళు, మజ్జిగ తేట, కమ్మటి కాఫీ. అడిగే పని లేదు రంజనకు. ఎవరు ఇస్తే వద్దంటే ఎవరు బాధపడతారోనన్న భయం.

అందరి కళ్ళల్లో నవ్వు.. ఆనందం. 'ఈ ఊరంతా మంచివాళ్ళేనా?' అన్నట్లు చూస్తోంది ఆమె.

ఎన్నో అడుగుతున్నారు. ఏదేదో చెపుతున్నారు. ఇంట్లో ముసలమ్మలు వంట ప్రయత్నం చేస్తున్నారు. పడక్కుర్చీలో కూర్చుని, గౌరవంగా ఎదురుగా నిలబడి ఉన్న జనానికి కొడుకు ఉద్యోగం గురించి చెపుతున్నాడు రామచంద్రయ్య. ఒద్దన్నా ఆ గొంతులో గర్వం. కొడుకుతోపాటు కోడలూ ఉద్యోగం చేస్తోంది. ఆ విషయం చెప్పడం నామర్దా ఆయనకు. అర్థమై నవ్వుకున్నది రంజన.

ఇల్లంతా తిరిగి చూసింది. అక్కడక్కడ క్రాక్ లిచ్చింది. వెనకాల వంటకు గుండ్రంగా చాలా ఆర్టిస్టిక్‌గా కట్టిన చిన్న గది. దొడ్లో అక్కడక్కడా ఆంటిక్ పీసెస్‌లాంటి గంగాళాలు దొర్లించి ఉన్నాయి. వెనకాల మందారాలు, పారిజాతాలు.. గుబురు సంపెంగ కాబోలు. నూతిగట్టున కూర్చుని ఊరివారి కబుర్లు వింటోంది.

గోడమీద గంగానమ్మ కొలువుకు రాసిన పసుపు చందమామ. ఎరుపు కళ్యాణం బొట్టు.

"ఇదుగో, ఈడే మీ అత్తగారు మజ్జిగ చేసేది. మంచి చెయ్యి ఆమెది. ఎంత వెన్న పడేదో. ఇదుగో, ఈ గట్టుమీద తలార పెట్టుకుంటూ తిరిగేది. బారెడు జుట్టు. వాళ్ళత్త వైనంగా చిక్కుదీసి, సాంబ్రాణి పొగ వేసి దిష్టి తగులుతుందని కొండె సిగచుట్టేది. ఎంత ముద్దుగా చూసేవారు ఆ యమ్మను. ఎప్పుడైనా కనబడుతుందా?" మెల్లిగా తలూపింది రంజన. ముప్పై ఏళ్ళు గడిచినా ఈ జ్ఞాపకాలు ఆమెకు సొంతమేనా?

"ఇదుగో, ఈ మల్లె అంటు ఆమె పుట్టింటి నుంచి తెచ్చుకున్నది. ఎన్ని చామంతులుండేవో. ఉన్నన్నాళ్ళూ ఇల్లు నందనవనం చేసేది."

తులసికోట వంక చూస్తూ ఆలోచిస్తోంది రంజన. జరిగిన కాలం నాటి నిశ్శబ్ద చిత్రాలు ఆమెకు అర్థంకాని చాలా విషయాలు చెబుతున్నాయి.

"మా ఇంటికి రామ్మా శుక్రవారం పొద్దు. పసుపు కుంకుమ తీసుకుని పోదువుగాని.." నవ్వుతూ పిలిచింది ఒక పెద్దింటి ఇల్లాలు.

అలా అలా అంచలంచలుగా ఇళ్ళు, బజార్లు చూస్తోంది రంజన.

"ఇదుగో, ఈ గుళ్ళో దీపం ఎప్పుడూ కొండెక్కనివ్వరు తెలుసా? మా వినాయకుడి గుడి ఇది. మొక్కుకో. పండంటి బిడ్డ పుడతాడు." చల్లటి మాట. ఎరటి చీర, తెల్లటి పళ్ళు, కాటుక కళ్ళు! ఎవరా అని వెనక్కు తిరిగి ప్రశ్నార్థకంగా చూసింది రంజన.

"ఓయ్.. బత్తుల జీలమ్మరోయ్. ఏవమ్మోవ్. కోడల్ని చూడ్డానికి వచ్చావ్ అయితే.."

ఎవరో పరిహాసంగా అన్నారు. ఆ యాసలో ఏదో మ్యూజిక్ హమ్మింగ్. వెనుకటి జన్మల జ్ఞాపకాల లాంటి ఏదో తీపి. తేరుకుని ఆవిడనుచూసింది. ఈవిడకు తనే రకంగా కోడలు?!

చిన్న చిన్న వీధులు దాటుతున్నారు.

"ఆ వీధి చూపించావ్!.. అక్కా, మా వీధికి తీసుకురా"

ఒకర్నొకరు ప్రశ్నించకుంటూ తీసుకువెళుతున్నారు. గట్టిగా పదడుగులు కూడా లేనిది వీధి!. నవ్వుకుంది రంజన.

ఎవరిదో ఇల్లు పడగొట్టి కడుతున్నారులా ఉంది. గొప్ప గొప్ప కళాఖండాలు చెక్కిన దూలాలు ఉసూరుమని పడి ఉన్నాయి.

"మా బిడ్డకు పట్నం వాసన వంట బట్టిందిలే వదినా! ఆడంతే.. మనశ్శాంతిగా బ్రతకడు. బంగారం లాంటి ఇల్లు పగులగొట్టి ఆడంబరంగా కాతాడంట." కొత్తచీర, రవికల గుడ్డపెడుతూ మొత్తుకుంది మునిరంగమ్మ.

"ఇదుగో, ఇక్కడే ఈ గుడి ముంగిట్లోనే మీ మాంగారి చెల్లెల్ని గభాల్న తాళి కట్టి పెళ్ళి చేసుకున్నాడు పెద్దలు ఒద్దన్నా అయ్యవారు, అప్పుడేమైందో తెలుసా? తలంబ్రాలు లేకపోతే తప్పుగా తోసి ముత్యాల సరాలు తెంపి పోసింది మీ ముత్తవ్వ. తా నచ్చినవాడిని ఎన్నుకుంది, తప్పెముందని తండ్రికి ఎదురు తిరిగి రామచంద్రయ్య బలవంతంగా ఇద్దర్నీ గృహప్రవేశం చేయించాడు. అప్పుడు మీ ముంగిటి నిండా ముత్యాలే.." పకపకా నవ్వుతూ ఒకరి మాటలో ఒకరు కలుపుతూ. కల్లాకపటం లేకుండా చెపుతున్నారు ఇల్లాళ్ళు.

ముంగిటి నిండా ముత్యాలు. ఏం ఊరిది?! నిజమే. పచ్చిపేడ, ఎర్ర మన్నుతో తాపీపనివాడంత అనుభవంతో అలికిన అరుగులు, అలా అలికితే దోమ, ఈగ రావట. ముంగిట్లో ఎర్రమన్ను గీతలు మధ్య ముగ్గులన్నీ ముత్యాల్లాగానే ఉన్నాయి రంజనకు. ఆ ముగ్గులు, ఆ శుభత ఆ ఊరు స్త్రీ ధనం! ప్రతి ఇంట్లో విచిత్రంగా గోడకు చెక్క కొట్టి దేముళ్ళను అమరుస్తారు. పసుపు. కుంకుమ, రంగవల్లులు, పంచ ముగ్గులు, ఎర్ర నీటిలో మెరిసిపోయే జంట దీపాలు. సన్నికల్లు మీద సైకతలింగం పెట్టి తెల్లవారు ఝామున లేచి వ్రతం చేస్తారు ఆడవాళ్ళు. శుభత, శుచి, భక్తి, శ్రద్ధ. భగవంతుడు ఏనాడో కిక్కిరిసిపోయిన కోరికల గుళ్ళో నుంచి పారిపోయి కోనేటం పేటలో కాపురం పెట్టాడనుకుంది రంజన.

ఇంటికొక జాకెట్టు బట్ట, తాంబూలాలు, మెరుస్తున్న పసుపు పాదాలు, వెనకాల ఊరేగింపులా జనం. ప్రతి ఒక్కరూ "అక్కా" అని నోరార పలకరిస్తున్న ఆ ఊరిలో కోనేరు కూడా "నన్ను చూడవూ?" అని పలకరిస్తున్నట్టు ఉంది.

"ఈ కోనేర్లో ఎన్ని రోజులు స్నానాలు చేశాను? నాన్న చిన్న గోచి పెట్టి ఈత రావడానికి కోనేట్లో పడేసేవాడు. ఎంత హాయి. అప్పుడు చుట్టూ వెదురుపొదలుండేవి. పాములు కూడా మా సందడికి పారిపోయేవి.." చెప్పాడు రాఘవ.

ఆ గాలి, నీరు మేను సోకంగానే కొత్త ఉత్సాహం వచ్చింది అతనికి. చాలా ఆర్టిఫిషియల్‌గా అతికించుకున్న గంభీరత చెదిరిపోయింది.

"మీ అత్తగారు ఈ ఊరు ఒదిలిపోయిన సంవత్సరమే అమ్మవారి నోరు ఎవరో మాంత్రికుడు కట్టేశాడమ్మా!"

"అదేమిటి? అమ్మవారు ఊరుకుంటుందా?"

"పేరు, రూపం ఏర్పడగానే దేవతైనా కాలానికి, మంత్రానికి కట్టుబడాలిగా తల్లీ! ఇంట్లో మందారాలన్నీ తెచ్చి మాల కట్టి అమ్మకు వేసే మీ అత్తగారు. పెళ్ళాం పూల పిచ్చితో ఎండలో వస్తుందని, మమ్మల్ని అదిలించి, తెల్లవారు ఝామునే గుడితెరిపించేవాడు మీ మామగారు. అవ్వో రోజులు." పూజారాయన మాట్లాడుతున్నాడు.

విగ్రహం మౌనంగా ఉంది. ఆమె కూడా ఆ ఊరి ఆడబడుచు కిందే లెక్క జనానికి.

"ఎందుకలా చేశాడు అమ్మవార్ని?" కుతూహలంగా అడిగింది రంజన.

"ఎందుకా? ఈ తల్లి శక్తిగల దేవతమ్మా! ఈమె ఉంటే చుట్టుపక్కల చేతబడులు, చిల్లంగులు పని చెయ్యవు. అందుకే, ఈవిడను నిర్వీర్యం చేస్తేకానీ, వారి ఆటలు సాగవని.."

ఆలోచిస్తోంది రంజన. డివైన్ మాగ్నటిక్ ఫీల్డ్, ఎలక్ట్రో మాగ్నటిక్ ఎనర్జీ ఫీల్డ్స్ తెలియని వ్యక్తి కాదు ఆమె.

పూజారిగారి భార్య జనాన్ని అదిలించి లోపలికి తీసుకువెళ్ళింది.

"మీ అత్తగారు ఊరు దాటగానే 'నువ్వు మగాడివి కాదు కనుకే అది ఊరు దాటింది, అసలు ఆ కొడుకు మాత్రం నీకే..' అని జనం అడ్డగోలుగా మాట్లాడారని ఛాలెంజ్‌గా ఈ బత్తుల జాలమ్మను చేరదీశాడు మీ మాంగారు. ఆ యమ్మా ఆయన్నే నమ్ముకుంది. ఆయన మీ అత్తగారిని మర్చిపోలేదు ఏనాడూ.. ఆ ఇంట్లో జ్ఞాపకాలన్నీ ఆవిడవే.."

అన్నీ వింటూ ఆలోచిస్తోంది రంజన. మాటల్లో పెట్టి ఊరివారినుంచి చాలా వివరాలు సేకరించింది.

డ్రైనేజ్ లేకపోయినా, మరుగు దొడ్లు ఊరికి దూరం కనుక ఊళ్ళో ఇన్‌ఫెక్షన్ లేదు. శుచీ, శుభ్రతా ఆచారం పేరుతో అక్కడ అలవాటుగా బ్రతికి ఉన్నాయి. చిన్న స్కూలు. ఎవరో మహానుభావుడు మంచి నీటి బావికి మోటారు పెట్టించి ఊరికి ఉపకారం చేశాడు. పట్నం వాసన 'పల్లెపట్టు' దగ్గర ఆగిపోయింది.

పసిపిల్లలా, అమ్మవారు పారు వేటలా ఊరంతా ఊరేగింపుగా తిరిగింది రంజన. తిరిగి ఇంటికి వచ్చేటప్పటికి తలెత్తి చూసింది.

వాకిట్లో చేతులు కట్టుకుని చూరు కిందనుంచి ఆమెనే చూస్తున్నాడు మామగారు. ఆమె చూడగానే చటుక్కున తలతిప్పి,

"సుబ్బక్కా.. కోడలికి ఎర్రనీళ్ళు తీసి పొయ్యి.." అని పైకొంగు మలుపుతూ రోడ్డెక్కాడు.

ఆ చూపులో నిలుపు, ఆశీర్వచనం, ఆప్యాయత, గుర్తింపు -

కళ్ళు చెమర్చాయి రంజనకు.

వాకిట సింహద్వారం వస్తున్నప్పుడు హడావిడిలో గమనించలేదు. శ్రీరామ జననం నుంచి పట్టాభిషేకం దాకా చెక్కుంది.

శాన్‌ఫ్రాన్సిస్కోలో తమ ఇంట్లో వెయ్యి డాలర్లతో కొన్న "ఏంటిక్" గుర్తుకు వచ్చింది.

"అసలు ఈ ఊరు, ఈ ఇల్లు, ఈ మనుష్యులు అంతా ఆంటిక్ పీసెస్. ఆ దేశంలో కేవలం 50, 60 ఏళ్ళ నాటి కల్చర్ ప్రిజర్వ్ చెయ్యడానికి అంతగా అవస్థ పడతారు. మరి ఈ ఊరు చరిత్ర ఎంతండీ?" భర్తతో అన్నది.

అన్నం తింటూ తలెత్తి చూశాడు మామగారు. ఆ కళ్ళల్లో మెరుపు, సన్నటి నవ్వులో గుర్తింపు.

గోడకానుకుని దూరంగా కూర్చున్న రంజనకు ఈ అనుభవమంతా తమాషాగా ఉంది.

"అమ్మవారి కొలువు లెత్తాలని, పుష్పగిరి స్వాములిల్ని పిలిచి తిరిగి ప్రాణ ప్రతిష్ట చేయించాలని అయ్యకు ఆశమ్మా! ఊరందరికీ అన్నదానం చెయ్యాలిట. పదివేల ఖర్చు. పంటలు సరిగా లేవు. ఊరిమీద మమకారంతో ఏ ఊరు సంపాదనకూ ఆశపడలేదు. తృప్తిపడ్డాడు. ఇక్కడే బ్రతికాడు. ఆ మా తల్లిని ఒక్క గడియ కూడా మర్చిపోలేదమ్మా!"

బత్తుల జాలమ్మ చెపుతోంది.

మెల్లిగా ఒడి విప్పి "అమ్మోయ్. పట్నం పిల్లవి. అమెరికా దానివి. వేసుకుంటావో లేదో కాని కులం ఒప్పుకోకపోయినా కోడలివే నాకు వేసుకుంటావా తల్లీ!" అన్నది.

"ఏమిటి?" ఇంతింత కళ్ళతో అడిగింది రంజన.

మెల్లిగా ఒణుకుతున్న చేతుల్తో సిగ్గుగా, బెరుగ్గా తీసింది పొట్లం ఒళ్ళోనుంచి.

గాజులు - ఎర్రటి మరకతపు పాడితో చేసినట్టున్న గాజులు. కళ్ళంబడి నీళ్ళు తిరిగాయి రంజనకు. అత్తగారు కొనుక్కోమన్న డైమండ్ గాజుల పక్కనే తొడుక్కుంది ఎర్రటి గాజులు. చెయ్యి పదిసార్లు గలగలలాడించి చూసుకుంది. చటుక్కున చేతులు ముద్దుపెట్టుకుని, మెటికలు విరిచి 'దృష్టి' తీసింది బత్తుల జాలమ్మ. ఆమె కళ్ళలో తృప్తి, పెదవిలో ఒణుకు.

'తనను నేను ఏక్సెప్ట్ చేశానన్న తృప్తా ఇది?! ***ఆఖరికి మనిషికి ఏం కావాలి? ఆ కాస్త 'తను' అన్న గుర్తింపా?!***'

మరొకసారి ఆలోచిస్తూ ఇల్లంతా తిరిగింది రంజన. అన్ని లక్షల మైళ్ళ దూరంలో ఉన్న అత్తగారి పలవరింపు ఆ ఇంట్లో ప్రతి అణువులోనూ ప్రతిధ్వనిస్తోంది.

'అందుకే ఆంటీ అంత తలుచుకునేవారు.' అనుకుంది.

గట్టిగా బిగించి వేసిన జడ, పూవుల ముడుపు, వెనక అద్దం, పెద్దబొట్టు, నిష్కల్మషంగా నవ్వుతున్న కళ్ళు, కాళ్ళకడియాలు, పాంజేబు పట్టాలు. ఇవన్నీ అలంకరించిన చాలా పెద్ద సైజున అత్తగారి ఫోటో ఉంది పూజగదిలో ఇవతలి గోడకు. అడుగున వంకర టింకర అక్షరాలతో కుంకుమ రంగుతో -

"నా సీతారావమ్మ" అని రాసి ఉంది.

కళ్ళనీళ్ళు తిరిగాయి రంజనకు.

మేరీ అబ్రహాం, వరల్డ్ బాంకు ఎంప్లాయి, చాలా ధనవంతురాలు, ఏం పోగొట్టుకున్నానని తన 50 వ ఏట పలవరిస్తోందో అర్థమైంది రంజనకి.

●●●

"ఒక యాభైవేలు మామగారి పేర బాంకులోకి ట్రాన్స్‌ఫర్ చేయించండి. పక్కన రెండెకరాల పొలం, మన పొలానికి కలిసేది బేరానికి వచ్చిందిట. ఆయన పేర రిజిస్టర్ చేయించండి. ఇల్లు కూలిపోతోంది. బాగు చేయించి, అమ్మవారికి కొలుపులు ఎత్తడానికి 'సరే' అనండి" భర్తతో మెల్లిగా మాటలు పేర్చి చెపుతోంది.

"ఛా! ఛా! ఎందుకు వేస్ట్? నువ్వు కూడా ఏమిటి రంజనా?! ఈ కూలిపోయే ఇల్లు ఇంకెలా బాగు చేయించగలరు!? మద్రాసులో ఫ్లాట్ కొనిపెడదాం కావాలంటే వేస్ట్ - సుద్ద వేస్ట్ -"

"హూ! వేస్ట్. ఆ పదానికి అర్థం ఏమిటో తెలుసా మనకు? ఇండియా నుంచి గ్రనైట్ తెప్పించుకుని అక్కడ ఇల్లు కట్టించారు. అక్కడ మీకు మీ అమ్మగారి జ్ఞాపకాలున్నాయా? చిన్నప్పటి కలలున్నాయా? మీ నాన్న తాలూకు వ్యక్తిత్వపు నీడలు ఉన్నాయా? అవి ఎంత ఖరీదు?! ఎవరో ఊళ్ళోవాళ్ళు చూడ్డానికీ మెచ్చుకోడానికీ బ్రతికాం ఇన్నాళ్ళూ.."

"అంటే?" అర్థం కానట్లు అన్నాడు రాఘవ.

"ఇదుగో.. ఈ చేతి గాజుల ఖరీదు దాదాపు లక్షరూపాయలు దాటింది. ఇది ఒట్టి అలంకారం. స్టేటస్ సింబల్. కానీ అందులో పదివేలు, జస్ట్ టెన్ థౌజండ్ ఈ కూలిపోతున్న జ్ఞాపకాల తీయదనం నిలబెట్టగలదు. నాన్నకు కావలసింది ఇవ్వగలదు."

"సరే, నీ ఇష్టం. పొలం కొనడం, ఇల్లు రిపేర్ చేయించడం నాకొక లెక్కకాదు. కానీ, అమ్మవారి కొలుపులనీ, అన్నదానాలు చేయించడమనీ వేస్ట్ చెయ్యద్దను. అర్థమైందా?" ఎటో చూస్తూ అన్నాడు రాఘవ. అతను ఎంత లౌక్యుడై పోయాడంటే, అతని మంచి ఆలోచనకు కూడా మరొకరి సపోర్టు కోరుకునేటంతటి బలహీనుడైపోయాడు. 'ఇతడు బ్రతికేది ప్రాక్టికల్ మనుష్యులుండే అమెరికా కాబట్టి సరిపోయింది. ఇటువంటి వాతావరణంలో వందిమాగధుల మాట విని ఎన్ని వంకరదారులు తొక్కేవాడోకదా!' అనుకుంది రంజన.

ఇవన్నీ అక్కడ గమనించలేకపోయినా, ఇవ్వాళ నిజాయితీ వర్షిస్తున్న ఈ వాతావరణంలో స్పష్టంగా తెలుస్తోంది ఆమెకు. నవ్వొచ్చింది.

"మనమెవరం వద్దనడానికి? దేవతకు, ఈ ఊరికీ, మన కుటుంబానికి ఉండే అనుబంధానికి మన డొనేషను ఇది - అంతే. ఊరు దాటిపోయిన ఈ దేవత తిరిగి ఎలాగూ రాలేదు. అమ్మవారికైనా ప్రాణ ప్రతిష్ట జరగనివ్వండి." అత్తగారి ఫోటో చూస్తూ భోరుమంది రంజన.

"రంజనా! ఏయ్!. ఎందుకంత సెంట్‌మెంటల్ అయిపోతున్నావు? ఏమైంది నీకు?" దగ్గరగా వచ్చి కుదుపుతూ అన్నాడు రాఘవ..

తల్లి ఫోటో పక్కన చిన్నప్పుడు నల్లపూసలు, మామిడిపిందలు, సిగ్గుబిళ్ళ మొలతాడుతో ఒక చిన్న బాబు ఫోటో ఉంది. రాఘవది. ఆ పక్కన శుభ్రంగా తుడిచిన ఉయ్యాల ఉంది. అది అతను పసితనంలో ఊగింది.

"ఏమిస్తే మనకు జ్ఞాపకాలు దొరుకుతాయండీ?! ఆ ప్రపంచంలో ఎవరు మననుంచి ఏం ఆశించకుండా, కేవలం మన జ్ఞాపకాలతో బ్రతికేది? ఈ జన్మలో లౌక్య ప్రపంచంలో మొగవాడికి ఆడవాళ్ళ గుండెల్లో ఉప్పెనలు అర్థం కావండీ. అందుకే మాకు చాలా అర్థమౌతాయి."

కన్నీళ్ళు తుడుచుకుంటూ అన్నది రంజన.

"ఆయనకు తప్పకుండా ఏం కావాలో చూసిరా. ప్లీజ్" అక్కడెక్కడో కొన్ని మైళ్ళ దూరంలో ఉన్న మేరీ అబ్రహాం రూపు మార్చుకుని ఫోటోలో నుంచి వేడుకుంటున్నట్లనిపించింది రంజనకు.

"ఓకే. డన్. నీ ఇష్టం. ఎమోషను అవకు. అందరూ చూస్తారు కమాన్, అదుగో ఎవరో వచ్చారు" అంటూ హడావిడిగా జుట్టు సర్దుకుంటూ బైటి వాకిలి వైపుకు వెళ్ళాడు రాఘవ.

"అమ్మాయ్!"

ఆ పిలుపులో లక్ష అర్థాలు వినిపించాయి. తలెత్తి చూసింది.

మామగారు. గుమ్మానికి ఆనుకుని చూస్తున్నాడు.

"అక్షరాలంటే నాకు అసహ్యం. చదువిచ్చిన నాగరికతే నా భార్యను నాకు దూరం చేసింది అని నేను భ్రమపడేవాణ్ణి. అందుకే నీ మొగుణ్ణి కూడా చదివించలేదు. కానీ ఇప్పుడు అర్థమైంది. నువ్వు నిజంగా చదువుకున్నదానివి తల్లీ! చిన్నదానివి, నా బిడ్డవు. నీకు నమస్కరించాలనిపిస్తోంది. కానీ చెయ్యను - ఆయుఃక్షీణం."

గావంచాతో కళ్ళు ఒత్తుకుంటున్నాడు ఆజానుబాహువూ, పౌరుషవంతుడు, ఆరడుగుల అరవింద దళాయతాక్షుడు అయిన ఆ పల్లెటూరి కామందు.

ఆ ఇద్దరి మధ్యా ఏర్పడిన అద్భుతమైన నిశ్శబ్దం వాతావరణంలో పార్టికల్స్‌ను చార్ట్ వేసి ఆమెకు ఆయన పాత జీవితాన్ని సినిమాలా చూపిస్తోంది. ఎంత ప్రేమించాడామెను? ఎంత దుఃఖం ఆ గుండెలో దాచుకుని తడిలేని ఎడారిలా కనబడుతున్నారు?!

"అమ్మా!"

తత్తరపాటుపడి "ఆ!" అంది ఆ పిలుపులోని మాధుర్యానికి.

"సీతారావమ్మ బావుందా?"

ఒక్కసారిగా ఏదో కరుడుగట్టిన స్తబ్ధత. గుండెల్లో గూడుకట్టుకున్న నిరాశ ఫటేలున పేలిపోయినట్టైంది. తత్తరపాటుతో -

"ఆ! మీకు నమస్కారాలు చెప్పమన్నారు.." ఒంగి ఆయన కాళ్ళకు నమస్కరిస్తూ అన్నది రంజన.

ఆయన కన్నీరు, ఆమె కన్నీరు. జాలువారి, మనసు ముంగిట్లోముత్యాలుగా, ఆ ఇంటి జ్ఞాపకాలై నిలిచిపోతాయా? ఏమో!...

కాలమే చెప్పాలి మరి.

సామగానం

- మల్లాది రామకృష్ణశాస్త్రి

(రచనాకాలం 1950 ప్రాంతాల్లో)

-విని.. ఏమీ చెప్పకుండా ఊరుకున్నాను. వెళ్ళిపోయినాడు.

మరునాడు మళ్ళా వచ్చి.. ఆ సంగతే చెప్పాడు. నవ్వి వేళాకోళం చేశాను.

మూడోనాడు.. సగం విని.. మొగం వాచేటట్లు చివాట్లు పెట్టి పంపించాను.

అంతకన్నా ఏమిటి చేయడం?.. అసలు అందులో ఏముంది, ఒకరు ఆర్చేందుకూ, తీర్చేందుకూ?

కలలు ఎందుకు వస్తాయి?.. తిన్న తిండి సరిగా అరగనప్పుడు, అమాంబాపతు గానూ.. ఎదురు రొమ్ముమీద చేతులు వేసుకు పడుకుంటే.. ప్రత్యేకం భయం వేసేట్టుగా.. కలలు వస్తాయని ఆబాలగోపాలమూ తెలిసిన సంగతి..

కలలో - ఏమేమి వస్తాయి? ఎవడి అదృష్టం వాడిది.. అందలం ఎక్కినట్లుగానూ.. ముక్కు మన్ను కాకుండా క్రింద బోర్లపడినట్లుగానూ.. అనుకున్నవన్నీ అయే యోగ్యత లేకపోతే.. ఆ కోరికలన్నీ మనసులో వెనక పీటీని నెమరునపడి అవి మనకు అంతు చిక్కని ధోరణిలో అల్లా, ఇల్లా కలల్లో చిగురిస్తాయి.. ఇది, నా మతం కాదు; మనకన్న కొమ్ములు తిరిగినవాళ్ళు ఎన్నో ఢక్కామొక్కీలు తిన్నమీదట తేల్చిన సిద్ధాంతం.

కలలకు అర్థం ఏమిటి?.. ఒకటేమిటి, కోటి. చెప్పేవాడి తాహతును బట్టి ఎన్ని చిలవలు పలవలయినా అల్లవచ్చును.. అవి నిజమవుతాయా? ఏమో, ఎవరు చూసి వచ్చారు?.. అనవచ్చు, కాకపోనూ వచ్చును. తెల్లవారగట్ల వచ్చినవి చాలావరకు అయితీరుతవని. పెద్దవాళ్ళు చెపుతుంటారు. కానీ, నికరంగా అయి తీరవలెనని శాసనం లేదు. నాకు మాత్రం, ఎంత మాత్రమూ నమ్మకం లేదు.

లక్ష్మయ్యకు... మొదటి రోజున కల వచ్చినప్పుడు, నిదుర లేచేటప్పుడు అంతా పూర్తిగా జ్ఞాపకం లేదటకాని.. ఆ మనిషి అప్పటికీ కళ్ళకు కట్టినట్టుగా ఉన్నది.. ఇక రోజూ.. ఆ రోజు వచ్చిన కలే, వీసపాలన్నా మార్పు ఏమీ లేకుండా! -

ఆమె ఎక్కడో ఎరుగున్న మొగమే. కాని పోల్చుకోలేడు - ఎరగుండటమంటే రోజూ నిదురలో కలిసి మెలిసి ఉంటూండటం చేతనా అంటే, అదికాదట. మొదటి సారి కనబడినప్పటినుంచీ.. అలాగే తోస్తూన్నదట.

ఎలా ఉంటుంది? ఏమో? ఇలా, ఇలా అని ప్రత్యేకం చెప్పదగినదేదీ కనిపించదు. అందరు ఆడవాళ్ళలాగానే ఉంటుంది. కానీ, ఏదో మొత్తానికి ఉండి ఉండాలి. ఇదీ అని చెప్పలేకపోతున్నాడు కాని.

పోనీ. ఆఖరుకు విధవా సధవా? - ఆ మాత్రం అన్నా.. చెప్పగలడా?.. ఏమో, అదీ అనుమానమే. ఎందుచేతనంటే.. తలకట్టు ఉన్నదన్నమాటే కాని ఇక ఇతర పునిస్త్రీ లక్షణాలేమీ లేవు.. అంటే మామూలుగా మెళ్ళో పుస్తెలు పూసలూ.. కాళ్ళకు మట్టెలూ ముఖానా చేతులకు ఉన్నవీ అంటే అవి ఈ కాలంలో అందరికీ ఉంటున్నవి. అందువల్ల చప్పున ఫలానా అని చెప్పడానికి వల్లకాదు. కానీ మొత్తానికి నిగ్గుతీస్తే పునిస్త్రీ లక్షణాలేమీ లేవు. అంటే మామూలుగా మెళ్ళో పుస్తెలు, పూసలూ, కాళ్ళకు మట్టెలూ, ముఖానా చేతులకూ ఉన్నవీ అంటే ..అవి ఈకాలంలో అందరికీ ఉంటున్నవి. అందువల్ల చప్పున ఫలానా అని చెప్పడానికి వల్లకాదు. కాని మొత్తానికి నిగ్గుతీస్తే పునిస్త్రీ అనడం కన్న..

సరే అయితే పోనీ ఒకటనుకుందాం. ఒక్కొక్కప్పుడు జాతకంలో అలాటివి అంటు ఉంటే ప్రత్యక్షంగా జరగకపోయినా ఇలా, ఆ దోషం అంతటితో శాంతించడానికి అవడమూ కద్దు. అలాంటిదేమన్నా ఉందా? లేదు, నిక్షేపంలాంటి జాతకము!

మరి.. ఇప్పుడు ఏమిటి చేయడం?

చేయడానికి ఏం ఉంది, వాడి ముఖం కాకపోతేను. కలలోకి ఎవరో పనీపాటా లేకుండా వస్తూంటే. ఏం మునిగిపోయింది? వచ్చేదానికి బుద్ధి లేకపోతే లక్ష్మయ్య ఏండ్లు వచ్చిన సంసారి.. వీడికన్నా ఉండవద్దూ?

వింటే ఎవరన్నా ఏమనుకుంటారు? - నాతో తప్ప ఎవరితోనూ ఈ సంగతి చెప్పలేదు. అయితే మాత్రం ఒరిగిందేముంది?.. ముక్కూ మూతీ మూసుకు కూర్చోకుండా? - నాతోకాదు.. బ్రహ్మదేవుడితో చెప్పినా. అరుస్తాడా. తీరుస్తాడా? -

ఇప్పుడు ఏం చేయాలి? - అదిగో, ఆ వెర్రివేషాలే కూడవన్నది! ఏమిటి చేసేది! - ఏం చేయాలని అభిప్రాయం? -

ఎవరో - ఎలా తెలుస్తుంది? ముప్పై మూడుకోట్ల జనాభా.. జీవించినదే ఉంటూంటే. ఎక్కడని, ఏ దేశంలో అని విచారించడం? ఇప్పటిదే అని మాత్రం ఎలా? ఏ యుగం నాటిదో.. ఎందుకు కాకూడదూ?

ఎన్ని చెప్పినా లాభం లేదు. ఎలాగైనా ఆమె ఎవరో కంటపడేదాకా ఇంకో ఆలోచనే లేదు. ఏమీ మనస్సుకు ఎక్కడం లేదు.

సరే కర్మంజాలక అలాటి ఆడది అంటూ ఉండి చప్పన్న దేశాలు గాలించగా ఎక్కడో కనబడిందే అనుకో.. అప్పుడు ఏమిటిరా? అప్పటి మాట అప్పుడు చూసుకోవచ్చును. ముందు కనబడటం అంటూ ఉండనీ.

మన ఊళ్ళో తెలిసినంతవరకూ ఊహూ ఎక్కడా అలాటి ఆమె తగులలేదు. నీలాటి రేవులూ, సర్కారు బావులూ అక్కడ కాపలా వేయడం తెల్లవారగట్లనే లేచి రోజుకు ఒకొక్క పేట చొప్పున తెల్లవారే లోపున గస్తీ తిరుగుతూ ఇంటి ముందర ఊడ్చి నీళ్ళు జల్లుతూ ముగ్గువేసే వితంతువులను పరకాయించి చూడటం ఇంకా ఏకాదశి నాడు, గుళ్ళల్లోనూ హరికథలూ, వీధినాటకాల దగ్గిర కార్తీక స్నానాలూ, మాఘ స్నానాలూ పర్వాలప్పుడు సముద్రానికి వీలయినంతవరకు శక్తివంచన లేకుండా చూసి అక్కడకు అక్కడ ఇక లాభం

లేదు అని తేల్చుకున్నాడు. చూడటం అంటే బయట కనపడిన వాళ్ళనే కాని. ఇంటి ఇంటికీ వెళ్ళి 'ఏమండీ మీ ఇంట్లో ఇలాంటి వితంతులెవరైనా ఉన్నారా? చూడాలి, పనుంది. ఉంటే దయచేసి ఒక మారు ఇలా పిలుస్తారూ? మీరు, రోజూ కలలోకి వెళుతున్నారే, అతడు మిమ్మల్ని వెదుక్కుంటూ వచ్చాడు.' అని అడగటానికి వీలున్నట్టయితే క్షుణ్ణంగా చెప్పవచ్చును, ఆ ఊళ్ళో ఆమె లేదూ, అని.

తిరిగి తిరిగి కొన్నాళ్ళకు దానితో దిమ్ముతిరిగి. బుద్ధి వస్తుందేమోననుకున్నాను. కాని లక్ష్మయ్యది రాక్షసత్వం. మూటాముల్లే కట్టుకుని బయలుదేరుతానన్నాడు దేశం మీదకి. ఉషకు అనిరుద్ధుడెవరో ముందు తెలుసునా?. పోనీ మనకెందుకు అని, ఎవడో వెధవాయ కలలో కనపడినాడు అని ఊరుకుందా? ఏం, మనం మటుకు తక్కువ తిన్నామా?.. ఏం లోటూ, తిరిగేందుకు సత్తువ ఉన్నది. తిరగడానికి సత్తుగా ఉన్నది. ఎందుకు మానుకోవాలీ? ఏదో అమీ తుమీ తేలకుండా? పట్టుబడితే. దాని సంగతేదో తేలకుండా నిదురపోవడమేనా?

లక్ష్మయ్య.. అలా దున్నపోతులాగా కాకుండా కొంచెం చిన్నవాడైనట్లయితే 'ఎప్పుడూ ఇలాటి వెధవ వేషాలు వేయవుగద - వెయ్యవు గంద..' అని పట్టుకు దవడ వాయుగొట్టి ఉందు. కానీ, ఇప్పుడేం చేయడం. నానాగడ్డీ కరిచి బ్రతికి వున్న నాళ్ళు పొట్టకు కూడా సరిగా తినకుండా వీడేదో ఉద్ధరించుతాడని లప్పంతా వీడికే కట్టిపోయిన ఆ తండ్రి ముండావాడిని మనసులో ఛెడామడా తిట్టి.. నీ కర్మానికి ఎవరు కర్తలు? అనుకుని. 'సరే. పోయిరా. ఏ ఊరు వెళ్ళినా, ఈ పంపిణీ మీదనే వెదకుతూండు.. కాకపోతే. పోనీ, నీకు చేతనైనట్టుగా భోగట్టా చేయి.. వచ్చేటప్పుడు వట్టి చేతులతో మాత్రం రాక, పుల్లాయ వేమవరం వెళ్ళినట్టుగా, ఎందుకన్నా మంచిది, కొంత దైవ సాహాయ్యం కూడా ఉండాలి కనుక, బయలుదేరేవాడు సత్యనారాయణ వ్రతమూ, వెంకటేశ్వరులకు దీపారాధనా చేసుకుని. కోరిక ఫలిస్తే ఏటేటా అలా చేసుకుంటూంటానని. ఇద్దరమూ కలిసి కొండకు వస్తామని మొక్కుకో..'

'సరే. నేను చెప్పవలసినవన్నీ చెప్పాను. క్షేమంగా వెళ్ళి లాభంగారా. ఎన్నడన్నా ఓ ఉత్తరం ముక్క. నీకు తీరిక ఉంటే సుమా. రాసిపారేస్తూ ఉండు.' ఇలా, పైకి సామంగానే అని. సాగనంపాను.

ఇంకో యావ ఏం లేదు గనుకనా, ఎప్పుడూ అదే జ్ఞాపకం ఉండడానికి? ఎవడన్నా ఎరుగున్నవాడు అప్పుడప్పుడు లక్ష్మయ్య ఈ మధ్య ఎక్కడా కనిపించడం లేదేం. ఎక్కడికి వెళ్ళాడు. ఎందుకు ఇలాటి బారవ - ప్రశ్నలు వేసినప్పుడు మాత్రం లక్ష్మయ్య అవస్థ.. నా ఊహలో కళ్ళకు కట్టేది వాడినీ, రైలులో పక్క కూర్చునవాళ్ళు ఇలాటి ప్రశ్నలే వేస్తారు. ఎక్కడికి? - సరే ఏదో ఫలానా ఊరికి! ఏం పనిమీద.. బంధువులెవరన్నా ఉన్నారా ఏమని సమాధానం చెపుతాడు? కలలో ఎవరో సకేశి కనబడ్డది, ఆవిడ కంటబడటం కోసం బయలుదేరానని నిజం చెపుతాడా? విన్నవాళ్ళు చెప్పాకటి పుచ్చుకుంటారు, పై స్టేషను రాగనే ఆ పెట్టెలో నుంచి దింపుతారు. దిగనంటే పోలీసుని పిలిచి పిచ్చివాడని అతనికి అప్పగిస్తారు ఏమీ జవాబు చెప్పకుండా ఊరుకుంటాడా - వీడికెంత నిక్కు! అని ఒకడు, ఏం చూసుకుని అంత పొగరు? అని ఇంకొకడు.. వీడేం ఆకాశం నుంచి దిగివచ్చాడా. మాట మాట్లాడడానికే అంత ఇదా? అని కార్పణ్యంతో చేతనైనంత వరకూ నాలువైపుల నుండి కాల్చే చూపులు చూసి ఆ తరువాత ఎలుకమీదా, పిల్లిమీదా పెట్టి, ఏదో లోకాభిరామాయణంగా మాటలతో చంపేస్తారు. ఎటైనా కంఠానికే పట్టుకుంది. సరి. ఆ అవస్థ ఎలాగో తప్పించుకుంటాడు. అన్నీ. లౌక్యంగా అబద్ధాలే ఆడి అంతటితో గడచి బయటపడతాడా? - అడుగడుగుకీ ఎవరి వంకన్నా - పరాకున ఒకసారికి రెండుమార్లు చూస్తే పక్కను తోడుగా ఉంటే ముసలమ్మ అయినా అది చూడటం సంభవించెనా 'ఏం నీకేం పోయేకాలం వచ్చింది? ఎందుకూ దానివంక అలా ఉరిమి ఉరిమి చూస్తావు. నీ గుడ్లు పీకించేస్తాను చూసుకో నలుగురినీ పిలిచినోట గడ్డి పెట్టిస్తాను. ఏం నీకు దానిలాంటివారు లేరూ? తల్లీ తోడూ అంతా తగులబడిపోయిందా? కళ్ళు ఉర్కుండకపోతే. ఇంత కారం సన్నగా తాల్చికొట్టుకో..' ఇదే వరుసను యక్షులూ, పక్షులూ హడలిపోయేట్టుగా. తిట్టి తిట్టి ఏమిటో అని చోద్యం చూడటానికి పోగయినవారు నలుగురూ నాలుగు మాటలూ అని. మరీ కర్మం తప్పిజారితే సున్నంలోకి ఎముక లేకుండా పాపం అంతా తలుచుకుంటే, నవ్వు వచ్చేది - కోపమూ వచ్చేది. జాలీ వేసేది. ఇదంతా బయటకు పొక్కనీయకుండా వాడి యోగక్షేమం అడిగిన వాడితో 'ఏమో లక్ష్మయ్య నాకూ కనబడటం లేదు - కనబడి చాలా

రోజులయింది -' టూకీగా జవాబు చెప్పి తప్పించుకుంటూ ఉండేవాడిని. నిజానికి అంతేకూడాను. ఎక్కడ తిరుగుతున్నాడో, ఏం అఘోరిస్తున్నాడో. వాడి అజాపజా తెలియలేదు.

ఎక్కడికి పోతాడు? ఏమౌతాడు, రేపీపాటికి ఇల్లూ ఇల్లాలూ ఎక్కడ ఉన్నారా అని మళ్ళా వెదుక్కుంటూ రాడూ?..

అలాగే రానే వచ్చాడు.

కనబడటంతోనే అంతదూరాన్నుంచే 'ఏంరా, ఏమైంది? - కాయా పండా?' అని పొల్లుకేకగా పలుకరించాను. లక్ష్మయ్య దగ్గరకు వచ్చి నా చేయి పట్టుకుని నింపాదిగా 'చెప్పాలి. ఇంటికి వెళుదామురా' అని మెల్లగా అన్నాడు. 'కనబడ్డదా లేదా. ముందు ఆ సంగతి చెప్పు తరువాత భారతమంతా కానిద్దువుగాని.' అని, చెప్పేదాకా అక్కడే నిలవేశాను.

లక్ష్మయ్య, నదురుడుగా తల ఊగించాడు. 'ఊహూ, అలాకాదు, నోటివెంట చెప్పు'మని సాగదీసి 'అవు'ననిపించాడు.

'కనబడిందన్నమాటేనా?'

'ఆహా'

'ఎక్కడ?'

'కనబడిందిగా.. ఎక్కడనైతేనేం'

'అడిగినదీ ఒకటీ.. చెప్పేదొకటినా?'

'చెపుతూంటినిగా'

'ఏమిటి, నీ ముఖం! అంత అంతఃపురాంగన అయి. ఆమె పేరే.. ఈ పాపాత్ముడు వినడానికి వీలులేకపోతే.. పోనీలే. ఇక్కడనే వుట్టికట్టుకు ఊరేగు..'

'అది కాదు. చెప్పడానికి సిగ్గవుతూంది'

'ఏం. అచ్చంగా కోతిలాగా ఉందా?'

'ఎబ్బే! చెపితే నేను వెర్రివాడననుకుంటావేమోనని భయం. అంతేకాని'

'..అది ఏనాడో నీకు ఉండవలసింది. ఉంటే, ఇందాకా వచ్చేదా వ్యవహారం? ఇంకా నీకూ అదుపూ ఆజ్ఞా ఏమిటి? - చెప్పు '

'చెప్పనా..'

'పోనీలే మానేయి.'

'ఎవరూ కారు. నా భార్యే!'

లక్ష్మయ్య వంక నిలువు గ్రుడ్లు వేసుకు చూశాను. 'వాడికా, నాకా, మతిపోయింది!'

'అందుకనే, నీవు నమ్మవనే చెప్పడానికి సందేహించింది! కాళ్ళు బలపాలు కట్టేట్టుగా ఇన్నాళ్ళనుంచీ తిరిగి విసుగెత్తి నాలుగురోజులపాటు ఇంటి పట్టున వుండి, మళ్ళా బయలుదేరుదామని నిన్న సాయంకాలం మెయిలులో వచ్చాను. ఇంటికి చేరుకునేటప్పటికి కనుచీకటి పడుతూ ఉంది. మా ఆవిడ తలుపు తీసింది. నా కళ్ళను నేను నమ్మలేకపోయినాను. మొదట, ఎప్పుడూ అదే పలవరింత కావడం చేత. అలా భ్రమపడుతున్నానేమో అనుకున్నాను; కాదు మా ఇల్లాలే. తలంటి పోసుకున్నది కాబోలు అందుచేత నిరాభరణ సుందరి. ఒళ్ళు తుడుచుకుంటూన్నదో ఏమో, నా పిలుపు వినబడేటప్పటికి చప్పున ఎదురుగుండా వంకెను నా మల్లుపంచే కనబడితే అది చుట్టుకు వచ్చినట్లుంది. ఏమైతేనేం. మూడు మూర్తులా నా కలలో అంతకాలం కనిపించింది... ఆ మూర్తే నాకు సందేహం ఏమీ లేదు, మనసు ఇన్నాళ్ళ నుంచీ పడిన యాతన గడిచి గట్టెక్కినందుకు శాంతిగా, దానిలో అది 'అమ్మయ్యా!' అనుకుని ఊరడిల్లింది.

ఆమెను చూచినకొద్దీ నా గుండె కుదుటపడింది. మా ఆవిడకు, నా గొడవంతా ఏం తెలుసును పాపం. 'ఏమిటండి. అలా చూస్తారూ' అని రెట్టించుతూ నన్నూ, నా వాలకం చూసి తెల్లబోవడం మొదలు పెట్టింది..

'ఏమీ లేద'ని ఆమెకు నచ్చచెప్పేటప్పటికి రాత్రి తాతలు దిగివచ్చారు..' అని ముగించాడు లక్ష్మయ్య.

నాకు లోపల నవ్వు ఆగడం లేదు. కానీ, పైకి తొణకకుండా.

'అయితే. పెద్ద చిక్కే వచ్చిందే' అన్నాను.

'ఏం?' అన్నాడు ఆదుర్దాగా..

'అవును, నీవు ఇకనుండి ఎవరితో చేయడం కాపురం?...'

'అంటే..'

'ఇంటావిడ అనుకుంటే మనసు ఒప్పదు. కాదనుకుంటే అలాటి కానిపని చేయడానికే నీలాటి శ్రోత్రియుడికి మనసు ఒప్పదు. చూస్తూ చూస్తూ రండాగమనం..'

'అప్రాచ్యపు మాట ఇలాటిదేదో అంటావనే అనుకున్నాను. అన్నంతపనీ చేశావు..'

అన్నంతపనీ చేస్తే - నీవు ఇన్ని ఆటలు ఆడేవాడివా?... ఒళ్ళు పొగరు కాకపోతే...ఊ..'

లక్ష్మయ్య తలవంచుకుని ఒకటే పరుగు. ఈ అక్కసుతో రేపు భోజనానికి మాత్రం పిలవడు. వ్రతం ఎలాగూ చేస్తాడు మళ్ళా, కోరిక ఫలించినందుకు. చేయకపోతే ఎక్కడ పడవ మునుగుతుందో అని భయంకాదా!

()

శేషమ్మ - A STUDY - చలం

ఉదయిని మాసపత్రిక - 1936 లోని సంచికలో ప్రథమ ముద్రణ

శేషమ్మకి ఈ లోకంలో ఏమాత్రమూ ఆనందమూ సౌందర్యమూ కనపడడం మానేసి ముప్పై ఏళ్ళయ్యింది. ఇతరులు నవ్వుతున్నా, తింటున్నా, పాడుతున్నా, ఆమెకి విచారమో లేక అసహ్యమో కలుగుతుంది. పిట్టల కూతలూ, పిల్లల నవ్వులు కూడా ఆమెని 'ఇరిటేట్' చేస్తున్నాయి.

"పాడుపిట్టలు - పనిలేదు వీటికి. వెధవ అరుపులూ, గోలలూ. అంతకన్నా చస్తేనేం?"

ఆమెకి ప్రపంచం దుఃఖమయం, పాపభూయిష్ఠం, అపవిత్రం. దీన్నంతా విడిచిపోవాలని మృత్యువుని తలుచుకుని అందరూ వినేట్టుగా ఆహ్వానిస్తూవుంటుంది. "ఆ ఈశ్వరుడు ఎప్పుడు దయతలుస్తాడో, ఎప్పుడు పిలిపించుకుంటాడో, ఈ నరకంలోంచి నన్ను!"

ఆ ఈశ్వరుడు తన తండ్రిలాగూ, తనని భూలోకమనే అత్తవారింటికి పంపినట్టూ మాట్టాడుతుంది. నాలుగేళ్ళక్రిందట కలరా తగిలినప్పుడు మాత్రం -

"ఒరే, చస్తానురా, చస్తానురా. డాక్టరేమన్నాడూ? ఆస్పత్రి పెద్ద డాక్టర్ని పిలుచుకురా. ఆ పెరుగు తోడుకుందో లేదో చూచావుటే. మా అమ్మ ఎనభై ఏళ్ళు బతికిందిరా. ఇంత చిన్నదాన్ని నాకప్పుడే ఏం చావు? అవునులే. ఈ ముసిలి ముండ చస్తే ఎవరికేం? అందరికీ పీడ విరగడైపోతుంది." అంది మళ్ళీ.

ఆమె మొహాన నవ్వు చూసినవాళ్ళెవరూ లేరు. చిన్నపిల్లలు గంతులేస్తూ ఉంటే, "ఈ గంతులెన్నాళ్ళు? మీ కాళ్ళు విరగా. ఇదేం పోయేకాలంరా. సరిగా కూచుని ఏడవలేరూ?" అన్నట్టు చూస్తుంది. ఎంత విచారంగా కనపడితే, ఈ లోకం మీద ఈ మాయమీద ఎంత అసహ్యం కనపరిస్తే, ఎంత సౌందర్యాన్ని ద్వేషిస్తే ఈశ్వరుడికి అంత సన్నిహితురాలూ, ప్రియతమురాలూ ఐవుంటుంది. ఈ లోకంలో తనవంటి సన్మార్గులకు కష్టాలు తప్ప ఇంకేమీ లేవు కనక సుఖపడేవాళ్ళంతా దుర్మార్గులే ఐవుండాలి. తను కష్టాల కోసం ఎంత ప్రయత్నించి ఏరుకుంటుందో ఆమెకి తెలీదు.

"అదేమిటీ ఆ కామాక్షి అట్లా పాడుతూ ఉంటుంది ఎప్పుడూ! దేన్ని చూసుకునీ ఆ బోర్లపాటు! ఆ మొగుడి ఉద్యోగం ఊడితే తెలుస్తుంది, అమ్మగారి అదిర్పాటు!"

ఆమెని "ఎట్లావున్నారమ్మా!" అని అడిగితే ఎప్పుడూ "బాగానే ఉన్నా"నని అనలేదు. అసలు ఈ దేశంలో ఆ మాట అనేవాళ్ళే తక్కువ. నిజంగా బాగా ఉండేవాళ్ళే తక్కువ. బాగా ఉన్నా కూడా, బాగా ఉన్నామని తెలుసుకున్నవాళ్ళు చాలా తక్కువ. తెలుసుకున్నా, 'బాగావున్నా'మని అంటే దిష్టితగిలి, అదృష్టం మారుతుందని ఆ మాట అనరు. అంతేకాక బాగా ఉండడం దోషమనీ, పాపాత్ములు మాత్రమే బాగా ఉంటారనీ, మూర్ఖులు మాత్రమే బాగా ఉన్నామనుకుంటారనీ నమ్మకం.

"ఏం బావుండడమమ్మా! కుర్రాడికి నిన్నటినుంచి జలుబు కదా! ఇంతవరకు కన్ను (ముక్కు అనాలి) తెరచి ఎరగడు. ఆవు పాలివ్వడం మానేసింది. మొన్ననేగా మా తాతగారి సవితి తల్లి మేనమామ పోయినాడు. వాడి మనుమడు మూడోక్లాసు తప్పిపోయినాడా! రాచ్చిప్ప చిల్లిపడ్డది. నిక్షేపమంటి రాచ్చిప్ప! ఇట్లా ఉంది మా గతి. ఏమోనమ్మా ఈ కాలంలో అంతా మాయ. మాయ రాచ్చిప్పలూ, మాయమనుషులూ! అవునులే అమ్మా! ఏం శాశ్వతం? ఈ దేహమూ అంతేకద, ఊరికే పట్టుకు పాకులాడతారు గాని."

ఈ వాక్యాలే ఏ దేశాభిమాని ఐనా విన్నాడా, అక్కడే మూడు పల్టీలు కొట్టి, "హా భారతమాతా! ధన్యురాలివి. ఇట్లాంటి ఆధ్యాత్మికులైన ముసలమ్మల్ని కన్నావు" అని అరిచి ఆనందంలో మూర్ఛపోతాడు.

"దుగ్గిరాలవారింట్లో పెళ్ళయిందా? వాళ్ళకేం? పెళ్ళిళ్ళూ చేస్తారు, ఒడుగులూ చేస్తారు. వాళ్ళ ముత్తాత మూటలు సంపాయించి పడేసిపోయినాడుగా! ఒక నీతా, న్యాయమా? ఏముందీ? పరాయివాళ్ళని దోచుకునేదీ, పెళ్ళిళ్ళు చేసేదీ!"

డబ్బు ఉందంటే, అన్యాయార్జితమనే ఆమె ఉద్దేశ్యం.

ఎవరన్నా - "అదీ, ఆ రత్తమ్మ! మొన్న రాత్రి పారిపోయిందటమ్మా!" అంటే, - శేషమ్మ - "ఛీ, ఛీ. అట్లాంటి మాటలు నా చెవిని పడనీకు. నాకెందుకు? నా రామనామమేమో నేనేమో! సరే కానీ, ఇంతకీ, ఎవడితో?"

"అక్క ఇంటికి."

"ఇంతేనా? ఐతే విశేషమేముంది? పారిపోయిందంటావేం?"

"ఏమో వాళ్ళంటే నేనన్నాను."

కొంచెం ఆగుతుంది శేషమ్మ ఇంకా ఏమన్నా చెపుతారేమోనని. చెప్పకపోతే -

"నా కెందుకమ్మా! కానీ అక్క ఇంటికి ఎవరు తీసి కెళ్ళారు? ఎవడో మొగాడు ఉంటాడు. బాగా చూడమను. వాతలు పెడితే ఇద్దర్ని పట్టుకుని - నా కెందుకులే. ఒద్దన్నా నా కెందుకు చెపుతావు! అక్క ఇంటికెళ్ళిందో, ఇంకెక్కడికి వెళ్ళిందో! ఆ అక్క సంగతి తెలుసుగా! దాని షోకులూ, రవ్వలదుద్దులూ - నా కెందుకమ్మా! బండెడు చాకిరీ తెల్లారి లేస్తే, చస్తున్నాను."

"మీ కోడలు పనిచెయ్యదా?"

"అయ్యో, దాని చేతులు పువ్వులట. దాని కాళ్ళు తామరాకులుట!"

"మీ కూతురో?"

"మా కూతురికి గంపెడు రోగమమ్మా! అదేం చేస్తుంది, దాని మొహం!"

"అట్లానమ్మా! బాగానే తిరుగుతూవుంటుందే!"

"మీ కంటికి అట్టానే కనపడుతుంది. పై పుష్టే గానీ, లోపలంతా గుల్ల. ఒకటే ఆయాసం."

"మరి ఎప్పుడూ అట్లా చిరుతిళ్ళు తింటే -"

"అయ్యో, ఏం తింటుంది? అన్నం అసలే తినదు. ఆ చిరుతిళ్ళు కూడా లేకపోతే ఎట్లా బతుకుతుంది?"

"మా కూతురమ్మా, మా సుబ్బలక్ష్మి! దానికి ఒక్కరోజు జబ్బు చెయ్యదు కద!"

"చెయ్యకేమమ్మా! అట్లా తిరిగేవాళ్ళు గబాలున పడతారు. మా మామ మనమడు అంతే. పిడిరాయిలాగు -"

శేషమ్మ ప్రపంచం, పనీ, ఆచారమూ తెల్లవారకట్ట నాలిగింటికి లేచి, రాత్రి పదకొండింటివరకు (మధ్యాహ్నం రెండు గంటలు విశ్రాంతితో) పనిచేస్తుంది. ముప్పై ఏళ్ళనుంచి, ప్రతిదినమూ ఆ విధమా పనిచేస్తోంది. ఆమె పనిచేసినంతసేపూ, ఆమె నోరూ పనిచేస్తూ ఉంటుంది, మాటలతో, తిట్లతో. తెల్లారకట్టే రాత్రి అల్లరి చేసిన పిల్లుల్నీ, ఎలికల్నీ తిట్లు; తరువాత పదింటిదాకా దాసీదాన్ని తిట్లు: అల్లరి చేసే పిల్లల్నీ కాకుల్నీ తిట్లు; కానీ వీశడు బీరకాయ లివ్వని కూరలదాన్ని, మజ్జిగ దాన్ని తిట్లు. ఈ ముప్పై యేళ్ళలోనూ ఒకరోజు కూడా చిక్కని మజ్జిగ పొయ్యలేదుకదా, ఒక గొల్లది కూడా. పుచ్చిపోనికూరలివ్వలేదు కదా ఒక కూరలవాడు కూడా! మధ్యాన్నించి ఇరుగుపొరుగువాళ్ళనీ, కోడల్నీ, కొడుకు అనాచారాన్నీ, కృతఘ్నతనీ, దేవుణ్ణీ, పిచికల్నీ తోవనపొయ్యేవాళ్ళనీ తిడుతుంది. ఎవరూ లేకపోతే రాత్రి పదింటికి తనని తాను తిట్టుకోవడం ప్రారంభిస్తుంది.

పని చెయ్యలేకుండా ఉండలేదు. అదే ఆమె మతం. ఆమె శరీరమే పనిచేసే మర అయిపోయింది. ఆమె 'ఇన్‌టెలిజెన్సు' ఎప్పుడో మానింది పనిచెయ్యడం. 'రొటీన్' తప్ప ఇంకేమీ ఆమె చాతకాదు. ఒక్క రవ్వ ప్రోగ్రామ్ మారిందా, ఇల్లు పడుకుంటుంది. అంట్ల శబ్దం, ఇల్లు కడగడం, పేడ చల్లడం, మెతుకులూ, ఎంగిలీ, మైల మైల అని అరవడం - ఇదే బతుకు! ఒక కొత్తపనీ, కొత్త యోచనా రెండూ ఆమె చాతకావు. గానుక్కి కట్టిన ఎద్దు నయం. అందువల్లనే మార్పు అంటే గుండెలు పగిలి చస్తారు. బెత్తం లేకుండా పాఠం చెప్పమంటే, ముసలి స్కూలు మాస్టరుకి ఎట్లా ఉంటుందో, ఇంగువ లేకుండా వంట చెయ్యటమంటే ఆమెకలా ఉంటుంది. టేపు లేకుండా పనిచెయ్యమంటే తాలూకా గుమాస్తాకి ఎట్లా ఉంటుందో, మడికట్టుకోకుండా వండమంటే ఆమెకట్లా ఉంటుంది. ప్రపంచం ముక్కలైనా ఆమెకి అంత ఆశ్చర్యం కలగదు. ఇంతపని ఇన్నేళ్ళు చేసిందా ఎవరికా ఉపయోగమంటే ఏమీ కనపడదు. అందరూ ఆమెని చూసి విసుక్కునేవాళ్ళేగానీ కృతజ్ఞా కనపరిచేవాళ్ళు లేరు. నలుగురికి భోజనం పెడుతోంది. తాను తింటోంది. ఇంటిని మురికి చేస్తుంది. ఎందుకు కడగడానికి కడగడమెందుకు? మళ్ళీ మురికిచెయ్యడానికి. అంతకాలం వంటచేస్తే మూడు వందల మందికి భోజనం పెట్టవచ్చు ఒక మనిషి. స్వర్గంలో అంట్లు తోమడమూ, బట్టలారవెయ్యడమూ లేకపోతే ఏం చేస్తుందో ఈ మనిషి?

పాపం? ఏ కొత్తకాంతినీ, ఆశనీ, ఆనందాన్నీ, కోర్కెనీ, అన్నిటినీ త్యజించి, ఆ వంటిట్లే తన ప్రపంచంగా, తన బాధే తన ఆనందంగా, తన చేతికి చిక్కిన అయిదారుగురూ దాసీలతో సహా, తన నోటి తీటను తృప్తిపరచగల సాధనాలుగా, తన ఆచారాన్నీ,

తులసికోటనీ చూసుకుని గర్వపడి బతుకుతోంది. భూకంపాలు రానీ, దేశాలు దేశాలు తగలబడనీ, సామ్రాజ్యాలు పడిపోనీ, ఆమెకేమీ సంబంధం లేదు - తన ఇంటికి వంద గజాల సర్కిల్ దాటి ఆమె మనసు పనిచెయ్యదు.

కాపరం, పిల్లలు, ప్రేమ, ఏమీ లేక తనది, స్వంతంగా తనది అనే ఆస్తిగాని మనిషి గాని లేక, క్రమంగా క్రమంగా మనసు మోడైపోయి నిలిచింది ఆమె. ఇంకే ఆసక్తిలేక, ఆ పాతపురాణాలలో విన్న అక్కడక్కడి వచనాలని పట్టుకుని, వాటి వాస్తవత్వంపై తన ఆత్మపురోభివృద్ధిని ఆధారం చేసుకుని కన్నంలో ఎలికవలె బతుకుతోంది.

ఎవరికైనా ప్రేమించడం కన్నా ద్వేషించడం సులభం. ప్రేమ మనిషిని తన స్వంతంగా చేసుకోవాలని ప్రయత్నిస్తుంది. ఈ పేద వితంతువు స్వంతం కావడానికి ఎవరంగీకరిస్తారు? తన కోడలికి ఒక్కొక్క బిడ్డే పుడుతుంటే, తన స్వంతం చేసుకోవాలని చూసింది. ఆ తల్లి ప్రతినిమిషమూ జ్ఞాపకం చేసేది ఆ పిల్ల తనదని - చూపుచాతా, నడివడిచాతా. ఆ పిల్లలే మూడేళ్ళు రాగానే అందరికన్న లోకువ గనక కర్రలు తీసుకుని బాదేవారు ఆమెని. ప్రేమ లేక, సంతోషం లేక, జీవితంలో ఇంట్రెస్టు లేక, ఏ బాధపడ్డా కరుణించేవారు లేక, ఇంక విధి లేక ఈ బండచాకిరిలో తన శక్తినీ, ద్వేషంలో తన ప్రేమనీ, తిట్లలో తన అందాన్ని, సార్థకం చేసుకోవాలని ప్రయత్నిస్తుంది. ఇట్లా ఎందరు ఈ దేశంలో కొయ్యబారిన ఆత్మలతో తమ జీవితాన్ని ఇతరుల జీవితాన్ని క్షోభపెట్టి మృత్యువులో చివరికి తప్పించుకునే స్త్రీలు! కానీ మృత్యువులోనైనా తప్పించుకుంటారా? వాళ్ళ జన్మలో ఉందా ఈలోపం, వాళ్ళనిట్లా చేసిన సంఘపరిస్థితులలో ఉందా? వాళ్ళు సంఘాన్నిట్లా ఎండపెడుతున్నారా, సంఘం వాళ్ళని కొయ్యల్ని చేస్తోందా?

****

నేను పోనే - జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి

(రచనాకాలం: 1940 ప్రాంతాలు)

తెలతెలవారుతోంది. తల్లి వచ్చి లేపకుండానే నాగభూషి లేచాడు. కళ్ళు నులుముకున్నాడు. అరి చేతిలో 'శ్రీరామ' వ్రాసుకున్నాడు. కళ్ళనద్దుకున్నాడు. 'అమ్మా!' అన్నాడు. అమ్మ పలకలేదు. నెమ్మదిగా లేచాడు. చాప చుట్టుచుట్టాడు. లోపలికి వెళ్ళి పెట్టాడు. తల్లి ఎదురైంది.

'అప్పుడే లేచావేరా, పిచ్చి సన్యాసీ!'

సీతమ్మకు ఇదిగానే ఉంది.

'నిద్దరపట్టలేదే అమ్మా! తెల్లారూ ఒకటే కలతే అమ్మా, బళ్ళోకెళ్ళినట్టూ, పరీక్షలయినట్టూ, ఫస్టున ప్యాసయినట్టు కలలే' అన్నాడు నాగభూషి

సీతమ్మ కోడుకేసి చూసింది. తన పనిలో మునిగింది. నాగభూషి లేచి వచ్చాడు. తెల్లవారుతోంది. తల్లి రోటి దగ్గర కూచుని పచ్చడి చేస్తోంది.

'నీకేమన్నా సాయితా చెయ్యనా అమ్మా!'

సీతమ్మకు నవ్వు వచ్చింది.

'ఏమమ్మా నవ్వుతావు? నేనేం చెయ్యలేనా?'

'పనేం లేదురా నాన్నా!'

రెండు నొక్కులు, నొక్కేటప్పటికి పచ్చడి అయిపోయింది. రాచ్చిప్పలో పచ్చడి తీసుకుని, రోట్లో ఇన్ని నీళ్ళు పోసి ఆమె ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఆమెకు అప్పుడు సంతోషంగా ఉంది. పసిపాపకు వడసారం పదేళ్ళు నిండాయో లేదో, సాయితా వొస్తానంటున్నాడు. ఇచ్చిన దేముడు మర్చిపోవాలి. వీడు నాలుక్కాలాలపాటు క్షేమంగా ఉండాలి.

తగని అల్లరి వెధవ, ఎప్పుడూ ప్రాణాలు వీడిమీదే తను ఏం చేస్తున్నా పంచప్రాణాలు వీడిమీదే ఉంటై. చదువుకోరాదుట్రా అనగూడదు. ఒచ్చేసిందంటాడు. ఏ వొస్తుందో ఏమో, వీడి అల్లరితోనే తను కిందామీద పడుతోంది. బస్తీకెట్లా వెళతాడో, ఎల్లా చదువుతాడో.. క్షణం జడురాలయింది.

నాగభూషి ఉయ్యాల తొట్లో గిలక్కాయలు చూసి ఆనందిస్తూ 'ఛీ' అంటే బోసి నవ్వులు నవ్వే రోజుల్లో ఆమె భర్త గతించాడు. పోతూ పోతూ ఇచ్చిపోయిన ఆస్తి తొట్లో పిల్లాడు. జడలేసుకునే రోజుల్లోనే మెడ బోసిదయింది. రాతకాలింది. ఏడవటానికి కన్నీళ్ళు కూడా అప్పు తెచ్చుకోవల్సిన స్థితిలో పసివాణ్ణి చూసుకుని నిట్టూర్చింది. గిలక్కాయ రంగు చూసి నవ్వుకునే నాగభూషిని చూసి తానూ నవ్వాలా? పసుపూ, కుంకుం పోయి ముసుగునెత్తికొచ్చినందుకు ఏడవాలా?

పుట్టిల్లనేది ముళ్ళకంచెలాంటిది. ఆడపిల్ల అత్తారింటికెళ్ళిందంటే చాలు. పుట్టిల్లు అంతంత అవడం ప్రారంభం అవుతుంది. అందులోనూ అవతల సర్వమంగళం అయి, చమురు కాళ్ళ మా తల్లి తిరిగి వొస్తుందన్నప్పుడు ఆడకూతురుకు జరిగే లాంఛనం ఎవరెరుగనిది?

తల్లీ, తండ్రీ ఉంటేనన్నా కాస్త మెరుగు. తల్లీ, తండ్రీ పోయాక, పుట్టింటి ఆపేక్ష ఆమడలంత దూరమూ అవుతుంది. దరిద్రంతో, ప్రేమలు పిట్టల్లాగా ఎగిరిపోతై.

నాగభూషినెత్తుకుని సీతమ్మ పుట్టింటికి వెళ్ళింది. ఇక్కడ చేసే చాకిరీ మరోచోట చేసుకుంటే - సాహాంత్రం అన్నా ఉంటుందని తిరిగి రానూ వచ్చేసింది.

కలిగిన మా రాజుల ఇంట్లో వంటచేస్తూనో, దంపులు దంపుకునో ఆమె జీవితం తలుచుకుంది. సరాసరి బస్తీ చేరిందిరో అని అనిపించుకో తలచలేదు. బస్తీ పక్కని ఓ మాదిరి ఊళ్ళో ఉంటోంది. కర్ణంగారి ఇంట్లో వంట చేస్తోంది ప్రస్తుతం. వాళ్ళ పిల్లలు చద్దన్నాల్లో పారేసినంత ఉండదు నాగభూషికి పెట్టేది. కరణంగారి భార్య 'సీతమ్మా, వాణ్ణి కూడా ఇక్కడే తినిపిద్దూ' అని చెప్పింది. అక్కడే తింటూ ఊరి బళ్ళో చదువుతున్నాడు. దుడుకు వెధవ. ఎక్కడ వాళ్ళ పిల్లల్నీ, వీళ్ళ పిల్లల్నీ ఏం చేస్తాడో, ఏ అల్లరిలో దెబ్బలు తిని వొస్తాడోనని కళ్ళలో ఒత్తులెట్టుకుని ఉంది.

'నేనేమైనా చదువు మానను' అని హఠం పట్టాడు నాగభూషి

'బస్తీకి వెళ్ళి రాగలవట్రా?' అంటే 'ఓ' అని తల ఊపాడు.

నిన్ను మటుకు నిన్న మారాం బట్టి డబ్బు తీసుకెళ్ళాడు. బళ్ళో పేరు చేర్పించుకున్నాడు. పుస్తకాలూ అవీ తెచ్చుకున్నాడు.

'అమ్మా నేను ఫౌంటెన్ కొనుక్కుంటానే'

'ఎంతవుతుందీ'

'మూడో, నాలుగో'

'పండక్కు కొనుక్కుందువుగానిలే, ఇప్పుడు డబ్బు చాలొద్దూ మరి?'

సీతమ్మ చచ్చీ చావని గొంతుకతో అంది ఆ మాట. నాగభూషి చిన్నబుచ్చుకున్నాడు.

'ఊ, ఊ, కొనుక్కోవద్దుటే.. '

'పండక్కు కొనుక్కోమ్మని చెప్పాను గదట్రా'

'మా క్లాసు వాళ్ళందరికీ ఉంటే'

సీతమ్మకు ఏమనాలో తోచలేదు. వాయిల్ సిల్కు జాకెట్టు కొని పెట్టమని అడిగితే, తన తల్లి తనకేమి చెప్పిందో జ్ఞాపకానికి వచ్చింది. మొగుణ్ణి నోరు విప్పి అడగడమూ అయింది. 'నీ అందానికి అదొక్కటేనా తక్కువ' అని ఆ మహారాజు చేత అనిపించుకోవడమూ అయింది - అప్పటికి. తల్లి ఏమంది 'పండక్కు తను ఇక్కడ ఉండదు అని అందరికీ తెలుసు. ఆనిక్క చూడ్డాంలే' అనడం. 'వీల్లేదు' అనటానికి మరోమాట. 'పోనీ, కొనుక్కోరా' అంది సీతమ్మ కొడుకుతో.

'పండక్కు కొనుక్కుంటాంలే.. '

'నిమిషంలో ఇంతకోపం వసే ఎట్లా? అప్పుడే అంత చిర్రూబుస్సూ ఏమిటో - వేలెడంత ఉన్నావో లేదో - ఎక్కడికి పోతై పోలికలూ?'

నాగభూషి చిన్నబుచ్చుకున్నాడు.

- ఇదీ నిన్న జరిగింది.

రాత్రి అంతా తనకు ఇదే గుంజాటన. వెలితి మాట ఎందుకంటినా అని సీతమ్మ చాలాసార్లు అనుకుంది. మరీ మరీ నొచ్చుకుంది. ఇప్పుడేమనుకుంటే ఏం లాభం? నోరు దాటాక, మాటను వెనక్కు తీసెయ్యలేం.

కంచంలో అన్నం పెట్టి కొడుకు దగ్గర కూచుంది సీతమ్మ. ఎప్పుడు వెళ్ళిపడదామా అన్న తొందరలో నాగభూషికి అన్నం సయించలేదు. ముద్దనోట్లోకి వెళ్ళడం లేదు నెమ్మదిగా ఆ మాటా ఈ మాటా చెబుతోంది.

'జాగ్రత్తగా వెళ్ళమ్మా, రోడ్డుకి ఓ ప్రక్కన నడూ, బళ్ళూ, కార్లు ఎక్కడ మీద పడతయ్యో చూసుకుంటూ నడవాలీ!'

'నడుస్తాలేవే'

'ముద్దతినూ, దిక్కులు చూస్తావేం? టైమైపోటల్లా'

'మజ్జిగ పాయ్ - '

'అప్పుడే - కాస్త నాలుగు మెతుకులన్నా తినకపోతే ఎల్లాగురా? ఏమిటా వేషం? తిను మరి'

నాగభూషి మూతి తుడుచుకున్నాడు. నిక్కరూ, చొక్కా తొడుక్కున్నాడు. పుస్తకాలు తీసుకున్నాడు. వాటినతడు నిన్నరాత్రే సర్ది ఉంచాడు.

'అమ్మా వెళతానే' -

'ఇది తీసుకెళ్ళవూ?'

కరణంగారి భార్యను పాత టిఫిన్ కారియరు చిన్నదేదన్నా ఇమ్మని నిన్న అడిగింది. పొద్దున్నే తిని వెళ్ళితే, సాయంత్రం గానీ తిరిగి ఇంటికి రాడామరి.. ఈలోగా ఎలా? కొందామంటే ఉన్న డబ్బంతా పుస్తకాలకూ, బళ్ళో చేరటానికే అయిపోయిందాయె. అన్నం తీసుకెళ్ళటానికని అడిగింది. బుల్లి సత్తు కారియర్ తెచ్చింది. దానికి కొక్కెం విరిగిపోయింది. కొక్కెం లేదన్నమాట తప్ప, ఫరవాలేదు పనికొస్తుంది. మనబోటి వాళ్ళకు సరికొత్తవి రమ్మంటే ఎల్లాగొస్తాయేం అనుకుంది ఆమె. తాడు ఒకటి తెచ్చి కొక్కానికి బదులు కట్టింది. దాన్ని శుభ్రంగా తోమింది. తోమేటప్పటికి సత్తుముండ తళతళా మెరుస్తోంది. దాంట్లోనే ఇంత అన్నమూ, మజ్జిగా కలిపి, నూరిన పచ్చడి కాస్తవేసి తెచ్చింది సీతమ్మ.

'మధ్యాన్నం ఎక్కడన్నా పెట్టుకు తినూ' అని చెప్పింది ఆమె. 'పొద్దోతోంది. కరణం గారింటి కెళ్ళాల'ని ఆవిడా బయలుదేరింది. నాగభూషి కంటిక్కనబడే వరకూ తల వెనక్కి తిప్పి చూస్తూనే వెళ్ళింది. పిచ్చి వెధవ, తలకాయ ఒంచుకుని రోడ్డుకు పక్కగానే పోతున్నాడు.

గబగబా నడుస్తూ నాగభూషి స్కూలుకు చేరుకున్నాడు. అతను అడుగు పెడుతున్నాడు. ఠంగ్ ఠంగ్ మంటూ బళ్ళో గంట కొడుతున్నారు. ఇది మంచి శకునం.. అడుగుపెడుతుండగా గంట కొట్టడం మంచిదని ప్రతివారూ చెపుతారు. శకునం కూడా కలిసివొచ్చిన ఉత్సాహంతో అతను తొందరగా లోపలికి వెళ్ళాడు. కొత్తగా స్కూలు తెరిచారు. ఆవాళ నుంచే పాఠాలు చెప్పడం ప్రారంభిస్తారు. మాస్టర్లు నీటుగా వచ్చి ఉన్నారు. జేష్ఠమాసమేమో ఎండ నెత్తి మాడుస్తోంది.

కుర్రాళ్ళు గబగబా నడుస్తున్నారు. టాక్‌టిక్‌గా ఉన్నారు. పాలాక్షుడు ఒచ్చి ఆపినా, ఆగేట్టు లేరు. ధన్‌ధన్‌మని నడుస్తున్నారు. కేరింతలాడుతున్నారు. ఓ చేత్తో పుస్తకాలూ, మరో చేత్తో ఇక్ష్వాకుల నాటి సత్తి కారియరూ పుచ్చుకుని నాగభూషి వచ్చాడు. చెమటకు చొక్కా తడిసిపోయింది. అడిగి తెలుసుకుని క్లాస్ రూంలోకొచ్చాడు. ఇంకా మాస్టర్లు క్లాసుకు రాలా.

నలుగురు పిల్లలూ ఒక్కసారి అతన్ని పరకాయించి చూశారు. ఫక్కున నవ్వారు. ఎందుకు నవ్వుతారో అతనికి తెలీలేదు.

'సత్తెప్పాలా ఎంతక్కొన్నావ్?'

అడిగాడు తోటి విద్యార్థి. చక్కగా నలగని మల్లెపూవల్లే ఉన్నాడతను. నెమ్మదిగా అడిగాడు.

'నాకు తెలీదు, మా అమ్మ ఇచ్చింది'

'మంచి పనే చేసింది'.

'ఏం?'

మాస్టరు క్లాసులో కొచ్చాడు. అల్లరి ఆగింది. పాఠం ప్రారంభించాడు. ముందు కాస్సేపు కొద్దిగా కబుర్లు చెప్పాడు. పాఠం ఎత్తుకున్నాడు. చెప్పిందేమీ లేదుగాని, చెప్పే విధం బాగుంది.

క్లాసు అయింది. ఇంకో గదిలోకి పోవాలి. గంట కొట్టగానే అందరూ లేచారు. నాగభూషి లేచాడు. అన్నం కారియరో? ఇక్కడ ఉంచి పోతేనేం? రెండడుగులు వేశాడు. ఏమైపోతుందోననిపించింది. వెనక్కు వెళ్ళి దాన్ని తీసుకున్నాడు. ఇక్కడ పెట్టుకున్నట్టే కదా పెట్టుకోవచ్చనుకున్నాడు.

ఇలాంటివి పెట్టుకుంటానికి గది ఏమన్నా ఉందేమోననిపించింది. ఎవర్ని అడగడం? తలవొంచుకుని బయలుదేరాడు.

ఇందాకా ఎంతక్కొన్నావ్ అన్న అబ్బాయిని అడిగితే.. ఏం అంటాడో ఏం ఎక్కిరిస్తాడో, ఇందాక నెమ్మదిగానే - ఎక్కిరించడం కానట్టే - అడిగాడే మరి. ముక్కూ మొహమూ తెలియకుండా ఎవర్ని అడుగుతాడు?

'అన్నాలగది ఏదన్నా ఉందా ఇక్కడ?'

'చద్దెన్నాల గదేనా?'

'చద్దెన్నం ఎందుకైందీ? తెచ్చుకున్న అన్నం పెట్టుకు తినే గది?'

'చల్లారిన అన్నం చద్దెన్నం కాదుటోయ్. చద్దెన్నం అంటే కాదంటేవేం?

'సరేలే, చద్దన్నాల గదే'

'అంత ఉక్రోషం ఎందుకోయ్ .... చద్దెన్నాల గదేగా'

నాగభూషి మాట్లాడలేదు. ప్రాణం చివుక్కుమంది. చూస్తున్నాడు. ఆ కుర్రాడు ప్రసంగం ఒదిలేసి తన పక్కనున్న విద్యార్థితో వేరే మాట్లాడుతున్నాడు. నాగభూషికి చిన్నతనం వేసింది.

'చెప్పమంటే చెప్పవేమోయ్, గది ఎక్కడుంది?'

'సోది అడుగు. తెలుస్తుంది'

'లేనేలేదా'

'సారాజ్యం వస్తే చద్దెన్నాల గది వొస్తుంది' పక్కనున్న నలుగురూ నవ్వారు.

నాగభూషికి మరీ చిన్నతనం వేసింది. తలవొంచుకున్నాడు. వెనకటిలాగానే పక్కన పెట్టుకున్నాడు. వెధవ కారీరు. కొక్కెమన్నా లేదు. తాడు కట్టిన కారీరు. ఎక్కిరిస్తారంటే వాళ్ళ తప్పేముంది? ఏం, అన్నం తెచ్చుకోడం తప్పా? అన్నం తింటం తప్పా?

క్లాసులోకి వెళ్ళి కూచున్నాడు. ఈ క్లాసులోనూ 'సత్తెప్పాలా' అనబడింది. అందరూ అతన్ని తలెత్తి తేరిపార చూట్టమూ అయింది. ఫక్కున నవ్వడమూ అయింది. మాష్టరు వొచ్చాడు క్లాసు ధణుతెగరగొట్టాడు. తన యావలో ఉన్నాడేమో కాస్సేపు నాగభూషికి అర్థం కాలేదు. తరువాత్తరువాత బోధపడింది.

అందరూ ఫౌంటెన్ పెన్నులు తీసి నోట్సు రాసుకుంటున్నారు. తను పెన్సిలుతోటే రాసుకున్నాడు. ఇదీ చిన్నతనమే వేసింది. పండక్కు తనూ కొనుక్కుంటాడు. ముష్టికలం! గట్టిగా అడిగితే ఇవాళే కొనుక్కోమంటుంది అమ్మ! ఆ మాటకొస్తే కొనుక్కోమనే అంది, తనే ఆగాడు కానీ –

బడి అయింది. బిలబిలలాడుతూ పిల్లలు బైటికొస్తున్నారు. ఆ గలభాలో అణచినా అణగని ఉద్రేకమూ ఉంది, ఆనందమూ ఉంది. 'సత్తెప్పాలా!' కొత్తనినాదం. కాస్సేపటితో ఆ నినాదం ఐపోయింది. ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళారు. బడి పక్కన ఉన్న పెద్ద అరుగుల మీదకి నాగభూషి వెళ్ళాడు. అతనికీ ఆకలి, అన్నం గుర్తుకు రాలేదు. నిజానికి ఆకలి వెయ్యడం లేదు.

మాష్టరు చెప్పింది నెమరుకు వొస్తోంది. నోట్స్ తీసి చూశాడు. టెక్స్ట్ పుస్తకాలు తీసి చూశాడు. చెప్పిందంతా కళ్ళముందు ఆడింది. ఇప్పుడు తను ఎవరికైనా సరే తిరిగి చెప్పెయగలడు.

ఎండ మలమల మాడుస్తోంది. పన్నెండు కావొస్తోంది. అన్నం తిందామనిపించింది. తిందాంలే అని కాస్సేపు జాప్యం చేశాడు. చుర్రుమంటోంది ఆకలి, లేచాడు. పుస్తకాలు సర్దాడు. టిఫిన్ కారీరు మూత తీశాడు. మజ్జిగ అన్నమూనూ, కంది పచ్చడీ!

చేతులూ, కాళ్ళు కడుక్కుని తినేస్తే సరి. కారీరుకు మళ్ళీ మూతపెట్టాడు. చేతులూ, కాళ్ళు ఎక్కడ కడుక్కోడం? పంపు ఎక్కడుందో? బడికి దగ్గర్లోనే పంపువుంటుంది అని చెప్పిందే అమ్మ. ఎటుందో వెతకాలి.

ఇవి ఇక్కడ పెట్టి ఎల్లా పోటం? రెండు చేతులతోనూ రెండూ పుచ్చుకుని బయలుదేరాడు. నెత్తి మాడుస్తోంది ఎండ. కింద కాళ్ళు భగ్గుమంటున్నాయి. ఒళ్ళంతా తుకతుకలాడుతోంది. తన ఒళ్ళు తనకే అసహ్యం వేస్తోంది. పంపు దగ్గరికి వెళ్ళి కాళ్ళూ, చేతులూ ముఖమూ కడుక్కుంటేనే గాని తోచేట్టులేదు. తిరిగి తిరిగి మళ్ళీ మొదటికి వచ్చాడు. పంపు కనబడలేదు. అరె! పక్క మలుపులోనే ఉంది పంపు. సూర్యుడు నడినెత్తికొచ్చాడు. కాళ్ళు మాడుతున్నై.

తనకు తెలీక కొట్టుకులాడాడు గానీ పక్కనే ఉంది పంపు. అమ్మ అబద్దం చెప్పదు. ఇందాకే ఏ కుర్రాణ్ణన్నా కనుక్కుంటే చిక్కేవుండేది కాదు. బడి ప్యూన్‌ను అడగాలిసింది. ఇప్పుడతనూ ఉండడు. అమ్మ ఏం అనుకుంటుందో? తనను మర్చిపోయి ఉంటుంది. ఈ పాటికి కరణం గారింట్లో అందరూ భోజనాలు చేస్తుంటారు.

పంపు దగ్గరికి వెళ్ళాడు. పంపు కట్టేశారు. నీటి చుక్కలేదు. ఎల్లాగబ్బా ఈ పంపే కట్టారా, అన్నీ కట్టేశారా? కొన్ని పంపుల్లో ఎప్పుడూ నీళ్ళొస్తయ్యని అంటారే. ఈ పంపులో రావన్నమాట. మరే పంపులో వొస్తయో? దాహం వేస్తోంది. గొంతుకు పాడి ఆరిపోతోంది. ఒళ్ళు అసహ్యంగా ఉంది. కాళ్ళు మాడి, మంట బుర్రకెక్కుతోంది. అడుగులు పడడంలేదు. కానీ, ఆగలేడు, దబదబా ఉరుకులు పరుగులు పెట్టకపోతే నేలమీద నిలవడం కష్టం. చెరువంటూ ఉంటే ఒక్క దూకున వెళ్ళి అందులో పడును తను. దాహం

తాగడానికి గతిలేదు గానీ, చెరువు! చేతిలో పుస్తకాలు తగ్గట్టు జారుతున్నై. అల్లాగే ఆగాడు. సర్దుకున్నాడు. కారియర్ పట్టుకుని పోతున్నాడు.

ఇంకో పంపు కనబడింది. ఏం లాభం? అదీ కట్టేశారు. తిరిగి తిరిగి మరో పంపు చూశాడు. అదీ కట్టేసుంది.

ఎంగిలి విస్తరాకు కనబడింది. ఎవడో మరి. ఆవకాయ ముక్క కొరక్కుండానే పడేశాడు. నిమిషం నిదానించి ఆత్రంగా చూశాడు నాగభూషి. ఎండలో ఆవకాయ ముక్క మెరుస్తోంది. కాళ్ళు బొబ్బలెక్కినట్టున్నై.

కాళ్ళు ఇక ఆగటంలేదు. పంపుదగ్గర ఉన్న మురుగు దగ్గరికి వెళ్ళాడు. కాళ్ళు దాంట్లో పెట్టాడు. అమ్మ! కాస్త నయం. అదీ చుర్రుమంది. ఐతేనేం కాళ్ళకు తడి తగిలింది కదా, ఇక్కడ భగ్గుమన్నట్లు ఉంది. అబ్బో.

ఎవరినన్నా అడిగితే?

ఎవరిని అడిగేది?

ఇందాక బళ్ళో ఏమైంది? మాట చెప్పటానికి అంత అల్లరయిందే.

'ఎవ్వరినీ ఏమీ అడక్కూడదు. ప్రాణం పోతున్నా సరే' అంటుంది అమ్మ. నిన్నరాత్రి కూడా అనుకుంది.

'ఏమిటల్లా వెతుకుతున్నావ్? రా, ఓశ్, మంచినీళ్ళేగదా' అని ఎవరన్నా అనగూడదూ? ఎవరంటారు? అమ్మైతే అంటుంది. ఇక్కడ అమ్మలేదే?

నాగభూషికి కళ్ళలో నీళ్ళు తిరిగై. మురిక్కాలవలో నుంచోటం కూడా కష్టం అనిపించింది. ఎవరన్నా చూస్తే నవ్వుతారు. నవ్వితే నవ్వారు. కాళ్ళుమాడి చావటం కంటే మరేమీ కాదు అది. ఇక్కడ కూడా ఏం బాగుండలేదు. ఆ బురదకాళ్ళతోనే బయలుదేరాడు. ఇందాకటి అరుగుల దగ్గరకి వచ్చాడు. పుస్తకాలూ, కారియరు అక్కడ పెట్టాడు. 'అబ్బ' అనుకున్నాడు. కాస్సేపు పడుకుందామనిపించింది. ఆ అరుగుమీదే పడుకున్నాడు. ఇటూ అటూ దొర్లాడు. మరింత దుమ్ము ఒంటికి అంటుకుంది.

ప్రాణం సొమ్మసిలిపోయింది. రివ్వున గాలి వెచ్చగా తగిలింది. నిద్రపట్టింది. దుంగలాగ పడుకుని నిద్రపోయాడు. ప్రాణం సారేసుకుపోయి నిద్రపట్టింది. మెలుకువ వచ్చింది. గంట కొడుతున్నారు. బద్దకంగా ఉంది. పిల్లలు పోతున్నారు. అడుగో ఇందాకటి అబ్బాయి వెళుతున్నాడు. నాగభూషి నెమ్మదిగా లేచాడు. ఒళ్ళంతా దుమ్ముకొట్టుకునుంది. కనబడ్డమేరకు చేత్తో రాశాడు. చొక్కా అసహ్యంగా ఉంది. ఉంటే ఉందిలే అనుకున్నాడు. పుస్తకాలు తీసుకున్నాడు. సత్తు టిఫిన్ కారియర్‌ను చూస్తే అసహ్యం వేసింది. సిగ్గుమాలిన సత్తెప్పాలా! అమ్మ ఇచ్చింది. అమ్మ ఏమనుకుంటుందో ఈ పాటికి అమ్మ కరణం గారి వసారాలో చెంగుపరచుకుని పడుకుంటుంది.

పుస్తకాలూ, కారియరూ రెండు చేతుల్లోనూ పట్టుకుని బయలుదేరాడు. ఒళ్ళు తేలిగ్గా, నీరసంగా ఉంది.

క్లాసుకు వెళ్ళాడు. చిత్రంగా ఉంది. పొద్దుటి గదేనా ఇది. క్యారియరు మామూలుగా పెట్టాడు.

క్లాసు జరుగుతోంది. పాఠాలు వినబుద్దే పుట్టడం లేదు. చిత్రం. ఇందాక అంత దాహం వేసిందా, ఇప్పుడు దాహమే లేదు. అన్నం తినలేదే అన్నది మనస్సును మహా వేధిస్తోంది. క్లాసులో ఏం జరుగుతోందో తెలియదు. ఉడికిన బంగాళా దుంపలాగున్నాడతను. చెప్పిన పాఠం బుర్రకెక్కలేదు. గంట కొట్టారు.

వికారంగా ఉండి లేచిపోదామా అనిపించింది. ఏమైనా సరే అని చదువుకోవచ్చాడు తను. బాగానే ఉంది కథ. లేచిపోతే ఎలా?

క్లాసులో చెప్పేది వినబడీ వినబడనట్టుగా ఉంటోంది. కళ్ళు మూసుకున్నాడు. కళ్ళముందు పచ్చపచ్చగా, ఎర్ర ఎర్రగా, మసకలు మసకలుగా కనబడుతున్నై. కళ్ళు తెరిచాడు. క్లాసు అయింది.

దాహం, తాగాలి, పక్క మలుపులోని పంపు దగ్గరికి వెళ్ళాడు. నీళ్ళు వొచ్చె. కాళ్ళు తడుపుకున్నాడు. ఆత్రంగా పొట్టపట్టినన్ని నీళ్ళు తాగాడు. తలా, చేతులూ కాళ్ళూ తడుపుకున్నాడు. ఆ చొక్కాతోనే మొహం తుడుచుకున్నాడు. తన ఒళ్ళు తనకు తుప్పు కంపు వేస్తోంది.

మళ్ళీ క్లాసులోకి వచ్చాడు. క్లాసు కుచ్చిటప్పాలతోటి నడుస్తోంది. అన్నం మీదకి కన్నుపోయింది. అన్నం తినాలనిపించలేదు. క్లాసు మామూలుగానే జరిగింది.

ఠప్ ఠప్ మంటూ కేరింతాలాడుతూ కుర్రాళ్ళంతా బయలుదేరారు.

ఆటలకని కొందరు గ్రౌండ్సులోకి పోబోతున్నారు.

'నువ్వు కూడా వస్తావా?'

పొద్దుటి కుర్రాడు కాడు, మరొకడు.

'ఉహూ.రాను'

'ఏం అల్లా నూతిలో పడ్డట్టు మాట్లాడుతున్నావ్?'

నాగభూషి తల ఊపాడు.

'సత్తెప్పాలా గాడితో ఏమిట్రా' అంటు మరో కుర్రాడు వచ్చి చూడక అన్నట్టు అన్నాడు.

'భేష్' అని ఇద్దరూ చక్కాపోయారు.

తన్ను ఎగతాళి చేశారన్న మంట దహించుకు తింటోంది. పంపుల్లో నీళ్ళు కావలసినన్ని ఎందుకు, తగలెయ్యాన? వెధవనీళ్ళు ప్రాణం పోతున్నా బొట్టుపడలేదు. అక్కర్లేనప్పుడు ఇబ్బడీ, ముబ్బడీ.

కాళ్ళు ఊరికే నములుతున్నై. ఒళ్ళంతా పచ్చిపుండల్లే ఉంది. చేతిలో ఈ కారియరు బరువొకటి.

తలొంచుకుని నడుస్తున్నాడు. రోడ్డుకు ఒక ప్రక్కనే నడవలేకపోయాడు. అడుగులు తేలుతున్నై. మనిషి తూలుతున్నాడు. కాస్సేపు రోడ్డుకు ఓ చివరా, మరి కాస్సేపు రోడ్డు మధ్యనా ఇంకాస్సేపటికి అవతలి పెడనూ నడుస్తున్నాడు. ఇదేమిటి ఈ చివరకి వచ్చాను అని అనుకుంటున్నాడు. మరి కొంచం సేపటికి అద్దరిన అడుగులేస్తున్నాడు. ఎవరో కక్షకట్టి సాధిసున్నపుడు పీడుతుడున్నట్టు ఉన్నాడు నాగభూషి.

అందరికీ వడ్డన చేసింది సీతమ్మ. కొడుకు కళ్ళలో మెదిలినట్లు అయింది. ఆమెకు. విస్తరేసుకుని అన్నం ముందు కూర్చుందన్నమాటే గానీ అమెకా అన్నం సయించలేదు. అన్నం హితవు తప్పినట్లయింది. నాగభూషి జాగర్తగా చేరుకున్నాడో, ఏమన్నానో.. పసివెధవ అంతమందిలో బిక్కమొహం వేసుకుని గోడకేసి అలాగే చూస్తూ కూర్చుంది. ఏమీటేమిటో జ్ఞాపకాలు రాసాగినవి. ఆ ప్రవాహంలో పడి ఆమె ఉక్కిరిబిక్కిరి అయింది.

'సీతమ్మా! ఏం చేస్తున్నా' - ఆమెకు వినబడలేదు.

'ఇదుగో, నిన్నే' -

తలెత్తింది. కరణం గారి భార్య. చప్పున స్పృహ తెచ్చుకుంది. 'అన్నం తింటున్నా'నంది, బొంకింది అలా, చిన్న చిన్న తప్పులు పట్టుబడ్డప్పుడే బొంకటం జరుగుతుంది.

'మరేం లేదుగానీ మరిచిపోయి మైలపడకు. కందులు వేయిద్దుగాని' అంది కరణం గారి భార్య.

'అయ్యో! సరే -'

'ఏం, వేరే ఏమన్నా పనుందా?'

'అబ్బే! ఆ మాట తెలిస్తే వేయించే కూచునేదాన్ని. అన్నం తిన్నబట్టగదా అని చూస్తున్నా..'

'మరేం ఫరవాలేదు లెస్తూ మడిబట్టేగా' అని వెళ్ళింది కరణంగారి భార్య మళ్ళీ తిరిగి వచ్చింది.

'ఇందాక కందులు తడిపు ఆరబోయించానూ, మరచిపోబోకూ' అని చెప్పింది. దర్జాగా సావిట్లోకి వెళ్ళిపోయిందామె.

సీతమ్మకు తోచలేదు. అన్నం ముందు కూచోటం కాలేకాలే పెనమ్మీద కూచున్నట్టుంది. మూతి తుడుచుకుంది. మంగలం ముందేసుకు కూచుంది.

ఆలోచనలకు, అగ్నిహోత్రుడికీ సయోధ్యల్లే ఉంది. నిప్పు, కణకణమంటున్న కొద్దీ ఆలోచనలు అతివేగంగా వస్తాయి. వేపు ఎక్కడ ముదర వేగుతుందో.. కాటోతుందని ఆమె ఎంత ఒళ్ళు దగ్గర పెట్టుకున్నా పంచప్రాణాలూ పిల్లాడిమీదనే ఉన్నాయి.

దిక్కుమాలినదాన్ని ఈ చాకిరీ ఆ ఊళ్ళోనే కుదుర్చుకున్నాను గాదు అనుకుంది. పోనీ, నలుగురితో చెప్పి పెట్టో, రెండు మూడురోజులు తిరిగో అక్కడే పని చూసుకుందామనుకుంది. ఊరు కదలడమంటే మళ్ళీ మనస్కరించలేదు. ఈ మల్లగుల్లాలు పడడం ఇదెన్నోసారో... ఇల్లా రోజూ మల్లగుల్లాలు పడడమేనా అనుకుంది. అక్కడికి పోక తప్పదనుకుంది. కరణంగారేమంటోరో...పని మానుకుని పోయేది ఎల్లాగో పోతుంది అనుకుని, ఏదన్నా అభాండం మీద పడెయ్యరు గదా. ఛీ! చెప్పి వెళితే ఎందుకేస్తారు?

పోదాం పోదామనుకోటమే గానీ, పోగానే అక్కడ దబ్బున పని కుదురుతుందా అనుకుంది.

ఏమైనా సరే, ఇక్కడినుంచి పనిమానుకుని పోనని తేల్చుకుంది.

సీతమ్మకు నవ్వు వచ్చింది. పదేళ్ళు చేసిన ఇంట్లోంచి పోవాలంటేనే ఇంత హైరానాపడుతోందే - అన్నేళ్ళున్న జీవుడు లేచి పోవాలనుకుని అంత హైరానా పడతాడు కాబోలు అనిపించి నవ్వింది. ఒడిలిపోయిన పువ్వు ఆ నవ్వు. పప్పు ముదరవేసింది. దబదబా దించింది. మళ్ళీ ఇంకోవాయి వేసింది.

పాపం వారు పోయేనాటి రాత్రి భళ్ళున తెల్లవారింది. తెల్లవార్లూ వారు మహా యమచర పడ్డారు. ఇంకాస్సేపటికి భూశయనం చేస్తారనగా 'సీతా' అని పిల్చాడు.

'సీతా!'

'హోయ్ దగ్గిరే ఉన్నా'

'మాట'

ఆమె దగ్గరగా వెళ్ళింది. 'మరేంలేదు. మాటదక్కింది. (ఐపోయింది అనర్థం) ఆధారం లేని వాళ్ళం. పిల్లాడు జాగర్త'.

మళ్ళీ మగత కమ్మింది. బద్దలయ్యేట్టు లాంతరు వెలుగుతున్నా చిమ్మచీకటి అయిందప్పుడు తనకు. 'పిల్లాడు జాగర్త అన్నారు' అనుకుంది.

రాత్రికి వంట చేస్తోంది సీతమ్మ.

'అమ్మా'

తలెత్తిచూసింది. నాగభూషికాదు. పనివాడు. కరేపాకు తెచ్చిఇచ్చి వెళ్ళిపోయాడు. ఇంకా నాగభూషి రాలేదు. ఆమెకు ఉడ్డుకుడుచుక్కునట్టుగా ఉంది. తను పెద్దదయ్యేదాకా ఎల్లాగన్నా యాడవొచ్చు. వాడు దబదబా పైకివస్తే ఈ యాతన తప్పుతుంది అనుకుంది.

'అమ్మా!'

నాగభూషికి ఏడుపు ఆగలేదు. వెక్కివెక్కిఏడుస్తున్నాడు. తల్లిని వాటేసుకున్నాడు. 'నే బళ్ళోకి పోనే..' అన్నాడు ఏడుపు దిగమింగుతూ.

'ఏంరా'అంది ఆదుర్దాగా. వేరే మడిబట్టలేదనీ, మైలపడుతున్నాననీ ఆమెకి తట్టనేలేదు. కొడుకును పొదవి పట్టుకుంది.

'చంపినా సరే - నేను పోనే..' అన్నాడు నాగభూషి ఏడుస్తూనే. ఈసారి అతను దుఃఖాన్ని మింగలేకపోయాడు. 'నేను పోనే' అని బావురుమన్నాడు.

●●●

భోగం మనిషి - మునిపల్లె రాజు

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 11-9-63 సౌజన్యంతో

మొన్న ఉత్తరం వచ్చింది. నిన్న తంతి. రెండూ బాలకృష్ణ మేనమామ వద్దనుంచే. కక్షతో, ద్వేషంతో, నిస్పృహతో వాటిని చదివి గదిలో మేజాబల్లమీద విసిరివేశాడతను.

తండ్రికి చాలా జబ్బుగా ఉన్నదట. తండ్రికి మాటలు పడిపోయాయట. ఎవరీ తండ్రి? కొడుకు సంగతి ఇప్పుడు జ్ఞాపకం వచ్చిందా? తనకోసం ఎదురుచూడటమెందుకు? భోగందాన్ని పెట్టుకుని ఏళ్ళు పైబడ్డా సిగ్గులేని కులుకులన్నీ కులికి, తననూ, లక్ష్మీదేవి వంటి తన తల్లినీ ఇన్నాళ్ళూ, ఇన్నేళ్ళూ నిర్లక్ష్యం చేసి, చివరకు వేసంగి సెలవుల్లో రెండు నెలలు ఇంట్లో ఉన్నా, ఒక్కసారి ఒక్కదినం కూడా తనను పలకరించి ఎరగని తండ్రేనా - ఇప్పుడు అవసానంలో తనకోసం ప్రాణాలు గొంతులో, కండ్లలో నిలుపుకుని ఉన్నది? తనెందుకు పోవాలి? తను రాముడా? యుధిష్ఠిరుడా? సత్యవంతుడా? ఏ పురాణ పురుషుడు? తన గుండెలోని గాయాలను ఎవరు మాన్పుతారు? తన తల్లి కన్నీళ్ళ నెవరు తుడుస్తారు? చేసిన వాళ్ళకిక క్షమార్పణ ఏమిటి? తను పాపం చేస్తున్నాడా? ధర్మం, న్యాయం ఆ తండ్రే గదా త్రుంచి వేసింది? ఇప్పుడు తను వెళ్ళి ఆ ధర్మాన్నేమో నిలబెట్టాలా? చీమూ, నెత్తురూ, తన ఆత్మగౌరవం - వీటిమాటేమిటి?

యూనివర్సిటీ హాస్టలు గదిలో మంచం మీద నిద్రలేకుండా దొర్లుతూ, కక్షతోనూ ద్వేషంతోనూ, నిస్పృహతోనూ ఆ రాత్రంతా సంఘర్షణ పడ్డాడు బాలకృష్ణ. తన ఆత్మను ఎవరికి నివేదించుకోగలడు? వీళ్ళకా? మిత్రుల కింద చెలామణి అవుతూన్న ఈ లోతులేని మానవులకా? సినిమాలూ, అందమైన ఆడపిల్లలూ బుర్రంతా ఆక్రమించుకోగా, రాబోయే ఉద్యోగాల చదువుకై ధనం, కాలం వ్యయంచేస్తున్న తన మిత్రబృందమా? ఈ ధర్మాధర్మ విచక్షణకు తోడ్పడేది? కానీ మామయ్య ఉత్తరంలో చివరి వాక్యం మాత్రం వీళ్ళందర్నీ నిజంగా ఆకర్షించి ఉండేది.

'ఆస్తి పరహస్తగతం అయిపోతుంది. మీ నాన్న కళ్ళు మూశాడా, ఆ ముండ - ఇల్లు కొల్లగొట్టుకుపోవటం మాత్రం తథ్యం.' అందుకే తను పోగూడదనుకున్నది. పోనీ, ఈ ఆస్తినంతా తన భోగందానికే ఇచ్చుకోనీ. అన్ని ధర్మాలనూ, న్యాయ నీతిశాస్త్రాలనూ కాలదన్ని, కొడుకునూ, భార్యనూ అవమాన పరంపరలతో కాలరాచిన మహాపురుషుడి ఆస్తికి తను వారసత్వం వహించటమా మగటిమి? వద్దు.

కిటికీ గుండా నీరెండ సోకి, కళ్ళు నొప్పి పుట్టగా అతను అటు తిరిగి, కిటికీవైపు ముఖం పెట్టి మళ్ళీ నిద్రపోవాలని ప్రయత్నించాడు. కానీ బయట వరండానుండి తలుపు బాదుతూన్న వెంకటేశ్వర్లు గొంతు వినిపించి, నిద్రాయత్నమంతా భగ్నమైంది.

"కృష్ణా! కృష్ణా! నీకోసం ఎవరో మనిషి వచ్చాడోయ్."

దోగులాడుతూ లేచి తలుపు తీశాడు. ఎదురుగా మొహతాదు వెంకట్రాది నిలబడి ఉన్నాడు. ఈ వెంకట్రాది చిన్నప్పుడు తనను భుజాలమీద మోసినవాడు. రహస్యంగా తాటి ముంజెలూ, తేగలూ, పచ్చి వేరుసెనగపప్పూ, కండెలూ - తను కోరినవన్నీ తెచ్చి ఆప్యాయంగా తినిపించినవాడు. రాత్రింబవళ్ళు తన ఇంటిముందు, ఏనాటి పూర్వజన్మకృతమైన సేవకధర్మంతోనో పడిగాపులు గాచేవాడు.

"ఏం వెంకట్రాదీ? ఎక్కణ్ణించి?"

"ఇంటికాణ్ణించే బాలకిట్టయ్యగారూ"

తనిక మాట్లాడలేదు. గదిలోకి దారితీశాడు. అతని వెనకాలే వెంకట్రాది లోపలికి వచ్చాడు. చెప్పులు విడుస్తూ అతనే అడిగాడు.

"మామయ్యగోరు తంతి కొట్టాడుగా అందలేదయ్యా?"

"ఏం తంతి?"

"కర్లంగోరికి శానా బరువుగా ఉందయ్యా. ఇయ్యాల్టికి నాలుగు. మాటలేదు. సూపైతే ఉంది. అట్టా పెద్దవాకిలి కేసి సూస్తా ఉంటాడు రేయిబవులు. గొంతులో అయితే గుడగుడమంటది. పైకి మాత్తరం మాట పెగిల్రావటం లేదు."

"అయితే నేనెందుకంట రావటం?"

ఆ గ్రామీణుడికి ఈ ప్రశ్న పూర్వాపరాలు తెలిసో, తెలియకో 'చిన్న కర్లం'గారి వంక తదేక దీక్షగా ఒక్కక్షణం చూశాడు. గదిలో అలిసిపోయిన తన కాళ్ళకు, దేహానికి విశ్రాంతి నిద్దామన్నా కుర్చీలే ఉన్నవి కాని, చిన్న చాప చింకికూడా లేదు. చేతిలో కర్రమీద వంగుతూ అతను మెల్లగా కింద కూర్చున్నాడు.

"బాలకిట్టయ్యగోరూ -"

ఈ బాలకృష్ణయ్య పేరు తన తాతగారి పేరు. పారబాటున కూడా ఆ పేరు ఉచ్చరించినప్పుడు గౌరవ ప్రబోధం చెయ్యకుండా మాట్లాడి ఎరగడు వెంకట్రాది.

"నువ్వు రాకపోతే ఇంక నడిచేదెట్టా? ఆ ప్యాణి అట్టా కొట్టుకు మిట్టకలాడ్తంటే."

"అదిగాదు వెంకట్రాది, నేనొచ్చి చేసేదేముందంట? ఆమె - ఆముందిగా - భోగం ఆవిడ.."

"ఏందండీ! చిన్న కరణంగోరూ! పెద్దయ్యకు భోగం మడిసి తుల్సినీళ్ళు బోసుద్దా - చెట్టంత కొడుకువి నువ్వుంటే?"

"అయితే నేనొచ్చి తులసి నీళ్ళు పొయ్యాలన్నమాట."

"ఎవరుకోసమండీ. ఆయన అబ్బ. నువ్వు బిడ్డవి. కోసేసుకుంటే తెగుద్దా?"

"అసలుంటే గదా కోసేసేది, తీసేసేది?"

"యాడికి బోద్దండీ? ఈ నాలుగు దినాల్నుండి - మీకోసం గాదుంటండీ ప్యాణి నిల్సింది?"

"ఎవరన్నారు?"

"ఎవురో ఏందండీ- నేనంటన్నా."

బాలకృష్ణ అతని తలగుడ్డ చూచాడు. చేతిలో కర్ర చూచాడు. అతని ముఖం చూచాడు. ఏమిటీ విశ్వాసం? ఏమి వేదాంతం? ఏమి నమ్మిక? నవ్వులూ, సంస్కారులూ, ఆత్మగౌరవపరులూ - అనుకునే ఈ విద్యావంతుల కందని ధర్మం, తర్కం, విశ్వాసం, ఈ నిరక్షర కుక్షి, సేవకుడు, వృద్ధుడూ - ఇతనిలో అంతర్వాహినిగా, గత యుగాలనుండీ, తెగిపోని శాశ్వతబంధంగా ఎట్లా నిలిచింది? అతనికి అర్థం కాలేదు. కాకపోవటమేకాదు - తన బింకమూ, ద్వేషమూ, సంఘర్షణా అర్థరహితమై తోచినవి. అతని మాటలు తనలోని లోపాన్ని, తన

కుతర్కపు ఆడంబరత్వాన్ని, తను తెంపివేశాననుకున్న గతకాలపు అనుబంధాల బలాన్ని, రక్త సంబంధపు పటుశక్తిని, మానవత్వాన్ని ఎత్తి చూపుతున్నట్లుగా తోచినవి.

"చిన్నబాబూ - నేను సతవుకుణ్ణోణ్ణిగాదు. తమకు దెలియందేమీ లేదు. అమ్మగోరు తమర్ని ఉన్న పళాన తోలుకురమ్మన్నారండి."

బాలకృష్ణమూర్తిలో చివర నిలిచిన బలహీనపు బింకం కూడా ఆ మాటలతో కొట్టుకుపోయింది. అసలా మాటలు అందుకే ఉద్దేశించబడినవేమో? గతరాత్రీ, అంతకు ముందు ఉత్తరం వచ్చినప్పుడూ ఆ తర్వాత తంతి వార్తను చదివినప్పుడూ, అమ్మ సంగతే తనకు తోచలేదు. ఈ ఇహలోకపు వ్యాజ్యంలో తనూ, తన తండ్రీ కక్షిదారులుగా ఊహించాడు. కానీ ఈ హోస్టలు సహాధ్యాయులూ, ఈ రంగు రంగు దుస్తుల పట్నవాసులూ, లాయర్లూ, లెక్చరర్లూ, రాజకీయ ముఠా నాయకులూ - అనామకుణ్ణిగా కట్టివేసే ఈ పల్లెటూరి పేద ఆసామీ యజమాని తప్పులే తెలియని ఈ పాతకాలపు సేవకుడు అతనికే ఓ ప్రధాన ధర్మాన్ని, పంచాక్షరినుపదేశించిన గురుబ్రహ్మలాగా అమ్మ సంగతి జ్ఞప్తికి తెచ్చాడు.

"వెంకట్రాదీ - నడిచి వచ్చావు. నీగ్గూడా వేన్నీళ్ళు తెప్పిస్తాను. మనిద్దరం ఇప్పుడే బయలుదేరుదాం" అన్నాడు చివరకు.

పాత యుద్ధం నాటి చెవర్లెట్ టాక్సీ - ఇంటిముందుకు వచ్చి ఆగేటప్పటికి చాలామంది జనం కనిపించారు బాలకృష్ణ మూర్తికి. ఊళ్ళో మోతుబరి రైతులు కొందరూ, కోమట్లూ, విశ్వబ్రాహ్మణులూ, తంబలాయన భద్రయ్య - ఆయన మామగారు వైద్యుడు - త్రయంబకం, వెట్టివాళ్ళూ. అందరినీ తోసుకుని, మామయ్యా, బాబాయీ, ఆ ఊళ్ళో నాన్నగారికి వ్యతిరేకంగా ప్రైవేటు చేసే చీరాల పంతులూ - ఎదురుగా వచ్చి చుట్టవేశారు.

ఆ ముగ్గురూ ఒకేసారి మాట్లాడారు. మొదట్లో ఏమీ చెబుతున్నదీ అతనికి వినిపించలేదు. వినిపించినా అర్థం కాలేదు. తను తండ్రి గొంతులో రాగి కాని డబ్బు తడిపిన తులసితీర్థం ఎట్లా పొయ్యాలో వాళ్ళు చెప్పటం లేదు. మడిగట్టుకోవాలో, ఆ గుడ్డలే పనికివస్తయ్యో వాళ్ళు చెప్పటంలేదు. అందరూ ఆస్తి గురించే మాట్లాడుతున్నారు. "పో! నన్ను అన్యాయం చేస్తావా? అని అడుగు. వీలునామా వ్రాస్తావా? వ్రాశావా? ఎక్కడుంది అనడుగు. మీ నాయనమ్మవి గట్టి నానుతాడు, రాళ్ళ పెద్ద వడ్డాణం, కాసులదండా ఏవి అనడగరా. పూర్వీకుల ఆస్తి. మళ్ళీ ఆ లోకంలో కూడా జవాబు చెప్పాల్సి వస్తుందనరా. మొండి ఘటంలే. అన్నింటికీ తట్టుకుంటాళ్ళే. ఇదుగో నీ చేతిమీదిగా పెళ్ళి కావాల్సినవాణ్ణి. ఆ అదృష్టం నాకు లేదు - అనటం మరిచిపోకు సుమా. ఒరేయ్! బాలా! ముందే ఆ మాట అనరా. కాయితం మాట బైటికి రానియ్యటం లేదు సుమా! ఘట్టిపిండం. ఆ సంగతి తేల్చుకో ముందు."

వీళ్ళ మాటలు చెవికి సోకగానే, వెంకట్రాది నుంచి వచ్చిన పెద్దలమీది భక్తంతా బాలకృష్ణమూర్తికి అయోమయంగా తోచింది. ఏమిటి? అంతా ఆస్తేనా? ఇంకేమీ లేదా జీవి ఇహలోకాన్ని వదిలిపోయే సమయంలో? చేసిన తప్పులు? క్షమార్పణలు? వీడ్కోళ్ళు? ఆదరింపులు? మరిచిపోవటాలు? ఏమీ లేవా? ఇందుకేనా తనను పిలిపించింది వీళ్ళు? అమ్మమాట ఒక్కరూ చెప్పరేం? ఏమిటీ గందరగోళమంతా?

చీరాల పంతులు అంటున్నాడు - "పిచ్చికుక్కను రాళ్ళగొట్టి తరిమినట్లు, తరిమించనూ దాన్ని? ఎవడబ్బ సొమ్మని ఈ పాతికేళ్ళూ పడితిన్నదో - లం..ముండ! భోగం పట్టి."

బాలకృష్ణకు మరీ మతిపోయింది. "వెంకట్రాదీ, అమ్మెక్కడ? అమ్మేదీ?" అని అడుగుతున్నాడు.

వాళ్ళు - బంధువులూ, పెద్దమనుషులూ - అతన్ని వెంకట్రాదికోసం వెతకనియ్యకుండానే, మేడమీదికి రెక్కపుచ్చుకు లాక్కుపొయ్యారు.

●●●

నాన్న మంచం చుట్టూ చాలామంది ఉన్నారు. దూరపువాళ్ళూ, దగ్గరవాళ్ళూ - చుట్టాలే ఎక్కువమంది. అందులో తమతో చాలా సంవత్సరాలుగా మాటలు నిలిపివేసిన, వేలిడిచిన మేనత్త మాణిక్యమ్మకూడా ఉంది. ఒక కుర్చీ మీద మునసబుగారూ, ఇంకో బల్లమీద సిద్ధాంతి సుబ్బరామయ్య. శివార్చకుల కుర్రాడు చంద్రశేఖరం కల్పంలో మందు నూరుతున్నాడు. బహుశ ఆయనికిక మాడు గీచి పట్టు వేస్తారేమో.

మేడమీది ఆ హాలు చాలా పెద్దది. బిక్కు బిక్కుగా అదంతా కలియజూశాడు. అమ్మ నాన్న కాళ్ళవద్దే ఉన్నది. తన్ను చూసి బావురుమంటే, మాణిక్యమ్మ వచ్చి నోరు మూసి, సర్ది కూచోపెట్టింది. అతను ఎవరి కోసమో ఇంకా కలియజూసాడు. అదిగో! ఆ మూలగా, ఈ జనం, ఈ కుటుంబీకులు తనను వెలివేసినట్లుగానో, తనే వాళ్ళను వెలివేసినట్లు గానో - ఆ మనిషి, ఆ మనిషి - భోగం ఆవిడ - తన తండ్రితో గత పాతికేళ్ళుగా గడిపి, సంసారంలో తల్లి హక్కు కాజేసిన "బోగంది" కూర్చుని ఉన్నది.

మునసబుగారు అతని చెయ్యిపట్టుకుని, నెమ్మదిగా మంచం వైపు నడిపించుకుపోయాడు. నాన్న ఠీవి ఏమీ తగ్గలేదు. పెద్ద పరుపు. తెల్ల బాలీసులు. తెల్ల దుప్పట్లు. ఆయన కండ్లు మాత్రం నీరు కమ్మి ఉన్నవి. ఆయన పొట్టకానుతూ, బాలకృష్ణమూర్తి వీపు వేపు కుడిచేయి వేసి కూర్చున్నాడు. ఇందాకటినుంచీ విశ్వప్రయత్నంతో ఆపి పట్టిన కన్నీళ్ళు చెలియల కట్ట తెగిన సముద్రజలం వలె, బయటి కురికినవి.

పెద్ద కరణంగారి చెయ్యి ఈషణ్మాత్రంగా కదిలింది. బాలకృష్ణ తన చేతిని తండ్రి కందించాడు. ఆయన కళ్ళు మాత్రమే మాట్లాడుతున్నవి. గొంతులో ఉండచుట్టి మాట పెగిలి రావటం లేదు. దుప్పటి కిందికి కొడుకు చేతిని లాక్కున్నాడు సూచనగా. మునసబుగారి వంక చూశాడు - ఒక్క క్షణం తృప్తితో. తన చేతిలో ఏమిటో చిన్న వస్తువు ఉంచాడు. చల్లగా, నల్లగా తగిలిన చిన్న తాళపు చెవి అది.

మామయ్య "అడగరా, అడగరా!" అంటున్నాడు. చీరాల పంతులు "తాళం చెవులు. తాళం చెవులు" అని జ్ఞప్తి చేస్తున్నాడు. నాన్న వంక చూశాడు. చుట్టూ పెద్ద హాహారావం బయలుదేరింది. బంధువులు ఘొల్లుమన్నారు. అమ్మ నాన్నమీదపడి పెద్ద శోకం పెట్టింది.

కానీ మామయ్య మాత్రం - "ఇచ్చాడూ తాళం చెవి? ఏ పెట్టెలో పెట్టేడో ఏమో? ఇంకెక్కడికి పోతుందిలే. ఒరేయ్ వెట్టీలూ -"

బాలకృష్ణ మెల్లిగా లేచి కిటికీ వద్దకు వచ్చి కిందకి చూశాడు. బయట మామయ్య పెట్టిన బందోబస్తు అంతా కనిపించింది. కర్రలతో వెట్టిలూ, ఆ ఊళ్ళో రౌడీలు ముగ్గురూ - యాకోబు, సింగుగాడూ, ఇంకో దూదేకుల సాయెబూ - వీళ్ళంతా నాన్న ఆస్తిని, తన ఆస్తిని, ఆ "మనిషి" బయటికి దాటించకుండా కాపలా అన్నమాట. ఆమె వంక చూశాడు బాలకృష్ణ. గోడ కానుకుని కూచుని ఇందాక చూసిన - మనిషి - ఇప్పుడు కిందకొరిగి ఉన్నది. ముక్కువద్ద వేలుంచి చూశాడు. ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆగి ఎన్నడో అయినట్లు తోచినది.

"మునసబుగారూ. వెంకటాద్రీ - ఈమె - ఈమె - చచ్చిపోయింది -" అని గావుకేక పెట్టాడు. ఎందుకో, ఆమె పేరు యశోద అని అతనికి హఠాత్తుగా జ్ఞప్తికి వచ్చింది.

●●●

కానీ "భోగం మనిషి" యశోద చచ్చిపోలేదు. స్పృహతప్పి పడిపోయింది.

చీరాల పంతులూ, మామయ్యా అతన్ని చుట్టుముట్టి, "ఒరేయ్, అది దొంగెత్తు వేసింది. ఇనప్పెట్టెవి, బీరువావి తాళం చెవులు దాచేసింది. అవి వెతకరా" అని సతాయింపు మొదలుపెట్టారు. ఒక శవమూ, ఒక జీవనస్మరణ సమస్యా, అందరూ వెలివేసిన ఒక వేశ్య, ఇద్దరు లౌకిక పరిజ్ఞానులు. బాలకృష్ణలోని అన్నేళ్ళ ద్వేషమూ, కోపమూ, భయంకరానుమానమూ ఈ దృశ్యం ముందు కరిగి మాయమైపోయినవి. అతని ఎదనంతా అనూహ్యమైన మానవత, కరుణ నింపివేసినవి. ధనమూ, బంధనాలూ, దురాగ్రహమూ,

అభిమానమూ అర్థంలేని వ్యసనాలుగా తోచినవి. నీళ్ళతో నిండిన కళ్ళనును వాళ్ళవేపుకు తిప్పి - "మీరు చూడటంలా? అక్కర్లేదు. నాకు తాళం చెవులు అక్కర్లేదు. వెంకటాద్రీ, వైద్యుణ్ణి పిలుచుకురా" అని నిరామయంగా పలికాడు.

●●●

సాయంత్రానికి ప్రారంభమైన తండ్రి దహన కార్యక్రమాలు, రాత్రి పొద్దుబోయిగాని ముగియలేదు. ఇంటికి వచ్చినా, అతనెవ్వరితోనూ మాట్లాడలేదు. చచ్చినాయన తలగడ క్రిందనే దొరికిన తాళం చెవుల గుత్తులు మామయ్యను పూర్తిగా తృప్తి పరిచినవి. ఆయన బెడద అంతటితో ఆగిపోయింది. చివరకు, అమ్మను ఓదార్చటానికి కూడా అతడు పోలేదు. నాన్న ఇచ్చిన చిన్న తాళం చెవి రహస్యం అతన్ని వేధించుకు తినసాగింది. రాత్రంతా యశోద మంచం పక్కనే అతను కూచున్నాడు.

తెల్లవారు ఝామున ఆమెకు స్మృతి వచ్చింది.

"కృష్ణబాబూ! మంచినీళ్ళు.." అన్నది.

●●●

నాన్న ఇచ్చిన తాళం చెవి ఆయన సందుకాయ పెట్టిది. అది యశోద వీణ పక్కన దొరికింది. అందులో ఆయన కాయితాలేవో ఉన్నవి. కృష్ణ వాటిన్నిటినీ కలియజూశాడు. కొన్నైతే లెక్కలు. కొన్ని పాత ఉత్తరాలు. వాటిపైన తనకు చివరి రోజుల్లో తండ్రి రాసిన ఉత్తరం దొరికింది. వీలునామా ఉందేమోనానుకున్నాడు - కాదు. ఆ ఉత్తరమే వీలునామా.

"నాన్నా! బాలకృష్ణా! నాకు గతి పదిరోజుల్నుండీ ఇక బ్రతకననే అనుమానం వేధించుకు తింటున్నది. మన దురభిమానాలు వదిలేద్దాం. ఈ ఉత్తరం నీతో నా చివరి మాటలు చెప్పటానికి. విను - మీ అమ్మను నేనెన్నడూ బాధించలేదు. రాచి రంపాన పెట్టలేదు. దానిది ఒక తత్వం. మొండితనం, మంకుపట్టు. నాకవి పడనిమాట నిజమే. యశోద ఈ ఇంటికి రాకపూర్వమే దాని తత్వం అట్లా ఉండేది. యశోద కులానికి మాత్రమే వేశ్య. ఒక సందర్భంలో ఆమెను రక్షించవలసిన బాధ్యత నా పైన పడ్డది. మన పూర్వీకుల సంగతి నీకు కర్ణకర్ణిగానైనా తెలిసి ఉండవచ్చు. మన ఇంటికి తెచ్చాను. మగవాడి రక్షణలేని స్త్రీ గతి ఈ దేశంలో అధోగతే గదా! ఆమె వచ్చినప్పట్నించీ మీ అమ్మ పోరు ఎక్కువైంది. అది సహజం అని ఊరుకున్నాను. మీ మామయ్య వచ్చి ఆస్తి పంపకాలు, హక్కులూ ప్రారంభించాడు. నాకు చిరెత్తి ఆస్తంతా యశోద పేర వ్రాశాను ఒకసారి. ఆ కాగితాన్ని ఆమే చించేసింది. ఏడుపుపాక్కటే మీ అమ్మకు తెలుసు. కానీ యశోదకు - నీ భవిష్యత్తు తెలుసు. నేను తాత్సారించినా నీకు డబ్బూ, దుస్తులూ పుష్కలంగా పంపించే ఏర్పాటు చేసేది. నీకు భార్యవస్తే, వీణ నేర్పాలని ఎంతో కుతూహలపడేది. కానీ ఈ కులస్త్రీగాని మనిషిని ఎవరు గుర్తిస్తారు? కొంత ఆస్తి వ్రాస్తానన్నాను. వద్దన్నది. నాతోనే చచ్చిపోతానన్నది. నీతో ఒక్క మాట కోసం - ఇన్నేళ్ళూ పడి చచ్చింది. నువ్వూ, అమ్మా ఆ అవకాశం దానికివ్వలేదు. 'ఆస్తి ఎందుకు వద్దన్నావు - నేను పోతే ఎట్లా?' అనడిగాను. నువ్వున్నావన్నది. చిన్నతనంలో నువ్వెత్తుకుని ఆడించినవాడిని కాదన్నాను. నాకేమీ అక్కరలేదన్నది. ఆ నమ్మకాన్ని నేనెందుకు చెడగొట్టాలి?

మీ మామయ్యకు చెప్పు. నేను ఆస్తినేమీ పాడుచెయ్యలేదని. మీ అమ్మకు చెప్పు - ఇది మన పూర్వజన్మ సుకృతమని.

నీకు తెలుసునో, తెలీదో - యశోద రాత్రిళ్ళు ఆవుపాలు మాత్రం త్రాగుతుంది. సంగీతంకోసం వచ్చిన అలవాటది. యశోదను కూడా నువ్వు మనిషిగా చూస్తే, నేనామెను ఇక్కడికి ఏ పరిస్థితుల్లో తెచ్చానో, ఆ కర్తవ్యం పూర్తవుతుంది. నా ఆస్థికలు కాశీలో కలిపినంత పుణ్యం అదే నాకు"

●●●

బాలకృష్ణ గబగబా యశోద గదికి పరిగెత్తాడు. తనకోసమే నిరీక్షిస్తున్నట్లుగా ఆమె కన్నులు చెబుతున్నవి.

"అమ్మా - కృష్ణుణ్ణి దేవకి కన్నది. కానీ యశోద పెంచింది. నా గోవుపాలన్నీ నీకిస్తాను. మా నాన్నగారు గొప్ప మనిషి. ఆయన కొడుకునని అనిపించుకుంటాను" అన్నాడు.

●●●

చిగురుటాకు - కె.వి.నరేందర్

"మీ ఆయన నక్సలైటట కదా!"

సినిమా టికెట్ క్యూలో నిల్చున్న సుజాత ఆ మాటకి ఉలిక్కిపడింది. సుజాత వెనగ్గా నిల్చుని ఆ మాటన్నావిడ వైపు తిరిగి చూసింది. ఆడవాళ్ళు ఎవరి ముచ్చట్లలో వారున్నారు అప్పటికింకా బుకింగ్ మొదలవలేదు."మొదట పార్ట్ టైం లెక్చరర్ అట కదా!" అంది ఆవిడే

సుజాతకు ఏమనాలో తెలీలేదు. చిరాగ్గా ఉన్నా ఊ అంది. సుజాత కళ్ళలో ఆవిడ ఏదో వెతుకుతున్నట్టుగా చూసింది.

"మేం ఈ మధ్యే కొత్తగా మీ స్ట్రీట్‌కి వచ్చాం. మీ ప్రక్కింటావిడ చెపితే విన్నాను. ఆయన ఈ మధ్యే ఏడేళ్ళ తర్వాత యు.జి (అండర్ గ్రౌండ్) నుంచి బయటికొచ్చి మీతో కాపురం చేస్తున్నాడని చెప్పింది. ఈ ఏడేళ్ళలో మీ సంసారం బాగా చితికిపోయిందని తెలీడానికి మీ ఇల్లుని చూస్తేనే తెలుస్తుంది." ఆవిడ ఆప్యాయంగానే అంటుందో, అయ్యో పాపం అన్నట్టుగా అంటుందో సుజాతకు అర్థం కాలేదు. కానీ ఎక్కడో గుండెల్ని నులిపెడుతున్న బాధ.

చాలా రోజుల తర్వాత సినిమా కొచ్చింది. ఆడవాళ్ళకు గేటు దగ్గర కుంకుమ భరిణలు కూడా ఇస్తున్న సిన్మా అది. సుజాత సగటు తెలుగు పడుచు. పదోతరగతి పాసవ్వగానే విశ్వనాథం కిచ్చి పెళ్ళిచేసారు తల్లిదండ్రులు. విశ్వనాథం పెళ్ళయ్యేనాటికి యూనివర్శిటీలో ఎమ్మే పొలిటిక్స్ చదువుతున్నాడు. విద్యార్థి రాజకీయాల్లో యూనివర్శిటీలో మంచి పేరు సంపాదించుకున్న విశ్వనాథం ఎమ్మే కాగానే ఉద్యోగం వేటలో పడ్డాడు. అప్పటికే ఏడాది గడిచిపోయింది. సుజాతకు అబ్బాయి పుట్టాడు. ఒక బిడ్డకు తండ్రవగానే ఏ మగాడైనా మరింత సంపాదనలో పడతాడు. కానీ విశ్వనాథంలో ఈ సమాజం పట్ల ఏవగింపు మొదలైంది. బిడ్డ వచ్చిన ఘడియతో నైనా ఉద్యోగమొస్తుందని ఎదురు చూసింది సుజాత, ఎవరో గడ్డపాయన పుస్తకాలు విపరీతంగా చదువుతున్న విశ్వనాధాన్ని 'మీరింత చదివినా మీకెందుకు ఉద్యోగం రావట్లేదండీ?' అని అమాయకంగా అడిగిన రోజుల్లో నవ్వేవాడు. తరువాత ఒక మిత్రుడు పెట్టిన జూనియర్ కాలేజీలో పార్ట్ టైం లెక్చరర్‌గా చేరాడు. మొదటి నెల జీతంతో ఏవేవో తెస్తాడని ఊహించుకున్న సుజాతకి నిరాశే ఎదురైంది. విశ్వనాథం ఆ డబ్బుతో అన్నీ పుస్తకాలే కొనుక్కుని రావటం చిరాకేసింది.

బాబుకి కనీసం పాలడబ్బా అయినా తేనందుకు మొదటిసారి గొడవపడింది. ఉద్యోగమొచ్చినా పుస్తకాలెందుకని వాదించింది సుజాత. కానీ ఆ పుస్తకాలు విశ్వనాథం ఆలోచనా ధోరణిని మారుస్తున్నాయని సుజాతకు అర్థం కాలేదు. అతడేదో కొంచెం దూరమవుతున్నట్టు భావించుకుని బాధపడేది. అలాంటప్పుడే విశ్వనాథాన్ని ప్రయివేట్ కాలేజీ యాజమాన్యం ఉద్యోగంలోంచి తీసేసింది. విశ్వనాథం నవ్వుకున్నాడు. కానీ సుజాత బావురుమంది. తెలివైన భర్తను తొలగించిన కాలేజీలో స్టూడెంట్లు పాసుకారని శాపనార్థాలు పెట్టింది. ఎందుకు తొలగించారన్న ప్రశ్నకు విశ్వనాథం ఏవో కారణాలు చెప్పాడు.

ఆ తర్వాత కొంత కాలానికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. జీవితం ఇక స్థిరపడిందనుకుంది సుజాత. కానీ అతని తిరుగుళ్ళు పెరిగాయి. ఎప్పుడు ఏ ఊరికి వెళతాడో తెలీదు. ఊళ్ళో ఉన్నప్పటికీ ఎప్పుడో రాత్రికి ఇల్లు చేరేవాడు. ఓ రోజు అనుకోని సంఘటన జరిగింది. సుజాత జీవితాన్ని దుర్భరంగా మార్చేసిన సంఘటన.

రాత్రి ఎనిమిది గంటల సమయంలో విశ్వనాథం ఇంటిముందు పోలీస్‌జీపాగింది. అది గమనించి విశ్వనాథం చీకట్లోకి పారిపోయాడు. పోలీసుల్ని చూసిన సుజాత బాబుని హత్తుకుని భయంగా నిల్చుంది. సుజాతని పక్కకి తోసి విశ్వనాథం కోసం ఇల్లంతా గాలించారు. రోజూ చదివే పుస్తకాల్ని బూతులు తిడుతూ నిప్పంటించారు. అడ్డుకోబోయిన సుజాత మీద బలమైన లాఠీదెబ్బ. ఆ తర్వాత మరో దెబ్బ. చంకలో బాబు ఏడ్పు. అరగంట సేపు రణరంగమే అయింది. చీకట్లోకి వెళ్ళిన విశ్వనాథం మళ్ళీ ఇంట్లోకి రాలేదు. సుజాతకీ విషయం తెలిసి గుండెలవిసేలా ఏడ్చింది.

ఇది ఏడేళ్ళ కిందటి సంఘటన.

ఈ ఏడేళ్ళలో సుజాత ఎన్నోసార్లు లాఠీ దెబ్బలు తింది. పోలీసులు ఒక్కసారిగా విరుచుకుపడేవారు. బాబుని కొట్టేవారు రాజీపడుతూ బీడీలు చేస్తూ బతకటం నేర్చుకుంది. బీడీల కట్టలు వేసుకునేటప్పుడు కంపెనీలో అంతా ప్రత్యేకంగా చూసేవారు. ఇంటికొచ్చి మౌనంగా ఏడ్చేది. తన చేతిలో ఏదో మారణాయుధమున్నంత దూరంగా ఉండేవాళ్ళు వాడలోని ఆడవాళ్ళంతా! పోలీసులొచ్చి భీభత్సం చేసినప్పుడు కూడా ఓదార్చడానికి ఎవరూ వచ్చేవాళ్ళు కాదు. ఓదారిస్తే. సానుభూతి పరులట! (వాళ్ళు భర్తలు చెప్పి ఉంటారు).

ఆడబిడ్డల ముందు, తోటి కోడళ్ళ తన బతుకొక శిథిల స్వప్నం కావటమే ఆమె భరించలేకపోయేది. చిన్న ఆడబిడ్డ భర్త నాలుగేళ్ళ తర్వాత మస్కట్ నుంచి వస్తున్నాడంటే ఇల్లంతా పండగ జరుపుకున్నారు రెండు రోజులు. ఆ రెండు రోజులైతే సుజాత మనసు విశ్వనాథం కోసం విపరీతంగా పలవరించింది. ఏ బంధువులింట్లో ఎలాంటి ఫంక్షన్ జరిగినా సుజాతనంతా విస్మయంగా చూసేవారు. ఆ చూపులే సుజాతనెక్కడికీ వెళ్ళనిచ్చేవి కావు. బాబుని స్కూల్లో చేర్పించాక విశ్వనాథం వెళ్ళిపోయిన ప్రభావం బాబు మీద రకరకాలుగా పడటం మొదలైంది.

ఓ సారి పిస్తోలు బొమ్మని స్కూలుకి పట్టుకెళ్ళినందుకు టీచర్లంతా "మీ నాన్న పంపాడట్రా" అంటూ నవ్వారు. ఇంటికొచ్చాక బాబు వేసిన ప్రశ్నలకి సుజాత చాలాసార్లు జవాబు తెలీక ఏడ్చింది. ఇలా ఏడేళ్ళ తర్వాత జనజీవితంలో కలిసిపోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించడంతో ఓ అర్ధరాత్రి ఇంటిముందు జీపాగింది.

శబ్దం విన్న సుజాత బాబుని మరింత గట్టిగా హత్తుకుని భయంగా చూసింది. మొదట తలుపు కొట్టిన చప్పుడు. ఆ వెంటనే. 'అక్కా' అని పిలుపు తీయడానికి సంశయించింది.

"అక్కా. విశ్వనాథం వచ్చారు" క్షణం పాటు గుండె పులకరించినా. గతంలో పోలీసులు తలుపు తీసే వరకూ ఇలాగే బుకాయించిన సంగతి గుర్తొచ్చి ఒళ్ళు జలదరించింది.

"అక్కా. విశ్వనాథం వచ్చాడు" మరోసారి పిలుపు. ధైర్యం కూడగట్టుకుని తలుపు తీసింది.

నిజమే. ఆయనే ఆయన ఎంత మారిపోయారు? ఆయన వెంట మరో ఇద్దరు.

ఆయన కళ్ళల్లో కూడా నీళ్ళు! బాబు నిద్రలోంచి వచ్చి భయంగా చూస్తున్నాడు. విశ్వనాథం గొంతులో దుఃఖం పొర్లింది. సుజాత గుండెకు గండిపడింది. బావురుమని మీదపడి ఏడ్చింది. మూడో తరగతి చదువుతున్న బాబుకి వాళ్ళనాన్నని పరిచయం చేసింది. ఈ దౌర్భాగ్యం ఎవరికీ రాకూడదేమో?

అరగంట తర్వాత వెంట వచ్చిన విప్లవ రచయిత, విప్లవ గాయకుడు జీపులో వెళ్ళిపోయారు. మర్నాడు సుజాత వాడలో గర్వంగా తిరిగింది. అయినా విచిత్రపరిస్థితి.

ఎవరూ తన సంతోషానికి మద్దతు పలికినట్టు కనిపించలేదు. విశ్వనాధానికి ప్రభుత్వం తిరిగి ఉద్యోగమివ్వటంతో బంధువులు అప్పుడప్పుడు రావడం మొదలుపెట్టారు. సుజాత మళ్ళీ మనిషినైనంత ఆనందంగా ఉంది.

అప్పుడే 'బెల్' మోగటంతో క్యూలో చలనం వచ్చింది. సుజాత ఆలోచనల్లోంచి తేరుకుని ఒక టిక్కెట్ తీసుకుని బయటపడింది. వెనుకావిడ కూడా నాలుగు టిక్కెట్లతో రాగానే భర్త పిల్లలు ఎదురొచ్చారు ఆమె సుజాతవైపు చూసింది. ఆ చూపులో "మీ ఆయన రాలేదే" అన్న అర్థం! సుజాత మనసు మరోసారి చివుక్కుమంది. సినిమాకి రమ్మని అడిగితే ఆ సినిమాలు నాకిష్టముండవు అంటాడు. తనిష్టం కోసమైనా రావాలనుకోడు! షాపింగ్‌కి వెళదామమటే నువ్వెళ్ళు అంటూ డబ్బులిస్తాడు. ఇలాంటి విషయాల్లోనే సుజాత విపరీతంగా బాధపడేది. ఆ బాధ కాస్తా కోపంగా మారుతోందిప్పుడు.

అస్తవ్యస్తమైన ఆలోచనల్లోనే సుజాత సినిమా చూసింది. సినిమా అయిపోయి ఇంటివైపు నడక ప్రారంభించింది. సగం దూరం వచ్చాక పక్కనుంచి వేగంగా స్కూటర్ వెళ్ళింది. స్కూటర్ మీద థియేటర్ దగ్గర మాట్లాడినావిడ, భర్త పిల్లలు.

జీవితంలో ఒక్కసారైనా ఆయన స్కూటర్ నడిపితే వెనగ్గా కూచుని తిరగాలనే ఉబికి వచ్చిన కోరిక. ఆ కోరిక చుట్టూ పాగలా కమ్ముకుంటున్న నిర్లిప్తత.

ఇంటికెళ్ళేసరికి విశ్వనాధంతో పాటు మరో ఆరుగురు వ్యక్తులున్నారు. బాబు బడినుంచి అప్పుడే వచ్చి నోట్స్ రాసుకుంటున్నాడు.

రష్యా తిరుగుబాటు పోరాటం మార్క్స్ ప్రపంచ కమ్యూనిస్టుల పై ప్రభావం.

ఆ గదిలో రష్యాలో జరిగిన మార్పుల నుంచి గుజరాత్ మత కల్లోలాల వరకు తీవ్రమైన చర్చజరుగుతోంది.

ఆ పదాలు వింటున్న సుజాత మళ్ళీ చిగురుటాకులా వణికింది.

బాధగా కణతలు రుద్దుకుంటుంటే పై కప్పు నుంచి మట్టిపెళ్ళ పడింది. శిథిలావస్థలో ఉన్న ఇల్లుని దీనంగా చూసింది.

"వీళ్ళు ఈ పూట ఇక్కడే తింటారు" అన్నాడు విశ్వనాధం.

ఆ మాటతో సుజాతను నిస్సత్తువ ఆవరించింది. సినిమా చూసి అంత దూరం నుంచి నడిచి వస్తే ఏమిటి ఈ మనిషి? పెళ్ళయి ఇన్నేళ్ళయినా అర్థం కాని మనిషి.

ఆయన సమాజపరంగా ఏమైనా సాధించాడేమో. కానీ కుటుంబపరంగా ఏం సాధించారు? ఇలాంటివాళ్ళు పెళ్ళెందుకు చేసుకుంటారో?

సుజాత ఇప్పుడు మనసుతో పోరాటం చేస్తోంది.

సహచర్యంతో కూడా విశ్వనాథం ఆలోచనల్ని చేరుకోలేని సుజాత ఆలోచనలు సుజాతవి. తమ ఇంటికి కొద్ది దూరంలో ఉన్న వేపచెట్టు క్రింద ఇద్దరు అపరిచిత వ్యక్తులు తచ్చాడుతుండటం మూడురోజుల్నుంచి గమనిస్తోంది. సుజాత జీపు శబ్దాలు విన్నా అపరిచిత వ్యక్తులు ఇంటి ముందు కనిపించినా చిగురుటాకులా వణుకుతోంది.

ఇంతలో ముందు గదిలోంచి ఓ వ్యక్తి పాట అందుకున్నాడు. ముందు కూడా ఇలాంటి చర్చలు సమావేశాలు, పాటలు, గోష్ఠులు ఇంట్లో జరిగేవి. స్థిమితపడి ఏడాది కూడా కాలేదు. మళ్ళా ఏడేళ్ళ క్రితం చరిత్ర పునరావృతమౌతే?

ఒక తాగుబోతును కట్టుకున్నా ఇంత నరకయాతన అరణ్య రోదన ఉండదేమో? సుజాత ఆలోచనల్లో ఉండగానే పాట పూర్తయింది.

"సుజాత ఇంకా వంట కాలేదా?" ఆయన తన ప్రక్కన ఎప్పుడు ఇంత ఆనందంగా ఉండరు. ఇంట్లో కనీస అవసరాలు చూడని వ్యక్తి సమాజం గురించి కలలు కనడం సుజాత విసుక్కుంది.

ఎవరైన తన బంధు మిత్రులు వచ్చినప్పుడు "అదేంటో సుజాతా మీ ఆయన గవర్నమెంట్ ఉద్యోగి. అయినా కనీసం కలర్ టీ.వి, ఫ్రిజ్, కూలర్, వి.సి.డి ఏవీలేవు. మేమైతే కంప్యూటర్ కూడా కొనాలనుకుంటున్నాము." అంటూ ఎగతాళిగా మాట్లాడినప్పుడల్లా బాదేసేది. ఎప్పుడైనా విశ్వనాథాన్ని అడిగితే బూర్జువా. భూస్వామ్య వ్యవస్థ, పేదరికం, సామ్రాజ్యవాదం, సోషలిజం, కన్యూమరిజం, దారిద్రరేఖకు దిగువ ఉన్న ప్రజలు, దళితులు గ్లోబలైజేషన్ అంటూ గంటల తరబడి ఉపన్యాసం దంచుతాడు. ఆరువేల చిట్టి ఎత్తి ఈ మధ్య రెండు పుస్తకాలు అచ్చువేసాడు. ఆ రోజు ఆయనతో పెద్దగా గొడవ పడింది. అయినా వినలేదు. అన్యమనస్కంగానే వంట చేసింది సుజాత.

వాళ్ళు తిని వెళ్ళిపోయాక ముందు గదిలోకి వచ్చింది సుజాత, కొంచెం ధైర్యం తెచ్చుకుని విశ్వనాథాన్ని అడిగింది. "మళ్ళీ ఆ పాటలేంటి? ఈ సమావేశాలేంటి? ఈ మధ్య మళ్ళీ ఎవరెవరో కొత్త వ్యక్తులు మన ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. మళ్ళీ మునపటి పరిస్థితులు మాత్రం తీసుకురాకండి. అలాంటి వాళ్ళు ఇంకా అండర్ గ్రౌండ్‌లోనే ఉండాల్సింది. పెండ్లి చేసుకోకుండానే ఉండాల్సింది."

"ఇప్పుడేం జరిగిందని కనీసం మాట్లాడడం కూడా మాట్లాడుకోకూడదా?" అన్నాడు విశ్వనాథం కొంచెం ఆవేశంగా.

ఆ మాటకి సుజాతలో అసహనం పెరిగింది. గంటసేపు పరస్పరం అరుచుకున్నారు.

"కట్టుకున్నదానికి మానసికంగా కనీస భద్రత ఇవ్వనప్పుడు. మీరు చేస్తున్నది సంసారం అనే కంటే చాకిరి చేయించుకోవటం అంటేనే మంచిది. ఇంట్లో పొంగి పొర్లే కన్నీటిని గమనించకుండా సమాజం గురించి కలలు గనే మీలాంటి వాళ్ళు కామెర్లకు చచ్చేదాక మందులుండవేమో? ఆ ఏడేళ్ళు ఎలా బ్రతికామో మీకు ఏమైనా తెలుసా? నా వాళ్ళు నా వాళ్ళు అనే మీ వాళ్ళు ఈ ఏడేళ్ళలో నన్ను కనీసం పలకరించడానికైనా రాలేదేం? ఎలా బ్రతుకుతున్నారని అడిగినవాళ్ళు లేరేం? మీ పిల్లల గురించి పట్టించుకోలేదేం? మీ స్నేహితులు, మీ ఉద్యమ మిత్రులు వాళ్ళ కుటుంబాన్ని వదిలేశారా? వాళ్ళ ఇండ్లలో కంప్యూటర్లు, టీ.వీ.లు, ఫ్రిజ్‌లు అన్నీ ఉన్నాయి కదా?"

మరుసటి రోజు ఉదయమే పిల్లలతో సహా సుజాత తల్లిగారింటికి వెళ్ళిపోయింది. మూడవరోజు విశ్వనాథం అత్తవారింటికి బయలుదేరాడు. ఆ రోజు రాత్రి అతనికోసం అర్ధరాత్రి పోలీసులు తాళాలు పగులకొట్టి ఇల్లంతా వెతికారు. ఎక్కడో ఎవరో పోలీసుల్ని హతమార్చారట అందుకు ప్రతీకారంగా విశ్వనాథం కోసం..

అత్తవారింట్లో ఉన్న విశ్వనాథం బ్రతికిపోయాడు. తనవాళ్ళు అనుకున్న ఎవ్వరు తనపై మళ్ళీ మొదలైన దాడుల్ని ఖండించలేదు. సుజాత భయంతో వణికిపోయింది. విశ్వనాథం మళ్ళీ ఏదో చెప్పబోయాడు.

"ఇక నాకు ఏమి చెప్పకండి"

సుజాత ఏడుస్తోంది.

కుటుంబానికీ ఉద్యమానికీ మధ్య నిలబడ్డ విశ్వనాథం మనసంతా కల్లోలమే.

●●●